C PAK08AU27

1/5486.

తెలుగు నవల సాహిత్య వికాసము.

Development of the TELUGU NOVEL.

(A Critical Survey)

IGNATIUS' GIRLS' HIGH SCHOOL
ARUNDELPET, 16TH LINE
GUNTUR



"సాహిత్యభూషణ"

పుల్లాభట్ల వెంకటేశ్వర్లు

0 PAKOSHA 027

తెలుగు నవలా సాహిత్య వికాసము.

Development of the TELUGU NOVEL.

(A Critical Survey)

ARUNDELPET. 15TH LINE
GUNTUR.

"సాహిత్యభూషణ"

పుల్లాభట్ల వెంకటేశ్వర్లు

ఖమ్మం సంవత్సరం. 1974 డిసంబరు.

వెల 22-00 రూపాయిలు.

సర్వహక్కులు రచయితవి.

ప్రతులకు :

"సాహిత్యభూషణ"

పుల్లాభొట్ల వెంకటేశ్వర్లు ఎం. ఏ;

ఖమ్మం.

(అన్ని పుస్తకశాలలలోను లభించును.)

ముద్రణ :

పై. యన్. ప్రెస్, ఖమ్మం.

అంకితము.

శ్రీరామ కార్య రచనా ధురంధరుడు,
వజ్రకాయుడు, వజ్ర సంకల్పుడు,
మహా తేజస్వి, మహా బలుడు,
భక్తకల్పద్రుమము,
నిస్స్వార్థ ఆదర్శమూర్తి,
ఆపద్బాంధవుడు,
నా అభీష్ట దైవము,
శ్రీ ఆంజనేయస్వామికి
భక్తితో సమర్పితము.

— రచయిత

విషయసూచిక.

Preface	i to iii
స్వాగతం	iv to xi
నివేదనము	xii to xvii
ప్రథమ భాగము	1—60
౧. నవలల పుట్టుక - నిర్వచనము	1
నవలా శబ్దోత్పత్తి	4
తెలుఁగులో నవల	5
విశ్వసాహిత్యమున నవల సాధించిన ఘన విజయము	5
నవలకు ఇతివృత్తము	6
౨. నవల ప్రధానాంగములు	8
నవల - నాటకమునకుగల భేదము	10
నవల - ప్రబంధము	14
నవల ప్రధానాంగముల పరామర్శ	16
౩. నవల ప్రధానాంగముల విషయ వివరణము	18
1. ఇతివృత్తము	,,
2. పాత్ర చిత్రణ	20
3. సంభాషణలు	23
4. వాతావరణము	24
5. సందేశము	25

నవలలు - భిన్నరూపములు 27

1. వస్తువు లేక ఇతివృత్తమునుబట్టి నవలలు

1. అపరాధ పరిశోధక నవలలు 27
2. సాంఘిక నవలలు 32
3. రాజకీయ నవలలు 36
4. చరిత్రాత్మక నవలలు 37
5. పౌరాణిక నవలలు 41

2. రచనా ప్రక్రియ ననుసరించి నవలలు 42

1. ఘటనా ప్రధానములు 42
2. కాతూహల ప్రధానములు 43
3. శీల ప్రధానములు 43
4. సంఘ చిత్రణ ప్రధానములు 44
5. ఇతిహాస ప్రధానములు ,,
6. మనఃప్రవృత్తి నిరూపణములు ,,
7. నిర్దుష్ట ప్రయోజనమునుబట్టి వ్రాయు నవలలు 45
8. పౌరాణిక సంబంధమైనవి 46
9. ప్రబంధ నవలలు 46
10. చలనచిత్ర సంభాషణ నవలలు 46
11. లేఖారూపక నవలలు 47

12. డైరీల పద్ధతిలో నడచిన నవలలు 47
13. పరిస్థితుల ప్రభావములను చిత్రించు నవలలు 47

3. వస్తుపోషణ ననుసరించి నవలలు

1. ఐతిహాసిక పద్ధతి 48
2 ఉత్తమ పురుషలో కథను నడుపు పద్ధతి 49
3. లేఖా పద్ధతి 50

4. నవలాకారుని బాధ్యతలు 52

చిత్రకారుడు-నవలా రచయిత 52
నవల పరిపంచ దర్శిని 55
పరామర్శ 58
ఉపక్రమణిక i to iv

ద్వితీయ భాగము 61 - 96

భారతీయ నవ్యసాహిత్య మహోదయము 61

యుగ విభజనము ,,
ప్రథమ దశ క్రీ॥ శ॥ 1800 — 1857 ,,
ద్వితీయ దశ ,, 1857 — 1880 ,,
తృతీయ దశ ,, 1880 — 1900 62
పూర్వ రంగము ,, 1800 — 1857 63

దేశీయ భావములో నవశక నిర్మాతలు 66

ఉత్తర రంగము క్రీ॥ శ. 1857 – 1900 67

తెలుఁగు నవలా సాహిత్యమున నవ శకోదయము 77

చిన్నయసూరి – నీతిచంద్రిక 79

తెలుఁగు తొలి నవలా రచయిత ఎవరు ? 79

వీరేశలింగం పంతులు – రాజశేఖర చరిత్ర 80

ఆంధ్రసమాజ ప్రతిబింబము – రాజశేఖర చరిత్ర 81

పంతులుగారి ఇతర రచనలు 82

సంఘ సంస్కరణము 83

పంతులుగారి రచనలు – విమర్శ 83

చింతామణిలో పోటీలు 85

వచన రచనకు నియమములు 86

నవలా రచనకు నిబంధనలు 85

పోటీలకు న్యాయ నిర్ణేతలు 87

గురువుగారి అడుగు జాడలలో చిలకమర్తి ,,

రామచంద్ర విజయము ,,

రాజశేఖర చరిత్ర – రామచంద్ర విజయము 90

గురు శిష్యుల ప్రభావము 91

అపరాధ పరిశోధక నవలలు 92

విక్టోరియా రాణి కాలపు రచయితల ప్రభావము 93

తెలుఁగు నవలలపై తెలుఁగు ముద్ర 98

తెలుఁగు రచయితల విశాల దృక్పథము 94
సింహావలోకనము 96
తృతీయ భాగము 97-593

నవలా సాహిత్య స్వర్ణయుగము 97

యుగ విభజనము

ప్రథమదశ క్రీ. శ. 1900 – 1930 98-149
సాధారణ పరిస్థితులు 98
రాజకీయ పరిస్థితి 99
ఆంధ్రదేశమున జరిగిన సంఘటనలు 105
తెలుఁగు రచయితలపైన దేశీయ సాహిత్య ప్రభావము 114
స్వర్ణయుగ సుప్రభాతము 118
కందుకూరి, చిలకమర్తి రచనలను గూఱించి కొందఱు
విమర్శకుల అభిప్రాయములపై పరామర్శ 122
తెలుఁగు నవలల విస్తృతికి–
పంథలు, వ్యక్తులక్రమము క్రీ. శ. 1900 – 1930 129
విజ్ఞాన చంద్రికా గ్రంథమాల 129
ఆంధ్ర ప్రచారిణీ గ్రంథమాల 134
వేగుచుక్క గ్రంథమాల 135
రామ విలాప గ్రంథమాల 135
సరస్వతీ గ్రంథమాల 185

ద్వితీయ దశ క్రీ॥ శ. 1930–47 (150–260)

భారతావనిలో చెలరేగిన వివిధ ఉద్యమములపై –
గాంధీజీ ముద్ర
ఆంధ్రదేశములో వివిధ ఉద్యమములు (150–164)
ద్వితీయ దశ 1930–47 (150–260)

కాల్పనిక హేతువాద ప్రభావములలో –
తెలుగు నవలా వికాసము (165–226)
విశ్వనాథ, చలం, శ్రీపాద, మొక్కపాటి–
మునిమాణిక్యం, పిలకా, నోరి రచనలు
హేతు, అస్తిత్వ, అధ్యాత్మిక, సామ్యవాద–
దృక్పథములు (227–260)
గోపీచంద్, కొడవటిగంటి, ముంపన, కొవ్వలి (227–257)
అనువాదములు (257–260)

తృతీయ దశ క్రీ. శ. 1947–1973 (261–593)

స్వాతంత్ర్య భానూదయము –
ప్రగతి పథములో నవభారతము (261–66)
ఆంధ్రోజ్జ్వలములు – అభ్యుదయసిద్ధి (266–277)
తృతీయ దశ 1947–73 (261–593)

తెలుగు నవలా వికాస స్వర్ణయుగ సంక్రాంతి–
రచయితల అపూర్వ కృషి ∩ (277–420)
తెలుగు నవలా స్వర్ణయుగ సంక్రాంతిని ముక్తాల

రంగవల్లులతో తీర్చిదిద్దిన రచయిత్రులు 3 (421–473)
తెలుఁగు నవలా భారతికి-నేపథ్యభూమికలై
వెలుగొందిన అనువాద, అనుసరణములు 3 (474–508)
భారతేతిహాస గర్భితములైన చారిత్రక నవలులు (509-536)
ఇతరభాషలనుండి అనువదింపబడిన నవలలు (509–524)
స్వతంత్ర చారిత్రక నవలలు (524–536)
అద్భుత కల్పనలతో వివిధ రసాశ్రయమైన
డిటెక్టివ్ నవలా సాహిత్యము 2 (537–548)
ఆకార వాక్‌చేష్టా విన్యాసములతో కదుపుబ్బ
నవ్వించు తెలుఁగు హాస్య నవలలు 2 (548–565)
బాలప్రభలలోనే మిగిలిఉన్న బాలల తెలుఁగు
నవలా సాహిత్యము 2 (566–593)
దేశ విదేశీయ భాషలనుండి అనువదింపబడిన
బాలల నవలలు 5 (566–82)
తెలుఁగులో చిన్నపిల్లల నవలలు (582–593)

చతుర్థభాగము (594-628)

తెలుఁగు నవలా వికాసములో పత్రికలు-
వ్యక్తుల కృషి 1 (594–608)
1. ఆంధ్రపత్రిక-సచిత్ర వారపత్రిక - భారతి
2. ఆంధ్రపత్ర - సచిత్ర వారపత్రిక
3. ఆంధ్రజ్యోతి - వారపత్రిక 4. విశాలాంధ్ర

5. మిజాన్ 6. గోలకొండ 7. ఆంధ్రభూమి
8. కృష్ణాపత్రిక 9. పగటి సచిత్ర వారపత్రిక
10. తరుణ 11. జయశ్రీ 12. యువ
13. విశ్వారచన 14. జ్యోతి 15. ఆంధ్రప్రదేశ్
16. వ్యజన 17. చందమామ 18. బొమ్మరిల్లు
19. బాలమిత్ర 20. బాలానందం, 21. అభిసారిక,
22. రేరాణి, 23. మదన మున్నగునవి.

తెలుఁగు నవలా వికాసమునకు ఇనాలోక పాత్రిప్తి నందించిన ప్రచురణ సంస్థలు - సాహిత్య సంస్థలు-విశ్వవిద్యాలయములు - (608-624)

1. యం. శేషాచలం అండ్ కో.,
2. ఆంధ్ర గ్రంథమాల
3. వావిళ్ళ రామస్వామిశాస్త్రి అండ్ సన్సు
4. దక్షిణభాషా పుస్తక సంస్థ
5. వేంకటాద్రి అండ్ కో.,
6. త్రివేణి పబ్లికేషన్సు
7. దేశీ ప్రచురణలు
8. విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్
9. ఆదర్శ గ్రంథమండలి
10. నవజ్యోతి పబ్లికేషన్సు
11. నవభారత్ పబ్లికేషన్సు
12. స్టూడెంట్సు బుక్ సెంటర్

13. నవోదయ పబ్లికేషన్సు
14. శ్రీ పబ్లికేషన్సు
15. నటరాజ పబ్లికేషన్సు
16. వి. యస్. యన్. పన్సు ప్రచురణలు
17. ప్రగతి ప్రచురణాలయం
18. విశ్వసాహిత్యమాల
19. సరస్వతీ గ్రంథమాల
20. కొండపల్లి వీరవెంకయ్య అండ్ పన్సు
21. సప్తగిరి పబ్లికేషన్సు
22. ఆంధ్ర సారస్వత పరిషత్తు
23. దేశోద్ధారక గ్రంథమాల
24. ఆంధ్ర విశ్వసాహితి
25. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి
26. కేంద్ర సాహిత్య అకాడమి
27. నేషనల్ బుక్ ట్రస్టు ప్రచురణలు
28. ఆంధ్ర విశ్వవిద్యాలయ కృషి

వసుధైక కుటుంబ నిర్మాణ మార్గదర్శి నవల 3 (624–628)

ఎ) శోధిత నవలా సూచి 1–20

బి) ఉపయుక్త ఉద్యమములు, సంస్థలు-
పత్రికల పట్టిక 20–24

PREFACE.

With great pleasure I have gone through TELUGU NAVALA SAHITYA VIKASAMU written by Sri Pullabhotla Venkateswarlu. So far there has not been any good critical study of the novels written in Telugu. One book published earlier on the same subject was so sketchy and inaccurate that it were better it was not published. Though the writing of a novel was primarily due to the influence of British Literature, novels were not unknown to Indian Literature. We have the great examples of Dasakumaracharitra, Kadambari, Vasavadatta, and Udaya-Sundari in Sanskrit. The British influence only revived the form already present in India.

The writing of the novels became popular towards the end of the last century. Sri Venkateswarlu went through all the novels and his insights reveal the great pains he undertook in preparing the present work. In the best tradition he outlines the social, political, economic, and cultural conditions of the age, and relates these to the given work. This is the finest part of the work. The works are classified according to the themes, according to the age, and according to the techniques employed. This has made

the work an important document on the cultural, social, economic, and political conditions of the Telugu-speaking people. From a study of the present work one can learn much about the Andhras. This is because the present work is an extremely valuable study in literary criticism, and also a valuable document of social criticism.

Sri Venkateswarlu has an inimitable style. Without being difficult, and refusing to play to the gallery, he has maintained a style which is in accordance with the theme. This is a work which deserves to be read by the students of Telugu Literature and by all others who are interested in the current socio-politico-literary trends in modern Telugu Literature. It is the first work of its kind in its comprehensive sweep and in its acute literary sensibility. This critical account reads like a creative kind of writing. At least now the critics cannot say that there is no critical study of the novel in Telugu — Sri Venkateswarlu deserves full praise. It is hoped that this work will be the prelude to other important studies of Telugu Literature. This is necessary when we are planning to hold a World Conference of Telugu Literature. Telugu is spoken in the country by the largest number of people, only next to Hindi; and it is time that senitive critics like Sri

Venkateswarlu make Telugu known widely as an international language. Sri Venkateswarlu has all the qualifications to achieve this objective. But the Academies and the Government have to come out of their shells. I am sure that Sri Venkateswarlu will succeed where our Academies and the Government fail.

Dr. P. S. Shastri.
M. A., PH. D., M. LITT.;
Professor & Head of the Department.
Department of English, Nagpur University.

* స్వాగతం *

తెలుగు నవల పుట్టి వందేళ్ళు దాటాయంటే దాటాయి. నిన్నగాక మొన్న వందేళ్ళ పండగ ముచ్చటగా జరుపుకుంది కూడా.

ఈ వందేళ్ళలోనూ ఈ పొలాన పండిన పంట ఇరవై వేల నవలలట! అనువాదాలూ, అనుకరణాలు అసలువాటి కంటే అధికం.

మనలో బంకింలూ, శరత్‌లూ లేరు; ఠాకూర్‌లూ, ప్రేమచంద్‌లూ లేరు. అయినా అంతో ఇంతో పేరుపడ్డ రచయితలకూ, రచయిత్రులకూ, లోపం లేదు; నవలలకూ లోటు లేదు.

ఏ సాహిత్యానికీ లేనంత గిరాకీ నవలా సాహిత్యానికే వుంది. కొత్తసీటికి చేపల్లాగ నవలలకే ఎగబడుతున్నారు చదువరులు, చిన్నా పెద్దా కూడా.

ఇంతయినా, ఇంతవరకూ ఈసాహిత్యంగురించి సమగ్రమైన చరిత్రకాని, సహేతుకమైన విమర్శకాని రాలేదు.

ఇప్పుడిప్పుడు ఇది గుర్తించి, ఆపనికి నడుము కట్టిన వాళ్ళిద్దరు చెప్పుకోతగినవారిలో "సాహిత్యభూషణ" శ్రీ పుల్లాభొట్ల వెంకటేశ్వర్లుగారు వ్రాశారు.

ఐరోపీయ, భారతీయ నవలా సాహిత్యాలు అవగా

హాన చేసుకుని, తెలుఁగు నవలలు అధ్యయనం చేసి వీరు మనకు అందించిన అపూర్వమైన కానుక ఈ "తెలుఁగు నవలా సాహిత్యవికాసము".

శ్రీ వెంకటేశ్వర్లుగారు ఈవరకే పెక్కు కథలు, వ్యాసాలు, విమర్శలు, చరిత్రలు, జీవితచరిత్రలు, నవలలు రాసి చెయ్యితిరిగిన రచయిత. అవన్నీ వొకెత్తూ, ఈ "తెలుఁగు నవలా సాహిత్య వికాసము" వొకెత్తూ అంటే విప్రతిపత్తి వుండదు.

వీరీ గ్రంథం నాలుగు భాగాలుగా విభజించుకున్నారు. ప్రథమ భాగంలో "నవలల పుట్టుక - నిర్వచనములు" తో గ్రంథం ఆరంభించారు.

'నవల' అనగానే దాని తొలి పుట్టుక ఎక్కడ? అన్న ప్రశ్న వస్తుంది. "షుమారు వేయి సంవత్సరముల క్రిందట జపాను దేశములో నవలా ప్రక్రియ ఆవిర్భవించినట్లు కొందరు భావింతురు".

పదకొండో శతాబ్ది ప్రారంభంలో జపాన్ రచయిత్రి మురాసా కిమికుచు (973–1015) రాసిన "గంజి మోనోగో తారి" (గంజి కథ) ప్రపంచ సాహిత్యంలో తొలి నవల అంటారు పాశ్చాత్యులు. ఇది తెలుగులో అనువాదమయింది. అదే కాలంలో జపానులో వచ్చిన "తాకేతోరీ మోనోగో తారి" (వెదుళ్ళ కొట్టేవాడి కథ) తొలి నవల అనీ కొందరంటారు.

సంస్కృతం కాదంబరి ఖచ్చితంగా నవలగానే లెక్క వేస్తే - అది ఏడో శతాబ్దిది కనక - ప్రపంచ సాహిత్యంలో తొలి నవల భారత దేశంలోనే ఆవిర్భవించింది - జపాన్ కాదు - అని ఘంటాపథంగా చెప్పవచ్చు. నిజంకూడా అంతే. ఎటొచ్చీ ఈ ప్రక్రియ వికాసం మాత్రం యూరప్‌లో జరిగింది, కొన్ని శతాబ్దాలు గడిచాక. ఇటలీ బొకాషియో (1313-1375) దాని విస్తృతికి కారకుడయ్యాడు.

తరవాత "నవలా శబ్దోత్పత్తి" వివరించారు శ్రీ వెంక టేశ్వర్లుగారు. లాటిన్, ఇటలీ, ఫ్రెంచి భాషలలోనూ, భారతీయ భాషలలోనూ నవలను ఏమంటారో చెప్పారు.

తెలుగులో తొలిసారిగా 1897లో కాశీభట్ల బ్రహ్మయ్య శాస్త్రిగారు "నవల" అని ప్రయోగించారు. అంతకుముందు గోపాలకృష్ణమ్మ శెట్టిగారు, వీరేశలింగంగారు "వచన ప్రబంధం" అంటూవచ్చారు.

"నవల-ప్రబంధము" అని రెంటికీ గల కారణమ్యం నిరూపించారు శ్రీ వెంక టేశ్వర్లుగారు. "నవలల ప్రధానాంగములు", "నవలల భిన్నస్వరూపాలు" పరామర్శించి చూపారు.

ద్వితీయ భాగంలో "భారతీయ నవ్యసాహిత్య మహోదయము" ప్రసంగించారు. దానికి భూమికగా పనిచేసిన దేశ వాతావరణం చిత్రించారు. జాతీయ భాషలలో నవలల ప్రాదుర్భావం వివరించారు. బెంగాలీ, ఒడియా మళయాళం, తమిళం మొదలైన భాషలలో నవల పురోగమించిన రీతులు

తెలియచేశారు. "తెలుగు నవలా సాహిత్యమున నవళకో దయము" పేర్కొని, "తొలి నవలా రచయిత ఎవరు? తెలుగు భాషలో నవలా రచన ఎప్పుడు ప్రారంభమైనది? ఎట్లు ప్రారంభమైనది? మన ప్రథమ నవల యేది? అను విషయములో విమర్శకుల మధ్య భిన్నాభిప్రాయము లేర్పడినవి" అని చెబుతూ విమర్శకులింతవరకు అపరిష్కృతంగా చర్చించి వదలిపెట్టిన ఈ అంశాన్ని వీరు స్పష్టంగా తేల్చి చెప్పారు.

శ్రీ వెంకటేశ్వర్లుగారు వేసుకున్న పరిశోధకలోకాల్లో పెద్దది తృతీయ భాగం. ఇందులో "నవలా సాహిత్య స్వర్ణయుగము" వర్ణించారు. 1900 నుంచి 1974 వరకు అంచలంచలుగా సాగిన క్రమ వికాసం వర్ణించారు. ఆర్థిక, రాజకీయ, సాంఘిక, సాంస్కృతిక రంగాలలో రేగిన సంక్షోభాలూ, లేచిన ఉద్యమాలూ, వచ్చిన మార్పులూ నవలా వికాసానికి ఎలా భూమికలయ్యాయో చూపారు. "తెలుగు నవలల విస్తృతికి సంస్థల - వ్యక్తుల కృషి" పరామర్శించారు. "కాల్పనిక, హేతువాద పరిభావములతో తెలుగు నవలా వికాసము" రుజువు చేశారు. "హేతు, అస్తిత్వ, ఆధ్యాత్మిక, సామ్యవాద దృక్పథాలు" ఎత్తి కనపరిచారు. "తెలుగు రచయితల అపూర్వ కృషి" విపులీకరిస్తూ ఎన్నో నవలలు పరిచయ పరిచారు. పరిశీలించిన నవలా చదివి అందులోని కథ క్లుప్తంగా మనస్సుకి పట్టినట్లు చెప్పుకొచ్చారు. కథాకథన రీతి, పాత్ర చిత్రణ, శైలి, శిల్పము పరామర్శించారు. ఎంతో ఉదాహ

హామూ, ఓ రూప్సా, పట్టుదలా, నిజాయితీ ఉంటేనే కాని సాధ్యంకాని పని ఇది. ప్రతి నవలలోని మంచీ చెడ్డా నిష్పక్షపాతంగా,నిర్మొగమాటంగా చెప్పినా కటువుగా కాక, చెప్పదలిచింది సౌమ్యంగా, మృదువుగా చెప్పారు. వీరి సౌజన్యానికి ఇది తార్కాణం.

"తెలుఁగు నవలా స్వర్ణయుగసంక్రాంతిని, ముక్యాల రంగవల్లులతో తీర్చిదిద్దిన రచయితు"ల" నవలా సాహిత్యం ప్రత్యేకంగా పరామర్శించారు. "నవలా వికాస సాహిత్య చరిత్ర కెక్కదగిన" ముమూరు అరవైమంది రచయితుల నవలల బాగోగులు పరిశీలించారు. రచయిత్రుల నవలలవేపు వెడవి విరిచేవారి నుద్దేశించి "రచయితుల రచనలలో ఆమాత్రపు లోపమున్నను పరిగణనలోనికి తీసికొనవలసిన అవసరము లేదేమో" అని సూచించారు. ఆలా అని వారిలో తమకు అవుపడిన లోపాలు చూపకండా పక్షపాతం చూపలేదు.

"తెలుఁగు నవలా భారతికి నేపథ్యభూమికలై వెలుగొందిన అనువాద అనుసరణముల" ను విపులంగా వివరించారు. ఐరోపీయ భాషలలోంచీ, బెంగాలీ, అస్సామియా, ఉర్దూ, హిందీ, తమిళ, మహారాష్ట్ర, మళయాళ, కన్నడ, ఒడియా, గుజరాతీ మొదలైన భారతీయ భాషలలోంచీ తెలుగులోకి వచ్చిన ముఖ్యమైన నవలలను విడమర్చి చెప్పారు.

ఇంతవరకు అనుసరణలు, అనువాదాలు గురించి

ప్రస్తావించిన వారెవ్వరూ, ఇంత విపులంగా ముచ్చటించ లేదు. "విశ్వసాహిత్యమునందలి ఉత్తమశ్రేణి రచనల సరసన నిలుపదగిన" ఒడియా, ఉర్దూ నవలల తెలుగు అనువాదాలు చూచిన పాపాన కూడ పోలేదు వారు.

సంస్కృతం మృచ్ఛకటిక అనుసరణ సెట్టి లక్ష్మీనరసింహంగారి "వసంతసేన" నవల ఇక్కడ ముచ్చటించ దగింది. ఇది 1915 లో అచ్చయింది.

తెలుగు నుంచి ఇతర భాషలలోనికి తర్జుమా అయిన కొన్ని నవలలను కూడా పేర్కొన్నారు శ్రీ వెంకటేశ్వర్లుగారు. ఈ సందర్భంలో - మరి ఒకటి రెండు చెప్పడం అప్రస్తుతం కాదనుకుంటాను. శ్రీ కేతవరపు వెంకటశాస్త్రిగారి "లక్ష్మీ ప్రసాదము" కన్నడంలోకి తర్జుమా అయింది. అనుపదించింది శ్రీమతి వి. పద్మమ్మ. ఇది 1938 లో అచ్చయింది. అంతకు ముందే చిలకమర్తివారి 'హేమలత' ఒడియాలోకి అనువాదమయింది. గణపతిమునిగారి 'పత్యపభ' ఈమధ్య గంటి శ్రీరామమూర్తిగారు ఇంగ్లీషులోకి అనువదించారు.

అయితే ఇతర భాషలనుంచి తెలుగులోకి వచ్చిన నవలలు మనవారి మెప్పుపొందినట్టుగా తెలుగునుంచి ఇతర భాషలలోకి వెళ్ళిన నవలలు "ఆయా భాషలలో ప్రజాహ్లాదయములను అంతగా చూరగొనినట్లు లేదు" అంటూ-చేదయితేనేం - వున్నమాట చెప్పారు వెంకటేశ్వర్లుగారు. ఈమధ్య అడవివారి "నారాయణరావు" మీద వ్యతిరేకమైన గాలి

దుమారం కూడా రేగింది పొరుగు దేశంలో. ఆ సలు తెలుగు నవలలు తెలుగువారి హృదయాలనే అంతగా చూర గొనలేదేమో! కనుకనే "తెలుగు నవలకు మైనారటీ తీరిందా లేదా?" అనేది అనుమానమే అనడమూ, "తెలుగు నవలలు కాకితుజిలీల పునర్జన్మ" అని మూతి ముడవడమూను. నిజం గుర్తించడం ప్రగతి లక్షణం.

అనంతరం రచయిత చారిత్రక నవలలూ, హాస్య నవలలూ, బాలల చిన్నపిల్లల నవలలూ పరామర్శించారు. "బాలల చిన్నపిల్లల నవలలు ఎదగవలసినంత ఎదగలేదని" వాపోనపడ్డారు. మొత్తం బాలసాహిత్యమే గొప్పగా తోకేమో!

చతుర్థభాగంలో "తెలుగు నవలా వికాసములో పత్రికలు - వ్యక్తుల కృషి; ప్రచురణ కర్తలు, సాహిత్య సంస్థలు, విశ్వవిద్యాలయాలు కలిగించిన దోహదము" వర్ణించారు.

"సాహిత్యభూషణ" శ్రీ పుల్లాభొట్ల వెంకటేశ్వర్లుగారి ఈ తెలుగు నవలా 'సాహిత్య వికాసము' తొలినుండి చివరి దాకా చదవండి-నవలా సాహిత్యంలో వారికున్న అభినివేశం ఆశ్చర్యం కలిగిస్తుంది. వారి విమర్శనారీతి తలపూపాలని పిస్తుంది. మంచివీ, కానివీ పరిశీలనాదృష్టితో ఇన్ని నవలలు చదివిన వారి ఓపికను మెచ్చుకోవాలనిపిస్తుంది. వారి అభిప్రాయాలన్నిటితో మీరు ఏకీభవించకపోవచ్చు, కాని వారి కెదిరించాలని మాత్రం అనిపించదు. దానికి కారణం వారి రచనలోని మార్దవం.

శ్రీ వెంకటేశ్వర్లుగారి రచన సరసమైన సరళ గ్రాంథికంలో సాగింది. అనుకోకండానే అక్కడక్కడ వ్యావహారికం చోటుచేసుకుంది. ఈనాడు ఏ రచన అయినా మూలభాషలోనే రావాలి. వాడుక భాషే మూలభావ.

శ్రీ వెంకటేశ్వర్లుగారు వాడుక భాషకు వ్యతిరేకులు కారు. త్వరలో మంచి కూర్పు వాడుక భాషలోనే వస్తుందని ఆశిస్తాను. ఇంతటి కృషి చేసిన శ్రీ వెంకటేశ్వర్లుగారిని అభినందిస్తున్నాను. వారి "తెలుగు నవలా సాహిత్యవికాసా"నికి హృదయపూర్వకంగా "స్వాగతం" చెపుతున్నాను—

"కళాప్రపూర్ణ"

డాక్టర్. పురిపండా అప్పలస్వామి.

ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ విశిష్ట సభ్యులు.

నివేదనవము.

1963 వ. సంవత్సరములో ప్ర ము ఖ విమర్శకులు శ్రీ శే. శ్రీ వాత్సవాగారితో మాట్లాడుచున్నప్పుడు, వారు సామాజికముగా తెలుఁగు నవలలపైన ఇంతవరకు సరియైన విమర్శనాగ్రంథము వెలువడలేదనియు, ఆపనిని చేపట్టి ఒక గ్రంథము వ్రాయవలసినదనియు ప్రోత్సహించిరి. ఆ పిమ్మట సాహిత్యాచార్య శ్రీ శే. పిల్లలమఱ్ఱి వేంకట హనుమంత రావు పంతులుగారు ఒక గ్రంథావిష్కరణ సందర్భములో 1964 వ. సంవత్సరమున ఖమ్మం విచ్చేసినప్పుడు నా తో మాట్లాడుచు, వారు తమ "నవ్యాంధ్ర సాహిత్య వీథుల"ను కొన్ని సవరణలతో తిరిగి ముద్రింపదలచితిమనియు, ముఖ్యముగా నవలా విభాగమును విస్తరించి వ్రాయనెంచితిమనియు వివరించుటయేగాక,'నిత్యనూతనముగా అభివృద్ధిజెందుచున్న' ఈ సాహిత్య ప్రక్రియపైన ఒక సామూహిక గ్రంథము వెలువడకపోవుట ఆంధ్ర భాషకొక తీరని లోటనియు, తమ అవేదనను వ్యక్తపరచి "నన్ను ఆపనికి పూనుకొనవలసి" నదని ఆదేశించిరి. "తప్పక యట్లనంతు" నని వారికి మాట ఇచ్చి నను ధైర్యము చాలక వెనుకముందు ఆలోచించదొడగితిని.

ఇంతలో ఆంధ్ర భాషేతరులంకొరకు, మన రాష్ట్ర భాషయైన "హిందీ"లో తెలుఁగు నవలల ప్రగతిని గురించి వివరించునట్టి ఒక గ్రంథమును "ఆంధ్రప్రదేశ్ హిందీ లేఖక్ సంఘము" వారు "పద్మాకర్ - 2" అను పేరున ప్రకటింప

సంకల్పించి వ్యాసములను వ్రాయువలసినదని కొందరు పెద్దలను కోరిరి. అట్లు కోరబడిన వారిలో శ్రీపిల్లలమర్రి వేంకటపానుమంతరావుగారొకరు. వారిని ఆ సంఘమువారు తెలుఁగు నవలల పుట్టుపూర్వోత్తరములను, వాని క్రమవికాసమును వివరించుచు వ్యాసమును వ్రాయువలసినదని కోరిరట! శ్రీపిల్లలమర్రివారు వ్యక్తిగత కారణాంతరములచేత ఆ వ్యాసమును వ్రాసి పంపక, 'నా పేరును' ఆ సంఘమువారికి సూచించిరట! అంతట ఆ సంఘ కార్యదర్శిగారైన డాక్టర్ శ్రీభీమసేన్ నిర్మలగారు నన్ను ఆ వ్యాసమును వ్రాసి పంపవలసినదని కోరిరి. వారి కోరిక మేరకు "తెలుఁగు నవలా వికాస" మను పేరున వ్యాసమును వ్రాసి పంపితిని. 1967 వ. సంవత్సరములో 'పద్మాకర్-2' గ్రంథములో, రెండవ వ్యాసముగా ముద్రించి ప్రకటించిరి. ఆసంవత్సరము నేను హైద్రాబాదులో డాక్టర్ భీమసేన్ నిర్మలగారిని చూచుటసంభవించినది. వారు మాటల సందర్భమున నా వ్యాసమును బాగుగా పరిశీలించితిమనియు, దాని విపులీకరించి గ్రంథముగా వెలువరించిన బాగుగానుండగలదనియు పలుకొనిచ్చిరి. ఆ వ్యాసమును హిందీలోను, తెలుఁగులోను చదివిన చరిత్ర చతురానన పండిత శ్రీ శ్రీ ఆదిరాజు వీరభద్రరావు పంతులుగారును, 'ఈ ప్రక్రియపైన ఒక విమర్శనా గ్రంథమును వ్రాసి ప్రకటించిన బాగుగానుండు' నని ప్రోత్సహించి, ఆదేశించిరి. ఇందరు పెద్దల ఆ దేశ, ఆశీస్సులు లభించుటతో నాలో

నూతనోత్సాహము కలిగినది. దానికి తోడు తెలుఁగునాట ఇరువది, ముప్పదివేల నవలలు వెలువడినట్లు ప్రతినిత్యము వినుచున్నను, యే విమర్శనాభ్యాసము చడివినను పేర్కొనదగిన లెక్కించదగిన కొందరు నవలా రచయితలను, వారి రచనలను గురించిన విమర్శనలు చర్విత చర్వణముగా వెలువడుచుండుటతప్ప, ఇంకేదియు లేశపోవుట చూచి, ఈ ప్రక్రియకై న విమర్శనాగ్రంథమును వ్రాయుట మొదలిడని దృఢముగా భావించి, నా గ్రంథమునకు "తెలుఁగు నవలా వికాస" మనియే నామకరణము చేసి, వ్రాత ప్రతులను శ్రీ వీర భద్రరావు పంతులుగారికి చూపించుచు, వారి అమూల్యమైన సూచనలను, సలహాలను గ్రహించుచు ముందుకు సాగితిని.

1968-69 సంవత్సరములలో ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీవారికి ఆర్థిక సహాయము నిమిత్తము నా వ్రాత ప్రతిని సమర్పించితిని. ఆ సంవత్సరము ఆ సంస్థ నుండి ఆర్థిక సహాయము నాకు లభించలేదు. కాని నా వ్రాత శుద్ధ ప్రతి అకాడమీలోనే 1969 వ సం. వరకు ఉండి పోయినది. 1968 - 69 సంవత్సరములలో నా వలెనే మరొక రచయిత ఇదే విషయముపై 'వేరొక పేరుతో' వ్రాత ప్రతిని సమర్పించినట్లును, దానికి అకాడమీవారు ఆర్థిక ముగా తోడ్పడినట్లును ఆ సంవత్సరము వెలువడిన వార్షిక నివేదికలో చదివియుంటిని. 1971 వ. సం. లో "తెలుఁగు నవలా వికాసము" అను పేరున ఆ రచయితయే

తమ గ్రంథమును అచ్చువేసి ప్రకటించినట్లును పత్రికలలో చూచితిని. ఆ పిమ్మట 1978 వ.సం. సెప్టెంబరు నెలలో నాగ పూర్ విశ్వవిద్యాలయపు ఆంగ్లభాష ప్రధానాచార్యులైన డా॥ శ్రీ పి. యస్. శాస్త్రిగారివద్ద ఆగ్రంథమునుగూడ చూచితిని. నాకు ఆకాడమీనుండి ఆర్థికసహాయంలభింపకపోయినను 1969 సం లోనే నావద్దగల చిత్తుప్రతి సహాయముతో 'తెలుఁగు నవలా వికాసము' ముద్రణకు పూనుకొని, ప్రతి పేజీపైన "తెలుఁగు నవలా వికాసము" అని ముద్రించుచు ప్రచురణను కొనసాగించితిని. పై రచయిత గ్రంథమును నేను స్వయముగా మాచిన పిమ్మట మరల అదే పేరుతో నా గ్రంథమును ప్రకటించినచో పాఠకులకు కొంత అసౌకర్యము కలుగ గలదను తలంపుతో మిత్రుల సలహా ననుసరించి, నేనే నా గ్రంథ ముఖపత్రముపైన "తెలుఁగు నవలా సాహిత్య వికాసము" అను పేరున కొద్ది పవరణతో ప్రకటించినాను.

ప్రపంచమునను, భారతదేశమునను ముఖ్యముగా ఆంధ్ర దేశమునను 19, 20 శతాబ్దములలో ఆర్థిక, రాజకీయ, సాంఘిక, సామాజిక, సాంస్కృతిక రంగములలో నడచిన మహోద్యమములను, ఆ ఉద్యమముల ప్రభావముతో వెలువడిన నవలలను స్పృశించుచు, నేను సిద్ధపరచుకొనిన 'ప్రణాళికకు' తొడ్పడిన, కొన్ని ప్రముఖ నవలలను మాత్రమే ఇందు విమర్శించితిని. 20 వేలకు పైన నవలలు వెలువడి, అవి నానాభివృద్ధినందుచున్న ఈ సాహిత్య శాఖయందు మరె

న్నియో అనర్ఘ రత్నములు, ప్రము ఖ రచయితలున్నను స్థలాభావముచే వానిని పేర్కొనజాలనైతిని. ఇందు పోది చేసిన నవలా సాహిత్యావశ్యమము లన్నింటి కాలనిర్ణయము చేయుటలో స్వాతంత్ర్య మహా పంగామమునందలి విభిన్న ఘట్టములను ప్రామాణికముగా గ్రహించి, వాని నీడన ఈ ప్రక్రియ పొందిన ప్రగతిని వివరించి, గాంధీజీ ప్రభావముతో అది వికసించిన తీరు తెన్నులను తెలిపి, అనంతరము ఇది గుబాళించిన తీరును పేర్కొంటిని. ఇందు సుమారు వేయి నవలలు పరామర్శితములు.

ఈ "నవలా సాహిత్య వికాసము" నకు Preface వ్రాసిన నాగపూర్ విశ్వవిద్యాలయ ఆంగ్ల శాఖాధిపతులు, బహుభాషావేత్తలు ఆచార్య డాక్టర్ శ్రీ పోతుకూచి సుబ్ర హ్మణ్యశాస్త్రి, దీనికి "స్వాగతం" చెప్పిన బహుగ్రంథ కర్తలు, కళాప్రపూర్ణ డాక్టర్ శ్రీ పురిపండా అప్పలస్వామి గారలకు నిండు మనస్సులో కృతజ్ఞతల నర్పించుచున్నాను. నా రచనా వ్యాసంగమును ప్రోత్సహించుచున్న సాహిత్య బంధువులు శ్రీయుతులు కె. వై. యల్. నరసింహారావు, కె. దిగంబరశర్మ, కె. మధుసూదనరావు, పి. గోపాలరావు గార్లకు నా హార్దికాభివందనములు.

ఈ విమర్శనా గ్రంథమునకు నా స్వంత గ్రంథాలయ ములో లేసినప లలను నాకిచ్చి తోడ్పడిన ధన్మం పట్ట ణ గ్రంథాలయాధికారులకును, తమ స్వంత గ్రంథాలయముల

నుండి ఇచ్చిన సాహిత్య మిత్రులకు కృతజ్ఞుడను. ఈ రచనకు ఆంధ్ర, ఆంగ్ల, ఉరుమూ భాషలలో వెలువడిన పెక్కు గ్రంథములు, దిన, వార, మాస పత్రికలు చాగుగా నాకు తోడ్పడినవి. ఆ గ్రంథకర్తలకు, ఆ పత్రికాధిపతులకు కృతజ్ఞతాభివందనములు.

ఈ గ్రంథమును ముద్రించుకొనుటకు కొంతవరకు చేయూతనిచ్చి పోత్సహించిన భాషాపోషకులకు, సాహిత్యాభిమానులకు, శ్రేయోభిలాషులకు నా హృదయపూర్వక అభివందనములు సమర్పించుచున్నాను.

నా అర్థిక ఇబ్బందులను గుర్తించి ఓపికతో ఇంతటి సుదీర్ఘకాలము పింటింగ్ కార్యక్రమమును నిర్వహించిన శ్రీ. యస్. వెంకటేశ్వరులు "కవిభూషణ" శ్రీ విశ్వనాధంగు ప్ర, వారి కుమారులు డాక్టర్ శ్రీ చంద్రశేఖరం గార్లకు నా శుభాభివందనములు.

నా ఈ విమర్శనా గ్రంథమును ఆంధ్రభారతి దివ్య చరణములకు భక్తిపురస్సరముగా సమర్పించుకొనుచున్నాను-

మంగళమ్ మహత్.

X ೧೧೨

తెలుగు నవలా సాహిత్య వికాసము.

ప్రథమ భాగము.

1

నవలల పుట్టుక — నిర్వచనము.

నేడు విశ్వసాహిత్యమునందు అగ్రాసనాధిపత్యమును వహియించుచున్న సాహిత్య ప్రక్రియ నవల. ఈనవలకుసంఘములో నేడున్న విలువ, పలుకుబడి, ఆదరణ మరియేయితర సాహిత్య ప్రక్రియకును లేదు.

ప్రపంచ సాహిత్యమునందు నవలా ప్రక్రియ యొక్క పుట్టు పూర్వోత్తరములను గురించి కొంత తెలసికొనినపిమ్మట మన తెలుఁగు నవల పొందిన ప్రగతినిగురించి ముచ్చటింతును.

షుమారు వేయి సంవత్సరములక్రిందట "జపానుదేశ"ములో నవలా ప్రక్రియ ఆవిర్భవించినట్లు కొందరు భావింతురు. అయినను అది ఐరోపాఖండములో ప్రవేశించి, పలువురు రచయితలు ఆప్రక్రియను చేపట్టి రచనలు విరివిగా చేయుటకు ప్రారంభించిన పిమ్మటనే దానికి సంఘములో మంచి గౌరవము లభియించి, అదివిశ్వవ్యాప్తినందుకున్నది.

"ఆదర్శత-వాస్తవికత" యనుమానవనైజ ప్రవృత్తులు సాహిత్యమునందు ప్రవేశించి, "కాల్పనిక రచనలు, వాస్తవిక రచనలు" అను రెండుభిన్నమార్గములను సృష్టించినవి.

గ్రీకు, రోము, ప్రెంచి భాషలనుండి వేనిన్నైనను అనువాదముచేసినను, లేదా ఆంగ్లభాషయందు అద్భుత విషయములతో సృజియింపబడిన "పద్యాఖ్యానము" లను "కాల్పనిక రచన" లని అనాటి సాహిత్య వేత్తలు నామకరణముజేసిరి.

ఈర్ష్య, అసూయ, ద్వేషము మొదలైన దుర్గుణములతో నిండియున్న పద్యాఖ్యానములను "నోవస్", అని పాశ్చాత్యులు క్రీ శ. పధ్నాలుగవ శతాబ్దమువరకే వ్యవరించ మొదలిడిరి.

అప్పటివారు వాస్తవిక జీవితమును "చిత్రించు" పెక్కు గద్య రచనలైన కథలను "టేల్సు" పేరుతో వ్రాసిరను అవి నేడు విస్పష్టార్థ బోధకములైవరలుచున్నవి.

మొత్తముపైన గద్యరూపక కథాసాహిత్యమునకు నవల యను పేరు ఇంగ్లాండు దేశమున "స్కాటు" కాలమునకు స్థిరపడినది.

క్రీ. శ. పదిహేను, పదహారు శతాబ్దములలో యూరపు ఖండమునందలి ఇటలీ దేశములో పెక్కు నవలలు బయలుదేరినవి. ఈసాహిత్య ప్రక్రియకు ఇటలీ నివాసియైన

"బూకాషియో" అద్యుడని అగ్రాసనాధిపత్యమునిచ్చి కొం దరు విమర్శకులు గౌరవింతురు.

"క్లేర్లారేవ్" వంటి ప్రముఖులు "నవల_కాల్పనిక"రచ నముల మధ్య సూక్ష్మ దృష్టితో తెలిపిన నిర్వచనము సమసి పోయి "యదార్థ జీవిత విషయముల వాస్తవిక చిత్రణము గల" గద్యరూపక కథాసాహిత్యము "నవల" అను పేరుతో స్థిరపడిపోయినది.

"చిత్రకథాఖ్యానము నవల" అని మరికొందరు పెద్దలు నిర్వచించిరి.

"సమగ్ర మానవ జీవితచిత్రణమే" నవల అని వేరొక కొందరు ప్రవచించిరి.

పెక్కు అద్భుతావహ విషయములతో నిండినకాల్పని కములకంటె, నవల భిన్నమైనది. విచిత్రమైనది. "మనోరంజ కత, అతివిచిత్రత, వాస్తవికత" యను త్రిగుణముల నిది కలిగియుండి. యదార్థజీవితచిత్రణము మన మనో నేత్రము లకు గోచరించునట్లు భాసింపజేయునట్టి అద్భుతశక్తి ఈ నవలకున్నది. గనుకనే అచిరకాలములో సోదరసాహిత్యప్రక్రి యలయందు దీనికి యింతటి విశిష్టస్థానము లభియించినది.

గనుక యిప్పుడుమనము నవల అంటే "మనో రంజకత, అతివిచిత్రత, వాస్తవికత" అను త్రిగుణము

లను కలిగియుండి యుదార్థ జీవితచిత్రణము మన మనోనేత్రములకు గోచరించునట్లుభాసింపజేసెడి గద్య కావ్యఖండికయే నవల గా సాహిత్య లోకముచే నిర్వచింప బడుచున్న" దని భావింపవలసియుండును. ఈ నిర్వచనము సమంజసమైనదని, సరియైనదని చెప్పక తప్పదు.

నవలాశబ్దోత్పత్తి:- నవలకు లేటిన్ భాషలో నోవిలస్ (Novellus) లేక నోవస్ (Novus) అనియు; ఫ్రెంచి భాషలో నోవా (Nouveau) అనియు; ఇటాలియన్ భాషలో నొవెల్లా (Novella) అనియు; ఇంగ్లీషు భాషలో నోవెల్ (Novel) అనియు వ్యవహరించిరి.

భారతీయ భాషలకు మకుటమైన సంస్కృతమునందు దీనికి "నవం లాతీతి నవలా" అని యుత్పత్తి యున్నది. నేడు తెనుఁగుభాషయందు సర్వజనులు "నవల" యను నామముతోనే యీ నూతన సాహిత్య ప్రక్రియను పిలుచుచున్నారు. ఈ ఉపదమునందు తెనుగు దనము సంపూర్ణముగా మిళితమైయున్నది. మరాఠి, కన్నడము, గుజరాతి మొదలైన ఇతర దేశీయ భాషలయందు దీనిని "కాదంబరి" యని వ్యవహరింతురు. బెంగాలి, అస్సామి, పంజాబి, ఒరియా హిందీ భాషలలో "ఉపన్యాస" మని నామకరణముజేసిరి. ఉరుదూ భాషయందు దీనిని తెలుగునందు వలెనే "నవల" అనుపేరుతోనే వారువ్యవహరింతురు.

తెలుఁగులో నవలఃـــ

తెలుఁగు భాషలో బృహత్క-థలు, కాశీమజిలీకథలు, భేతాళపంచవింశతి కథలు, సింహాసనద్వాత్రింశిక, శుకసప్తతి, కాటమరాజు కథలు, మదన కామరాజు కథలు, భట్టీవిక్ర మార్క కథలు మొదలైన ప్రాచీన కథలెన్నియో నున్నవి. ఇవి అధునాతన నవలా పద్ధతికి నిలువకపోయినను, పూర్వ కాలమున మనకుగూడా యిట్టి అద్భుతావహ సన్నివేశము లతోనిండిన, యిట్టి మహత్తర సాహిత్యము ఒకటి వుండి యుండెడిదని చెప్పుటకు దీనివలననవీలు కలుగుచున్నది. ఎన్నియో సన్నివేశములతోను, సంఘటనలతోను నిండిన పెద్దకథలను తెలుఁగుభాషయందు నవల అని వ్యవహరించిరి.

నవలారచనకు కావలసిన పెక్కు-హంగులను, లక్ష ణములను మనము ఆంగ్లరచనా సంప్రదాయమునుండి యెరువు తెచ్చుకొంటిమి. ఆభాషా సహచర్యముతో మనతెలుఁగు నవల క్రమవికాసము నందినదని చెప్పకతప్పదు.

విశ్వ సాహిత్యమున నవలసాధించిన ఘనవిజయము:-

"సమగ్రమానవజీవిత చిత్రణముచేయుటకును, సంఘ వ్యవస్థను యథాతథముగా చిత్రించుటకును." నవలాప్రక్రియ మిక్కిలి ప్రయోజనమును కలిగించుచున్నది. గనకనే అది గతనాలుగు శతాబ్దములలో తనసోదర సాహిత్య ప్రక్రియ లతో పోరుసలిపి, ఘనవిజయమును సాధించి అగ్రగామియై

ముంను నిలచినది. ఈసాహిత్య ప్రక్రియయుంను పెక్కు-మంది రచయితలు, ఉత్తమ రచనలుచేసి "నోబుల్" బహుమతులను గూడా పొంద గలిగిరనినచో దీనికిగల విశ్వవ్యాప్తి, బహు జనాదరణను గురించి వేరుగా తెలుపవలసినదేమున్నది!

నవలకు ఇతివృత్తము:—

"మహావిప్లవములు ఘోర సంగ్రామములు, నిరంకుశ ప్రభుత్వములు, వాని దౌష్ట్య విధానములు, రాజ్యపతనములు, ప్రజాస్వామ్య వ్యవస్థలు, ఆర్థిక, రాజకీయ, నాంఘిక, సాంస్కృతిక పరిస్థితులు, వైవాహిక జీవితములు, అందలివొడు దుడుకులు, ప్రేమ, విడాకులు, ఉమ్మడి సంసారములు, కార్మిక కర్షకోద్యమములు, చారిత్రక కళాఖండములు విభిన్నమానవ మానసిక ప్రవృత్తులు, దైనందిన జీవితములో మానవుడెదుర్కొను పెక్కు చిక్కుసమస్యలు, అదియిదియని ప్రత్యేకముగా జెప్పవలసిన పనిలేకయే, మానవ జీవితమునందు సంభవించు ప్రతిచిన్న పెద్దసంఘటన" నవలకు యితివృత్తములై వర్ధిల్ల గలుగుటచేతనే, ఈసాహిత్య ప్రక్రియను ప్రపంచ ప్రఖ్యాతి నందిన మహారచయితలందరును చేపట్టి ఉత్తమోత్తమమైన నవలల నెన్నింటినో నిర్మించి తదితర సాహిత్య ప్రక్రియలపైన విజయధ్వజమును ప్రతిష్ఠించిరి.

ప్రపంచ ప్రఖ్యాతి జెందిన నవలా రచయితలు:—

ప్రపంచ ప్రఖ్యాతిజెందిన కొందరు నవలా రచయిత

లను, వారు తమ అపూర్వ కళా కౌశలముతో నిర్మించిన పీఠికలు "నవలలను" పేర్కొనుటవలన ఈసాహిత్యప్రక్రియకు నేడు ప్రపంచ సమాజములలోనున్న విశిష్టత, పలుకుబడి, గౌరవాదరములు మనకు కొంతవరకు వ్యక్తముకాగలవు.

అనటోల్ ఫ్రాన్సు "థాయిస్"; ఎమిలిజోలా "థెరిసా" గస్టాల్ఫాబిక్ "మేడాంబోవారి"; టాల్‌స్టాయ్ "అన్నా కెరినా", "వార్ అండ్ పీస్";మేగిమ్ గోర్కె "మదర్"; విక్టర్ హ్యూగో "లెమిజర్ బుల్స్"; "హంచ్‌బేక్ ఆఫ్ నాటర్‌డాం"; రోమారోలా "థిమేన్"; అలెగ్జాండర్ డ్యూమాస్ "కౌంట్ ఆఫ్ మాంట్‌క్రిస్టో"; "బ్లాక్ టూలిప్"; ఫ్లాబెర్ట్ డికెన్సు "ఏటేల్ ఆఫ్ టు సిటీస్"; "పిక్‌విక్ పేపర్సు"; సర్వాంటిస్ "డాన్‌క్విక్‌సేట్"; యువాన్‌చింగ్‌కుంగ్ "సన్సు అండ్ డాటర్సు"; పెరల్సు బర్క్ "గుడ్ అర్త్" "ఈస్ట్ అండ్ వెస్ట్"; మార్క్‌ట్వైన్ "టామ్‌సాయర్"; సర్ వాల్టర్ స్కాట్ "టేలిస్‌మన్" "ఐవాన్‌హో"; "టాలిస్‌మన్"; మెల్‌విల్ "మాబిడిక్"; హెన్రిజేమ్సు "ఎంబేసిడర్"; ఆలివర్ గోల్డుస్మిత్ "వికార్ ఆఫ్‌ది వేక్ ఫీల్డు"; డబ్లియు. యం. థేకర్ "వేనిటిఫేపర్"; థామస్ హార్డి "మెయర్ ఆఫ్ కాస్టర్ బ్రిడ్జి","వుడ్‌లాండర్సు," "రిటరన్ ఆఫ్ ది నేటివ్"; మిసెస్ మొరాసకి "గెంజ్‌గాథ"; డాస్టోవిస్కి, "ఫాదర్సుఅండ్‌సన్సు" మొదలైనవన్నియు విశ్వవ్యాప్తినంది పెక్కు ప్రపంచభాషలలోనికి అనువదింపబడినవి.

మనటాగూర్, శరత్, బంకించంద్ర్, వీరేశలింగం పంతులు మొదలై నవారందరు ఆకోవకు జెందిన ఉత్తమ రచయితలే. ముల్క-రాజ్ ఆనంద్, కిషన్‌చందర్, ఆర్. కె. నారాయన్. విశ్వనాధ సత్యనారాయణ, అడవి బాపిరాజు. నోరి నరసింహశాస్త్రి మొదలైన వర్తమానకాల రచయిత లందరు భారతీయ సాహిత్యములో ప్రథమ శ్రేణికిజెందిన నవలలు సృష్టించి, విశ్వసాహిత్యములో మనకు మంచిస్థాన మును సమకూర్చిపెట్టిరి.

2

నవల ప్రధానాంగములు

మానవ శరీరమునకు నోరు, ముక్కు, కండ్లు, చెవులు, చేతులు, కాళ్లు మొదలగు అంగములవలెనే, "నవలా శరీరమునకు" కొన్ని ప్రధానమైన అంగములున్నవి. లౌకిక సంబంధమైన ఈ భౌతిక దేహమునకు, యీ "అంగముల" వలన నెట్టి ప్రయోజనములు కలుగుచున్నవో, అలౌకిక సంబంధమైన నవలా దేహమునకు గల ఈఅంగముల వలన గూడా మనకు అట్టిమహత్తరమైన ప్రయోజనములే సమకూరుచున్నవి.

"మానవజీవిత యదార్ధ చిత్రణను" సమగ్రముగా సందర్శించుటకు, సంపూర్ణముగా దాని స్వరూప స్వభావములను అవగహనచేసికొనుటకు, తదితర సాహిత్య ప్రక్రియల అన్నింటికన్న "నవల" మిక్కిలి ప్రయోజనకరమైన దని అనేకమంది మహామనీషులు వెల్లడించిరి. విధాత తన మహత్తరశక్తితో, విశ్వమును సృష్టించినట్లే, ప్రతిభావంతుడైన రచయిత తనకుగల అపూర్వ లోకానుభవముతో, రచనా శిల్పముతో, కళాకౌశలముతో చక్కని నవలనుప్రసవించి అంగ ప్రత్యంగములతో సర్వాంగసుందరముగా, సమగ్రముగా నవరసభరితముగా భాసించునట్లుచేసి, ఆ అలౌకిక చిత్రమునుగూడా మనకన్నులకు రూపు కట్టునట్లుచేసి పరిరక్షించును. కనుకనే రచయిత "ప్రాంతదర్శి"వై గడిగాంచని ప్రదేశములను శోధించి సజీవసంపన్నమైన వినలు చేసి; పైనందిన జీవితములో లౌకిక ప్రపంచమునందు మన మనుభవించు, సుఖదుఃఖముల నన్నింటిని మరిపించి తన అలౌకిక ప్రజ్ఞాపాటవములతో మనలను మరొకలోకమునకు గొంపోవగలుగును. ఇట్టి మహత్తరశక్తి సంపన్నమైన "నవల"కు పరిజ్ఞానములైన అంగములేవియో తెలిపి, వాని వలన ఆ పరిక్రియ పొందు ప్రయోజనములనుచూపి, దాని వలన మనమనుభవించుచున్న ఆనందమును కొంతవరకు గ్రహియింతము.

ఇంతటి మహత్తరానందమును మనకు కలిగించు నవల అంగములకును, తదితరసాహిత్య ప్రక్రియల అంగములకును భేదమేమైన నున్నదా? ఉన్నచో నది యెట్టిది? అను విషయమును ముందుపరికింతము.

నాటకము, ప్రబంధము, కావ్యము మొదలగు ఇతర సాహిత్య ప్రక్రియలకుగల అంగములతో, నవలాంగములకు గూడా సన్నిహిత సంబంధమున్నది. కొన్నివిషయములలో కొంత వ్యత్యాసమున్నది. ఆ వ్యత్యాసమే యీ సాహిత్య ప్రక్రియకు యిటటి జనాదరణను, విస్తృత ప్రచారమును కలుగునట్లు జేసివది. ఖండాంతరములలో తనప్రత్యేక ప్రతిపత్తితోపాటు గొప్పప్రభావమునుగూడా అదిప్రదర్శించుకొనగలుగుచున్నది. తదితరసాహిత్య ప్రక్రియలకన్న అది అగ్రగామియై ముందునిలిచి సభాపత్యమును వహించుచున్నది.

నవల—నాటకమువకు గల భేదము.

ముందు మనము నాటకముయొక్క అంగములను ఉదాహరణముగా గ్రహించి, నవలాంగములతో పోల్చిచూచి భేదమును పరిశీలింతము. నాటకమునకుగల అంగములు చాలావరకు నవలాంగములతో సరిపోయినప్పటికిని, వాని వివరణములో ప్రయోగవిధానములో, రచనా సంవిధానములో కొంత భేదము కలదని చెప్పక తప్పదు. ఆభేదమే ఆరెండు ప్రక్రియలకుగల విస్తృత ప్రచారములో జనాద

రణములో సర్వత్ర గోచరించు చుండును. ఆలక్ష్యములోగల వైవిధ్యమే ఆరెంటికిగల ప్రచారములో ప్రస్ఫుటమగును.

1. నవలకు ప్రత్యేకముగా ఒక రంగస్థలమనునది లేదు. దానికి గల రంగస్థలము దానియందే, దానివెంటనే యిమిడి యున్నది. ఇకనాటకము రంగ నిబంధయుక్తము. రంగస్థలమును దృష్టియందుంచుకొని కవి తన నాటకమును వ్రాయును.

2. నవలలలో వర్ణనల వలన పాత్రలు మన మనస్సునందు నిలుచును. అవిబహిర్గతములుకానేరవు. నాటకము నందట్లుకాదు. ప్రత్యక్షముగా గనుపించును. అవిమన మనోనేత్రములయందు రూపుకట్టుకొనును.

3. నవలకుకాల వ్యవధిలేదు – ఏంతసేపైనను జెప్పవచ్చును. వినవచ్చును. వినువారికి వోపికయున్నచో రోజుల తరబడి నెలల తరబడి దానినికొనసాగించవచ్చును. రూపకములందు కాలనియతితోపాటు, రంగస్థల నియతిగూడా నున్నది. ఎంతమంచి నాటకమైనను నాలుగూ లేక ఐదు గంటలకన్న చూచినచో విసుగుజనించును. మన మనస్సు దానిపై లగ్నముగాదు. ఏకాగ్రత నశియించును.

4. నవల అంతర్దృశ్యము–నాటకము బాహ్యదృశ్యము.

5. నవలకు వస్తు నియతిలేదు. నాటకమునకు వస్తు నియతితోపాటు సంగ్రహీకరణము ప్రధానము.

6. నవలశ్రవ్యకావ్యము. గనుక జీవనకళ కొంతతక్కు వగా నుండును. నాటకముదృశ్యకావ్యము. అందు సజీవత్వము విధిగానుండును. పాత్రలు మనకన్నుల యెదుట తిరుగు చుండును. వాటిచుట్టు మనము తిరుగు చుందుము. దీని యందు వాగ్నియతి, సందర్భనియతి మిక్కుటము. వేష ధారణము అవసరము. పాత్రోచిత సంభాషణలు ముఖ్యము.

7. నవలాకారుడు పాత్రలపక్షమున మాట్లాడవచ్చును. తన స్వంత అభిప్రాయములను వ్యక్తము చేయవచ్చును. నాటక రచయితకు ఆ స్వతంత్రతమృగ్యము. కొన్నినిబం ధనలకు కట్టుబడి రూపక నిర్మాణముచేయవలయును.

8. నవలకు విస్తృతత్వము మిక్కుటము. రచయిత తన అభిప్రాయముల కనుగుణ్యముగా పెంపు సొంపులతో దానిని తీర్చి దిద్దుట కవకాశమున్నది. నాటకమునకట్టి స్వతం త్రతలేదు. కొన్ని నియమ నిబంధనలకు కట్టుబడి అభిరుచ్యనుగుణ్యముగా దానిని మలచవలసియుండును.

9. నవలకు భాషావిషయకమైన ప్రతిబంధకములేదు. నాటములందు పాత్రోచిత భాషను విధిగా వాడవలెను.

10. నవలయందు భూతభవిష్యద్వర్తమాన కాలములు మూడును ఇతివృత్తముగా నుండవచ్చును. రూపకమునందు భూతకాల విషయమును, వర్తమాన కాలమున జరుగు

చున్నట్లు చూపవచ్చును. వాటక కర్తకీ స్వతంత్రత మాత్ర మున్నది. ఇంతకుమించి లేదు.

11 నవలయందు రచయిత సూక్ష్మ విషయములను సవివరముగా వివరించగలుగును. రూపకమునందట్లు చేయుట మిక్కిలి కష్టము.

12. నవలయందలి పాత్రలకు వేషధారణాది అలం కరణయుండదు. గనుక వాటిరూపకల్పనను రచయిత తన యిచ్ఛ ననుసరించి చేయవచ్చును. నాటకమునందు పాత్రలు వేషమును ధరియించి, రంగస్థలముపై తమ హావభావములను వెల్లడిచేయవలసి యుండును. ఏమాత్రము లోపమున్నను నటులు అపహాస్యము పాలగుదురు. నాటకము రక్తికట్ట నేరదు.

13. పైన తెలిపిన వివరములనుబట్టిచూచినచో నవ లకు స్వయం సంపూర్ణత్వము స్వతస్సిద్ధము. ఇది నాటకము నందు సిద్ధించుటకు పెక్కు ఇతర విషయములు తోడ్పడ వలసియుండును. ముఖ్యముగా (1) నటుల నటనా చాతు ర్యము, (2) రంగస్థలము, (3) అలంకరణ (4) పాత్రల సం భాషణలు (5) పాత్రోచిత వేషధారణ ఇట్టి వెన్నియో నున్ననే గాని నాటకము విజయవంతము కాజాలదు.

14. కథా కథన పద్ధతిలో, సన్నివేశముల కల్పనా విధానములో, ఇతివృత్తమును స్వీకరించుటలో, దానిని

నిర్వహించుటలో నవలాకారునికున్న స్వతంత్రబుద్ధి "స్వేచ్ఛ" నాటక కర్తకులేదు.

15. నవల విజయము కేవలము పఠిత నాశ్రయించి యుండును. నాటక విజయము ప్రేక్షకాశ్రయము. ముఖ్యముగా రచయిత, ప్రదర్శకులు, రంగస్థలము, ప్రేక్షకులు. ఇందేది లోపించినను నాటకము విఫలమగును.

నవలకు స్వయం సంపూర్ణత్వము సిద్ధించుటకుగల ఇట్టి సదవకాశములే, దాని ఘనవిజయమునకు మూలభూతములై ప్రపంచ వాఙ్మయమున దానికి చోటును కల్పించినవి. అది స్థాన బలిమిని చిక్కించుకొని తదితరవాఙ్మయములకు మకుటమై ప్రపంచ సాహిత్యమునందు నేడు అధికారమును నెరపుచున్నది.

నవల - ప్రబంధము:-

నవలకును, ప్రబంధమునకునుగల, ప్రధానాంగములను గురించి కొంతవివరించి, నవల బహుజనాదరణను పొందుటకుగల హేతువులను మరికొంత విశదపరుతును-

1. నవలయందు కథ ప్రధానము. గనుక కథనువిన సొంపుగా మలిచినచాలును. ప్రబంధమును కథ కొరకు మనము చదువము. వర్ణనలు, కవితారీతులు, శైలీసుందరత, అలంకారములు మొదలైన వెన్నియో చదివి అవి మన హృదయమునకు నచ్చినచో అనందింతుము. కవిసమర్థుడు,

ప్రతిభావంతుడు నైనచో ఇన్నిటిని మనోహరముగా చిత్రింపగలడు. ఇందు యేవొక్కటి లోపించినను ఆదివిజయవంతము కాజాలదు.

2. నవల తక్కువశ్రమతో సుఖముగను, సుందరముగను చదువరుల నాకర్షించి, ఆనందమును కలిగించును— నవల వచన రూపమున నుండునుగదా! ప్రబంధము పద్యములతోనుండి కఠినపద భూయిష్టమై యుండును. దాని పఠన మేధస్సునకు శ్రమనిచ్చును. ఛందోనియమము, విశ్వంఖలత్వమును అరికట్టును సంగతి సర్వులకు విదితమేగదా!

3. నవల సర్వజన పఠన యోగ్యము. స్త్రీ, పురుష, బాల, వృద్ధులు దానిని చదివి ఆనందించుటకు, తమదైనందిన జీవితము నందలి శ్రమను నివారించుకొనుటకు మిక్కిలి ఉపయోగపడుచున్నది. ఇక ప్రబంధమన్ననో కొన్నినియమనిబంధనలకు కట్టుబడియుండి, పండితులకును ఉన్నతవిద్యాసంపన్నులకును మాత్రమే ఉపయోగపడుచున్నది. గనుక దీనికి విస్తృత ప్రచారము, బహుజనాదరణము, నేడుతక్కువగానున్నది.

ఈసందర్భమున మనము ముఖ్యముగా పింగళి సూరనార్యుడు ప్రబంధ రచనమునందుగూడా తనసునిశిత మేధాసంపత్తితో, రచనా శిల్పముతో కళాకౌశలముతో, అపూర్వమైన లోకానుభవముతో "కళాపూర్ణోదయ మహా

కావ్యము"నందు నవలాత్యమును సిద్ధింపజేసిన మాటను విస్మరించుటకు వీలులేదు. అది మనముగర్వింపదగిన ప్రబంధ రూపమైన నవల. 'ఆంధ్రవాఙ్మయ ప్రపంచమునందు ఆమహా మహుడు పండించిన పసిడిపంట. తెలుఁగువారు గర్వింప దగిన మహత్తర గ్రంథము.

పై వివరణమున నవలతో, నాటకము, ప్రబంధమునకు గల ప్రధానాంగములయందలి భేదములే, కావ్యమునకును ఇతర సాహిత్య ప్రక్రియలకును వర్తించును. నవలకుగల యీవొరవ గుణమే, అది ఇతర సాహిత్య ప్రక్రియల కన్న అగ్రగామియై ముందుకు నడిచి వానిపై అచిరకాల ములో నాయకత్వమును వహించి రాణించునట్లుచేసినది.

'నవల' ప్రధానాంగముల పరామర్శ.

ఇక నవలకుగల ప్రధానాంగములను వివరించి, వాని వలన నవలకుచేకూరు ప్రయోజనములను విశదపరుతును—

ఈజగన్నాటకమునందు యేవ్యక్తియు నిర్వ్యాపారిగా, నిష్క్రియుడుగా నుండజాలడు. ఎంత గొప్పవాడైనను, ఎంతటిసోమరిపోతైనను, ఏదియో ఒకపనినిచేసితీరవలసినదే. విశ్వవ్యాపారమున యాత్రికుడుగా పయనించుచున్న మానవుడు, జీవితరంగమున, యెన్నియో సంఘటనలు, సమావేశములు, వాగ్వ్యవహారములు, క్రియాకలాపములు జరుపు

చుండును. వానివలన అతనికి కొంత అనుభవము, అనుభూతి కలుగును. కొంత జ్ఞానమునసమకూరును. బుద్ధి వికసించును. ప్రతినిత్యము జీవితరంగమున సంభవించిన ఈఅనుభవములే, యీసంఘటనలే, సమావేశములే, వాగ్వ్యవహారములే నవలకు ముఖ్య ఇతివృత్తములై ప్రధానాంగములుగా భాసించుచున్నవి. గనుక నవలకు "ఇతివృత్తము" ముఖ్యమైన అంగమని మనము గ్రహియింపవలసియుండును.

మనము ప్రతినిత్యము యీ జగన్నాటకము నందు చూచుచున్న వ్యక్తులు, మనతో సన్నిహిత సంబంధము గల మనుష్యులు, యీ సంఘటనలకు, యీ విచిత్ర సమావేశములకు మూలభూతములై ఇందలి "పాత్రలు" గా వ్యవహరింతురు.

ఆపాత్రలు పరస్పరము జరుపుకొనిన సంభాషణలు వారిఅనుభవములు, అనుభూతులు, వాగ్వ్యవహారరూపమున బయలు వెడలినప్పుడు అవి నవలకు "సంభాషణ" లగుచున్నవి. నవలకు సజీవత్వమును సమకూర్చుచున్నవి.

పైన తెలిపిన మూడింటికి ఒకకాలము, దేశము అవసరము. ఆయాదేశకాలముల ప్రభావము దీనిపైన ప్రస్ఫుటముగా మనకు గోచరించును. గనుక దీనిని "వాతావరణ" మని యందురు.

నవలా రచయిత తనకుగల లోకానుభవముతో, పైన తెలిపిన నాలుగంశములను సహాయముగా దీసికొని, ఈ ప్రపంచమును, తానుజీవించుచున్న సంఘమును అందలి విభిన్న వ్యక్తులను వారి గమనశీలమును గురించి తన అభిప్రాయములను వెల్లడించును. దీనిని "సందేశము"అనిగాని, లేదా "జీవనతత్వము" అనిగాని, లేదా "జీవన విధానము" అనిగాని యందురు.

దీనిని బట్టి నవలకు (1) ఇతి వృత్తము, (2) పాత్రలు (3) సంభాషణలు (4) వాతావరణము. (5) సందేశము అను నవి ప్రధానమైన అంగములని తేలినది. ఈ ఐదు అంగము లను రచయిత సమర్థవంతముగా నిర్వహించగలిగినప్పుడేనవల విజయవంతము కాగలదు. ఈ అంగములను కొంతవరకు పరామర్శించి, వానితత్వమును తెలుసుకొనుట చాలా ముఖ్యము.

నవల ప్రధానాంగముల విషయ వివరణము :-

1. ఇతివృత్తము:- నవలయందుండు "కథ"ను ఇతి వృత్తమని వ్యవహరింతురు. ఇతివృత్తమును స్వీకరించుటయం దును, స్వీకరించినదానిని శ్రద్ధగా క్రమపద్ధతి వెంట నడుపుట యందును, రచయితకు మంచి సామర్థ్యము అవసరము. నవలా రచయిత నిత్యము తాను చూచుచున్న ప్రతి విషయ

మును, ప్రతి సంఘటనను ఇతివృత్తముగా స్వీకరించి, నవలను ప్రాయుటకు ప్రయత్నించినచో అది ఫలవంతము కాజాలదు. గనుక తనను ముఖ్యముగా కలచివేసిన (ఆవేదనను) సంఘట నను దానివలన తానుపొందిన అనుభూతి విశేషములను మాత్రమే ఇతివృత్తముగా స్వీకరించి వానిని ఒక క్రమపద్ధ తిలో ఆస్వాదయోగ్యముగా నుండు నట్లు, అమర్చుట మిక్కిలి అవసరము. దీనికి శ్రద్ధముఖ్యము.

ఇతివృత్తము యింపుగను, చదివినకొలది చదివించ గల సమర్థవంతముగను ఉన్నప్పుడే, అది సర్వజనామోదము నందగలదు. గనుక నవలారచయిత ఇతివృత్తసేకరణ ములో మిక్కిలి అప్రమత్తుడుగా నుండవలెను. ఇతివృత్తము ప్రారంభమునుండి పఠితను ఆకట్టుకొని చివరవరకు అతనిని వెన్నంటి చదివించగల సమర్థవంతముగా నుండవలెను. పాఠకుడు వాస్తవప్రపంచములో తాననుభవించుచున్న సుఖ దుఃఖములను మరచి, తన సర్వేంద్రియములను దానియందు లీనముచేయు నంతటి సమర్థవంతమైన ఇతివృత్తమును స్వీకరించుట చాల అవసరము ముఖ్యము. రచయిత తనకు సంబంధములేని అతిలోకమైన; అవాస్తవ, యితివృత్త మునుస్వీకరించక, వాస్తవప్రపంచముతో, తాను స్వీకరిం చిన యితివృత్తమునకు సన్నిహిత సంబంధముండునట్లుచూచు

కొనుట చాల అవసరము. తనతోసంబంధములేని వ్యక్తులనుగాని, తానుచూడని సంఘటనలనుగాని యితివృత్తముగా స్వీకరించినచో దానిని సమర్థవంతముగా మలిచిచూపుట మిక్కిలి కష్టము. అప్పుడు ఎన్నియో వొడు దుడుకులకు గురికావలసివచ్చును. గనుక ఇతివృత్త సేకరణలోనే రచయిత మిక్కిలి జాగరూకతతో మెలిగి తన సామర్థ్యమును ప్రకటించవలెను. రచయిత గొప్ప భావుకుడును, నేర్పరియైన శిల్పియు నైనప్పుడే అదిసాధ్యపడును. తానుగ్రహించిన ప్రతిచిన్నవిషయమును, పూసలలో దారమువలె ప్రధాన కథతో సన్నిహిత సంబంధముండునట్లు కథను మలిచి, ఆసాంత మధురముగా నుండునట్లు చిత్రించుటకు ప్రయత్నింప వలెను. అప్పుడు నవలారచయిత పడిన శ్రమ - శ్రేయు ఫలవంత మగును. మంచి పుష్టిగల నవల అతని చేతనుండి వెలువడును.

పాత్ర చిత్రణ:- నవల సజీవముగా నవరసభరిత సంపన్నముగా మనముందు సాక్షాత్కరింపవలెనన్న పాత్ర చిత్రణ విషయములో చిత్రకారునివలె నవలారచయిత మిక్కిలి శ్రద్ధవహించి పనిచేయవలసి యుండును. సమగ్ర మానవజీవిత చిత్రణమే నవలయని మనమంగీకరించినప్పుడు, ఆ చిత్రనిర్మాణములో అపరిమితత్వమే మెలగుట మిక్కిలి ఆవశ్యకముగదా! నవలయందలి పాత్రలకు, యదార్థ ప్రపంచ

మున మనము చూచుచున్న పాత్రలకు సన్నిహితసంబంధ
ముండవలెను. అట్లున్నప్పుడు నవలారచయిత పడిన శ్రమ,
తీసుకొనిన శ్రద్ధ ఫలవంతమగును. అట్లుగాక నవలయందలి
పాత్రలు మనస్వభావ స్వరూపములకు, నడవడికి, చూరముగా
నుండి, వాస్తవప్రపంచముతో సంబంధము లేక యున్న
ప్పుడు ఆ పాత్రలపైన మనకు సానుభూతి కలుగదు. ఆ
పాత్రలతో మనము తదాత్మ్యమును బొందజాలము. మనకు
వారిపైన ఆత్మీయత కలుగనప్పుడు వారిపై అభిమానమెట్లు
కలుగును? సానుభూతి ఎట్లేర్పడును? ఆ పాత్రల కష్టసుఖము
లను మనము పంచుకొని, వారి ఆనందముతో మన ఆనం
దము, వారి దుఃఖముతో మన దుఃఖము; పమ్మిశ్రితమై, ఆ
రెండును ఏకవాహినిగా ప్రవహించినప్పుడే అది యదార్థ
మైన నవల కాగలదు. మన శ్రమను తీర్చి ఆనందోత్సాహ
ములను కలిగించగలదు. గనుక పాత్రచిత్రణమున రచయిత
కడుజాగరూకుడై మెలగవలెను. మనము నవలను ముగిం
చిన పిమ్మట గూడ ఆ నవలయందలి పాత్రలు మనలను
వెన్నాడుతూ, తమ కష్టసుఖములను మనతో చెప్పుకొను
చుండవలెను. మన కన్నుల ముందు అవి తిరుగుచు, వానిని
గురించి మనము ఆలోచించునట్లుగా చేయవలెను. అవి
మనతో తమ బాధలను, గాథలను మోమోటము లేకుం
డగా చెప్పుకొనునట్లు చేయవలెను. వానికి మనము అస్త

మిత్రులమో యనునట్లు ప్రవర్తింపవలెను. ప్రతిభావంతు డైన నవలారచయిత చేతిలో నిట్టి పాత్రల సృష్టి జరుగును. ఇంతటిసజీవసంపన్నమైన పాత్రలను సృష్టించుటకు రచయిత స్వయముగా జగన్నాటక సూత్రమునెరిగిన ప్రతిభావంతుడును, భావుకుడునుగావలెను. తాను జీవించుచున్న సమాజము నందలి వ్యక్తులను, వారి స్వరూప, స్వభావములను, వారి మనోవృత్తులను, వారి వేష భాషలను, ఆచారవ్యవహారములను, నాగరికతా వైభవములను, ఆర్థికస్తోమతలను చక్కగా పరిశీలించ గల లోకానుభవము ఆతని కుండవలెను. అట్టి లోకానుభవమున్నవేగాని, సజీవపాత్రలను సృష్టించి, లోకమున కందింప జాలడు.

కథాకల్పనయందే, ఆయాపాత్రల రూపురేఖలను తీర్చి దిద్ది మన మనోనేత్రములయందు అవి సాక్షాత్కరించునట్లు చేయగలనేర్పు, ప్రతిభ నవలారచయితకుండవలెను. అప్పుడే ఆపాత్రలు సజీవ సంపన్నముగా నుండును. నాటకమునం దలి పాత్రలవలె నవలయందలి పాత్రలుగూడా సజీవ సంపన్నముగా మనముందు ప్రత్యక్షమైనప్పుడే మనకు అవి ఆనంద మును చేకూర్చగలవు.

ఇతి వృత్తము, పాత్రలు, ఒకదానితో మరొకటి నీర క్షీర న్యాయమున సమ్మిశ్రితమై నప్పుడే, ప్రతిభావంత మైన పాత్రలసృష్టి జరుగగలదు. సజీవ సంపన్నముగా ప్రాణ వంతముగా మనముందు అవి సాక్షాత్కరింపగలవు.

3. సంభాషణలు:- నవలయందలి పాత్రలు ప్రపంచమునందలి మానవులకు ప్రతిబింబములు. వాస్తవ ప్రపంచమునందలి యదార్థత, స్వరూప స్వభావములు, వాక్చమత్కృతియందలి విన్నాణము, నవలయందలి పాత్రలలో బాగుగా ప్రతిబింబించినప్పుడే అవిమనకు ఆనందమును చేకూర్చగలవు. ఆపాత్రల సంభాషణా సంవిధానము సరసముగను, సుందరముగను, మనోరంజకముగను, ఫలవంతముగను నున్నప్పుడే మనకుఅవి ఆనందమును చేకూర్చగలవు. కృత్రిమ సంభాషణలు, అసందర్భ ప్రలాపములు అసహజమైన ఆలోచనలు నవలకు పుష్టిని చేకూర్చజాలవు. పఠితలకు తృప్తిని కలిగించనేరవు. నీరసము, నిర్వీర్యముతో నున్న గ్రంథముపట్ల యెవ్వరికిని ఆదరణ కలుగనేరదుగదా!

సంఘటనలకును, సన్నివేశములకును అనుకూలమైన సంభాషణలు జరిగినప్పుడే, నవల సజీవముతో మనముందు సాక్షాత్కరించి, అదిమనలను ఆనంద సముద్రమున నోలలాడించగలదు. పాత్రల నోటినుండి వెలువడు ప్రతిమాట ప్రతిచేష్ట, అర్థవంతముగను సందర్భోచితముగను నున్నప్పుడే ఆపాత్రలు ప్రాణవంతమై మనముందు నిలిచి నాలుగు కాలముల పాటు వర్ధిల్లగలవు. సజీవ చిత్రముల వలె, మన ముందు సాక్షాత్కరించి, మరోలోకములకు అవి గొంపోవ సమర్థవంతములగును. లేనిచో అవి రచయిత చెప్పుచేతులలో

శీలుబొమ్మలవలె మెలిగి, మనపైన నిట్టిప్రభావమును కలిగించ కుండగనే తెర మరుగున, పడిపోగలవు. రచయిత పడినశ్రమ యంతయు బూడిదలోబోసిన పన్నీరై పోవును.

4. వాతావరణము:— నవల యదార్థతను ఆపాదించుకొని, సజీవముగను, సలక్షణముగను, చైతన్యవంతముగనుభాసింపవలయునన్న దేశకాలచిత్రణము, లేదా బాహ్యా పరిస్థితులను గురించిన వివరణము ముఖ్యమని వొప్పుకొనకతప్పదు. ఒక్కమాటలో చెప్పవలెనన్న చక్కని వాతావరణ కల్పన మన్నమాట. అది ప్రతిభావంతముగను, సమర్థవంతముగను, లేకపోయినచో పాత్రలు నిర్వీర్యమైపోగలవు. నిస్సారముగను, నీరసముగను యుండి మనకు నవలాపఠనములో సరియైన ఉత్సాహమును కలిగింపజాలవు. ఈదేశకాల పరిస్థితులను, బాహ్య వాతావరణమును సమర్థవంతముగా చిత్రించినప్పుడే ఇతివృత్తమునకు మంచి జిగి, బిగిచేకూరి, రచన సక్రమముగాను సాఫీగాను సాగగలదు.

ఈ వాతావరణమును 1. సామాజిక వాతావరణమని, 2. భౌతిక వాతావరణమని రెండుభాగములుగా విభజింపవచ్చును. ఈ వాతావరణద్వయమును పుష్టివంతముగను, తుష్టివంతముగను చిత్రించి చూపినప్పుడే నవలకు పరిపూర్ణత సిద్ధించి అది ఫలవంతముకాగలదు.

కథా గతికి తోడ్పడని వర్ణనములు, ఆనందమును చేకూర్పజాలవు. దానివలన కథాప్రవాహము దెబ్బతిని పోగలదు. అధికవర్ణనములు, అనర్థమును చేకూర్చి నవలకు ప్రాథమిక ప్రయోజనమైన "ఆనందము" కుంటువడిపోవును. గనుక వాతావరణమును చిత్రించుటలో శ్రద్ధ యెంతైనను అవసరము. అది విస్మరించినచో అనర్థములు ప్రత్యక్షము కాగలవు.

5. సందేశము:- సమగ్రమానవజీవన చిత్రణము "నవల" అని మనము ముందే తెలిసికొనియుంటిమి. ఇట్టి మహత్తర చిత్రణమునుండి మనముగ్రహియించునదేమి? లేక దీనిని పఠియించుటవలన కలుగు లాభములేవి? లేక మనము ఈ గ్రంథము పఠియించుటవలన కలిగిన శ్రమకు లభియించు సందేశమేమి? ఏమహత్తర ప్రతిఫలము నాసించి పఠిత తన సమయమును వ్యయముచేసి నవలను పఠియించుచున్నాడు? అను ప్రశ్నలు ఉత్పన్నము కాకతప్పదు.

ఏఫలితము లేనిదే, మానవుడు శ్రమపడుట సంభవించదుగదా? విభిన్న సాహిత్య ప్రక్రియల నన్నింటిని అధ్యయనము చేయుటవలన మనకు యే ఆనందము లేక యే సందేశము సమకూరుచున్నదో నవలా పఠనమువలన గూడా నదియే లభియించుచున్నది. దీనిపరిధి విశాలము గనుక దీనివలన అంతకంటే గొప్పఫలము మనకు సమకూరగలదు.

"సత్యము, శివము, సుందరము" అను త్రిగుణములను మనము దీనివలన పొందవచ్చును. అయినను రచయిత ప్రతిభను, ఆలోచనా సంవిధానమును, అనుభవమును, అను భూతిని బట్టి ఫలితము లభియించగలదు.

రచయిత సమాజమును సమగ్రముగా పరిశీలించి, నవలాంగముల నన్నింటిని సమకూర్చుకొని, తనకుగల ప్రతిభా వ్యుత్పత్త్యభ్యాసములతో పరిశ్రమించినచో మంచి నవలను సృష్టించి, తనఆలోచనా పరిధికి తగిన సందేశమునివ్వగలడు. రచయిత నీరసుడైనచో అతని సృష్టియంతయు నీరసమగును. అతడందించు సందేశము నీరసముగానుండును. మనము పడు శ్రమ మరియు కాలము వ్యర్థమగును.

గనుక రచయిత యిచ్చు సందేశము చాల ముఖ్యమైనది. శరీరమునకు ప్రాణమెట్టిదో రచనకు రచయిత మొసంగు సందేశమట్టిది. సమర్థవంతుడైన రచయిత చేతిలో నవల "సామాజిక దర్శనము" గా ప్రకాశించును. ఆతడిచ్చు సందేశము అత్యుత్తమమైనదై, ఏకదేశికముగాక, ఏకకాలికముగాక, సార్వదేశికము, సార్వకాలికమునై. సర్వమానవ కల్యాణమునకు, సర్వమానవ సౌభ్రాతృత్వమునకు, సౌహార్ద్రిత్వమునకు దోహద మొసంగునదిగా గూడానైయుండ గలదు. అప్పుడు అతడు పడినశ్రమ ఫలవంత మగును. మన కాలము సద్వినియోగ మగును.

3

నవలలు - భిన్న రూపములు

వస్తువు లేక ఇతివృత్తమును బట్టి నవలలు:- కథావస్తువును బట్టి స్థూలముగా నవలలను ఐదు విధములుగా విభజించవచ్చును.

1. అపరాధ పరిశోధక నవలలు. 2. సాంఘిక నవలలు 3. రాజకీయ నవలలు. 4. చారిత్రాత్మక నవలలు 5. పౌరాణిక నవలలు.

పైన వివరించిన నవలలలో విడివిగా అపరాధపరిశోధక నవలలు ప్రతిసంవత్సరము వెలువడుచున్నవి. సాంఘిక నవలలు ద్వితీయస్థానము నాక్రమించు కొనుచున్నవి. తృతీయ స్థానము రాజకీయ నవలది. ఇక చారిత్రిక నవలలు అప్పుడప్పుడు వెలువడుచుండును. పౌరాణిక నవలలలు సక్కత్తుగా వచ్చును.

1. అపరాధ పరిశోధక నవలలు:—నేడు తెలుఁగు భాషయందు "అపరాధ పరిశోధక నవల" అను పేరుకన్న "డిటెక్టివ్" నవల అనుపేరు అవిరళ ప్రచారము నందు కొన్నది. అందరుదానిని ఆపేరుతోనే వ్యవహరించుచున్నారు.

సహజముగా "డిటెక్టివ్" నవల, అనఁట తోడనే అం దులో తప్పనిసరిగా ఒక హత్యవుంటుందని, మనవారు భ్రమ పడుతూవుండగలరు. ఒక అందమైన యువతిని, ఒక విలన్ "బ్లాక్‌మెయిలు" చేసి, చివరకు ఆమెనో, ఆమె ప్రియుడినో, భర్తనో లేక ఆప్తుఁడినో, హత్యచేస్తాడనిగూడ అనుకుంటారు. అంతేగాక ఆరడుగుల ఎత్తు, ఆ ఎత్తుకుదగిన లావు, కలిగి వున్న ఆ "డిటెక్టివ్" విలన్ని పట్టుకుఁటూడని, అందరికీ ఒక అపోహవున్నది. ఆ పుస్తకములు చిన్న సైజులో ముద్రింప బడివుండి, వాటిపైన ఒక అందమైన ముఖచిత్రముగూడా చిత్రింపబడివుంటుందని, అది మిక్కిలి ఆకర్షణీయముగా వుండగలదని మరొక విధమైన నమ్మకము ప్రజలలో పాతు కొనిపోయివున్నది. ఈ వివరణము సరియైనదికాదు.

ఈ క్రింది నిర్వచనమును పరిశీలించినచో "డిటెక్టివ్" నవల యొక్క యదార్థస్వరూపము అవగతము కాగలదు.

> "అయోమయముగను, అధ్వాన్నముగను, అసందర్భముగను, ఉంచబడిన పరిస్థితులను, ఒక క్రమపద్ధతిలో కూర్చుకొని, హేతువాదముతో తన ప్రతిభవల్ల, తెలిసిన విషయముల సహాయముతో, తెలియని విషయములను సవివరముగా తెలిసికొనడము అనునది "కథా వస్తువుగా" గలయేకథ యైనను డిటెక్టివ్ నవలయే" యని చెప్పవచ్చును."

దీనికి అర్థపూరకముగా ఈ విధముగను చెప్పవచ్చును.

"నేరములను గుర్తెరిగి, నేరముచేసిన వారిని నిరూపించుటలోగల పరిశోధకుల బుద్ధి కుశలతను, తదవరోధములను, తదవరోధాతిక్రమణలను. ఒకదానితో నింకొకదానికి సంబంధింపజేయుచు, పరిశోధకుని యొక్కయు, అపరాధి యొక్కయు మేధాసంపత్తిని తెలియపరచుచు "తుట్టతుదకు నేరముదాగదు-అపరాధికి శిక్షతప్పదు". అనుసత్యమును నిర్వచించు అద్భుత కథా సంవిధానమే అపరాధ పరిశోధక నవల" అని చెప్పవలసియుండును.

అపరాధ పరిశోధక నవలలు రెండువిధములు;-

1. చదువరుల బుద్ధికుశలతను రేకెత్తించి, చక్కని పరిష్కార మార్గమును నిర్దేశించి చూపునవి.— వైజ్ఞానిక సంబంధమైన ఉత్తమ నవలలీ కోవకు జెందినవి.

2. మానసికోద్రేకములను విపరీతముగా రెచ్చగొట్టి మనుష్యులను తికమకపెట్టునవి— ఇవిచౌక బారు నవలలు. వీనినే "మిష్టరీ" కథలనిగూడా వ్యవహరింతురు. ఇవి మూడు రకములు. 1. దయ్యముల కథలు 2 చిక్కుప్రశ్నలతో నిండియున్న కథలు 3. డిటెక్టివ్ కథలు.

భయోద్రేకములను ఉత్పన్నముచేయు విచిత్రమైన

కథలన్నియు యీ కోవకు జెందగలవు. వీనివలన సంఘమున కంతగా ప్రయోజనముండదు.

నేరములు చేయుటకుగల వివిధ కారణములు :—

ఈ నేరములు ఆర్థిక పరముగను రాజకీయపరముగను, సాంఘిక పరముగను, లైంగిక పరముగను వుండవచ్చును. ఈనేరములు సామాన్యముగా సాంఘిక, శాసన ధిక్కార రూపముగానుండవచ్చును. అపరాధ పరిశోధక నవల ముఖ్యముగా శాసన ధిక్కారమును చూపునట్టిదిగా నుండును. శిక్షలు మొదలైనవి యిందు విధింప బడుచుండును.

డిటెక్టివ్ నవలల చరిత్ర;- ఈసాహిత్య ప్రక్రియ 18 వ శతాబ్దమునందు ఫ్రెంచిదేశమున ప్రప్రథమముగా వుద్భవించినది. కాని అమెరికాదేశమునకు జెందిన "ఎడ్గార్ అలాన్‌పో" 1841 వ సంవత్సరమున వ్రాసిన "మర్డర్స్ ఇన్ది రూమోర్" అనుకథతో యీ సాహిత్య ప్రక్రియకు ప్రపంచమున మంచి పేరు ప్రతిష్టలు లభియించినవి. ఈయన మరి రెండు డిటెక్టివ్ కథలు వ్రాసి యీ సాహిత్య ప్రక్రియకు మంచి బలమును చేకూర్చెను. అయన సృష్టించిన డిటెక్టివ్ పేరు "సి. అగస్ట్‌డ్యూపా". అయినను యీరచయితకు అనాడు అంతగా ప్రజాదరణము లభియించలేదు.

చార్లెస్ డికెన్సు "మిస్టరీ ఆఫ్ ఎడ్విన్‌డ్రూడ్" అను పేరుగల అసంపూర్ణమైన ఒక "డిటెక్టివ్" నవలను వ్రాసి

యుండెను. ఇదిమిక్కిలి అద్భుతవిషయములతో నిండియున్న గొప్ప నవల యట !

యదార్థమైన డిటెక్టివ్ నవలలు 1887 వ సంవత్సర మునుండి నిక్కిలి ప్రచారములోనికి వచ్చినవి. ఆ సంవత్స రమున ఒక ఆస్ట్రేలియన్ రచయిత వ్రాసిన ఒక డిటెక్టివ్ నవల 5 లక్షల ప్రతులు మూడునెలలలో అమ్ముడు పోయిన వట ! ఈ చారిత్రాత్మక ఘనవిజయముతో అటు రచయిత లకు, యిటు పాఠకులకు మంచి ఆకర్షణ, ప్రోత్సాహము లభియించినవి.

ఆసంవత్సరములోనే బ్రిటీష్ రచయిత అయిన, ఆర్థర్ కేనన్ డాయిల్ "షెర్లాక్ హోమ్స్"అను"అద్వితీయమైన"డిటె క్టివ్ కళాఖండమును వ్రాసి యీ సాహిత్య శాఖలో స్వర్ణ యుగమును సృష్టించి, విశ్వసాహిత్యములో యీ ప్రక్రి యకు ఒక అపూర్వ విజయమును సాధించెను. 1887-93 సంవత్సరముల మధ్య ఆయన "షెర్లాక్ హోమ్స్"నుకథానాయ కుడుగా సృష్టించి 25 నవలలు వ్రాసెను. ఈమహామహుని కృషి ఫలితముగా "డిటెక్టివ్" సాహిత్యము విశ్వవ్యాప్తినంది నది. ఈయన తరువాత చెప్పుకోతగిన మరియొక రచయిత ఫ్రెడరక్ జేమే. ఈ యన సృష్టించిన డిటెక్టివ్ పేరు "ఎలరీ క్వీన్". నేడు అంతర్జాతీయ డిటెక్టివ్ నవలా రచయితగా ఎర్ సాని గార్డినర్ గొప్పఖ్యాతిని గడించు కొన్నాడు.

ఈయన సృష్టించిన డిటెక్టివ్ పేరు "ఫెర్రిమేసిన్". ఈఅద్భు తమైన పేరుతో యీ రచయిత 150 నవలలకుపైగా వ్రాసి యున్నాడని ప్రతీతి. మొత్తముపైన నేడు విశ్వసాహిత్యము నందు ఇతర నవలలకన్న అపరాధక పరిశోధక నవలలసృష్టి అత్యధికముగానున్నదని మనము నిస్సంశయముగా చెప్ప వచ్చును.

2. సాంఘిక నవలలు;- మార్పు సహజము- స్వతస్సిద్ధము. ఏదేశమునందును, యేసంఘమునందును, ఎొకేవిధముగా ఆచారవ్యవహారములు, సాంఘిక కట్టుబాట్లు నిలిచియుండుటలేదు. నిలచియుండజాలవు. నిత్యనూతనముగా కాలాను గుణ్యముగా అవిమారి రూపొందుచున్నవి.

సంఘము చైతన్యస్రవంతి. ఈ ప్రవంతికి అంతమను నదిలేదు. కాలక్రమముగా సంఘమునందలి వ్యక్తుల అలవాట్లు, కట్టుబాట్లు, ఆచారవ్యవహారములు, జీవిత విధానము మారుచుండును. ఈ మార్పునకు తలయొగ్గిన నేగాని మానవుని మనుగడకు శాంతియనునదిలేదు.

గనుక - "ప్రస్తుత సంఘమునందలి ఆచార వ్యవహారములను గమనించి, అందలి లోటుపాటులను సవరించి సంస్కరణ పూర్వకమైన చక్కనిభవిష్యత్తును చూపు అపూర్వమైన సాహిత్య సాధనము "సాంఘిక నవల". అని చెప్పవచ్చును.

ఈ ప్రక్రియ ఒకచక్కని మార్గదర్శి-సంఘ వ్యవస్థను బలమైన పునాదులపైన పునర్నిర్మించుటకు యిది మిక్కిలి ప్రయోజనకారి. సంఘమునందలి అక్రమ పరిస్థితులను, అవినీతిని, కుళ్లును, అన్యాయమును క్షాళనముచేసి, సువ్యవస్థతో అది వర్ధిల్లునట్లు సంస్కరించి పునర్నిర్మించుట దీని పరమోద్దేశ్యము. ఈలక్ష్యమును సాధించుటకు ప్రగతిశీలురు, సాంఘిక సంస్కర్తలు నైన రచయితలు గొప్పకృషి చేసి పెక్కు నవలలను సృష్టించిరి.

ఈరకమైన నవలలు వ్రాయు రచయితలకు చారిత్రక, సాంఘిక, వైజ్ఞానిక దృష్టితో పుష్టికరమైన పునాదులపైన భావిచరిత్రను ప్రగతిశీలముతో సృష్టించు మేధాసంపత్తి యుండితీరవలయును. ఈరచయిత భవిష్యత్కాలమునకు వైతాళికుడు.

ఈ రయితకు దూరదృష్టి, విశాలదృక్పథము తాను చిత్రించు సంఘముపట్ల గొప్ప సానుభూతి వుండవలెను. అప్పుడే ఆనవలా రచనోద్దేశ్యము సాధింపబడును. ప్రగతిశీలియైన రచయితమాత్రమే అట్టిఘనకార్యమును సక్రమముగా, సజీవ సంపన్నముగా సర్వజనా మోదముగా చేయగలడు.

సాంఘిక నవలలు రెండువిధములు;- 1. సంఘము నందలి కుళ్ళును, అవినీతిని, అక్రమ పరిస్థితులను, ఎలిగెత్తి

చాటి, వానిని వ్యంగ్య స్ఫోరకముగా, విమర్శించి అభ్యుదయ మార్గమును సూచించునవి. పరిష్కార మార్గమును ప్రతిపా దించి, పునర్నిర్మాణమునకు మార్గదర్శకముగా నుండునట్లు యివి మలచబడును. దోషములను పరిహరించి చక్కని మా ర్గములను నిర్దేసించి చూపు నవలలు యీకోవకు జెందినవి -

2. రెండవరకమైన నవలలు అట్టివికావు ఈరకపు నవలలు ప్రాయు రచయిత తన కాలమున జరుగుచున్న సాంఘిక పరిస్థితులను, యథాతథముగా చిత్రించి, ఆపరిస్థితులు మనకన్ను లకు రూపుకట్టునట్లు చేయును. వీనియందు రచయిత ఒక ద్రష్ట గానిలచి తనస్వంత అభిప్రాయములను, అభిరుచులను అందు చొప్పింపక, యథార్థపరిస్థితులను భావితరములవారికి వున్నది వున్నట్లుగా, జరిగినది జరిగినట్లుగా ఇందు చిత్రించి చూపును. ఇతనిది చారిత్రక సృష్టి-రాబోవు సంఘమునకు చారిత్రక విషయములను సత్యసూరములు కాకుండ చూపునవి. ఇవిఐతి హాసికములైనను - ఇతిహాసమునకు దూరముగానుండును. సాంఘిక చలత్వ చరిత్రయే వీరికి ప్రధానము.

సాంఘిక నవలల చరిత్ర:— 15-18 శతాబ్దముల మధ్య పాశ్చాత్య దేశములలో చెలరేగిన వైజ్ఞానిక, పారిశ్రా మిక విప్లవముల ఫలితముగా ఆ సంఘములలో గొప్ప సంచ లనము బయలుదేరినది. ప్రజల పైన సర్వాధికారమును నెరపుచున్న నిరంకుశ ప్రభువుల, మతశక్తుల ప్రాబల్యము

క్రమముగా క్షీణించి పోసాగినది. అంత వరకు ఆ శక్తులకు నివ్వా ళొల్పించుచు రచనలు చేసిన కవులు, కళాకారుల దృష్టి సామాన్య ప్రజలవైపు మళ్ళినది. ప్రగతిశీలురైన రచయితలు కొందరు నిరంకుశ ప్రభువుల పరిపాలన క్రింద నలిగి పోయిన మూగజీవుల ఆవేదనను, వారి హృదయగత ఆక్రందనలను, దుఃఖమయ జీవిత గాథలను ఇతి వృత్తముగా స్వీకరించి రచనలు చేయుచు వారి పురోభివృద్ధికి తోడ్పడ సాగిరి. సంఘ సంస్కర్తలు, ప్రజాసేవకులు నిర్భయముగా అధికారము నదిరించుచు ప్రజలకు అండ దండలుగా నిలబడి సేవ జేయుటకుద్యమించిరి.

ప్రజాసమస్యలను యథాతథముగా చిత్రించి సంఘ ములో ప్రతిబింబింప జేయుటకు, పద్యముకన్న గద్యము మిక్కిలి ప్రయోజనకారి యని ఆనాటి రచయితలు గ్రహిం యించిరి. ఆలివర్ గోల్డుస్మిత్, చార్లెస్ డికెన్సు వంటి ప్రగతిశీలురైన మహోమహులు నవలను సాధనముగా జేసి కొని, సాంఘిక సమస్యలను యితివృత్తముగా గ్రహియించి రచనలు చేయసాగిరి. వారి రచనలకు మంచి ఆదరణ, సంఘములో గొప్ప గౌరవము లభియించినది. ప్రజా విశ్వాసమును విరివిగా పొందిన ఆ రచయితలు ధైర్యముతో సామాన్య ప్రజల పక్షమున నిలబడి వారి దైనందిన జీవిత సమస్యలను, వివిధ దృక్కోణముల నుండి పరామర్శించుచు పుంఖాను పుంఖములుగా రచనలు చేయసాగిరి.

ఈ మధ్యన టాలస్టాయ్, బెర్నార్డ్‌షా, మపాసా వంటి ప్రముఖ రచయితలు పెక్కు సాంఘిక నవలలు వ్రాసి సంఘమును ఉద్రేజ పరచిరి.

ఆంగ్ల భాషను రచనాసాధనముగా స్వీకరించి, భారతీయ ఇతివృత్తమునకు ప్రాధాన్యత నిచ్చుచు చక్కని నవలా రచయితగా ప్రఖ్యాతి నందిన మన వారిలో ఆర్. కె. నారాయస్. కమలా మార్కండేయులు, ఖాజా మహమ్మద్ అబ్బాస్, ములక్‌రాజ్ ఆనంద్ పేర్కొన దగినవారు.

3. రాజకీయ నవలలు:-

"దేశమునందలి భిన్నవ్యక్తులు తమతమ ధర్మములను గమనించి, హక్కులను ప్రతిపాదించి, ఆ హక్కులను సాధించుటకు ప్రజలలో ఉద్రేకములను రెచ్చగొట్టి తిరుగుబాటునకు పునాదివేయుట లక్ష్యముగా గల కథాసంవిధానము రాజకీయ నవల."

ఇందలి కథలు యదార్థములైనను, ఊహాజనితములైనను కావచ్చును. ఇవి వీర రస ప్రధానముగా నుండి ప్రజలను చైతన్యవంతులుగను, కార్యోన్ముఖులుగను మార్చ గలవు. ఇట్టివి దేశభక్తి ప్రపూరితములు. తాముజన్మించిన దేశముకొరకై తమ సర్వస్వమును త్యాగముచేయుట వీని అంతిమ లక్ష్యము. ప్రపంచమున ప్రజాస్వామ్య వ్యవస్థను

నెలకొలుపుటకు పెక్కు మహోద్యమములు నడచినవి. మహా విప్లవములు చెలరేగినవి ఆ ఉద్యమములను ఆధారముగా దీసుకొని, దాని యందలి వివిధ ఘట్టములను ఇతివృత్తముగా గ్రహించి, అనేకమంది దేశభక్తులైన రచయితలు ఉత్తేజకరమైన మహత్తర నవలల నెన్నింటినో వ్రాసి ప్రజాసందోహమునందు గొప్ప సంచలనమును కలిగించి వీరోచిత సాహసకార్యములను నెరపునట్లు ప్రోత్సహించిరి. త్యాగశీలురైన మహాత్ములు తమ మాతృదేశ గౌరవమును కాపాడుటకై నిర్భయముగా చిరు నవ్వును చిలకరించుచు, తమ శరీరమునందలి ప్రతిరక్తబిందువును ధారబోసి చివరకు వుర్వి కంబముల నలంకరించిన ఘట్టములెన్నియో నున్నవి. ఇట్టి సాహసోపేతమైన వీరోచిత గాథలతో ఊరకమైన నవలలు నిండియుండును.

ఐవాన్‌హో, రాబ్‌రాయ్, త్రీమస్కెటీయర్స్, వార్ అండ్ పీస్, అన్నాకెరినీనా, ఎ టేల్ ఆఫ్ టు సిటీస్, దుర్గేశ నందిని, ఆనంద మఠము, మాలపల్లి మొదలైనవి, యీ కోవకు జెందిన ప్రసిద్ధ నవలలు.

4. చరిత్రాత్మక నవల:- చరిత్రాత్మక నవల పేరు వినబడుటతోడనే అది "రెండు విరుద్ధ విషయముల కలయిక"యని మనకు స్ఫురించును. "చరిత్ర"అనగా జరిగిపోయిన సంగతి. సత్యముతో నిండిన యదార్థ విషయము- "నవల"

అనగా కల్పితము. జరిగిపోయిన సత్యముతో దీనికి సంబంధ ముండ నక్కరలేదు. ఈకల్పన హృద్యంగమముగా నుండిన చాలును. ఈ రెండు విషయములకు సమన్వయ మెంత చక్కగా కుదిరిన, చారిత్రాత్మక నవల అంత ఫలవంత ముగను, ప్రశంసనీయముగను భాసించును. అనగా "జరిగి పోయిన ఒకానొక చారిత్రిక సంఘటనను, ఆధారముగా గ్రహించి, దానిని ఆత్మగాచేసి దానిచుట్టు పెక్కు-అద్భుత సంఘటనలతో, విచిత్ర సన్నివేశములతో కథాకథన దక్షతతో రచియించిన మహత్తర గ్రంథమే" చారిత్రాత్మకనవల

అందువలన చారిత్రిక నవలలు అనగా "ఇతి వృత్తముపూర్తిగా చరిత్రికు సంబంధించినదై యుండి, కొన్ని ముఖ్య సన్నివేశములు విశిష్ట, కల్పిత లక్షణము లతో చారిత్రిక సన్నివేశములకు భంగము వాటిల్ల కుండునట్లుగా పాత్రిపోషణము చేయునదియే చారి త్రాత్మక నవల." అని నిర్వచించవచ్చును.

ఈ నవలలను రెండువిధములుగా విభజించవచ్చును.

1. ఏదేని దేశ చరిత్రను లేదా అందలి ఒకానొక ప్రముఖసంఘటనను ఆధారముగా దీసికొని వ్రాయు నవలలు.

2. చరిత్రిలో తెరమరుగున పడిపోయిన ప్రముఖ వ్యక్తులనుగాని, లేదా వీరోచిత కృత్యములను. సాహస కార్యములను సరపినవారిని గాని దీసికొని వారి జీవితములో

తెరమరుగున పడిపోయిన విశేషములను ఆధారముగా గ్రహించి ఆవ్యక్తుల చుట్టు కథను మలచునట్టివి- జీవితాత్మక నవలలు.

చారిత్రాత్మక నవలల ప్రయోజనము:-

ఈరకమైన నవలలు జాతీయభావములను, దేశభక్తిని, వీరరసమును ప్రజలలో పెంపొందించుటకు బాగుగాతోడ్పడ గలవు. వ్యక్తులు తమజాతియొక్క, దేశముయొక్క పూర్వ వీరుల చరిత్రను, వారునెరపిన ఘనకార్యములను, సాధించిన మహత్తర విజయములను, తెలిసికొని ఉత్సాహముతో ముందుకు పురోగమింతురు.

నీరసముగను, అస్తవ్యస్తముగను వున్న చారిత్రక గ్రంథములతో సరియైన విషయమును గ్రహించజాలము. అదేవిషయమును సరసముగను, సహజముగను, మనోరంజకముగను వుండునట్లు"నవలా రూపమున"వ్రాసినచో మిక్కిలి ఉత్సాహముతో చదువరులు వానిని పఠియించి ఆనందింతురు. నవల అనగా ఒక పెద్దకథగదా! ఆనందమును చేకూర్చునట్టి ఒక ప్రముఖ సాధనముగదా! అట్టి కథద్వారా చారిత్రక సత్యమును బోధించినచో అదిమన హృదయము నకు హత్తుకొని పోవును.

రోగిచేత చేదుమాత్రలను మ్రింగించుట మిక్కిలి కష్టము. ఆమాత్రలకే "షుగరు కోటింగ్"నిచ్చి చేతికందించి

నచో సులభముగా వానిని దోగి మ్రింగును. రోగ నివారణ యగును. అటులనే క్రిమపద్ధతి వెంట లేక, తెరమరుగున దాగియున్న చారిత్రక విషయములనుగూడా నవలా రూప మున తెలిపినచో సంతోషముగా వానిని గ్రహియించి ఆనందించగలదు.

ఈ సువిశాల దృక్పథముతో ఒక బృహత్తర ప్రణాళికను సిద్ధము చేసుకొని, పాశ్చాత్యదేశపు రచయితలు గొప్ప చారిత్రిక నవలలు వ్రాసిరి.

పూర్వచరిత్రను, నేటి చరిత్రతో అనుసంధింపజేసి అది సంఘాభివృద్ధికి మార్గ దర్శకత్వముగానుండు నట్లు చేయుట చారిత్రాత్మక నవలయొక్క ప్రధానలక్ష్యము. ఆ లక్ష్యసిద్ధిని సాధించుటకు రచయితలు మిక్కిలి కృషి సలిపిరి. ఈ నవలా రచయితల ముఖ్యోద్దేశము ఒకవ్యక్తిని ఆరాధ్యుడుగా జూపుచు ఆతనివ్యక్తిత్వమునకు సంబంధించిన విషయములను కార్యకారణ ఫలితములతో (Cause and effects) సంబంధింపజేసి, తద్విషయమును సంఘమునకు తెలిపి, సంఘమును ఉత్తేజపరచుట- దేశభక్తి, ప్రభుభక్తి, త్యాగశీలత, వీరారాధన మొదలైన ఉత్తమ గుణములు పాఠకులలో పురికొలుపుట వీని లక్ష్యము.

"యుద్ధము - శాంతి" అను నవలను టాలస్టాయ్, నెపోలియన్ సలిపిన దండయాత్రలను ఆధారముగా గ్రహించి వ్రాసియున్నాడు. అదిగొప్ప చారిత్రాత్మక నవల.

ప్రసిద్ధ చిత్రికారుడైన వాన్‌గోగ్, జీవిత చరిత్రకు సంబంధించిన "లస్ట్‌ఫర్‌లైఫ్" అునది మరియొక గొప్ప జీవితాత్మక చారిత్రిక నవల. "మోషే" ప్రాసిన చారిత్రక నవల లన్నియు యదార్థచరిత్రను ప్రతిబింబింపచేయు ఉత్తమ చారిత్రిక కళాఖండములని చెప్పక తప్పదు.

పాశ్చాత్యులవలె మనకు పరిపూర్ణమైన చారిత్రాత్మక నవలలుగాని లేదా జీవితాత్మక నవలలుగాని వ్రాయుటకు తగిన చారిత్రకాధారములు లేవని, మనవారిలో కొందరికి ఒక విధమైన అపోహయున్నది.

భారతీయ చారిత్రక నవలలకు మకుటమని చెప్పదగిన డాక్టర్ శ్రీ కె. యం. మున్షి వ్రాసిన "భగవాన్ పరశురాముడు"మరియు శ్రీరాహుల్ సాంకృత్యాయన్ ప్రాసిన"సింహ సేనాపతి" చదివితే యదార్థపరిస్థితి వారికే తెలియగలదు.

5. పౌరాణిక నవలలు;- పురాణ సంబంధమైన విషయములను ప్రతిపదికగా తీసికొని, వానియందలి పురాణత్వము చెడకుండ నిలుపుచు నేటి సంఘమున కవి యెంతటి ప్రయోజనమును కలిగించుచున్నవో వివరించి చెప్పునవి పౌరాణిక నవలలు. ఆ పౌరాణిక గాథలు వర్తమాన సంఘవ్యవస్థకు తగినట్లుగా మలిచి, అవి యెల్లవేళలయందు నిత్యనూతనముగా నుండునని, సంఘ పురోభివృద్ధికి దోహదకారియని ప్రతిపాదనచేయుచు, కథాసంవిధానమున, తగుమా

ర్పులతో నేటి సంఘవ్యవస్థకు, అభిరుచికి తగినట్లుగా మల చుట యీనవలలయొక్క ప్రధాన లక్ష్యము. ఈలక్ష్యము పాశ్చాత్రొత్తల మేలు కలియిక - ఈలక్ష్య సాధనకు పెక్కు మంది ప్రతిభావంతులైన రచయితలు పాటుపడిరి. చిలక మర్తివారి "సౌందర్య తిలక" విశ్వనాథ వారి"పురాణవైర గ్రంథమాలాంతర్గత నవలలు" ఇందుల కుదాహరణములు.

2. రచనాప్రక్రియ ననుసరించి నవలలు

రచనా ప్రక్రియ ననుసరించి నవలల నీక్రింది విధముగా జూపవచ్చును. 1. ఘటనా ప్రధానములు 2. కౌతూహాల ప్రధానములు 3 శీలప్రదానములు 4. సంఘ చిత్రణ ప్రధానములు 5. ఇతిహాస ప్రధానములు 6. మనఃప్ర వృత్తినిరూపణ ప్రధానములు 7. నిర్దిష్ట ప్రయోజనమును బట్టి వ్రాయు నవలలు 8. పౌరాణిక సంబంధమైన నవలలు 9. ప్రబంధ నవలలు 10. చలనచిత్ర సంభాషణ- నవలలు 11. లేఖారూపక నవలలు 12. డైరీల పద్ధతిలో వడచినవి. 13. పరిస్థితుల ప్రభావమును చిత్రించు నవలలు.

1. ఘటనా ప్రధానములు;— జీవితములో సంభవించిన, ఒకానొక సంఘటనను గాని సన్నివేశమును గాని దీసికొని దానికి ఆధిక్యత నొసంగుచు వ్రాయు నవలలు ఘటనా ప్రధానములై నవి. ఆ ఘటన సంస్కరణో

చితమై యుండుట ముఖ్యము. అందలి పాత్రలు కల్పి తములై ఆ ఘటన చుట్టు మలచబడును. ఇది యంతయు నవలాకారుని ప్రజ్ఞా విశేషములపై ఆధారపడి యుండును. ఇట్టి నవలల యందు ఆ ఘటనలకే అధిక ప్రాధాన్యత యుండును. దాని చుట్టు కథను తిప్పుదురు.

2. కౌతూహల ప్రధానములు;— పఠిత హృదయములో ఒకానొక కుతూహలమును కలిగించి, ఆ కౌతూహలముతో నవలను ప్రారంభించి నప్పటినుండి, చివర వరకు చదివించు నట్లు చేయు నవలలు కౌతూహల ప్రధానమైనవి. వీటికి ఆశ్చర్యమో. విషాదమో, ఆనందమో, హాస్యమో ఏదైన నొక్కటి విషయము కావచ్చును. ఆ విషయమును చదివినకొలది, ఇంకను చదువవలె ననుకుతూహలమును కలిగించునట్లుగా రచయిత తన అపారమైన సామర్థ్యముతో పఠితలను ప్రేరేపణ చేయవలయును.

3. శీలప్రధానములు;— స్త్రీ, పురుషులకు శీలము చాల ముఖ్యము. ఎంతటి విద్యావంతులైనను, ధనవంతులైనను శీలము మంచిది కానిచో, సంఘములో వారికి గౌరవము, ఆదరము, అభిమానము వుండదు. హేయభావముతోవారిని జూతురు. పేదవారైనను శీలవంతులైనచో మిక్కిలి ఆదరింతురు. గనుక శీలము ప్రాణముకంటె మిన్నయై నది. కథయందు స్త్రీయొక్కగాని, పురుషుని యొక్కగాని

శీలమును ప్రధానముగాచేసి వివరించి చెప్పు నవలలు, శీల ప్రధానమైనవి. ఇందు ఔచిత్యమునకు ఆధిక్యతమెండు. అంతే గాక కథప్రారంభించి నప్పటి నుండి ముగియువరకు నాయికా నాయకుల శీలమును దెబ్బ తినకుండునట్లుగా జాగ్రత్త వహించుచు, నడుపు నవలలు శీలప్రధానమైనవి.

4. సంఘచిత్రణ ప్రధానములు:— రచయిత తాను జీవించుచున్న కాలమునందలి, సంఘపరిస్థితులనుగాని లేదా భూతకాలపు సంఘ పరిస్థితులనుగాని, లేదా రాబోవు కాలమున సంఘము వుండవలసిన విధానమునుగాని సూచించుచు వ్రాయు నవలలు "సంఘ చిత్రణ" ప్రధానమైనవి. ఈనవలలయందు, సంఘమును దానియందలి లోటుపాటును మంచిచెడులను, తేవలసిన మార్పులను యథాతథముగా చిత్రించునట్టివి. ఇవి "సంఘచిత్రణ" ప్రధానములు. ఈ నవలల యందు ఆ సంఘములయందలి పరిస్థితులు అద్దములోవలె ప్రతి బింబించుచుండును.

5. ఇతిహాస ప్రధానములు;— ఇతిహాసము లేక చరిత్రను ప్రధానముగా దీసికొని, దాని చుట్టును కథను మలిచి ఆ చారిత్రిక సత్యమునకు ప్రధానస్థానము నిచ్చునవి ఐతిహాసిక నవలలు.

6. మనఃపరివృత్తి నిరూపణములు;— మనస్సు చంచలమైనది. అదిభిన్నభోకడలు కలిగియుండును. ప్రేరేప

ణాత్మకము. బాహ్య అంతఃపరిస్థితుల ప్రేరేపణనుబట్టి మనస్సు చలించుచుండును. తదనుసారముగా మానవుడు ప్రవర్తించుచుండును. కాబట్టి మనస్సు స్థిరముగా నుండుటగాని, అస్థిరముగా నుండుటగాని, పైన తెలిపిన బాహ్య అంతఃపరిస్థితుల ప్రేరేపణ పైననే ఆధారపడి యున్నదని వొప్పుకొనక తప్పదు. మానవునకు గల ఈవిభిన్న మానవ మానసిక ప్రవృత్తులను గ్రహియించి, అది చిత్రవిచిత్రగతులలో నెట్లు పరిభ్రమణచేయుచున్నదో చిత్రించు నవలలు మనఃప్రవృత్తి ప్రధానములు. ఈమనఃప్రవృత్తులను వాని భిన్నగతులను తెలుపుచు పాశ్చాత్య పాశ్చాత్య దేశములలో వెక్కునవలలు వ్రాయబడినవి.

7. నిర్దిష్ట ప్రయోజనమునుబట్టి వ్రాయునవలలు ;-

ఒకానొక ప్రయోజనమును దృష్టియందుంచుకొని, ఆ ప్రయోజనమును సాధించుటకుగాను రచయిత యీమహత్తర ప్రక్రియ నుపయోగించుకొనును. ఉదా: కుటుంబ నియంత్రణము. కుటుంబ నియంత్రణమునందలి ఒక నిర్దిష్టప్రయోజనమును సాధించుటకు నవలను సాధనముగా గ్రహియించి దాని చుట్టు కథను అల్లును. కుంటుంబ నియంత్రణమును, దాని ఫలితములను చూపుట ఇందలి నిర్దిష్ట ప్రయోజనము. అవిషయమునే ప్రధానముగా దీసికొని దానికి ముఖ్య స్థానమునిచ్చి నవలను వ్రాయును.

8. పౌరాణిక సంబంధమైనవి :- పౌరాణిక గ్రం థముల నుండి పౌరాణిక సంబంధమైన ఒకచిన్న సంఘట నను దీసికొని, ఆసంఘటనకు అధిక ప్రాధాన్యతనిచ్చి కథను దానిచుట్టు మలచుట యనునది యిందలి రామణీయకత. అనగా పౌరాణికగాథ చెడకుండ, సన్నివేశములకు తగినట్లు కల్పనలుచేసి, పాత్రలను సృష్టించి కథను నడుపుట యిందలి ప్రధాన లక్షణము.

9. ప్రబంధ నవలలు: ఏదేని యొకప్రసిద్ధ ప్రబం ధమును ఆధారముగా తీసుకొని, అందలి పాత్రలను, సన్నివేశములను సంఘటనలను "నవలా రీతిలో"మార్చి ప్రా యుట. ఇదినిక్కిలి కష్టసాధ్యమైన పనియైనను ఆధునికకాల మున యీరీతి రచనలుగూడ పెక్కు జరుగుచున్నవి.

10. చలనచిత్రసంభాషణ నవలలు; ఇవిరెండు విధములు 1. చలనచిత్రముల యందలి సంభాషణలను దీసికొని, వానిని కొందరు వెండితెర నవల లనుపేర ప్రక టించిరి. 2. అటులనే మరికొందరు అసలు నవలలను చలనచిత్రములను నిర్మించుట కనువుగా కథను, సన్నివేశము లను మార్చి చిత్ర నిర్మాణమున కనువుగా సంభాషణలను తీర్చి దిద్దుదురు. ఈ రెండు రకముల నవలలను చలనచిత్ర సంభాషణ నవల లను పేర వ్యవహరించుచున్నారు.

11. లేఖారూపక నవలలు ;— నవల యందలి ఇతివృత్తమును, వర్ణనలను, సంభాషణలను చివరవరకు లేఖల రూపమున చిత్రించు నవలలు లేఖారూపక నవలలు. ఇందు కథాకథనము, ఔచిత్యము దెబ్బ తినకుండ పూసలలో దారమువలె రచయిత పాత్రలచేత లేఖల రూపములో చివర వరకు కథను నడిపించును.

12. డైరీల పద్ధతిలో నడచిన నవలలు;- విజ్ఞానవంతుడైన మానవుడు తన దినచర్యలను, డైరీలలో వ్రాసి భద్రపరచుచుండును. ఈ దినచర్యలను ప్రతిభావంతులైన రచయితలు నవల వలె భాసించువట్లు తమ రచనా విన్నాణముతో, లోకానుభవముతో మలచు చుందురు. ఆ దిన చర్యలు నవలకు ప్రాతిపదికలు. అందలి విశేష ఘట్టములు నవలకు శయ్యలు. పాత్రలను యథాతథముగా గాని, మార్చిగాని నవలాకారుడు నవలను సృష్టించును. ఆ డైరీలతో రచయితలకు సంబంధముండ నక్కరలేదు. అందలి ఏఘట్టమునైనను తనకు నచ్చినచో దానిని నవలగా మార్చ వచ్చును. కావలిసినంత వరకు విషయమును దానినుండి స్వీకరింపవచ్చును.

13. పరిస్థితుల ప్రభావములను చిత్రించు నవలలు:- ఎంతటి గొప్పవారైనను, ప్రతిభావంతులైనను లేక ఎంతటి తక్కువ వారైనను తమచుట్టు పట్లగల పరిస్థితుల

ప్రభావమునకు లొంగకతప్పదు. అప్రభావముతో తాము మారక తప్పదు. జీవితరంగములో సంభవించు యిట్టివిచిత్ర పరిస్థితులు, వాని ప్రభావములతో డైనందిన జీవితములో కలుగుచుండు మార్పులు యీనవలయందు ప్రధానముగా చిత్రింపబడును. ఇట్టినవలలు నేడు ప్రధాన స్థానము నాక్రమించుచున్నవి.

3. వస్తుపోషణ ననుసరించి నవలలు

నవలాకారుడు వస్తువును పోషించుచు, నవలలను వ్రాయు పద్ధతిని మూడు విధములుగా విభజింపవచ్చును. ఈ విభజన నవలలయొక్క ప్రాశస్త్యమును, రచనా విధానమును వివరించగలదు.

1. ఇతిహాసిక పద్ధతి 2. ఉత్తమ పురుషలోకథను నడుపు పద్ధతి 3. లేఖాపద్ధతి.

1. ఇతిహాసిక పద్ధతి:_ ఇతిహాస మనగా జరిగిన కథ. అందలి కథా సంవిధానమును వివరించి చెప్పు పద్ధతి ఇతిహాసిక పద్ధతి. ఈపద్ధతియందు నవలాకారుడు, తాను చెప్పుకథను ఇతిహాసమువలె చెప్పుకొనిపోవుచుండును. కథను ప్రథమపురుషలో వ్యక్తముచేయును. ఇందు నవలాకారుడు పాత్రలను "కథానాయకు" నిచుట్టు ఉద్దేశ పూర్వకముగా నిల్పుచుండును.

రచయిత తనకు ప్రీతికరమైన పాత్రలపట్ల అధిక ప్రాధాన్యత నిచ్చి వర్ణించి, కథలో వానికి ఆధిక్యతనొసంగి చక్కగా పోషించును. అతనికి అయిష్టమైన పాత్రలను, తన బుద్ధికి తోచినట్లు మలచును. ఈపద్ధతిలో కథను నడుపుట మిక్కిలి సులభము. రచయిత పాత్రల పట్టమున "వకాలత" పుచ్చుకొని తనమనఃప్రవృత్తికి, బుద్ధికుశలతకు, యోగ్యతకు తగినట్లు ప్రవర్తించును. నవలయందలి పాత్రలన్నియు రచయిత కనుసన్నల ననుసరించి, అతనిఆజ్ఞకు లోబడిప్రవర్తించునేగాని అవి స్వేచ్ఛాస్వాతంత్ర్యములతో మనజాలవు. అతని యిష్టానిష్టముల కనుగుణ్యముగా అవి చక్రభ్రమణము చేసి తీరవలసినదే.

ఆపాత్రలన్నియు కథాగర్భితమగు నైతికౌన్నత్యము నకు దోహద కారులుగానుండి, కథాగమనమునకు తోడ్పడు చుండగలవు.

2. ఉత్తమ పురుషలో కథనునడుపు పద్ధతి;-

ఐతిహాసిక పద్ధతియందు కథను రచయితచెప్పును. అదేకథను కథానాయకుడు తన అనుభవములను, అనుభూతులను యిత రులకు చెప్పినచో ఉత్తమ పురుషలో కథను నడుపు పద్ధతి యందురు. ఇదిస్వీయచరిత్రవలె నడచును. గనుక యీపద్ధతి నవలలలో నాయకుడు తానే ద్రష్ట, దృష్టయై కథను వ్యక్త ముచేయుచుండును.

వ్యక్తులు తమజీవితములలో సంభవించిన పెక్కు సంఘటనలను, ఇతరులతో జరిపిన సమావేశములను, వాగ్వ్యవహారములను, ఒక క్రమ పద్ధతిలో సమకూర్చుకొని తామే ఆకథకు నాయకులుగా నుండి, తమ చుట్టు కథను త్రిప్పుకొందురు. ప్రధాన కథానాయకుడు ఉత్తమ పురుషలో కథను వివరించుకొని పోవుచుండును. అతని చుట్టు కథతిరుగుచుండును. ఈ వ్యక్తితో కథలో వచ్చు ప్రతివ్యక్తికి విధిగా సంబంధ ముండితీరవలెను. ప్రారంభమునుండి చివరవరకు ఇతడు కథలోనుండి కథను నడుపును. ప్రత్యక్షముగనో, పరోక్షముగనో యీకథానాయకునితో తదితరులందరికి పరిచయ ముండును. అట్లుకానిచో కథ యేకసూత్రము ననడువజాలదు. కథ కుండవలసిన జిగిబిగి యుండనేరదు. ఈపద్ధతి రచన మిక్కిలి శ్రమతోకూడినది. చక్కని లోకానుభవము, దూరదృష్టి, సత్యారాధన మొదలైన మహత్తర గుణములు గల చేయి తిరిగిన రచయిత మాత్రమే యీ పద్ధతిననుసరించి కథను వ్రాయగలడు. అనుభవపాఠస్థ్యమే యీ రచనా సంవిధానము నందలి సొంపు. అది రచయితకెంత అధికముగానున్న "నవల" అంత సఫలమగును. మధురానుభూతులను కలిగించు చక్కని సృష్టి అతడు చేయగలుగును.

3. లేఖా పద్ధతి;— ఉత్తర ప్రత్యుత్తరములతో కథనునడుపు పద్ధతి యిది. వ్యక్తులలో పెక్కు సందేహ

ములు, అనుమానములు కలుగుచుండును. వానిని నిస్సం
కోచముగా, నిర్భయముగా బయలుపరచి, యోగ్యత గల
వారిని తెలిపినచో అది ఉత్తరమగును. అట్టి యోగ్యత
గల వారినుండి, యీ వుత్పన్నమైన ప్రశ్నలకు లిఖితపూర్వ
కముగా తెప్పించుకొను సమాధానము ప్రత్యుత్తరమగును.

గనుక ఉత్తరములలో నుండు అనుమానములు,
శంకలు, ప్రశ్నలకు శాబ్దిక పరమైనట్టుగా గాని అర్థపరమై
నట్టుగా గాని అనుమానము లుండరాదు. అవి స్పష్టములై
కేంద్రీకృతములై ఆలోచనలను రేకెత్తించునవై, సహజో
ద్దేశ పూరితములై యుండవలెను. అట్లే వీనికి వచ్చు ప్రత్యు
త్తరములు గూడ నిర్భయాత్మకములై, సంశయ రాహిత్య
ములై అర్థవంతములై యుండును. కనుక నవలాకారునకు
యీ పద్ధతిలో వ్యక్తులతో ముఖాముఖిగా సంబంధముండదు.
పాత్రల స్వరూప, స్వభావ విశేషములు, దైనందిన జీవిత పద్ధ
తులు, పెక్కు ముఖ్య సంఘటనలు ఉత్తర ప్రత్యుత్తరముల
ద్వారాజరుగుచుండును. ఇందులోకథ ప్రాసలలో దారమువలె
అంతర్గర్భితమై అందులో యిమిడియుండును. ప్రతిచిన్న
విషయము ఉత్తర ప్రత్యుత్తరములలో వెలువడుచుండును.
అసలు కథతో ఆచిన్న విషయములకుగూడా విడదీయరాని
సంబంధముండును. కథనిండుదనముతో ప్రవాహ సదృశమై
సాగిపోవుచుండును. పెక్కు చిక్కు సమస్యలు నిగూఢ విష

యములు విచి్రత సంఘటనలు యీ ఉత్తరములలో యిమిడి యుండును.

ఈపద్ధతియందు కథ ముగియు నంతవరకు ఒక ఉత్తరము మరియొక ఉత్తరమునకు ప్రకరణమువలె పనిచేయుచుండును. నవలల రచనా పద్ధతిలో యిది ఒక కొత్తమళుపు. దీనివికాసమునకు, విస్తృత ప్రచారమునకుగల కారణము నేటి యూన సౌకర్యములు, వైజ్ఞానిక ప్రగతి మరియు నాగరికత యని మనమంగీకరింపక తప్పదు.

4. నవలాకారుని బాధ్యతలు

చిత్రికారుడు-నవలా రచయిత;— నవల పెక్కు విషయములసమాహారము. దాని పరిధి విశాలము. గనుక రచయిత నవలవ్రాయునప్పుడు మిక్కిలి అప్రమత్తుడుగా నుండవలెను. చిత్రికారుడు చిత్రమును చిత్రించునప్పుడు ప్రతి అంగము సుస్పష్టముగా గనుపించునట్లు చేయుటకు శ్రద్ధవహించును. ఏ అంగము యేపరిమాణములోనున్న చిత్రము నకు శోభచేకూరునో యోచించి తదనుగుణ్యముగా కుంచెను త్రిప్పును. దానికి రంగులు వేయునప్పుడు యేరంగు యెచ్చట పులిమిన చిత్రమునకు అందము సమకూరునో బాగుగా విచారించి నేర్పుతో వ్యవహరించును.

చిత్రకారుడు కుంచెసారింపులో యెంతటినేర్పును, ఓర్పును, పరిజ్ఞను ప్రదర్శించునో ఆచిత్ర మంత ప్రతిభావంతముగను, మనోరంజకముగను సర్వ జనామోదముగను చిత్రిత మగును. అప్పుడు అదియొక అపూర్వ కళా ఖండముగా లోకమున భాసమాన మగును.

ఆటులనే నవలాకారుడును మిక్కిలి జాగరూకతతో ఆలోచించి, నవలా రచనయంచు యే విషయమున కెంత ప్రాధాన్యత నీయవలయునో గుర్తించి, ముందుగనే క్రమ బద్ధమైన ఒక పరిణాళికను సిద్ధముజేసికొని తదనుగుణ్యముగా రచనచేయును. అట్లుగాక రచయిత తనయిష్టము వచ్చి నట్లు ప్రవర్తించినచో, అతడు తలపెట్టిన మహాకార్యము అపహాస్యమునకు గురియై పోవును. ఆచరనకు పూర్ణత్వము సిద్ధింపదు.

రసమును చిప్పలజేసి, ఆనందమునుచేకూర్చ వలసిన నవల, అరసమైనట్టి మట్టిముద్దగా మారిపోవును. నవలా కారుడు పడినశ్రమయంతయు, బూడిదలోబోసినపన్నీరగును. పఠితకాలము వ్యర్థమగును.

నవలాకారుడు నీతిని బోధించునప్పుడు, పాత్రల శీలమును చిత్రించునప్పుడు, హితమునుబోధించునప్పుడు, మత విషయములను చర్చించునప్పుడు, ధర్మప్రతిపాదనచేసి సంఘమును పునరుద్ధరించు నప్పుడు, మానవ మానసిక పరివృత్తి

లను వర్ణించునప్పుడు, విజ్ఞానాత్మకమైన ప్రబోధమును చేయు నప్పుడు స్థిత ప్రజ్ఞుడై ప్రవర్తించవలెను.

నవల యందు యేవిషయమున కెంతటి ప్రాధాన్యత నిచ్చి కథాకథనము జేసిన బాగుగానుండునో పెక్కుమా రులు యోచించి తదను గుణ్యముగా నడుచుకొనవలెను.

అటులనే భాషావిషయమునను, నవలా రచయితకు గొప్పబాధ్యత యున్నది. నవలయందు కఠినపద భూయిష్ట మైన సమాసములనుగాని, అనర్థములను చేకూర్చు అలంకార ములను గాని, కథా కథనమునకు పుష్టిని చేకూర్చలేని సంభాషణలను గాని, అసహజము, అసందర్భమునైన వర్ణన లను గాని చేయకుండ నుండుట చాల ముఖ్యము. అధిక వర్ణనలు అనర్థదాయకములను సత్యమును అతడు మరచి పోకూడదు.

చదివినకొలది చదివించి చవులూరించగల తియ్యని మాటలతో, మధురమైన లోకోక్తులతో, దేశీయమైననుడి కారపు సొంపులతో, సరసమైనసంభాషణలతో, చమత్కార జనితముగను, ఆహ్లాదవంతముగను వుండి ప్రవాహ సదృశ ముగ కథసాగినప్పుడే నవలా కారుడు సలిపిన కృషిఫలవంత మగును.

"కాంతా సమ్మిత" మైన కావ్య లక్షణము లన్నియు నవలానుగుణ్యములే గనుక నవలాకారుడు తనరచనలో ఎంత

నేర్పును, యెంత విన్నాణమును ప్రదర్శించిన అది అంతటి సజీవ సంపన్నమైన నవలయై, మనహృదయములను కదిలించి మనను మరొక లోకమునకు గొంపోవగల సమర్థవంతమగును. దానివలన నవలా ప్రయోజనములన్నియు సిద్ధించును.

"మానవ జీవిత యదార్థ చిత్రణను" చేయు నవలా రచయిత అనంతమైన తనబాధ్యతలనుగుర్తించినప్పుడే అతని కృషి విజయవంత మగును. "చిత్రకారునివలె నవలా కారు"దును అప్రమత్తుడై పరిశ్రమించవలెను. అప్పుడే అతడు ఘన విజయమును పొందగలడు.

నవల — ప్రపంచవర్ణని;— ఖండ కావ్యము, గేయము, కథానిక, ఏకాంకిక, నవల మొదలగు నూతన ప్రక్రియల, యన్నింటియందును నవల ప్రతిదేశమునను, ప్రతి సమాజమునను ఒక ఉన్నత స్థానము నాక్రమించుకొనినది. ఈనూతన ప్రక్రియద్వారా మానవుడు తన దైనందిన జీవిత ములో నిరంతరము పొందు అనుభూతులను, అనుభవములను, ఎదుర్కొను వొడుదుడుకులను, కష్టనష్టములను, వెలుఁగునీడ లను యథా తథముగను అమూలాగ్రముగను చిత్రించుటకు, సమాజపు ప్రగతిని, పురోగతిని ప్రదర్శించి చూపుటకు రచ యితలకు ఇది మిక్కిలి తోడ్పడుచున్నది.

మానవ జీవితములో సంభవించు విభిన్న సంఘటనలు, సమావేశములు, వాగ్వ్యవహారములు, క్రియా కలాపములు

నవలా ప్రపంచములో అధికమైన ప్రాధాన్యతనువహించు చున్నవి. రచయిత వీనికి చక్కని రూపురేఖలుదిద్ది, వాస్తవ ప్రపంచములో తాను నిత్యముచూచుచున్న లోపములను గూడా బాగుగా సవరించి, ఒక వినూతనత్వముతో, యదార్థత భాసించునట్లుచేసి మనకుచూపును. గనుకనే దీనికి ఇతర సాహిత్య ప్రక్రియల యన్నింటికన్న గొప్పపలుకు బడి, విలువ, ప్రభావము ప్రపంచమునందలి ప్రతిసమాజములోను లభియించినది. ప్రపంచ సభ్య దేశములన్నియు యీనూతన సాహిత్య ప్రక్రియను ఆహ్వానించి, ఆదరించి, అనుసరించి తమ స్వంతముచేసుకొను చున్నవి. ఎక్కువమంది జగద్విఖ్యాతి నందిన రచయితలు విభిన్నసమస్యలను దీసికొని యీప్రక్రియతో ఉత్తమ నవలల నెన్నింటినో కోకొల్లలుగా సృష్టించి, ప్రజలకందించుచున్నారు.

నిజము చెప్పవలెనన్నచో మనము ఈప్రక్రియద్వారా, యెక్కడికిని వెళ్ళకుండగనే, యే దేశమును సందర్శించకుండ గనే, ఆయా దేశములు సాధించుచున్న ఘనవిజయములను, వానిసమగ్ర స్వరూపములను, సంపూర్ణముగా సాకల్యముగా యిక్కడి నుండియే దర్శించవచ్చును. ఆయా దేశములు నిరం తరము ఆర్థిక రాజకీయ,సాంఘిక, సాంస్కృతిక, వైజ్ఞానిక రంగములలో సాధించు విజయములను, సంఘముల సజీవత్వ మును, గమన శీలమును దర్పణములో వలె చూచి, ఆనందించి

అవగహన చేసికొనవచ్చును. గనుక ఈ ప్రక్రియను "ప్రపంచ దర్శిని" యని మనము అంగీకరించినచో సమంజసముగా నుండగలదు.

ప్రారంభదశలో ఈ ప్రక్రియ సైతము యెన్నియో అభాండములకు, అవాంతరములకు, విమర్శలకు, వొడుదుడుకులకు గురియైనది. ఇది పెక్కు గండములను గడచి పద్దెనిమిదవ శతాబ్దపు ప్రథమ పాదమున ప్రపంచమునందలి అన్ని దేశములలోను మంచిఆదరణను, పలుకుబడిని, విలువను సంపాదించుకొని నిలువ దొక్కుకొనగలిగినది. ఇది అచిరకాలమలోనే తన ప్రాభవమును, ప్రభావమును, బహుముఖములుగా విస్తరింపజేసుకొని, తనతోటి సాహిత్య ప్రక్రియల యన్నింటియందును ముందునిలిచి, సజీవ స్రవంతియై, నిత్య నూతనముగను, నవనవోన్మేషముగను, వర్ధిల్లుచు పెక్కు భాషలలో "నవశకమును సృష్టించి" ప్రపంచ ప్రజలచేత నివ్వాళులనందుకొనుచున్నది.

విశ్వసృష్టిని, దాని స్వరూప స్వభావములను బాగుగా గమనించి, యదార్థ పరిస్థితులను అవగహనచేసుకొనుటకు "నవలా ప్రక్రియ"కన్న మరొక సరియైన మార్గములేదని చెప్పినచో అతిశయోక్తి కానేరదు. ఇది తదితర సాహిత్య ప్రక్రియలకు మకుటము.

ఒకదేశపు ప్రజల పరిస్థితులను, మరియొక దేశపు ప్రజలు సంపూర్ణముగా తెలిసికొనుటకు "నవలా ప్రక్రియ" కన్న మించిన సాధనము మరియొకటిలేదు. గనుక దీనిని "ప్రపంచదర్శని"యని చెప్పవచ్చును.

విధాత జీవులను సృష్టించినట్లే, కవికావ్య సృష్టిచేయును. ఋషితుల్యుడైన కవి కాంతదర్శియై నిర్జీవమైన కావ్యమునందు ప్రాణప్రతిష్టజేసి, లోకమున మనము చూచుచున్న సుఖదుఃఖములను, వెలుఁగునీడలను, అందు తీర్చి దిద్ది, సర్వాంగసుందరముగను, ఆపాత మధురముగను ఆస్వాదయోగ్యముగను వుండునట్లుగా దానిని తీర్చిదిద్దును.

ఇఁకనవలా పరిధియన్ననో విశాలతమముగదా! ప్రతిభావంతుడైన నవలా కారుడు తన విద్యుక్త ధర్మమును బాగుగా గుర్తించి, అప్రమత్తుడుగానుండి, కృషిసలిపినప్పుడే "విశ్వప్రేయఃకావ్యమ్" అను మన ప్రాచీనాలంకారికుల ప్రవచనమున కనుగుణ్యముగా ఆ నవల మలచబడి సర్వజనులకు ఆనందమును ప్రసాదించునదై యుండి "ప్రపంచదర్శని"యై కలకాలము వర్ధిల్లగలదు. అప్పుడే అది లోకమునకు మధురానుభూతుల నందించగలదు.

పరామర్శ;- ఇప్పటి వరకు విశ్వసాహిత్యమునందు నవలల యొక్క వుట్టుక, నిర్వచనము, దానికి నాటకము,

ప్రబంధము మొదలైన ఇతర సాహిత్య ప్రక్రియలలో గల పోలికలు, వ్యత్యాసములు మరియు నవల యొక్క ప్రధానాంగములు దాని భిన్నరూపములు, నవలాకారుని బాధ్యతలు అను విషయములను గురించి కొంతవరకు తులనాత్మక పరిశీలన జరుపుకొంటిమి. వీనితోడ్పాటుతో, దేశీయ భాషలలో నవలా ప్రక్రియ ప్రవేశించిన విధమును, ఆ యా ప్రాంతీయ భాషల యందలి నవలల ప్రభావముతో మన తెలుఁగు నవల పొందిన క్రమవికాసమును, దాని మహత్తర ఘనాళింపుతో తెలుఁగు ప్రజలు పొందిన, నవచైతన్యము తెలుపబడును.

భారతదేశమున పంధొమ్మిది, ఇరవై శతాబ్దములలో ఆర్థిక, రాజకీయ, సాంఘిక. సాంస్కృతిక, నైజ్ఞానిక ధార్మిక నైతిక రంగములలో పెక్కు మహోద్యమములు చెలరేగినవి. ఆవుద్యమము లన్నియు తెలుఁగుదేశమును, తెఁలుగు ప్రజలను బాగుగా ఉత్తేజపరచి తెఁలుగు నాట, నవోదయ సృష్టికి నాందీప్రస్తావనలైనవి. ఆయా విషయములను ఇతివృత్తముగా గ్రహించి ప్రగతిశీలురు, దూరదృష్టి పరాయణులు నైన తెలుఁగు రచయితలు సంఘమును, జాతిని విభిన్న దృక్కోణములనుండి పరిశీలించి, వాస్తవ పరిస్థితులను చిత్రించుచు నవల, ఖండకావ్యము, గేయము, కథానిక, సకాం

కిక మొదలైన నూతన సాహిత్య పద్ధతులలో పుంఖాను పుంఖములుగా రచనలుచేసి, తెలుఁగు ప్రజలను ప్రభావితుల నొనరించి, మనసాహిత్య సంపదను విస్తరింపజేసి, సుసంపన్న మొనరించిరి అమహోమహుల కృషిఫలితముగా. నూతన దృక్పథముతో సమస్యలను పరిశీలించి, పరిష్కార మార్గ ముల నన్వేషించు, విశాలమైన మార్గము లేర్పడినవి.

ఆంగ్లభాషాసంపర్కముతో మనసాహిత్యములో ప్రవే శించిన నూతన సాహిత్య ప్రక్రియలన్నింటియందును "నవల" ఒక విశిష్ట స్థానము సంపాదించుకొన్నది. ఈ సాహిత్యా ప క్రియ మనభాషను నూతన రీతులలో ప్రగతి పథము వెంట ఆలోచించి సుసంపన్న మొనరించుటకు, మన నాగరికతను, సంస్కృతిని, సభ్యతను విశాలమొనరించుటకు తనతోటి సాహిత్య ప్రక్రియలతో సంఘర్షణ పడుచు, అనేక ఘనవిజ యములనెట్లు సాధించినదో స్థాలీపులాక న్యాయముగా కొన్ని నవలలను స్పృశియించుచు ఆంధ్రదేశమున తెలుఁగు నవల యీ రెండు శతాబ్దములలో పొందిన క్రమవికాసమును, అది మనకై న వేసిన మరపురాని ప్రత్యేక ముద్రను, దానిమహా త్తర ప్రభావముతో, మన తెలుఁగు భాషలో వచ్చిన నవ శకోదయమును, శుభోదయమును విడివిడిగా రాబోవు భాగములలో తెలిసికొందము.

ఉపక్రమణిక.

కవులు, రచయితలు ప్రతికాలమునను, ఆయాదేశముల సాంఘిక, సాంస్కృతిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితుల ననుసరించి సాహిత్య సృష్టి చేయుచుందురు. భారతదేశమును రాజులు, మహారాజులు పరిపాలించిన కాలమున కవులు వారినాశ్రయించి, వారి వుంపుడు గత్తెలనుగురించి, వారనుభవించిన భోగభాగ్యములను గురించి, వారు నిర్మించిన రాజప్రాసాదములనుగురించి, చేసిన దానధర్మములను గురించి, కుప్పతిప్పలుగా కవిత్వము ప్రాసి వారి మెప్పులను బొందిరి.

ఈదేశము చిన్న చిన్న భూఖండములుగా విడివడి పోయిన పిమ్మట దానిని జమిందారులు, దేశముఖులు, దేశ పాండ్యాలు, జాగీరుదారులు పరిపాలింపదొడగిరి. అప్పుడు కవులు వారి ప్రాపుతో వారి వంశ చరిత్రలను వర్ణించుచు శృంగార వర్ణనలతో సాహిత్య సృష్టిచేయసాగిరి.

ఈదేశములోని అన్నిభాగములలో క్రమముగా యీ రాజుల, మహారాజుల, జమీందారుల నిరంకుశ ప్రభుత్వ ములు నశియించిపోయినవి. సాంఘిక పరిస్థితులలో, నాగరికతలో, ఆచార వ్యవహారములలో, ఆలోచనా సంవిధానములో గొప్ప మార్పులు రాదొడగినవి.

చిన్నచిన్న భూఖండములుగా విడివడిపోయిన, యీ సువిశాల భారత భూమిని బ్రిటిష్‌వారు పందొమ్మిదవ శతాబ్దము ప్రారంభమున ఏకప్రభుత్వముక్రిందికి తీసికొని వచ్చి పరిపాలింప మొదలిడిరి. ఆ ప్రభుత్వమునకు ఆనాడు కేంద్రము కలకత్తా నగరము. ప్రభుత్వాదరణముతో వంగ భూమి పారిశ్రామిక ప్రగతినంది, దేశము నంతటికిని నాయకత్వము వహియించినది. దానితో మనసాంఘిక పరిస్థితులు గూడా మార్పు జెంద దొడగినవి. ఆనాటి మనరచయితలు మార్పు జెలిదుచున్న సాంఘిక పరిస్థితుల కనుగుణ్యముగా, తామును మారుచు, కొత్తదృక్పథముతో రచనలుచేయుట కుద్యమించిరి. శృంగార వర్ణనలతో ప్రభువులను, ధనవంతులను ఆనందింపజేయుచు రచనలుచేయుటకు బదులు, ప్రజా సమస్యలను, వారి జైనందిన జీవిత విధానములను, కష్ట సుఖములను ఇతి వృత్తములుగా స్వీకరించి, యదార్థ పరిస్థితులను చిత్రించుచు కొత్త మార్గముల వెంట పయనింపసాగిరి. ఒక్కమాటలో చెప్పవలెనన్న "సామాన్య ప్రజలు" వారనుభవించు కష్ట సుఖములు, రచయితల నాకర్షించినవి. అవి ఇతివృత్తములై వరలినవి.

ఆనాటి రచయితలు విదేశ ప్రభుత్వము సరియైనది కాదని, దానికి ప్రజల క్షేమముతోను, అనందముతోను సంబంధము లేదని, ఈదేశ ప్రగతితో యెట్టి సంబంధమును

కలిగియుండకయే, అది ఇంగ్లాండులోనున్న ప్రభుత్వాధికారుల చేతిలో కీలుబొమ్మగా మాత్రమే వ్యవహరించుచున్నదని పెక్కుమంది దూరదృష్టిగల రచయితలు గ్రహించిరి. ఈ పరప్రభుత్వమునుండి విముక్తి పొందుటకు కావలసిన జాతీయ భావములను. దేశభక్తిని ప్రబోధించుటకు కంకణము కట్టుకొని వారుపనిచేయ దొడగిరి.

పరప్రభుత్వమును వ్యతిరేకించుచు, యీ సువిశాల భాగతదేశములో గదర్, ఉద్యమము, పెరగ్రిస్టు ఉద్యమము కాంగ్రెసు అతివాద, మితవాద ఉద్యమములు బయలుదేరినవి. వానికితోడు దేశము నలుమూలలయందు ఆర్థిక, రాజకీయ, సాంఘిక, వైజ్ఞానిక, ధార్మిక ఉద్యమము లెన్నియో నడచినవి.

ఇట్టి మహోద్యమములను బలపరచుచు సాహిత్య రచనకు మొట్టమొదటి మారు నాందీవాచకము పలికిన ఘనకీర్తి బంకించంద్రచటోపాధ్యాయునకు దక్కినది. "వందేమాతరం–మనదేరాజ్యం" అను నినాదముతో ఆసేతు శీతనగము ప్రతిధ్వనించినది. కోట్ల గొంతుకలతో అది భూత భోంత రాళములు మారుమ్రోగినది.

ప్రాతలోని మంచిని గ్రహియించి, దానిని నూతన సౌరభముతో మేళవింపజేసి, ప్రగతి శీలురును, దూరదృష్టి గల ప్రతిభావంతులును నైన పెక్కుమంది రచయితలు వంగ

రాష్ట్రమునందు "దేశభక్తిని" ప్రబోధించుచు విశ్వాంఖలముగా రచనలు చేయుటకు ప్రారంభించిరి. ఆ వ్యూహములో, ఆమహోత్సాహముతో అక్కడ నాటకము, నవల, గేయము, వ్యాసము, జీవితచరిత్ర, కథ మొదలైన నూతన సాహిత్య ప్రక్రియలు, కొత్తమార్గమునననుసరించి వ్రాయబడినవి. అవి విశ్వసాహిత్యముతో చేతులుకలిపి, కొత్త అందచందములతో యువతీయువకుల నుత్తేజ పరుప సాగినవి. ఆ నూతన విజయముతో దేశీయభాషలలో రచయితలు పుంఖానుపుంఖములుగా రచనలుచేసి యావద్భారతదేశమునకు కొత్త వెలుఁగును ప్రసాదించిరి. ఆ కొత్త వెలుగులో, నూతన కాంతులతో బహుజనాదరణముతో దర్శనమిచ్చిన సాహిత్య ప్రక్రియయే నవల—దీనివివరణమే మనప్రస్తుత కర్తవ్యము.

తెలుఁగునాట యీనవలా సాహిత్య ప్రక్రియకు బీజావాపముచేసి, దాని విస్తృతికి, వికాసమునకు, బహుజనాదరణకు, అవిరళముగా కృషి సలిపిన ఘనకీర్తి, నవయుగాంధ్ర సాహిత్య నిర్మాత, గద్య తిక్కన యైన శ్రీ కందుకూరి వీరేశలింగం పంతులుగారికి దక్కినది. ఆనాడు తెలుఁగునేలయందు ఆవిర్భవించిన ఆ చిన్న మొక్కదినదినాభివృద్ధి నొంది మహావృక్షమై, పుష్పించి, ఫలించి సర్వాంధ్ర ప్రజల మన్ననలకు పాత్రమగుచు, వారిని ఆనంద సముద్రమున నోలలాడించు చున్నది. ఆదివ్య సౌరభపు గుబాళింపు యీ గ్రంథమునందు రాబోవు భాగములలో వివరింపబడును.—

ద్వితీయ భాగము

భారతీయ నవ్య సాహిత్య మహోదయము

యుగ విభజనము;— భారత దేశమునందలి పంథొమ్మిదవ శతాబ్దమున, వివిధ ప్రాంతములలో దేశీయ సాహిత్యముల ప్రగతికి జరిగిన కృషిని, అందలి నవ యుగోదయ ఛాయలను పరిశీలించినచో అది మూడు దశలలో జరిగినట్లు మనకు తెలియగలదు.

ప్రథమదశ : క్రీ.శ. 1800 – 1857. ఈదశలో మన దేశమును ఈస్టుఇండియా కంపెనీ పరిపాలనము చేసినది. ఈ మధ్యకాలము, సిపాయీల తిరుగుబాటు వరకు నిర్మాణ ఘట్టమై వరలినది. మత ప్రచారకులు, భాషాభిమానులు నైన పాశ్చాత్య విద్వాంసులతోడ్పాటులో నూతనయుగ ప్రభాతమునకు ప్రజలు సిద్ధపడుట జరిగినది.

ద్వితీయదశ; క్రీ.శ. 1857 – 1880. ఈ ఘట్టములో ప్రజలలో నూతనభావ సంచలనము కలిగినది. అనువాదము లతో అనుకరణములతో పెక్కు ఉద్గ్రంథముల భాషాంతరీకరణము జరిగినది. ఇది మన దేశీయ విద్యాధికులు జరిపిన కృషి–వీరి కృషి ఫలితముగా దేశీయ భాషలలో నూతన పంథా

యేర్పడి, సాహిత్యప్రగతికి రాచబాటలనేర్పరచుటకు అనుకూలమైన వాతావరణ మేర్పడినది.

తృతీయ దశ; క్రీ.శ. 1880 - 1900. ఈమధ్యకాలములో సరికొత్త భావములతో. నూతన సంప్రదాయములతో మన సాహిత్య ప్రక్రియలలో ప్రయోగాత్మకమైన నూతన కల్పనలెన్నియో విజయవంతముగా జరిగినవి. పెక్కు రకములైన నూతన సాహిత్య ప్రక్రియలను దేశీయ భాషలలో రచయితలు చేపట్టి విరివిగా రసవంతమైన రచనలు చేయుటకు ప్రక్రమించిరి. ప్రజలు మహోత్సహాముతో వానినాదరించి పఠియించ సాగిరి. ఈకాలములోనే మనదేశీయ భాషలలో యుగకర్తలు, మార్గదర్శకులు, సాంఘికసంస్కర్తలు, దేశభక్తులు, శాస్త్రవేత్తలు అని చెప్పదగిన పెక్కుమంది మహాపురుషులుజన్మించి, యితరులకు వెలుగుబాటలను చూపించి, దేశపురోభివృద్ధికి, నూతన సాహిత్య ప్రక్రియల అభివృద్ధికి తోడ్పడుటయేగాక, రాబోవు శతాబ్దపు నూతన సాహిత్య స్వర్ణయుగ సృష్టికి పునాదులను వేసిరి.

ఈచివరిదశయే మనసాహిత్య చరిత్రలో రాబోవు నూతన యుగోదయమునకు ఉషఃకాలమైనది. ఈదశలో ప్రతిభావంతులు ప్రగతి శీలురు నైన రచయితలు తమస్వతంత్ర ఆలోచనలతో,సరికొత్తభావములతో పెక్కు సాహిత్య ప్రక్రియలలో గ్రంథములను రచియించిరి.

ఈమూడు దశలలో జరిగిన ప్రగతిని, పాఠకులసౌలభ్యము కొరకు రెండుభాగములుగా మార్చి క్రీ. శ. 1800-1857 వరకు గల కాలమును పూర్వరంగమని వ్యవహరించితిని. ఈదశయందుజరిగిన కృషి రెండవదశకు ప్రాతిపదికయై మార్గదర్శకత్వము వహించినది. ఈమొదటి దశతో మననవలా వికాసమునకంత సంబంధము లేక పోయినను, ఈ కృషి మననవలా సాహిత్య విస్తరణకు, వికాసమునకు, దాని సర్వతోముఖాభి వృద్ధికి బాగుగా తోడ్పడినది. గనుకఆవిషయములను తెలిసి కొనుట అవసరమని భావించి వివరించితిని.

క్రీ. శ. 1857-1900 సంవత్సరముల మధ్యగలకాలము ఉత్తరరంగము. ఈరంగములోనే మన నవలా సాహిత్యము భారతదేశమునందలి భిన్నభాషలలో ప్రాదుర్భవించి క్రమ వికాసముజెందినది. ఆ విషయములనే ఉత్తరరంగమున వివరింతును.

పూర్వరంగము ; 1800-1857. పంధొమ్మిదవ శతాబ్దము ప్రారంభమునసే భారతదేశములో కుంపిని పరిపాలనము స్థిరపడినది. ఆంగ్లదేశమునుండి యిక్కడికి వచ్చిన క్రైస్తవ మిషనరీలు యీసువిశాల భారతదేశములో తమ మత ప్రచారముతోపాటు, నూతన విద్యా సంస్థలనుగూడ దేశము నలుమూలల నెలకొలిపి, ఆంగ్ల విద్యను మనవిద్యార్థులకు బోధింపసాగిరి. దానితో మనసాంఘికజీవితములో ఆచార

వ్యవహారములలో, విద్యా విధానములో పెక్కు మార్పులు సంభవించినవి. పాత సంప్రదాయములు. పాతసిద్ధాంతములు, నాగరికతా వైభవములు క్రమక్రమముగా తెరమరుగున పడిపోయి వాటిస్థానమున క్రొత్త క్రొత్త సంప్రదాయములుతలయెత్తి ప్రచారములోనికి వచ్చి, మనసాంఘిక జీవితములో ఒక సంచలనమును, అలజడిని కలుగజేసినవి.

ప్రగతి శీలురు, భాషాప్రియులు, ఉత్తమ సంస్కార సంపన్నులు నైన కొందరు ఆంగ్లవిద్యావేత్తలు ఈస్టు ఇండియాకంపెనీలో ఉన్నత పదవులను నిర్వహించుచూ, దేశీయ పండితుల సహాయముతోనూ, మున్షీలతోడ్పాటుతోను భారతీయ భాషలలోనున్న ఉత్తమ సాహిత్య గ్రంథములను, భాషా చరిత్రలను నిఘంటువులను, ప్రముఖుల జీవితచరిత్రలను, వ్యాకరణ గ్రంథములను తర్కవేదాంత గ్రంథములను, నూతన పద్ధతులలో వ్రాసి ప్రకటించ మొదలిడిరి.

ఆనాడు ఆంగ్లభాషలోని ఉత్తమ సాహిత్యగ్రంథములను, నవలలను పాఠ్యభాగ్యములుగానిర్ణయించి మనపాఠశాలలలో విద్యార్థులచేత చదివించుటకు యేర్పాటుచేసిరి. అంతేగాక వారి కొరకు దేశీయభాషలలో పాఠ్యగ్రంథములను సులభశైలిలో, మధురమైన వాడుకభాషలలో ఉన్నతవిద్యాసంపన్నులచేత వ్రాయించి, చదివించునట్లు చేసిరి. దీనివలన మనదేశీయ విద్యాధికులలో ఒకవైపు ఆంగ్లభాషపైన

వ్యామోహము కలిగినను, వేరొకవైపున అట్టి ఉత్తమ గ్రంథములను మన భాషలలోఁ గూడ రచియించి, మన భాషలను, మన దేశీయ సాహిత్యమును సుసంపన్నము చేయవలయునను అభిలాష, ఆకాంక్ష ప్రబలినది. దానితో మన దేశీయ సాహిత్య క్షేత్రమున సుప్రభాతోదయమైనది. ఆదివ్యకాంతులు దేశము నలుమూలల ప్రసరించినవి. నూతన భావవిలసితులైన మహా పురుషులు, దేశీయ భాషలలో వెక్కు-నూతన సాహిత్య ప్రక్రియలను సృష్టించి, నవశకోదయమునకు రాచబాట నేర్పరచి, ప్రజలను చైతన్యవంతులుగను, దేశభక్తులుగను మార్చుట కుద్యమించిరి.

ఈ నూతన భావోదయమునకు ప్రప్రథమముగా వంగ దేశము గురియై చైతన్యవంతమైనది. ఆ పిమ్మట దేశము నలుమూలలకు అది విస్తరించినది.

నవయుగవైతాళికులైన సర్వశ్రీ రాజా రామమోహన రాయలు, ఈశ్వరచంద్ర విద్యాసాగర్, సర్ సయ్యద్ అహమ్మద్‌ఖాన్ వంటి సాంఘిక సంస్కర్తలు మన సమాజములో పాతుకొనిపోయిన సాంఘిక దురాచారములను రూపుమాపి సంఘమును నూతన పరిస్థితుల కనుగుణ్యముగా పునర్నిర్మించుటకునడుము బిగియించిరి. వారు మొత్తిన విజయ పతాక ఆసేతు శీతనగ పర్యంతము రెప రెప లాడినది. దానితో

దేశము నాలుగు చెరగులు ఒక కొత్త సంచలనము, ఒక కొత్త వెలుగుతో వెల్లి విరిసి పోయినదిరి.

సంఘ సంస్కరణతోపాటు, భాషా విషయకమైన సంస్కరణముగూడా చాలా అవసరమని గ్రహించి వారు ప్రజలలో ప్రబోధముచేసి వారిని కార్యరంగమున అడుగిడుటకు పురికొలిపిరి. ఒక్కమారుగా దేశమంతయును, నూతన భావములతో చైతన్య స్రవంతియైపోయినది.

దేశీయ భాషలలో నవశక నిర్మాతలు.

మన దేశమునందలి భిన్నప్రాంతములు ఆంగ్లేయుల హస్తగతమైన పిమ్మటనే, ఆయా ప్రాంతముల సాహిత్యములలో నూతన భావోదయములు కలిగినవి. ఈ నూతన భావ సంచలనము బెంగాలీ, ఉరుదు భాషలలో అన్నింటికన్న ముందు జరిగినట్లు లోగడ తెలిసికొంటిమి.

ఉత్తర, దక్షిణ భారతదేశములలో ఈ నూతన భావ సంచలనముతో కొత్త పంథాలలో పెక్కురీతులలో గద్య పద్యములు రచియించి, ఆయా భాషలకు శక పురుషులై నూతన యుగోదయమునకు మార్గదర్శకులై వర్ధిల్లిన మహా పురుషులను స్మరియించుట మన ధర్మము. వారి నిరంతర పరిశ్రమ వలననే యీ నూతన సాహిత్య ప్రక్రియలన్నియు నిత్య నూతనములై వర్ధిల్లుచున్నవి.

బెంగాలీ భాషలో రాజా రామమోహనరాయలు, ఈశ్వరగుప్త, మహర్షి దేవేంద్రనాథ్ ఠాకూర్, అక్షయ కుమార్, మైఖేల్ మధుసూదనదత్తు; ఉర్దు భాషలో మౌల్వీ జకాఉల్లా, గాలిబ్, నజీర్ అహమ్మద్; అస్సామి భాషలో హేమచంద్ర భారువ, ఆనందరాంఫూకర్, రమాకాంత దాదరి; గుజరాతి భాషలో నర్మద్; హిందీభాషలో భారతేందు హరిశ్చంద్ర; కాశ్మీరీ భాషలో పరమానంద్, ప్రకాశ్‌రాం, మరాఠీ భాషలో చిప్లుంకర్, తిలక్, ఆప్టేలు; పంజాబి భాషలో భాయి మోహన్‌సింగ్, భాయి కహన్ సింగ్; ఒరియా భాషలో రాధానాథ్‌రాయ్, మధుసూదన రాయ్‌లు; తమిళ భాషలో యు. వి. స్వామినాథయ్యర్, సుబ్రహ్మణ్యభారతి; మళయాళభాషలో కేరళవర్మ, రాజ రాజవర్మ, తెలుగు భాషలో చిన్నయాసూరి, వీరేశలింగం పంతులు మొదలైన వారిని పేర్కొనక తప్పదు.

ఉత్తర రంగము 1857 - 1900

జాతీయ భాషలలో నవలలు :- నవలా రచనము యించుమించు అన్ని భారతీయ భాషలలోను ప్రథమ భారత స్వాతంత్ర్య యుద్ధము ముగిసిన పిమ్మటనే ప్రారంభమైనట్లు ఆధారములు లభియించుచున్నవి. ఎచ్చటనైనను ఒకటి రెండు నవలలు ఆయా దేశీయ భాషలలో అంతకు ముందు వెలువడియున్నను వానికి సరియైన ఆదరణ లభియించలేదు.

నూతన రీతులలో ప్రగతిశీలురైన రచయితలు గద్య పద్యములను మాత్రమే విరివిగా రచియించి, ప్రజల నుత్తేజ పరచి నవ్యమార్గములను సృష్టించిరి. రాజారామమోహన రాయలు వంగభాషలో వచన రచనను చేపట్టి దానితో కొత్త ప్రయోజనములను సాధించి, పెక్కుమంది సంస్కార భావ సంపన్నులైన రచయితలను ఆకర్షించెను. మైఖేల్ మధుసూదన్‌దత్తు "బ్లాంక్ వర్స్"లో నూతన కావితారీతు లను ప్రారంభించి క్రొత్త మార్గములతో ఒక నవచైతన్యమును కలిగించెను. ఆ ఇరువురి ప్రభావముతో వంగ సాహిత్య క్షేత్రము నవ్య తేజఃపుంజములతో విరాజమానమై వర్ధిల్లినది.

1860 వ. సంవత్సరమున వంగ సాహిత్యాకాశమున బంకించంద్ర ఛట్జీ ఉదయించి పెలిసి, నవలా సాహిత్య మునకు పుష్టిని చేకూర్చి, ఆ ప్రక్రియకు గొప్ప మార్గదర్శకు డయ్యెను. ఆ రోజులలో అతడు రచియించిన దుర్గేశనందిని, ఆనందమఠము, కృష్ణకాంతుని మరణశాసనమువంటి ఉత్తమ నవలలు వంగ యువకులకు గొప్ప ఉత్సాహము నిచ్చినవి. ఆ మహాపురుషుడు తీర్చిదిద్దిన ఒరవడిలోనే, రవీంద్రనాథ్ ఠాకూర్, శరత్ వంటి ప్రముఖ రచయితలు పయనించి ఈ సాహిత్యపు దివ్య కాంతులను దేశము నలుమూలల ప్రసరింపజేసిరి.

వంగసాహిత్య చక్రవర్తియైన యీ బంకిం చంద్రుఁడు పదునాలుగు నవలలను రచియించెను. "అనురాగాత్మకమైనవి దేశభక్త్యాత్మకమైనవి" అనివానిని మనము రెండు భాగములుగా విభజింప వచ్చును. బంకింబాబు రచియించిన ప్రతినవలయందును, ఆయనప్రతిభ, రచనాచాతుర్యము ఉజ్వలముగా ప్రకాశించుచుండును. ఆనవలల దివ్య సౌరభము దేశము నలుమూలల ప్రసరించి, దాని మహత్తర గుభాళింపుతో హిమాలయములనుండి, కన్యాకుమారి వరకు ఒక నవచైతన్యము, నూతనోత్సాహము వెల్లివిరిసినది.

"ఆనందమఠము, దేవిచౌదురాణి, సీతారాము," అను మూడు నవలలు సంపూర్ణమైన దేశభక్త్యాత్మకములు. పరాధీనులైన భారతీయులు మాతృదేశ దాస్యవిముక్తి కొరకు ప్రతీకార దీక్ష నెట్లు పూనవలసియుండునో పరోక్షముగా వానియందుద్బోధించిరి.

బంకిం బాబు ప్రథమ రచనయైన "దుర్గేశనందినిని" అశ్లీలమైన నవలయని అనాటి సనాతనులు, ఛాందసబుధులు తీవ్రముగా విమర్శించి ఆయనను అపహాస్యముజేసిరి. అయినను ఆమహాపురుషుడు అచంచలమైన ఆత్మ విశ్వాసముతో ప్రతిపక్షులుచేయు విమర్శలకు, నిందలకు తలయొగ్గక తనరచనావ్యాసంగమును ద్విగుణీకృతమొనరించి పెక్కు ఉత్తమ నవలలను రచియించి వంగ సాహిత్యమున నవశకోదయ

మును స్థాపించెను. ఆయన వ్రాసినపెక్కు నవలలకు "ఆనంద మఠము" ఉత్తుంగ శిఖరము. అది భారతీయ నవలా సాహిత్యమునకు కైలాస శిఖరమువంటిది. మన స్వాతంత్ర్య సంగ్రామమునకుమూలస్తంభమై వర్ధిల్లినది.

బంకింబాబు 1773 - 74 సంవత్సరముల నడుమ బెంగాలునందు దేశభక్తి పరిపూరితులైన కొందరు సన్యాసులు "సంతానులు"ల ను పేరుతో, ఆదేశమును పరిపాలించు మ్లేచ్ఛుల దురాగతముల నెదిరించుచు జరిపిన విప్లవ చర్యలను, ఆంగ్లేయులు భారతభూమియందు సుస్థిరమైన ప్రభుత్వమును యేర్పరచునంతవరకుగల పరిస్థితులను వర్ణించెను. సంతానులు ఆమహోద్యమమునందు చేసిన త్యాగములను వారు సాధించిన ఘనవిజయములను ఆయన బహు చమత్కారముగా వర్ణించెను. ఆ నవలయందలి సత్యానందుడు, జీవానందుడు, భవానందుడు, మహేందుర్సింగు, శాంతి, కల్యాణి, సలిపిన సహస కార్యములు, ప్రదర్శించినదేశభక్తి అత్యుత్తమమైనది.

"వందేమాతర"మను నినాదము యెంతటికష్ట పరిస్థితియందునువారికి నూతనోత్సాహమును, ఉత్తేజమునుకల్పించి కార్యోన్ముఖులను చేసినది. ఆమహత్తర విషయమిందు ప్రతిభావంతముగా చిత్రింపబడినది. 1906 వ సంవత్సరమున బెంగాలు విభజనకు వ్యతిరేకముగా బయలుదేరిన

"వందేమాతర"మను మహోద్యమమునకు యీనవల పూర్వ రంగమై, భావి మహోద్యమములకు పునాదియై వర్ధిల్లినది.

బ్రహ్మచారియైన సత్యానందుడు శాంతితో పలికిన యీవాక్యములు గమనింపుడు "తల్లీ! యీ ఘోర వ్రతంబునకు బలిదానముగలదు. మనమందరమును బలికావలసియున్నది..... అయినను పనిచేసి చావవలసియున్నది. పనిచేయక చచ్చుట భాగ్యమునా? నేను యెప్పుడూ స్వదేశమును మాత్రము "తల్లీ"యని పిలుతును. గాని మఱియెవ్వరిని అట్లు పిలువను. ఏలనన సుజలమును. సుఫలమును గల భూమియే మనకు తల్లి. ఇప్పుడు నిన్ను తల్లీయని నుడివితిని. నీవు తల్లివై పంతానుల కార్యము జేయుము. దేనిచే కార్యోద్ధారమగునో దానిని జేయుము....." "హరేమురారే... మధుకైటభారే....."

ఆ విష్ణు మందిరమున బ్రాహ్మ ముహూర్తమున వెన్నెల వెలుంగున మహాప్రతిభా పూర్ణులగు నిరువురు మహాపురుషులు ఒకరు మరియొకరి చేతినిబట్టుకొని నిలిచిరి. ఎవరు ఎవరిని బట్టుకొనియున్నారు. జ్ఞానము భక్తి చేతిని బట్టుకొనియున్నట్లును, ధర్మము కర్మముచేతిని బట్టుకొని యున్నట్లును, నివృత్తి ప్రవృత్తిచేతిని బట్టుకొనియున్నట్లును, కల్యాణి శాంతిచేతిని బట్టుకొనియున్నట్లును యుండెను ఈ సత్యానందుడేశాంతి..... ఈమహా పురుషుడే కల్యాణి

సత్యానందుడే ప్రవృత్తి... ఈమహాపురుషుడే నివృత్తి... నివృత్తి పరివృత్తిని తోడ్కొని పోయెను.

హిందీ భాషలో భారతేందు హరిశ్చంద్ర అకాలములో పెక్కు నవలలు వ్రాసి, ఆ భాషాభివృద్ధికి తోడ్పడిరి. ఉరుదులో నజీర్ అహమ్మద్ పెక్కు నవలలు రచియించెను. అతడు తననవలలలో మధ్యతరగతి ముస్లిం ప్రజల జీవిత సమస్యలను, వారికష్టనష్టములను బహు చమత్కారవంతముగా చిత్రించెను. రతన్‌నాథ్‌శర్షార్, మీర్జా రుజ్వా, అబ్దుల్ హలీమ్ వంటి ప్రతిభావంతులైన ప్రముఖ రచయితలు పంధొమ్మిదవ శతాబ్దపు చివరదశలో గొప్ప చారిత్రక నవలల నెన్నింటినో వ్రాసి ఉరుదూ భాషావాఙ్మయ వికాసమునకు తోడ్పడిరి. "ఉమ్రావ్ జాన్ అదా" అను నవల పంధొమ్మిదవశతాబ్దములో వెలువడిన ఉరుదూ నవలలకు మకుటమని పెద్దలు తెలుపుదురు. ఈనవలయందలి ఇతివృత్తము లక్నో నగరమునందలి ఒక నర్తకి జీవిత చరిత్రకు సంబంధించినది.

గోవర్ధన త్రిపాఠి "సరస్వతీచంద్ర" అను పేరుతో 1905 పుటలతో నాలుగు భాగములుగల ఒక పెద్ద నవలను వ్రాసెను. ఇదిగొప్ప ప్రమాణికమైన వ్రాయబడిన ఉత్తమ నవల. "కరణఘెలో" యనునవల 1866 వ సంవత్సరములో గుజరాతి భాషలో వెలువడినది. ఇది ఆభాషలో తొలి

నవలయట. "గుంజికర్" రచియించిన "మోచనగడ్"అను నది మహత్తరమైన చారిత్రాత్మక నవల. దీనియందలి "చారిత్రకసన్నివేశములు" మిక్కిలి నేర్పుతో నిర్వహింప బడినవి. మరాఠి భాషలో యిది ప్రథమ నవల యని పెక్కు మంది భావింతురు. హరినారాయణ ఆప్టే సాంఘిక,చారిత్రక రాజకీయ పరిస్థితులతోనిండిన గాథలను దీసికొని పెక్కునవ లలను వ్రాసి మరాఠీ ప్రజల గౌరవమును, ఆదర్శవంతమైన ఆమరాఠీవీరుల జీవిత విధానమును చిత్రించి, ఆభాషా సాహి త్యమునకు యెనలేని సేవల నొనరించెను. అతని రచనలలో "ఉషఃకాలము" "అబలా జీవితము" అనునవి చాలా ముఖ్య మైనవి. మరాఠీ భాషలో వెలువడిన చారిత్రక నవలల వంటి నవలలెన్నియో ఆరోజులలో కన్నడభాషలో చాలా వెలువడినవి.

శీఘ్రసాహిత్యమును కన్నుల పండువుగా నొనర్చి, నవీన నవలాయుగమును సృష్టించిన మహాపురుషుడు ఫకీర్ మోహన్—ఇతఁడు నిర్మించిన పెక్కునవలలు శీఘ్రసాహిత్య నవలాకాశమున అచంద్రతారార్కము వర్ధిల్లగలవు. ఇతడు రచియించిన "ఆరెకరముల ఎనిమిదిగుంటలు" అను నవల మిక్కిలి ప్రసిద్ధమైనది. ఇందు ఒక వడ్డీవ్యాపారి ఒకపల్లె టూరి సాలె దంపతులను పెట్టిన బాధలు చేసిన అవమాన ములు కన్నులకు రూపుకట్టునట్లు చిత్రించెను. ఒరియా

దేశపు ప్రజలజీవితవిధానమును అందులో మధురమైన వాడుక భాషలో వ్రాసెను. ఇదిహాస్యముతో నిండిన మంచిరచన. ఫకీర్ మోహన్ రచనలలో పేర్కొనదగిన మరొక నవల "ప్రాయశ్చిత్త" మనునది. ఫకీరు మోహనుని కుమారుడు ఆంగ్లభాషా ప్రభావముతో నాస్తికుడైపోయి, వేదనామయ జీవితమును గడిపెను. అతని దుర్భర జీవితము, నైచ్యజీవనము, సేనాపతినిపూర్తిగామార్చి వేసినవి. ఈవిషాదాంత గాథను చిత్రించుచు యీనవలను వ్రాసెను. ఇతని రచనలయందు దైవ చింతన, సోదరప్రేమ, నింపుగా నుండును. జాతీయ భావములు, ఐకమత్యము, దేశభక్తి మొదలైన గుణములను చక్కగా వర్ణించి చూపు నేర్పు యీయన కధికము.

ఈయన తరువాత పేర్కొనదగిన వారు గోపీనాథ మహంతి, కానూచరణ మహంతి. వీరిరువురును సోదరులు. గోపీనాథ మహంతి వ్రాసిన "అమృతకే సంతాన్" గొప్ప నవల. కొండజాతి ప్రజల జీవితవిధానము. వారనుభవించు బాధలు యథాతథముగా ఇందు చిత్రింపబడినవి. ఇదిదక్షిణ భారతదేశము నందలి కొండజాతి ప్రజలనువర్ణించు ఉద్గ్రంథము. "ఒడిశా"జాతి వారికి సంబంధించినపెక్కువిషయములు దీనివలన మనకు తెలియగలవు. కానుచరణ మహంతిగూడా పెక్కు నవలలు వ్రాసెను. ఇతడుగూడా పల్లెటూరి ప్రజల

సాంఘిక జీవితమును చిత్రించుచు, వారిపట్ల ప్రగాఢమైన సానుభూతిని ప్రకటించి యుండెను.

మలయాళకవియైన కేరళవర్మ "అక్బరు" అను ఆంగ్ల నవలను మలయాళములోనికి అనువదించెను. అది వీర గ్రంథిక భాషలోనుండి చదువరులకు అంతఉత్సాహమును కలిగించదట.!

నవలా రచనములో అకాలమున మిక్కిలి కృషిచేసి అసమానమైన నవలలు వ్రాసినకీర్తి సి. వి. రామన్ పిళ్ళై, చందూమీనన్‌లకు దక్కినది.

రామన్‌పిళ్ళై "మార్తాండవర్మ" "ధర్మరాజ" "రామరాజ బహద్దూర్" వంటి గొప్ప నవలలను సృష్టించెను. ఇవి తిరువాన్కూర్ నేలిన రాజులచరిత్రలను ఆధారముగా దీసికొని, ఆయాచారిత్రక సన్నివేశములకు తగిన ప్రధాన్యత నొసంగుచు కడునేర్పుతో వీనిని నిర్వహించెను.

చందూమీనన్ "ఇందులేఖ" "శారద" మొదలైన ఉత్తమ సాంఘిక నవలలను వ్రాసియుండెను. ఈ మహా పురుషులిరువురును, నవలా సాహిత్యములో అమోఘమైన కృషిచేసి ఆవాఙ్మయ వికాసమునకు భూరిసేవల నొనరించిరి.

సి. వి. రామన్ పిళ్ళైవలె మలయాళభాషలో పెక్కు చారిత్రిక నవలలువ్రాసి ఆభాషకు పుష్టినిచేకూర్చిన సర్దార్

కె. యం. ఫణిక్కర్, అప్పన్ తంబూరాన్ లిరువురును గొప్ప సమర్థులు. ఫణిక్కర్ "కేరళసింహ"; తంబురాన్ "భూత రాయర్" రెండును, పేర్కొనదగిన ప్రముఖనవలలు.

పి. కేశవదేవ్ "ఉలక్క"; తగళి శివశంకరపిళ్ళై "చెమ్మీన్"; మహమ్మద్ బషీర్ "బాల్యకాలసఖి" ప్రసిద్ధము లైన నవలలు. ఈ రచయితలు మలయాళ ప్రజల జీవితము లను దర్పణములోవలె ప్రతిబింబింపజేసిరి. వారు రచన లలో వస్తవదృష్టితోపాటు, సామాన్యప్రజలను నాయికా నాయకులుగాజేసి, నిర్ధనులైన పేదప్రజలనుభవించు కష్టము లను, వారిదైనందినజీవితసమస్యలను గొప్పగాచిత్రించిచూపిరి.

ఆధునిక రచనా రీతులలో, ఆనాదు పెక్కు రకము లైన గ్రంథములను వ్రాసి మలయాళ రచయితలు దక్షిణ భారతసాహిత్య చరిత్రలో తమకు ప్రత్యేక స్థానమును సృష్టించుకొనిరి.

తమిళ సాహిత్యములో వేదనాయకంపిళ్ళై 1876 లో వ్రాసిన "ప్రతాప మొదలియారు చరిత్ర" ఆభాషలో ప్రప్రథమ నవలయని చెప్పుదురు. ఇదిగొప్ప సాంఘికనవల. దీనియందలి భాష, భావములు మిక్కిలి హృద్యముగా నుండును. హాస్యరసము చిప్పిలుచుండును. పి. ఆర్. రాజ

మయ్యరు రచియించిన "కమలాంబాళ్ చరిత్రము" తమిళ భాషలో ద్వితీయ నవల. ఇదియును సాంఘికమే.

ఆరణి కృష్ణస్వామి మొదలియార్, గోదైనాయకి, దొరైస్వామి అయ్యంగారలు పెక్కు సాంఘిక, అపరాధపరిశోధక నవలలు వ్రాసిరి.

అయినను పందొమ్మిదవ శతాబ్దముచివర, ఇరవైయ్యవ శతాబ్దపు పూర్వభాగమున వర్ధిల్లిన సుబ్రహ్మణ్య భారతి కలముచేపట్టిన పిమ్మటనే ఆ సాహిత్యములో నూతన వెలుఁగు ప్రసరించినదని కొందరు భావింతురు. ఇంతవరకు దేశీయ సాహిత్యములలో జరిగిన నవలా ప్రగతిని వివరించితిని. ఇక పందొమ్మిదవ శతాబ్దమున మన తెలుఁగు నవల పొందిన క్రమ వికాసమును వివరింతును.

తెలుఁగు నవలా సాహిత్యమున నవశకోదయము

భారతదేశ స్థితిగతులు : భారతదేశమున 1857వ. సంవత్సరమున జరిగిన సిపాయీల తిరుగుబాటు విఫలమైనది. విక్టోరియా మహారాణి భారతదేశ పరిపాలనను తనహస్తగతముచేసికొని ప్రజలకు అభయ హస్తము నిచ్చి కొన్ని

ప్రత్యేక సౌకర్యములను కలుగజేసినది. అయినను అవి ప్రజల కంత సంతృప్తిని కలిగించలేదు. దేశము నలుమూలల అశాంతి జ్వాలలు ప్రాకిపోయినవి.

పెక్కు-రకములైన పన్నుల భారముతో కృంగి కృశియించిపోవు రైతుల బాధలను, కష్టనష్టములను తొలగించి దేశమునందు ఉత్తమ పరిపాలనా వ్యవస్థను నెలకొల్పవలెనను సదుద్దేశ్యముతో 1885వ సంవత్సరమున భారతజాతీయ కాంగ్రేసు మహాసంస్థను కొందరు పెద్దలు స్థాపించిరి. ఏ.ఓ. హ్యూం, దాదాభాయి నౌరోజి వంటి ప్రముఖ ప్రజానాయకులు ప్రభుత్వ దమననీతిని నిరంకుశ పరిపాలనా విధానమును నిరసించుచు ప్రజలను చైతన్యవంతులుగా చేయుటకు ఉద్యమమును ప్రారంభించిరి. దానితో ప్రజలకు విదేశ ప్రభుత్వము యెడల విముఖత యేర్పడి, జాతీయ భావములు, దేశభక్తి మొలకెత్తి వారిలో ఒక నవచైతన్యము, కార్యదక్షత ప్రస్ఫుటముగా గోచరింపసాగినది.

సిపాయి తిరుగుబాటు జరిగి, కాంగ్రేసు మహాసంస్థ దేశములో స్థాపింపబడిన పిమ్మటనే మన ఆంధ్రదేశములో అనేకమార్పులు సంభవించినవి. ఎందరో మహాపురుషులు, గొప్ప రచయితలు, విశాలభావ సంపన్నులైన సంఘ సంస్కర్తలు యీ పుణ్యభూమియందు జన్మించి పెక్కు-నవీన సాహిత్య ప్రక్రియలలో రచనలుచేయటకు ప్రారంభించిరి.

చిన్నయ్య సూరి – నీతిచంద్రిక : ఆంధ్రదేశ ములోఁగూడా పందొమ్మిదవ శతాబ్దపు పూర్వభాగమున ఆంగ్ల భాషాపరిభావముతో రచయితలు పద్యరచనకన్న గద్యరచన వైపే అధికముగా మొగ్గుజూపి, రచనలు చేయుటకుద్యమించిరి ఆరోజులలోనే మహాపండితుడైన చిన్నయసూరి "నీతిచంద్రిక" వంటి ఉత్తమ వచనగ్రంథ మును రచియించి మన వచనవాఙ్మయ వికాసమునకెంతయో ఉపకారమొనరించెను.

1857 వ. సంవత్సరమునకు పూర్వము తెలుఁగు దేశ ములో నవలా రచనము జరిగినట్లు సరియైన ఆధారములు లభియించుటలేదు.

తెలుఁగు తొలి నవలా రచయిత ఎవరు ?

తెలుఁగు భాషలో నవలా రచన యెప్పుడు ప్రారంభ మైనది? ఎట్లు ప్రారంభమైనది? తొలి నవలా రచయిత యెవరు? మన ప్రథమ నవలయేది? అను విషయములో విమర్శకుల మధ్య భిన్నాభిప్రాయము లేర్పడినవి.

1867 వ. సంవత్సరమున కొక్కొండ వెంకటరత్నం పంతులుగారు "మహాశ్వేత" అను నవలను లిఖియించినట్లు వారిజీవిత చరిత్రవలన విశదమగుచున్నది. ఇది మహాకవి బాణభట్టు"కాదంబరి"ననుసరించి వ్రాయబడినది. గనుకయిది

స్వతంత్ర నవల కానేరదని కొందరు భావింతురు. అదేవిధముగా కర్నూలు నివాసియైన నరహరి గోపాలకృష్ణమ్మ శెట్టి గారు 1872 వ. సంవత్సరమున "శ్రీరంగరాజ చరిత్ర" మను పేరుగల నవలను వ్రాసి ప్రకటించినట్లు మరికొందరు తెలుపుదురు.

వీరేశలింగం పంతులు — రాజశేఖర చరిత్ర.

అయితే వీనికివేనికిని లభియించని ప్రచారము, ఆదరణ అభిమానము ప్రథమనవలారచనా గౌరవము గద్యతిక్కనవయుగాంధ్రపాహిత్యనిర్మాత రావుబహద్దూర్ శ్రీకందుకూరి వీరేశలింగం పంతులుగారి "రాజశేఖర్ చరిత్ర"కు దక్కినది.

పంతులుగారు రాజశేఖర చరిత్రను 1878. వ. సంవత్సరములో ప్రకటించిరి. ఆంధ్రసాహిత్య నందనోద్యానమున యీ నవలావతరణముతో తెలుఁగు భాషకు ఒక కొత్త తేజస్సు, ఓజస్సు కలిగినది. ఈరాజశేఖర చరిత్రను మన సాహిత్య సుక్షేత్రమునపూచిన తొలిపూవుగా అందరును ఏకగ్రీవముగా ఆమోదించి, వారికి నవలా రచనమున ప్రథమస్థానమునిచ్చి గౌరవించిరి. ఆనవల మహత్తర గుబాళింపుతో తెలుఁగువారి హృదయములలో ఒకకొత్త సంచలనము, ఒక క్రొత్త వెలుఁగు వెల్లివిరిసినది. తెలుఁగునవలా సాహిత్య చరిత్రకు రాజశేఖర చరిత్ర పునాదిరాయియై వర్ధి

ల్లినది. ఈనవీన సాహిత్యశాఖయందు ఆ నవలకు గొప్పఆద రణ లభియించినది.

ఈనవల ప్రఖ్యాత ఆంగ్ల నవలా రచయిత ఆలివర్ గోల్డు స్మిత్ ప్రాసిన "వికార్ ఆఫ్ వేక్‌ఫీల్డు" అను నవలకు అనుసరణమని కొందరు భ్రమపడిరి. కాని దానిని 1883. వ సంవత్సరమున జె. రాబర్టు హచ్‌సన్ అనునతడు ఆంగ్లభా షలోనికి అనువదించెను. ఆఅనువాద గ్రంథమును చూచి ఆంగ్లేయులే దిగ్భ్రాంతులైపోయి, దానిని మిక్కిలి ప్రశంసిం చిరట! మన తెలుఁగు నవలకు తొలిదశలోనే విదేశీయుల నుండిగూడా అంతటి ఘనమైన గౌరవము, విశిష్టత లభియిం చుట చూచినచో, మనవారికి యీ నూతన సాహిత్యశాఖా నిర్మాణములో గల కల్పనాశక్తి, రచనా విన్యాసము యెం తటి శక్తివంతమైనదో వేరుగా ప్రశంసించి చూపవలసిన పని లేదుగదా!

ఆంధ్ర సమాజ ప్రతిబింబము రాజశేఖర చరిత్ర:-

పంతులుగారు ఈ రాజశేఖర చరిత్రయందు ఆనాటి ఆంధ్ర సమాజములో సర్వసాధారణముగా ప్రబలియున్న దుర్మార్గములను, దురాచారములను, మూఢ విశ్వాసములను, అక్రమచర్యలను, మంచివారిపైన ఛాందస బుద్ధులుచేయు దుష్ప్రచారములను విపులముగా వర్ణించిరి. భూతచికిత్స, అంజనము, సువర్ణముచేయుట మొదలైన క్షుద్రవిద్యలతో,

కుతి్సత పద్ధతులతో వారు అమాయకపు ప్రజలను యెట్లు మోసగించి వంచించు చుండెడివారో కన్నులకు గట్టునట్లు, అందులో వారు వర్ణించిచూపిరి. ఆనాటి ఆంధ్రదేశ గ్రామీణ జీవితవిధానమునకు "రాజశేఖర చరిత్రము" ప్రతి బింబము. ఇందలి నీలాదిరావు, భైరాగి, సుబ్రహ్మణ్యము, కృష్ణగజపతి మొదలైనవారు ఆనాటి తెలుఁగు కుటుంబములలో సర్వసాధారణముగా గనుపించు వ్యక్తులు. ఆంధ్రప్రజలకు సుపరిచితులైన వ్యక్తులు.

పంతులుగారి ఇతర రచనలు:—

పంతులుగారి హస్తకమలములనుండి వెలువడిన మరి యొక అపూర్వ రచన "సత్యరాజాపూర్వ దేశయాత్రలు" అనునది. దీనిలో వారు మద్రాసు పట్టణమునందు తెలుఁగు వారు ఆంధ్రేతరుల చేతులలో యెట్లు మోసగింపబడు చుండెడివారో చమత్కారముగను, హాస్య రసపోషకముగను వర్ణించి చూపిరి. ఆడమళయాళమునందు స్త్రీలుచేయు రాచరికములను, వారి విశృంఖలత్వమును బహు రమ్యముగను విచిత్రముగను వర్ణించి ఆనాడు సంఘపు దుర్నీతికి బలియై పోయి ఇనుపచక్రముల క్రింద నలిగిపోవు అనాథ స్త్రీలబాధలను, గాథలను వారనుభవించు నిక్కారకములైన కష్టనష్టములను చిత్రించు తలంపుతో కథను తల్లక్రిందుచేసి యీ

ఆడమళయాళమునుసృష్టించి వ్యంగ్యముగా ఆనాటి సమా
జమును హేళనయొనర్చి, మహిళామ తల్లుల నుద్ధరించుట
కెంతయోతోడ్పడిరి.

అటులనే "పత్నీహితసూచిని" "సతీ హితబోధిని"
యను మరి రెండు గ్రంథములను వ్రాసి వానిలో పెక్కు
నీతులను వింత ధోరణిలో ప్రబోధించిరి.

సంఘసంస్కరణము:— పంతులుగారు బాల్యవివా
హములను ఖండించిరి. బాలవితంతువులకు పునర్వివాహము
చేయవలసిన ఆవశ్యకతను గురించియు, వారికికావలసిన
విద్యా సౌకర్యములను గురించియు, ప్రత్యేక శ్రద్ధవహించి
వానివలన కలుఁగు మహత్తర ప్రయోజనములను తెలుపుచు
పెక్కు గ్రంథములను వ్రాసిరి. వారు ముఖ్యముగా యీ
నూతన సాహిత్య ప్రక్రియను చేపట్టి సాంఘిక దురాచార
ములను రూపుమాపుటకును, సంఘమును పునరుద్ధరించుట
కును పెక్కు నవలలు వ్రాసి తెలుఁగు ప్రజల నుద్ధరించుటకు
తోడ్పడిరి.

పంతులుగారి రచనలు — విమర్శ:-

పంతులుగారి నవలలలో శిల్పముకన్న ప్రచారధోరణి
అధికముగా నుండునని కొందరు విమర్శింతురు. అది సరియైన
విమర్శకాదు. ముఖ్యముగా వారు యీ ప్రక్రియను ఆంధ్ర

సమాజమును పునరుద్ధరించుటకును, తాము యేర్పరుచుకొనిన సంఘసంస్కరణోద్యమమునకును దీనిని వినియోగించుకొనిరి. గనుక అక్కడక్కడ వారి రచనలలో సంస్కరణదృష్టితో ప్రచార ఘోరణి కనుపించినను, అది కథాంతర్భాగమై, కథా కథనమునకు పుష్టిని చేకూర్చి, ఆనందమును సమకూర్చుచున్నదేగాని పాఠకునికి విసుగును కలిగించదు. సందర్భమునుబట్టి కథాంతర్గతమైన పాత్రలు, సంఘ పునర్వ్యవస్థీకరణమునకు అనుగుణముగా వ్యవహరించినవేగాని కేవలము ప్రచారముకొరకు విచ్చలవిడిగా అవి సంచరించలేదు.

వీరేశలింగంగారి నవలలు సందర్భోచితమైన సరస సంభాషణలతో, అత్యుత్తమమైన సంఘటనలతో, కథాకథనము కొంటుపడకుండ, శిల్పసంపద లోపింపకుండ ప్రజా హృదయములను రంజింపజేసిన వని అంగీకరింపకతప్పదు. గనుగ వారి ప్రచారదృష్టి రాజకీయమైనట్టిగాని, మరియే యితరమైనట్టిగాని కాక, కథకు అనుగుణ్యమై, అది శిల్పాశ్రేయమైన ఒక చక్కని సంఘసంస్కార ప్రచారయుక్తమై భాసించుచున్నదనుటలో సందేహములేదు.

వీరేశలింగం పంతులుగారు తొలి నవలాకారులైనను వారిచేతిలో యీ ప్రక్రియ పరాంకోటి నందుకొన్నది. ఆమహా పురుషుడు తెలుఁగు నవలా ప్రపంచమునకు నూతన వసంతోదయమును కల్పించి, అది బహుముఖములుగా విస్త

రించుటకు అనన్య సామాన్యమైన కృషిసలిపిరి. అంతటితో వారు తృప్తినందక ఆంధ్రదేశమున యీ నూతన సాహిత్య వికాసము కొరకు "చింతామణి" యను మాసపత్రికనుస్థాపించి యీ నూతన శాఖలో పోటీలను నడిపి, అందు గెలుపొందిన నవలలను వరుసగా ఆ పత్రికలలో ప్రచురించుటయే గాక, నగదు బహుమతులనుగూడా యిచ్చి మిక్కిలి ప్రోత్సాహ పరచిరి.

"చింతామణి" లో పోటీలు;—

ప్రప్రథమమున 1893 వ. సంవత్సరమున జరిగిన యీ నవలల పోటీలో "ధర్మవతీ విలాసము" "సంజీవరాయచరిత్ర" లను వానిని రచియించిన ఖండవిల్లి రామచంద్రుడు, తల్లా ప్రగడ సూర్యనారాయణరావుగారలకు ప్రథమ, ద్వితీయ బహుమతులు లభియించినవి. 1894 వ. సంవత్సరమున నెరపిన పోటీలలో ప్రముఖ నవలా రచయితయైన శ్రీచిలక మర్తి లక్ష్మీనరసింహము పంతులుగారి "రామచంద్ర విజయము"నకు ప్రథమబహుమతి, గోటేటి కనకరాజుగారి"వివేక విజయము" అనుదానికి ద్వితీయ బహుమతి వచ్చినవి. 1895 లో చేకుమళ్ళ రాజగోపాలరావుగారి "త్రివిక్రమవిలాసము." ఖండవిల్లి రామచందుర్తిగారి "మాలతీ రాఘవము" వరుసగా ప్రథమ ద్వితీయ బహుమతుల నందుకొన్నవి.

అదే సంవత్సరము ఆంధ్రోద్యమ పితామహులు, మహామేధా సంపన్నులునైన రెంటాల వెంకట సుబ్బా

రావు పంతులుగారు "కేసరీ విలాసము" అను నవలను ప్రత్యేకముగా ప్రకటించిరి. అది సులభశైలిలోనుండి, చక్కని వర్ణనలతో నలరారుటచేత పెక్కుమంది చదువరుల నాకర్షించినది.

1896 లో తిరిగి చిలకమర్తివారి "హేమలతకు" ప్రథమ బహుమతి లభియించినది. ద్వితీయ బహుమతి ఖండవిల్లి రామచంద్రుని "లక్ష్మీవిజయము" నకు వచ్చినది. 1897. లో గుడా మరల "అహల్యాబాయి" అనుపేరుగల చిలకమర్తివారి నవలకే ప్రథమ బహుమతి దొరికినది. 1898 వ. సంవత్సరములో తిరిగి చిలకమర్తివారి "కర్పూర మంజరికి" ప్రథమ స్థానము లభియించినది. కూనపులి లక్ష్మీ నరసయ్యగారి "భక్తి" అను నవలకు ద్వితీయస్థానము లభియించినది.

వచన రచనకు నియమములు:—

"వివేక వర్ధని" పత్రికలో పంతులుగారు తమ వచన రచనా పద్ధతికి యాక్రింది నియమములనేర్పరచు కొనినట్లు తెలిపిరి. "తెలుఁగుభాషలో మృదువైన సులభశైలిలో సలక్షణమైన వచన రచన సర్వజనులకు అందుబాటులో నుండునట్లు చేయుటకు సంకల్పించితి" మనిరి.

నవలారచనకు నిబంధనలు;—

వచన రచనవలెనే వారు నవలా రచనకుగూడాకొన్ని

ఉత్తమ నిబంధనలను ప్రతిపాదించి, తదనుగుణ్యముగా రచయితలు రచనలు చేయుటకు ప్రోత్సహించిరి.

1. సులభగ్రాహ్యత 2. వైశద్యము 3. సమత 4. జీవనము – అనునవి ముఖ్యలక్షణములు.

పోటీలకు న్యాయ నిర్ణేతలు:—

"చింతామణి" పత్రికలోనడిపిననవలల పోటీకి న్యాయ నిర్ణేతలుగా న్యాయపతి సుబ్బారావు పంతులు, వావిలాల వాసుదేవశాస్త్రి, వీరేశలింగం పంతులుగారలు వ్యవహరించిరి. ఈ విధముగా పంతులుగారు చింతామణి పత్రికలో నవలా పోటీలు జరిపినంతకాలము, చిలకమర్తివారు ప్రథమ ద్వితీయ బహుమతులలో నేదో యొకటి పొందుచునేయుండిరి.

గురువ్రగారి అడుగుజాడలలో :-

చిలకమర్తివారు తమగురువు గారైన వీరేశలింగము పంతులుగారి అడుగుజాడలలో నడచి, వారిచ్చిన చేయూతతో, ప్రోత్సాహ పోద్బలములతో పెక్కు ఉత్తమ శ్రేణికి జెందిన నవలల నెన్నింటికో వ్రాసి ఆంధ్ర భారతి గళము నందు భక్తి ప్రపత్తులతో సమర్పించిరి.

రామచంద్ర విజయము;—

వారి అసదృశమైన మేధాసంపత్తికి, అనన్య సామాన్యమైన ప్రతిభకు నిదర్శనమని చెప్పదగిన ఉత్తమ సాంఘిక

నవల రామచంద్ర విజయము. వారి అమృత హస్తముల నుండి జాలువారిన అసంఖ్యాకమైన నవలలకు యిదిమకుటము.

ఈ రామచంద్ర విజయమునందు పంతులుగారు గోదావరినదికి అవతలి వొడ్డున నవనవోన్మేషముగా వర్ధిల్లుచున్న కోనసీమ ప్రాంతమును అందలి ప్రకృతి రమణీయకతను, సిరి సంపదలను మన మనోనేత్రములకు రూపుకట్టునట్లు సహజ సుందరముగను, ప్రతిభావంతముగను చిత్రించి చూపిరి. అనాథ బాలుడైన రామచంద్రుడు తల్లిదండ్రులను గోలు పోయి, విద్యా సముపార్జనకై అమలాపురమునకు బోయెను. అక్కడ అతడు పడినబాధలు, పొందిన అవమానములు, జరి గిన మోసములు పూసగ్రుచ్చినట్లు ప్రతిచిన్న విషయమును అందు వివరించి చూపిరి. అతనిచుట్టు మూగిన దుష్టులబారి నుండి అతడెట్లు బయటపడి లెక్కలేనన్ని చిక్కుసమస్యలను యెట్లు యెదురొక్కినది బహుచమత్కారముగను, హాస్య రసపోషకముగను, వ్యంగ్యప్రాధాన్యముగను, కరుణరసము చిప్పిలజేయునట్లుగను కడురమ్యముగా ప్రదర్శించరి.

రామచంద్రుడు సాధించిన ఘనవిజయమును, కడు విజయవంతముగా నిర్వహించి, కథను సుఖాంతముగా ముగిం చిరి. ధనికుడు ఉదార హృదయుడు మిక్కిలి సమర్థుడునైన శరభరాజుగారు తనకుమార్తెను రామచంద్రునికిచ్చి వివా హము చేసెను. ఆవివాహముతో అతనిని చుట్టియున్న విష

వలయము తుత్తునియలై పోయినది. పఠితలకు విభ్రమాశ్చర్యములు కలుగునట్లు చమత్కారముగా కథను సమాప్తము చేసి, భారతీయ సాహిత్య సంప్రదాయమునందు చొప్పించిరి.

చిలకమర్తివారి నవలలకు అలంకార ప్రాయమైన మరియొక ఉత్తమ నవల "గణపతి". ఇది కేవలము హాస్యరస ప్రధానముగా నడచినను, ఆంధ్రసాహిత్యనందనోద్యానమున కలకాలము వర్ధిల్లగల అతివాస్తవ మనోహరచిత్రణము. విద్యాహీనుడు, ధనహీనుడు, మొద్దబ్బాయి-యైన గణపతి యదార్థ జీవితరంగమునందు అడుగడుగునపడినపాట్లు పొందిన అవమానములు, భరియించిన బాధలు చదువుచున్నప్పుడు మనకు అతనియందు ఒకవిధమైనప్రేమ, అనురాగము, సానుభూతి యేర్పడగలదు. చదివిన కొలది యింకను చదువవలెనను ఉత్కంఠతను కలిగించుచూ పాఠకులను చివరవరకు చదివించి, మరొక లోకమునకు గొంపోవగల సమర్థవంతమైన మహత్తర రచనఅది.

చిలకమర్తివారి అమృత హస్తములనుండి జాలువారిన హేమలత, అహల్యాబాయి, కర్పూరమంజరి మొదలైన నవల లన్నియు, చక్కని కథాగమనము గలిగియుండి ముచ్చటైన సన్నివేశములతో, సరసమైన చక్కనిసంభాషణా చాతుర్యముతో యెన్నడో గతియించి పోయిన ఆచారిత్రిక పాత్రలన్నియు మనకన్నులముందు రూపుకట్టి సాక్షాత్కరించ.

గలవు. ఆపాత్రలు మనకు తెలియని చారిత్రక సత్యముల నెన్నింటినో తెలుపుచు, మహత్తరమైన సందేశములనందిం చుచుండును. ఆపాత్రలు మనకు ఒకవిధమైన ఉత్తేజ మును, ఉత్సాహమును కలిగించి దేశభక్తి ప్రపూరితులను జేయుచుండగలవు. ఏనాడో తెరమరుగున పడిపోయిన, మహత్తర చారిత్రిక సత్యములను, మెక్కు యదార్థ సంఘట నలను మనకు జ్ఞప్తిజేయుచు, గతకాలపు వైభవ ప్రాభవ ములను ఒక్కసారి సాక్షాత్కరింపజేయగలవు.

చిలకమర్తివారి చారిత్రక నవలలకిట్టి అమోఘమైన శక్తియుండుటను బట్టియే, నేటికిని వానికి తెలుఁగుదేశమున అవిరళ ప్రచారము, బహుజనాదరణము లభియించుచున్నది.

చిలకమర్తివారి "రామచంద్ర విజయము" ఆనాటి సాంఘిక నవలలకు మకుటము:- "హేమలత" అద్వితీయమైన చారిత్రాత్మక నవల. ఈ రెండు ఆంధ్రనవలా సాహిత్య మునకు మణిపూసల వంటి ఉత్తమ నవలలు. తెలుఁగు నవలా సాహిత్యమున ఆయన పండించిన పసిడిపంట యిది.

రాజశేఖరచరిత్ర–రామచంద్ర విజయము;-

మొత్తముమీద కందుకూరివారి "రాజశేఖర చరిత్ర" చిలకమర్తివారి "రామచంద్ర విజయము" పందొమ్మిదవ శతాబ్దమునందలి ఆంధ్రదేశపు ప్రజాజీవితమును ఆచారవ్యవ హారములను, నాగరికతా వైభవములను, విద్యా వైదుష్య

ములను తేట తెల్లము జేయు చున్నవి. ముఖ్యముగా అవి ఆ నాటి గ్రామీణ జీవితమును యథాతథముగా మనమునో నేత్రములకు గోచరింప జేయుచున్నవి. ప్రత్యేకముగా మన తెలుఁగు సమాజములోని మధ్యతరగతి కుటుంబములలో ఆర్థిక, రాజకీయ, సాంఘిక వైజ్ఞానిక రంగములలో నూతన ప్రభావముతో వచ్చిన, వచ్చుచుండిన బహుముఖములైన మార్పులను వివరించుచు అవివ్రాయబడినవి ఆరెండునవలలు ఆనాటి తెలుఁగు సమాజమును ప్రజాజీవితమును ప్రభావిత మొనరించి తెలుగువారి సర్వతోముఖాభివృద్ధికి తోడ్పడినవి. ప్రజలకు అవిమంచి ఉత్తేజమును, ఉత్సాహమును ప్రసా దించి, గొప్పజాగృతిని కలిగించినవి.

ఆనవలలు ఆనాటి సమాజ వ్యవస్థకు అనుగుణ్యముగా రచియింపబడిన వైనను, అందలి ఇతివృత్తము, సంభా షణలు, సన్నివేశములు, వర్ణనలు అతిలోక మాధుర్య మును ప్రసాదించగల సమర్థవంతమైన వగుటచేతనే, నేటికిని అవిపెక్కు ముద్రణలతో దర్శనమిచ్చుచూ, మనచేత మరల మరల పఠియింపజేసుకొన గలుగుచున్నవి.

గురుశిష్యుల ప్రభావము;-

ఈగురుశిష్యులిరువురును నవలా రచనతో తమ సమ కాలిక ఆంధ్రదేశమును యథాతథముగా చిత్రించి, నర్మ గర్భముగా సంఘసంస్కరణముచేసి, సుస్థిరమైన పునాదుల

పైన నవసమాజమును నిర్మించుటకు చక్కని కృషిసలిపిరి. వారిమహత్తర కృషిఫలితముగా ఆంధ్రదేశమున "నవలలకు" మంచి ఆదరణ లభియించినది. ఆయిరువురును భావికాలపు నవలారచయితలకు మార్గదర్శకులై ప్రవర్తించిరి.

ఈ పురుషసింహము లిరువురును పూర్వ సంప్రదాయ ములయందలి లోపములను విమర్శించి, నవీన భావస్రవంతి లోని మంచిని, ప్రగతిశీలతను నిర్భయముగా స్వీకరించి, తమ రచనలలో ప్రతిబింబింప జేసిరి. ఆనాటి ప్రజాజీవితములో కరుడు గట్టిపోయిన సాంఘిక, ఆర్థిక, రాజకీయ, విద్యావైజ్ఞానిక రంగములలోని మూఢ విశ్వాసములను, ఛాందసుల కార్పణ్యములను పటాపంచలుచేయుచు, సంఘముపైన విజయ పతాక నెత్తి తమ పనిలోవారు కొంతవరకు కృతకృత్యులైరి. వీరిరువురును నవలాసాహిత్య చరిత్రమున నవయుగోదయ సృష్టికి మార్గదర్శకులై ప్రవర్తించిరి.

అపరాధ పరిశోధక నవలలు;—

ఈ శతాబ్దములో సాంఘిక, చారిత్రక నవలలతోపాటు కొన్ని అపరాధ పరిశోధక నవలలుగూడా వెలువడినవి. అవి ప్రజలకు మంచి పఠనాసక్తిని, రచనాశక్తిని అభివృద్ధి జేసినవి. ఈవాఙ్మయ శాఖకు గూడా ఆనాటినుండియే ప్రజ లలో ఆదరణ లభియించి, వేళ్ళూనసాగినది.

విక్టోరియారాణి కాలపు రచయితల ప్రభావము;-

ఈ పందొమ్మిదవ శతాబ్దపు తెలుఁగు రచనలపైన, రచయితలపైన విక్టోరియా మహారాణికాలపు పాశ్చాత్య రచయితల ప్రభావము కొంతవరకు కనబడుచున్నదని కొందరు భావింతురు.

తెలుఁగు నవలలపై తెలుఁగుముద్ర;-

అయినను ఆనాటి తెలుఁగు రచయితలు, ఇతివృత్త సేకరణములో, పాత్రోన్మీలనములో, సంభాషణా సంవిధానములో, శిల్పనిర్మాణములో, వర్ణనలలో, కథా కథన విధానములో,పాశ్చాత్యులను అనుకరించక, మన తెలుఁగుదేశమును, తెలుఁగుల ప్రజా జీవితమును, ఆచార వ్యవహారములను, సంస్కృతీ సభ్యతలను మాత్రమే స్వీకరించి, ఆంధ్రితా ముద్రితో, తెలుఁగుదనము తొణికిసలాడునట్లు స్వతంత్ర ఆలోచనలతో రచనలు జేసిరి. ఆనాటి వారి ప్రతిరచన యందు, ఆంధ్రులకు సుపరిచితమైన విషయములనేగ్రహించిరిగాని, తద్భిన్నమైన వానిని తీసికొనలేదు. ఆంధ్రితా ముద్ర ఆనాటి ప్రతిరచనలోను. ప్రస్ఫుటముగా గోచరించుచుండును. ఆనాటి వారి రచనలు తెలుఁగుజాతిని మేలుకొలుపుటకు, కర్తవ్యమును నిర్దేశించి చెప్పుటకు, ఉత్తమ మార్గములను ప్రబోధించి చూపుటకు తోడ్పడినవి. జాతికి జాగృతిని, నవచైతన్యమును ప్రసాదించినవి. ఆనాటి

తెలుఁగు నవల ఆంధ్రికా ముద్రితో, స్వచ్ఛమైన తెలుఁగు దనముతో, అచ్చమైన "తెలుఁగుల బాలయై" వర్ధిల్లి, అది నవ్య సాహిత్య నిర్మాణమునకు, నూతన యుగోదయమునకు మార్గదర్శకత్వము వహించినది.

పందొమ్మిదవ శతాబ్దపు తెలుఁగు రచయితలు పాశ్చాత్యులనుగాని, మనదేశీయ భాషలలోని యితర రచయితలను గాని అనుకరించి యుండలేదు. మన తెలుఁగు నవల "ఎరువు సొమ్మ బరువుచేటు" గానుండక స్వచ్ఛమైన, అచ్చమైన నింపు తెలుఁగు దనముతో తెలుగువారి ఆలోచనలకు తగినట్లు వ్రాయబడి, నవనవోన్మేషముగా వర్ధిల్లినది.

తెలుఁగు రచయితల విశాల దృక్పథము;—

ఈశతాబ్దములో కుల, మత, వర్గ విశ్వాసములతోనిండిన ప్రాతసంప్రదాయములు, ఆచార వ్యవహారములు క్రమముగా వెనుకబట్టి పోదొడగినవి. కొత్త ఆచారవ్యవహారములు వాటి స్థానమునాక్రమించినవి.

ఈకాలములో విశాల దృక్పథముగల రచయితలు "మానవత, ధర్మము, సత్యము, నీతి" అను పాశ్చమిక సూత్రములను పునాదులుగా గ్రహించి, స్వీయఆలోచనలతో, స్వతంత్రప్రతిపత్తితో సంఘమును సంస్కరించి, లోకోద్ధరణ సలుపుటకుబద్ధకంకణులైరి. ఆ ఆదర్శముతో నిండుదనముతో రచనలు చేయుటకు దృష్టిని "విశాలతమ" మొనరించుకొని ముందుకు పుకోగమించిరి. అనాటి వారి విశాల దృష్టి, ఆలో

చనా సంవిధానమే, ఇరవయ్యవ శతాబ్దము లో మన తెలుగు నవలాసాహిత్యము, కొత్త కొత్త పొంతలు త్రొక్కుటకు, క్రొత్త వెలుగును ప్రపరింపజేయుటకు, చక్కని సువాసనల గుబాళింపుతో అది ముకోకటి తెలుఁగు ప్రజలను ముది పింపజేయుటకు తోడ్పడినది.

ఈశతాబ్దములో నవలారచయితలు, ప్రాత సంప్ర దాయములలోని చెడునకు నిర్భయముగా భరత వాక్యము పలికి, అందలి మంచిని ఆదరముతో, అభిమాన ముతో స్వీకరించి, సంఘమును సంస్కరించి, నూతనభావవికాసముతో పునర్నిర్మించుటకు పూనుకొనిరి. ఈ "మహాప్రసాన" కార్య క్రమములో వారు, నూతన భావ వికాసముతో నవచైతన్య ముతో, తాము తలపెట్టిన బృహత్కార్యమునకు చక్కని రాచబాటను నిర్మించి పెక్కు నవలలు వ్రాసి, నవయుగ శుభో దయమునకు. భాగ్యోదయమునకు నాందీ ప్రస్తావనలుసలిపిరి.

ఈ బృహత్కార్యమును తెలుఁగు దేశమున విజయ వంతముగను, సమర్థవంతముగను నిర్వహించిన మహా నుభావులు, మహాపురుషులు శ్రీ కందుకూరి వీరేశలింగం, శ్రీ చిలకమర్తి లక్ష్మీనరసింహం పంతులుగారలు. గనుక ఆ పుణ్యపురుషుల దివ్యముద్ర ఈశతాబ్దముపు తెలుఁగు నవలా వికాసముపైన ప్రస్ఫుటముగా గన్పించక తప్పదు.

ఈ మహత్కార్య నిర్వహణములో కందుకూరివారు స్థాపించిన "చింతామణి" పత్రికను; అది నిర్వహించిన పాత్రను, అది తెలుఁగు నవలా ప్రగతికి తోడ్పడిన కృషిని మనము ఈ సందర్భమున విస్మరించుటకు వీలులేదు.

సింహావలోకనము;— పందొమ్మిదవ శతాబ్దమున పాశ్చాత్య విద్యావేత్తల సహాయ, సహకారములతో, ప్రగతి శీలురైన మన రచయితలు ప్రభావితులై, నూతన రీతులతో పెక్కు రకములైన రచనలుచేసి, దేశీయ సాహిత్యములను సుసంపన్న మొనరించినట్లు తెలిసికొంటిమి. దేశము నలు మూలల సంఘసంస్కర్తలు, దేశభక్తులు, యుగపురుషులు జన్మించి, దేశపురోభివృద్ధికి సలిపిన కృషిని పరామర్శించు కొంటిమి. ప్రజలు అమహత్తర ప్రభావముతో చైతన్యవంతులై పురోగమించి, దేశ స్వాతంత్ర్యము కొరకు పోరాటము సలుపుటకు సంకల్పించిన సంగతిని గూడా తెలిసికొంటిమి.

విశాల భావము, దూరదృష్టిగల రచయితలు, దేశీయ భాషలను సంకుచిత వాతావరణమునుండి వెలుపలికితీసి వెలుఁగును ప్రసాదించి నవయుగోదయమునకు తోడ్పడిన విషయమును వివరించుకొంటిమి.

రచయితలు అత్యుత్సాహముతో ఖండ కావ్యము, గేయము, నాటకము, ఏకాంకిక, నవల, కథ, జీవిత చరిత్ర, వ్యాసము, విమర్శనము మొదలైన నూతన సాహిత్య ప్రక్రియలను సువిశాలమైన ప్రాతిపదిక పైన పుంఖానుపుంఖము లుగా రచనలుచేసి ప్రకటించిరి. ఈనవీన సాహిత్య ప్రక్రియలన్నియు ప్రత్యక్షముగనో, పరోక్షముగనో ఇరువదవ శతాబ్దపు మననవలా వికాస ప్రగతికి, స్వర్ణయుగ సృష్టికి హేతు భూతములై వర్ధిల్లినవి.

తృతీయ భాగము

నవలా సాహిత్య స్వర్ణయుగము.

యుగ విభజనము ;- ఇంతవరకు పందొమ్మిదవ శతాబ్దమున, జాతీయ భాషలలో కొంతవరకు నవల పొందిన వికాసమును గురించి తెలిసికొంటిమి. అంతేగాక తెలుఁగు నేలయందు అది పొందిన క్రమ వికాసమును వివరముఁగా గహించితిమి.

ఈ ఇరువదియవ శతాబ్దమున తెలుఁగు నవల, వివిధ దేశీయ భాషలతోను, విదేశ భాషలతోను ఆదాన ప్రదాన కార్యక్రమములను స్వేచ్ఛగా జరుపుచు, విశాల దృక్పథముతో ప్రగతి పథమువెంట నడచి, అది పుష్పించి, ఫలియించిన విధమును, దానిక్రమ పరిణామ వికాసమును, యీ భాగములో తెలుపబడును.

ఈ శతాబ్దములో తెలుఁగు నవల జెందిన ప్రగతి, క్రమ వికాసము మూడు దశలలో జరిగినట్లు పరిశీలన వలన విశదమగుచున్నది. ఈ పరిశీలనము, యీ విభజనము, రాజకీయ వాతావరణము ననుసరించి యేర్పడినను, మన నవలా ప్రగతి, చాలవరకు దీని ననుసరించియే జరిగినది. మనము

జరిపిన యీ యుగ విభజనమునకును, నవలా వికాసమునకును సన్నిహిత సంబంధమున్నది. అది అవినాభావ సంబంధ మని పరిశీలన వలన తేట తెల్లమైనది.

రచయితలు, కళాకారులు, శిల్పులు, సమకాలిక సాంఘిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితుల ప్రభావమునకు లోనుగాక తప్పదను సత్యము సర్వులకు విదితమేగదా!. దాని ననుసరించియే, దేశప్రగతి, సాహిత్య వికాసము, కళోద్ధరణ జరుగు చుండుటను పరమ సత్యమును మనము విస్మరించుటకు వీలు లేదు. గనుక యీ శతాబ్దపు నవలా సాహిత్య "స్వర్ణయుగ" మును యీ క్రిందివిధముగా విభజించవచ్చును.

ప్రథమదశ. 1900–1930; ద్వితీయ దశ 1930–1947; తృతీయదశ 1947—1969.

ప్రథమ దశ :– 1900—1930

సాధారణ పరిస్థితులు;– రచయితలు గత శతాబ్దమున, ప్రజలను నూతన విద్యావిధానమున కనుగుణముగా తీర్చిదిద్దుటకును, సంఘసంస్కరణ, సముద్ధరణ సలుపుటకును. దేశభక్తిప్రపూరితులనుగా మార్చుటకును, రచనలు చేసి దేశ ప్రగతికి తోడ్పడినట్లు తెలిసికొనియుంటిమి.

ఇరువదియవ శతాబ్దపు ప్రథమ పాదమున ఆర్థిక, పారిశ్రామిక, ఉద్యోగ సంబంధమైన అభివృద్ధిని కలిగించుటకును,

భూసంస్కరణలు చేయుటకును గొప్పక్రుషి జరిగినది. రైతు కూలీల కష్టనష్టములను, పారిశ్రామిక సంస్థలలో పనిచేయు కార్మికులయొక్క పరిస్థితులను, చిక్కులను,పరిశీలించి,పరిష్కార మార్గములను వెదుకుటకు పెక్కుమహోద్యమములు జరిగినవి.

రాజకీయ పరిస్థితి:— వెనుకటి శతాబ్దములో వలె ఆంగ్లేయులు గొప్పన్యాయ ప్రవర్తకులని, వారి నాశ్రయించి వారిదయా దాక్షిణ్యములతో, వారి ఛత్రిఛాయలలో మనము నడచుకొనినచో మనకు క్షేమమని చెప్పు రాజకీయములు వెనుక బట్టినవి. ప్రజలలోను, నాయకులలోను గొప్ప చైత న్యమువచ్చినది. వలసరాజ్య పరిపాలనగాని, సామ్రాజ్యాంత ర్గత స్వపరిపాలనగాని కాక; మనధ్యేయము "స్వరాజ్యము, సంపూర్ణ స్వరాజ్యము," అనునదిమాత్రమే నని తెలుపుచు దానిని సాధించుటకు ప్రజానాయకులు పూనుకొనిరి.

1903 వ. సంవత్సరమున కర్జన్ ప్రభువు తలపెట్టిన బెంగాలు విభజన కార్యక్రమము ఆదేశ ప్రజలను కోపోద్రి క్తులనుగా నొనరించినది. యావద్భారత దేశమునకు ఆను హోద్యమము ప్రాకినది. "వందేమాతరం-మనదేరాజ్యం" అను నినాదము ప్రతిభారతీయుని నోట వినిపించినది. పెక్కు మంది దేశభక్తులు, కార్య కర్తలు నిర్భయముగా ప్రభుత్వ శాసనములను ధిక్కరించుచు, యీ మహోద్యమమును బల

పరచుటయేగాక, ఉపన్యాసములతోను, గ్రంథ రచనలతోను ప్రజల నుత్తేజ పరచిరి.

1907 వ. సంవత్సరమున సూరత్ కాంగ్రెస్ మహా సభ జరిగినది. దురదృష్ట వశమున కాంగ్రేసు అతివాద, మితవాద వర్గములుగా చీలిపోయినది. తిలక్ మహాశయుడు అతివాదవర్గమునకు, గోఖలే మితవాదవర్గమునకు నాయక త్వము వహియించి పనిచేయసాగిరి.

లోకమాన్యుడు "స్వరాజ్యము నాజన్మహక్కు-దానిని సాధించి తీరుదును" అని ప్రతిజ్ఞచేసెను. అది భూనభోంత రాళములు ప్రతిధ్వనించినది.

గోఖలే, లజపతిరాయ్, అరవిందఘోష్, మాలవ్యా, పాల్ మొదలైన ఉత్తమ శ్రేణికి జెందిన రాజకీయ వేత్తలు, దేశభక్తులు ప్రజలకు నాయకత్వము వహియించి కర్తవ్య నిష్టను ప్రబోధింప దొడగిరి.

1909 వ. సంవత్సరమున వెలువడిన "మింటో-మార్లే" సంస్కరణలను నాయకులు బహిష్కరించిరి.

1914-18 సంవత్సరములమధ్య ప్రపంచ ప్రథమ సంగ్రామము జరిగినది.

1917-18 సంవత్సరములలో ఎనిబిసెంట్ సతి అఖిల భారత హోంరూలు ఉద్యమమును ప్రారంభించినది. ఆఉద్య

మమును తిలక్, గాంధీ మొదలైన మహానాయకులు బలపరచిరి. దేశము యీ ఉద్యమముతో కొత్త మొగ్గదొడిగి కొత్త శోభతో తళతళలాడినది. నూతనోత్సాహముతో ప్రజలు ముందుకు దూకి పనిచేసిరి.

యుద్ధానంతరము 1918న. సంవత్సరమున మాంటేగ్-చేమ్స్ ఫర్డ్ ప్రవేశపెట్టిన సంస్కరణలు సైతము తిరస్కరింప బడినవి. 1917 వ. సం. ఏప్రియల్ మాసమున చాంపారన్, బార్డోలి సత్యాగ్రహములు విజయవంతముగా జరిగినవి. 1918 వ. సంవత్సరమున ఖేడాలోగూడా సత్యాగ్రహోద్యమము ఫలవంతమైనది.

1918 వ. సంవత్సరమున భారత రాజకీయ చరిత్రలో నూతన శకోదయమైనది. మహాత్మాగాంధి సత్యాహింసలను నూతనాస్త్రములతో భారత రాజకీయ రణరంగమున ప్రవేశించి, తనదివ్య ప్రభావముతో, యీ సువిశాల దేశములో పేరుకొనియున్న అజ్ఞానమును, అంధవిశ్వాసములను, దుర్భర దారిద్ర్యమును, దుస్సహమైన పరపీడనను తొలగించి దేశమునకు స్వరాజ్యమును సాధించి పెట్టుటకు నడుముబిగియించి కార్యరంగమున దూకెను. మహాత్ముని అమృత వాణి దేశము నలుమూలల ప్రతిధ్వనించినది. దేశమాత దాస్య శృంఖలముల విచ్ఛేదనమునకు, త్యాగశీలురును, దేశభక్తులును నైన వెక్కుమంది యువతీయువకులు, వృద్ధులు, మహా

త్సాహముతో, తమ సర్వస్వమును విడనాడి ఆయన అడుగు జాడలలో నడచిరి.

1919 వ. సంవత్సరమున ఖిలాఫతు ఉద్యమము నడచినది. ఈమహోద్యమము నందు హిందూ మహమ్మదీయులందరును, ఐకమత్యముతో పాలుగొని తమశక్తిని ప్రదర్శించిరి. 1920 ఏప్రియల్ 13 వ. తేదీన అమృతసరులోని జలియన్‌వాలా భాగ్ నందు కని విని యెరుగనంతటి ఘోర దురంతములు జరిగినవి. "డయ్యరు"చేసిన యీ దుష్కార్యమును ప్రజలు ఐక్య కంఠముతో నిరసించిరి.

1921 వ. సంవత్సరమున సహాయ నిరాకరణోద్యమము, విదేశవస్తు బహిష్కరణోద్యమములు ముమ్మరముగా సాగినవి. హరిజనోద్ధరణ, హిందూమహమ్మదీయుల ఐక్యత, స్త్రీజనోద్ధరణ వంటి పెక్కు సమస్యలకు ప్రాధాన్యతవచ్చి, ప్రచారమునందుకొన్నవి.

1924–25 సంవత్సరములలో "స్వరాజ్యపార్టి"స్థాపింపబడినది. ఆపార్టీ కార్యక్రమములు విరివిగా జరిగి ప్రజలనాకర్షించినవి. 1926 వ. సంవత్సరమున స్వామి శ్రద్ధానందుడు హత్యగావింపబడెను. ఆసంవత్సరము ఖాది ఉత్పత్తి, ప్రచారములకు సంబంధించిన కార్యక్రమములను గాంధీ మహాత్ముడు ప్రచారముచేయ దొడగెను. నిర్మాణ కార్యక్రమమునందు కార్యకర్తలు మిక్కిలి శ్రద్ధవహించి పని చేయసాగిరి.

1928 వ. సంవత్సరమున "సైమన్ కమీషన్" భారత దేశమును సందర్శించిన సందర్భమున, ఆతని రాకను వ్యతిరేకించుచు నల్లజండాలను ప్రదర్శించిరి.

1929. జనవరి 26 వ. తేదీన పండిత జవహర్లాలు నెహ్రూ అధ్యక్షతన లాహోరులో కాంగ్రేసు మహాసభలు జరిగినవి. "సంపూర్ణస్వరాజ్యము" భారతీయుల ప్రగాఢ వాంఛయని, దానిసాధనకై యెట్టిత్యాగములు సలుపుటకైనను వెనుదీయ బోమని ముక్తకంఠముతో విదేశ ప్రభుత్వమును వారు హెచ్చరించిరి.

1930. ఏప్రియల్ 6 వ. తేదీన గాంధీమహాత్ముడు ఉప్పు సత్యాగ్రహమును ప్రారంభించిరి. దానికితోడు విదేశవస్తువుల బహిష్కరణను గూడా జరిపిరి. ఈపోరాటము భారత దేశమునందలి ఆబాల వృద్ధులను ఆకర్షించినది. లక్షల సంఖ్యలో దేశభక్తులు శ్రీకృష్ణ జన్మస్థానమున కేగిరి. భారత స్వాతంత్ర్య చరిత్రలో ఇది చివరి పోరాటమని అనాటివారు భావించిరి.

1935వ. సంవత్సరమున పరిపాలనా లోపములను సవరించి, దేశీయులకు ఉద్యోగములలో సరియైన స్థానమును కల్పించుటకు యేర్పాటు చేయబడిన కాంగ్రేసుసంస్థ 1906వ. సంవత్సరము వరకు "స్వరాజ్యము"ను ఆదర్శముగా ముందుం

చుకొని, అదిముందుకు ఏజ్యంభించినది. ఆ మహాసంస్థయే 1929 వ. సంవత్సరమునకు తన ధ్యేయము సంపూర్ణ స్వాతంత్ర్యమని ప్రకటించి మహోత్సాహముతో ముందుకురికినది.

గత శతాబ్దమునను, యీశతాబ్దపు ప్రథమ దశయందును, జరిగిన ఉద్యమములను యీకింది విధముగా సమన్వయముచేసి, సంక్షిప్తముగా చెప్పవచ్చును.

రాజా రామమోహనరాయలు ప్రారంభించిన,సాంఘిక సంస్కరణోద్యమము, ఆయన ప్రతిపాదించిన బ్రహ్మసమాజ సిద్ధాంతములు, భారత జాతి పునరుజ్జీవనమునకు, భారతీయ సాహితీ సంస్కృతుల సర్వతోముఖాభివృద్ధికి, ప్రథమ సోపానమైనది. దానికి తోడు హైందవ జాతీయోద్యమము గూడా యించుమించు అదేరోజులలో ప్రారంభమైనది. ఈమహోద్యమము దయానంద, రామకృష్ణ, వివేకానందు లతో, పువ్వొత్తునలేచి, లోకమాన్యని దివ్యప్రభావముతో ఉత్తుంగ శిఖరములనందుకొని, చిరదాస్యములోనున్నజాతిని జాగృతమొనరించి, పూర్వసంస్కృతీ సభ్యతలపట్ల, నాగరికతావైభవములపట్ల, యెనలేని ఆదరణ, అభిమానముయేర్పడి జాతీయ పునరుజ్జీవనమునకు అది ద్వితీయ సోపానమైనది.

మహాశక్తి సంపన్నము, ప్రతిభావంతమునైన భారత జాతీయోద్యమముగూడా అదే సమయమున బయలుదేరి, సాంఘిక, మతోద్యమములకు ఆలంబనముగా నిలచి, భార

తీయ పునరుజ్జీవనమునకు నవ్యసాహిత్య సృష్టికి, దానిక్రమ వికాసమునకు తోడ్పడినవి. విడి విడిగా బయలుదేరిన ఈ మూడు మహోద్యమములు గంగా, యమునా, సరస్వతుల వలె ఏక ప్రవంతియై, ఏకోన్ముఖమై ఒకదానికొకటి ప్రోద్బలమును ప్రోత్సాహమును కలిగించుచు ఉజ్వలముగా ముందుకు చొచ్చుకొని పోవుచున్న తరుణమున, మహోన్నతదివ్య వాణీ హిమాలయములనుండి, కన్యాకుమారి వరకుగల సర్వ భారతదేశమునను ప్రసరించి జాతిని సంపూర్ణ జాగృతమొనరించి, చైతన్యవంతులుగా నొనరించినది.

ఈ మధ్యకాలమున భారతదేశమునందును, విదేశములలోను వెక్కు స్వాతంత్ర్యోద్యమములు విజయవంతముగా నడచినవి. ప్రజావాణికి ఘనవిజయము చేకూరినది. కనివిని యెరుగని మార్పులు సంభవించినవి. రష్యా, జపాను దేశములు సాధించిన విజయములు భారతీయులను ఉత్తేజపరచి కార్యోన్ముఖులగుటకు తోడ్పడినవి. —

ఆంధ్రదేశమున జరిగిన సంఘటనలు ;-

అఖిల భారత స్థాయిలో జరిగిన యీ మహోద్యమములకు అనుబంధముగా ఆంధ్రదేశమున మరికొన్ని సంఘటనలు జరిగినవి.

"దోసమటంచెఱింగియును దుందుడు కొప్పగఁబెంచినారమీ- మీసము రెండు భాసలకు మేమొకవీందులమంచు

దెల్పగా" నని ప్రతినబట్టి కొన్నాళ్ళు* ఆంధ్రకవితాసామ్రాజ్యమును, యేకచ్ఛత్రముగా తమశతావధాన ప్రక్రియలతో బరంపురమునుండి, బళ్ళారి వరకు; మద్రాసునుండి, గద్వాల వరకు; గల యీసువిశాల భూభాగములో కవితాకన్య నూరేగించి, పూత సంప్రదాయమునకు జెందిన కవితలనే, నూతన రీతులతో సులభశైలిలో అందరికి అందుబాటులోనుండునట్లు బహు గ్రంథములు రచియించి, ప్రతిభావంతులైన పెక్కుమంది వర్తమాన రచయితలకు గురువులై నవ్యకవితా మహోద్యమమునకు నందీ ప్రస్తావనలు సలిపి "అద్యత నాంధ్ర కవితాప్రపంచ నిర్మాత" లని పించుకొనిన మహా పురుషులువారు. వీరివలెనే కొప్పరపు కవులు, వేంకటరామ కృష్ణకవులు ఆంధ్రభాషకు అనల్పమైన సేవలను జేసిరి.

ఆంగ్లభాషా సంపర్కముతో, ఉన్నతవిద్యా సంపన్నులైన డాక్టరు. కట్టమంచి రామలింగారెడ్డిగారు 1901వ. సంవత్సరమున "ముసలమ్మ మరణ" మను కావ్యమును నూతనరీతిలో వ్రాసి ఆంధ్రభాషలో గొప్ప సంచలనమును కలిగించిరి.

1-9-1901. వ. జేదీన హైదరాబాదు నగరములో శ్రీరాజా నాయని వేంకట రంగారావు బహద్దూర్, రావి చెట్టు రంగారావు, కొమర్రాజు వేంకట లక్ష్మణరావు పంతులు గారలు శ్రీకృష్ణదేవరాయాంధ్రభాషా నిలయమును స్థాపించి, తెలంగాణ ప్రాంతమునకు సుప్రభాత గీతములను పాడిరి. ఆ తిమూర్తులే మరికొద్దికాలము పిమ్మట, "విజాన చంద్రికా"

---

* శ్రీ తిరుపతి వేంకటకవులు

గ్రంథమాలను అక్కడనే స్థాపించి, ఆంధ్రకేదారమునకు నూతన వసంతోదయమును గలిగించిరి. 1903_4 సంవత్సరములలో ఓరుగల్లునందు "శ్రీరాజరాజ నరేంద్ర" గ్రంథాలయమును స్థాపించి, తెలంగాణమునందు ఆంధ్రోద్యమమును మరికొంత ముందుకు తీసికొనిపోయిరి.

1908 వ. సంవత్సరమున బొంబాయినుండి దేశోద్ధారక కాశీనాథుని నాగేశ్వరరావు పంతులుగారు ఆంధ్రవార పత్రికను ప్రచురించుచు, ఆంధ్రులకొక నూతనోత్సాహమును కలిగించి, ఆంధ్రత్వమును ప్రదర్శించసాగిరి.

బహుభాషా వేత్త, మహాపండితుడైన శ్రీగిడుగు వేంకట రామమూర్తి పంతులుగారు వంగభాష నభ్యసించి, సునీతి కుమార్ ముఖర్జీవంటి పండిత ప్రకాండుని సహచర్యముతో పెక్కు పరిశోధనలు సలిపి వంగవాణికిని, ఆంధ్రభారతికిని విశేష సఖ్యమును కలిగించి 1908–1909 సంవత్సరములలో ఆంధ్రదేశమున వ్యావహారిక భాషావాదమును లేవదీసి పెక్కుమంది మహాపండితులతో "ఢీ"కొని దేశము నలుమూలల విశేష సంచలనమును కలిగించిరి. వీరి మహత్తర కృషి ఫలితముగా, యీనాడు ఆంధ్రవాణి దివ్యవాణియై సర్వజనులకు ఆస్వాదయోగ్యమై దిన దినాభి వృద్ధి జెందుచున్నది.

గురజాడ వేంకటప్పారావు, రాయప్రోలు సుబ్బారావు గారలు వంగభాషా ప్రాబల్యముతో విశాల దృక్పథము నల

వరచుకొని, ఆధునిక రీతులలో రచనలు చేయుటకు అంకు
రార్పణ చేసిన నవ్యాంధ్ర సాహిత్య పితామహులు.

గురజాడవారు వాడుకభాషలో "కన్యాశుల్కం" నాటక
మును; మా ప్రాచ్చందస్సులో "ముత్యాల సరము" లను
గేయములను ప్రాసి పందొమ్మిదవ శతాబ్దపు తొలిదశలో
ఆంధ్ర సాహిత్య నందనోద్యానమున గొప్పగాలి చుమార
మునులేపి, "అడుగు జాడ గురజాడ" యను నంతటిప్రభావ
మును కలిగించి, నవ్యాంధ్ర సాహిత్యములో స్వర్ణయుగ
సృష్టికి ఆచార్యులై వర్ధిల్లిరి.

రాయప్రోలువారు వ్రాసిన, "తృణకంకణము, కష్టక
మల, లలిత, జడకుచ్చులు" ఆధునిక తెలుఁగుసాహిత్యములో
విరబూసిన కొత్తపూవులు. వాని నూతన సౌరభములో
ఆంధ్రులమనోభావములు నూతన హోయలతో పులకించినవి.

"ఆంధ్ర సాహిత్య పరిషత్తు" అనుసంస్థను, పిఠాపురం
రాజావారి సహాయముతో జయంతి రామయ్య, కందుకూరి
వీరేశలింగం, కొమర్రాజు లక్ష్మణరావు పంతులుగారలు
12 మే. 1911 వ తేదీన, ఆంధ్రభాషాభి వృద్ధిని ధ్యేయముగా
నిడుకొని మద్రాసునందు స్థాపించిరి. దీనికి అనుబంధముగా
"ఆంధ్రసాహిత్య పరిషత్పత్రిక" ను నడిపిరి.

1913 వ. సంవత్సరములో బాపట్లలో బయ్యా నరసిం
హేశ్వరశర్మ గారి అధ్యక్షతన జరిగిన ఆంధ్ర మహాసభ

వారు ప్రత్యేక ఆంధ్రరాష్ట్రము సిద్ధించిననేగాని, ఆంధ్రులకు సరియైన అభివృద్ధి కలుగనేరదని గుర్తించి, ప్రతిసంవత్సరము వార్షిక సమావేశములను, భిన్న ప్రదేశములలో యేర్పాటు చేయుచు, తమ ప్రగాఢ రాష్ట్రవాంఛను వ్యక్తముచేయసాగిరి. ప్రత్యేక రాష్ట్ర వాంఛతోపాటు ప్రత్యేక రాష్ట్ర కాంగ్రేసు సంఘమునుగూడా యేర్పాటుచేయవలెనను కోరికను ఆంధ్ర కేసరి ప్రకాశం, దేశభక్త కొండా వేంకటప్పయ్య, విశ్వ దాత కాశీనాథుని నాగేశ్వరరావు, గాంధీజీ భాష్యకారుడైన డాక్టరు. పట్టాభి సీతారామయ్యగారలు అఖిల భారత కాంగ్రేసు సంఘముతో నిరంతరము పోరాటము సలిపి 1917 వ. సంవత్సరమున దానిని సాధించిరి.

1921 మార్చినాయందు బెజవాడలో జరిగిన కాంగ్రేసు సభలు తెలుఁగు జాతిని మేలుకొలిపినవి. అదే సంవత్సరము చీరాల, పేరాల మునిసిపాలిటీలకు సంబంధించిన మహోద్యమమును ఆంధ్రరత్న శ్రీ దుగ్గిరాల గోపాలకృష్ణయ్యగారు విజయవంతముగా నిర్వహించి ఆంధ్రులకు కనువిప్పును కలిగించిరి.

11, 12 నవంబరు 1921 వ. సంవత్సరమున హైదరాబాదులో ఆంధ్రపితమహులు మాడపాటి హనుమంతరావు, బూర్గుల రామకృష్ణారావు, ఆదిరాజు వీరభద్రరావుగారలు "ఆంధ్ర జనసంఘ"మును స్థాపించిరి. ఆపిమ్మట ఆసంస్థయే

"ఆంధ్ర మహాసభ" గావఁగా నిదాీణమైన తెలంగాణమును మేలుకొలిపినది.

12 జనవరి 1922 వ. సంవత్సరమున పన్నుల నిరాకరణోద్యమము ఆంధ్రదేశంలోని గుంటూరు, కృష్ణా, గోదావరి, కడప జిల్లాలలో ఘనవిజయమును సాధించినను, గుంటూరు జిల్లా ప్రజలు ఆమహోద్యమములో ముందంజవేసి అగ్ర తాంబూలమునందుకొని యావద్భారత ప్రజలదృష్టి నాకర్షించిరి. ఈ ఉద్యమమునకు దేశభక్త కొండా వేంకటప్పయ్య, ఉన్నవ లక్ష్మీనారాయణ, నడింపల్లి వేంకట లక్ష్మీనరసింహారావుగారలు నాయకత్వము వహియించిరి.

"ఆంధ్ర దేశీయేతిహాస పరిశోధక మండలి"ని సెప్టెంబరు 1921 వ. తేదీన చరిత్ర చతురానన చిలుకూరి వీరభద్రరావు, చిలుకూరి నారాయణరావు, భావరాజు వేంకట కృష్ణారావు, రాళ్ళభండి వేంకట సుబ్బారావుగారలు రాజమహేంద్ర వరమున స్థాపించిరి.

27_12_1922 వ. తేదీన హైదరాబాదులో "ఆంధ్రపరిశోధక మండలి" స్థాపింపబడినది. 1931. లో. అది "లక్ష్మణరాయ పరిశోధక మండలి"గా మారి దినదినాభివృద్ధి నందుచున్నది.

1924, 25. సంవత్సరములలో ఆంధ్ర విశ్వవిద్యాలయము స్థాపింపబడినది. దీనికి తొలిదశలోనే డాక్టరు. కట్ట

మాచి రామలింగారెడ్డి, డాక్టర్. సర్వేపల్లి రాధాకృష్ణయ్య వంటి పండిత ప్రకాండులు, ప్రముఖ సాహిత్య వేత్తలు ఉపాధ్యక్షులై ఆంధ్ర భాషకు యెనలేని సేవలను సల్పియుండిరి.

1925 వ. సంవత్సరమున గోదావరి, విశాఖ జిల్లాల లోని ఏజన్సీప్రాంతములలో ప్రముఖ దేశభక్తుడు, విప్లవ నాయకుడునైన, అల్లూరి సీతారామరాజు తన సహచరులతో "మహా విప్లవము"ను నడిపి ఆంగ్ల ప్రభుత్వమును గగ్గోలు పరచిరి. దీనిని ఆనాటివారు "గూడెం" తిరుగు బాటను పేరుతో వ్యవహరించిరి. దీనికితోడు పాఠశాలల బహిష్కరణోద్యమము, కోర్టుల బహిష్కరణోద్యములు జరిగినవి. బందరులో జాతీయ కళాశాల, మనదేశీయ విద్యలను, కళలను పునరుద్ధరించి ప్రజలను దేశభక్తి ప్రపూరితులనుచేయుటకు స్థాపించిరి. ఏలూరు, రాజమహేంద్రివరము, గుంటూరు పట్టణములయందు గూడా యిట్టి జాతీయ కళాశాలలను స్థాపించిరి.

1929 వ. సంవత్సరమున ఆంధ్రనాటక సమాజము స్థాపింపబడినది. దీని వికాసము 1934. సంవత్సరము తరు వాతనే జరిగినది.

హిందూ, మహమ్మదీయ, క్రైస్తవమతములతోపాటు, ఆరోజులలో ఆంధ్రదేశమునకు బ్రహ్మసమాజము, దివ్య

జ్ఞాన సమాజము, ఆర్యసమాజము, రాధాస్వామి మతమువంటి నూతన సంస్థలెన్నియో దిగుమతియై పనిచేయ దొడగినవి.

బ్రహ్మ సమాజమును, బెంగాలునందు రాజారామ మోహన రాయలు స్థాపించిరి. దానికి శాఖోపశాఖలు భారతదేశము నందంతటను నెలకొల్పబడినవి. దేవుడొక్కడేననియు; సత్యస్వరూపుడు, జ్ఞాన స్వరూపుడు, సర్వాంతర్యామియైన పరమాత్మ ఆత్మస్వరూపుడగుటచేత విగ్రహములు దైవములని తలంచి పూజించుట గొప్పదోషమని వారుద్ఘాటించిరి. "ఏకేశ్వరోపాసనయే" వారిధ్యేయము.

ఈమత వ్యాప్తికి ఆంధ్రదేశములో వీరేశలింగం పంతులు, రఘుపతి వెంకటరత్నంనాయుడుగారలుగొప్పకృషి చేసిరి. దివ్యజ్ఞాన సమాజము అమెరికాయందు ఉద్భవించినది. భారతదేశమున దీనివ్యాప్తికి అనిబిసెంట్ సతి అమోఘమైన కృషి సలిపినది. ఆంధ్రదేశమున యీమతమునకు సంబంధించిన రెక్కొశాఖలు నెలకొల్పబడినవి. ప్రథమదశలో దీని వ్యాప్తికి తల్లాప్రగడ సుబ్బారావు, జి. సుబ్బయ్యసెట్టిగారలు పాటుపడిరి. ఈదివ్యజ్ఞాన సమాజమునందు ప్రధానపాత్ర వహించి పనిచేసిన ఆంధ్ర ప్రముఖుడు జిడ్డు కృష్ణమూర్తిగారు. ఇతనిని అవతార పురుషుడని అనాటివారు భావించిరి.

ఈదివ్యజ్ఞాన మతము, ప్రజలలో స్వమతాభిమాన

మును పునరుజ్జీవింపజేసి హిందువులు యితర మతములలో చేరకుండునట్లు చేసినది. "సత్యాన్నాస్తి పరోధర్మః" అను మహోన్నత సిద్ధాంతమును యీ మతము ప్రబోధించినది. ఈ మతము అల్లాడి మహాదేవశాస్త్రి, వాఁకిలాల శివావధానులు, తల్లావజ్ఝల శివశంకరశాస్త్రివంటి పండిత ప్రకాండులనుఆకర్షించినది. ఈమతవ్యాప్తికివారు గొప్పకృషిచేసిరి.

స్వామి దయానంద సరస్వతి స్థాపించిన ఆర్యసమాజము, యావద్భారత దేశమునందు గొప్పచైతన్యమును కలిగించినది. నిద్రాణమైయున్న తెలంగాణమును యీ సంస్థ గూడా మేలుకొలిపి, మంచి జాగృతిని ప్రసాదించినది. వినాయకరావు విద్యాలంకార్, నరేంద్రదేవ్, రుద్రదేవ్ వంటి ప్రముఖులుదీని ప్రగతికి తోడ్పడిరి. ఆంధ్ర ప్రాంతము నందును దీనికి మరికొన్ని శాఖలున్నవి.

రాధాస్వామి మతస్థులను "సత్సంగు"లని పిలుతురు. ఈమతమునకు దయాల్‌భాగ్ కేంద్రము. ఇది ఆగ్రానగరమునందున్నది సంఘాభి వృద్ధికి, శ్రేయస్సుకు, ఐకమత్యతకు వీరు పాటుపడిరి. "పారమార్థిక చింత" వీరి ప్రధాన లక్ష్యము. ఈ మతావలంబకులు రాజమహేంద్ర వరము, తుని, గుంటూరు, హైదరాబాదు, హనుమకొండ, ఖమ్మం పట్టణములలో నెందరో గలరు

పైన తెలిపిన మతములేగాక రామకృష్ణ పరమహంస,

స్వామి వివేకానందుఁడు మనభారతీయ ఆధ్యాత్మిక, నైతిక, మత ధర్మప్రబోధములను సలిపిరి. అరవింద మహర్షి "పూర్ణ యోగ సంయుక్తమైన ఆధ్యాత్మిక విద్యావ్యాప్తి" కృషి సలిపిరి. శ్రీ రమణ మహర్షి నూతన భక్తిమార్గమును ప్రబోధించెను.

ఆంధ్ర దేశమున చెలరేగిన పై సంఘటన లన్నియు రచయితలను ఉత్తేజితులను చేసినవి. ఆయా విషయము లను ఇతివృత్తములుగా దీసికొని, నూతన సాహిత్య ప్రక్రి యలను సృష్టించుటకు వారు పూనుకొనిరి. తెలుఁగు నవలా వికాసముపైన, పై ఉద్యమములన్నియును పరోక్షముగను గొప్ప ప్రభావమును వేసినవి.

తెలుఁగు రచయితల పైన దేశీయ సాహిత్య ముల ప్రభావము :- పందొమ్మిదవ శతాబ్దమునందు వలెనే, ఇరువదియవ శతాబ్దపు ప్రథమ దశయందు భారత దేశమున చెలరేగిన మహోద్యమముల ప్రభావము పగతి శీలురు, దూరదృష్టిగల వంగ రచయితలను ఆకర్షించి ఉత్తేజ పరచినవి. ఆ ఉత్సాహముతో వంగభాషలో అనేక నూతన సాహిత్య ప్రక్రియలను వారు సృష్టించిరి.

వంగ సాహిత్యాకాశమును తమదివ్య కాంతులతో ప్రభావిత మొనరించుటయే గాక, యావద్భారత జాతికి,

నూతన పథమువెంట వెలుఁగుబాటను ప్రదర్శించిన త్రిమూ
ర్తులు బంకించంద్రుడు, రవీంద్రుడు, శరశ్చంద్రుడు. ఈ
త్రిమూర్తుల సాహిత్య ప్రభావము ఆధునిక భారతీయ భాష
లన్నింటిపైనను ప్రసరించినది. వారు రచియించిన దేశ
భక్తి పరిపూరితమైన రచనలను, పరిగతిశీలుర్తైన రచయితలు
దేశీయభాష లన్నిఁటిలో నికిని, అనువదించుకొని తమతను
భాషలను నూతన రీతులలో, నవీన మార్గములవెంట సుసం
పన్న మొనరించుకొనిరి. ఇతర దేశీయ భాషారచయితల వలెనే,
మన తెఁలుగురచయితలుగూడా అగ్రంథములను మనభాషల
లోనికి విరివిగా అనువదించి, మనసాహిత్య క్షేత్ర పరిధిని
విశాల మొనరించి పుష్టిని చేకూర్చిరి.

బంకిం బాబు రచనలు చాలవరకు ఇరువదవ శతా
బ్దము ప్రారంభముననే తెలుఁగుబోనికి అనువదింప బడినవి.

రవీంద్రుని దేశభక్తి ప్రబోధిత రచనలు తెలుఁగు
వారిని బాగుగా ఆకర్షించి ఆనందింపజేసినవి. గురుదేవుని
రచనల యందలి గంభీరత, నిండూదనము లోతునకు వెళ్ళి
బాగుగా పరిశీలించి పరామర్శించిననేగాని, అంతుపట్టదు.
ఆమహాపురుషుడు సందర్శించిన పూర్ణమానవతను, తనరచ
నలలో ప్రిబోధించిన మహత్తరమైన దేశభక్తిని, భారత
ప్రిజలందరితోపాటు తెలుఁగువారుగూడా మహోత్సాహ
ముతో ఆస్వాదించి ఆనంద పరవశులై, తమ సర్వస్వమును

దేశమాత దాస్యశృంఖలముల విచ్ఛేదనకు సమర్పించుటకు, జాతీయ మహోద్యమములలో దూకుటకు బద్ధకంకణులైరి. పెక్కుమంది యువతీయువకులు ఆనాడు శాంతి నికేతనము నందు గురుదేవుని పాదసన్నిధిలో అంతే వాసులుగానుండి, ప్రత్యక్షముగా వారి ప్రబోధములను పొంది, విశాలదృక్పథముతో సమాజమును సందర్శించి, నూతన రీతులలో సాహిత్య వ్యవసాయముచేయుట కుద్యమించిరి.

ఇకశరత్ బాబు రచనలతో వంగసాహిత్యములోగొప్ప మార్పులు జరిగినవి. ఆయన తనకుగల అపూర్వలోకానుభవముతో, సునిశిత మేధాసంపత్తితో, వర్ణనా నైపుణ్యముతో, భావనా పటిమతో తమ నవలలయందు క్రొత్త క్రొత్త పాంతలు తొక్కి, చిత్రవిచిత్రమైన పాత్రలను సృష్టించి యావద్భారత ప్రజలకు ఒక నూతనోత్తేజమును, ఒక నూతనోత్సాహమును ప్రసాదించిరి. ఆయన రచనలను దేశములోని యే ప్రాంతము వారు చదివినను, "శరత్ బాబు" తమ ప్రాంతమువాడేనను నంతటి ప్రభను కలిగించుచుండును. ఆయన స్వీకరించు ఇతివృత్తము, సర్వకాలీనమై, సర్వజనీనమై సర్వప్రాంతీయమైనదిగా నుండును. ఆ మహా రచయిత చేతిలో "స్త్రీ"మూర్తి మనకు సంపూర్ణముగా సాకల్యముగా, ప్రత్యక్ష మగును. ఆయనరచనలలో ఒకానొక ఇంద్రజాలము యిమిడియున్నది. ఆయింద్రజాలమే, పాఠకుని ఊహాతలూ

గించి, ఆయన రచనలను ప్రారంభించి నప్పటినుండి అవి ముగియునంత వరకు వెన్నంటియుండి పఠిత హృదయము నకు యెప్పటికప్పుడు నూతనోత్సాహమును ప్రసాదించు చుండును. ఒక ప్రొత్త ఆలోచనను హృదయములో రేపి, మేధస్సునకు ఒక గొప్ప పనిని కల్పించగల, ప్రతిభా పూర్ణ మైన రచన ఆయనది. స్త్రీలపట్ల, వారి చిత్ర విచిత్రమైన సమస్యలపట్ల, వారి స్వాతంత్ర్యముపట్ల ఆయన చూపినంత శ్రద్ధ, ఆదరణ, అభిమానము మరి యేయితర భారతీయ రచయిత, ఆనాడేగాక మరి యీనాడుగూడ చూపించలేదని చెప్పినచో అది స్వభావోక్తికి విరుద్ధముకాదు.

ఈ ప్రతిమూర్తుల ప్రభావము తెలుఁగుదేశమునైన, తెలుఁగు రచయితలపైన బహుముఖములుగా ప్రసరించి, వారిని ప్రభావితులను జేసి, రచనలుచేయుటకు పురికొల్పినది. గనుకనే వారి రచనల నన్నిటిని ఆనాడు తెలుఁగు భాష లోనికి వాగు అనువదించిరి. ప్రజలు మహోత్సాహముతో వానినిఆదరించి పఠియించిరి.

ఆమూర్త్రితయపు రచనాప్రభావముతో, తెలుఁగు భాషలో ఇరువదియవ శతాబ్దపు ప్రాథమిక దశలో ఎన్ని యో శక్తివంతమైన, సజీవసంపన్నమైన రచనలు వెలువడి తెలుఁగు సాహిత్య క్షేత్రమున నూతన భానూదయమైనది. ఆరోజులలోనే మహారాష్ట్ర, కన్నడ, అరవభాషల

నుండిగూడా కొన్ని రచనలు తెలుఁగులోనికి అనువదింప బడినవి. అయినను వంగసాహిత్య ప్రభావమే ఆనాటి తెలుఁగు రచయితలపైన అధికముగా ప్రసరించి, వారిని ఉత్తేజపరచినది.

మొత్తముపైన ఇరుదియవ శతాబ్దపు ప్రథమ పాదమున, మనదేశీయ భాషలలోనుండి, సాంఘిక, రాజకీయ, చారిత్రక, అపరాధపరిశోధక నవలలెన్నియో తెలుఁగులోనికి అనువదింపబడినవి. అటులనే కందుకూరివారి రాజశేఖర చరిత్రను, అరవ, కన్నడ, ఆంగ్లభాషలలోనికి అనువదించు కొనిరి. ఇట్లు ఇరుగుపొరుగు భాషలతో మన తెలుఁగు భాష స్వేచ్ఛగా ఇచ్చిపుచ్చుకొను పద్ధతితో వ్యవహరించినది. ఆనాడు తెలుఁగున వెలువడిన నవీన సాహిత్య శాఖలన్నింటి పైన వంగసాహిత్య ప్రభావము కొంతవరకు కనుపించును.

స్వర్ణయుగ, సుప్రభాతము :—

పందొమ్మిదవ శతాబ్దమునకు వీడ్కోలు సలిపి, ఇరువదియవ శతాబ్దమున అడుగిడగనే, మరల ప్రముఖముగా దర్శనమిచ్చు మహా పురుషులు, మహావ్యక్తులు శ్రీ కందుకూరి వీరేశలింగం, శ్రీచిలకమర్తి లక్ష్మీ నరసింహంపంతులు గారలేనని చెప్పక తప్పదు. ఈప్రముఖ లిరువురును పందొమ్మిదవశతాబ్దపు ఉత్తరార్ధమున తెలుఁగునాట నవలా వికాసమునకు జరిపిన మహత్తర కృషిని, నవయుగ శుభో

దయమునకు వాఁగు "శ్రీరామరక్ష" యై వర్ణింపఁబడిన విషయమును సవివరముగా వెనుకటి భాగమున తెలిసికొని యుంటిమి.

ఈశతాబ్దపు ప్రథమ దశయందు గూడా వారిరువ రును, భక్తిపురస్సరముగా ఆంధ్రసరస్వతిగళమున వెక్కు పూజా పుష్పములను సమర్పించి, ఆమహాతల్లిని సర్వాంగ సుందరముగా తీర్చి దిద్దిరి.

దక్షిణ భారత విద్వాన్మాగరుడని విఖ్యాతి నార్జించిన వీరేశలింగం పంతులుగారు, ఆంధ్రదేశమున వెక్కు యితర సాంఘిక సంస్కరణలతోపాటు, బ్రహ్మసమాజ స్థాపనకు, దానివికాసమునకు తీవ్రమైన కృషిసలిపి, అందుకృతకృత్యు లైరి. పంతులుగారు రాజశేఖర చరిత్ర, సత్యరాజా పూర్వ దేశయాత్రలు, అను నవలలను మాత్రమేగాక, సత్యవతీ చరిత్ర, చంద్రమతీ చరిత్రయను మరి రెండు నవలలనువ్రాసిరి.

సత్యవతీ చరిత్ర మిక్కిలివిశిష్టమైనది. దీనిలోనాలుగు రకములైన దాంపత్య జీవితములను వారు చిత్రించి చూపిరి. స్త్రీ పురుషు లిద్దరును చదువుకున్నవారు; స్త్రీవిద్యా వంతురాలు, పురుషుడు విద్యాహీనుడు; స్త్రీ పురుషు లిరు వురును విద్యా విహీనులు; స్త్రీవిద్యాహీనురాలు, పురుషుడు గొప్ప విద్యావంతుడు నైనచో ఆకుటుంబములలో సంభ వించు అనర్థములు, లాభనష్టములు అందు వివరించి చూపిరి. పంతులుగారిదృష్టి ప్రచార, ప్రబోధమునకై యీనవలలలో

శిల్పము కొంత లోపించినది. వ్యంగ్యముగను, సర్మగర్భముగను, చిత్రించవలసిన పట్టులందు వాచ్యముగా వారు తమభావములను వెల్లడించిరి. మొత్తముపైన కథాకథనము కుంటుపడక రచన సాగినది.

హరిశ్చంద్ర మహారాజు భార్యయైన చంద్రమతీదేవి చరిత్రమును, కొన్నిమార్పులతో నవలగా జేసిరి. కాని దీనికి నవలా లక్షణములు పట్టలేదు. ఇది పదిహేను ప్రకరణములుగల గ్రంథము. ప్రతిప్రకరణమునందును చంద్రమతికి, గురువుగారు నీతి, పరోపకారము, సౌశీల్యము, సాంఘిక ధర్మములను వివరించి చెప్పిరి. చివరకు చంద్రమతీదేవి చరిత్రమును అతి సంక్షేపముగా తెలిపిరి. ఇది స్త్రీలు, ఆడపిల్లలు తప్పక చదువదగిన ఉత్తమగ్రంథము.

వీరేశలింగం పంతులుగారు ఒక్క నవీన కథాసాహిత్యమునకుతప్ప, మిగిలిన నవ్యాంధ్ర సాహిత్యశాఖ లన్నింటికిని ఆద్యులై "శ్రీకారము" చుట్టినట్లు మనకు వారి స్వీయచరిత్ర వలన విశద మగుచున్నది. సాహిత్యమును ఆలంబనముగా జేసికొని తమప్రతిరచనయందును ప్రబోధాత్మకమైన విషయములను విరివిగా వ్రాయుచు, తమ సమకాలిక సంఘమును సంస్కరించుటకును, పునర్నిర్మించుటకును పూనుకొని, తమకుగల యేకసంథాగ్రాహిత్వముతో, అపూర్వ లోకానుభవముతో, తదాశయ సిద్ధికి శతాధిక గ్రంథములనువ్రాసి,

ఆంధ్రదేశమునకును, తెలుఁగు భాషకును మహోపకారమొనరించిన పుణ్య పురుషులు, పూర్ణపురుషులు, నవయుగాంధ్ర సాహిత్య నిర్మాతలు శ్రీపంతులుగారు. అగ్రశ్రేణికిజెందిన ప్రపంచ సాహిత్యవేత్తల శ్రేణిలో సముచిత స్థానమున నున్న ప్రతిభాపూర్ణులు వారు.

వీరేశలింగం పంతులుగారికి, ఏకలవ్య శిష్యులై, వారిచ్చిన చేయూత, ప్రోత్సాహ, ప్రోద్బలములతో గతశతాబ్దపు నవలా ప్రగతికి బహుముఖములుగా తోడ్పడి, ఆ శాఖయందు సిద్ధహస్తులై నూతన యుగోదయమునకు మార్గదర్శకులై, పూర్ణాయుష్కులై, శతాధిక గ్రంథకర్తలై, వర్ధిల్లిన కళాప్రపూర్ణ చిలకమర్తి లక్ష్మీనరసింహము పంతులుగారి భాషా సేవ, ఇరువదియవ శతాబ్దపు ప్రథమ, ద్వితీయ దశలలోగూడా అవిరళముగా లభియించుట ఆంధ్రుల భాగ్య విశేషమని చెప్పక తప్పదు.

చిలకమర్తివారు రచియించి నన్ని నవలలను ఆనాడు మరియెొకరు రచియించి యుండలేదు. 1906 వ. సంవత్సరమున ప్రఖ్యాత వంగరచయితయైన రమేష్ చంద్రదత్తు ఆంగ్లములో రచియించిన "దిలేక్ ఆఫ్ పామ్స్" అను నవలను "సుధాశరశ్చంద్రము" అను పేరుతో వారు అనువదించిరి. ఇవిగాక కృష్ణవేణి, మణిమంజరి, రాజరత్నము అనునవలలను గూడా రచియించిరి.

1907. వ. సంవత్సరమున రాజమహేంద్ర వరమునకు బిపిన్ చంద్రపాల్ వచ్చిన సందర్భమున "భరత ఖండంబు చక్కనిపాడియావు" అని ఆశువుగా చెప్పిన పద్యము, చిలక మర్తి వారి ఉత్తమదేశభక్తికి, రచనా శక్తికి నికషోపలము.

చిలకమర్తి వారు భారతీయేతిహాసమునందలి పెక్కు ఘట్టము:ను దీసికొని చారిత్రిక నవలలను వ్రాసియుండిరిగాని ఆంధ్రదేశ చరిత్రకు సంబంధించిన ఒక్క నవలయైనను వ్రాయకుండుట ఆంధ్రుల దురదృష్టమని చెప్పకతప్పదు

చిలకమర్తివారి చారిత్రిక నవలలపైన కొంత ఆంగ్ల నవలల ప్రభావము, మరికొంత వంగనవలల ప్రభావము గను పించినను, ఆయన బుద్ధిపూర్వకముగా వారి ననుసరించి యుండలేదు. అనుకరించి యుండలేదు. అది యాదృచ్ఛికముగా జరిగినపని. వారి విస్తృత గ్రంథ పఠనమువలన, అభిమాన రచయితల ప్రభావముగాని లేక వాని ఛాయలు గాని అచ్చటచ్చట, వారిగ్రంథములలో గనుపించుచుండును.

కందుకూరి, చిలకమర్తి రచనలను గుఱించికొందరు విమర్శకుల అభిప్రాయములపై పరామర్శ :-

వీరేశలింగం పంతులుగారి రాజశేఖర చరిత్రపైన గోల్డ్ స్మిత్ వ్రాసిన "వికార్ ఆఫ్ వేక్‌ఫీల్డు"; "సత్యరాజాపూర్వ దేశయాత్రల" పైన జోనాథ్‌స్విఫ్టు వ్రాసిన "గలివరు

టాల్‌వెల్సు"; స్త్రీల వినోదముకొరకు వ్రాసిన కథలపైన ఛార్లెస్‌ల్యాంబ్ మరియు ప్రహసనములపైన "షెరిడన్"ల ప్రభావము కొంతవరకు కనుపించుచున్నదని విమర్శకులు భావింతురు.

చిలకమర్తివారి సాంఘిక నవలయైన రామచంద్రవిజయ ముపైన, కందుకూరి వారి రాజశేఖరచరిత్రతో పాటు, ఛార్లెస్ డికెన్సువ్రాసిన "ఆలివర్ ట్విస్ట్", "నికోలస్ నికెల్బి", "డేవిడ్ కాపర్ ఫీల్డు", ల ప్రభావమున్నదని, అటులనే వారి చారిత్రక నవలలపైన మెడోస్ టేయిలర్ వ్రాసిన "టిప్పూ సులతాను" "తార" "చాంద్‌బీబి" అను నవలల ప్రభావము ఛాయా మాత్రముగా ద్యోతక మగుచున్నదని విమర్శకులు విశద పరచిరి. పంతులుగారు వర్ణనలు చేయునప్పుడు "స్కాటు" వలె వ్యవహరించి రని మరికొందఱు తెల్పిరి

కందుకూరి, చిలకమర్తివార లిరువురును ఆంగ్ల భాషా సంపర్కముతో, సహచర్యముతో ప్రభావితులైనను, రచనలు చేయుటలో తమ స్వతంత్ర ప్రత్యేక ప్రతిపత్తిని ప్రదర్శించి, ఆంధ్రత్వమును, తెలుఁగు దనమును ప్రతిబింబింపజేసిరే గాని తద్భిన్నముగా ప్రవర్తించలేదు. అదియునుగాక నవలయనునది తెలుఁగునాటమనము నాటుకొనిన "అంటు" వంటిదను సంగతిని మనము విస్మరించుటకు వీలులేదుగదా! ఇది ఆంగ్లభాషా ప్రభావముతో, సహచర్యములో వెలసిన నూతన సాహిత్య ప్రక్రియగదా!

తెలుఁగులో ఆనాటికి నవలా రచనము నూతనము గనుక, ఆంగ్లభాషను శ్రుణ్ణముగా అర్థము చేసికొనిన వారిపైన ఛాయామాత్రముగా ఆరచనల ప్రభావమున్నను వారి వ్యక్తిత్వమునకుగాని, అసమానమైన పాండిత్యమునకు గాని, రచనా శిల్పమునకుగాని, తెలుఁగు నవలా వైశిష్ట్యతకుగాని లోటురాదు. తెలుఁగునాట ఈ నూతన సాహిత్య వికాసమునకు వారు చేసిన భూరిసేవలను విస్మరించుటకు వీలులేదు. పందొమ్మిదవ శతాబ్దపు నవలా రచనలపైన తొలి ఉషస్సులను ప్రసరింపజేసిన ఆమహా పురుషులే, ఇరువదవశతాబ్దపు సుప్రభాతోదయమునకుగూడా మార్గదర్శకులైవర్తిల్లిరి.

కందుకూరివారు ఖడ్గవాదులు. చిలకమర్తి వారు కార్యవాదులు. గనుక వీరేశలింగం పంతులుగారు ప్రారంభించిన సరోద్యమములు, వీరిచేతిలో పూర్ణత్వము పొందిన వనుటలో సందేహములేదు. ఆమహాపురుషు లిరువురును సులభశైలిలో రచనలుచేసి, సంఘసంస్కరణకు సాహిత్యమును సాధనముగా స్వీకరించి, తెలుఁగు మాగాణమును బంగరు పంటలతో సుసంపన్నమొనరించిన పుణ్యమూర్తులు.

వీరేశలింగం పంతులుగారు ఈనూతన సాహిత్యప్రక్రియతో పందొమ్మిది, ఇరువదవ శతాబ్దములమధ్య సువిశాలమైన ప్రాతిపదికపైన వారధిని నిర్మించిరి. దానికి చక్కని

రూపురేఖలు దిద్ది, సర్వాంగ సుందరముగా నొనరించిన శిల్పి చిలకమర్తి లక్ష్మీనరసింహముపంతులు.

ఈ మహా పురుషు లిరువురినిగురించిన సాహిత్యచర్చ యింతటితో విరమింతును.

యుద్ధతంత్రమునను, సాహిత్యసృష్టియందును, చిత్ర కళాది విద్యలలోను పురుషులతోపాటు అన్నివిధముల తుల తూగగల విదుషీమణులెందరో భారతదేశము నందును, ఆంధ్రావనిలోను వేదకాలమునుండి వర్ధిల్లినట్లు చారిత్రిక దృష్టాంతరములెన్నియో మనకు గన్పించుచున్నవి.

దురదృష్టవశమున పందొమ్మిదవ శతాబ్దమున, స్త్రీల పరిస్థితి మిక్కిలి హేయముగా మారిపోయినది. స్త్రీజనాభ్యుదయమునకు రాజారామమోహనరాయలు ప్రారంభించిన మహోద్యమమును, ఆంధ్రదేశములో వీరేశలింగం పంతులుగారు చేపట్టి, వారి అభివృద్ధికి దోహదకారియగు బాల్య వివాహముల నరికట్టుటకును, వితంతూద్వాహములను ప్రోత్సహించుటకును, స్త్రీవిద్యకుగల ప్రాముఖ్యతను నిరూపించి చూపుటకును పెక్కురకములైన సాహిత్యములను సృష్టించి నారీలోకము నుద్ధరించుటకు నడుముబిగియించి కార్యరంగమున దుమికిరి. వారిదివ్య బోధనల ప్రభావముతో, నారీలోకము జాగృతమైనది. వారు వెలిగించిన ఆదివ్యజ్యోతి ఆంధ్రదేశము నలుమూలల ప్రసరించినది. ఆదివ్య చైతన్య

ములో పెక్కుమంది స్త్రీలు భిన్నశాఖలలో సాహిత్యసృష్టికి పూనుకొనిరి.

పంతులుగారి ప్రభావముతో పెక్కు నవలలు వ్రాసి ఆయుగమునకు వెలుగును ప్రసాదించిన యీ కింది రచయిత్రులను స్మరియించుట మనముఖ్యధర్మము.

శ్రీమతి బండారు అచ్చమాంబగారు అబలా సచ్చరిత్ర రత్నమాల, బీదకుటుంబము వంటి వచన గ్రంథములను వ్రాసి రచయిత్రులకు మంచిప్రోత్సాహమును కలిగించిరి.

ఆప్రోత్సాహముతో శ్రీమతులు గోపిశెట్టి లక్ష్మీనరసమ్మ "సుకేశి" "సుగుణహేళి"; శ్రీనివాసమ్మ "నేతు పిండారి" "ప్రియాన్వేషణము"; సీరము సుభద్రయాంబ "జాగిలము"; అచంట సత్యవతమ్మ "సునందిని"; రాజాంబ "చంపకమాలిని"; పులుగుర్తి లక్ష్మీనరసమాంబ "సుభద్ర" "అమర విజయము" "కమలా కుమారి" "లోకబాంధవి" "కామ మంజరి"; జూలూరి తులశమ్మ "రాణిభవాని" (రెండు భాగములు) అను నవలలను వ్రాసిరి.

ఇందరు రచయిత్రుల నాకర్షించి, యిన్ని నవలలు వ్రాయునట్లు ప్రోత్సహించిన ఘనుడు వీరేశలింగం పంతులుగారు. గరిటెను బట్టిన చేతితో కలమునుబట్టి అపూర్వ రచనా కౌశలముతో భావితరముల నారీమణులకు మార్గదర్శకులైన ఆమహిళా రచయిత్రులు చిరస్మరణీయులు.

ఆరచయి్రతుల అపూర్వ కృషివలన ఆయుగము పండు వెన్నెలలు విరిసినట్లు, బొండుమల్లెలు మొరిసినట్లు నవ్య సాహిత్యముతో కళకళలాడి, తళతళ మొరిసినది. తత్ఫలితముగా తెలుగునాడు యీ రచయి్రతుల సేవాఫలమును పొందినది.

గనుకనే వీరేశలింగంపంతులు నవయుగ సాహిత్య నిర్మాతయై, యుగపురుషుడై, ఆంధ్రప్రజలకు ప్రహ్లాదా మోదములను కలిగించుచున్నాడు. పెక్కు-నూతన సాహిత్య ప్రక్రియలను సృష్టించి, తనజాతిని మేలుకొలిపిన నవయుగ వైతాళికుడు ఆమహా పురుషుడు. తెలుఁగు జాతికి తెలుఁగు భాషకు ఆయన ఆశాజ్యోతి—

గతశతాబ్దమునను, యీశతాబ్దమునను తెలుగునాట కేవలము నవలారచనలుచేసి యీ సారస్వత శాఖాభివృద్ధికి కృషిచేసినవారి సంఖ్యచాల తక్కువ. కొందరు పద్యకవులుగా రచనలు ప్రారంభించి, యేకారణము వలననో ఆశాఖను విడిచిపెట్టి గద్యరచనలుచేసి అఖండ కీర్తి నార్జించిరి. కొందరు గద్యరచనలతో కుస్తీలుపట్టి చివరకు దానినివిడిచిపెట్టి పద్యరచన వైపు దృష్టినుళ్ళించి అందులో ఘనకీర్తి నార్జించి యుండిరి. మరికొందరు కేవలము గద్య రచనలనేచేసి అందులో చేవగల మంచి ఫలసాయమును దీసిరి. అటులనే కొందరు పద్యరచనతో జీవితాంతము పాటుపడి పదిమందిచేత "హాయి హాయి" యని పించుకొనిరి.

గద్య, పద్యములను రెండింటిని సమపాళమ్ములో నడిపి సవ్య సాచులై అఖండకీర్తి నార్జించిన మహాపురుషులును గలరు.

గనుక గతశతాబ్దములో వర్ధిల్లిన రచయితలనైనను, యా శతాబ్దిములో వచ్చు రచయితల నైనను, వారివారి సమగ్రసాహిత్య కృషిని దీసికొని చర్చించుట సాధ్యము కానిపని. దానివలన గ్రంథము పెరిగి, ఆసించిన ప్రయో జనము సిద్ధించదు.

గనుక నవ్యాంధ్ర సాహిత్య వీథులను వికసింపజేయు టకు తోడ్పడిన ప్రముఖులను, ఆంధ్రదేశమున చెల రేగిన ఆయా ఉద్యమములను స్పృసియించుచు, ముఖ్య ముగా నవలా వికాసమునకు తోడ్పడిన రచయితలను, వారిగ్రంథ రచనలను మాత్రముదీసుకొని రాబోవు భాగ ములలో పరామర్శించియుంటిని.

సాంఘిక సంస్కరణోద్యమములతోను, భాషావాద ములతోను, స్త్రీజనాభ్యుదయమునకై చేసిన ప్రబోధముల తోను దేశభక్తి ప్రపూరితమైన రచనలతోను, నిండిన యీ యుగము క్రొత్త ప్రాతల మేలుకలయికల క్రొమ్మెఱుంగులు జిమ్మ్నచున్నది. ఈ క్రొమ్మెఱుంగులతో సృష్టింప బడిన నవలా సాహిత్యము, ఆంధ్రదేశమున రాబోవు నవలా సాహిత్య స్వర్ణయుగమునకు రాచబాటల నేర్పరచి, దాని క్రమ వికాసమునకు, ప్రగతికితోడ్పడినది.

1900 – 1930

✦ తెలుగు నవలల విస్తృతి – పంస్థలు, వ్యక్తుల కృషి –

ఇరువదియవ శతాబ్దపు ప్రథమ దశయందు భారత దేశమునను, ఆంధ్రదేశమునను చెలరేగిన ఆర్థిక, సాంఘిక, రాజకీయ, సాహిత్య, సాంస్కృతిక ఉద్యమములను గురించి సంగ్రహముగా వివరించియుంటిని. ఆయా ఉద్యమముల ప్రభావమున మన ఆంధ్రదేశములో అన్నియో గ్రంథ ప్రచురణ సంస్థలు, సాహిత్య సంస్థలు, భాషాభిమానులైన సాహిత్యవేత్తలు ముందుకువచ్చి నడుము బిగించి కార్యరంగమున దూకి ఆయా నూతన సాహిత్య ప్రక్రియల ప్రగతికి తోడ్పడిరి. తెలుగు నవలా సాహిత్య వికాసమునకు అండగా నిలచి తోడ్పడిన సంస్థలను, వ్యక్తులను ఇచ్చట ముచ్చటింతును–

విజ్ఞానచంద్రికా గ్రంథమాల : మహారాష్ట్ర, వంగ భాషా వాఙ్మయములలో ఉత్తేజితుడైన శ్రీ గొ మ కొ జి లక్ష్మణరావు పంతులుగారు మాతృదేశమునకు తిరిగి వచ్చిన పిమ్మట మన తెలుగు సాహిత్యము ఆ స్థాయిని అందుకొను

నట్లు ఆధునిక విజ్ఞానమునకు తగిన ప్రోత్సాహము నిచ్చుటకు ప్రయత్నించెను. ఆయన ప్రయత్నమువట్ల రాజా శ్రీ నాయని వేంకటరంగారావు బహద్దూర్, శ్రీ రావిచెట్టు రంగారావు, ఆంధ్ర పితామహ శ్రీ మాడపాటి హనుమంతరావు, శ్రీ ఆచంట లక్ష్మీపతి మొదలైన ప్రముఖులు శ్రద్ధచూపిరి. వారి తోడ్పాటుతో, ప్రోత్సాహముతో 1908 వ. సంవత్సర పర్యంతమున హైదరాబాదు నగరములో విజ్ఞానచంద్రికా గ్రంథమాలను నెలకొలిపిరి. కారణాంతరముల వలన దాని కార్యస్థానము 1096 వ. సంవత్సరమున మద్రాసునకు మారిన పిమ్మట దాని కార్యరంగము విస్తృతమైనది.

చారిత్రక గ్రంథములకు, విజ్ఞాన శాస్త్రసంబంధమైన రచనలకు, నవలా సాహిత్యమునకు, విమర్శనాత్మక గ్రంథములకు సంఘములో తగిన ప్రోత్సాహము లేనందున "విజ్ఞాన చంద్రిక" ఆలోటును భర్తీ చేయుటకు సంకల్పించినది. ఈ ఆధునిక విజ్ఞాన సంబంధమైన మంచి గ్రంథములు వ్రాసిన వారికి బహుమతులను ప్రకటించినది. మన చర్చనీయాంశము నవలా సాహిత్యము గనుక ఆ సంస్థపతమున వెలువడిన నవ లలనుగురించి ముచ్చటింతును శ్రీ వేలాల సుబ్బారావుగారి రాణిసంయుక్త; శ్రీ భోగరాజు నారాయణమూర్తిగారి విమ లాదేవి, అల్లాహో అక్బర్, చంద్రగుప్తుడు, అస్తమయము, ఆంధ్రరాష్ట్రము; శ్రీ కేతవరపు వేంకటశాస్త్రి, రాయచూరు యుద్ధము, ఇచ్ఛినీకుమారి. పూర్ణానంద, అగ్రహారం; దుగ్గి

రాల రాఘవచంద్రయ్య చౌదరి విజయనగర సామ్రాజ్యము: ఎ. వి. నరసింహము పంతులు, పాతాళభైరవి వంటి ఐతిహాసిక నవలలెన్నియో బహుమతుల నందుకొని ఆగ్రంథమాల పఱమున వెలుగులోనికి వచ్చినవి. "విజ్ఞానచంద్రిక" వెలువరించిన నవలల మూలమున ఆంధ్రదేశ చరిత్రలో మరుగుపడిపోయిన చారిత్రక సంఘటనలెన్నియో బయల్పడి, ఆంధ్ర చరిత్ర రచనకు దిక్కులి లోడ్డనివి.

శ్రీ భోగరాజు నారాయణమూర్తి వ్రాసిన 'విమలాదేవి' చాల విచిత్రమైనది. ఇది 1910 వ సంవత్సరములో ఆగ్రంథమాల పఱమున బహుమతి నందుకొన్నది. రాజపుత్ర స్థానమునకు సంబంధించిన చారిత్రక విషయమును విశదపరచు ఈ నవల ఔరంగజేబునకు ప్రతిస్పర్ధియైన రాజసింహుడు ప్రదర్శించిన సాహస కార్యములు, అతని భార్య విమలాదేవి గన బరచిన స్థైర్య, శౌర్యములు, అమెకుగల ప్రగాఢమైన హిందూమతాభిమానము ఇందులో చక్కగా ఆవిష్కరింపబడినది.

ఔరంగజేబు చక్రవర్తి అంతఃపురమున జరిగిన చిత్ర విచిత్రమైన వ్యవహారములు హృద్యముగా వర్ణింపబడినవి. అతని పట్టమహిషి దయపురికిని, చెల్లెలగు లోపనారకునుగల మనస్పర్ధలు, కాల్పణ్యములు కనులకు గట్టునట్లు చూపబడినవి. చంద్రావతియొక్క పవిత్ర చరిత్ర, ఇందిర, దుర్గాదాసుల రాజభక్తి, దేశభక్తి వారి త్యాగనిరతి, ధర్మాసక్తి, గోలు

గొండలోని అక్కన్న మాదన్నల వైభవములు రమణీయముగా చిత్రితమైనవి. ఆబూపర్వతముపైన వేఁచేసియున్న శ్రీ అచలేశ్వరస్వామి మందిరములోనున్న వైకుంఠమౌగి చేసిన అద్భుత కార్యక్రమములు మనోహరముగా చిత్రితమైనవి. ఇందలి కథయొక్క ఎత్తుగడ, నిర్వహణ విధానము, పాత్ర చిత్రణ, ప్రకృతి వర్ణనలు సుందరాతి సుందరములై వెలుగొందినవి. ఖయిబరు కనుమల రామణీయకత, ఆరావలీ పర్వత శోభ అనుపమపూర్వములు.

శ్రీ వేలాల సుబ్బారావు, రాణి సంయుక్తయు 1910 వ సంవత్సరమున వెలువడినవే. పృథ్వీరాజు, రాణి సంయుక్తల యొక్క దేశాభిమానము, ప్రేమోదంతము, పరాక్రమములు అద్భుతముగను, రసవంతముగను ఇందు మలచబడినవి.

హైందవసామ్రాజ్య పతనమునకుగల కారణములు, తురుష్కులు ఈదేశమునకు వచ్చినప్పటి పరిస్థితులు, ఈ నవలయందు చక్కగా వివరింపబడినవి.

రాణిసంయుక్త నవలయందలి కథ శౌర్య, శృంగార రసముల నాశ్రయించి నడచిన విధమును ఘనముగా వర్ణించి చూపెను.

నాయికా, నాయకులైన సంయుక్త, పృథ్వీరాజుల దృఢానురాగము, వారు ప్రదర్శించిన సాహస కార్యక్రమములు, నిగ్రహానుగ్రహములు, పఠితలకు విభ్రమాశ్చర్యములు కలిగించుచుండును. సంయుక్త గురువైన దేవశర్మ నెరపిన

పరీక్షా సాహసములు, యుక్తి ప్రయుక్తులు మిక్కిలి అద్భుత ముగను, ఆశ్చర్యజనకముగను ఉండును.

ప్రత్యేకాంధ్రరాష్ట్ర వాంఛ ప్రజా హృదయములలో వేళ్ళూనుకొనుచున్న సమయమున ఆ సమస్యను బలపరచుచు శ్రీ భోగరాజు నారాయణమూర్తి "ఆంధ్రరాష్ట్రము" అను నవలను వ్రాసి ఆ సమస్యకు గల ప్రాముఖ్యతను, చాటి చెప్పెను.

విజ్ఞాన చంద్రికా గ్రంథమాల సంవత్సరములకు సులువు వచన గ్రంథముల చొప్పున ప్రకటించి, ఇంగ్లీషు రానివారికి ఆ భాషలోగల మహత్తర విజ్ఞానము వంటిని, తెలుగులో అందించుటకు చక్కని కృషి చేసినది. ప్రతి ఉత్తమ నవలకు ఐదువందల రూపాయల బహుమతిని ఏర్పాటుచేసి విరివిగా నవలా ప్రచారము జరుగునట్లు అవిరళకృషి సలిపినది.

స్త్రీలకును, పామరులకును అందుబాటులో నుండునట్లు సులభశైలిలో చారిత్రక నవలలతోపాటు, దేశ చరిత్ర, ప్రకృతి శాస్త్రము, మహాపురుషుల జీవిత చరిత్రలు, ఆంగ్లభాష యందలి ఉత్తమ గ్రంథములను ఎన్నింటినో భాషాంతరీకరణము చేయించి, సరసమైన ధరలతో గ్రంథములు అందరికి అందునట్లు శ్రద్ధవహించిన ఘనుడు శ్రీ కొమర్రాజు లక్ష్మణరావు పంతులుగారు.

ఈ విజ్ఞానచంద్రికా గ్రంథమాల తమ ఉత్తమ ప్రచుర

ణలద్వారా ఆంధ్రదేశము నాలుగు చెరగులలో విజ్ఞానచంద్రి కలను వెదజల్లి ఆంధ్ర ప్రజలకు భూరి సేవలు చేసినది.

ఆంధ్రప్రచారిణీ గ్రంథమాల : 1911 వ. సంవత్స రమున తణుకులో సారస్వత ప్రియులు, ప్రగతి శీలురు నైన శ్రీ కొవ్వూ్వరి చంద్రారెడ్డి అధినేతృత్వమున శ్రీ అయ్యగారి నారాయణమూర్తి పర్యవేక్షణములో ఆంధ్రప్రచారిణీ గ్రంథ మాల నడచినది. దీని పక్షమున వసుమతీ వసంతము, దుర్గేశనందిని, చతుర చంద్రహాస, ప్రమదావనం, లక్ష్మీరూపా యల వంటి నవలలెన్నియో వెలువడినవి.

ఈ గ్రంథమాల పక్షమున వెలువడిన నవల లన్నియు పరివర్తనములే. బెంగాలి, కన్నడ, ఆంగ్లభాషలనుండి ఎన్నియో గ్రంథములు పరివర్తన చేయబడినవి.

ప్రేమదావనం, ఆంధ్రచరిత్రకు సంబంధించిన ఉత్తమ నవల. కథ చిన్నదైనను నాలుగువందల పుటల నాక్రమించి నది. ఇందు ప్రేమకు అధిక ప్రాధాన్యత నీయబడినది.

ప్రథమమున ప్రేమ ప్రధానముగా పెక్కు నవలలు ఈ గ్రంథమాల పక్షమున వెలువడినను క్రమముగా అపరాధ పరిశోధకనవలలవైపు మొగ్గుచూపి తత్సంబంధమైన వాఙ్మ యము నిండా సృష్టించినది. ఆనాడు తెలుఁగు భాషలో ప్రచురింపబడిన నవలలలో $\frac{3}{4}$ వంతులు ఈ గ్రంథమాల పక్ష మున ప్రకటింపబడి ప్రఖ్యాతి గాంచినవి.

వేగుచుక్క గ్రంథమాల: ఆంధ్ర విశారద శ్రీ కాపి ధర్మారావుగారు బరంపురములో ఈ వేగుచుక్క గ్రంథమాలను స్థాపించిరి.

శ్రీ వంగూరి సుబ్బారావుగారి "ప్రభాతము" వంటిదే ప్రొద్దుపొడుపు నవల. దీనిలో ఆంధ్రసాహిత్య చరిత్ర ఇతివృత్తము. నేనే, వాడే వీడు, వంటి ఉత్తమ శ్రేణికి చెందిన డిటెక్టివ్ నవలలు ఎన్నో ఆ సంస్థపఱమున వెలువడి బహుళ ప్రజాదరణను సంతరించుకొన్నవి.

రామవిలాస గ్రంథమాల: రామవిలాస గ్రంథమాల అను ప్రచురణ సంస్థనుభాషాభిమానులైన శ్రీ చెలికాని లచ్చారావుగారు చిత్రాడలో ప్రారంభించి, నవలా వాఙ్మయ ప్రగతికి కొంత తోడ్పడిరి. శ్రీ వంగూరి సుబ్బారావుగారి "ప్రభాతం" అను ప్రముఖ నవల ఆ సంస్థ పఱమున వెలువడిన నవలలన్నిటిని మణిమకుటము. ఆంధ్రుల చరిత్ర, ఆంధ్ర సాహిత్యచరిత్ర దీనియందలి ప్రధాన ఇతివృత్తము. ఆనాడు వెలువడిన నవలలలో ఇది ఉత్తమోత్తమమైనదని ఆంధ్రదేశమున కీర్తి గడించుకొనినది.

సరస్వతీ గ్రంథమాల: రాజమహేంద్రవరములో శ్రీ అద్దేపల్లి లక్ష్మణస్వామి నాయుడుగారు సరస్వతీ గ్రంథమాలను స్థాపించి, నవలా సాహిత్య ప్రచారమునకు భూరి సేవలు సలిపిరి. ఆ గ్రంథమాల పఱమున స్వతంత్ర నవలల

కన్న ఇతర భాషలనుండే పెక్కు నవలలు అనువదింపబడి ప్రచురింపబడినవి. శ్రీ జొన్నలగడ్డ సత్యనారాయణమూర్తి గారు అధిక సంఖ్యలో అపరాధ పరిశోధక నవలలు వంగ భాషనుండి అనువాదము చేసి ఆంధ్రమహాజనుల కందించిరి.

ప్రభాతికుమార ముఖోపాధ్యాయ్ రచించిన "కుంకుమ భరణి" నవలను సాహితీ సమితి సభాపతి శ్రీ తల్లావజ్ఝుల శివశంకరశాస్త్రిగారు (స్వామి శివశంకరులు) వాడుక భాషలో మనోహరముగా నుండునట్లు అనువాదముచేసి, ఆంధ్ర భారతికి చిరస్మరణీయమైన గళాభరణమును సమకూర్చిరి.

అనాటి ప్రగతిశీలురైన రచయితలు స్వభాషాభిమానముతో ఇతర భాషల నెన్నింటినో అభ్యసించి, అయా భాషలలోని ఉన్నతశ్రేణి రచనలను యథా మాత్మికముగా అనువదించుటకు పూనుకొనిరి. ఈ మహోద్యమమునకు పిఠాపురము కేంద్రమై వర్ధిల్లినది. శ్రీ వేంకట పార్వతీశ్వరకవులు, బంకించంద్రుడు రచించిన దుర్గేశనందిని, నవాబు నందిని, యుగళాంగుళీయకం, కృష్ణకాంతుని మరణశాసనము, మొదలైన నవలల నెన్నింటినో మనోహరమైన తెలుగుభాషలోనికి అనువాదముచేసి ఆంధ్ర యువతీయువకులకు మంచి ప్రోత్సాహము నిచ్చిరి. ఆంధ్రపత్రికాధిపతి గ్రంథమాల పద్ధతిని రెండేసి మాసములకొక నవల చొప్పున మొత్తము రెండు వందల నవలలను వారు ప్రకటించిరి.

శరత్ అరక్షణీయ, అభాగిని వంటి ప్రథమశ్రేణి నవలలు ఆరోజులలోనే తెలుఁగు పాఠకుల ఆదరాభిమానములను చూరగొనినవి. విశ్వనివి రవీంద్రుని నౌకాభంగము, గోరా, వంటి నవలల నన్నింటినో వారు తెలుగువారికందించిరి.

"గోరా" నవల మన ఆంధ్రదేశములో బ్రహ్మసమాజ భావ వ్యాప్తికి గొంతవరకు పనిచేసినది. ఆంధ్ర పాఠకులు ఆ నవలను మిక్కిలి ఆదరించిరి.

శ్రీవేంకట పార్వతీశ్వర కవులు కేవలము అన్యభాషల నుండి అనువాదముచేసి తృప్తి జెందక, వ్యాఖ్యల, భాష్య మందిరము, ప్రమదావనము వంటి స్వతంత్ర రచనల నన్నింటినో చేసి, నవలాసాహిత్య విస్తరణకు పాటుపడిరి. వీరితోపాటు శ్రీ చాగంటి శేషయ్య, చిల్లరిగ శ్రీనివాసరావు వంటి ప్రముఖ రచయితలెందరో అమార్గమున పయనించి, నవాలాసాహిత్య వికాస కృషిలో ప్రశంసనీయమైన పాత్రను వహించిరి.

ఆరోజులలోనే మాయావి, మాయావిని, హత్యా రహస్యము, జీవన్మృత రహస్యము మొదలైన అపరాధ పరిశోధక నవలలు వెలువడినవి. ఇవి అనాడు తెలుఁగువారిని ఎంతో ఉత్తేజపరచినవి. ఈ నవలలన్నియు పాఠకులకు మించి అభిరుచిని కలుగజేసినవి. కొందరు ఉత్సాహవంతులైన రచయితలు స్వతంత్రమైన అపరాధపరిశోధక నవలలను గూడ

రచింప దొడగిరి.

1913–14 సంవత్సరములలో శ్రీ శివశంకరశాస్త్రి మొక్క నవలలువ్రాసి ఈసాహిత్యశాఖకు ఎనలేని సేవలు జేసియుండిరి. రఘునాథజీ, తేజపింగు మొదలైనవి వారి తొలినాటి నవలలు.

వ్యక్తుల సారస్వతసేవ ఆకోజులలో నవలలోనే ప్రారంభమగుచుండెడిది. నూతన భాషా సారస్వతముల నన్నింటిని బాగుగా ఆకళింపుచేసుకొనిన వ్యక్తి శివశంకర శాస్త్రి, ఇతరదేశములలో ఈనూతన సాహిత్య ప్రక్రియల ద్వారా జరుగుచున్న మహత్తర కృషిని గమనించి, మన దేశమునను, మన సంఘమునను అట్టి మార్పు అవసరమని గ్రహించిన ప్రగతిశీలి ఆయన. భాషా సారస్వతములు నూతన విజ్ఞానమునకు లోబడినప్పుడే ప్రగతి సాధ్యమని గ్రహించిన దూరదృష్టిగల మేధావి. భాషలోను, భావములోను, ఆలోచనలోను, కార్యక్రమములలోను నవ్యత్వమును కాంక్షించి, తదభివృద్ధికే ఆయన చేసిన సేవ సరుపమానమైనది. ఆనాడు నవలాసాహిత్య ప్రగతికి కృషిచేసిన మూలపురుషులలో శాస్త్రిగారి పేరు చేర్చివనే ఆ జాబితా సమగ్రమై భాసింపగలదు.

శ్రీ తిరుపురారిభొట్ల వీరరాఘవస్వామిగారు వంగభాష నుండి ఎన్నియో నవలలు అనువదించిరి వారి భాష సలక్షణ

మైనది. భావములు గంగాప్రవాహ సదృశమైనవి. వారి నవలలలో కపాలకుండలి, పేర్కొనదగిన ఉత్తమ నవల. వంగభాషను అభ్యసించి, యథా మాతృకముగా వారు రచనలు చేసిరి.

ఈ రోజులలోనే క్రియక్రియముగా రైల్వే సాహిత్యము గూడ మొగ్గతొడగనారంభించినది.

ఈ ప్రథమ దశలో, 1900–1910 సంవత్సరముల మధ్యగల కాలమును అనువాదయుగమని మనము పేర్కొనవచ్చును. అయినను కొన్ని అనుసరణలు గూడ వచ్చినవి. అనువాదములు, అనుసరణలు ఎక్కువగా రావడముచేత దీనికి అనువాదయుగమని మనము పేరు పెట్టినను 1920 సంవత్సరము తరువాత పరిస్థితులు మారినవి. ఎన్నో స్వతంత్ర రచనలు వెలువడసాగినవి. ప్రతిభావంతులైన రచయితలు రంగస్థలము పైన అవతరించి రచనలు అసంఖ్యాకముగా చేయనారంభించిరి. దీనికిగల ముఖ్యకారణము జాతీయోద్యమము. మహాత్ముడు సత్యాహింసలను నూతనాస్త్రములతో, నిర్మాణకార్యక్రమముతో ఆసేతు శీతనగము జాగృతము చేసి, ఒక నూతనోత్సాహమును, ఒక నూతన తేజస్సును ప్రసాదించెను. ఆయన స్వాతంత్ర్య పాంచజన్యమును పూరించిన పిమ్మట జాతీయోద్యమము ముందెన్నడు కనివిని ఎరుగనంతటి నూతనోత్సాహముతో బహుముఖములుగా విస్తరించినది.

ప్రజలు ఆయన అడుగుజాడలలో పయనించసాగిరి. రచయి తలు ఆ మహానాయకుని సిద్ధాంతములను, ప్రవచనములను, నిర్మాణ కార్యక్రమ సూత్రములను, ఇతివృత్తములుగా గ్రహించి అసంఖ్యాకముగా రచనలు చేయుట కుద్యమించిరి.

తెలుఁగునాట మహాత్ముని ఆదేశము ననుసరించి సహాయ నిరాకరణోద్యమము, సత్యాగ్రహోద్యమము రెండు ను మున్నగముగా సాగినవి. తెలుఁగువారు స్వాతంత్ర్య సము పార్జనలో, దేశభక్తిలో, నిర్మాణ కార్యక్రమములను ఆచ రించుటలో చూపిన ప్రతిభను, నెరపిన సాహస కృత్యములను ఇతివృత్తముగా స్వీకరించి, ప్రముఖ దేశభక్తులు, సుప్ర సిద్ధ ఆంధ్రనాయకులు శ్రీ ఉన్నవ లక్ష్మీనారాయణ పంతులు గారు 1921 వ. సంవత్సరమున "మాలపల్లి" అను గొప్ప సాంఘిక నవలను ప్రాసి ఆంధ్రనవలా సాహిత్యమునకు గొప్ప గౌరవమును సమకూర్చిరి. ఇది స్వతంత్ర ఆంధ్ర నవలాసాహి త్యమునకు మణిమకుటము. ఈనవలలో ఆనాటి ఆర్థిక, సాంఘిక, రాజకీయ పరిస్థితులను వాస్తవ దృక్పథముతో చిత్రించి శ్రీ లక్ష్మీనారాయణగారు ఆంధ్రులకు ఒక స్వతంత్ర ప్రతిపత్తి గల మహత్తర నవలను అందించి, యావదాంధ్రులు తనకు కృతజ్ఞతాబద్ధులుగా నుండునట్లు చేసికొనిరి.

"మాలపల్లి" గాంధీమహాత్ముని పవిత్ర ఆశయములకు, రాజకీయ సిద్ధాంతములకు పతాక. శ్రీ లక్ష్మీనారాయణగారు

దీనిలో ఆనాటి గ్రామీణ జీవితమును, ఆ జీవితములో నుండు ఒడుదుడుకులను, కష్టలు, పగలు, తెగలు, హరిజనులు వాని విభిన్నసమస్యలు, వారి ప్రగతికి ఆనాటి సాంఘిక సంస్కర్తలు అడుగడుగున ఎదుర్కొనిన చిక్కు సమస్యలు ప్రతిభావంతముగను, రసవంతముగను చిత్రించిరి. ఈ నవలా రచనలో ఆయన తన బహుముఖీనమైన ప్రజ్ఞను, ఉపజ్ఞను పెల్లడించి తెలుఁగు నవలా సాహిత్యమునకు స్వతంత్ర ప్రతిపత్తిని ప్రసాదించి, అనువాదములనుండి, అనుసరణములనుండి మనలను వేరొకవైపుకు మళ్ళించి, ఒక రాచబాటను నిర్మించిరి. ఆపిమ్మట మన నవలాసాహిత్య ప్రగతి సల్లేరుకాని బండివలె సాగిపోయినది. ఆంధ్ర నవలా సాహిత్యమున "మాలపల్లి" నిరుపమానమైన ఉత్తమ నవల. దీనికి ఉజ్జ్వలమైన స్వతంత్ర ప్రతిపత్తిగల నవలలు ఎన్నియో ఆ పిమ్మట వచ్చినను దీని స్థానము ఒక ప్రత్యేకమైనదని విమర్శకులు ముక్త కంఠముతో నుడివిరి.

"మాలపల్లి" సంగవిజయమని వేరొక చెప్పనక్కరలేదు. రామదాసాశ్రయమైన, ఈ నవల ధర్మ సంరంభమునకు కేంద్రము. సంగదాసు సంకల్పితమైన శ్రీ రామ మందిరము ధర్మ సంస్థాపనాలయము. మాలపల్లియందు లక్ష్మీనారాయణ గారు సంకల్పించిన నవజీవన నిర్మాణ విధానము, ఆంధ్ర సాహిత్య సంస్కార రంగమున నూతనాధ్యాయమును నెల

కొలుపుచున్నది. రాజులు మారినను, రాజ్యములు అంత రించిపోయినను, కులమతపరిభావములు తగ్గినను, గ్రామసీమలలో ప్రజాసాహిత్యము నవనవోన్మేషముగా వికాసవంత మగుచున్న విధమును "మూలపల్లియందు" సరసముగను, సమగ్రముగను వర్ణింపబడినది.

మూలపల్లి నవలయందలి "మంగళాపురము" మానవ ధర్మమును, కళ్యాణ జీవనమును, కన్నులకు కట్టునట్లు ప్రదర్శించు మంగళాపురమే. రామదాసు, మహాలక్ష్మమ్మ, రామానాయుడు, సంగదాసు, జోతి చౌదరయ్య, కమల, పౌలు, పాదరీలు మానవధర్మ నిర్వాహకులు.

ఈ నవలలో కర్మయోగము భక్తియోగరూఢమై, అత్యుత్తమమైన మానవధర్మ పరిణామమునకు సాధనమైనది. ఇందలి రామదాసు కథ భారతమునందలి ధర్మవ్యాధుని కథతో సర్వవిధముల పోలిక కలిగియున్నది. ఈ రామదాసు "మూలపల్లికి" సంగమ విజయమునకు హృదయము. రామదాసు నిరంతరము అనుభవించిన దుఃఖ పరంపరలు, రాగద్వేషములు, తన మమకార అహంకారములను, మానాభిమానములను జయించుటకు కారణభూతమై ఆత్మ విజయమునకు సాధనములైనవి.

రామదాసునకు ఆస్తి అంతయు పోవుట, సంగదాసు బలవన్మరణము, జైలు సెటల్మెంటునందు నిర్బంధములు,

జోతి ఆహ్లాదాసుల సహగమనము, భార్య మరణము, నిర్బంధ దండనములు కర్మయోగ సాధ్యమైన ఆత్మోద్ధరణ మునకు మిక్కిలి తోడ్పడినవి. రామదాసు విజయ కళాలకు కులపతియగుట, పుంగదాసు ఆత్మత్యాగముతో విజయ కళా శాల స్థాపనము మొదలైన విషయములన్నియు ధర్మ విజయ మునకు మూలభూతములై నవలకు మంచి రసపట్టును, కథా కథన నిర్వహణకు స్ఫూర్తిని కలిగించుచున్నవి.

మాలపల్లి నవలయందు సాంఘిక, రాజకీయ, ఆర్థిక పరివర్తనములు సముచితముగను, సరసముగను, రసస్ఫోరకముగను నిర్వహింపబడినవి ఈ నవల నవరసభరితమై, పర్యాంగసుందరమై ఆంధ్రకళా సాహిత్యరంగమునకు వన్నెను పెట్టుచున్నది. నేటి తెలుఁగువారికి, నాటి తెలుఁగుల జీవిత విధానమును, ఆచార వ్యవహారములను, నాగరికతా వైభవ ములను సంపూర్ణముగను, సాకల్యముగను వివరించి చూపు చున్నది. ఆంధ్రభాషలో అజరామరమైన కీర్తి ప్రతిష్ఠలను ఆర్జించుకొని, తెలుఁగువారి హృదయసీమలలో శాశ్వతత్వ మును నింపుకొని వెలుగొందు ఉత్తమోత్తమమైన సాంఘిక నవల మాలపల్లి.

ఈ నవలయందలి ప్రతి పాత్ర, ప్రతి సన్నివేశము, హృదయంగమముగానుండి స్వయం సంపూర్ణమై, ఆదర్శ వంతమై అలరారుచున్నవి. ఇందలి ప్రతి ఒక్క పాత్ర సజీవ

ముగను, సహజముగను మన కన్నులకు గన్పట్టుచుండును. ఆయా పాత్రలు తమ మానసిక వ్యథలను, తమ గాథలను, బాధను, మనకు వివరించి చెప్పుతూవున్నట్లు రూపు కట్టు చుండును.

ఈ నవలా ప్రాదుర్భావముతో, ఆంధ్ర నవలారంగము నకు మంచి పుష్టి చేకూరినది. భావి రచయితలకు చక్కని రాచబాట ఏర్పడినది. ఇండలి భాష, భావములు, వర్ణనలు మిక్కిలి పటుత్వము గలిగియుండి, పలువురు రచయితలను ఆకర్షించి, ఆ మార్గము వెంట నడిపించినది.

మొత్తముపైన "మాలపల్లి" నవల తెలుగు నవలా రచనయందు, ఆదర్శవంతమైన ఉత్తేజమును కలిగించి, ఒక విధమైన నూతన సంచలనమును ప్రేరేపించి, ఎందరో రచయితలను మహోత్సాహపరచి, మరో మలుపుకు తిప్పి తెలుగు నవలా వికాసమునకు మార్గమును సుగమము చేసినది.

ఈ నవల గాంధీజీ ప్రారంభించిన పెక్కు ఉద్యమములకు ప్రతినిధియైనది. జాతీయభావములను ప్రజలలో కలిగించి, స్వాతంత్ర్య సంగ్రామమున తమ సర్వస్వమును తృణప్రాయముగా అర్పించునట్లు ప్రేరేపించినది. ఆంధ్రనవలా సాహిత్య రంగమున ఉన్నతాదర్శములకు, ఉత్తేజకరమైన భావములకు, దేశభక్తికి ఇది ఉన్నత సోపానమై భాసించినది.

ఇది వాడుక భాషలో వచ్చిన ఉత్తమోత్తమ మైన నవల. శ్రీ లక్ష్మీనారాయణగారి దేశభక్తికి, ఆదర్శ జీవిత మునకు దర్పణము. ఆంధ్ర నవలాసాహిత్యరంగమున బంగరు పంటలను పండించుటకు తోడ్పడి, ప్రత్యేక విశిష్టతతో ప్రకాశించుచున్న తెలుఁగువారి కాణాచి. ఆతరువాత వెలు వడిన నవలన్నింటికి ఇది చుక్కానియై భాసించినది.

గాంధీజీ రాజకీయ నాయకత్వమును చేపట్టకముందే మున తెలుఁగు రచయితలు దూరదృష్టితో, మానవతా దృష్టితో హరిజన సమస్యకు అధిక ప్రాధాన్యతనిచ్చి నవలలు వ్రాసిరి. ఆసమస్యకు తెలుఁగుగడ్డపైన ప్రప్రథమముగా అధిక ప్రాధాన్యతనిచ్చి నవలారచన చేసినవాడు శ్రీ తల్లాప్రగడ సూర్యనారాయణగారు. వారి హేలావతి 1918 వ. సంవత్స రములో ప్రకటితమైనది. ఇదే సమస్యను గ్రహించి శ్రీ వేంకట పార్వతీశ్వర కవులు 1918 వ. సంవత్సరములో "మాతృ మందిరం" అన్న పేరుతో నవలను వ్రాసి కృతకృత్యులైరి. రంగన్న అను పేరుగల బ్రాహ్మణ యువకుడు ముత్యాలు అను పేరుగల ఒక అస్పృశ్యుని కుమార్తెను వివాహమాడిన ఉదంతమును ఇందులో చిత్రించిరి. ఇటువంటి సాంఘిక సమ స్యను ఇతివృత్తముచేసి, ఆ రోజులలో నవల వ్రాయటము అంత సులభమైన పనికాదు. అది ఎంతో సాహసోపేతమైన కార్యము.

1918 వ. సంవత్సరములో శ్రీ విశ్వనాథ సత్యనారాయణగారు "అంతరాత్మ" అను సాంఘిక నవలను, 1925 లో "ఏకవీర" అను చారిత్రిక నవలను వ్రాసిరి.

1920 వ. సంవత్సరములో "ఓబయ్య" అను పేరుగల నవలను శ్రీ వేలూరి శివరామశాస్త్రిగారు జాతీయోద్యమ సమరమును ఇతివృత్తముగా తీసికొని రచియించిరి. జాతీయోద్యమమునుస్పృశించుచు వెలువరింపబడిన తెలుఁగుతొలి నవల ఇది.

మాక్సింగోర్కీవ్రాసిన "మదర్" రష్యన్ నవలలలో ఉత్తమోత్తమమైనది. ఈ నవల రష్యాలో జరిగిన విప్లవమును కళ్ళకు కట్టినట్లు చూపును. దీనిని సుప్రసిద్ధ దేశభక్తులు శ్రీ కొప్పర్తిడి లింగరాజు "అమ్మ" అను పేరుతో 1921 వ. సంనత్సరములో తెనుగుచేసి ముద్రించిరి. ఇది పరళ గ్రాంధిక భాషలో నడచినది. దీని ప్రభావము తెలుఁగువారిపై బహుళముగా పడినది.

శ్రీ పాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారు "మిధునాను రాగము" అన్న నవలను 1914 వ సంవత్సరములో వెలువరించిరి.

ధీరేంద్రపాల్ వ్రాసిన ప్రఖ్యాత రచన 'మొగలాయి' దర్బారునకు 1925 వ. సంవత్సరములో శ్రీ మొపలిగంటి సంజీవరావుగారి అనువానుదము చాల ప్రఖ్యాతమైనది.

ఈ కాలములోనే శ్రీ వేలూరి శివరామశాస్త్రిగారు పుంఖాను పుంఖముగా శరత్ రచనలను తెలుఁగులోనికి అనువదించి ఆంధ్ర పాఠకులను ఉత్తేజపరచిరి.

శ్రీ మొక్కపాటి నరసింహశాస్త్రిగారు "భారిష్టరు పార్వతీశం" అను పేరుగల నవలను 1925 వ. సంవత్సరములో వ్రాసిరి. ఇది హాస్య ప్రధానమైన చక్కని నవల.

శ్రీ గుడిపాటి వేంకటచలం 1926 వ. సంవత్సరములో "శశిరేఖ" అను నవలను వ్రాసి ప్రచురించిరి.

మదరాసులో శ్రీ చక్రపాణి, శ్రీ నాగిరెడ్డిగారలు "యువ ప్రచురణలు" అన్న పేరుతో ఒక సాహిత్య సంస్థను నెలకొలిపి, శ్రీ చలం మొదలైనవారి నవలల నన్నింటినో ముద్రించిరి.

1919, 20 వ. సంవత్సరములో "సాహితీసమితి" ఏర్పడినది. దీని సభాపతి, బహుభాషావేత్త, బహుగ్రంథకర్త, బహుముఖ ప్రజ్ఞాశాలి అయిన శ్రీ శివశంకరశాస్త్రిగారు. ఇందులో శ్రీ త్రిపురాభొట్ల వీరరాఘవస్వామి, శ్రీ నోరి నరసింహశాస్త్రి, తెలికిచర్ల వేంకటరత్నం మొదలైన వారెందరో సభ్యులుగావుండి గేయ, పద్య కవితలతోపాటు, ఈ నవలా సాహిత్యప్రగతికి కూడ ఎంతో పాటుపడిరి.

దేశోద్ధారక శ్రీ కాశీనాధుని నాగేశ్వరరావు పంతులు గారు 1923 వ. సంవత్సరములో ఆంధ్ర గ్రంథమాలను స్థాపించి ఆంధ్రభాషాభ్యున్నతికి మిక్కిలి కృషిచేసిరి.

ఈ గ్రంథమాల పట్టుమునసే "మాలపల్లి" నవల ప్రచురితమై నది. ఈ నవలకు శ్రీ నాగేశ్వరరావుగారు విలువైన పీఠికను వ్రాసిరి.

1920 వ. సంవత్సరము తరువాత అనువాదములు, అనుసరణలతోపాటు మౌలికమైన స్వతంత్ర రచనలు కొంతముగా అధిక సంఖ్యలో వెలువడినవి. ఈవిధముగా క్రీ. శ. 1920 నుండి 1930 వరకు, పదుగు, పేకలవలె అనువాదములు, మౌలికమైన స్వతంత్ర రచనలు విశృంఖలముగా వెలువడదొడగినవి.

ఈ తొలి దశలో అనగా 1901 - 1930 సంవత్సరముల మధ్య వెలువడిన తెలుఁగు నావలా సాహిత్య ప్రగతికి అధికముగా తోడ్పడినవారి చిలకమర్తి, వేంకట పార్వతీశ్వర కవులు, కేశవరపు వేంకటశాస్త్రి, భోగరాజు నారాయణమూర్తి, చాగంటి శేషయ్య, తల్లాప్రగడ సూర్యనారాయణ, శ్రీ ఉన్నవ లక్ష్మీనారాయణ, శివశంకరశాస్త్రి, వేలూరి శివరామశాస్త్రి మొదలైన ప్రముఖులు ఎందరో గలరు. వీరిలో కొందరు అనువాదములను చేసియు, చారిత్రక నవలలను, సాంఘిక నవలలను వ్రాసియు, దేశభక్తి పూరిత నవలలను సృష్టించియు మన తెలుఁగు నవలా సాహిత్య ప్రగతికి ఎనలేని సేవలను చేసిరి.

మన తెలుఁగునవలా సాహిత్య చరిత్రలో కాల్పనికోద్య

మువునకు ప్రతిబింబములై తెలుగొందినవారు శ్రీ విశ్వనాధ సత్యనారాయణ, శ్రీ అడివి బాపిరాజు, గుడిపాటి వేంకట చలంగారలు. ఈ మువ్వురిపైనను ఆంధ్రనవలా సాహిత్యము నందలి కాల్పనికోద్యమ ప్రభావము, హేతువాద సిద్ధాంత ముల ప్రభావము మనకు ప్రస్ఫుటముగా గోచరమగు చుండును. అయినను ఈ త్రిమూర్తులు తెలుఁగు నవలా సాహిత్యరంగమున నూతనాధ్యాయమును ప్రవేశపెట్టి, తెలుఁగు పఠితలకు అత్యుత్తమమైన నవలల నందించిరి. ఈ మువ్వురి రచనలతో తెలుఁగు దేశము, తెలుఁగు ప్రజలు మిక్కిలి ప్రభావితులైరి. వీరు తమ సమకాలిక జాతీయో ద్యమములను, సాంఘిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితులను, సాహిత్య సాంస్కృతికోద్యమములను చిత్రించి, పెక్కు నవ లలు వ్రాసి బహుజనాదరణను గడించిరి. ఈ తొలిదశలోనే ఈ మువ్వురు నవలా రచన కుపక్రమించి, పెక్కు రచనలు చేసినను, వారికి అఖండకీర్తి లభించినది, ద్వితీయ దశలో గనుక అక్కడ వీరి రచనలనుగురించి సవివరముగా తెలుపుట మంచిదని భావించి, ఇంతటితో ఈ దశకు సంబంధించిన చరిత్రను, నవలా సాహిత్య ప్రగతిని విరమించి, రాబోవు స్వర్ణయుగమునకు రాచబాటను ఏర్పరచిన యెందరో నవలా రచయితల మరపురాని కృషికి అభివందనలు తెలుపుతూ, ఈ చర్చను ముగింతును.

1930-47 ద్వితీయదశ.

భారతావనిలో చెలరేగిన వివిధ ఉద్యమములపై గాంధీజి ముద్ర.

సహాయ నిరాకరణోద్యమము, ఉప్పు సత్యాగ్రహోద్యమము విజయవంతమగుటవలన, భారత ప్రజాహృదయములలో గాంధీమహాత్మునకు తిరుగులేని నాయకత్వము సిద్ధించినది. అయన నాయకత్వముపట్ల, కార్యక్రమముల పట్ల ప్రజలు అశేష శ్రద్ధ వహించి, అయన అడుగుజాడలలో నడచిరి.

అఖిలభారతమున ప్రగతిశీలురైన రచయితలందరును మహాత్మని నిర్మాణ కార్యక్రమములను, అయన నడపిన మహోద్యమములను, ఇతివృత్తములుగా గ్రహించి, మహా కావ్యములు, ఖండకావ్యములు, గేయకావ్యములు, నవలలు, నాటకములు, కథలు వ్రాసి దేశభక్తిని, స్వాతంత్ర్య పిపాసను, ప్రతిబింబింపజేసి ప్రజలను జాగృతమొనరించిరి. అనాటి రచన లన్నిటికైనను ఏదో ఒక విధముగా అయన ప్రభావముతోపాటు, దేశభక్తి, ప్రేమ, త్యాగము,

సాంఘిక పరిస్థితుల చిత్రణ, విదేశ ప్రభుత్వము యెడల విముఖత, ప్రస్ఫుటముగా గోచరించునట్లు రచయితలు మలచిరి. ప్రతి రంగములోను ఆయన ఒక ముఖ్య వ్యక్తియై భాసించెను. ఆయన ప్రత్యేక ముద్ర ఆకాలపు రచనలన్నింటి పైన ఏదో ఒక రూపములో గోచరించినది.

లండను నగరములో ప్రథమ, ద్వితీయ, తృతీయ రౌండు టేబులు సమావేశములు 1930, 31, 32 సంవత్సరములలో జరిగినవి. మహాత్ముడు భారత కాంగ్రెస్ సంస్థ ప్రతినిధిగా ద్వితీయ, తృతీయ సమావేశములలో పాలుగొనెను

1931 వ. సంవత్సరమున 'గాంధి - ఇర్విన్' ఒడంబడిక జరిగినది. ఆ ఒడంబడికప్రకారము కాంగ్రెసువారు శాసనోల్లంఘనమును విరమించుటకును, ప్రభుత్వము రాజకీయ ఖైదీలను విడుదల చేయుటకును నిర్ణయించబడినది.

ముస్లింలీగుకు ప్రతిద్వంది గా "హిందూమహాసభ" అను ఒక పెద్ద సంస్థ డాక్టర్ శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ నాయకత్వములో యావద్భారతదేశమునను పనిచేసి, మేధావుల సిందరినో ఆకర్షించినది. నేడు దేశమున ప్రముఖ రాజకీయ పార్టీగా వ్యవహరింపబడుచున్న జనసంఘము కూడ పై సంస్థ ఛాయలోనిదే.

బ్రిటీష్ ప్రభుత్వము 1935 వ. సంవత్సరమున ఇండియాలో రాజ్యాంగ సవరణలు చేయుటకు చట్టమును చేసి

నది. దీనిననుసరించి కేంద్రమున ఫెడరల్ ప్రభుత్వ స్థాప
నము, రాష్ట్రములలో స్వపరిపాలనను కల్పించుటకు నిర్ణయ
ములు గైకొనబడినవి. కారణాంతరముల వలన ఫెడరల్
ప్రభుత్వ స్థాపనమునకు స్వదేశ సంస్థానాధీశ్వరులు అసమ్మతి
ప్రకటించుటవలన అది ఆగిపోయినది. కాని ఆ చట్టము
ననుసరించి 1937 వ. సంవత్సరమున భారతదేశమునందలి
వివిధరాష్ట్రములలో ప్రజాప్రభుత్వములేర్పడి, గ్రామ ఋణ
విమోచనము, మద్యపాన నిషేధము, మాతృభాషలో విద్యా
బోధనము వంటి ప్రగతిశీలక సమస్యలను విజయవంతముగా
పరిష్కరించుచు పరిపాలన గొనసాగించినవి.

1936 వ సంవత్సరమున డాక్టర్ శ్రీ రాజేంద్ర
ప్రసాదు అధ్యక్షతన జాతీయ కాంగ్రెసు సంస్థ స్వర్ణోత్సవ
ములు అత్యుత్సాహముతో ప్రజలు జరుపుకొనిరి. 50
సంవత్సరముల కాంగ్రెసు మహాసంస్థ చరిత్రను డాక్టర్
పట్టాభి రచియించి ప్రకటించెను.

1939 వ. సంవత్సరమున ద్వితీయ ప్రపంచ సంగ్రా
మము ప్రారంభమైనది. రాష్ట్రములలో కాంగ్రెసు ప్రభుత్వ
ములు విజయవంతముగా పరిపాలన సాగించుచున్నను, వారి
అంగీకారమును పొందకయే, బ్రిటీష్ ప్రభుత్వము భారత
దేశము మిత్రయుండలికి తోడ్పడదలచినట్లు ప్రకటించినది.
దానితో రాష్ట్రమంత్రివర్గములు రాజీనామానుసమర్పించినవి.

యుద్ధానంతము దేశములో జాతీయ ప్రభుత్వ స్థాపనకు, బ్రిటిష్ ప్రభుత్వము అంగీకరించినయెడల భారత ప్రజలు యుద్ధములో పాలుగొని విజయము చేకూర్చుటకు నాయకులు తమ సంసిద్ధతను ప్రకటించిరి. ప్రభుత్వము ఆ అభిప్రాయమును తిరస్కరించినది.

1940 వ. సంవత్సరమున మహాత్ముడు వ్యష్టి సత్యాగ్రహమును ప్రారంభించి, భారత ప్రజాహృదయములలో ప్రగాఢముగా నిండియున్న స్వాతంత్ర్యేచ్ఛను ప్రతిబింబింపజేసి, ప్రభుత్వమునకు కనువిప్పు కలిగించెను.

1942 సం. మార్చి నెలలో సర్. స్టాఫర్డ్ క్రిప్స్ను ఆంగ్ల ప్రభుత్వ ప్రతినిధిగా ఈ దేశమునకువచ్చి [illegible] సర పైను. అది విఫలమైనది.

1942 ఆగష్టు 8 వ. తేది అర్ధరాత్రమున బొంబాయి నగరములో జాతీయ కాంగ్రెసు సంస్థ లో గొ త్తర మైన "క్విట్ ఇండియా" తీర్మానము నంగీకరించినది. తత్ఫలితముగా 9 వ. తేదీన దేశనాయకుల నందరిని ప్రభుత్వము నిర్బంధించినది. ఆనేతు శీతనగము బ్రిటీష్ ప్రభుత్వమునకు వ్యతిరేకముగా స్వాతంత్ర్య మహోద్యమము [illegible] నది. ప్రభుత్వపు "ఉనికి" గూడ కారుమబ్బులైనది.

1944 వ. సం. మే నెలలో అనారోగ్య [illegible] డుట వలన ప్రభుత్వము మహాత్ముని కారాగార [illegible] ల

చేసినది. ఆయన ప్రభుత్వముతోను, ముస్లిము నాయకులతోను రాజీకి ప్రయత్నించి, విఫలనిరోధుడయ్యెను. ఆ సంవత్సరమే ఆయన సహధర్మచారిణియైన శ్రీమతి కస్తూరిబాయి స్వర్గస్థురాలైనది.

1945 వ. సంవత్సరమున ద్వితీయ ప్రపంచ సంగ్రామము సమాప్తమైనది. సూర్యుడస్తమించని బ్రిటిష్ సామ్రాజ్య పరిస్థితులు తలక్రిందులైనవి. పాలితుల మధ్య, పాలకుల మధ్య పెద్ద అఘాతము ఏర్పడినది. వలస రాజ్యములలో స్వాతంత్ర్యేచ్ఛ మిన్నుముట్టినది. బ్రిటనులో కార్మిక పార్టీ, ప్రభుత్వాధికారమును హస్తగతము చేసికొనినది. ప్రగతిశీలురైనవారు భారతీయులకు స్వాతంత్ర్యము నిచ్చుట శ్రేయస్కరమనితలచి, ఆ ప్రభుత్వ పక్షమున 1 సర్ స్టాఫర్డ్ క్రిప్స్, 2 పెథిక్ లారెన్స్, 3. ఎ. వి. అలెగ్జాండర్ అను అమాత్యత్రయము నిచ్చటికివచ్చి, హిందూ మహమ్మదీయులమధ్య ఏకాభిప్రాయమును సాధించుటకు, స్వాతంత్ర్యమును ప్రకటించుటకు కృషి సలిపిరి. అది విఫలమైనది. అమాత్యత్రయమువారి సూచన ననుసరించి, బ్రిటిష్ ప్రభుత్వము తాత్కాలిక జాతీయ ప్రభుత్వమును ఏర్పరచుటకు సమ్మతించినది.

సంవత్సరము సెప్టెంబరు నెలలో శ్రీ జవహ్లాలు నెహ్రు కేంద్రములో తాత్కాలిక జాతీయ

ప్రభుత్వమేర్పడినది. మొదట ముస్లిములీగు ప్రభుత్వములో చేరుటకు తిరస్కరించినను, ఆపిమ్మట చేరినది.

1946 వ. సంవత్సరము డిశంబరు మాసములో భారత రాజ్యాంగపరిషత్తు ఏర్పడినది. డాక్టర్ శ్రీ రాజేంద్రప్రసాద్ దానికి అధ్యక్షుడయ్యెను.

హిందూ - ముస్లిముల మధ్య ఐక్యత సమకూరనందున లార్డు మౌంట్‌బాటెన్ ప్రభువు ఇండియాను; భారతదేశము, పాకిస్తాను అను రెండు భాగములుగా చీల్చుట తప్పనిసరియని భావించి, ఒక పథకమును వెలువరించెను. దానిని ఉభయ పక్షములు అంగీకరించినవి. ఆయన బ్రిటిష్ ప్రభుత్వముతో రాయబారములు నెరపి, వారి అంగీకారముతో 1947 ఆగష్టు 15 వ. తేదీన, భారతదేశమునకు, పాకిస్తానునకు సంపూర్ణ స్వాతంత్ర్యమును సిద్ధింపజేసెను.

"క్విట్ ఇండియా" ఉద్యమానంతరము, అంతవరకు భారత జాతీయ కాంగ్రేసు సంస్థలో వామపక్షీయులుగా నుండి పనిచేసిన, కొందరు ప్రగతిశీలవాదులు వివిధ దేశముల యందు ప్రవర్తిల్లిన సోషలిస్టు, కమ్యూనిష్టు ఉద్యమములచే ఆకర్షింపబడినవారై, మాతృ సంస్థనుండి విడిపోయిన ఫలితముగా, దేశమునందు సోషలిస్టు, కమ్యూనిస్టుపార్టీలు, ప్రత్యేకముగా ఏర్పడినవి. ఆయా పార్టీల ఆశయములను, సిద్ధాంతములను బలపరచుచు, కొన్ని రచనలు వెలువడినవి.

ఆంధ్రదేశమందలి వివిధ ఉద్యమములు

అఖిల భారత స్థాయిలో మహాత్ముని నాయకత్వమున జరిగిన అన్ని రాజకీయోద్యమములయందును ఈదశలోను తెలుఁగువారు ముందంజవేసి, అయినకు బాసటగా నిలచి, స్వాతంత్ర్యసిద్ధికి తోడ్పడిరి. మన ఆంధ్రదేశమున తెలుఁగు భాషాభివృద్ధికి, నవలాసాహిత్య ప్రగతికి, ఎన్నియో సంస్థలు స్థాపింపబడి, కృషిచేసినవి.

1919-20 సంవత్సరములలో బహుభాషావేత్త, నవ్య సాహిత్య పిపాసియైన శ్రీ శివశంకరశాస్త్రిగారు కొందరు సాహితీ మిత్రులతో కలసి "సాహితీ సమితి" ని స్థాపించి, నూతన సాహిత్యప్రక్రియల వికాసమునకు తోడ్పడిన సంగతి వెనుక తెలిపియుంటిని. ఆయన సంపాదకత్వమున 1920 వ. సంవత్సరమున "సాహితి" మాసపత్రిక వెలువొలుపబడి నవ్య సాహిత్య ప్రక్రియలైన ప్రేమ, సౌందర్యము, జీవనము, ఆత్మ విభిన్న అంశములను దృష్టియందుంచుకొని, ఆత్మాశ్రయమైన భావకవిత్వముతోపాటు, నవలాసాహిత్య వికాసమును గొంతవరకు నడచినది.

1924 వ. సంవత్సరమున దేశోద్ధారకులు "భారతి" మాసపత్రికను వెలువొలిపి, ఆంధ్రవాఙ్మయమునకు చిరస్మరణీయమైన సేవజేసిరి.

1926 వ. సం. విశాఖ పట్టణములో "కవితాసమితి" అను సంస్థను శ్రీయుతులు పూరిపండ అప్పలస్వామి, శ్రీరంగం శ్రీనివాసరావుగారలు ప్రారంభించి, నవ్యకవితోద్యమమును ముమ్మరముగా ప్రచారముచేసిరి.

1933 వ. సం. మార్చి 10, 11, 12 తేదీలలో బరంపురమునందు 'అభినవాంధ్ర కవి పండితసభ' అను సంస్థను శ్రీ భాగవతుల ధర్మారావు, శ్రీ పంచాగ్నుల ఆదినారాయణ శాస్త్రిగారలు స్థాపించి నవ్యకవితా సృవంతిని బహుముఖముగా ప్రవహింపజేసిరి. ఈ అభినవాంధ్ర కవిపండిత సభయే 1936 వ. సంవత్సరమున మరి ఒక మెట్టు ముందుకుపోయి, "నవ్యసాహిత్యపరిషత్తు"గా మారినది. ఇది అఖిలాంధ్రమును నవ్యసాహిత్య ప్రగతికి మూలాధారమై నిల్చినది. ఈ సంవత్సరమే "ప్రతిభ" అను మాసపత్రికను గూడ నెలకొల్పి ఆ సంస్థ పక్షమునసే ప్రచురింపదొడగిరి. అది ఆనాడు నవ్య సాహిత్య వికాసమునకు, విస్తృతికి కేంద్రమై భాసించినది.

1936 వ. సం. ఏప్రియల్ 10 వ తేదీన అఖిలభారత అభ్యుదయ రచయితల సంఘము లండన్ నగరమున స్థాపింపబడినది. ఆంధ్రలో దాని శాఖను 1943 వ. సంవత్సరమున శ్రీ చివలువాడ పిచ్చయ్యగారు కొందరు మిత్రులతో విశేష కృషిచేసి ప్రారంభించిరి. అనాటినుండి అది దినదినాభివృద్ధి గాంచినది.

11, 12, నవంబరు 1921 వ. సంవత్సరమున హైద

రాబాదు నగరములో స్థాపింపబడిన ఆంధ్ర జనసంఘము, క్రమముగా ఆంధ్రమహాసభగామారి 1938 వ. సం. అది స్టేటుకాంగ్రెసులో విలీనమగునంతవరకు, నిద్రాణమైన తెలంగాణమును మేలుకొలుపుటకు పలిపిన కృషి మిక్కిలి ప్రశంసనీయమైనది. అది ఆనాటి నిరంకుశ ప్రభుత్వమును అదుగడుగున ధైర్యముతో ఎదుర్కొని, ప్రజాహిత కార్యముల నెన్నింటినో విజయవంతముగా నిర్వహించినది. గ్రంథాలయోద్యమములు, మహిళా ఉద్యమములు ఘనముగా జరిగినవి. అన్ని రంగములయందును చైతన్య స్రవంతి వెల్లివిరిసినది. స్వాతంత్ర్యపిపాస ప్రతివ్యక్తిలోను ప్రస్ఫుటముగా గోచరించినది.

1943 వ. సం. మే నెల 23 వ. తేదీన శ్రీ లొకనంది నారాయణరావుగారి అధ్యక్షతన 'ఆంధ్ర సారస్వత పరిషత్తు' స్థాపించబడినది. ఈ మహా సంస్థ తెలంగాణమున సారస్వత పునరుజ్జీవనమునకు అవిరళముగా కృషిసలుపుచు దినదినాభివృద్ధినందుచున్నది. దీని అభివృద్ధికి శ్రీయుతులు ఆదిరాజు వీరభద్రరావు, దేవులపల్లి రామానుజరావు, నూకల నరోత్తమరెడ్డి, పులిజాల హనుమంతరావు, గడియారం రామకృష్ణశర్మ గారలవంటి సాహిత్యవేత్తలు ప్రశంసనీయమైన కృషిచేసిరి. ఈ సంస్థ పక్షమున పరీక్షలు నిర్వహించుట, ఉత్తమ గ్రంథములను ప్రచురించుట, వివిధ ప్రదేశములలో సారస్వత సమావేశములు జరుపుట, కవి పండితులను ఆదరించుట మొదలైన ఉత్తమ కార్యక్రమములను ఎన్నింటినో

నిర్వహింపబడుచున్నవి.

1943-44 సంవత్సరములలో శ్రీ కలకత్తావాలా అను నాతడు తెలుఁగులో "మీజాన్" అను దినపత్రికను హైదరాబాదు నుండి వెలువరించెను. దీనికి ప్రముఖ కవి, నవలా రచయిత, చిత్రకారుడునైన కులపతి శ్రీ అడవి బాపిరాజు సంపాదకులుగా వ్యవహరించిరి. వాని లేఖిని నుండి వెలువడిన ఉత్తమ నవలలెన్నియో ఆ పత్రికలో సీరియలుగా ప్రచురితమై, ఆపిమ్మట గ్రంథరూపము దాల్చినవి.

1945 వ.సం. తెలంగాణా రచయితలసంఘము స్థాపించబడినది. దీనికి ప్రముఖ ప్రజా కవులు శ్రీ కాళోజి, శ్రీ దాశరథి, మున్నగువారు అధ్యక్షులుగా వ్యవహరించి, పెక్కుమంది యువరచయితలను ప్రోత్సహించిరి.

సీయుతులు కల్లూరి సుబ్బారావు, జనమంచి వేంకట శర్మ, దుర్భాక రాజశేఖర శతావధాని, గడియారం వేంకట శేషశాస్త్రి, రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ, పుట్టపర్తి నారాయణాచార్యులు మొదలైన పండిత ప్రకాండులు రాయలసీమ సాహిత్యమును, రత్నాలసీమ సాహిత్యముగా తీర్చిదిద్దిరి. వీరి కవితా వ్యాసంగములతో, సాహిత్య సమావేశములతో రాయలసీమకుగల పూర్వ ప్రతిభ, ద్విగుణీకృతమై ప్రకాశించినది. ఊరూర సాహిత్య సమారాధనలు జరిగినవి.

గాంధీజీ తన నిత్యజీవితములో ప్రదర్శించిన విశ్వమానవ ప్రేమ, జీవకారుణ్యము, స్వేచ్ఛా స్వాతంత్ర్యములకు

కవులు అధిక ప్రాధాన్యతనిచ్చి రచనలు చేసిరి. ఆయనకు ఆదర్శపాత్రములైన సంఘ సంస్కరణ, హరిజనోద్ధరణ, పతిత జనోద్ధరణ, మధ్యపాన నిషేధము, స్త్రీజనాభ్యుదయము, రాట్నము మొదలైనవన్నియు కవితాంగములై భాసించినవి.

సుప్రసిద్ధ దేశభక్తుడు శ్రీ గరిమెళ్ళ సత్యనారాయణ గారు వ్రాసిన బోధనాగేయములు ప్రజలలో అత్యధిక పంచలనమును కలిగించినవి. మధ్యపాన విషేధమునుగురించి —

"కల్లు తాగబోకు కదుపు మాడ్చుకోకు
నీ ఇల్లు గుల్లసేయకోరి తమ్ముడా—" అని.

బ్రిటిష్ పాలనముపట్ల వైముఖ్యమును తెలుపుచు—

"మాకొద్దీ తెల్లదొరతనము—" మొదలైనవి.

అదేవిధముగా శ్రీ మాధవపెద్ది బుచ్చి సుందరరామ శాస్త్రిగారి "అంటరాని వారెవరోకారు - మా వెంటరాని వారే—" అనునది.

ప్రముఖ దేశభక్తుడు, ఉత్తమ జాతీయ కవి అయిన శ్రీ బసవరాజు అప్పారావుగారు గాంధీమహాత్ముని, ఒక అవతారపురుషునిగా చేసి కీర్తించెను. చూడుడు—

"కొల్లాయి గట్టితేనేమి — మా గాంధి మాలడై
తిరిగితే నేమి—" అని.

"వెన్నపూసా మనసు - కన్నతల్లి ప్రేమ.
పండంటి మోమువై బ్రహ్మతేజస్సు—" అని.

ఈ పాటలు మహాత్ముని దివ్యస్వరూపమును, నిర్మల

హృదయమును, ప్రస్ఫుటముగా కన్నులకు రూపు కట్టునట్లు చేసినవి.

సైన తెలిపినవారేగాక అనాదు శీర్షుతులు ఒలిజేపల్లి లక్ష్మీకాంతము, తుమ్మల సీతారాముమూర్తి చౌదరి, ఏళ్వ నాధ సత్యనారాయణ, దామరాజు పుండరీకాక్షుడు, జాషువ, పింగిళి, కాటూరి, వేదుల, దువ్వూరి మొదలైన ప్రధమ శ్రేణి కవులందరును, ఈ రక్షైనగాంధేయ సాహిత్యమును, జాతీయభావ సంపన్నమైన, దేశభక్తి ప్రపూరితమైన రచన ను, ఎన్నింటినో చేసి అకాలపు ప్రజలను ఉత్తేజపరచిరి.

ప్రధమ ప్రపంచ సంగ్రామములో సంభవించిన బీభత్స ములో ఉత్తేజితుడైన శ్రీకృష్ణశాస్త్రిగారు భావకవితావేశ ములో విజృంభించి కృష్ణపక్షము, ఊర్వశీ, ప్రవాసము వంటి ఉత్తమ కృతులతో స్వేచ్ఛాగాన మాధురులను ఆంధ్ర సీమలో విరివిగా విరజిమ్మి; ద్వితీయ ప్రపంచ సంగ్రామము ప్రారంభమగునంతవరకు ఆంధ్ర కవితా సామ్రాజ్యములో తన ప్రత్యేక ముద్రను, వ్యక్తిత్వమును బహువిధములుగా ప్రదర్శించి, ఎందరెందరిలో మార్గదర్శకుడయ్యెను. ఈ మధుర మనోజ్ఞ కవితాశిల్పి అనంతలోక విహారియై, స్వేచ్ఛాస్వాతం త్ర్యములతో "ఆకులో ఆకునై, పూవులో పూవునై, కొమ్మలో కొమ్మనై, నునులేత రెమ్మనై, ఈయడవి దాగి పోనా, ఎక్కైన ఇచటనే యాగిపోనా —" అని అలాపించి ఆ మహాప్రకృతితో తదాత్మ్యతను పొందెను.

శ్రీ.శ్రీ. 1930వ. సంవత్సరమునకు పూర్వమునుండియే, నవ్య కవితా వేశమూతో పరవళ్లుతొక్కి, ద్వితీయ ప్రపంచ సంగ్రామములో, ప్రపంచ చరిత్రలో జగుప్సాకరమైన సంఘటనలతో సంభవించిన వినూతన పరిణామములను శ్రద్ధగా అవగాహన చేసికొని, సామ్యవాద సిద్ధాంతములలో తేలి తడిసి, ఆంధ్ర నవ్యకవితాసాహిత్య కేదారములో "మరో ప్రపంచ" నిర్మాణమునకు రాచబాటను వేర్పరచి, నవ్య కవితాప్రవంతిని ఆంధ్రభూమి నాలుగు చెరగులలో పూట లూరించి, చిక్కుమంది యువకవులకు ఆచార్యుడై నవ్యాంధ్ర కవితా సామ్రాజ్యమున, పున్నమిచంద్రుడై వెలుగొందుచున్నాడు.

తెలంగాణ ప్రజాకవులైన శ్రీ కాళోజి, శ్రీ డాశరథి, శ్రీ మోరియా, శ్రీ పూటుకూరి రంగారావు, శ్రీ కవిరాజమూర్తి, శ్రీ అద్దంకి అయోధ్యారామకవి గారలు నైజాం నిరంకుశ ప్రభుత్వమునకు యెదురొడ్డి నిలచి, తమ మధుర కవితాప్రవంతితో నిద్రాణమైన తెలంగాణపు ప్రజలకు వైతాళికులై వర్ధిల్లిరి.

ఈ నవ్య కవితోద్యమపు గుబాళింపు, మన తెలుఁగు నవలా వికాసమునపైన ఎంతయో ప్రసరించినది. ఇంతవరకు గ్రాంధిక భాషను అధికముగా ప్రేమించి రచనలు చేసిన రచయితలు, వ్యావహారిక భాషవైపు దృష్టిని మరల్చిరి. జమీందారులను, జాగీర్దారులను, రాజులను, రాణులను

వర్ణించుచు వ్రాయుటమాని, సామాన్య ప్రజల దైనందిన జీవిత సమస్యలవైపు మొగ్గుచూపి, వారిని కథానాయకులుగా చేసి రచలు చేయదొడగిరి. విభిన్న ప్రజా సమస్యలు, వారి సాధక బాధకములు ఇతివృత్తములై వర్ధిల్లినవి.

ద్వితీయ ప్రపంచ సంగ్రామమునకు కొంతముందు నుండియే, ప్రతి వ్యక్తికి ప్రబుకు ఒక సమస్య యైనది. ఆకలి బాధ, దారిద్ర్యము, అజ్ఞానము, అంధకారము, పరాధీనత వల్ల సంభవించిన కష్టములు, నష్టములు హృదయములను తల్లడిల్లజేసినవి, ప్రగతి శీలురు, దూరదృష్టిగల రచయితలు, మానవుని దైనందిన జీవితములో సంభవించు వొడుదుడుకులకు అధిక ప్రాముఖ్యతనిచ్చి, వానిని ఇతివృత్తములుగా గ్రహించి, రచనలు చేయుట కుద్యమించిరి. వీనికి తోడు విదేశములలో చెలరేగిన ఫాసిజము, నాజిజము, కమ్యూనిజము వంటి విభిన్న ఉద్యమములు మన రచయితలను సైతము ఉద్రేకితులుగించినవి. దానితో వారు విజృంభించి జాతీయ, అంతర్జాతీయ సమస్యలనుగురించి, వాటి పరిష్కార మార్గములను గురించి, భిన్న దృక్కోణములనుండి పరామర్శించి రచవలు చేసిరి.

ఈ దశయందలి రచయితలను కాల్పనికోద్యమము, హేతువాద సిద్ధాంతములు రెండును మిక్కిలి ఉత్తేజితులను చేసి, స్వతంత్ర తెలుఁగు నవలలను విరివిగా వ్రాయునట్లు ప్రోత్సహించినవి.

యావత్ప్రపంచమున జంఝుప్రవలె వ్యాపించిన ఫ్రాయిడ్, యుంగ్, ఫ్రేజర్, ఆడ్లర్ మొదలైనవారి తాత్త్విక, మనస్తత్వ సిద్ధాంతములు తెలుఁగు రచయితలను గూడ ఆకర్షించి ఉక్కిరి బిక్కిరిచేసి, రచనోన్ముఖులను గావించినవి. ఆ ప్రభావముతో రసవత్తరమయిన తెలుఁగు రచనలు వెలువడి, మన నవలా సాహిత్య చరిత్రలో అంతకు ముందు ఊహించని మార్పు సంభవించినది. ఈ సాహిత్య క్షేత్ర పరిధి విశాలతరమైనది. కొంగొత్త హోయలలో, వినూతన భావములతో పుంఖాను పుంఖముగా రచనలు సాగినవి.

వైతుకూలి ఉద్యమములు, కార్మిక, కర్షక ఉద్యమములు, కీడు యూనియన్లవంటి పెక్కు నూతన విషయములను అతి వాస్తవిక దృక్పథముతో, వివరించి, రచలు చేసిరి.

పైన తెలిపిన నూతన భావ పుంజముల ప్రభావము, 1930-47 సంవత్సరముల మధ్య ఆంధ్ర, తెలంగాణ, గాయల, సీమలలో వెలువడిన వివిధరకములైన సారస్వత ప్రక్రియల పైన ప్రసరించి, అందరిని ప్రభావితుల నొనరించినవి. దానితో తెలుఁగు సారస్వతము మరొకమెట్టు ముందుకు అధిగమించి, నవ్యాంధ్ర సాహిత్య వీధులు, సరికొత్త రీతులతో నవ్య తేజఃపుంజములను ప్రసరింపజేసినవి. మహాత్ముని ప్రత్యేకముద్ర వివిధ సాహిత్య ప్రక్రియలపైన ప్రస్ఫుటముగా కనుపించసాగినది.

1930_47 ద్వితీయ దశ.

కాల్పనిక, హేతువాద ప్రభావములతో — తెలుఁగు నవలా వికాసము.

వివిధ పాశ్చాత్య సాహిత్యములను వికసింపజేసి, వాని విస్తృతికి తోడ్పడిన కాల్పనికోద్యమము, హేతువాద సిద్ధాంతములు రెండును, ఈ దశలో మన తెలుఁగు నవలా రచయితలను బాగుగా ఆకర్షించి ప్రేరితులను చేసిన పంగతిని లోగడ తెలిపియుంటిని.

ఆ అద్వితీయ ప్రభావములో తెలుఁగు నవలా రంగమున సరికొత్త అధ్యాయమును ప్రవేశపెట్టి తెలుఁగు పాఠకులకు అత్యుత్తమమైన స్వతంత్ర ప్రతిపత్తిగల నవలలు నెన్నింటినో ప్రసాదించి, తెలుఁగు నవలాసాహిత్య చరిత్రను, వేరొక మలుపుకు త్రిప్పి అది బహుముఖములుగా ప్రజలలో వ్యాపించుటకు అపార కృషి సలిపిన భాషా భగీరథులు శ్రీ విశ్వనాథ సత్యనారాయణ, శ్రీ గుడిపాటి వేంకటచలం, శ్రీ అడవి బాపిరాజు గారలు.

ఇంతవరకు అధిక సంఖ్యలో వెలువడిన అనువాదములు, అనుసరణల, గాలి దుమారము క్రమముగా తగ్గి, ఈ దశలో చెవగల స్వతంత్ర రచనలు తెలుఁగు రచయితల హస్తకమలములనుండి వివిగా జాలువారినవి. ఈ మార్పునకు పైన తెలిపిన త్రిమూర్తులే ముఖ్యులు.

ఈ ముగ్గురు తమతమగల నిశిత మేధాసంపత్తితో, భావనా బలములతో, కమనీయ కల్పనా చమత్కృతితో, తమ సమకాలిక సంఘములో ప్రవర్తిల్లిన వివిధ జాతీయోద్యమము లను, సాంఘిక, ఆర్థిక, రాజకీయ, వైజ్ఞానిక పరిస్థితులను, దానికి తోడు విదేశములలో చెలరేగుచున్న విభిన్న పరిణామ ములను, వివిధ దృక్పథములతో, భిన్న కోణములనుండి పరి శీలించి, పరామర్శించి, నిగ్గుదేల్చి, తమకు గలిగిన అనుభూ తులతో, అనుభవములతో ఇతివృత్తములను గ్రహించి, వివిధ సన్నివేశములను చాకచక్యముతో హృదయంగమముగా నుండునట్లు కల్పించి, ఆయా పాత్రలను మన మనోనేత్రము లకు వాస్తవిక దృష్టితో గోచరమగునట్లు మలిచి. హృదయ మునకు ఆహ్లాదమును, ఆనందమును కలిగించునట్టి సరస సంభాషణలతో, చతుర వాగ్గుంభనలతో సహజమైన, సజీవ పాత్రలను సృష్టించి, వారి హృదయగత భావనలను, గాథ లను, బాధలను మనకు వివరించి చెప్పుచున్నట్లు రూపకల్పన మొనర్చి, పెక్కు నవలలువ్రాసి, మన నవలా సాహిత్యములో ఒక అపూర్వమైన వినూత్నయుగమును సృష్టించిరి.

పై ముగ్గురిలో కాల్పనికోద్యమమునకు ప్రథమ వాహినీ పతియై నవలారచన కుపక్రమించిన శ్రీ విశ్వనాథ తన కార్మిక బద్ధమైన బుద్ధిబలముతో, పాశ్చాత్య సంపర్క మైన హేతువాదమునకు ప్రతిద్వంద్విగా, సుసంపన్నమైన భార తీయ అధ్యాత్మిక వాదమును నిలిపి, తన వాదమును సహేతు

కముగను, సోపపత్తికముగను సమర్థించి, మూరుమూలల యందు మరుగుపడియున్న అగ్నబద్ధమైన మాణిక్యరాసుల నెన్నింటినో వెలికితీసి, అందరికి చూపి, అర్వ సాంప్రదాయ మునందలి పవిత్రతను, విశిష్టతను, శక్తిని, పటుత్వమును తన యుక్తి చాతుర్యములో, యుక్తి ప్రయుక్తులతో సమన్వయించి, తనకుగల ఊహాబలముతో, రచనా విన్యాణముతో పెక్కు నవలలను వ్రాసిన మహా రచయిత, మహాశిల్పి ఆయున.

పాశ్చాత్య సంస్కృతీ సభ్యతయందు, నాగరికతా వైభవమునందు ఆయున విముఖత్వమును ప్రదర్శించి, మన వర్ణాశ్రమ ధర్మములను, ఆందలి లోతుపాతులను, వాని విశిష్టతను బహిరుముఖములుగా వెల్లడించి రచనలు చేయుటచేత, ఆయున దృష్టి, సృష్టి కొంత సంకుచితమైనదని ఆధునిక విమర్శకులు కొందరు భావించి విమర్శించినను, తన కాలమునలో పాతుకొనిపోయియున్న పాశ్చాత్య సంస్కృతీ వ్యామోహాముల నుండి అనాటి ప్రజల బుద్ధిని మళ్ళించి, స్వీయ ధర్మమునట్లు ఉన్నతులను గావించుటకు ఆయున చాకచక్యముతో నెరపిన 'యుక్తి' మాత్రమని మనము భావించుట సమంజసము. ఆదృష్టితో మనము ఆయున నవలా సాహిత్యము ననుశీలించుట యుక్తము. ఏది ఎట్లైనను, నవ్యాంధ్ర సాహిత్య నవలా వికాసమునందు ఆయున మధ్యాహ్న మార్తాండుడై వెలుగొందుచున్నట్లు, అందరు అంగీకరించిన సత్యము. ఆయున చేతిలో తెలుఁగునవల పరిపుష్టినంది, తెలుఁగు ప్రభలు

దేశము సలుమూలల ప్రసరించినవి. అయన లేఖని నుండి వెలువడిన అసంఖ్యాకమైన నవలలలో, ప్రతి దానియందును తన ప్రత్యేక వ్యక్తిత్వమును, ప్రతిభను గనబరచి పట్టినదల్ల బఱిగారము చేసి, సిద్ధహస్తుడై యావదాంధ్రులను తన అపూ రూప కల్పనా సమున్మత్తితో ఉర్రూతలూగించిన బ్రాహ్మ్మ మూర్తి. తెలుఁగు వారికి స్వతంత్ర ప్రతిపత్తిగల నవల నెన్నింటినో రచియించి, ప్రతి రచనలోను తన ప్రత్యేక ముద్రను గనబరచి, నవలా రచనలో కాకలు తీరిన బంటై వెలుగొందెను.

"ప్రకృతికిన్ భాష్యప్రణేతలీ కవుల్" అన్న చందమున శ్రీ సత్యనారాయణగారికి, సృష్టి పర్యవేక్షణమును వ్యాఖ్యానము చేయగల అనంతమైన శక్తియున్నది. ఆ శక్తిలో, ఆయన జీవితమును సహాస్ర ముఖములుగా అవలోకించగలశక్తిని పరమేశ్వరుడు ప్రసాదించెను. దానితో సర్వమును అవగతము చేసికొని, రచనా రంగమున ఆయన విజృంభించి అగ్రగామియై పయనించెను. ఆయనది సంప్రదాయబద్ధమైన స్వతంత్ర ప్రతిపత్తిగల ఆలోచన. కనుకనే ఒక నవలకుగల పోలికలు, మరొక నవలకు రాకుండునట్లు, ఒక నవలలో మాలిచిన పాత్ర, మరొక నవలలో కనబడకుండునట్లు, పునరుక్తి దోషములు లేకుండ వాసిగల నవలల నెన్నింటినో సృష్టించి, తన సృష్టిని ఒక ప్రత్యేక రాసిగా రూపొందించి మనకిందించిన సుకృతి సంపన్నుడాయన.

ఆయన నవలలను కొన్నింటిని ఇచ్చట పరామర్శింతును.

చారిత్రక నవలలు :—

"ఏకవీర" శ్రీ విశ్వనాథ రచనలలో కాల్పనికోద్యమ ప్రభావముతో వెలువడిన తొలి చారిత్రక నవల. ఇది మధుర నేలిన నాయక రాజుల పరిపాలనా కాలమునకు చెందిన నది. దీనిలో చారిత్రకాంశములతో పాటు, మానవ హృదయములకు సంబంధించిన కథ నిబద్ధింపబడినది. ఆర్ష ధర్మమునకు, వ్యక్తిగతమైన హృదయస్పందనకు మధ్య జరిగిన సంఘర్షణ ఈ కథకు బీజము.

ధర్మమునకు, ప్రేమకు మధ్య అల్పస్వల్పమైన సంఘర్షణ దీనిలో ప్రధాన ఇతివృత్తము. ఈ నవలలోని ముఖ్య నాయిక అయిన ఏకవీర పాత్రను విశ్వనాథ పోషించిన విధము, కథను నడిపిన పద్ధతి, ముగింపు అన్నియు అత్యుత్తమమై వరలినవి. దీనికి నవలా గౌరవముతోపాటు, కావ్య గౌరవము గూడ సిద్ధించినది.

వీర భూపతి, కుట్టాన్, మీనాక్షి, ఏకవీరల ప్రేమోదంతములు, విరహవేదనలు ఉదాత్తముగా చిత్రింపబడినవి. మహాకవి భవభూతి ఉత్తరరామచరిత్రలో నిబద్ధించిన 'స్పర్శ' సిద్ధాంతమును ఈ నవలలో ఆయన ఉన్నత శ్రేణిలో ప్రదర్శించి, నవలా రచనలో దానికి మహోన్నత స్థానమును కల్పించెను.

ఈ నవలయందలి చరిత్, కథను అనుసరించి, ఁానికి లోబడి, కథా కథనమునకు తోడ్పడి, చరిత్రకు, నవలకు గల సంబంధమును నిపుణతతో ప్రదర్శించెను. ఇది 1925 లో రచియించబడినది.

"బద్దన్న సేనాని" 1918 వ. సంవత్సరమున రచియింపబడిన మరియొక చారిత్రక నవల. వేంగీ చాళుక్య ప్రభువులు దక్షిణాపథమునందలి చోళ రాజకుమార్తెలను వివాహమాడుచుండిరి. రాజరాజ నరేంద్రుని అనంతరము ఆ ప్రభువులు మాతామహ స్థానములకు పోయి, అచ్చటి నుండియే ఈ తెలుఁగు నేలను తమ సామంత రాజ్యముగా చేసికొని పాలించుచుండిరి. కుళోత్తుంగ చోడ దేవుడు అచ్చట మహారాజుగానుండి పాలించుచున్నప్పుడు పశ్చిమ చాళుక్యులు ఈ భూభాగమును స్వాధీన పరచుకొని రాజ్య పాలన చేయదొడగిరి. ప్రభుభక్తి పరాయణులైన కొందరు, పశ్చిమ చాళుక్యులను ఇచ్చటినుండి తరుముటకు తిరుగుబాటు చేసిరి. ఆ ఇతివృత్తమే ఈ కథకు మూలము. ఈ నవల యందలి నంబయ్య, గొంకయ్య, నన్నయ్య మొదలైన మహా వీరులు ప్రదర్శించిన శౌర్య సాహసములు కన్నులకు గట్టి నట్లు అయిన కథను పలచిన తీరు అద్భుతమైనది. అనాడు చెలరేగిన శైవ, వీరశైవ సంబంధమైన మనస్పర్ధలు, తత్ఫలితములు వివరింపబడినవి. లింగజ్ఞానాతీతమైన బద్దన్న, బాదమ్మల ప్రేమ సంబంధము, ఈ చారిత్రక నవలకు గొప్ప రసపట్టును కలిగించినది.

"కడిమిచెట్టు" నవల పల్లవ, కాదంబులకు చెందిన ఇతివృత్తముతో నడచిన చారిత్రిక నవల. ఇది 1946 వ సంవత్సరమున రచియింపబడినది. న వ ల చిన్నదైనను ఇందలి పాత్రలు సజీవ సంపన్నమైనవి. నవలలోని మయూరుని పాత్ర చిత్రణ ప్రశంసనీయమైనది. అతడు తన కుంటుంబమునకు సంభవించిన అన్యాయమును ఎదురించుటలో ప్రదర్శించిన ధైర్యసాహసములు వర్ణనాతీతము. భల్లాత వర్మను పట్టుకొని వధించుటకు మయూరుడు పడిన పాట్లు, తిరిగిన తిరుగుడు, చివరకు తన కోరికను నెరవేర్చుకొని అతడు పొందిన ఘన విజయము నవలలో చక్కగా వర్ణింప బడినది.

శ్రీ విశ్వనాథ "ధర్మచక్రము" నవలను 1947 వ. సంవత్సరమున, బౌద్ధ కథను ఆధారముగా గ్రహించి రచియించెను. దీనిలో హైందవధర్మ ఆధిక్యతను, ఆర్య సంప్రదాయపు విశిష్టతను నిరూపించెను. విజయపురి నేలిన ఇక్ష్వాక ప్రభువుల చరిత్రను ఇతివృత్తముచేసి, రచనను మలచెను. ఆ ప్రభువుల అంతఃపుర రహస్య విషయముల నెన్నింటినో రసవంతముగా దీనియందు చిత్రించెను. అల నాటి నాగార్జునకొండ ప్రాంతపు నాగరికతా వైభవములను రమ్యాతి రమ్యముగా మలచి, ప్రతి చిన్న విషయమును మనోగోచరమగునట్లుచేసి, చూపెట్టెను.

పైన తెలిపిన చారిత్ర నవలలో విశ్వనాథ కథలోని

సంఘర్షణలద్వారా, విభిన్న పాత్రల మానసిక చిత్తవృత్తులతో, మనకు చారిత్రక భ్రాంతిని కలిగించెనేగాని, కేవలము చారిత్రక విషయములకు ప్రాధాన్యతనిచ్చి కథను మలచి విసుగు కలుగునట్లు చేయలేదు. అది ఆయనకుగల రచనా వైచిత్రి. ఫై నవలలన్నియు ఆంధ్రేతిహాసమునకు సంబంధించినవే. దీనినిబట్టి ఆయనకు ఆంధ్ర చరిత్రపట్లగల అభిమానము వ్యక్తమగును.

సాంఘిక నవలలు:—

"మాబాబు" కరుణరస ప్రధానమైన ఉత్తమ నవల. ఇందలి కథానాయకుడు తల్లిదండ్రులను కోలుపోయి, అయిన వారితోను, కానివారితోను పడిన బాధలు, అనుభవించిన కష్టములు, ఎంతటి కఠినహృదయునైనను కదలించివేయును. నవలయందలి "పాముల" వాని పాత్రసృష్టి అపురూపమైనది.

కథానాయకుడు మేనమామ కూతురిని ప్రేమించెను. ఆమె తప్పుదారి తొక్కి "మాబాబు" కుమారుని వలచినది. అతనితో సంబంధము పెట్టుకొనినది. ఆ ఇద్దరికి వివాహమైనది. అతడు ఒక దుస్సంఘటనలో మరణించెను. వారి కొక పిల్లవాడు జన్మించెను. అపసిపాపడు మోసిదువారిన మాన కథానాయకుని జీవితమునకు, తన లేత నవ్వులతో శ్రీఆనందమును కలిగించెను. ఆద్యంతము ఇది ఒక విషాదమైన గాథ. పశ్వనాథ అపసిబాలునిద్వారా, కథానాయకుడు, మురదలు

మొదలైనవారి విషాద జీవితములకు వెలుగు రేఖలను ప్రసా
దించి, తన బహుముఖీనమైన ప్రతిభను చమత్కారముగా
ప్రదర్శించుకొనెను. ఇది సజీవమైన సరళ వ్యావహారిక
భాషలో నడచిన మంచి నవల. దీని రచనాకాలము 1935.

"చలియలికట్ట" 1935 వ. సంవత్సరమున వెలువడినది.
ఇందలి వస్తువు వివాహవ్యవస్థ, ప్రేమ. రంగారావు తన అన్న
యైన సీతారామయ్య భార్య రత్నావళిని ప్రేమించి, ఆమెను
తనవెంట మద్రాసునకు లేపుకొని వెళ్లెను. అతడు ఆమెతో
కొంతకాలము గడిపెను. లోక రహస్యమును, ప్రేమ తత్వ
మును ఆమె గ్రహించినది. జీవితముపై రోత జనించినది.
మనస్సులో పెక్కు మార్పులు సంభవించినవి. ఆ మార్పుతో
గుడుసుళ్లు తిరిగిపోయినది.

రత్నావళి మనస్సులో చెలరేగిన గాలిదుమారము
ఇహపరములకు సంబంధించినది. విశ్వనాథ అతి సున్నిత
ముగా ఆ మార్పులను చిత్రించెను. ఈ నవలలో అనాది
సిద్ధమైన వివాహ వ్యవస్థను, కర్మసిద్ధాంతమునకు ప్రాము
ఖ్యతనిచ్చి. తాత్కాలికమైన యౌవ్వనోద్రేకములతో స్త్రీ,
పురుషులు పోవు పోకడలు, అవి ఎన్ని మెలికలు తిరిగినను
చివరకు సంప్రదాయసిద్ధమైన వ్యవస్థకు కట్టుబడి వుండక
తప్పదని తార్కిక బుద్ధితో నిరూపించెను. విద్యాధికుడైన
రంగారావు సైతము మారక తప్పలేదు.

ఈనవలయందలి 'బైరాగి' పాత్ర జీవితపు విలువలను

అందలి అగాధమైన లోతులను విశదీకరించువట్టిది. నవల యందలి సముద్రపు వర్ణనము బహుముఖమైన జీవితపు లోతులను, అందలి వివిధ భంగిమలను తరిచి చూపు చున్నది

"స్వర్గానికి నిచ్చెనలు" నవలయందు, విశ్వనాథ పరిణితి జెందిన తన తార్కిక బుద్ధితో జీవితమునందలి వైవిధ్యమును కడు సమర్థతతో విడమరచి చూపెను. సువ్యవస్థితమైన జీవితమునుండి మార్గము తప్పిన జీవుల, జీవిత భంగిమలను, వాని భిన్నమైన నడకలను, విభిన్నమైన, విచిత్రమైన, పోకడలను వసుంధర జీవితములో మనకు ప్రదర్శించి. నిర్వేద భరితమైన ఆమె స్థితిని, పుత్ర వియోగార్తయైన తల్లితో పోల్చి, చూపెను. నాస్తికతపై ఆస్తికతకు గల ఆధిక్యతను నిరూపించి సమర్థతతో దీనిని ముగించెను.

సామాన్యురాలైన వసుంధర యోగిని యైనప్పటి నుండి ఆమెలో సంభవించిన ప్రతి మార్పును, విశ్వనాథ సునిశిత తార్కిక బుద్ధితో వర్ణించెను. ఆమె నిర్మించిన దేవాలయములు, వాని నిర్వహణలో బంధువులు చేరుట, అచ్చట సంభవించిన వివిధ సంఘటనలు, "ఎప్పుడు సంపద గలిగిన - నప్పుడు బంధువులు వత్తురు" అనునట్లు వివరించెను

"తెరచిరాజు" నవల ఒక మహాశిల్పి, ఒక మహా నటుడునైన సారథి జీవితగాథను తెల్పునట్టిది. ఇందలి వాసంతి లోక ముఖమును సరిగా చూడనట్టి స్వచ్ఛమైన,

అచ్చమైన తెలుఁగుపిల్ల. సంగీతాధ్యయనము, నటనము రెండు తప్ప ఇతర విషయములు తెలియని ముగ్ధ. తనలో దాగియున్న నటనా కౌశలమును, మహానటుఁడైన సారధి ప్రోత్సాహన నటియించి ప్రకటించినది. అతని సహాయముతో తాను మహానటిని కావలెనని ఉవ్విళ్ళూరినది. అతని స్పర్శతో తనకు తెలియని వింత అనుభూతులను పొందినది. ఆ దివ్యానుభూతితో తన్మయత్వము జెందినది. లౌకిక జ్ఞానము ఇసుమంతయులేని ఒకానొక విచిత్ర ప్రవృత్తిగలది ఆమె.

ఏకవీర అనుభవించిన స్పర్శ గుణమునే, అట్టి మహత్తరమయిన అనుభూతినే వాసంతియు పొందినది.

వాసంతిని సమ వయస్కుఁడైన కిరీటికిచ్చి వివాహము చేయవలెనని సారధి భావించెను. వాసంతి వ్యతిరేకించినది. వాసంతి మోహినిగను, సారధి రుక్మాంగదుఁడుగను, రంగస్థలముపై నటియించుచుండిరి. వాసంతి సారధిని కౌగిలించుకొనినది, అతని శరీరస్పర్శతో ఆమెకు చైతన్యము పోయినది. ఆ ఇరువురును, ఆ కౌగిలిలోనే రంగభూమియందు మరణించిరి. ఈ స్పర్శగుణము నవలలో పరాంకోటి నందినది.

పూటకూళ్లుపెట్టి జీవించు "విశాలాక్షి" పాత్రను అతి విచిత్రముగా మలచి, సారధిపట్ల ఆమెకుగల పవిత్ర ప్రేమను చక్కగా ప్రదర్శించెను. రంగనాధము, అవధానులవంటి హృదయ విహీనులైన కవులను, వారి ఈర్ష్య, అసూయాది

గుణములను, వారి దుర్మార్గ పరివృత్తులను చక్కగా వ్యక్త పరచెను. ఈ నవల విశ్వనాథవారి బహుముఖనమైన పాండిత్యమునకు పతాక.

"వేయిపడగలు" 1934 వ. సంవత్సరమున ఆంధ్ర విశ్వవిద్యాలయమువారు నెరపిన పోటీలలో బహుమతి నంది నది. విశ్వనాథవారి విజ్ఞానసాగరమునుండి వెలువడిన అసం ఖ్యాకమైన నవలలలో ఇది వేయి పుటల నాక్రమించిన బృహత్తరమయిన నవల. అది ఆయన చేసిన మహా సృష్టి. తెలుఁగు వారికి అందించిన కానుక. ఈ నవలయందు ఆయన మూడు తరముల కథను తీసికొని మన హిందూసంఘ ముపందలి చాతుర్వర్ణ్య వ్యవస్థను, దాని నాశ్రయించి నడ చిన వర్ణాశ్రమ ధర్మములను, పాశ్చాత్య నాగరికతతో క్రమ ముగా అవి క్షీణించిపోవుచున్న విధమును, పూర్వకాలపు జమీందారీ వ్యవస్థను, అందలి వెలుగు నీడలను, వారి పరి పాలనలో పోషింపబడిన కళలు, విద్యలు, మత సంస్కృతులు, నాగరికతా వైభవములు, బహు రమ్యముగను. మధురాతి మధురముగను చిత్రించి గత రెండు శతాబ్దములలో మన తెలుఁగు దేశములో సంభవించిన మార్పులను, తన భావనా బలముతో, ఊహాశక్తితో సమర్థవంతముగా వ్యక్తము చేసెను. ఇది 'పాత కొత్తల' మేలు కలయిక. ధర్మారావు ఈ రెంటికి సంగమ స్థానము. ఇది ఒకవిధముగా చూచిన ధర్మారావు జీవిత చరిత్ర. ఇందు సృష్టింపబడిన పాత్ర

లన్నియును. అతనితో ప్రత్యక్షముగనో, పరోక్షముగనో ముడివడియున్నవి.

ధర్మారావు సుబ్బన్నపేట నివాసి. ఆర్ష విజ్ఞానమూర్తి యైన రామేశ్వరశాస్త్రి కుమారుడు. తెలుఁగు దేశమునకు, తెలుఁగుల జీవిత విధానమునకు ఈ సుబ్బన్నపేట కేంద్రము. సుబ్బన్నపేటలో జరిగిన మార్పులన్నియు ఆనాడు ఆంధ్రదేశమున సంభవించినవి. ఈ మార్పులను విశాల దృక్పథముతో పరికించినయెడల ఆంగ్ల పరిపాలన వలన, విదేశ నాగరికతవలన ఆంధ్రదేశములో వచ్చిన మార్పు అంతయు మనకు అవగతమగును. రైలుమార్గములు ఏర్పడుట, మునిసిపాలిటీల నిర్మాణము, జాతీయ కళాశాలలు, క్రైస్తవ కళాశాలలు, నాటక సమాజములు, నిర్బంధ ప్రాథమిక విద్య, విద్యుచ్ఛక్తి, మహిళా సమాజములు, సినిమా హాలులు, తాలూకా బోర్డులు, జిల్లా బోర్డులు, వివిధ పత్రికల స్థాపనలు, నూతన మతములైన, థియాసఫీ మతము, దివ్యజ్ఞాన సమాజము, ఆర్థిక, రాజకీయ, సాంఘిక, నైతిక, సమాజ వ్యవస్థలలో వచ్చిన మార్పులు ఎన్నియో మనకు గన్పించును. అటులనే మెట్టపొలములు మాగాణులగుట, చెఱుకు, పసుపు తోటల అభివృద్ధి, పొగాకు ఫ్యాక్టరీల నిర్మాణము, విపరీతముగా డబ్బు చెలామణిలోనికి వచ్చుట, ప్రతిష్యక్తి ఆంగ్లభాష నభ్యసించి లౌకిక జీవితమును గడుపుటకై స్వర్గధామములైన పల్లెపట్టులను వదలి పట్టణముల కెగబ్రాకుట,

పట్టణములలో పదు దురవస్థలు, అచ్చటి మురికి కూపములు విశ్వనాథవారు మిక్కిలి సమర్థవంతముగా దీని లో వివరించెను.

ఈ వేయిపడగలు నవల నాలుగు స్తంభముల ధర్మ మంటపము. వేణుగోపాలస్వామి, జమీందారు, బ్రాహ్మ ణుడు, గణాచారి, దీనికిగల స్తంభములు. ఈ నా లు గు స్తంభములమధ్య నడచిన విచిత్రమైన ఆటయే వేయిపడగలు. రాజు ధర్మాచరణకు, బ్రాహ్మణుడు ధర్మప్రచారమునకు ప్రతినిధులు. ఈ రెండు వ్యవస్థలు దేశమున క్రమముగా క్షీణించిపోయిన విధమును, వాని స్థానమున దే శ ము లో నూతననుగా రాబోవుచున్న ప్ర జా స్వా మ్య వ్యవస్థను చూపించెను.

జమీందారైన కృష్ణప్పనాయడు ధర్మస్వరూపుడు. రామేశ్వరశాస్త్రి శిష్టాచార సంపన్నమైన గృహస్తు. చాతు ర్వర్ణ్య వ్యవస్థకు మూలమైన బ్రహ్మ. త్రయీ విద్యలకు అతడొక వ్యాఖ్యానము. భారతదేశమునకు అయన ఆత్మ. ఆ మహా సంప్రదాయమునకు వారసుడు ధర్మారావు. ఇతడు కథానాయకుడు.

కేశవరావు మన విద్యలను, కళలను పునరుద్ధరించు టకు జన్మించిన కారణ జన్ముడు. శివరావు ఆనాడు మన దేశమున చెలరేగిన దివ్యజ్ఞాన సమాజ ప్రచారమునకు ప్రతి నిధి. రంగారావు పాశ్చాత్య నాగరికతా వ్యామోహములో

పడిపోయి, మార్గము తప్పి సంచరించిన జమీందారు. రామేశ్వరము దుష్టవ్యూహములకు, దుర్గుణములకు, స్వార్థ పరత్వమునకు ప్రతిబింబము. రాఘవరావు గాంధీమహాత్ముని ఆజ్ఞను సిరసావహించి తన పర్వస్వమును దేశమాత దాస్య శృంఖలముల విచ్ఛేదనకై అర్పించి, ఉప్పు సత్యాగ్రహోద్యమములో పాలుగొనిన నిస్వార్థ దేశభక్తుడు. హరిజనోద్ధరణ, ఖద్దరు ప్రచారము, మద్యపాన నిషేధమువంటి నిర్మాణ కార్యక్రమములను, ప్రచారముచేసి, యావదాస్తిని పోగొట్టుకొనిన త్యాగధనుడు, గణాచారి అనాదిసిద్ధమైన మన సంప్రదాయములను కాపాడుటకు కల్పింపబడిన ఉత్కృష్ట మైన పాత్ర. భూత భవిష్యద్వర్తమాన కాలములు ఆమెకు కరతలామలకము. ఈ నవలలో ఆమె పాత్ర కీలకస్థానము. పసిరిక సృష్టి అద్భుతమైనది. ఇట్టి వింత సృష్టి మరియే ఇతర సాహిత్యమునందును కానరాదని విజ్ఞుల భావన. ఈ పాత్ర నిర్మాణము, కేవలము కళ్వాదాథవారి ప్రతిభా సంపత్తికి, ఊహాశక్తికి, ఉత్తుంగ శిఖరము. ఈ పసిరిక పల్లెటూరి వాతావరణమును రూపుగొన్నవాడు. ఇతనికి మెట్ట చేలనిన, పచ్చని పైరు పంటలనిన, పశులనిన, పిట్టలనిన, గుట్టలనిన, గట్లనిన, పాములనిన, వాగులు వంతలు అనిన మక్కువ అభిమానము. ఈ పసిరిక మనిషి రూపులో పుట్టిన పాము. పాము రూపులో జన్మించిన మనిషి. పాపము ఈ వింతమానిసిపైనను నవనాగరికతా ప్రభావము పడక తప్ప

లేదు. దాని ధాటికి తట్టుకొనలేక ఉక్కిరి బిక్కిరియైపోయెను. ఇక గిరిక పాత్ర విశ్వనాథవారి మేధాసంపత్తికి విజయపతాక. అమ్మి దేవ దాసి. సంగీత, సాహిత్య, నాట్య శాస్త్రములు మూడింటిని తన సొత్తుజేసికొని భక్తిమార్గము ననుసరించి మోక్షమును సిద్ధింపజేసికొనిన మహాయోగిని. తన సర్వస్వమును వేణుగోపాలస్వామి కర్పించిన పరమ భక్తురాలు.

చిన్న హారప్పనాయడు తాత మహాగుణములను పుణికి పుచ్చుకొనిన కర్మయోగి. అగిపోయిన స్వామి కళ్యాణములను మహా వైభవోపేతముగా జరిపించుట, తల్లికి జరుగవలసిన కర్మలు జరుగకుండుటను గమనించి, తాను ఆ కర్మలను జరిపి, మాతృ ఋణము తీర్చుకొనుట, ఇతడు చేసిన ఘనకార్యములు. కర్మమార్గమునందలి విశిష్టతను గ్రహించిన వివేకి. మంగమ్మ పతిత. విధివశమున మార్గముతప్పి సంచరించినను, అందలి అనౌచిత్యమును ధర్మారావు వలన తెలిసికొని, అతనికి శిష్యురాలై యదార్థ పరిస్థితులను అవగతము చేసికొని, ఆత్మపరిశోధన చేసుకొనిన విదుషీమణి.

ఇట్టి విభిన్నమైన మహోత్కృష్ట పాత్రలతో, నడచిన "వేయిపడగలు" నవల దేశమున వేయి వెలుగులను వెదజల్లినది. ఇందలి పెద్ద అరుంధతి, చిన్న అరుంధతి, సనాతనమైన ఆర్య ధర్మములు ప్రతిబింబింపజేయు పతివ్రతామ తల్లులు. సనాతనమైన ఈ దేశమున ఎన్ని మార్పులు సంభవించినను "పతివ్రతకు హానిరాదు" అను సిద్ధాంతమును విశ్వనాథ ఆ

పాత్రద్వారా నిరూపించెను. ఈ పతివ్రతామతల్లుల నార్ష యించియే సర్వ భారతీయ ధర్మము దేశమున ప్రవర్ధమాన మగుచున్నదని ఈ నవలలో ఆయన నిరూపించెను.

ఆంధ్రదేశమునందలి సుందరమైన ప్రకృతిని, సర్వ ఋతువులను, వాని వింతశోభలను, గుండేటి వరదలను, ఆయన చక్కగా వర్ణించెను. ఈ నవల ఆంధ్ర ప్రజా జీవన స్రవంతికి పట్టుకొమ్మ. మన గ్రామీణ జీవితమును రసవంత ముగా చిత్రించి, తద్వారా ఆంధ్రుల సాహిత్య సభ్యతలను, ఆచార వ్యవహారములను మనకు కన్నులకు కట్టునట్టు వర్ణించి చూపెను. గత రెండు శతాబ్దముల ఆంధ్ర చరిత్రకు ఇది యొక తలమానికమైన వ్యాఖ్యానము. భారత, భాగవత, రామాయణాది గ్రంథములకిది సారము. విశ్వనాథవారి అనంత భావనాశక్తికి ఇది హిమాలయోత్తుంగమువంటిది. ఆంధ్ర నవలా చరిత్రలో ఒక నూతనాధ్యాయమును సృష్టించి, శర బ్యోత్పన్నులను వెదజల్లుచున్నది. ఇది ఒక మైలు రాయియై ప్రత్యేక విశిష్టతతో భాసించుచున్నది.

కులమునకున్న గుణ, శీల, ప్రవృత్తులు ప్రధానములని నిరూపించు నవల, 'వీరవల్లడు'. ఇది 1945 వ. సంవత్సరమున ప్రచురితమైనది. ఒక బ్రాహ్మణ కుటుంబమునకు, హరిజన కుటుంబమువకు గల సామీచీ న్యాయమును, ఆ ఉభయ కుటుంబములవారు ఒకరిపై మరొకరు ప్రదర్శించిన ప్రేమ, ఆదరణ, అభిమానము ఇందు చక్కగా ప్రతిపాదింపబడినది

హరిజనుడైన 'వల్లప్ప' పేరును ఆ బ్రాహ్మణ కుటుంబము వారు తమ కుమారునికి పెట్టుకొని ఆతనిపట్ల తమకుగల అవ్యాజానురాగములు వెల్లడించుకొనిరి. ఇది చాల చిన్న నవల. చవులూరించు వ్యవహారిక భాషలో రచన సాగినది. విశ్వనాథవారి ప్రగతిశీలతకు ఇది తార్కాణము.

వ్యంగ్యాత్మక నవలలు :—

"హహా-హూహూ" ఒక చిన్న వ్యంగ్యాత్మక నవల. స్వర్గలోకమునుండి గంధర్వులిరువురు ఈ భూలోకమునకు వచ్చి ఇక్కడి వింతమానిసులను, వారి విచిత్రమైన ప్రవృత్తులను, ఆచార వ్యవహారములను దర్శించి ఆశ్చర్యమును ప్రకటింతురు.

"పిష్టుశర్మ ఇంగ్లీషుచదువు" అతి విచిత్రమైన వ్యంగ్య ప్రధానమైన నవల. కవిబ్రహ్మ తిక్కనసోమయాజి, విష్ణుశర్మ ఇరువురును ఆంగ్లవిద్య నభ్యసించుటకు దేవేంద్రుని ఆజ్ఞతో విశ్వనాథవారి వద్దకు వచ్చిరి. ఆ ఇరువురికి కొన్ని ఆంగ్ల పదములు నేర్పి, వారి దైన్య స్థితికి జాలిపడి, ఆ ఇరువురు పండితులకు సత్కారములు చేయించవలెనని భావించి విజయవాడ, గుంటూరు, నెల్లూరు, రాజమహేంద్రవరము, వాల్తేరు మొదలైన పట్టణములలో కొన్ని సభలు ఏర్పాటు చేయించెను. ఆ సభలలో వారు అడుగడుగున ఎదుర్కొనిన చిక్కులను, జరిగిన విచిత్ర సంఘటనలను విశ్వనాథ మిక్కిలి

నేర్పుతో చిత్రించెను. మన విద్యాలయముల విద్యార్థి వైళ్ళ మొదలైనవి ఆలస్యముగా బయలు దేరుటవలన కలుగు దుస్సంఘటనలు, విద్యార్థుల పరిస్థితులు, కళాశాలల అధ్యక్షుల విచిత్ర ప్రవర్తనలు వ్యంగ్యముగా ఆవహేళన చేసెను. ఆంగ్లభాషా విశారదుడైన విశ్వనాథ, ఈ కాలమున ఆంగ్లభాషా వ్యామోహముతో పడుచున్న పాట్లను అతి సున్నితముగా విమర్శించెను. తిక్కన్న, విష్ణుశర్మలవంటి వారును, ఆ భాష రానందున తిరిగి దానిని నేర్చుకొనుటకు, ఈ భూలోకమునకు రాక తప్పలేదని జహు విచిత్రముగా నిరూపించెను.

హాహా-హూహూ, విష్ణుశర్మ ఇంగ్లీషు చదువు, నవలలయందు స్వర్గ మర్త్యలోకములకు గల సంబంధమును వ్యంగ్యాత్మకముగా స్పృశించి చూపెను.

"పులుల సత్యాగ్రహము" ఈ కోవకు చెందిన మరొక వ్యంగ్యాత్మక నవల.

ఇంతటి వైవిధ్య సంపదతో, కళావిలసితమైన ఇన్ని నవలలను సృష్టించిన మరియొక తెలుఁగు నవలా రచయిత లేడు. ఆయన దృష్టి, సృష్టి, అనంతమైనది.

స్థూలముగా ఆయన నవలలను, మనము రెండు విధములుగా చూపవచ్చును. మొదటిదశ నవలలు కథాత్మకములు. రెండవదశ నవలలు సంవాదాత్మకములు లేదా ఉపన్యాసాత్మకములు.

కలము చేతపట్టిన నాటినుండి నేటివరకు నిర్విరామముగా, అసంఖ్యాకమైన నవలలు వ్రాసి, ఆంధ్ర నవలా ప్రపంచమునకు నూతన రూపురేఖలను దిద్దిన మహా శిల్పి విశ్వనాథ. ఆయన తెలుఁగునాట కాల్పనికోద్యమమునకు ప్రధాన ప్రవర్తకుడైనిలచి తెలుఁగు మాగాణమును సుసంపన్నమైన పంటలతో పెలార్చిన మహాభావుకుడు. ఆయన నవలలో ఇక్కడ కొన్నింటిని మాత్రమే స్పృశించితిని. మిగిలిన మరికొన్ని ప్రధాన నవలలను గురించి ముందు దశలలో వివరింతును.

కాల్పనికోద్యమములో ప్రధముడైన విశ్వనాథ పాశ్చాత్య నాగరికతా సంపర్కములో, కలుషితమై పోవుచున్న సంఘ నియమములను, కట్టుబాట్లను కాపాడి మన పూర్వుల నైతిక జీవనమువైపుకు నడిపి, ఆర్ష ధర్మమును, చాతుర్వర్ణ్యవ్యవస్థను, వివాహ బంధములను గట్టి పునాదుల పైన నిర్మించుటకు పాటుపడెను. శ్రీ గుడిపాటి వేంకటచలం ఆయనకు ప్రత్యర్థిగానిలచి తద్భిన్నముగా మన పూర్వ సంప్రదాయములపైన, మన వివాహ వ్యవస్థపైన విప్లవ ధ్వజము నెత్తి స్త్రీ పురుషుల స్వేచ్ఛాజీవనమును సర్వే సర్వత్రా ప్రోత్సహించి, పూర్వ వ్యవస్థయందలి లోటుపాట్లను నిర్భయముగా చాటి చెప్పిన ప్రతిభామూర్తి. గొప్ప సంస్కర్త.

చలం సృష్టించిన నవలలన్నియు ఆంధ్రదేశములో పెద్ద గాలిదుమారమును రేపినవి. దానితో ఆయనకు కీర్తితో

పాటు, అపకీర్తియు సమృద్ధిగా చేకూరినది. అయన వాడిన భావ, భావములు, స్వీకరించిన ఇతివృత్తములు, చేసిన శృంగార వర్ణనలు చాల తీవ్రమయినవి. మిక్కిలి పదునైనవి. మన సాంఘిక వ్యవస్థను తీవ్రముగా విమర్శించి దానిని సాహసముతో ప్రతిఘటించెను. తన రచనలద్వారా స్త్రీ పురుషులలో విప్లవ భావములను, స్వేచ్ఛావృత్తిని, తిరుగుబాటు తత్వమును ప్రచారముచేసి సాహిత్యములో గొప్ప భావ విప్లవమును రేకెత్తించెను.

స్త్రీలో దాగియున్న నిగూఢశక్తిని, మానసిక ప్రవృత్తిని అయన గుర్తించినంతగా యే ఇతర తెలుగు రచయిత గుర్తించలేదనిచో, అది ఎంతమాత్రము అత్యుక్తి కానేరదు. అయన స్త్రీ శక్తిని బహిర్గతపరచి, నూతన పంథాలో విప్లవాత్మక రచనలు చేసెను.

హైందవ సమాజమునైన, ముఖ్యముగా వివాహ వ్యవస్థనైన అయన విప్లవ శంఖమును పూరించి, స్త్రీ పురుషుల స్వేచ్ఛా ప్రేమ తత్వమును, శారీరక సుఖములను జల పరచుచు, దైవమిచ్చిన భార్య, శశిరేఖ, మైఖానము, జీవితాదర్శము, బ్రాహ్మణీకము, అమీనా, అరుణ మున్నగు నవలల నెన్నింటినో వ్రాసెను. పతితలన్నను, అనాధలన్నను, సంఘ వ్యవస్థకు బలియైపోయి అట్టడుగునపడి క్రుంగ్గుచున్న మూగజీవులన్నను అయనకు అత్యంత అభిమానము. ఆ అభిమానముతో, ఆ ఆదరణతో వారి హృదయాంతరాళ

ములలో, ఎక్కడనో దాగియుండి, ఎవరితోను చెప్పుకొను టకు అవకాశములేని పరమ రహస్యముల నెన్నింటినో చాక చక్యముతో వెలికితీసి, వాటికి వెలుఁగును ప్రసాదించెను.

ఎందరు తనను విమర్శించినను, విరోధులైనను లెక్కిం చక తన విమ్యక్తధర్మమును నిర్వర్తించి, తనకు యథార్థ మని తోచిన విషయమును, మొగమాట పడకుండగ బైటికి విప్పిచెప్పి, వానిని ఇతివృత్తములుచేసి, పెక్కు నవలలు వ్రాసి, ఆంధ్ర నవలా ప్రపంచమున వినూతనమైన మార్గమును చూపి, తనకు ఒక ప్రత్యేక స్థానమును కల్పించుకొనెను.

చలం తన నవలలలో, తాను ప్రతిపాదించిన, నూతన సిద్ధాంతములకు స్వయముగా కట్టుబడక అరుణాచల యోగిగా మారుటవలన, ఈనాడు ఆయన ఆలోచనలకు, రచనలకు కొంత ప్రచారము తగ్గి, సంక్షుభితమైన ఆయన ప్రభావము క్రమముగా వెనుకబట్టినది. అయినను చలం తెలుఁగునాట విప్లవ పంథాలో స్త్రీ పురుషుల లైంగిక సమస్యలకు ఇచ్చిన ప్రాధాన్యత, ఆ దృష్టితో ఆయన చేసిన రచనలు అజరా మరములైనవి. మంచి చేయగల రచనలను, యా దార్థ దృష్టి తో, అతి వాస్తవ దృక్పథముతో రచియించి, తెలుఁగు భారతికి అపూర్వ శోభను ప్రసాదించెను. చలం "ముద్ర" తెలుఁగు నవలలపైన ప్రత్యేకమైనది. ఆయన పంథాను వర్తమాన రచయితలు కొందరు అంగీకరించక పోయినను, ఆయన నిశితమైన భావములను, పదునైన

భాషను, యథార్థ పరిస్థితులను సూటిగా చెప్పిన విధమును అత్యాదరముతో అంగీకరించిరి. నేటికి ఆయన రచనలు
✦ కొందరికి నిత్య పఠనీయములై యొప్పుచున్నవి.

అత్తలు, మామలు, భావలు, మరదలు, ఆడబిడ్డలు తోటికోడండ్లు మొదలైనవారి మధ్య హృదయము నకు నచ్చని భర్తలతో కాపురముచేయుచు, సంఘ మర్యాదలకు, సభ్యతలకు తలవొగ్గి, పతివ్రతలవలె నటించి, అడకత్తెరలో పోకచక్కలవలె నరకయాతనలు అనుభవించుచు లవలేశము గూడ ఆనందమును చవిచూడని అమాయకపు స్త్రీలకు, ఏ ముక్కో, మొగము తెలియని పురుషుడితోనో సంబంధమును గలిపి, అక్కడనుండి ఆ ఇద్దరు ఏమార, తీరములలో, పారి
✦ పోవడము, అక్కడ స్వేచ్ఛా స్వాతంత్ర్యములతో ఇష్టము వచ్చినట్లు అడ్డులేకుండ లైంగిక సుఖము అనుభవించడము, చలం ప్రతి రచనలోను కనబడును. ఆయన రచనల ముఖ్య ఉద్దేశ్యము అదే. ఆపిమ్మట వారి గతేమిటి? అనే ప్రశ్న ఆయనకు ఉదయించదు. ఎంతసేపటికి శరీర సుఖము ఒక్కటే ఆయనకు పరమావధి. ఈ జీవితము అంటే, శరీర సుఖమే కాదుగదా! లైంగిక సంబంధమైన కోరికలను పూర్తి చేసు కోవటమే కాదుగదా! "జీవితము" విభిన్న సమస్యలతో నిండిన గభీరమైన కడలి. ఆ అగాధమైన కడలిలో ఎంత
✦ సేపటికి ఆయనకు కనపడ్డది, ఆయన చూచినది, చూపించినది, లైంగిక సుఖము - స్త్రీ స్వాతంత్ర్యము, రెండే. మరొక విష

యము అయినకు పట్టలేదు. అయిన పట్టించుకోలేదు. స్త్రీ స్వాతంత్ర్యము, ముఖ్యముగా లైంగిక స్వాతంత్ర్యము అయిన ధ్యేయము. "కామి కానివాడు మోహకామికాడు" అన్న వేమన్న సూక్తి అయినకు నచ్చిన పంథాయైనట్లు కన పడుచున్నది.

చలం నవలలు :—

చలం వ్రాసిన "వివాహం" 1928 వ. సంవత్సరములో వెలువడినది. వెంకన్న పంతులు, రామమూర్తి, అన్న తమ్ముల్లు. వెంకన్న డిప్టీ కలెక్టరు. మూర్ఖుడగిట్టని వ్యక్తి. రామమూర్తి అరవై రూపాయల ఉద్యోగి. సంస్కరణ భావములుగల వ్యక్తి. అతడు మరణించగా, అతని భార్యను, కూతురు "రవణ"ను వెంకన్న పంతులు తన ఇంటికి తీసు కొనివెళ్లెను. అయిన భార్య "రామమ్మ" గయ్యాళి. రవణ చాకచక్యముతో పెదతండ్రిని, పెదతల్లిని ఆకర్షించినది.

రామమ్మ మేనమామ వేంకటాద్రిపు. అతడు జిల్లా జడ్జి. అతని సహాయముతో అతనివద్ద చదువుచున్న 'గోపాలరావు' అను బీదవిద్యార్థితో "రవణకు" పెండ్లి జరిగినది. వివాహానంతరము గోపాలరావు వెంకన్న పంతులువద్ద ఉండి కొంత కాలము చదువుకొనెను. అప్పుడు అతడు వెక్కు బాధలను అనుభవించెను. అతని పరిస్థితి చూచి "రవణ" ఎంతయో బాధపడినది. తన భర్త అసహాయస్థితికి మిక్కిలి కుమిలిపోయినది. గోపాలరావు వెంకన్న సహాయముతో ఓవర్సీయరుగోర్సు

చదువుటకు మడ్రాసువెళ్ళి, ఎన్నియో బాధలుపడి తిరిగి వచ్చెను. విలువైన ఒక లైబ్రరీ గ్రంథమును వెంకన్న పంతులు, కుమారులు చించివేసిరి. దాని వెల ఇరువది రూపాయలు. ఆ వెలను ఇప్పించమని పంతులును, గోపాలరావు కోరగా, అతడు తిరస్కరించెను. భర్త అసహాయస్థితికి మిక్కిలి బాధపడి "రవణ" ఇరవై రూపాయలు దొంగతనముచేసి, అతని పుస్తకములలో దాచినది. పంతులు గోపాలరావుపైన నేరము మోపి నానా మాటలు అనెను రవణ తానే ఆ దొంగతనము చేసినట్లు అంగీకరించి, పెదవంకిచి చిడనవ్వు, వవ్వునట్లు చేసినది.

రవణకు గోపాలరావుతో వివాహము జరిగినప్పటి నుండి, అతనిపట్ల ఒకవిధమైన ప్రేమ, అభిమానము, అనురాగము ఏర్పడినది. అతడు తన భర్త. తన "స్వంతము" అను భావము కలిగి. అతనికి జరుగుచున్న ప్రతి అన్యాయమును ఎదిరించి, నిరంకుశత్వము ప్రకటనపట్ల తన నిరసనభావమును ప్రకటిస్తూ, అనురాగమును గనబరచినది.

పరిస్థితులు అనుకూలముగా లేనందున వెంకట్రావు ఆహ్వానముపై రవణ, గోపాలరావులు వారింటికి వెళ్ళిరి. వెంకట్రావు ఏకైక కుమార్తె "అరవింద" వేసవి శెలవులకు అక్కడికి వచ్చినది. ఆమె చాల విచిత్రమైన ప్రవృత్తిగలది. ఆమె మిత్రుడు "వాల్లే" అను నాతడు వారి ఇంటికి వచ్చెను. అరవింద అతడు అతీత శక్తులుగల మహాపురుషుడని, గొప్ప

వ్యక్తి అని చెప్పి, తనవెంట రవణను గూడ అతనిలో కలసి తిరుగుటకు ఆహ్వానించినది. రవణ వారితో కొన్ని రోజులు తిరిగినది. కాని వాగ్లే పరివర్తన సరిగా లేకపోవుటవలన గోపాలరావు రవణను అతనితో కలసి తిరుగవద్దని కాసించెను. మొదట రవణ భర్త ఆజ్ఞను తిరస్కరించినను, ఆపిమ్మట పరిస్థితులను గ్రహించి సమ్మతించినది. ఆపిమ్మట వెంకట్రావు సహాయముతో వారి కాపురము చక్కగను, నిరాఘాటముగను సాగినది.

ఈ నవలలో మిక్కిలి పేదవాడైన గోపాలరావు మానసిక స్థితిని, పరిస్థితుల ప్రభావముతో అతడు పడ్డ బాధలను, రవణ విచిత్ర హృదయమును, వివాహానంతరము అమ్మతో వచ్చిన మార్పులను, చలం అతి సహజముగా వివరించి చూపెను. గోపాలరావు అతి దరిద్రుడు. అసమర్థుడు. అయినను అతడు తన భర్త. తనపైన అతనికి ఏదో అధికారము ఉన్నది అను సంగతిని "వివాహం" అయిన మరుక్షణమునుండి రవణ గ్రహించినది. వివాహ బంధంమువల్ల అంతస్తులు, హెచ్చుతగ్గులు పోయి, కేవముగా 'భర్త' అను భావము ఏర్పడి రవణకు అతనిపట్లగల భక్తి, ప్రేమ, అభిమానము ఏవిధముగా అభివృద్ధిఅయినది, ఒకరిపైన మరొకరికి అధికారము ఏవిధముగా ఏర్పడినది, ఈ నవలలో సహజముగా అయన చిత్రించెను. వివాహము ముగిసిన మరుక్షణమునుండి రవణ గోపాలవుపట్ల ప్రదర్శించిన సానుభూతి గమనించగగినది.

"మైదానం" కవల, చలం రచనలలో చుక్కలలో చంద్రుని వంటిది. అందాల బరణియైన "రాజేశ్వరి" ఒక బ్రిటిష్ సైనికుని భార్య. ఆమె "అమీర్" అను తురకవానితో లేచిపోయి, అంతకుముందు జీవితములో ఏ శరీర సుఖమును కాను ఆ సైనికునుండి పొందజాలకపోయినదో, ఆ సుఖమును, ఆ మానసిక మహదానందమును సంపూర్ణముగా ఏటివొడ్డున కొండల ప్రక్కన ఉన్న ఒక గుడిసెలో వివసించుచు అనుభవించినది. ఆ సమీపములో ఉన్న పెద్ద మైదానములో పగలు, రాత్రి అను భేధము లేకుండగ, ప్రకృతి నంతటిని ఆస్వాదించుచు తన కామ తృష్ణను తీర్చుకొనినది. ఆమె అతనినుండి పొందిన దివ్యసుఖములో, మధురానుభూతిలో సర్వ ప్రపంచమును మరచిపోయినది. "అమీర్" తప్ప ఆమెకు ఈ సృష్టి లో మరొక వస్తువు కనుపించలేదు. అంతయు 'అమీర్' మయమైనది. ఈవిధముగా వారి ప్రేమ ప్రవాహము కట్టలు తెగి, పరవళ్లు తొక్కి ప్రవహించినది. ఆసమయములో "అమీర్" ఒక తోళ్ళ వ్యాపారి కూతురును ప్రేమించి, విఫలుడై "మీరా" అను కుట్రవాని సహాయముతో ఆ స్త్రీని వశపరచుకొనుటకు ప్రయత్నించెను. అదియు ఫలించక కామపీడితుడై బాధపడజొచ్చెను. రాజేశ్వరి "మీరా" సహాయముతో విషయమును గ్రహించి, స్వయముగా ఆ స్త్రీతో కాను సారధ్యముచేసి, అతని కోరికను నెరవేర్చినది. కొద్దిరోజులలో వారి ప్రేమ విఫలమైనది.

"మీరా" తన మంచితనముతో, సుగుణసంపదతో "రాజేశ్వరి" హృదయమును ఆకర్షించెను. ఆ ఇద్దరి మధ్య అవ్యక్త మధురమైన ప్రేమ నడచినది.

ఇంతలో "రాజేశ్వరి" గర్భవతియైనది. అమీర్ ఆ గర్భము తన ప్రేమకు, స్వేచ్ఛకు అటంకమని భావించి దానిని విచ్ఛిత్తి చేసుకోవలసినదని బలవంతపెట్టెను. "రాజేశ్వరి" సంతానవతియై, మాతృమూర్తియై, పెలుగొందవలెనని గాఢముగా వాంఛించి, అతని కోరికను తిరస్కరించినది. కోపముతో అమీర్ ఇంటినుండి వెళ్ళిపోయెను. ఆమె అమీర్ కొరకు తన హృదయమును చంపుకొని గర్భవిచ్ఛిత్తికి లొంగినది. అమీర్‌ను చావలసినదని "మీరా" వర్తమానము పంపెను. ఈలోగా "మీరా" అమెను, ఆమె శరీరమును క్రమముగ వాంఛించదొడగెను. అమీర్ తిరిగి వచ్చెను.

రాజేశ్వరి హృదయమును ఒక వైపు "మీరా" మరొకవైపు "అమీర్" కల్లోలపెట్టిరి. ఆ ఇద్దరి మధ్యన కొంతకాలము ఆమె మానసికబాధ ననుభవించినది. ఒకనాడు "మీరా" బలవంతముచేయగా, ఏటివొడ్డున అర్ధరాత్రి అతనితో ఆమె గడుపుచుండెను. అప్పుడు "అమీర్" వచ్చి స్వయముగా కండ్లతో పరిస్థితినిచూచి కోపోద్రిక్తుడై తన కత్తితో మీరాను వధించుటకు సిద్ధపడెను. రాజేశ్వరి అడ్డముపోయి, ముందు తనను నరికి, ఆపిమ్మట మీరాను

నరకమని గోరినది. మహోద్యోగములోనున్న అతడు "ఆ మీరాతో నిన్ను పంచుకుంటాననుకున్నావా! తురక బిడ్డని-" అని చెప్పి; "అతడో - నేనో" ఒక్కరే ఈ లోకములో జీవించి ఉండవలెనని, తన మనోభావములను వ్యక్తము చేసి, తన కత్తితో తానే పొడుచుకొని నేలకొరిగెను. డాక్టరుగొరకు పరుగెత్తిన "మీరా" పోలీసులతో ఆ హత్య తానే చేసితినని తెలిపి, వారిని అక్కడికి తీసుకొనివచ్చెను. పరిస్థితినంతటిని గ్రహించిన రాజేశ్వరి ఆ హత్యను తానే చేసినట్లు పోలీసులకు తెలిపి, మీరాను ఆ మహా ప్రమాదము నుండి తప్పించి, తాను ఆ చిక్కులో ఇరికినది. ఆమె ఆ మహా త్యాగముతో కథ సంభ్రమాశ్చర్యములను గొలుపుచు ముగిసినది. చలం ఈ నవలలో అక్కడక్కడ మన సంప్రదాయములను విమర్శించిన తీరు అంత సమంజసముగా లేదు. దీని రచన 1934.

సమకాలిక స్వాతంత్ర్యోద్యమమును జలపరచుచు చలం హృదయసాగరమునుండి వెలువడిన నవల "దైవమిచ్చిన భార్య". దీనిలోను స్వార్థపరుడైన పురుషుడు స్త్రీని తనకొరకు వివిధముగా ఉపయోగించుకొనినట్లు ఇతరనవలలలో వలెనే చూపెను.

ఉన్నత కుటుంబమునకు చెందిన పద్మావతి "రాధాకృష్ణ" అను సామాన్య యువకుని ప్రేమించినది. కాని ఒక రెండవపెళ్ళి పెద్దమనిషితో ఆమెకు వివాహము జరిగి

వది. ఏడు సుదీర్ఘ వసంతములు నిర్జీవముగా అతనితో వెళ్ళబుచ్చి తన ఇష్టమువచ్చినట్లు అతనిని ఆడించినది. రాధాకృష్ణ బి. ఏ, పరీక్షలు వ్రాసి, వేసవి శెలవులకు వచ్చి, పద్మావతిని కలుసుకొని ఆమెతో అడ్డు కట్టలులేని నిండైన ప్రేమతో గడిపి, ఆమెకు స్వర్గసుఖములను ప్రసాదించెను.

"న్యాయమూర్తి" అను మరొక వ్యక్తితో పద్మావతి చేరిపోయి. అతనితో కాశ్మీరము చేరుచున్నప్పుడు మరల రాధాకృష్ణ వచ్చెను. వారిద్దరిమధ్య కొంత ప్రేమ మరల సాగినది. ఆసంగతి న్యాయమూర్తికి తెలిసినది. పద్మావతి మోసగ్రస్తుడైన ఆయనతో, మరల రాధాకృష్ణను కాను కలుసుకోవని తెలిపి, ఒప్పించి కాపురము చేయసాగినది.

రాధాకృష్ణ ఇంగ్లాండు వెళ్ళి ఉన్నతవిద్య నభ్యసించి అక్కడ తిలక్ మహారాజు శిష్యుడై దేశభక్తిని, స్వాతంత్ర్యేచ్ఛను పెంపొందించుకొని మాతృదేశమునకు తిరిగివచ్చెను. అతనికి కుంతల అను అమ్మాయితో ఇష్టములేని పెండ్లి జరిగినది. ఐనను ఆ ఇద్దరు కలసి జీవించిరి.

రాధాకృష్ణ మాతృదేశ దాస్యశృంఖలల విచ్ఛేదనకై తన సర్వస్వమును అర్పించి, దేశసేవా కార్యక్రమములలో నిమగ్నుడయ్యెను. ఒకనాడు కాలికట్టులో జరుగు సంఘ సంస్కరణసభకు అధ్యక్షతవహించుటకుగాను వెళ్ళుచుండగా, దేశాటనము చేయుచు మార్గమధ్యములో పద్మావతి అకస్మాత్తుగా అతనికి కలసినది. ఆ ఇరవురి మనస్సులలో గాఢ

ముగా అలముకొనియున్న ప్రేమ మరల సెలవేసి జారిని కలత పెట్టినది. యధేచ్ఛగా ఒకరాత్రి గడపిరి. పద్మావతి వెంట ఉన్న వేరొక స్త్రీవలన ఈ విషయమును తెలిసికొని న్యాయమూర్తి రాధాకృష్ణపైన కేసుపెట్టుటకు నిశ్చయించెను. ఆ స్థితిలో చివర పర్యాయము పద్మావతి రాధాకృష్ణ వద్దకు వచ్చి అతనిలో సుఖమును తనివితీర పొంది, అతని ఒడిలోనే ప్రాణము విడిచినది.

న్యాయమూర్తి అకడ్కడికి వచ్చి, పద్మావతి మృత దేహమును చూచి "మనమిద్దరము కలసి..... చంపావు ..... ఇద్దరం..... ముక్కలుగా చీల్చుకున్నాం. ....." అంటాడు రాధాకృష్ణతో. దీనితో కథ ముగిసినది.

మైదానంలో అమీర్, మీరాల మధ్య రాజేశ్వరి నలిగిపోయినది. దైవమిచ్చిన భార్యలో రాధాకృష్ణ, న్యాయమూర్తుల మధ్య పద్మావతి సతమతమైనది.

రాజేశ్వరీ పద్మావతులలో, పద్మావతి వివేకవతి. న్యాయమూర్తి రాధాకృష్ణలు తనకొరకు పోట్లాడుచున్నప్పుడు ఆమె ఇచ్చిన సమాధానమును తిలకించండి- "నేను మీ ఎవ్వరిదాన్ని కాదు - నాదాన్నే నేను-" అని. చలం, సంఘసేవా పరాయణుడు, దేశభక్తుడు అయిన రాధాకృష్ణను "దైవమిచ్చినభార్యలో" ఎంతయాత్మగా చిత్రించెను. రాధాకృష్ణకు "సంఘము" ఇచ్చిన భార్య "శకుంతల." దైవ

మిచ్చిన భార్య "పద్మావతి" చక్కని నమున్వయము.

"జీవితాదర్శం" నవలలోని పే) ము ప్రవాహము మనా)సు బీచీలో ఆరంభమై పె క్కు మలుపులు తిరిగి, అనంతపురములో ఒక మార్గముపట్టి, అవెంటనే అది విచ్ఛిత్తి అయిపోయి, మరల గమ్యములేకుండా కొంత ఉద్వేగముతో నడిచి "భీ మ్లీ" బీచీలోని ప్రశాంత వాతావరణములో కొంత సాగి, చివరకు జీవితాదర్శము, ధ్యేయము అయిన "శాంతి" కొరకు అన్వేషించి, ఆమార్గములో అది సమాప్త మైనది.

"లాలస" విద్యాధికురాలు. అపురూప లావణ్యవతి. పెక్కుమంది విద్యార్థులతోను, విద్యార్థినులతోను పరిచయముకలది. లక్ష్మణసింగ్ ఆమెను మద్రాసు బీచీలో మొదటిసారి చూడగానే ప్రేమించెను. ఆ డమ్ను అనే వానితో ఆమెకు శరీర సంబంధమున్నదని అతనికి తెలియును. ఆ ఇద్దరిని వివాహముచేసుకొనుటకు నిర్ణయించుకొని పెద్ద డిన్నర్ పార్టీనిగూడ ఏర్పాటుచేసిరి. ఆడమ్ను, ఆమెను వివాహమాడుటకు నిరాకరించెను. ఆమె దైబ్బతిని స్వర్గా మమునకు వెళ్ళినది.

కొంతకాలము పిమ్మట సముద్రపు ఒడ్డున ఉప్పు సత్యాగ్రహము చేయుచున్న గుంపులోనికి సింగు వెళ్ళెను. ఆ బృందమునకు నాయకత్వము వహించుచున్న లాలాసను చూచి ఆశ్చర్యచకితుడయ్యెను. పోలీసులు ఆమెను అరెస్టు

చేసి ఒక సంవత్సరము కఠినశిక్ష విధించి, వేలూరు జైలుకు పంపిరి. అమె విడుదలనాటికి సింగు అక్కడికివెళ్ళి, అమెను కలుసుకొనజాలక తిరిగి మద్రాసు చేరుకొనెను. సింగ్ లాలస పైన వ్యామోహముతోనే "లా" పూర్తిచేసి, ప్రాక్టీస్ గూడ ముగించుకొని, అనంతపురములో ప్రాక్టీసు పెట్టుటకు వెళ్లుచుండగా, రైలులో అకస్మాత్తుగా లాలస కలిసి, అతనితో వివాహమాడుదునని తెలిపెను. అమెకొరకు తీవ్ర అన్వేషణ జరిపినవాడు గనుక, ఆ ప్రతిపాదనను సంతోషముతో అంగీకరించి, అనంతపురములో వివాహము చేసుకొనెను. ఒకనాడు లాలస "మాన్వులంకర్" అను సంగీత విద్వాంసుని "పాటను" విని ముగ్ధురాలై అతనివెంట వెళ్ళినది. వెళ్ళిపోవు చున్నప్పుడు విశాలహృదయుడైన సింగ్ అమెను ఒక్కమాట అనలేదు. కొద్ది నెలల తరువాత మాన్వులంకర్ తనను విడిచి పెట్టివేయుట, తిరిగి అమె ఎట్టకేలకు సింగ్‌ను చేరుట వ్రాసినది. సింగ్ అమెపైన గాఢానురాగము కలిగివున్నను, సంఘమునకు వెరచి ప్రత్యుత్తరము వ్రాయజాలకపోయెను.

సింగ్, రామారావు అను మిత్రునితో భీమ్లాకి వెళ్లెను. అక్కడ బీచ్‌లో ఎవరో 'ఫ్రెంచివారి' పిల్లతో పరిచయమై స్నేహము కలిగినది. ఆ స్నేహము క్రమముగా వృద్ధిజెంది, అప్తమిత్రులై పోయిరి. అతడు అహర్నిశలు ఈ నూతన మిత్రులకు, కావలసిన సౌకర్యముల నన్నింటిని సమకూర్చుచు, తన ఇంటికి ఆహ్వానించుచుండెను.

ఆ మిత్రులిరువురు ఒకనాడు వాహ్యాళికిపోయి సముద్రపు టొడ్డున తిరిగి తిరిగి చీకటిపడిన పిమ్మట బసకువచ్చుచుండగా సముద్రము ఉప్పొంగి మార్గమంతయు జలమయమైనది. దారి తెన్ను తెలుసుకొనజాలక ఆ ఇరువురు మిక్కిలి ఖేదపడు చున్నప్పుడు ఒక అపరిచిత స్త్రీ వారిని ఆ గండమునుండి రక్షించినది. సింగ్ ఆ చీకటిలో తమకు తోడ్పడిన ఆ స్త్రీ "లాలస" యని ఊహించెను. ఆ రాత్రి అంతయు ఆ ఊహా లోకములో అతడు గడిపెను. మరునాడు దేశికాచారి వగైరాగా సముద్రముపెంట వెళ్ళుట తప్పని మందలించి, ఆ చీకటిలో వారిని ఆ గండమునుండి కాపాడినది తన భార్య అని తెలిపెను. ఆ మాటలతో సింగ్‌కు ఆమెను చూడవలెనను కోరిక ప్రబలమైనది. దేశికాచారి ఇంటిలో లేని సమయమున అక్కడికి వెళ్ళి ఆమెనుచూచి "లాలస" అని నిర్ధారణ చేసికొనెను. మరల ఆమెను తన భార్యగా స్వీకరించి, తన దానిసగా చేసికొనవలెనని ఉవ్విళ్ళూరదొడగెను.

దేశికాచారి బేంకులను దోచి, లక్షలు గడించిన మోసగాడైనను హృదయమున్న గొప్ప వ్యక్తి. సింగ్ లాలసను తిరిగి తనవెంట తీసికొని వెళ్ళదలచినచో కాను అభ్యంతర పెట్టబోనని చెప్పి, వారు ఒక నిర్ణయము చేసికొనుటకు అను కూలముగా ఇంటినుండి, బయటకు వెళ్ళిపోయెను.

"లాలస" ను తనవెంట రమ్మని సింగ్ బ్రతిమాలెను. బలవంతపెట్టెను. ఆమెకు అతనియందు గొప్ప అభిమానము,

పేమ యిన్నను, అతనిననుసరించి వెళ్ళుటకు అంగీకరించ లేదు. లైంగిక సుఖముకన్న తాను హృదయములో నిరంత రము కాంక్షించిన యదార్థమైన "శాంతి" తనకు దేశికా చారి వద్దనే లభ్యమగునని తలచినది. స్వేచ్ఛకొరకు ఇన్ని తిరుగుళ్లు తిరిగి, ఇన్ని పోకడలు పోయి, జీవితమును "ఒక చెల గాటను" చేసిన లాలస జీవితాదర్శము "శాంతి". శరీర సుఖము బుద్బుదపాయము. ఆ శాంతిముందు అన్నియు వ్యర్థమనుకొ..... ఇక తన శేష జీవితమును ప్రశాంత వాతావరణములో "శాంతి" కొరకు అన్వేషించదలచినది... ... "తాను" అని సింగ్‌కు తన మనోభావమును తెలిపినది. ఎంత విచిత్రమైన ముగింపు.....

"అమీనా" నవల నాలుగు భాగములు. మొదటి రెండు భాగములు 1926 వ. సం. లోను, మిగిలిన రెండు భాగములు 1942 వ. సం. లోను ముద్రితమైనవి. ఒక విధ ముగా ఇది రచయిత ఆత్మకథ. "సుబ్బులు" ఆయన ధర్మ పత్ని. ఆమె "లోకానికి, సంఘానికి" ప్రతీక.

"అమీనా" తురక పిల్ల. ఒక నౌకరు పిల్ల. అయి నను రచయిత హృదయమునకు నచ్చినది. ఆమె ఒక "ఎద గని పువ్వు"—ఆమె రచయితకు జీవిత సర్వస్వము. నిరంతరము అతని స్మృతి పథమునుండి తొలగిపోని ఒక అపూర్వ సౌందర్యరాశి.

"అరుణ" నవల 1935 వ. సంవత్సరములో వెలువడి

వదిం చలం తన జీవితములో దర్శించిన " స్త్రీ " సంపూర్ణ స్వరూపము "అరుణ". వచ్చిన ప్రేయసి. అతని దృష్టిలో ఆమెకు చావు లేదు.

బీస్ట్ - నాగస్ - రచయిత, ముగ్గురు అరుణకు ప్రేమి కులు. ఈ ముగ్గురు ఆమెను తనివిదీర అనుభవించిరి. ఈ ముగ్గురి మధ్య ఆమె - ఇది ఊహాతీతమైన రాసలీల. అరుణ మిగిలిన ఇద్దరికన్న రచయితపై మొగ్గుచూపి ప్రేమించినది. ఆమె ఆవిషయమునే "..... ఎవరినన్నా, కొంచెమన్నా ప్రేమించానా అంటే - నిన్నే - అందుకనే నీపాదాలవద్దే నిష్క్రమిస్తున్నాను-" అని హృదయము విప్పిచెప్పినది.

"అమీనా, అరుణ" చలం హృదయ సామ్రాజ్యమును అక్రమించుకొనిన స్త్రీలు. అయన ఆ ఇద్దరిని ఎంతయో అధికముగా ప్రేమించి, ఆరాధించటమువలననే ఆయన హృదయమును, మనస్సును వారు ఆకట్టుకొనగలిగిరి.

తెలుఁగు సాహిత్యములో ఆ ఇద్దరు చలం సృష్టించిన అపూర్వమైన స్త్రీలు.

తెలుఁగు రచయితలలో స్త్రీ, పురుషుల స్వేచ్ఛా ప్రియత్వమును, పురోగామిత్వమునకు చుట్టి ఇచ్చినంత ప్రాధాన్యత, ప్రాముఖ్యత మరొక తెలుఁగు రచయిత ఇవ్వలేదన్నసంగతి నిర్వివాదాంశము. అమీనా, అరుణ రెండు, ఈ దృక్పథమునకే అధిక ప్రాధాన్యతనిచ్చి రచయిత వాసినను, దానితోపాటు అనన్య సదృశమైన శైలీ సంవిధాన విన్యాస

ములలో అవి వెలుగొంది, సాహిత్యపరముగాను కొంత కీర్తి గడించుకొనినవిగా నుండుట గమనార్హము.

శ్రీ విశ్వనాథ మన కట్టుబాట్లను కట్టుదిట్టముగా కాపాడి రచనలు చేయుగా, శ్రీ చలం, స్త్రీ, పురుషుల సమాన ప్రవృత్తిని, విశృంఖలత్వమును బలపరచెను. ఇక కాల్పనికోద్యమ నిర్మాతలలో మూడవవాడైన శ్రీ అడవి బాపిరాజు తనకుగల పరిణతభావ శబలతో, విశాల దృక్పథముతో భారతదేశమునను, సర్వ ప్రపంచమునను చెలరేగిన సమకాలికోద్యమములకు, యుద్ధములకు అధిక్షేపనిచ్చి, మన దేశమునందలి అన్ని కులములకు, మతములకు, వర్గములకు, రాజకీయపక్షములకు ఐకమత్యతను, సామరస్య పూర్వకముగా కలిగించి, 'వసుధైక' కుటుంబ నిర్మాణమునకు పాటుపడెను. నవలా రచనలో ఆయన స్వీకరించిన 'ఇతివృత్త'ములు ఆంధ్రదేశమునకు, ఆంధ్రుల జీవితమునకు సంబంధించినవైనను, అందలి పాత్రల మనస్తత్వములు, ఆలోచనలు, కార్యక్రమములు అతి గంభీరములై అవి విశ్వశ్రేయస్సును, సర్వమానవ కళ్యాణమును, సౌభ్రాతృత్వమును, సౌహార్ద్రిత్వమును కాంక్షించి, ఆదర్శమూర్తులై వెలుగొందినవి. శ్రీ బాపిరాజు కళా తపస్వి. గొప్ప భావుకుడు. జాతీయవాది. గాంధేయ పథగామి. దేశ స్వాతంత్ర్యోద్యమములో భాగస్వామియై పెక్కు ఇడుములుపడి, కారాగార వాసక్లేశముల ననుభవించెను. దేశభక్తుడు, కళాకారుడునైన శ్రీ బాపిరాజు

దూరదృష్టితో, బుద్ధిబలముతో, తన నవలలయందలి పాత్రల నన్నింటిని వైవిధ్య కళామూర్తులుగను, సంఘ సంస్కర్తలుగను, మానవాళి అభ్యుదయమునకు పాటుపడిన ఆదర్శవాదులుగను, గుణ, శీల, సంపన్నులుగను మలిచి మనకందించెను. ఆ పాత్రలన్నియు, సజీవ చిత్రములై మన మనోనేత్రములముందు పరిభ్రమించుచుండును. అవి పఠితలను కదిలించి, కవ్వించి, కర్తవ్యమును ప్రబోధించును.

సృజనాత్మకము, సౌందర్యాత్మకమునైన ఆయన రచనలలో జాతీయోద్యమము, ఆంధ్రత్వము ప్రతిచోట గనుపించును. గ్రామీణ జీవితమనిన, పల్లెపట్టులనిన ఆయనకు ప్రాణప్రదము. ఆంధ్రదేశమునందలి ప్రముఖ చారిత్రక స్థలములైన అమరావతి, నాగార్జునకొండ, భట్టిప్రోలు, ఘంటసాలలతో పాటు; హంపి, విజయనగరము, ఎల్లోర, అజంతా మొదలైన శిల్పకళాఖండముల నన్నింటిని తన నవలలలో ప్రతిభాపూర్ణముగా చిత్రించెను. మన పూర్వాంధ్రులకు శిల్ప, చిత్రలేఖనములవంటి లలితకళలయందుగల అభినివేశమును, సమర్థతతో తన రచనలలో ఆయన చూపి, మన గత వైభవమును వివరించెను.

చారిత్రక నవలలు :-

"హిమబిందు" ప్రథమాంధ్ర రాజులైన శాతవాహనులకు సంబంధించిన చారిత్రక నవల. శ్రీముఖ శాతవాహనుడు ధాన్యకటకమును రాజధానీ నగరముగా జేసికొని, ఆంధ్ర

సామ్రాజ్యమును వైభవోపేతముగా పాలించి, పాటలీపుత్ర మును జయించి, జంబు ద్వీప చక్రవర్తియైన విధమును ఈ నవల తెలుపును.

శ్రీముఖ శాతవాహనుడు రాజ్యాధిపత్యము చేపట్టిన పంధ్రొమ్మిది సంవత్సరములకు, ఆయన తన జన్మదినోత్సవ ముల సందర్భమున ఏర్పాటుచేసిన శకటచోదక పరీక్షలో "సువర్ణశ్రీ" అను యువశిల్పి. భారత వణిక్సార్వభౌముడైన చారుగుప్తుల శకటమును ఓడించి దిగ్విజయమును పొందెను. చారుగుప్తుల కుమార్తె 'హేమబిందువు' సువర్ణశ్రీని గాఢముగా ప్రేమించినది. తండ్రి ఓటమికే ఆమె కొంత పరితపించినను, అతనిని తనవానినిగా చేసుకొనవలెనను కోరిక ఇసుమంతయు తగ్గలేదు.

శాతవాహన మహారాజులు బౌద్ధులు, వైదిక మతానుయాయులైన కొందరు, పరరాజుల సహాయముతో ఆ రాజ్యమును కూలదోయుటకు కుట్రలు పన్నిరి. మహా రాజు ద్వితీయ కుమారుడైన మంజుశ్రీని ఎవరో దొంగి లించుకొనిపోయిరి. రాజ్యము అల్లకల్లోలమైపోయినది. స్థాల దివ్యహోమర్షికి, రాజ్యమున సంభవించుచున్న కుట్రలతోను, రాజకుమారుని దొంగలు తస్కరించుకొని పోవుటలోను, సంబంధమున్నదని వదంతియున్నది. మహారాజు కుట్ర వెనుకనున్న యథార్థపరిస్థితులను గ్రహించుటకు గట్టి ప్రయ త్నము చేయుచుండెను.

చారుగుప్తుడు యువరాజైన శ్రీకృష్ణుని తన అల్లునిగా చేసికొనుటకు ప్రయత్నించుచుండెను. హిమబిందు, మేనత్త కుమారుడైన సమదర్శి, ఆమెను వివాహమాడ సంకల్పిం చెను. హిమబిందు సువర్ణశ్రీనితప్ప అన్యులను వివాహ మాడుటకంగీకరించలేదు.

స్థాలతిష్యులు ఒకవైపు రాజుతో స్నేహము చేయుచు, వేరొకవైపు "విషబాలను" సృష్టించి, ఆమెను యువరాజుపైకి ప్రయోగము చేయుచుండెను.

పులింద, మగధ, మాళవదేశాధీశులు తమపైకి దండెత్తి వచ్చుచున్నట్లు గ్రహించి, మహారాజు మంత్రి సామంతులతో సంప్రదించి, వేరువేరుగా వీరితమ సైన్యములు ఆయా రాజులపైకి పంపించుటకు తీర్మానించెను.

చారుగుప్తుడు "హిమబిందు"తో ఆమెను యువ రాజునకిచ్చుటకు సంకల్పించిన సంగతిని తెలిపెను. మహారాజు గూడ సమ్మతించినట్లు చెప్పెను. ఆవార్త ఆమె హృదయము నకు శూలమై నాటినది. సువర్ణశ్రీకి ఈవార్త తెలిసినది. తొలుత అతడు బాధపడినను, యువరాజుకు ఆమె అర్ధాంగి యగుటయే సమంజసమని తెలిపి, తాను అందులకు తోడ్పడుదునని తెలిపెను.

యువరాజైన శ్రీకృష్ణుడు తండ్రి ఆజ్ఞ ననుసరించి ఉజ్జయినిని జయించుటకు వెళ్ళుచు, మార్గమధ్యములో విష బాలను చూచి, మోహించి ఆమెతోడిదే లోకమై ప్రవ ర్తింపదొడగెను.

భాగ్యకటకములో "హిమబిందు" ను చోరులు తస్కరించిరి. ఆమెను వెతుకుటకు సువర్ణకీ బయలుదేరి, శబర నాయకుడైన మహాబలగోండు సహాయముతో ఒక గుహలో బంధింపబడిన, హిమబిందును, ఆమె మాతామహి ముక్తావళీదేవిని, మహారాజు రెండవ కుమారుడైన మంజుశ్రీని చాకచక్యముతో కనుగొనెను.

చారుగుప్తుడు "హిమబిందు" ను యువరాజ్ఞిని చేయుటకు పల్పిన కృషి వ్యర్థమైనది. యువరాజు విషబాలను తప్ప అన్యులను వివాహమాడనని విశదపరచెను. మహారాజు సంకటస్థితిలో పడిపోయెను.

✦ ఆంధ్రులు పాటలీపుత్రమును, జంబుద్వీపమును వశపరచుకొనిరి. కుమారుని వివాహసమస్య రాజును వేధించసాగినది. మహారాజు కర్తవ్యమును బోధించవలసినదని తమ గురువైన అమృతపాదాచార్యులను వేడుకొనెను. అతడు హిమబిందు సువర్ణకీ ప్రేమవృత్తాంతమును తెలిపి, విషబాలయే యువరాజునకు తగిన భార్య అని బోధించెను.

అమృతపాదాచార్యులు విషబాలనుగురించి తెలుసుకొనుటకు స్థూలతివ్యమహాముని ఆశ్రమమునకు వచ్చి, ఆతనితో వాదించెను. స్థూలతిష్యుడు, అమృతపాదాచార్యులు తన కుమారుడని గ్రహించెను. అటులనే స్థూలతిష్యుడు, తన తండ్రి ఇతడు అని గ్రహించెను.

అమృతపాదాచార్యులు తన యుక్తిచాతుర్యముతో ఆర్య,

బౌద్ధధర్మములు రెండును సన్నిహిత సంబంధముగలవని నిరూపించెను.

విషబాల అమృతబాలయై శ్రీకృష్ణుని వివాహమాడినది. ఈ విషయము తెలియక సువర్ణశ్రీ యుద్ధము ముగిసిన పిమ్మట భారతదేశమునందలి బౌద్ధ సంఘారామములను దర్శించుటకు వెళ్ళెను. ఆ సంగతి తెలిసికొని హిమబిందు గృహమును విడిచి దేశాటనము చేయుచు, వారణాసిలో అతనిని కలసికొనినది. సువర్ణశ్రీ సన్యసింతునని హిమబిందుతో చెప్పుచున్నప్పుడు, హఠాత్తుగా చారుగుప్తుడును అక్కడికి వచ్చి, ఆ ఇరువురి ప్రేమను మన్నించి వివాహమున కిష్టపడెను. అంతటితో కథ ముగిసినది.

"హిమబిందు" రాజ్ఞీత్వమును సైతము తిరస్కరించి సామాన్య శిల్పియైన సువర్ణశ్రీని వివాహమాడుట ఈ కథా విశేషము. ఉదాత్తమైన ప్రేమకు ఈ లోకములో సాటి మరియొక్కటి లేదన్న సత్యమును ఈ కథ మనకు చాటుచున్నది. అంతేగాక సైద్ధిక, బౌద్ధ ధర్మముల సారూప్యము తండ్రి కొడుకులను చిహ్నముగాచేసి చూపుటలో బాపిరాజు మిక్కిలి ఔన్నత్యమును ప్రదర్శించెను.

"గోనగన్నారెడ్డి" బాపిరాజు రెండవ చారిత్రక నవల. శ్రీ శ్రీ కాకతి రుద్రమదేవి మహారాజ్ఞిగా ఆంధ్ర మహా రాజ్యమును విజయవంతముగా పాలించుచున్న కాలమున ఆమెకు కుడిభుజముగానుండి, సర్వవిధముల ఆమెకు సహాయ

పడి, వర్ధమానపురమును ముఖ్యపట్టణముగా చేసికొని, పశ్చి మాంధ్ర భూభాగమునంతటిని సమర్ధతో ఏలిన మాండలిక ప్రభువు గోనగన్నారెడ్డి. కాకతీయ సామ్రాజ్యమును కబళించు టకు మహారాష్ట్రులు సంకల్పించినప్పుడు ప్రభుభక్తి పరాయ ణుడైన గన్నారెడ్డి వారికి ఎదురొడ్డి నిలిచి తన భుజబల ముతో, బుద్ధివైభవముతో, రాజనీతి చతురతతో వారిని ఓడించి, తమ ప్రభువుకు విజయమును చేకూర్చటము ఇందలి ప్రధాన కథ. గోనగన్నారెడ్డి ప్రదర్శించిన ప్రభుభక్తి, అతని సాహసముతో ప్రదర్శించిన వీరత్వము ఇందులో చక్కగా వివరింపబడినది.

"అడవి శాంతిశ్రీ" మరియొక చారిత్రక నవల. ఆంధ్ర దేశమున ఒకనాడు బౌద్ధమతము మూడు పూవ్వులు, ఆరు కాయలుగా వర్ధిల్లినది. దాని తాకిడికి వైదిక మత పునా దులు కొంత సడలినవి. ఈ నవలలో బాపిరాజు హిమ బిందువులోవలెనే వైదిక, బౌద్ధమత ధర్మములకు జరిగిన సంఘర్షణలు, ఒకడాసిని మరియొకటి నాశనముచేయుటకు చేసిన ప్రయత్నములు వివరింపబడినవి. మహా విద్వాంసుడు, బహుముఖ ప్రజ్ఞాశాలి, బహు గ్రంథకర్త, ప్రముఖ బౌద్ధ మతాచార్యుడు నైన ఆచార్య నాగార్జునుని ఆశీఃప్రభావ ముతో విజయపురియందు ఇక్ష్వాకు రాజ్యస్థాపన జరిగిన విధ మును ఇందు చూపబడినది. ఆనాటి రాజులు, రాణులు, వారి ధర్మప్రవృత్తి, రాజకీయ చతురత ఇందు చక్కగా వివరించిచూపెను.

శ్రీ బాపిరాజు తమ చారిత్రక నవలలయందు మిక్కిలి నేర్పుతో ఆనాటి చారిత్రక జీవన చిత్రణకు, దాని పునర్నిర్మాణమునకు అధిక ప్రాధాన్యతనిచ్చుటయేగాక, మత, రాజకీయ, నైతిక సంబంధమైన విషయములను గూడ యథాతథముగా చిత్రించి చూపుటకు ప్రయత్నించి విలువగల మంచి ఫలసాయమును అందించెను. భాషను వాడుటలో, సంభాషణలు వడుపులలో పాత్రలను చారిత్రక పరిస్థితుల కనుగుణ్యముగా మలచుటలో, వర్ణనలు చేయుటలో, చారిత్రక సత్యములను ప్రదర్శించుటలో ఆయన గనబరచిన నేర్పు అసాధారణమైనది. గనుకనే ఆయన చారిత్రక నవలలకు దేశమున అంతటికి ప్రఖ్యాతి లభించినది.

సాంఘిక నవలలు: —

పట్టభద్రుడు, నిరుపేదయైన "గోనంగి" పెళ్ళిచూపులకై మద్రాసువెళ్ళి "సీతాకుమారి" అను ధనవంతుల పిల్ల చేత తిరస్కరింపబడి, వీధిపాలై, రకరకముల కష్టముల ననుభవించి చివరకు తంజావూరు నాయకరాజులకు చెందిన ఒక వేశ్యకుమార్తెయైన "అనంతలక్ష్మి" ని ప్రేమించి, గురువై చివరకు వివాహమాడెను.

బ్రతుకుదెరువుకై వచ్చిన గోనంగి ఒక ప్రైవేటు కంపెనీలో సేల్స్‌మెన్‌గను, హోటలులో సర్వరుగను, చలనచిత్రములో నాయకుడుగను, పత్రికా సంపాదకుడుగను, విభిన్నమైన వృత్తులు చేపట్టి యుంచి అనుభవమును గడించెను.

జాతీయవాది. దేశభక్తుడు నైన గోనంగి, మొదటి పర్యాయము "కమ్యూనిష్టు" అని, రెండవ పర్యాయము "కాంగ్రెసు" అని కీర్తిష్ట జన్మస్థానము నలంకరించెను. మహాత్మునియందు, ఆయన నెరపిన మహోద్యమములయందు అతనికి అచంచలమైన ఆత్మవిశ్వాసము.

ఈ నవలయందలి పాత్రలన్నియు విభిన్న రాజకీయ పార్టీలకు చెందినవారై నను, గోనంగితో అందరికి, ఏదో ఒక విధముగ, ప్రత్యక్షముగనో, పరోక్షముగనో సంబంధ మున్నది. అతనిచుట్టు పాత్రలన్నియు చంక్రమణము చేసినవి. రెడ్డి సామ్యవాది, బోసుపక్షీయుడు మధుసూదన్. జాతీయ ముస్లిం రియాసత్. ముస్లింలీగు మొహారున్నిసా. కాంగ్రెసు పక్షము అనంతలక్ష్మి. భక్తి పక్షము జయలక్ష్మి. జస్టిసు పక్షమున అంబుజము. ప్రజాపక్షము వినాయగంపిళ్లై. ఆంగ్లో ఇండియన్ సంఘపక్షమున సారా. వీరందరును గాంధేయ పథ గామియైన గోనంగికి ఆత్మీయులు. అతని ఆశయములపట్ల సమ్మతముంచి, అతనిని అనుసరించి తిరిగిరి.

అపురూప లావణ్యవతి, సుగుణాల ప్రోవుయైన అనంత లక్ష్మిని, కోటీశ్వరుడైన ఒక చెట్టియార్ కోరుమించి, వలలో వేసికొనుటకు ప్రయత్నముచేసి, విఫలమనోరథుడై స్వార్థ బుద్ధితో అతడు పగతీర్చుకొనుటకు పన్నిన పన్నాగములు, చేసిన కుట్రలు, సలిపిన దుస్తంత్రములు, పోయిన పోకడలు దీనిలో పూసగ్రుచ్చినట్లు చిత్రించి, చివరకు అతడు గోనంగికి,

లొంగిపోయిన విధము, విశాలబుద్ధితో అతనిని క్షమించిన తీరు బహు చమత్కారముగాచూపి "చంపదగినయట్టి శత్రువు దన చేత చిక్కినేని కీడు సేయరాదు-పొసగ మేలుచేసి పొమ్మ్నాను టయేచాలు-" అన్న 'వేమన్న' నీతిని ఇందులోచూపెట్టెను.

ఈనవలలో కమ్యూనిష్టుపార్టీకి చెందిన రెడ్డికి, జాతీయ వాది ఐన చాదురాణితో; బ్రాహ్మణ వితంతువుకు భర్త మరణానంతరము జన్మించిన కోనంగికి, వేశ్యయైన జయలక్ష్మ్ని కుమార్తె అనంతలక్ష్మ్నితో; క్రాంగ్రేసు ముస్లిమైన రియాసత్ అలీకి, ముస్లింలీగుకు చెందిన మొహరున్నిసాతో; వివాహసంబంధమును కలిపి సర్వ సమభావముతో నిండిన వర్ణాంతర వివాహములను పోత్సహించి, నవలా రచనలో ఒక నూతన దృక్పథమును కలిగించి (Cosmopolitan out look) తో వ్యవహరించెను. ఇంతటి విశాల దృక్పథముతో వెలువడిన తెలుఁగు నవలలు ఒకటి రెండు మాత్రమేఉన్నవి.

ప్రథమ ద్వితీయ సంగ్రామముల మధ్య భారతదేశమునను, సర్వ ప్రపంచమునను నడచిన అన్ని ఉద్యమములకు ఈ నవల ఒక వ్యాఖ్యానము. మహాత్ముడు నడపిన సర్వ ఉద్యమములు దీనిలో ప్రతిబింబించినవి.

"మంగళాదీని, మంగళ మధ్యాని, మంగళాంతాని" అన్న మన సాహిత్య నియమమును, భాపిరాజు ఇందులో చక్కగా పాటించెను.

శ్రీ భాపిరాజునకు ఆంధ్రదేశమున ప్రముఖ నవలా

కారుడుగా కీర్తి ప్రతిష్టలను సమకూర్చినది. "నారాయణ రావు" నవల. 1934 వ. సంవత్సరమున ఆంధ్ర విశ్వవిద్యా లయమువారు నడపిన నవలారచన పోటీలలో విశ్వనాథవారి వేయిపడగలతో పాటు దీనికిని బహుమతి లభించినది.

అళ్వలాపురము జమీందారు కుమార్తె శారదకు, కొత్తపేట భూస్వామి కుమారుడైన నారాయణరావునకు వైభవోపేతముగా వివాహము జరిగినది. వివాహము ముగిసిన పిమ్మట ఆర్థిక సంబంధమైన హెచ్చుతగ్గులు, అంతస్థుల బేధములు ఏర్పడి ఆ ఉభయకుటుంబముల మధ్య కలతలు బయలు దేరినవి.

శారదకు, జగన్మోహనరావు మేనమామ కొడుకు. ఆ ఇరువురికి వివాహము జరుగవలసియుండెను. కాని జరుగ లేదు. అతడు శారద మనస్సులో నారాయణరావుకు వ్యతిరేకముగా "విషబీజములు" నాటెను.

నారాయణరావు, శారదల పునస్సంధానమునకు ఏర్పాట్లు జరిగినవి. గర్భాదానమునాటి రాత్రి నారాయణ రావుతో శారద "నాకు - నీపైన ప్రేమలేదు -" అని తెలి పినది. అతడు ఆ దుస్సంఘటనకు కించపడి, మిత్రుడైన పరమేశ్వరమూర్తితో కలసి ఉత్తర హిందూదేశమంతయు పర్యటించి కొంతకాలమునకు ఇంటికి చేరుకొని, ఆపిమ్మట మద్రాసులో వకీలు వృత్తిని ప్రారంభించి, చెల్లెలు సూర్య కాంతిమునకు, భార్య శారదకు పాఠములు చెప్పి, ఉన్నత

పరీక్షలకు కూరుచుండబెట్టి నెగ్గునట్లు చేసెను. నారాయణ రావు గుణగణములను ప్రతి వ్యక్తి పొగుడుచు, అతనితో స్నేహముచేయుటకు ఎందరో సంకల్పించుట గమనించిన శారద హృదయము క్రమముగా కల్లోలపడినది. క్రొత్త పేటలో మహోగ్నిప్రమాదము సంభవించినప్పుడు అతడు సలిపిన సాహసకృత్యములు ఆమెకు దిగ్భ్రాంతిని కలిగించినవి. సద్గుణ సంపన్నుడు, దయార్ద్రహృదయుడు, లలితకళాస్రష్ట యైన తన భర్తపట్ల తన ప్రవర్తనకు కలవరపడినది. శ్యామ సుందరి తనతో "నీ భర్త భగవంతుని అనుగు చెలికాడు-దివ్యుడు - నీ అదృష్టం తల్లీ - ఆయన్ను సర్వవిధాల పూజ చెయ్యి-" అనటము; అక్క శకుంతల "అలాంటి భర్తే నాకు దొరికి వుంటే ఈ జన్మలో నాకింకేమి కావాలి. నీ అంత అదృష్టవంతురాలు లేదు" అనటము; తండ్రి "శారదా! నా ముద్దుతల్లీ! నీకై దేశదేశాలు గాలించి సేకరించిన నాయకమణిని నీ తల ధరించుగో - అది అతి పవిత్రమైనది-" అని అనటము.

ఈ మాటలన్నియు శారద హృదయమును క్రమముగా మార్చదొడగినవి. ఎన్నో క్లిష్టపరిస్థితులను అధిగమించి చివరకు శారద నారాయణరావును తన హృదయ సామ్రాజ్యమునకు అధినాథునిగా అంగీకరించి, అతనితో తనకు వివాహము జరుగుట తన పూర్వజన్మ సుకృతమని భావించి, తన తప్పును గ్రహించి, తన "సర్వస్వము" అతడుగా తలచి

పుష్పమాలాంకృతుని జేసినది. మహాసౌభాగ్య సంపన్నుడైన నారాయణరావు ఆ దివ్య సౌందర్యతేజః పుంజమును ఒక్కసారి తన హృదమునకు హత్తుకొని స్వర్గసుఖముల ననుభవించెను.

ఉత్తమ మేధాసంపన్నురాలు, కర్మయోగి, దేశసేవా పరాయణి అయిన శ్యామసుందరీదేవికి, సద్గుణ ఖనియైన రాజేశ్వరరావునకు వివాహము జరిపి, బాపిరాజు నవలకు మంచి సుందరతను సమకూర్చెను.

తమ జీవితమును మూడు పూవులు, ఆరు కాయలుగా చేసి విచ్చలవిడిగా స్వేచ్ఛాప్రేమను తనివితీర అనుభవించిన చెంచలహృదయయైన పుష్పలత స్థితిని, రాజారావు ఓషా దాంత మరణమును ప్రతి వ్యక్తియందు జాలి కలుగునట్లు మలిచెను,

అమెరికా వనితయైన లియోనారా కన్య రామచంద్రుని ఒక్క నిముషమైనను విడిచిపెట్టక, సర్వకాలములయందు అతని వెన్నంటి తిరిగినది. అతడు స్వదేశమునకు తిరిగివచ్చు నప్పుడు అతనిపట్ల తనకుగల ప్రగాఢ ప్రేమను గనబరచి "నీవు నాకు గురువువు – నేనింతటినుండి బ్రహ్మచారిణినై మానవసేవ చేయుటకు సంకల్పించితిని..... మొదలూ తుదీ ఏకమైన ఆనందమును నాకియ్యి. నన్ను ఈఒక్క ముహూర్త కాలము భార్యగా నొనరించుకో–" అని అన్న మాటలు, ఆమె పవిత్రమైన ప్రేమార్ద్ర హృదయమును, ఆంతరంగిక

పరివృత్తిని, నిష్కల్మషత్వమును వ్యక్తము చేయుచున్నవి. ఆ ఇద్దరు ఒక దివ్యలోకములలో "ఋణకాలము" విహరించిరి. ఆమె చివరి పర్యాయము రామచంద్రునితో "నా ప్రియతమ స్నేహితుడా! నీ భార్యతోపాటు సుఖముగా కాపురము చేయుము. మమ్మల్ను మరచిపోకుము. మాకందరకు హిందూదేశముపైన నున్న ప్రేమ ఏదేశమునందును లేదు-" అనినది, నిండు మనస్సుతో.

రామచంద్రుడు విదేశములనుండి, తిరిగి స్వదేశమునకు వచ్చిన పిమ్మట తెలుఁగునేలను చూచి పొందిన పరవశత్వము వర్ణనాతీతము. చూడండి - "ముద్దు లు గులుకు తెలుఁగుభాష వినతాక్ష చెవులు తుప్పలు పట్టినవి. ఆంధ్ర దేశము మాకు అమరదైవతము-" అనెను, వీరావేశముతో.

ఈ మాటలు బాపిరాజుకు తెలుఁగు భాషపైన, తెలుఁగు ప్రజలపైన, తెలుఁగు సంప్రదాయముపైన ఉన్న అతివేలమైన ప్రేమకు చిహ్నములు.

ఈ నవలలో మహాత్మునిగురించిన చర్చలు, స్వాతంత్ర్యోద్యమమునకు సంబంధించిన చిక్కు ఘట్టముల వివరణలు తెలుపబడినవి. జాతీయభావ సంపన్నుడైన బాపిరాజు దీనిలో సమకాలిక స్వాతంత్ర్యోద్యమమునకు ప్రాధాన్యత నిచ్చి, దానికి ప్రతీకలుగా నారాయణరావు, శ్యామసుందరీదేవివంటి నిస్వార్థసేవాపరాయణులను చిత్రించి రచన చేసిరి.

కోనసీమ ప్రాంతపు ప్రకృతి సౌందర్యమును, ఆప్రాంత

పల్లె జీవిత మాధుర్యమును, ఆచారవ్యవహారములను, నాగరికతా సంస్కృతులను, గోదావరీనది ఉభయ పార్శ్వ ములయందలి విగతశోభలను, ఆ చల్లనితల్లి నిరంతరము ప్రసాదించు అమృత మధుర నాదములను, ఆకాశమును చుంబించుచు పాపికొండలమధ్య ప్రవహించు ఆ మాత వింత సోయగములను, చిత్ర విచిత్రమైన సుడులతో అలరారు గాంభీర్యతను, ఈనవలలో మనోహరముగా వర్ణించి, సుందర సుచిరమైన, దివ్యతేజోసంపన్నమైన, పూర్ణభావగర్భితమైన వాక్చిత్రముల నెన్నింటినో కన్నులకు కట్టించి, నూటికి నూరు పాళ్లు తెలుఁగుదనము పరవళ్లుతొక్కు "నారాయణరావు" వంటి నవలారాజము నందించిన శిల్పి, చిత్రకారుడు, బహు ముఖ ప్రజ్ఞాదురంధరుడునైన శ్రీ బాపిరాజు సర్వవిధముల ప్రశంసనీయుడు.

"తుఫాను" మరియొక ఉత్తమ నవల. దీని లో అపురూప లావణ్యవతి, దివ్య సుందరి, సుగుణశీల యైన శకుంతల అకాల మరణముతో, ఉన్నత విద్యాధికుడు, లలితకళాస్రష్టయైన "శ్రీనాథమూర్తి" హృదయమున·లో ఒక పెనుతుఫాను చెలరేగినది. జీవితముపై విరక్తి కలిగినది. సౌందర్యోపాసకుడైన అతడు తన తల్లితో భారతదేశము నందలి పుణ్యస్థలములను, హిమాలయ సానువులయందలి వింతశోభలను, తిబ్బెత్తు, నేపాలు దేశములయందలి బౌద్ధసంఘా రామములను, మహామహిమాన్వితుడైన ఒక స్వామీజీ

శిష్యత్వమును నెరపి, కొన్ని తాత్విక వేదాంత విషయము లను, శిల్పచిత్ర కళలయందలి లోతులను, మెళుకువలను గ్రహించి, దేశమంతయు తిరిగి తిరిగి మద్రాసునకు వచ్చి "త్యాగయితి శార్వరీభూషణుడు" అన్న నామముతో తన పూర్వపు అత్తమామలతో మిక్కిలి సన్నిహితముగా మెలగు చుండెను.

శకుంతల చెల్లెలు హేమసుందరీదేవి. అందాల రాశి. సుగుణాల జొంపము. అక్క మరణించునప్పటికి ఆరు సంవత్స రముల బాలిక. నేడు బి. ఏ; అనర్సు చదువుచున్నది. ఆమెను నిశాపతి, కల్పమూర్తి, తీర్థమిత్రుడు, త్యాగయితి, నలుగురును గాఢముగా ప్రేమించిరి. తమ దానినిగా చేసు కొనుటకు నలుగురును ప్రయత్నించిరి. మిగిలిన ముగ్గురికన్న త్యాగయితిని చూచిన ప్రతి సమయమున మనస్సులో ఆమెకు ఒక విధమైన గిలిగింతలు జరుగుచుండెడివి.

లోకేశ్వరి అను ఉపాధ్యాయినితోను, సోఫియా అను ఆంగ్లో ఇండియన్ యువతితోను. హేమసుందరికి గాఢమైన స్నేహము. ఆ ఇరువురికి ఆమె మనస్సులోని రహస్యములనన్నింటిని చెప్పును. వారు ఆమెకు చెప్పుదురు.

హేమసుందరి తనను ప్రేమించుచున్న ఆ నలుగురిలో తనకు తగిన వాడెవ్వడో తెలిసికొనజాలక క్రిందు మీదగు చుండగా, లోకేశ్వరి "త్యాగాధమూర్తి" జీవిత చరిత్రను తెలుపు ఒక వ్రాత ప్రతిని ఇచ్చి, చదువవలసినదని ఆదే

శించినది. ఆ గ్రంథమును ప్రారంభించినప్పటినుండి "త్యాగ యితి శర్వరీ భూషణుడు" తన భావ అన్న అభిప్రాయము కలిగి, అది ముగిసినప్పటికి ధృడపడినది. ఆమె ఆనందముతో తన్మయత్వము జెందినది. ఆట్టి సహృదయుడు, లలితకళా మూర్తి, మహాభావుకుడు తనకు భావయై, ఇంతకాలము ఆ సంగతి తనకు తెలియనందుకు మిక్కిలి బాధపడినది. ఆట్టి అమృతమూర్తి సహచర్యముతో తన అక్క పొందిన దివ్యానుభూతికి మురిసిపోయినది. తన అక్క జీవితము ధన్య మైనట్లు భావించినది.

హేమ కుసుమసుందరి తన తల్లిదండ్రుల అనుమతితో త్యాగయితిని వివాహమాడినది. ఆ సుముహూర్తమునకే లోకేశ్వరి, నిశాపతులకుగూడ పాణిగ్రహణము జరిగినది. కథ మంగళప్రదముగా ముగిసినది.

త్యాగయితి తలపెట్టిన స్త్రీల "లలితకళాశాల" నిర్మాణము, దాని మహత్తరమైన ఆదర్శములు, శ్రీ బాపిరాజుకు లలితకళల పట్ల, మన పూర్వ విద్యలపట్ల గల అభిరుచికి, అభిమానమునకు ప్రతిబింబములు.

ఆనాటి ప్రపంచ ద్వితీయ సంగ్రామమువలన కలిగిన దుష్ఫలితములకు, అస్వతంత్ర భారతదేశపు స్థితిగతులకు, ఆయన అంతరంగము తల్లడిల్లిన విధమునకు ఈక్రింది వాక్యములు సాక్ష్యము.

"దూరమున యూరపులో, ఆ ఫ్రెంచి లో, శాంత,

అట్లాంటిక్ మహాసముద్రాలలో దారుణ సంగ్రామధ్వనులు. దగ్గిర నాదేశంలో స్వాతంత్ర్యంకోసం ఆర్తనాదం, కమ్ముకొ వచ్చే కాటక ఘోష ..... ఏకోపియను పరపీడనం నాశన మవడం తథ్యం. జగత్తులో త్వరలో ధర్మం నెలకొలుపబడి తీరుతుంది-" అని.

జాజిమల్లి, నరుడు, రాగమాలిక శ్రీ బా పి రా జు వ్రాసిన నవలికలు. వీనిలో ఆయన తన చరమదశలో "జా జి మ ల్లి" అను నవలను రచియించెను. ఆయన ఈ నవలలో స్త్రీ హృదయమును అతి సూక్ష్మదృష్టితో పరిశీలించి, సంపూర్ణ "స్త్రీ" త్వమును చక్కగా చిత్రించెను.

పైన పేర్కొనినవారేగాక, ఈ కాల్పనికోద్యమమునకు మరికొంత పుష్టిని సమకూర్చి, రచనలుచేసిన మరికొందరు రచయితలను గురించి ఉల్లేఖింతును.

పదునైన తెలుఁగుభాషను వ్రాయగల ప్రతిభావంతులలో శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారొకరు. అయన 1914 వ. సంవత్సరములో "మిధునానురాగము" అను నవలను వ్రాసినట్లు లోగడ తెలిపియుంటిని. అప్పుడె వ్రాసిన మరొక నవల "శ్మశానవాటిక". "ఆత్మబలి" "రక్తబంధము" తరువాతి నవలలు. "వ డ్ల గి ం జ లు" "ఇల్లుపట్టని వెధవాడబడచు" నవలికలు.

శ్రీ శాస్త్రిగారు తన నవలలలోను, నవలికలలోను గోనసీమ బ్రాహ్మణ కుటుంబములయందలి పరిస్థితులను,

ఆచార వ్యవహారములను, అక్కడి ప్రతివ్యక్తి ఇండ్లలో సాధారణముగా వాడుకొనుభాషను, అక్కడి బ్రాహ్మణ కుటుంబములలో జరిగిన కథలను ఆలంబనముగా గ్రహించి, ఆవిషయమునే తన నవలలలో వ్యక్తముచేసెను. ఆయన తన నవలలలో ఆద్యంతము తెలుఁగువాతావరణము, తెలుఁగుదనము సమగ్రముగాను, సమర్థవంతముగాను చిత్రించి యుండెను. సజీవమైన, సహజమైన, పాత్ర చిత్రణ, కనులకు రూపుకట్టునట్టి వర్ణనలు, సున్నితమైన హాస్యము, కుంటువడని కథాకథనము, అన్నిటిని అధిగమించిన మధురమైన తెలుఁగు భాష, అయనకు తెలుఁగునాట అఖండమైన కీర్తి నార్జించి పెట్టినవి. కాని శ్రీ శాస్త్రి నవలా రచయితగా గాక, ఉత్తమ కథకుడిగా విశేషకీర్తి నార్జించెననుట గమనార్హము.

శ్రీ మొక్కపాటి నరసింహశాస్త్రిగారి "చారిష్టరు పార్వతీశము" నవల చక్కని హాస్యరస పోషకమైనది. దీనినిగురించి చాగడ కొంత ప్రస్తావించితిని. ఇది యావ దాంధ్రుల మనఃఫలకములపైన చెరగని ముద్రవైచి, ఆంధ్ర నవలా ప్రపంచమున తన ప్రత్యేక ప్రతిపత్తిని చాటుకొన్నది. "పార్వతీశము" అను అమాయక గ్రామీణ యువకుడు తన ఇంటిలో ఎవరితోనుచెప్పకుండగ, చారిష్టరుచదువునకై సీమకు బయలుదేరి, వైజాగ్‌స్టేషనునకు వచ్చి, అక్కడినుండి మద్రాసు చేరుకొని, ఓడ ఎక్కునంతవరకు ప్రతిక్షణము అతడు ఎదుర్కొనిన చిక్కు సమస్యలు, సీమ ప్రయాణమునకు తనవెంట

వ్రుంచుకొన్న వింత వస్తువులు, అతని విచిత్ర మనఃప్రవృత్తి ఈ నవలలో చక్కగా వర్ణించబడినది. పార్వతీశం ప్రతి మాట, ప్రతి చేష్ట, ప్రతి కదలిక, కడుపుబ్బ నవ్వునట్లు చేసినది.

భారిష్టరు పార్వతీశం "ద్వితీయ భాగము" ఈమధ్య ఆంధ్రజ్యోతిలో ధారావాహికముగా వెలువడినది. కాని ఇది మొదటిభాగము అంత ఆకర్షణీయముగాలేదు. అంతటి చక్కని హాస్యమునుగూడ కలిగించుటలేదు.

"ఏకోదరులు" నవల 1931 వ. సంవత్సరములో రచియించబడినది. దీనిలో ఒక కులీన బ్రాహ్మణ యువకుడు వర్ణాంతర వివాహమునుచేసికొని, తన బంధువులనుండి దూరమై పడిన బాధలు, వర్ణాంతర వివాహములలోని చిక్కులు, మనస్తత్వములలోని వ్యత్యాసములు, సాంఘికమైన, మానసికమైన సంఘర్షణలు, అతడు పొందిన వింత అనుభూతులు ప్రతిభావంతముగా ఇందు చిత్రింపబడినవి. ఈ నవల చదువుచున్నప్పుడు అది ప్రారంభించినప్పటినుండి ముగించునంత వరకు, మనకు అతనిపట్ల ఒక విధమైన సానుభూతి, జాలి కలుగును. ఈ నవలలో మొక్కపాటివారు, కరుణరసము జాలువారునట్లు కథను మలచిరి.

శ్రీ) మునిమాణిక్యం నరసింహారావుగారి అపూర్వసృష్టి "కాంతం". అయితే శ్రీ) మునిమాణిక్యాన్ని ఎరుగనివాడు ఎవరైనా ఉంటే వుండవచ్చును, గాని ఆయన "కాంతాన్ని"

ఎరుగని అఓరాస్యుడు తెలుఁగునాటలేదు అనిన, అది అతిశ యోక్తి కానేరదు.

గృహసంబంధమైన ఇతివృత్తమును స్వీకరించి, భార్యాభర్తలమధ్యగల ప్రేమకలాపములను, కష్టసుఖము లను, సులభమైన శైలిలో, మధురమైన భాషలో, హాస్య రసము చిప్పిలజేయుచు, రచనలుచేయు నేర్పు ఆయనకు అధి కము. కనుకనే ఆయన "కాంతము" నకు ఆంధ్రదేశములో అంతటి జనాదరణ లభించినది.

దీక్షితులు, తిరుమాళిగ, రుక్మిణి, శీ) మునిమాణిక్యం ప్రఖ్యాత నవలలు.

"దీక్షితులు" కరుణారస ప్రధానమైన ఉత్తమ నవల. దీక్షితులకు భార్యపోయినది. అపిమ్మట ఒక సంవత్సరమునకు ఏకైక కుమార్తె ఈశ్వరసాన్నిధ్యమునకు చేరుకున్నది. దానితో అతని హృదయము దెబ్బతినినది. చేయుచున్న ఉద్యోగమును విడిచిపెట్టి, విరాగియై, ప్రపంచమే తనదిగా భావించి, కష్టములలోనున్న ప్రతి వ్యక్తికి తోచిన సహాయము చేసి, నిర్లిప్తముగా, విరాగిగా, పరమయోగిగా జీవిత నౌకను వెళ్ళబుచ్చిన సాధుమూర్తి దీక్షితులు. తన కుమార్తె వయస్సులోవున్న ప్రతి స్త్రీలోను, ఆమె రూపమును చూచుకొని, గుణగణములను తలచుకొని ఆనందించుచు, నిలకడలేకుండగ తిరిగిన మహోమనీషి.

దీక్షితులు ఎందరితో ఉల్లాసముగా తిరిగినను, ప్రజోప

యోగకరమైన మంచిపనులు ఎన్నిచేసినను, లోకము లో యెందరినో తన కుమార్తెలుగా భావించి, వారి తృప్తియే తన తృప్తిగా భావించినను, అతని హృదయమునకు తగిలిన గాయము ఎప్పటికప్పుడు సలవేసి రంపపుకోత కోసినది. శ్యామల, ఈశ్వరరావుల వివాహము మహా వైభవోపేత ముగా తన యాజమాన్యమునసే జరిగినను, హృదయ కోహర ములో ఎక్కడనో అట్టడుగున దాగియున్న విచారము ఒక్క సారి పెల్లుబికినది. వివాహము సమాప్తమై పోయిన పిమ్మట అతడు కాస్త ఇదిగా వుండటమును పసిగట్టిన తిరువెంగళము కారణమును ప్రశ్నించెను. అప్పుడు దీక్షితులు "నాకు ఇంకా హృదయ దౌర్బల్యము పోలేదోయ్. ఇందరు కుమార్తెలున్నా, ఆ చనిపోయిన ఒక్కదానికోసం దుఃఖం వస్తుందేమోయ్ నాకు-" అంటాడు. కథ ఈవిధముగా విషాదాంతమై ముగిసినది.

"తిరుమాళిగ" నవలలో భార్యను గోలుపోయి విధు రుడై ఒక పురుషుడు పడ్డ బాధలు, అనుభవించిన దుఃఖము వర్ణించి; అతనికి ఒక అపరిచిత స్త్రీతో కలసిన స్నేహము, ఆమెద్వారా అతని జీవితము ప్రభావితమైన విధము ఉదాత్తముగా చిత్రించబడినది. ప్రతి పురుషునికి జీవితయాత్రలో సుఖజీవనమున చేయుటకు ఒక స్త్రీ అవసరము అను సత్యమును ఆయన ఈ నవలలో ప్రతిధ్వనింపజేసెను.

శ్రీ పిలకా గణపతిశాస్త్రిగారు వ్రాసిన 'మీనాంబిక'

నాయకరాజుల కాలమునకు చెందిన మంచి చారిత్రక నవల. విశ్వనాధ నాయకుని ఇతివృత్తముగాచేసి, రచియింపబడిన ఈ నవలయందు మధుర, తంజావూరు రాజ్యముల మహోన్నతి, ప్రాభవ వైభవములు మిక్కిలి సమర్థవంతముగా రచియించబడినవి. శ్రీ శాస్త్రిగారి చారిత్రక ప్రతిభను, లోకజ్ఞతను, విస్తృత పాండిత్యమును చాటిచెప్పగల మరొక చారిత్రిక నవల "కాశ్మీరపట్ట మహిషి-". ఇది ఇటీవలి రచన. "విశాల కేశాలు" వీర, శృంగార రసములనాశ్రయించి నడచిన వేరొక కథానకము. ఇది జానపదగాథల కోవకు చెందిన నవల. రచయిత భావుకతకు, రచనాసామర్థ్యమునకు, ఈ నవల మేలుబంతియని చెప్పవచ్చును.

"చారిత్రక నవల" యనిన చారిత్రక సంబంధమైన ఏదియో ఒక సంఘటననుగాని, ఒక యుగమునుగాని తీసికొని ఆకాలమున వర్ధిల్లిన ఒక మహారాజునుగాని, ఒక మహారాణినిగాని ఆధారముగాచేసి, దానిచుట్టు కథను మలచి వ్రాయుట, లేదా ఆయా రాజులకు జైత్రయాత్రలలో, తదితర సమయములలో తోడ్పడిన మంత్రులను, సేనాపతులను, మహావీరులను నాయకులనుచేసి వారిచుట్టు కథను అల్లుట సంప్రదాయబద్ధమైన ఆచారము.

శ్రీ నోరి నరసింహశాస్త్రిగారు అట్టి సంప్రదాయమును త్రోసిరాజని, తమ చారిత్రక నవలలలో ఆయాకాలములలో వర్ధిల్లిన మహాకవులకు ప్రాధాన్యతనిచ్చి, వారి రచనలకు

తోడ్పడిన సాహితీ బంధువులను, రచనావ్యాసంగమునకు ప్రోత్సహించిన మహారాజులను, తదితర ప్రముఖులను, ఆ కాలపు పరిస్థితులను, ఆలంబనముచేసి వారిచుట్టు కథను నడిపి. ఇది శ్రీనాథుని చారిత్రక నవలల ప్రత్యేక తీరుబడి. అయన నవలల యందలి మరియొక విశిష్ట లక్షణము, ఆయా కాలముల చారిత్రకాంశములను, రాజకీయ, మత, సాంఘిక, సాహిత్య, సాంస్కృతిక సంబంధమైన విషయములలో, తమకు సత్యమని తోచిన వానిని, ఆయా పాత్రలకు అనుగుణముగా నుండునట్లు, వేషభాషలను రమ్యముగా చిత్రించుట.

ఆంధ్రదేశ చరిత్రయందలి ప్రముఖ ఘట్టములైన చాళుక్య, కాకతీయ, రెడ్డి సామ్రాజ్యములను, కథివృత్త కేంద్రములుగా గ్రహించి, నారాయణభట్టు, రుద్రమదేవి, మల్లారెడ్డి, కవిసార్వభౌముడు, ధూర్జటి మొదలైన నవలలు వ్రాసి, ఆంధ్రభారతికి మేలితొడవులుగా అలంకరించిరి.

"నారాయణభట్టు" నందు, కవిత్రయములో ప్రథముడైన నన్నయభట్టారకుని మహాభారత రచనకు ప్రోత్సహించిన 'విషయము' నిబంధింపబడినది. మహాభారతయుద్ధమున అర్జునునకు శ్రీకృష్ణపరమాత్మ తోడ్పడి విజయము సిద్ధింపజేసినట్లు; అష్ట భాషాధ్యాయి, బాల్యమిత్రుడు నైన 'నారాయణభట్టు' వాగనుశాసనుడైన నన్నయ భట్టారకునకు "మహాభారత" రచనలో తోడ్పడి మహోపకారమొనరించెను. ఆంధ్ర భాషోద్ధారకుడైన శ్రీ రాజరాజనరేంద్ర మహారాజు పాత్ర

చిత్రణలో, అయన ప్రదర్శించిన ఔదార్యాది మహాగుణము లను పోషించుటలో శ్రీనోరివారు గనబరచిన శ్రద్ధ అత్యంత శ్లాఘనీయమైనది. ఆనాటి చారిత్రక వ్యక్తులందరు, సజీవులై ఈ నవలలో దర్శనమిత్తురు.

"రుద్రమదేవి" నవల ఆంధ్రేతిహాసమునందలి కాక తీయ సామ్రాజ్యమునకు సంబంధించినది. కాకతీయ గణపతి దేవమహారాజు శరన్నవరాత్రోత్సవములలో విశ్వేశ్వర శంభు దేశికుల ఆదేశము ననుసరించి, తమ పుత్రికయైన శ్రీరుద్రమ దేవిని, తన స్థానమున ఆనాటినుండి మహారాజ్ఞిగా వ్యవహ రించుటకు సభాముఖమున నిర్ణయించెను. ఆ నిర్ణయమును రుద్రమదేవి భర్త, గొందరు జైన, బౌద్ధ మతాభిమానులైన సామంతరాజులు స్వార్థబుద్ధితో వ్యతిరేకించిరి. రుద్రమ దేవి మహా ధైర్యముతో శత్రువుల నెదిరించి, దేశమున శాంతిభద్రతలను నెలకొలిపి, వసంత నవరాత్ర్యుత్సవముల నాటికి ధర్మ పరిపాలనను ఆరంభించినది. తిక్కన మహా కవి భారతమునుండి రాజధర్మములను ప్రబోధించువట్టి ఒక మహోజ్వల ఘట్టమును చదివి ప్రజలను ఆనందపరవశులను చేయు సుసమయమున, ఆ ఉత్సవములు సమాప్తమైనవి. కథ మంగళాంతమైనది.

ఈ నవలలో శ్రీనోరి ఆర్షధర్మమును పరిరక్షించు టకు అన్న మంత్రి, తిక్కన సోమయాజి, విశ్వేశ్వర శంభు దేశికులు అను మువ్వురు రాజనైతిక ధర్మస్వరూపులను

ప్రవేశపెట్టిరి. ఈ నవలలో 'రుయ్యమ' పాత్ర ముఖ్యమైనది. రచయిత దక్షతతో దీనిని నిర్వహించెను.

కవిత్రయములో ద్వితీయుడై, అద్వితీయ కవితా వైభవముతో విరాటపర్వముండి, స్వర్గారోహణ పర్వ పర్యంతము గల మహాభారతమును రచియించిన తిక్కన సోమ యాజి పాత్రను, ఆయన తన మహా విజ్ఞానమును లోక కల్యా ణమునకై, శాంతిస్థాపనకై వినియోగించిన పద్ధతి ని శీ) శాస్త్రి మిక్కిలి హృద్యముగా ఇందు చిత్రించెను.

"మల్లారెడ్డి" నవల ఇతివృత్తము, కవిత్రయములో కనిష్ఠుడై, ప్రబంధ పరమేశ్వర బిరుదాంకితుడైన ఎఱ్ఱా ప్రగ్గడకు సంబంధించినది. దీనిలో రెడ్డిరాజుల భాషాపోషణ, సాహిత్య సంస్కృతుల పునరుజ్జీవనమునకు వారు చేసిన దోహ దము, ఆకాలపు మత సాంఘిక, పరిస్థితులు, రాజనైతిక ప్రవర్త నమును హృదయంగమముగా శీ) నోరి విశ్లేషించి చూపెను. ఇందలి మల్లారెడ్డి, ఎఱ్ఱాప్రగ్గడల గుణశీలములు, మహోన్న తాదర్శములకు ప్రతీకలు.

కవిత్రయమునకు సంబంధించిన ఈ చారిత్రక నవలా త్రయమును, ఉదాత్తరీతిలో, మహోదాత్తముగా చిత్రించి శీ) నోరి నరసింహశాస్త్రిగారు చారిత్రక నవలా రచనలో సరికొత్త మార్గమును కనిపెట్టి, అనంతర రచయితలకు ఒక కొత్త ధృక్పథమును చూపి, ఆంధ్ర మహాజనులకు ఆదర్శ పాత్రుడయ్యెను.

హేతు, అస్తిత్వ, ఆధ్యాత్మిక, సామ్యవాద దృక్పథములు—

శ్రీ గోపీచంద్ తనకు ముందు ప్రభంజనమువలె విజృంభించిన కాల్పనిక సిద్ధాంతమును; తన తండ్రి శ్రీ రామస్వామి చౌదరినుండి హేతువాదమును; శ్రీ యం. యన్. రాయ్ నుండి మానవతా వాదమును, శ్రీ ఫ్రాయిడ్ మొదలైన పాశ్చాత్య తత్వవేత్తలనుండి మనోవైజ్ఞానికతను; శ్రీ అరవిందమహర్షినుండి అతీత మానసిక శుద్ధచైతన్యస్ఫూర్తిని గ్రహించి, ఆ ప్రభావముతో విభిన్న మానవ మనస్తత్వములను భిన్నకోణములనుండి తరచిచూచి, వెక్కు మహోద్యమముల పరిణామములను తన సునిశిత దృష్టితో, మేధా సంపత్తితో పరిశీలించి, తాను కనుగొనిన ఆ సత్యములను విశాల ప్రతిపదికపైన తన రచనలలో "గూడు" కట్టించి, తెలుఁగు నవలా ప్రపంచమున ఒక వినూతన సృష్టికి, దృక్పథమునకు మార్గదర్శకుడై, భావి రచయితలకు ఆచార్యవర్యుడై వెలుగొందిన ఆధ్యాత్మిక తార్కికవేత్త.

"పరివర్తన" గోపీచంద్ ప్రథమ నవల. నాయకుడైన రాజారావునకు భార్యావియోగము కలిగినది. ఆ దుఃఖము అతనిని చుట్టుముట్టి, జీవితముపై రోత కలిగించినది. జీవితము పట్ల అతనికి కలిగిన నిరాశను, నిస్పృహను తొలగించి, "పరివర్తనను" చూపుటకు శ్రీ గోపీచంద్ చేసిన దృఢప్రయత్న

ఫలితమే, ఆయన రెండవ నవల "అసమర్థుని జీవితయాత్ర". దీనిలో నాయకుడైన సీతారామారావు త్రండిని కోలుపో యిన దుఃఖభాజనుడు. దానితో అతని జీవితములో ఒక పెద్ద అఘాతము ఏర్పడినది. పరిస్థితులు అతనిని తల్లకిందులు చేసినవి.

"సీతారామారావు జీవితం ఉన్నత శిఖరాగ్రంనుంచి స్వచ్ఛమైన జలంతో భూమిమీదపడి మలినాన్ని కలుపుకొని మరికి కూపంలోకి ప్రవహించే సెలయేరని జ్ఞప్తికి తెస్తుంది-" అని చెప్పి; గోపీచంద్ ఈ నవలను ప్రారంభించెను.

తండ్రి జీవించి ఉన్నంతవరకు సీతారామారావుకు ఎట్టి బాదర బండీలు లేవు. ఆయన మరణముతో సంభ వించిన చిక్కు సమస్యలు, విషమ పరిస్థితులు అతనిని ఉక్కిరి బిక్కిరి చేసినవి.

"పరివర్తన" నవలలో రాజారావు, "అసమర్థుని జీవిత యాత్రలో" సీతారామారావు; పొందిన దుఃఖమునే, మానసిక వ్యధనే, గోపీచంద్ గూడ తన యుదార్ధ జీవితములో అనుభవించెను. ఆయన పొందిన ఆ నిర్వేదమునకు ఫలిత ములే పై రెండు నవలలు. ఒకవిధముగా ఆ రెండు నవలలు, ఆయన హేతువాద దృక్పథమునకు స్మృతి చిహ్నాలై నిలచినవి. గోపీచంద్ హృదయములో తండ్రి మరణము రేపిన అగ్నిజ్వాలకు ఇవి ప్రతీకలు.

"జాతస్య మరణం ధ్రువం" అను పరమ సత్యమును

గ్రహించగల జ్ఞాని యైన సీతారామారావు జీవితమునైన తండ్రి మరణము మాయని ముద్రవేసినది. తండ్రి చివర ఘణములో, సీతారామారావును కుటుంబ గౌరవము నిలబెట్ట వలసినదని ఆదేశించెను. అతడు తండ్రి ఆజ్ఞను, కుటుంబ గౌరవమును కాపాడుటకు పడిన పాట్లు, ఎదుర్కొనిన గడ్డు సమస్యలు, వక్రించిన పరిస్థితులను చక్కదిద్దుటకు చేసిన విఫల యత్నములు, ఆప్తులనబడువారు సలిపిన మోసములు, ఈ 'అసమర్థునిజీవితయాత్ర' నవలలోకథ ముగా, అసమర్థుడు, అతని భార్య, అతని ఆదర్శం, అతని మేనమామ, అతని ప్రతాపం, అతని అంతం అను ఆరు శీర్షికలతో వివరించెను.

శ్మశానవాటికలో అతడు పొందిన ఆత్మ ఘర్షణము ఆద్యంత ప్రధానమైనది. నవలకు ఇది కీలకము - ప్రాణము.

పరిసరములను, పరిస్థితులను, అవగాహన చేసికొను టలో, రామయ్యశాస్త్రి ఈ నవలలో ప్రదర్శించిన లోకజ్ఞతను, ఆధ్యాత్మిక చింతనను గోపీచంద్ దక్షతతో నిరూపించెను.

సీతారామారావు మృత్యువు చేతిలో పరాజితుడయ్యెను. అతని మానసిక ఘర్షణములోనుండి గోపీచంద్ పునర్జన్మము నెత్తెను. దానితో అతనిలోని సంకుచితమైన "హేతువాద" దృక్పథము మాసిపోయి ఒక కొత్త మలుపు తిరిగి; సంఘమునట్లు, వ్యక్తులపట్లు, సరికొత్త అవలోకన, సరికొత్త ఆలోచన, వివేచన ఏర్పడి, అతనిని పురోగమింప జేసి కొత్త పనులు చేయుటకు ప్రేరేపించినవి.

జీవితములో మానవుడు ఇతర వస్తువులు ఎన్ని కలిగి యున్నను, సుఖమునకు, ఆనందమునకు, ఘనవిజయమునకు అన్నిటికి వైయక్తిక మనస్తత్వమే మూలభూతమని, అది శూన్యమైననాడు అన్నియు నిర్ప్రయోజనములని నిరూపించు నట్టి ఉత్తమ నవల "అసమార్థుని జీవితయాత్ర". అది తెలుఁగు నవలా సాహిత్య పరిమళమును, యెల్లెడల ప్రసరింపజేసిన వినూతన పారిజాత కుసుమము.

శ్రీ గోపీచంద్ లోగడ తనకు హేతువాద దృక్పథ ముతో సంఘముపట్ల, వ్యక్తులపట్ల, స్త్రీ పురుషుల లైంగిక సమస్యలపట్ల ఏర్పడిన సంశయములను, అనుమానములను విడనాడి, సరికొత్త దృక్పథముతో, వ్యక్తియైన మానవుడి పైన, అతని సమస్యలపైన, ఆలోచనలపైన అనురాగమును పెంపొందించుకొని పెక్కుమంది పాశ్చ్య, పాశ్చాత్యవేత్తల ఆధ్యాత్మిక, తత్వ గ్రంథములను విశాల దృక్పథముతో అధ్యయనముచేసి, సంపూర్ణ మానవ జీవితమును శాస్త్రీయ దృక్పథముతో దర్శించి, అందలి లోతుపాతులను, తెలుఁగు నీడలను సమ్యక్ దృష్టితో అవగహన చేసికొని, తాను కను గొనిన ఆ సత్యములను, యదార్థ పరిస్థితుల కనుగుణముగా రూపకల్పన చేసిన కృషియే, అతని లేఖనినుండి వెలువడిన తరువాతి నవలలు.

స్త్రీ పురుషుల శారీరక, మానసిక సంబంధములకుగల విలువలను, ధార్మిక సంబంధములను, కాల్పనికదృష్టితో పరిశీ

లించి, వారి హృదయ విహారములలో దాగియున్న విచిత్ర పరివృత్తులను గోపీచంద్ నూతన దృక్పథముతో అవగాహన చేసుకొనుటయేగాక, యం. యన్. రాయ్, అరవిందులవంటి మహా విజ్ఞాన వేత్తలను, దివ్యపురుషులను స్వయముగా సందర్శించి, వారినుండి పొందిన మహానుభూతితో, పిల్లతెమ్మెర గడియపడని తలుపులు, మొరపుల మాలికలు, వంటి ఉత్తమ నవలలను వ్రాసెను. ఇవి అయిదలో వచ్చిన మార్పును సూచించు ద్వితీయ దశ నవలలు. వీనియందలి కథావస్తువు సంఘటనలు, ఒకే ఒక సమస్య 'స్త్రీ' లోని స్త్రీత్వమును, ప్రతిబింబింపజేయుచు రూపొందింపబడినవి, ఈ నవలాత్రయము నందలి శమంతకమణి, గోకేశ్వరమ్మ, ఉషారాణి మువ్వురు ఒకే స్త్రీయొక్క మూడు రూపాంతరములు.

"పిల్లతెమ్మెర" నవలలోని శమంతకమణి ఒక అనాథ బాలిక. పిల్లతెమ్మెరవంటి స్వభావముగల ఆమెను, రామనాథం ప్రేమించి వివాహమాడి, అర్థము చేసికొని ఆమె చిత్తవృత్తికి, వ్యక్తి వికాసమునకు అనుగుణముగా, ఆమె దృష్టిని భగవంతునివైపునకు మళ్ళించుటకు ప్రయత్నించెను.

సాంఘిక సంస్కర్త, ఆదర్శవాది అయిన కచేంద్రుడు శమంతకమణిని ప్రేమించి, ఆమెలో నివురుగప్పియున్న కళా కౌశలమును, వ్యక్తిత్వమును వికసింపజేయు తలంపుతో తన స్నేహితుడు నిర్వహించుచున్న "డ్యాన్స" స్కూలులో చేర్పించెను.

రామనాధము, శచీంద్రుడు; శమంతకమణి వ్యక్తి వికాసమునకు తోడ్పడినట్లు, పైకి కనుపించినను - ఆ ఇద్దరు ఆమెలోని స్త్రీత్వమునకు (సెక్సునకు) దాసులైనవారే. ఇక డ్యాన్సు మాష్టరు ఆమెలోని స్త్రీత్వమునకు, ఆకర్షణకు లొంగని సుగుణశీలి. ఆమె పొందనున్న పతనమును గ్రహించి ఉద్ధరించుటకు ప్రయత్నించిన ఆదర్శవాది.

ఇక శమంతకమణి, తనలోని స్త్రీత్వమును సంపూర్ణముగా అనుభవించి, ఆనందమును పొందుటకు ప్రయత్నించి, సఫలీకృతురాలైన పిల్ల కామెర్ర-అది తప్పో, ఒప్పో గ్రహించజాలని చంచల స్వభావ ఆమె.

శచీంద్రుడు పైకి ఆదర్శవాదిగను, సంఘ సంస్కర్తగను కనుపించి, స్త్రీ యొక్క సంపూర్ణ వ్యక్తి వికాసము ప్రముఖమని భావించి, తదనుగుణముగా ప్రవర్తించి, ఉపన్యాసములు దంచినను శమంతకమణి స్వేచ్ఛా ప్రవృత్తిని సహించలేక, సామాన్య మానవునివలెనే ఆమెను హత్యచేసి, అహంతో నిండిన సార్థపరత్వమును, ఈర్ష్యను, క్రోధమును ప్రదర్శించుకొనినేగాని, అంతకుమించి ప్రవర్తించలేక పోయెను - ఇది గమనించదగిన విషయము.

ఈ నవలయందు హైందవ సంప్రదాయమునకు ప్రతీకమ్మనాళిని. గనుకనే సుగుణ సంపన్నుడైన డ్యాన్సు మాష్టరు ఆమెను ప్రేమించెను. తనను సర్వవిధముల లోబరచుకొను టకు ప్రయత్నించిన శమంతకమణి నుండి తప్పించుకొనిన

సంప్రదాయజ్ఞుడు అయిన - స్త్రీ ఆకర్షణకు లొంగని అతీత వ్యక్తి - ఉత్తముడు.

"శమంతకమణి" వ్యక్తి వికాసమునకు ప్రతీక. మృణాళిని సంప్రదాయబద్ధమైన హైందవ నాగరికతకు, సంస్కృతికి చిహ్నము. ఆ ఇరువురిని జంటగాచేసి ఈ నవలలలో చూపించి, ఎవరు, ఎవరో నిర్ణయించుకొను బాధ్యతను పాఠకులకు వదలిపెట్టిన గడుసరి తాత్వికుడు గోపీచంద్.

మానవత్వ వికాసమునకు; సంప్రదాయవాదులు, అస్తికతావాదులు కలుగజేయుచున్న విపత్తునకంటే పైకి సాంఘిక వాదులవలె ప్రవర్తించి. ఏహ్యమైన నీచపు పనులు చేయు వారివలననే అధికమైన నష్టము వాటిల్లుచున్నదని, ఈ నవలలో ధ్వని పూర్వకముగా గోపీచంద్ నిరూపించుటకు ప్రయత్నించెను-

"గడియపడని తలుపులు" నవలలో కథా నాయిక గోకేశ్వరమ్మ. ఈమె సంప్రదాయబద్ధమైన జీవితమును, నిరాఘాటముగా సాగుచున్న పలిదువంటి కాపురమును, గ్రామీణ జీవితమును విడిచిపెట్టి, వ్యక్తి వికాసము, లైంగిక స్వేచ్ఛా స్వాతంత్ర్యముల కొరకు పట్టణము చేరిన ప్రౌఢ నారి. ఆమె తన అందచందములతో, విలువైన దుస్తులతో, సరికొత్త ఫ్యాషనులతో స్వైర విహారముచేసి, విజయవంతముగా జీవితమును వెళ్ళబుచ్చుచున్నప్పుడు శ్రీనివాసరావుతో పరిచయము ఏర్పడినది. ఒకవైపు అతనిలోని అమాయకత్వపు

ఆకర్షణకు, వేరొకవైపు అతనితో తనకుగల లైంగిక సంబంధములకు మధ్య ఆమె హృదయము ఊగిసలాడి, బ్రహ్మానంద స్వామివారి దర్శనము చేసికొనినది. శ్రీ స్వామివారి అమృత దృష్టి ఆమెను ఆ మధురప్రవంతిలో ముంచెత్తినది. ఆమె ఏ 'శాంతి' కొరకు నిరంతరము అన్వేషించినదో, ఆ శాంతి, ఆ ప్రశాంతత శ్రీవారి చరణసన్నిధిలో లభ్యమైనను, తన బుద్ధిని ఆ మార్గములో నిలదొక్కుకొన లేకపోయినది. శేష జీవితమును వైరాగ్య సాధనములోను, సంప్రదాయబద్ధమైన జీవితపు లోతులను, విలువలను మననము చేయుటలోను గడిపి కన్నుమూసినది.

ఈ నవలయందలి గోపేశ్వరమ్మ, శ్రీనివాసరావులలో నుండి గోపీచంద్ మరల దర్శనమిచ్చును. బ్రహ్మానందస్వామి వారి సన్నిధిలో గోపేశ్వరమ్మ పొందిన దివ్యానుభూతినే గోపీచంద్ శ్రీ అరవిందులవద్ద పొందెను. అతడు జీవితములో పొందిన మానసిక సంఘర్షణ ఈ నవలలో వ్యక్తమగును.

పిల్లతెమ్మర, గడియపడని తలుపులు, నవలలు రెండు సంప్రదాయబద్ధమైన జీవితమునకు, వ్యక్తి వికాసమునకు కావలసిన స్వేచ్ఛకు మాధ్య, పమాన్యాయమును పొందుపరచుటకు జరిగిన ప్రయోగాత్మక రచనలు.

"మొరపుల మరకలు" నవలలోని ఉషారాణి విద్యావతి. వివేకవతి. ఆమె నూతన ప్రాచ్య, పాశ్చాత్య నాగరికతలను రెండింటిని పుణికిపుచ్చుకొనిన విశిష్టవ్యక్తి. రామానుజము

వంటి ఉత్తమ వ్యక్తికి ఆమె భార్య. చక్రవర్తి, శ్రీకాంత్, కమలాకరం వంటి విద్యావంతులతో, ఉన్నతభావ సంపన్నులతో, లైంగిక సంబంధము కలిగివుండి, స్వేచ్ఛాప్రవృత్తితో, తన మనోభీష్టములను యథేచ్ఛగా అనుభవించగలగటము ఆమె అదృష్టము. ఇందరిమధ్య ప్రవర్తించి, ఆమె ఎవరికిని అంతుబట్టకుండగను, చిక్కకుండగను తన ప్రత్యేక వ్యక్తిత్వమును, వైశిష్ట్యతను నిలబెట్టుకొని నేర్పుతో సంచరించిన నెరజాణ. ఈ క్రింది సంభాషణ అది ఋజువుచేసినది-

"నీపట్ల.....నాకున్న ప్రేమను అతి పవిత్రమైనదానినిగా భావిస్తున్నాను....." అంటాడు ఎంతో ఉద్వేగముతో చక్రవర్తి ఉషారాణితో. "బాగానేవుంది చక్రీ, కాని శ్రీకాంత్‌కూడా నన్ను నీకుమల్లేనే ప్రేమిస్తున్నాడని ఎందుకనుకోవు!" అంటుది ఆమె నిర్లిప్తతగా. "అసంభవం" అన్నాడు చక్రవర్తి. "ఎందుకనీ! ... ... ఇప్పుడు నివు వెలిబుచ్చిన అభిప్రాయాలే అతను వెలిబుచ్చుతాడు....." అంటుంది ఆమె. "అభిప్రాయాలు వెలిబుచ్చటానికేం! ఎన్నైనా వెలిబుచ్చవచ్చు....." అంటాడు. "మరింకేమంటావ్!" అంటుంది ఆమె. ఈ ప్రశ్నతో అతని నోట్లో పచ్చి వెలక్కాయపడినట్లై, నిరుత్తరుడైపోయెను. ఇది ఆమెకు గల వాక్చాతుర్యము-

గోపీచంద్ ఈ నవలలో అస్తిత్వవాదమును ఆధారముగా గ్రహించి, తన మనస్సును, బుద్ధిని విశాలపరచుకొని,

మానవతావాదమునుండి గూడ ముందుకు పురోగమించి, తాత్విక చింతనలో దృష్టిని విశాలతమముచేసి రచనలు చేసెను. పరిణితహృదయుడు, తాత్విక, ఆధ్యాత్మిక చింతనా పరుడునైన శ్రీ గోపీచంద్ మనస్తత్వమునకు, వ్యక్తిత్వమునకు దీనిలో ప్రతినిధులు ఉపాసాని - చక్రవర్తులు.

ఉపాసాని కరుణానందస్వామి సన్నిధికి చేరినది. దానితో ఆమె వ్యక్తిత్వ వికాసము పరిపూర్ణతనంది, యోగినిగా మారిపోయినది-

చక్రవర్తి, ఉపాసానినుండి దూరమైన పిమ్మట, ఆమె వ్యక్తిత్వ ప్రభావమువలన తనలో స్థిరపడిపోయిన ఉదాత్త భావ సముదాయమును మాసిపోకుండగ ఆకట్టుకొని, ఒక కొత్త అనుభూతితో లోగడ ఆమె శరీర సౌందర్యముపట్ల, తాను పొందిన లైంగిక సౌఖ్యముపట్ల గల వ్యామోహము నుండి విడివడి స్వార్థచింతనకు అతీతుడై, తుచ్ఛమైన శారీరక సుఖానుభూతులపట్ల విముఖుడై, ఆమె తనలోనే ఉన్నట్లు భావించి ఆమెతో తదాత్మ్యతనంది సమాధినిష్ఠుడయ్యెను. ఇది ఎంతటి విచిత్రమైన మార్పు! ఎంతటి అద్భుతమైన మహత్తర చిత్రణము ఇది.

తాత్విక, యోగసాధనాసంపన్నుడైన గోపీచంద్ చక్కని భావ పరిపుష్టితో ప్రాచ్య, పాశ్చాత్య జీవిత విధానములకు సమన్వయముచేయ సంకల్పించి, ఈ నవలలో ఉపాసాని, చక్రవర్తివంటి ఆదర్శ పాత్రలను సృష్టించి మన కందించెను.

ఉషారాణి, గోపేశ్వరమ్మ, శమంతకమణి ఈ మువ్వురిలో సంపూర్ణ "స్త్రీ" త్వమును, వారి వ్యక్తి స్వాతంత్ర్యములను, భిన్నకోణములనుండి చూపించినను. ఒక మూసలోనుండి వచ్చిన మూడుమూర్తులు మాత్రమే వారు. గోపీచంద్ భావనా పటిమకు, పరిణత హృదయస్థితికి, వెలుగును వెదజల్లిన ప్రతీకలు వారు.

శ్రీ గోపీచంద్ "పరివర్తన" నుండి "మెరుపుల మరక" వరకు వెలువడిన తన నవలలపైన చెలరేగిన విమర్శనాలకు, తర్జనభర్జనలకు ఎదురొడ్డి నిలచి; తాత్విక దృష్టితో వానిని అవగాహన చేసికొని, అస్తిత్వవాద ప్రభావముతో వివాహ వ్యవస్థయొక్క భవితవ్యమునుగురించి పరామర్శించుటతో తృప్తినొందక, పాశ్చాత్య భౌతికవాదమును, పాశ్చాత్య అధ్యాత్మిక వాదములతో సమన్వయపరచి నప్పుడే దానికి సమగ్రత సిద్ధించునని గ్రహించి, ఈ రెండింటిని ముడిపెట్టులకు శ్రీ అరవిందుల అతీత శుద్ధ మానసిక చైతన్య ప్రపంచమే సరియైన మార్గమని దూరదృష్టితో యోచించి, వ్రాసినవే తృతీయదళ నవలలైన శిథిలాలయము, పేమోపహతులు, యమపాశము, పండిత పరమేశ్వరశాస్త్రి వీలు నామా, చీకటిగదులు (అసంపూర్తి) మొదలైనవి.

నిర్మల, పీతాంబరరావుల శిథిల దాంపత్య జీవితగాథ "శిథిలాలయము" నవలయందలి ఇతివృత్తము. ఆ దంపతుల వ్యక్తిత్వమూలమున, సదవగాహన లేకపోవడమువలన అనుసం

రము యథాయథలై పోయినది. దాంపత్య జీవితము సఫల మగుటకు కేవలము లైంగిక సుఖము ఒక్కటే ప్రధానము కాజాలదని, వ్యక్తి స్వాతంత్ర్యము మృగ్యమైననాడు మిగిలిన సుఖములు ఎన్ని యున్నను వ్యర్థములేనని నిర్మల పాత్ర నిరూపించినది. అందుకే ఆమె కట్టుకున్న భర్తను వదలిపెట్టి లేచిపోయినది. ఏకాంత జీవితములో ఆమె పొందిన తృప్తి, ఆనందము మరెందులోను తనకు లభ్యముకాలేదని, తన ప్రవృత్తిని గురించి నిర్మల చెప్పిన ఈ మాటలను గమనిస్తే చాలును- "నాకు ఎవ్వరికీ భార్యగా వుండాలనే అపేక్ష లేదు ఒకవేళ యత్నించినా ఉండలేనుకూడా ... నేను బ్రతికితే స్వతంత్రురాలిగానే బ్రతుకగలను. ఆ స్వాతంత్ర్యం లేక పోయిననాడు నేను మరణిస్తాను. అది నా స్వభావం—" అంటుంది.

దీనినిబట్టి అన్నిటికన్న వైయక్తికమైన స్వేచ్ఛ, లైంగిక సంబంధమైన స్వాతంత్ర్యము, సంప్రదాయము, పత్నీ తల పేరుతో చలామణియగుచున్న కఠిన నిబంధనలలోని మార్పు, ముఖ్యమని నిర్మల పాత్ర ద్వారా నిరూపణము చేసి గోపీచంద్ మాపిలచెను

పీతాంబరరావు జీవితపు మనుగడకు ఒక స్త్రీ ఆలంబనము చాల ముఖ్యము - అయినను అతనిలోను మార్పురాక తప్పినదికాదు. చూడండి- "తప్పు చెయ్యటంకంటే, తప్పును క్షమించలేకపోవటం పెద్ద తప్పు అని నేను గ్రహించాను—" అన్నాడు ఒక తత్వవేత్తవలె.

"శిథిలాలయము" జీన్‌పాల్ సార్త్రే, అస్తిత్వవాద బహుళ వ్యాప్తికి తెలుఁగునాట తోడ్పడిన ఉత్తమ నవల. పునాదులతో సహా కూలిపోవుచున్న నేటి వివాహ వ్యవస్థను విశ్లేషించి చెప్పిన నవల శిథిలాలయము కాగా, ఆ కూలిన గోడలమధ్య అస్తవ్యస్తమైన విచిత్ర పరిస్థితుల ముసుగులో, నాగరికత, సభ్యత, ఛేషను పేరుతో గోప్యముగా పరస్పర సహకార పద్ధతివెంట చాకచక్యముగా, సహ జీవనము సాగించిన ఒక "భార్యాభర్తల" జంటయొక్క లైంగిక స్వైర విహారమును చిత్రించిన నవలయే పేకమేడ లు. శ్రీ గోపీచంద్ నూతన దృక్పథముతో ప్రయోగాత్మకముగా రచియించిన కొత్త రచన ఇది.

శ్రీ గోపీచంద్, శ్రీ అరవిందుల మానసిక శుద్ధ చైతన్య స్ఫూర్తిని, దీప్తిని లక్ష్యముగా నిడుకొని ఆధ్యాత్మిక చింతనతో, తాత్విక దృక్పథముతో విభిన్న రచనలు చేసినను సామాన్య మానవుల కైనందిన జీవిత సమస్యలపట్ల, వారి అభిరుచులపట్ల, ఆశయములపట్ల ఆయన గనబరచిన శ్రద్ధకు ఫలితమే "యమపాశం" నవల. నాయకుడైన నారాయణరావు సామాన్యమైన ఉద్యోగి. అందరివలెనే, అతడు వివాహమాడి, ఎక్కువమంది పిల్లలకు తండ్రియై, యౌవనములో తన చుట్టు నిర్మించుకున్న ఆశలు, ఆశయములు, అడియాసలై; మారుచున్న పరిస్థితులకు తట్టుకొనలేక "దినగండము నూరేండ్ల ఆయుర్దాయము" వలె సాగిపోవుచున్న సంసార

బంధములనుండి విముక్తి మార్గము గోచరించక తాను, తన భార్య "జీవితం అనే గోడకు కొట్టబడి ఎండిపోయిన రెండు పిడకలు ..... " అని నిరాశ, నిస్పృహలతో బాధపడుచు, తనచుట్టు ఆవరించియున్న వివశలయమునుండి బయటపడు టకు మార్గము గోచరించక, పరిస్థితుల ప్రభావమునకు తట్టు కొనలేక కొట్టుమిట్టాడుచున్నప్పుడు భార్య రాజమ్మ, కూతురు అరుంధతి ఇద్దరు, "మనకన్న బీదవాళ్ళు, దురదృష్ట వంతులుగా ఎంతో హాయిగా బ్రతుకుతున్నప్పుడు మనక ఆలో చనలన్నీ వృధా ... ... ఏనడకలో ఉన్న మాధుర్యం ఆ నడకలో ఉంది ... అదుగు తప్పకుండా పడితే సరి ... " అని చెప్పి, అతని హృదయములో చెలరేగిన వెనుతుపాను నుండి విముక్తిని చూపిరి.

"జీవితాన్ని యథాతథంగా అంగీకరించి అనుభవించాలి - జీవితానికి పెడగా నిలుచున్న వారికంటె, అన్నివిధాల జీవితాన్ని అనుభవించేవారంటేనే నాకు ఇష్టం- ఒక్క ఇష్టమేకాదు, నమ్మకంకూడాను-" అని జీవితమును గురించి చక్కని సందేశమును గోపీచంద్ చూపెట్టెను.

శ్రీ గోపీచంద్ తను 'స్పృష్టచేయ్యని ఉత్తరాల'లో ఉద్ఘా టింపదలచిన లౌకిక, ఆధ్యాత్మిక, అద్వైత సిద్ధాంతము లను 'పండిత పరమేశ్వరశాస్త్రి వీలునామాలో' నిక్షేపించు టకు యత్నించి ఆయన కొంతమేర వరకే విజయమును పొందెను. ఆయన జీవిత చరమదశలో ఏర్పడిన మానసిక

స్థితిగతులను ఇది వ్యక్తీకరించును. కేంద్ర సాహిత్య అకా
డమీ వారి బహుమతినందుకున్న నవల ఇది.

ఈ నవలలో కేశవమూర్తి కథానాయకుడు. అతడు రచయిత. రాజకీయవాది. మానవత్వముపట్ల, జీవితము పట్ల మమత ఉన్నవాడు. ఆధ్యాత్మిక చింతన కలిగిన వ్యక్తి.

కేశవమూర్తి రచనలను; కుత్సిత హృదయుడైన సీమంతం, ఓర్వలేని బుద్ధితో అపనిందలువేసి విమర్శించెను. సుస్నితహృదయుడైన కేశవమూర్తి తన మిత్రుడు తన రచనలపట్ల వెలిబుచ్చిన అభిప్రాయములకు తట్టుకొనలేక బాధపడదొడగెను. భార్య సుజాత భర్తతో "అంట్లు తప్పెలకన్న మకిలితో నిండిన స్వభావము సీమంత" ము దని తెలిపి, తృప్తిపరచినది.

ఈ నవలలో సుభాషిణి, కన్యకామణి, సుజాత, కేశవ మూర్తిని దైవముగా యెంచి ఎంతగానో అతనిని పొగడిరి! ఇది రచనకు అసహజముగానున్నది.

శ్రీ అరవిందుల అతీత మానవత్వ స్థితికి, ప్రతీకగా కేశవమూర్తిని చిత్రింప నెంచిన గోపీచంద్ ఆలోచన, ఆ పాత్రను సృష్టించిన తీరు, అంత ఉదాత్తముగా నుండక సామాన్య మానవులకుండునట్టి ఈర్ష్య, అసూయ, అహం వంటి దుర్గుణములను కలిగియుండడము, అడుగడుగున అతని శ్రేష్ఠత్వ, తనను విమర్శించిన వారిపట్ల ప్రతి విమర్శ చేసి తృప్తిపడుట, పైకి కొట్టవచ్చినట్లు కనుపించి నవలకుండవలసిన

సహజత్వము కుంటువడినది. ఈ నవలలో ఆధ్యాత్మిక విలువలకన్న, సాహిత్యవిలువలు మెండుగా నున్నవి.

మిగిలిన విషయమెట్లున్నను పండిత పరమేశ్వరశాస్త్రి పాత్రను గోపీచంద్ అద్భుతముగా పోషించెను. శాస్త్రి అస్తిని కాజేయుటకు సీమంతము మొదలైనవారు చేసిన ప్రయత్నములను చిత్రచేసి, కేశవమూర్తిని తన వారసునిగా అతడు నిర్ణయించినతీరు చాల అద్భుతమైనది.

"చీకటిగదులు" గోపీచంద్ అసంపూర్ణ రచన. దీనిలో అయన ఆంధ్రదేశ రాజకీయ చరిత్రను, తన మనస్సులో ప్రవేశించిన విభిన్న ప్రాచ్య, పాశ్చాత్య తాత్విక సిద్ధాంతములను సమన్వయ దృష్టితో వాయ సంకల్పించి, సువిశాల పీఠికను ఏర్పరచి, దానిని పూర్తిచేయకయే కన్ను మూసెను.

శ్రీ గోపీచంద్, సాహిత్య వ్యాసంగమును, సత్యాన్వేషణమును జీవిత ధ్యేయములుగా చేసికొని, చివరఘడియ వరకు ఆ దృక్పథముతో రచనలుచేసి, ప్రాచ్య, పాశ్చాత్య తత్వ సిద్ధాంతములను సమన్వయ దృష్టితో పరిశీలించి, సాహిత్యరంగమున వానిని ప్రవేశపెట్టి, తెలుఁగువారికి నవ్యత్వముతో నిండిన విలువైన గొప్ప నవలల నందించిన ఖ్యాతి ఆయన గడించుకొని, తెలుఁగు నవలా వికాస చరిత్రలో అమరుడయ్యెను.

శ్రీ విశ్వనాథ, శ్రీ గోపీచందులు వారు సృష్టించిన

పెక్కు నవలలయందలి విభిన్న పాత్రలలోనుండి ఏదో ఒక రూపమున తమకు తాపై, వారు కనుపించి, తమ వ్యక్తిగతమైన ఆలోచనలను, అభిరుచులను, సిద్ధాంతములను, వ్యక్తము చేసిరి.

శ్రీ కొడవటిగంటి కుటుంబరావు అట్లుగాక, నిజాయతీతో ఆయన నమ్మిన సిద్ధాంతములను పాత్రల ముఖతః సహజసుందరముగా నుండు రీతిలో చెప్పించి, అతిశయోక్తులకు, అసంబద్ధమైన అతీత వర్ణనలకు తావివ్వక యథార్థ దృష్టితో వ్యక్తులను, సంఘమును భిన్నకోణములనుండి అవలోకించి, తాను రూపొందించిన ఆయా పాత్రలలో నుండి వ్యక్తిగా తానొకనుపించక, ఒక ద్రష్టవలె, న్యాయ నిర్ణేతయై వ్యవహరించెను. అది ఆయన రచనయందలి ప్రత్యేకత.

శ్రీ కుటుంబరావు సామ్యవాది. నిండైన మానవతావాది. ఆంధ్రదేశపు నడిబొడ్డునైన సామ్యవాద బీజములు నాటబడి వేళ్ళూనుచున్న తొలి ఉషస్సులలో, ఆనూతన సిద్ధాంతములకు అక్షర రూపమునిచ్చి నవలలు వ్రాసిన ప్రగతిశీలక రచయితలలో ఆయనది ప్రథమ పీఠము.

శ్రీ కుటుంబరావు కమ్యూనిస్టు సిద్ధాంతములపట్ల పీఠికలిగిన వ్యక్తియైనను, ఆయన తనకు తానై ఆ సిద్ధాంతములను నవలలో ప్రచారముచేయక, వాని ప్రతిపాదనకు అనుకూలమైన ఇతివృత్తమును కల్పించి, ఆ మనస్తత్వము గల పాత్రలను రంగమున ప్రవేశపెట్టి, తమ తమ

సంభాషణలద్వారా ఒకరితో మరియొకరు వాని మంచి చెడ్డ లను చర్చించుకొని, ఒక సదవగహనముతో పురోగమించు వట్లుచేసి చూపించెను. అది ఆ యన నిస్పక్షపాత దృష్టి. ఆయన కల్పించిన పాత్రలన్నియు నిత్యము మనము చూచు చున్న వ్యక్తులకుసంబంధించినవే. అవి మన మధ్య, మనలో మనలుచుండునట్టివే. సున్నితమైన వ్యంగమును ఆయన పాత్రలద్వారా చొప్పింపజేసినను అది ఇతరుల మనస్సును నొప్పించని విధముగా నుండును.

శ్రీకొడవటిగంటి సామ్యవాదియైనను, ఇతర రాజకీయ సిద్ధాంతములను, వర్గములను విమర్శించక, అన్నిటిని సమ దృష్టితో తిలకించి, రచనలుచేసిన మానవతావాది. ఆయన గత నలుబది సంవత్సరములనుండి నిర్విరామముగా సాహిత్య వ్యవసాయముచేసి పండించిన ఫలరాశిని పక్షపాత రహిత బుద్ధితో పరిశీలించినచో ఆ సత్యము విశదమగును. ఆయన పెక్కు నవలలను, నవలికలను వ్రాసి తెలుఁగు ప్రజల కందించిన సాహిత్య సురభి.

సంఘ చరిత్రాత్మక నవలలు :—

శ్రీకొడవటిగంటి విశాల దృష్టినుండి స్రవించిన మధు కుల్యయే "చదువు" అను నవల. అది అశేష పాఠకులను ఆకట్టుకున్న సుచిరమైన రచన. అది క్రీ. శ. 1915-1940 సంవత్సరముల మధ్యన భారతదేశమునను, ఆంధ్రదేశమునను చెలరేగిన జాతీయోద్యమములను ప్రతిబింబింపజేయు నవల.

"సుందరం" అన్న వ్యక్తి అక్షరాభ్యాసముతో నవల ప్రారంభమై అతని కుమారుడు చదువులో ప్రవేశించటముతో అది ముగిసినది. సుందరం తల్లి సీతమ్మ. భర్త మరణముతో ఆమె నిరుత్సాహపడక, తన కుమారుని ఉన్నత విద్యాసంపన్నుని చేయనెంచి, అడపాదడపా లభించుచున్న కొందరు బంధువుల సహాయముతో ఆమె చేసిన ప్రయత్నములు ఇందు వివరింపబడినవి. అనాటి వీధి బడుల విద్యా విధానమునుండి, కళాశాలల చదువుల వరకు ఉన్న విద్యావకాశములను ఇది వివరించును.

"సుందరం" బెనారసులో ఎం. ఏ; ఎల్. ఎల్. బి; వరకు చదివి తిరిగివచ్చి నిరుద్యోగియై, నిర్వ్యాపారియై ఒక రచయితగా మారి సంఘశ్రేయస్సును దృష్టియందుంచుకొని రచనలుచేసి జీవితయాత్రను సాగించెను. అతడు విద్యార్థియై పాఠశాలలలో ఆర్జించిన చదువు, విజ్ఞానముకన్న వాస్తవ జీవితములో గ్రహించిన విషయములే గొప్పవి. ఇహ యాత్ర ఎట్టి వొడు దుడుకులు, మిట్ట పల్లములు లేకుండ సాగుటకు లోకజ్ఞానము అతిముఖ్యమన్న సంగతిని అతడు జీవితములో ఆలస్యముగా గ్రహించెను.

సుందరమునకు అతని తల్లికి గల సంబంధము క్రమముగా చెడిపోయి వారి మధ్య అపోహలు ఏర్పడినది.

సుందరం తన కుమారుడు విద్యార్థియై పాఠశాలకు వెళ్ళుచున్నప్పుడు "ఓనమా" లు దిద్దుచున్నప్పుడు తను, తన

భార్య పొందిన దివ్యానందములో, మధురానుభూతిలో తాను విద్యార్థిగా నున్నప్పుడు, తన తల్లి ఒకప్పుడు పొందిన అనుభూతిని స్మరించుకొని అమాయికురాలు మాతృప్రేమ యందలి పరమార్థమును గ్రహించగలిగెను. కథకు ఇది ఒక విచిత్రమైన మలుపు. తల్లి కుమారుల మధ్య గల వైరము దీనితో సమసిపోయినది.

ఈ నవలకు శేషగిరిరావు పాత్ర జీవము. దేశ స్వాతంత్ర్యోద్యమములో అతడు ప్రముఖపాత్ర వహించి, పెక్కుమారులు శ్రీకృష్ణ జన్మస్థానము నలంకరించిన అకలంక దేశభక్తుడు. దేశ స్వాతంత్ర్యము కొరకు ఎన్ని త్యాగములు చేసినను, అతనికి రావలసిన కీర్తి రానందున కొంత మానసిక వ్యధను అనుభవించినను, తన కర్తవ్య పథమున మడమ తిప్పక పయనించిన కర్మయోగి. గాంధీమహాత్ముని దివ్య మార్గమును అనుసరించిన పుణ్యమూర్తి. అల్లుడు రంగారావు ఆ తరపు యువనాయకుడైన శ్రీజవహర్లాలు నెహ్రూకు ప్రతీక. ఆ ఇరువురు మహాపురుషులకు, ఈ ఇరువురు ప్రతీకలు. శేషగిరిరావుది, వైరాగ్యపరమైన జీవితము. రంగారావు జీవితము కాఁబోవు సహజ మార్పులకు ఆలంబనమైన చిహ్నము. రెండు భిన్నతరములకు ఆ ఇరువురు సంతకేములు.

ఈ నవలలో జలియన్‌వాలాబాగ్, చౌరారణ చంపారాలలో జరిగిన మహోద్యమములు, అక్కడ సంభవించిన అమానుషకృత్యములు, కార్యకర్తల అకుంఠిత దేశభక్తి,

కార్యదక్షత, ప్రజల మనస్తత్వములు చక్కగా నిరూపించ బడినవి. మహాత్మని సహాయ నిరాకరణోద్యమము, జాతీయ పాఠశాలల స్థాపనము, కోర్టుల బహిష్కరణ మొదలైన పెక్కు విషయములు వివరింపబడినవి.

సుందరం, శీతమ్మ, శేషగిరి పాత్రల చిత్రణ మిక్కిలి సహాజముగనుండి వారిపట్ల పఠితలకు సానుభూతి, పదవగాహనను కలిగించును.

"చదువు" నవల ఒక తరపు ఆర్థిక, రాజకీయ సాంఘిక పరిస్థితులను, ఆనాటి గ్రామీణ జీవితమును ప్రత్యక్షముగా వ్యాఖ్యానించినది. ఇది కుటుంబరావు ప్రథమ నవలయైనను దీనిలో వాస్తవిక పరిస్థితులను, అతి వాస్తవ దృక్పథముతో అయన చిత్రించెను.

ఒక విధముగా సుందరం ఆత్మ చరిత్రను - దాని క్రమ విధానమును మనము ఇందులో చూడగలము-

"సుందరం" సాగుచున్న యదార్థ జీవిత నాటకము నకు దూరమై పోకుండినవలె వ్యవహరించి, జీవిత తత్వమును, పరమార్థమును, సహజ మాధుర్యమును గ్రహించలేక మిగిలిన ఒక అసంపూర్ణ వ్యక్తి - అసమర్థుడు.

"అరుణోదయం" నవలలో శ్రీ కుటుంబరావు కమ్యూనిజం నిజ ప్రాముఖ్యతను, విశిష్టతను విశ్లేషించి చెప్పెను. మధ్య తరగతి ప్రజల వికాసమునకు కమ్యూనిజం ఒక్కటే ఆశా జ్యోతి అని భావించి, దానిని ఈ నవలలోముక్కలి నేర్పుతో

ప్రవేశపెట్టెను. కమ్యూనిజంపట్ల, దాని ఉజ్వల భవిష్యత్తు పట్ల ఆయనకుగల అపారమైన విశ్వాసమును ఈ నవలయందు నేర్పుతో ప్రవర్ధమానము చేసి చూపెను. ఈ నవలలో నాయకుడైన రామమూర్తి తన ఆస్తిని బంధువులు హరించి వేసినప్పుడు నోరు మెదపని ఆదర్శవాది - అంతయూ హరించి పోయిన పిమ్మట మద్రాసు చేరి, అచ్చట నానా అగచాట్లు పడి బి. ఏ; వరకు చదివి, ఏదో ఒక ఉద్యోగముచేసికొని బ్రతుకక, స్వేచ్ఛకొరకు, అందని ఆదర్శముల కొరకు అల్లులు చాచి వాటిని చేజిక్కించుకొనలేక, నిత్యనూతనముగా పురోగమించుచున్న సంఘముతో రాజీపడలేక, నిరంతరము దాని వెనుక పరుగిడి తనలో తాను గుడుసుళ్లుతిరుగుతూ, గమ్యము చేరలేని అభాగ్యుడు ఆయన.

ఈ నవలలో ఆనాటి యువకులకు తమ జీవిత ఉన్నతాదర్శములపట్లగల నమ్మకములను, వాటిని పొందుటకు వారు అవలంభించిన మార్గములను, అడ్డుగోడలవలె నిలచిన విషపూరితమైన పరిస్థితులను, విభిన్న సంఘర్షణలద్వారా శిథిలరాగ్రములను చేరుటకు చేసిన వారి ప్రయత్నములను, విఫలములైన వారి ఆలోచనలను, అసంతృప్తిని రామమూర్తి పాత్రద్వారా ఈ అరుణోదయము నవలలో కుటుంబరావు స్పష్టీకరించెను. 1920 - 45 సంవత్సరముల మధ్య ఆంధ్ర దేశమున జరిగిన పెక్కు సంఘటనలకు ఈ నవల ప్రాతినిధ్యము వహించుచున్నది.

రామమూర్తి భార్య "కళ్యాణి". ఆమె అన్నివిధములఁ భర్తకు తోడ్పడిన పంపిదాయజ్ఞురాలు. సుభద్ర విహ్వాల విహాంగి - ఆమె ప్రేమకు మట్టు మర్యాదలు లేవు. ఆమెది స్వేచ్ఛా ప్రవృత్తి. ప్రేమించినవాడు ప్రేమించినంతకాలము ఆమెకు భర్త అన్న భావముగలది. ఆమెది కాకి వన్ని. కాకికంఠము. అయినను ఆమె గాయని. నటి. రామమూర్తిని అన్నివిధముల సంతృప్తిపరచిన పోడ.

"గడ్డురోజులు" నవలలో 'సత్యం', అన్నివిధముల "చదువు" నవలలోని 'సుందరం' ను పోలినవాడైనను, అతని కన్న ఇతడు కొంత వ్యక్తి వికాసముగల వాడైనను, ఇతడును భగ్నాశయుడే. తనకన్న తక్కువ తెలివితేటలు, తక్కువ అంతస్తులుగల ఆంజనేయులు, శ్రీరాములు, వామనరావు, వీరాజు మొదలైనవారందరు జీవితములో వీలైనన్ని పోకడలు పోయి, ధనార్జన చేసి, నిర్విచారముగా జీవించుచు హాయిగా కాలక్షేపము చేయుచుండగా, జీవితమును ముఖాముఖిగా ఎదుర్కొనలేని అసమర్థుడు. 'విధి' ఎటునెట్టిన అటు పోయి, లక్ష్యమును చేరుకొనలేని అవివేకి ఇతడు.

నడచు చున్న సంఘ చరిత్రయందు శ్రీయుతులు తిలక్, గాంధి, గొల్లపూడి సీతారామశాస్త్రి, స్థానం నరసింహారావు వంటి ప్రసిద్ధ చారిత్రక పురుషులను, మరియు ఆయా కాలములయందలి సన్నివేశ, సంఘటనలను "చదువు, అరుణోదయము, గడ్డురోజులు" అను నవలలయందు ప్రవేశపఱచి

వివరించుటనుబట్టి ఈ నవలాత్రయమును సంఘ చరిత్రాత్మక నవలలని పేరొనియుంటిని.

సాంఘిక నవలలు :

"కొత్త అల్లుడు-కొత్తకోడలు" అను రెండు నవలలు వాస్తవ సమాజ పరిస్థితులను, జీవితపు పోకడలను ముఖ్యముగా మధ్యతరగతి ప్రజల మనస్తత్వములను విడమరచి చెప్పునట్టి అపురూప శిల్పఖండికలు.

ఈ నవలాద్వయములో స్వార్థపరుల కుత్సితములను, కుంతంత్రములను, అహంభావములను, ఆదర్శజీవులు ఎట్లు ప్రతిఘటించి విజయమును పొందినది ఉదాత్తభావనా పటిమతో శ్రీ కొడవటిగంటి వివరించెను.

"కొత్త అల్లుడు" నవలలో కమలమ్మ, ముకుందుడు దుష్టస్వభావమునకు, సంకుచిత తత్వమునకు ప్రతీకలు. అల్లుడైన కుశాలరావు కాలాతీత వ్యక్తి. అతడు యువతరమునకు, నవతరమునకు ఆశాజ్యోతి. కొత్త పోకడలకు ప్రతినిధి. అత్తమామలనుండి, బంధుత్వమును, ప్రేమను తప్ప భౌతిక సంబంధమైన ఇతర వస్తువులను కాంక్షించని మధురమూర్తి.

"కొత్తకోడలు" నవలలో సరోజని ఒక విశిష్ట స్త్రీ మూర్తి. ఆమె ఆదర్శజీవితము, ప్రవర్తన నేటి నారీమణులు జ్ఞాపకముంచుకొనదగినవి. భావి తరపు "స్త్రీ" జాతికి సరోజనిని ఆదర్శముచేసి చూపిన శ్రీ కుటుంబరావు ప్రశంసనీయుడు.

కుటుంబమునందలి వ్యక్తులందరును కలసి మెలసి జీవించినప్పుడు కలుగు సౌభాగ్యమును, ఆనందమును గుర్తింప నేరని దివాంధురాలు హానుమాయమ్మ. పిల్లలందరిని తన అదుపాజ్ఞలలో ఉంచుకొని తను గీసిన గీటును దాటిపోకుండు నట్లు శాసించిన మూర్ఖురాలు. పిల్లలు ఆమె ఆశలను అడి యాసలుచేసి, ఆమె చేతిలోనుండి జారిపోయిరి. ఇంతటి గయ్యాళిగంప గూడ కాలము ఇచ్చిన తీర్పునకు తలవొగ్గక తప్పలేదు. ఆమె భర్త ఉత్తముడు. కాలపరిస్థితులను గుర్తించిన మేధావి. భార్య చేయు అస్తవ్యస్తమైన పనులకు బాధపడినను, ఆమె నోటికి భయపడి మంచి సూచనలు ఇచ్చుటకు సైతము వెనుకాడిన సాధుమూర్తి.

"కొత్త అల్లుడు" నవలలో "చంద్రావతి" తల్లి కమలమ్మ కఠినశాసనమును ఉల్లంఘించి, హోటలులో ఉన్న కుశాలరావు వద్దకు వెళ్ళి అతనిని వివాహమాడుదునని తెలిపి ఇంటికి తిరిగివచ్చి తల్లితో "మీ అందరి ఇష్టాలు విని విని తలపట్టిపోయింది. ఇకముందు నా ఇష్టమేమిటో మీరు వినండి-" అంటుంది ఎంతో ధైర్యముగా. అదే విధముగా కొత్తకోడలు నవలలో "సరోజిని" నేరుగా హానుమాయమ్మ ఇంటికి వచ్చి చలపతితో స్వేచ్ఛగా మాట్లాడి, హానుమాయమ్మను తప్ప ఇంటిలో ఉన్న వారినందరిని మంచి చేసుకొని అతనితో రిజిష్టరు మేరేజి చేసుకొనిన నేర్పరి.

"వారసత్వం" నవలలోని అనూరాధ, జీవితమునైన

అపేక్ష చూపని వ్యక్తి - "సుదర్శనం" అను బిడ్డల తండ్రితో సహజీవనముచేసి, జీవిత మాధుర్యమును చవిచూచినది. సుదర్శనం భార్య దుర్గాంబ అపరకాళి. అయినను నేర్పుతో ఆమె భర్త సహచర్యమును విడిచిపెట్టని అనూరాధ, యెంతటి వివేకవతియో మనకు ఈ నవలలో విశదమగును.

"తార" నవల ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ వారి బహుమతి నందుకొనిన ఉత్తమ రచన. బాల్యము ననే తాళిగట్టిన భర్త గతించినందువలన శ్యామల జీవితము ఎందుకు కొరగాకుండ మారిపోయినది. ఆమె తండ్రి, రామశాస్త్రి అను సంఘ సంస్కారి పోద్బలముతో మాయల మరాఠి వంటి ప్రకాశరావును వివాహమాడినది. అతడు భార్యను సైతము పెట్టుబడిగా ఉపయోగించి ధనార్జనము చేయుటకు వెనుదీయని నీచుడు. శ్యామలను మద్రాసు తీసుకొనివెళ్ళి సినిమాలో ఛాన్సు ఇప్పింతునని ఆశలు గొలిపి నప్పుడు అతనిమీద ఆమెకు అసహ్యము కలిగినది. మద్రాసులో అతడు ఒక చెట్టియారును మోసముచేసి డబ్బును సంపాదించి ఆమెకు చెప్పకుండగడ ఉడాయించినప్పుడు, ఆమె అందరు స్త్రీలవలె అధైర్యపడక వాసుదేవరావు అను మరొక వ్యక్తితో చేయికలిపి, సుఖజీవనము చేసిన ధీరురాలు. బజారుపాలై పరిస్థితులకు లొంగిపోకుండ జీవించిన ఉపాయశాలిని ఆమె.

"వారసత్వం" నవలలోని అనూరాధ, "తార" నవల

లోని శ్యామల, ఇద్దరు తమకు సంభవించిన కష్ట నష్టములకు అధైర్యపడక పరిస్థితుల తాకిడికి ఎదురొడ్డి నిలచిన వివేక వతులు-

నవలికలు:

"అనామిక" చిన్న నవలిక. దీనిలో శ్రీ కుటుంబ రావు కమ్యూనిజముపైన తనకున్న అభిమానమును ప్రదర్శించుటకు ఇద్దరు స్నేహితుల మధ్య చర్చావేదికను ఏర్పరచెను. "గోవిందరావు" అను అభ్యుదయవాదినైన రచయిత నుగురించి ఈ నవలిక వివరించును. దీనిని ఒక నవలిక అనడముకన్న, కొన్ని సంఘటనల కూర్పు అనినచో సరిపోవును.

"ఎండమావులు" లో "రాజు" అను పేరుగల ప్రెస్ కార్మికుడు కమ్యూనిజముద్వారా మరొక ప్రపంచపు అంచులను చూడ తలపెట్టును. అతడు తన మనోభావములను దీర్ఘోపన్యాసములతో వెల్లడించును.

రంగారావు మరొక ప్రెస్ కార్మికుడు. అతడు తన బుద్ధి వైభవముతో రచనలు చేసి, ఆ చిన్న స్థితినుండి పైకి వచ్చి, సినిమాలకు సంభాషణలుగూడ వ్రాసి, పై అంతస్తును చేరుకొనెను. భార్య ప్రతికూలవతియై పరివర్తించి నందున "సుందరం" అను తన చిన్ననాటి స్నేహితురాలితో సంబంధమును కల్పించుకొని, ఆమెతో యథేచ్ఛగా తిరుగుచున్నప్పుడు సినిమా వ్యక్తులు అతనిని ఆ రంగమునుండి తరిమివేసిరి. ఆ పరిస్థితిలో తోటి కార్మికుడైన రాజు, అతనిని సన్మార్గములో

పెట్టి కాపాడెను. భార్య మరణ అతనిని చేరినది. ఏ సినిమా జీవితము తనను వంచించి, అధోగతిపాలు చేసినదో ఆ సినిమా జీవితముపైన అతడు పగదీర్చుకొనుటకు నడుము బిగించును. ఇది ఒక విశిష్టమైన నవలిక.

ప్రతి మనుష్యకు ఉన్న వెలుగు నీడలను శ్రీ కుటుంబ రావు తానై చెప్పక, అనుకూల ప్రతికూల సన్నివేశములను సృష్టించి, తదనుగుణమైన పాత్రలమధ్య చర్చలు నడిపి, నిగ్గు తేల్చి వారి ముఖతః తన మనోభావములను వ్యక్తముచేయు నేర్పు ఆయనది. అది ఆయన రచనా విశిష్టత. చలం వలె ఆయన, తాను సృష్టించిన స్త్రీ పాత్రలకు, లైంగిక స్వేచ్ఛనే ప్రధానముచేసి, అది ముగిసిన తరువాత వానిని గాలిలో విడిచి పెట్టక, ఏదో ఒక మార్గమును చూపి ఉద్ధరించుటకు ప్రయత్నించును. ఇది మరొక విశేషము.

కులములేని పిల్లనుండి, పడుపు వృత్తిలో హాయముగా జీవితము గడుపువారి వరకు; కురూపులనుండి, ఉన్న త సంస్కారవంతులు. రూపవంతులవరకు; సహాయనిరాకరణోద్యమమునుండి, కార్మిక కర్షకోద్యమములవరకు; యుద్ధమునకు ముందున్న డిప్రెషన్‌నుండి, యుద్ధానంతరము ఆకాశమునంటిన అధిక ధరల వరకు: వివాహ వ్యవస్థయందలి లోపము లనుండి, నిరుద్యోగ సమస్యలవరకుగల నడిమి, చివర తరగతుల ప్రజల విభిన్న సమస్యలు, పరిస్థితులు, మానసిక స్థితిగతులు, ఆయన రచనలలో మనకు గనుపించును. ఇన్నిరకము

లైన ఇతివృత్తములతో ఆ యన పెక్కు రచనలు చేసినను, ఆయన సృష్టించిన పాత్రలు మనకు సన్నిహితమైనట్లు, మనతో కలసి మెలసి చర్చించినట్లు; ఆయన రచనా శైలి పఠిత లను ఆకట్టుకొని శాశ్వతముగా వారి మేధస్సునందు గాఢ ముద్రను వేయగలిగినంత బలమైనది కాకుండుట యనునది ఎన్నదగిన లోపముగా కనుపించుచున్నను, తెలుఁగు నవలా సాహిత్య చరిత్రలో, ఆయన పండించిన పంట, రాసిలోను, వాసిలోను శ్రేష్ఠమైనదని విమర్శకులు అంగీకరించిన సత్యము. "Novel is a pocket theat-e" అన్న ఆంగ్ల సూక్తి శ్రీ కొడవటిగంటి నవలలకు కొంతవరకు వర్తించును.

దేశ, కాల, కుల, మత, వర్ణభేదములులేని సాధారణ జనులైన స్త్రీ పురుషుల పరస్పర సంబంధములను, యౌవ్వనో ద్రేకములను, వానివలన సంభవించు వెలుఁగు నీడలను, వారి అంతర్గతమైన సహజ భావములను, ఇతివృత్తములు చేసి లెక్కకుమించిన నవలలు వ్రాసి, రాజాంతఃపురములనుండి రైల్వే ప్లాటుఫారములవరకు; మారుమూల కుగ్రామముల నుండి, మహా పట్టణములవరకు గల ఆంధ్రదేశమున, ఒక దశా బ్దమునకు పైగా ప్రభుత్వము నెరపి, తెలుఁగు ప్రజల హృదయము లలలో పఠనా సక్తిని పెంపొందించిన ప్రముఖ నవలా రచయితలు శ్రీ కొవ్వలి లక్ష్మీనరసింహారావు, శ్రీ జంపన చంద్రశేఖరరావులు.

శ్రీ కొవ్వలి "సిపాయికూతురు" "వెయ్యి శిరస్సులు

ఖండించిన అపూర్వ చింతామణి" "పెంకి పిల్ల" "పాడుగు పెళ్లాం" "పొట్టి మొగుడు" "స్వాతంత్ర్యం"; మురియు శ్రీ జంపన "ఊర్వసి" "వేంకటేశ్వర మహాత్మ్యము" "నల్లకళ్ళ అమ్మాయి" మొదలైన వారి కొన్ని నవలలు పేర్కొనదగినవి. వారి నవలలలో సాహిత్య విలువలు మృగ్యమైనను, నవలల కుండవలసిన చిక్కు ఇతర లక్షణములు లేకున్నను, కథాకథన విధానములో ఒక విధమైన నేవళము, భాషలో ఒక విధమైన పరిళత, సుష్టుగానుండుటచేత, అవి అశేష ప్రజాదరణను పొంది, చదువుట ప్రారంభించినదే తడవుగా ముగియునంతవరకు, పాఠకులు అన్య మనస్కులు కాజాలక పోవుట యను విశిష్టత, ఈ నవలల యండలి ప్రవాహశీలతా లక్షణము. కనుక అవి తెలుఁగు నవలా సాహిత్య వికాస ప్రగతికి అత్యధికముగా దోహదము చేసిన విధమును మనము విస్మరించుకు యెంతమాత్రము వీలులేదు.

వీరితోపాటు సాంఘిక, చారిత్రక నవలల నెన్నింటినో వ్రాసి, ఈ దశలో తెలుఁగు నవలా ప్రపంచమున వినూతన భావ కుసుమములను పుంజీభవింపజేసిన మరికొందరు రచయితలను, వారి రచనలను ఇచ్చట పేర్కొందును.

శ్రీయుతులు బూదూరు రామానుజులురెడ్డి, "రత్నభాయి, వీరగాంధర్వము, మోహన" (1930-31 సం.) గంటి జోగి సోమయాజి "ధర్మసామ్రాజ్యము" (1928 సం.); పోలవరపు రామబ్రహ్మము "లీలాకుమారి" 1, 2 భాగములు (1930);

శ్లా వేంకట సుబ్బయ్య "శుచిముఖి" (1931); అకుండి వేంకట శాస్త్రి "శిలకనుండరి" (1930); శీ) వాత్సవ "సైరంధ్రి" (1933); గంటి సుబ్రహ్మణ్యశర్మ "భూతగృహము, మాధవాశ్రమము" (1932-33); సహదేవ సూర్యప్రకాశరావు "చతురిక" (1930); సామవేదము జానకిరామశర్మ "ధన్యజీవి" (1946); వడ్లపట్ల వెంకటరామదుర్గాప్రసాద్, "బికారి, మినువాక, నాకబలి" (1946-47); పెసుమత్స సత్యనారాయణరాజు "మనస్విని" (1944); కొండూరి నరసింహం "తానాజి"; దుర్భాక రాజశేఖర శతావధాని "రాజసింహ"; నండూరి రామకృష్ణమాచార్య "తెలుగు దళవాయి" (1947); ముడుంబి నరసింహాచార్య "పొరుగింటిపిల్ల, తయ్యాల లంక"; మిత్రశ్రీ "శారద"; ఇల్లెందర్ల రంగనాయకులు "మల్లిక, స్వర్ణలత"; పోలూరి ఆంజనేయప్రసాదు "రణచండిక" (చారిత్రక నవల) అయితం ఇందిరా, భారతులు "ప్రతిమాదేవి" (చారిత్రక నవల): వజ్ఝుల కాళిదాసు, వేంకటేశ్వరుల "నళిని, నివాళి, బాష్పబిందువు" మొదలైనవి.

అనువాదములు :

ఈ కాలమున వివిధ భాషలనుండి అనువదింపబడిన కొన్ని ఉత్తమ నవలలను, అనువాదకులను ఈ సందర్భమున స్మరించుట సమంజసమని భావింతును. శ్రీయుతులు సహదేవ సూర్యప్రకాశరావు "చతురిక" (శరత్ ఆరక్షణీయ 1930); వెలువోలుసీ తారామయ్య "ప్రేమ"(అశ్వసీకుమారదత్తు వంగ

మూలమునకు హిందీ నుండి 1930); కాపీ ధర్మారావు "అనా కెర్నినా" (టాలస్టాయి), అట్లూరి పిచ్చేశ్వరరావు "గోదాన్" (ప్రేంచంద్); దిగవల్లి శేషగిరిరావు "విజయ" (శరత్ నవలకు 1945); సాంబశివరావు బాబ్జి, "కాశీనాథ్, నళిని" (శరత్ నవలలు 1946); మద్దిపట్ల సూరి "స్వయంసిద్ధ, పథేర్ పాంచాలి, జీవనలీలలు" (బెంగాలినుండి) వేదుల సత్య నారాయణశాస్త్రి "ధర్మపాల, అపరాధిని, రంగమహల్, వినోదిని" (రవీంద్రుని నవలలు); శ్రీనివాస చక్రవర్తి, "అనాథబాలుడు" (గోర్కీ ఆంగ్ల నవలకు); "పికమీడలు" (తుర్గినీవ్ నవలకు ఆంగ్లమునుండి); అట్లూరి నరసింహారావు "వాల్గానుండి-గంగాతీరంవరకు" (రాహుల్ సాంకృత్యాయన్ హిందినుండి) - ఈదశలో అనువాదములకన్న స్వతంత్ర రచనలవైపే మన రచయితల దృష్టి అధికముగా కేంద్రీకరించినది. కనుకనే వారి లేఖిని నుండి ఉత్తమోత్తమమైన స్వతంత్ర రచనలు అత్యధిక సంఖ్యలో వెలువడి, మన నవలా సాహిత్య చరిత్రలో ఒక నూతనాధ్యాయమును ప్రారంభింపజేసి బంగరు పంటలతో కళకళలాడించి, తళతళ మెరిపించినది.

వెనుకటివలె, ఇతరములో అపరాధ పరిశోధక నవలలు అంత ముమ్మరముగా వెలువడలేదు. కాని దేశమునకు స్వాతంత్ర్యము సిద్ధించిన పిమ్మట ఈ అపరాధ పరిశోధక నవలలు కుప్పతిప్పలుగా వెలువడి, పాఠకులకు మంచి అభిరుచిని, ఆనందమును, చక్కని కాలక్షేపమును, కలిగించినవి.

ఈ సాహిత్యశాఖ పొందిన వికాసమును ముందు ప్రకరణము లలో తెలుపుదును.

పైన తెలిపినవారేగాక, ఈసాహిత్యశాఖ క్రాంతివంతమై నవ నవోన్మేషముగా వర్ధిల్లుటకు పరిశ్రమించిన రచయిత లెందరో ఉన్నను, వారందరినిగుఱించి చర్చించుట సాధ్యము కాకపోవుటయే గాక, అది నా పరిశీలనాలభ్యము నందొదగ నిది కూడ. కనుక భారతదేశమునను. ప్రముఖముగా ఆంధ్ర దేశమునను వెల్లువయై చెలరేగిన పెక్కు నూతనోద్యమము లకు, సిద్ధాంతములకు, వాని విభిన్న గతులకు, రీతు లకు లక్ష్యభూతములై మన సంఘ పురోగతికి, మను గడ కు, జాతీయ సంస్కృతికి, నాగరికతకు, జీవనాడులై, శరీరమునకు హృదయమువలె భాసించి, తమ అనల్ప కల్పనా మాధుర్య ముచే, మృదుమధుర భావ తరంగములచే, మహోదాత్త వర్ణ నలచే, కథాకథన శిల్ప చమత్కృతిచే, ఆంధ్ర ప్రజా హృద యములను సురభిళ మొనర్చి, ఆకట్టుకొని ఆనందడోలికలలో నూగించిన, కొన్ని ప్రముఖ రచనలను నూతనమే స్పృశించితిని. మిగిలిన వానిని "నామ" మాత్రములుగా తడివి విడిచి పెట్టి తిని. ఇంకను నాకు తెలియనివి, నా దృష్టి పథమునకు రానివి, మరెన్ని అనర్ఘ రత్నములు - మరుగుపడిన మహా మాణిక్యములు ఉన్నవో? అందరికి నా వందనములు -

1869 వ. సంవత్సర పర్యంతమున పా శ్చా త్య పరి పాలనా సంపర్కముతో, ఆంగ్ల భాషాప్రభావముతో ఆంధ్ర

వాఙ్మయ నందనోద్యానమున మనము నాటుకొనిన "తెలుఁగు నవల" అను, ఈ అంటు, క్రమముగా వేళ్ళూని, మారాకులతో రెప రెపలాడి, ఏపుగా పెరిగి, చెట్టై, మ్రానై, మహా వృక్షమై, రెమ్మలతో, కొమ్మలతో, శాఖోపశాఖలై వర్ధిల్లి, నిత్య నూతన వసంత శోభలతో దినదినాభివృద్ధినంది, ఆది 1947 వ. సంవత్సరమునాటికి పొందిన విస్తృతిని, విజ్ఞాత్రముగా ఇంతవరకు తెలిపియుంటిని. ఈ క్రమ వికాస కృషి పథములో ప్రాచ్య, పాశ్చాత్య మహా రచయితల రచనలతో పాటు, మహా ప్రతిభా సంపన్నులు, స్వతంత్ర ఆలోచనా తత్పరులు, బహుముఖ ప్రజ్ఞాధురీణులు, ప్రగతిశీలురు నైన సర్వశ్రీ. కందుకూరి, చిలకమర్తి, ఉన్నవ, విశ్వనాథ, అడవి, గుడిపాటి, కొడవటిగంటి, గోపీచంద్ మొదలైన ప్రముఖ తెలుఁగు రచయితలు నిరంతరము తడభివృద్ధికై చేసిన సేవలను, వారి చేతులలో అది మలచబడిన విధమును ఇంతవరకు క్లుప్తముగా వివరించితిని.

స్వాతంత్ర్యము సిద్ధించిన అనంతరము ఆ మహా వృక్షము, దివ్యసౌరభముతో పుష్పించి, ఫలించి, సర్వాంగసుందరమై, సర్వాలంకార శోభితమై, సర్వ కళావిలసితమై, అది దశ దిశల వెలుగొంది, గుణములోను, రాసిలోను, వాసిలోను, మేలు జాతిలోను, రుచిలోను ప్రపంచ నవలా సాహిత్యముతో సర్వవిధముల తులతూగుచు, మన నవలా రచయితలకు విశ్వ కీర్తిని సంతరించిపెట్టిన విధమును, రాబోవు ప్రకరణములలో తెలుపుదును——

1947-1973 తృతీయదశ

స్వాతంత్ర్య భానూదయము – ప్రగతి పథములో నవభారతము.

రెండు శతాబ్దముల పారతంత్ర్యానంతరము 1947 సం. ఆగష్టు 14 వ. తేది అర్ధరాత్రి మన దేశమునకు స్వాతంత్ర్యము సిద్ధించినది. కాని అఖండ హిందూదేశము; భారత, పాకిస్తాను అను రెండు భాగములుగా విభజింపబడినది. భారత రత్న. శ్రీ జవహర్లాలునెహ్రూ నాయకత్వమున కేంద్రమున జాతీయ ప్రభుత్వమేర్పడినది. దేశ విభజనతో బెంగాలు నందలి నఖళీ పాంతమునను, పంజాబు రాష్ట్రమునను మత కలహములు చెలరేగి, రక్తపాతము జరిగినది. పెద్దపెట్టున కాందిశీకులు భారతదేశమునకు వలసవచ్చిరి. ఆహారధాన్యముల కొరత ఏర్పడి, రేషనింగు విధానమును దేశమందంతటను ఏర్పరచిరి. క్రమముగా దేశమున నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశము నంటుకొనదొడగినవి. చీకటిబజారులో పరకుల క్రయ, విక్రయములు పారంభమైనవి.

1948 సం. జనవరి 30 వ. తేది. సాయంత్రము ఆరు గంటలకు ఢిల్లీయందలి బిర్లా భవనములో మన జాతిపిత మహాత్మా గాంధి పార్థనా సమావేశములో ప్రసంగించుచుండగా "నాథురాంఘాడ్సే" అనునతడు, తన పిస్టలుతో

కాల్చగా "హే-రాం-రాం" అని ఆయన నేలకొరిగెను. కుల, మత వర్గభేదములు లేక అశేష భారతజాతి ఆ మహాత్ముని కొరకు విలపించినది. ప్రపంచ పీడిత జనోద్ధరణకు నదుము బిగించి, తన సర్వస్వమును ఆ మహోద్యమమునకు ధారబోసిన ఆ పరంజ్యోతికి, విశ్వ ప్రజలు తమ భక్తిపురస్సరమైన ప్రగాఢ శ్రద్ధాంజలిని సమర్పించిరి.

1950 సం. జనవరి 26 వ. తేదిన డాక్టర్. శ్రీ రాజేంద్ర ప్రసాద్ రాష్ట్రపతిగా సర్వ స్వతంత్ర ప్రజాస్వామ్య భారత రిపబ్లిక్ అవతరించినది.

భారత దేశమునందంతటను చిన్నా భిన్నముగా నుండి దేశీయ సమ్మైక్యతకు, సమైక్యతకు అడ్డుపడుచున్న 670 స్వదేశ సంస్థానములు సర్దారు. శ్రీ వల్లభాయి పటేలు అధినేతృత్వ కృషితో ఇండియన్ యూనియనులో అంతర్భాగమైపోయినవి.

1952-53 వ. సంత్సరములలో చిరకాలమునుండి దేశ వ్యాప్తముగా ప్రజానీకము వాంఛించిన, భాషాప్రయుక్త రాష్ట్రములు ఏర్పడినవి.

భారత ప్రభుత్వము దేశాభ్యుదయమునకై ప్రథమ, ద్వితీయ, తృతీయ, చతుర్థ పంచవర్ష ప్రణాళికలను వరుసగా సిద్ధముచేసి, వ్యవసాయము, విద్య, పరిశ్రమలు, నదీ ప్రాజెక్టులు, జల విద్యుత్తు మొదలైన సౌకర్యములను కలిగించుటకు పూను కొనినది.

పెద్దపెద్ద నదులకు ఆనకట్టలు కట్టి, భాక్రానంగల్,

హీరాకుడ్, నాగార్జునసాగర్ వంటి ప్రాజెక్టులను ప్రభుత్వము నిర్మించినది.

భిల్వాయి, దుర్గాపూర్, రూర్కేల మొదలైన ప్రదేశములలో పెద్ద ఉక్కు కర్మాగారములను స్థాపించినది.

గ్రామీణ స్థాయినుండి, పట్టణస్థాయివరకు గల అన్ని దశలలోను విద్యా సౌకర్యములను కల్పించి, నిర్బంధ ప్రాథమిక విద్యను గూడ దేశమున అమలుపరచినది.

మహాత్ముడు కలలుగన్న "రామరాజ్య" స్థాపనకు ప్రభుత్వము, ప్రబల కృషి ప్రారంభించినది. సోషలిస్టు సిద్ధాంతముల ప్రాతిపదికపైన నవసమాజ నిర్మాణమునకు పాటుపడవలె నని "ఆవడి" కాంగ్రేసు మహాసభలు తీర్మానించినవి. తదను గుణముగా కార్యకర్తలు దేశాభ్యుదయమునకు కృషి ప్రారంభించిరి.

దేశీయ భాషలను ప్రోత్సహించి, ఉత్తమ గ్రంథములను ప్రచురించుటకు భారత ప్రభుత్వము "కేంద్ర సాహిత్య అకాడమి" అను సంస్థను 1954-55 సంవత్సరములలో స్థాపించినది. అంతియేగాక అది ఉత్తమ గ్రంథములకు బహుమతుల నిచ్చుచు రచయితలను ప్రోత్సహించుచున్నది. ఒక దేశీయ భాషలో వెలువడిన ఉత్తమ రచనను ఇతర దేశీయ భాషలలోనికి గూడ అనువదించి, భారతీయ భాషల నన్నింటికిని సన్నిహిత సంబంధమును కలిగించుచున్నది.

"భారతీయ జ్ఞాన పీఠము" అను ఒక సంస్థ, భారతదేశ

మునందలి వివిధ భాషలలో వెలువడిన అత్యుత్తమ గ్రంథ మునకు ప్రతి సంవత్సరము ఒక లక్షరూపాయల నగదు బహు మతి నిచ్చుచు గొప్ప సాహిత్యసేవ చేయుచున్నది. ఇది విశ్వ విఖ్యాత "నోబులు ప్రైజు పద్ధతిలో" నడచుచున్నది.

"హిందూ-చైనా" భాయి భాయి అని ఎంతో కాల మునుండి భారతదేశముతో మిత్రత్వము నెఱపిన చైనా 20-10-1962 వ. సంవత్సరమున మనపైన అకారణముగా యుద్ధము ప్రకటించినది. ఆ దురాక్రమణను నిరసించుచు, ఆసేతు శీతనగరమునందలి కవులు, రచయితలు రచనలుచేసి తమ దేశభక్తిని ప్రదర్శించిరి. శాంతిమూర్తియైన శ్రీ నెహ్రూ పండితుని హృదయము ఈ దుస్సంఘటనతో పరితపించిపోయి నది. ప్రజాస్వామ్య దేశములు ఈ దుస్సంఘటనను తీవ్రముగా నిరసించుటవలన, చైనా యుద్ధమును విరమించి వెనుకకు తిరిగిపోయినది. 1964 సం. మే 27 వ. తేదీన, నవభారత నిర్మాతయైన శ్రీ నెహ్రూ పండితుడు శాశ్వతముగా ఈ లోక మును వీడి అశేష భారత ప్రజానీకమును దుఃఖసాగరమున ముంచివైచెను.

1965 వ. సంవత్సరమున పాకిస్తాన్ భారతభూభాగము. పైన దండయాత్రచేసి, కొన్ని భాగములను ఆక్రమించు కొనగా, అప్పటి ప్రధాన మంత్రి శ్రీ లాల్ బహద్దూర్ శాస్త్రి గొప్ప ధైర్యముతో శత్రువులను తిప్పికొట్టి, మనకు దిగ్విజయమును సమకూర్చెను.

1971 వ. సంవత్సరమున "బంగ్లాదేశ్" ప్రజలు తమ దేశ స్వాతంత్ర్యముకొరకై పోరాడినప్పుడు పాకిస్థాన్ ప్రభుత్వము నిర్దాక్షిణ్యముగా వ్యవహరించి, ఆ ఉద్యమమును అణచివేయుటకు ప్రయత్నించినది. ఆ దేశ ప్రజలు పెక్కుమంది శరణార్థులై మనదేశమునకు వచ్చిరి. వారికి అన్ని విధముల అండదండలుగా నిలుచుటయేగాక, ఆప్రజల ప్రగాఢ స్వాతంత్ర్యేచ్ఛను, సమర్థించి వారికి అఖండ విజయమును సమకూర్చుటకు; మన ప్రజలు, ప్రభుత్వ పక్షమున ప్రధాని. శ్రీమతి ఇందిరాగాంధి తోడ్పడినది.

మన రచయితలందరు ఈ సంఘటనలను 'కేంద్రము' చేసి, దేశభక్తి ప్రపూరితమైన రచనలుచేసిరి.

స్వతంత్ర భారతదేశమున ఈ మధ్యకాలమున ఎన్నియో, రాజకీయ మార్పులు సంభవించినవి. సోషలిస్టు పార్టి రెండుగా చీలిపోయినది. భారత కమ్యూనిష్టుపార్టి; మితవాదులు, అతివాదులు, ఉగ్రవాదులు అను మూడు పార్టీలుగా మారిపోయినది. అఖిలభారత కాంగ్రెస్; సంస్థా కాంగ్రెస్, కొత్త కాంగ్రేసు అను రెండు పార్టీలుగా విడిపోయినది. శ్రీరాజాజి నాయకత్వమున "స్వతంత్రపార్టి" అను ఒక నూతన పార్టి యావద్భారతదేశమున అవతరించినది. జనసంఘము ఒక బలమైన ప్రతిపక్షముగా కొన్ని రాష్ట్రములలో స్థిరపడినది.

బెంగాలు రాష్ట్రమున బయలుదేరిన 'నక్సలైటు' ఉద్య

మము, యావద్భారత దేశమును కొంతకాలము కల్లోల పరచినది.

జాతీయ మలేరియా నిర్మూలనము, కుటుంబ నియంత్రణము, నిరుద్యోగ సమస్య, ధరల పెరుగుదల, చీకటి మార్కెట్టు, దొంగనోట్ల చెలామణి వంటి పెక్కు క్లిష్ట సమస్యలు ఉత్పన్నమైనవి.

కొరియాలో ఆనాడు జరిగిన దారుణ మారణహోమము, నేడు వియత్నాములో జరుగుచున్న భయానక యుద్ధ పరిస్థితులు, రచయితల హృదయములను కల్లోలపరచి, ఉత్తేజితుల నొనరించి, రచనలు చేయునట్లు పే)రేపించినవి.

1947 – 1973 తృతీయ దశ.

ఆంధ్రోద్యమము లు – ఆశయ సిద్ధి.

దేశమునకు స్వాతంత్ర్యము లభించిన పిమ్మట కేంద్రము నందు వలెనే, వివిధ రాష్ట్రములలోను జాతీయ ప్రభుత్వములు ఏర్పడినవి. ప్రత్యేక ఆంధ్రరాష్ట్ర సాధనకై చిరకాలము నుండి జరుగుచున్న కృషి ఫలించనందున శ్రీ స్వామి సీతారాం 1950 వ. సం. స్వాతంత్ర్య దినోత్సవమునాడు ఆమరణ నిరశన దీక్షను బూని, 35 రోజులు గడిచిన పిమ్మట ఆచార్య. శ్రీ వినోభాభావే, డాక్టర్. శ్రీ రాజేంద్రప్రసాద్, శ్రీ జవహర్లాలు నెహ్రూ) మొదలైన పెద్దల ఆదేశము నను

సరించి విరమించెను. ఆ పిమ్మట అమరజీవి. శ్రీ పొట్టి శ్రీరాములు అస్తవ్యస్తమైపోయిన ప్రత్యేక ఆంధ్రరాష్ట్ర సమస్యను ముందుకు తెచ్చి, మద్రాసునందలి మహా ఋషి. శ్రీ సాంబమూర్తి గృహమున 19 అక్టోబరు 1952 వ. సంవత్సరమున ఆమరణ నిరాహారదీక్షనుబూని 59 రోజుల పిమ్మట 1952 డిశంబరు 15 వ. తేది రాత్రి 11 గం. 23 ని. ములకు పరమేశ్వర సాన్నిధ్యమునకు చేరుకొనెను. ఆంధ్రుల ప్రగాఢ రాష్ట్ర వాంఛను గుర్తించి, ఆనాటి ప్రధానమంత్రి శ్రీ జవహర్లాలు పార్లమెంటులో ఆంధ్రరాష్ట్రమును ప్రసాదించుటకు అంగీకరించి, చరిత్రాత్మకమైన ఒక ప్రకటన చేసెను. తదనుగుణముగా రాజస్థాన్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి శ్రీ కైలాసనాథ వాంఛు సమర్పించిన ప్రత్యేక నివేదిక ననుసరించి 1953 వ. సం. అక్టోబరు 1 వ. తేదీన సి. యం. త్రిసేది గవర్నరుగా, ఆంధ్రకేసరి ప్రకాశం పంతులు ముఖ్యమంత్రిగా, కర్నూలును రాజధానిగా చేసి, ప్రత్యేక ఆంధ్రరాష్ట్రమును ఎర్పరచిరి. శ్రీ జవహర్లాలు అశేష ప్రజల ఆనందోత్సవముల మధ్య ఈ ప్రారం భోత్సవమును జరిపెను.

శ్రీ స్వామి రామానందతీర్థ నేతృత్వమున, స్టేటుకాంగ్రెసు ఆధ్వర్యమున 1947-48 సంవత్సరములలో అవిభక్త హైదరాబాద్ రాష్ట్రమున నైజాం ప్రభుత్వమునకు వ్యతిరేకముగా స్వాతంత్ర్య పోరాటము ఉవ్వెత్తున లేచి, రాష్ట్రమునందలి విభిన్న ప్రాంతములలో ముమ్మరముగా సాగినది.

రజాకార్ల దౌర్జన్యములను ఎదిరించి, ప్రజాస్వామ్య వ్యవస్థను నెలకొలుపుటకు రాష్ట్ర సరిహద్దులలో కాంగ్రెసు ఆధ్వర్యమున కేంపులను ఏర్పాటుచేసి, వాలంటీరులకు శిక్షణ నిచ్చి, ప్రజా ఉద్యమమును తీవ్రతరము చేసిరి. తెలంగాణ ప్రాంతమున ఈ ఉద్యమమునకు సర్వశ్రీ. బూరుగుల రామకృష్ణారావు, కొండా వెంకటరంగారెడ్డి, జమలాపురం కేశవరావు, బొమ్మకంటి సత్యనారాయణరావు, టి. హయగ్రీవాచారి, మాడపాటి రామచంద్రరావు, పాగ పుల్లారెడ్డి వంటి ప్రముఖులు సారథ్యము వహించిరి. కమ్యూనిస్టు పార్టి పక్షమున సర్వశ్రీ రావి నారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డి, దేవులపల్లి వేంకటేశ్వరరావు, సర్వదేవభట్ల రామనాథము మొదలైనవారు పనిచేసిరి. ఆర్యసమాజము వైపునుండి సర్వశ్రీ నరేంద్రజీ, రుద్రదేవ్, భద్రదేవ్ వంటి వారు పాలుగొనిరి.

కాంగ్రెసు సంస్థ పక్షమున "సారథి" అను వారపత్రిక శ్రీ కాళోజి రామానుజస్వామి సంపాదకత్వమునను; "తెలుఁగుదేశము" అను వారపత్రిక శ్రీమతి సూర్యదేవర రాజ్యలక్ష్మమ్మ సంపాదకత్వమునను వెలువడి, అనాటి ప్రజా ఉద్యమ నిర్వాహణకు, విజయ సముపార్జనకు అసాధారణమైన కృషి సలిపినవి.

ఆంధ్ర ప్రాంతమున కాంగ్రెసు పక్షమున సర్వశ్రీ. అయ్యదేవర కాళేశ్వరరావు, ఆంధ్రకేసరి ప్రకాశం,

ఆచార్య రంగ, గోర, తెన్నేటి విశ్వనాథం, దుగ్గిరాల బలరామకృష్ణయ్యలు; కమ్యూనిష్టుపార్టీ వైపునుండి పర్వతీ. పుచ్చలపల్లి సుందరయ్య, మోటూరి హనుమంతరావు, చండ్ర రాజేశ్వరరావు వంటి ప్రముఖులు ఈ మహోద్యమమును బలపరచుచు, గొప్ప చేయూత నిచ్చిరి.

ఎందరెందరో దేశభక్తులు తమ అస్తిపాస్తులను గోలు పోయి, శ్రీకృష్ణజన్మస్థానములలో మగ్గిపోయిరి. కొందరు దారుణ హత్యలకు గురియైరి. స్త్రీలు పెక్కు అవమానముల పాలైరి. ఎందరో కవులు, రచయితలు ఈ ఉద్యమమును బలపరచుచు రచనలు చేసిరి.

శ్రీ కే. యం. మున్షి భారత ప్రభుత్వ ఏజంటుగా వ్యవహరించి, నైజాం ప్రభుత్వముతో చాకచక్యముగా ఆనాడునడిపిన రాయబారములు మిక్కిలి శ్లాఘనీయమైనవి.

ఆనాటి దేశీయ వ్యవహారముల మంత్రియైన శ్రీ వల్లభాయి పటేలు రాజకీయ చతురతతో 1948 సెప్టెంబరు 13 వ. తేదీన హైదరాబాదు రాష్ట్రమునపైన పోలీసుచర్య జరిపి, ఈ భూభాగమును ఇండియన్ యూనియన్‌లో అంతర్భాగము గావించిరి. జె. యన్. చౌదరి మిలటరీ గవర్నరుగా కొంతకాలము పనిచేసెను. ఆ పిమ్మట యం. కె. వెల్లోడి సివిలు పరిపాలనాధికారిగా వ్యవహరించెను. శ్రీ బూరుగుల రామకృష్ణారావు, శ్రీ వినాయకరావు విద్యాలంకారు మొదలైనవారు, ఈయన మంత్రివర్గమున ప్రజా ప్రతినిధులుగా

చేరి పనిచేసిరి. అపిమ్మట 1953 వ. సం. కాష్ట్రమున సాధారణ ఎన్నికలు జరిగినవి. శ్రీ నైజాం నవాబు రాజప్రముఖుగను, శ్రీ బూరుగుల రామకృష్ణారావు ముఖ్యమంత్రిగను తొలి ప్రజా ప్రభుత్వము ఏర్పడినది.

1953 వ. సం. తెలంగాణ ప్రాంతమున ములికోలు కాని వారిని, ఉద్యోగములలో నియమించుటకు వ్యతిరేకముగా ఒక ఉద్యమము వడచినది.

1956 వ. సం. హైదాబాదు రాష్ట్రము; తెలంగాణ, మహారాష్ట్ర, కన్నడ ప్రాంతములుగా విడిపోయి, తెలుఁగు వారు ఆంధ్ర ప్రాంతములోను, మహారాష్ట్రులు మహారాష్ట్ర ప్రాంతములోను, కన్నడిగులు కన్నడ ప్రాంతములోను చేరిపోయిరి.

1956 వ. సం. నవంబరు 1 వ. తేదీన హైదాబాదు ముఖ్య పట్టణముగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రము అవతరించినది. ఈ సువిశాల రాష్ట్రమునకు శ్రీ నీలం సంజీవరెడ్డి ప్రథమ ముఖ్యమంత్రి అయ్యేను.

1969 వ. సం. తెలంగాణ ప్రజలు తమ హక్కుల పరిరక్షణ కొరకు ప్రారంభించిన ఉద్యమము, ప్రత్యేక తెలంగాణా వాదముగా మారినది. ప్రధాన మంత్రి శ్రీమతి ఇందిరాగాంధి ప్రకటించిన 'అష్టసూత్ర' పథకముతో శాంతి నెలకొనినది.

1972 వ. సం. ముల్కీ నిబంధనలకు అనుకూలముగా

సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పునకు వ్యతిరేకముగా ఆంధ్ర ప్రాంత ప్రజలు చేపట్టిన ఉద్యమము, ఉభయ ప్రాంతముల వేర్పాటుకు కారణభూతమై, అల్లకల్లోలమునకు దారి తీసినది. ప్రధాన మంత్రి శ్రీమతి ఇందిరాగాంధి ఉభయ ప్రాంత ప్రజల సమైక్యతకు, సహజీవనమునకు 'పంచసూత్ర' పథకమును ప్రవేశపెట్టి గట్టి కృషి చేయుచున్నది.

ఫై రెండు ఉద్యమములలోను పెక్కుమంది ప్రాణము లను గోలుపోయిరి. ప్రభుత్వ ఆస్తులకు, ప్రైవేటు ఆస్తులకు సంభవించిన నష్టము అపారమైనది.

హైదాబాదులో, 1958 వ. సం. నవ్య సాహితీసమితి ఆధ్వర్యములో స్థాపించబడిన "సాహితీ సదస్సు" అఖిల భారత తెలుఁగు రచయితల సంస్థగా రూపొందిది 1960-1971 వ. సం. మధ్య ఆంధ్రదేశమునండలి భిన్న ప్రాంతములలో ఐదు మహాసభలు చాల ఉన్నతస్థాయిలో నడచినవి. ఈ సంస్థను నెలకొలిపిన నాటినుండి, నేటివరకు అత్యుత్సాహముతో ఆ సంస్థను నడుపుచున్నది, ప్రముఖ నవలా రచయిత శ్రీ పోతుకూచి సాంబశివరావు. ఆయునయే ఆసంస్థకు ప్రధాన కార్యదర్శి. ఆయువ ఆధ్వర్యములో "విశ్వరచన" అను తెలుగు సాహిత్య మాసపత్రిక; (Unilit) అను ఆంగ్ల త్రైమాసిక పత్రిక నడచుచున్నవి.

1957 వ. సం. ఆగష్టు 7 వ. తేదీన "ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ", డాక్టర్. శ్రీ బెజవాడ గోపాలరెడ్డి

అధ్యక్షులుగను, శ్రీ దేవులపల్లి రామానుజరావు కార్యదర్శిగను వ్యవహరించునట్లు స్థాపింపబడి, నేటివరకు అది సాహిత్య సేవ చేయుచున్నది.

పర్వశ్రీ, జ్వాలాముఖి, చరబండరాజు, నగ్నమునిని మొదలైన అభ్యుదయ రచయితలు "దిగంబరకవు" లను పేరుతో హైదరాబాదును కేంద్రముచేసి 1965-66 సం. నుండి రచనలు చేయుచు, సంఘమును పట్టి పీడించుచున్న దీర్ఘ రుగ్మతను, కుళ్ళును ఎత్తి చూపి, సమాజములో గొప్ప సంచలనమును కలిగించిరి. వీరివలెనే గుంటూరునుండి, ఎ. కె. సుగంబాబు, దేవీ ప్రియ అనువారు "సైగంబర" కవులను పేరుతో రచనలు చేసి, నేటి పెట్టుబడిదారీ వ్యవస్థను, దోపిడి విధానమును నిశితముగా విమర్శించిరి.

1969-70 సంవత్సరములలో శ్రీ. శ్రీ, కొడవటిగంటి, రాచకొండ మొదలైనవారు అభ్యుదయ రచయితల సంఘము నుండి విడివడి, దిగంబర కవులను, సైగంబర కవులను కలుపుకొని "విప్లవ రచయితల" సంఘమును స్థాపించి, విప్లవ పంథాలో రచనలు చేయుట కుద్యమించిరి.

శ్రీ తుమ్మల వెంకటరామయ్య, శ్రీ ఆరుద్ర, శ్రీ దాశరథి మొదలైన అభ్యుదయ రచయితలు; శ్రీ నోరి, శ్రీ ముక్కామల మొదలైన నవ్యసాహితీ సమితి సభ్యులు, ఎవరికి వారు తమతమ భావములకు అనుగుణముగా రచనలు చేసి, సంఘ పురోభివృద్ధికి దోహదమొనరించిరి.

ఆంధ్రపత్రిక, ఆంధ్రప్రభ, ఆంధ్రజ్యోతి, విశాలాంధ్ర (దిన పత్రికలు); ఆంధ్ర పత్రిక, ఆంధ్రప్రభ, ఆంధ్రజ్యోతి, ప్రగతి సచిత్ర వారపత్రికలు); జాగృతి, కృష్ణాపత్రిక, ప్రజామత (మొదలైన రాజకీయ సాహిత్య వారపత్రికలు) యువ, భారతి మొదలైన (మాస పత్రికలు) ఆంధ్ర ప్రాంతమునుండి నవలా సాహిత్య ప్రగతికి సలుపుచున్న సేవలు మరువరానివి.

సృవంతి, సృజన, జయంతి, సుజాత, వంటి మాస పత్రికలు, కాకతీయ, ధర్మభూమి, జనధర్మ వంటి వార పత్రికలు తెలంగాణమునుండి వెలువడి, సాహిత్యమునకు వెన్నెముకగానుండి పనిచేయుచున్నవి.

సైకో - ఎనాలిసిస్ (Psycho-analysis) మనో విశ్లేషణకు అధిక ప్రాధాన్యతనిచ్చి పాశ్చాత్య రచయితలు పెక్కు నవలలు వ్రాసిరి.

మానవ మస్తిష్కములో చెలరేగిన వివిధ భావములను యథాతథముగా స్వీకరించి, వానికి ఒక రూప చిత్రణము చేసి, చైతన్య ధోరణిలో కథను మలచి, నవలను వ్రాయు వినూతన విధానమును, పాశ్చాత్య రచయిత జేమ్సుజాయిస్ ప్రారంభించగా; వర్జీనియావుల్ఫ్, విలన్‌వాఘ్ మొదలైన వారి చేతులలో అది శిఖరాగ్రమును చేరుకొనినది.

మన తెలుఁగు రచయితలలో ఈ రకపు నవలలకు శ్రీకారము చుట్టినది శ్రీ గోపీచంద్, శ్రీ కుటుంబరావులు. దీనికి రూపకల్పనముచేసినది శ్రీ జి. వి. కృష్ణారావు. శ్రీ రాచ

కొండ విశ్వనాధశాస్త్రి దీనికి ప్రాణప్రతిష్ఠ చేసెను. దానిని సర్వకళావిలసితముచేసి, పరిపక్వతను సిద్ధింపజేసినది శ్రీ బుచ్చిబాబు. ఇది చైతన్య స్రవంతిలో నడయాడునట్లు మలచినది శ్రీ భాస్కరభట్ల కృష్ణారావు. మరియొక మెట్టు ముందుకు నడపించినది శ్రీ నవీన్. శ్రీ ఆర్. యస్. సుదర్శనం, శ్రీ గొల్లపూడి మారుతిరావు మొదలైన మరికొందరు ఈ విధానములో మరికొన్ని నూతన ప్రయోగములు చేసి, మరి కొంత ముందుకు గొనిపోయిరి.

1956 వ. సంవత్సరము వరకు మన తెలుఁగు నవలాకారులు మద్రాసు పట్టణమును, దాని నానుకొని యున్న మహాసముద్రపు బీచిని ఆలంబనము చేసి పెక్కు నవలలను వ్రాసిరి. ఆంధ్రప్రదేశ్ అవతరించిన పిమ్మట, ఈ రచయితలకు చరిత్రాత్మకమైన హైదరాబాదు పట్టణము, దానిని చుట్టియున్న సుందర పరిసరములు వర్ణనాంశములై వర్ధిల్లి, పెక్కు నవలలు వ్రాయునట్లు చేసినవి.

స్వాతంత్ర్యము లభించిన పిమ్మట దేశీయ జీవనరంగములో విప్లవాత్మకమైన మార్పులకు ప్రాతిపదికగా పారిశ్రామిక సమస్యలు, శ్రామికుల స్థితిగతులు, పంచవర్ష ప్రణాళికలు, మరియు పొదుపు ఉద్యమము, కుటుంబ నియంత్రణము, పంచాయితీరాజ్ వంటి పెక్కు నూతనాంశములను ప్రభుత్వము ప్రవేశపెట్టినది. వీనిని ఇతివృత్తములుచేసి రచయితలు నవలలు వ్రాసిరి. వీనికి తోడు సంఘ పరముగా అనాది

నుండి పారంపర్యముగా వచ్చుచున్న ప్రేమ, వివాహము దాని విచ్ఛిత్తి, విడాకులు, వర్ణాశ్రమ ధర్మములు, హరిజన, గిరిజన సమస్యలు, సవతి తల్లులు, వారివలన సంభవించు కష్ట నష్టములు, ఉమ్మడి సంసారములు, వాని విచ్ఛిత్తి, మధ్య, చివర తరగతి ప్రజల దైనందిన జీవిత సమస్యలు, వరకట్నములు, బాలబాలికల విద్యాసమస్యలు, నిరుద్యోగ సమస్యలు, వర్ణాంతర, మతాంతర వివాహములు, వానివలన సంభవించు ఒడు దుడుకులు, అధికారులు గుమస్తాల మధ్య నిత్యనూతనముగా ఉత్పన్నమగుచున్న పరిస్థితులు, ఆహార సమస్య, కరువు కాటకములు, అతివృష్టి అనావృష్టి పరిస్థితులు, ఆస్తిక, నాస్తిక సిద్ధాంతములు నేటి రచయితలకు ఇతివృత్తములై పెక్కు సాంఘిక, సాంసారిక నవలలు వ్రాయుటకు ప్రేరేపించినవి.

ఈ సమస్యలను తమ నవలలయందు ఇతివృత్తములు చేసి పెక్కు రచనలు చేసిన వారిలో శ్రీయుతులు మహీధర రామమోహనరావు, బలివాడ కాంతారావు, కందుకూరి లింగరాజు, పురాణం సూర్యప్రకాశరావు, కాళ్లూరి నాగేశ్వరరావు, వట్టికోట ఆళ్వారుస్వామి, ఎర్రం చందశేఖర్, పోతుకూచి సాంబశివరావులు, మరియు శ్రీమతులు ముప్పాళ్ళ రంగనాయకమ్మ, గోపూరి కౌసల్యాదేవి, యద్ధనపూడి సులోచనారాణి వంటి వారు పేర్కొనదగిన ప్రముఖులు.

స్వాతంత్ర్యోద్యమ కాలమునను, ఆ పిమ్మటను చేసిన

కొన్ని వాగ్దానములను నాయకులు పూర్తిచేయకుండుటయే గాక, పదవులకై తమలో తాము కుమ్మలాడుకొనుట, ఆశ్రిత పక్షపాతముతో వ్యవహరించుట వంటి విషయములు ప్రజలకు, రచయితలకు అసంతృప్తిని కలిగించినవి. రచయితలు ఆ విషయములను ఇతివృత్తముచేసి వ్యంగ్యాత్మకమైన, చక్కని నవలలను వ్రాసిరి. అట్టి వారిలో శ్రీ ముళ్ళపూడి వెంకట రమణ, శ్రీ గొల్లపూడి నారాయణలవి అందెవేసిన చేతులు.

గ్రామీణ జీవిత వ్యవస్థలో ఆర్థిక, రాజకీయ, సాంఘిక, వైజ్ఞానిక రంగములలో వచ్చిన మార్పులు, పడలిపోవుచున్న కట్టుబాట్లు, ఆంతరంగిక కల్లోలములు, ఎన్నికలు, స్వార్థధామములైన గ్రామసీమలను పడలి పట్టణముల నాశ్రయించుటకు ప్రజలు పలుపుచున్న ప్రయత్నములు, అనాదినుండి వచ్చుచున్న వృత్తులు పడిపోవుట, ఉద్యోగములకొరకు చేయు పరుగులాటలు, సంఘ జీవితము, వ్యక్తి జీవితము, డబ్బుపైన ఆధారపడుట వంటి సమస్యలును రచయితలను ఉత్తేజపరచి రచనలు చేయించినవి.

స్వాతంత్ర్యోద్యమము నడచిన కాలమున వెలువడిన నవలలపైన కన్న, ఆ పిమ్మట వెలువడిన నవలలపైననే గాంధీ మహాత్ముని చెరగని ముద్రపడినది. ఆయన ప్రవేశపెట్టిన నిర్మాణ కార్యక్రమములను, నడిపిన మహోద్యమములను రచయితలు యథాతథముగా చిత్రించి నవలలు వ్రాసిరి.

అతి వాస్తవిక పరిస్థితులను యథాతథముగా చిత్రిం

చుట, పరిసరముల ప్రభావమును వర్ణించుట, మానవ మేధ స్సులో చైతన్యరూపమున చెలరేగిన విభిన్న భావ తరంగము లను విశ్లేషించి చూపి, చెక్కుమంది రచయితలు నూతన దృక్పథముతో నవలలను వ్రాసిరి.

ప్రగతి మార్గమున గత నూరు సంవత్సరములనుండి విభిన్న సమస్యలతో, వినూతన సిద్ధాంతములతో దిన దిన పరివర్ధమానమగుచు, అవి చెక్కుమంది సిద్ధహస్తులైన నవలా కారుల బుద్ధి వైభవముతో సర్వాంగసుందరమై తెలుఁగు నేలన పసిడి పంటలతో యలలారి, మన నవలా ప్రపంచమున స్వర్ణయుగ సృష్టికి కారణభూతమై వెలుగులను వెదజల్లినవి.

1947—1973 తృతీయ దశ.

తెలుఁగు నవలా వికాస స్వర్ణయుగ సంక్రాంతి—

రచయితల అపూర్వ కృషి — ం

తెలుఁగు రచయితలు, మన నవలా ప్రపంచమున స్వర్ణ దీధితులను ప్రసరింపజేసిన ఈ దశయందును ఉన్నతముగా గనుపించునది కవిసమ్రాట్ శ్రీ విశ్వనాథ సత్యనారాయణయే. ఆయన అరువదికి పైబడిన నవలలను వ్రాసి, ఆ సుమమాలను ఆంధ్రభారతి గళమునందలంకరించి, కర్పూర నీరాజనముల నర్పించి, నేటికిని నిర్విరామముగా భాషాసేవ చేయుచున్న సాహిత్య రోచిష్ణువు.

శ్రీ విశ్వనాథ "జేబుదొంగలు" అతి వాస్తవిక పరిస్థితులను, పరిసర ప్రభావములను, విభిన్న మానసిక స్థితిగతులను తెలుపునట్టి ఉత్తమ నవల - ఇందలి కథను సంగ్రహముగా తెలుపుదును.

సోమశంకరము రిటైర్డు డిప్యూటి కలెక్టరు. "భవాని" ఆయన రెండవ సంబంధపు భార్య. అవధాని, వినుల, వారి సంతానము. సోమశంకరము మిక్కిలి లోభి. అప్పుడు ఆ ఇంటి నౌకరు - "అవధాని - అప్పుడు" బాల్యస్నేహితులు - జేబు దొంగలు.

"సోమశంకరము, గురుమూర్తి" చిరపరిచితులు, స్నేహితులు.

సోమశంకరము వద్దకు గురుమూర్తి వచ్చెను. అతని జేబులోనుండి అవధాని సహాయముతో, పోద్బలముతో అప్పుడు ఒక రూపాయి, ఏడు అణాలన్నర దొంగిలించెను. దానిని ఇద్దరును పంచుకొనిరి. గురుమూర్తి పోయిన డబ్బును లెక్కచూచుకొని అప్పుడిని గట్టిగా మందలించెను అవధానిని కూడ మందలించవలెనని తలచెను. కాని గొప్ప ఇంటి బిడ్డ గనుక తండ్రికి కోపము వచ్చునేమోయని భావించి ఊరకొనెను. అప్పుడు అవధానితో ఆ విషయమును చెప్పగా అతడు "నాన్నతో చెప్పనేమో?" అనెను. "చెప్పనన్నాడు" అని మరల; చెప్పితే మాత్రము "మీరు రూపాయి తీసుకొన్నారు - నేను చిల్లరే తీసికొన్నాను -" అనెను. "నామీద

గూడ చెపుతావా? చెపితే ఎవరు నమ్ముతారురా!" అన్నాడు ధీమాతో అవధాని. "ఎందుకు నమ్మరు - నేను తీశానంటే నమ్మటంలేదా!" అప్పుడు అమాయకముగా అనెను.

"పిచ్చివెధవా! నీవు తీశావనుకున్నారు - కాని నేను తీశాననుకున్నారా? అది భేదం -" ధీమాగా మరల అన్నాడు. ఇక్కడ ఆ ఇద్దరి మధ్యన ఉన్న అంతస్తుల భేదమును శ్రీవిశ్వనాథ ఎంతో చమత్కారముగా చిత్రించెను.

అవధాని, చెల్లెలు "విమల"కు జబ్బుచేసినది. తండ్రి స్వభావము తెలిసిన అతడు తన స్వంత సంపాదనలోనుండి డాక్టరు ఫీజు చెల్లించి ఆమె శరీరము నిమ్మళించునట్లు చేసెను. తండ్రి సంగతి తెలిసిన ఆమె "డబ్బు ఎక్కడినుండి తెచ్చితి" వని అన్నను ప్రశ్నించినది. "అప్పుడప్పుడూ వచ్చే చుట్టాల జేబుల్లోంచి, పెద్దమనుషుల జేబుల్లోంచి కాజేస్తూ వచ్చాను. నాదగ్గర పదిరూపాయలదాకా ఉన్నది." అని అవధాని చెప్పెను. ఆ సమాధానము విన్న విమలకు మిక్కిలి కోపము వచ్చినది. దొంగతనము చేయుట మానవలసినదని అన్నను ఆమె మందలించినది. ఆ సంఘటనతో చెల్లెలుపైన అతనికి గురి కుదిరినది.

సోమశంకరము మరణించెను. అతడు తన ఆస్తిలో కొంత భార్యకు, కొంత కుమార్తెకు విల్లు వ్రాసి, మిగిలిన ఆస్తిని కుమారునికి వ్రాసి, మైనరు తీరునంతవరకు గురు

మూర్తి, రామారావులు ఆ ఆస్తికి పెద్దలుగా వ్యవహరించ వలెనని వ్రాసెను.

గుహమూర్తి విమలకు మద్రాసులోని ఒక పత్రికా కార్యాలయములో పనిచేయుచున్న మోహనరావు అను వానితో వివాహము జరిపెను.

అవధాని పెద్దమేనమామ కూతురు సీత. లలిత, శారదలు చిన్న మేనమామ కుమార్తెలు. ఆ ముగ్గురు అవివాహితులు. సీతకు తండ్రి చనిపోవుట వలన పినతండ్రి వద్దనే పెరుగుచున్నది. లలితను అవధానికిచ్చి వివాహము చేయవలయునని మేనమామ భావించెను.

అవధాని, తండ్రి మరణానంతరము ఇంగ్లాండునకు వెళ్ళి ఐ. సి. యస్. పరీక్షకు చదివి, అందు ఉత్తీర్ణుడై భారతదేశమునకు తిరిగివచ్చి, తనకిష్టములేకున్నను పెళ్లిలి పోకానామముతో డబ్బును వితరణగా ఖర్చుచేసి తండ్రి సాంవత్సరీకములను యథావిధిగా పూర్తిచేసెను.

అవధాని తన ఆస్తిని ఆజ్మాయిషి చేయుచున్న గురుమూర్తిని, దొంగలెక్కలు వ్రాసితివని మందలించి, అతని ఆస్తి వైనములు తెలిసికొని తనపేరకు దానిని వ్రాయువలసిన దని కోరెను. ఈ సంఘటనతో గురుమూర్తి మనస్సునకు గొప్ప గాయము తగిలినది. అతని తండ్రి సోమశేఖరము తనపైన పెట్టిన భారమును గుర్తుంచుకొని "నాయనా ! సరె. వ్రాసిపంపింతు" నని చెప్పి, అట్లు చేసెను.

అవధాని కాకినాడలో సెషన్సు జడ్జిగా నియమితు
డైన సంగతిని విని అప్పుడు మిక్కిలి సంతోషించెను. తన
చిన్ననాటి స్నేహితుడు అంత పెద్ద ఉద్యోగముతో అచ్చటికి
వచ్చుట తన అదృష్టమని భావించి అతని వద్దకు రాకపోకలు
సాగించెను. శాల్య స్నేహితుడైనను అప్పని పంటి
తుంటరి, కొంటె, మర్యాదా విహీనుడు తనవద్దకు వచ్చుట,
తనతో మాట్లాడుట తన గౌరవ మర్యాదలకు భంగమని
అవధాని భావించెను. ఆ ఇద్దరి మధ్యన ఏడ్పడిన అంతస్తు
లను, పెంచుతగ్గులను, వారి వారి హృదయములలో చెల
రేగిన భావతరంగములను, మానవ సహజ మానసిక ప్రవృత్తు
లను శ్రీ విశ్వనాథ బహు దక్షతతో వివరించెను.

ఇది ఇట్లుండగా 'నళిని' అను అమ్మాయిని అప్పుడు
మానభంగము చేసినట్లు వచ్చిన అభియోగములో అవధాని
సభాముఖమున "శిక్ష" విధించి, ఇంటికి పోయి అప్పడికి తాను
శిక్ష విధించుట తప్పని గ్రహించి, మనసులో గుదుసుళ్ళు
తిరిగిపోయి ఆ రాత్రి జైలులో ఉన్న అప్పడిని కనిసిరొని
"ఈ శిక్ష ననుభవించునది నీవుకాదు - నేను. నాది మనస్సు-
నీది శరీరము. నాయందు నీకు పూర్వమున్న గౌరవమున్నచో
మాట్లాడకుండ ఈ శిక్ష ననుభవింపుము-" అని చెప్పి ఒక
వికారమైన నవ్వు నవ్వి, తిరిగి వెళ్ళిపోయెను. ఈ ఘట్టమున
శ్రీ విశ్వనాథ మానసిక స్థితిగతులను, పరిసర ప్రభావములను,
అవి మానవజీవితమునైన వేయు కొన్ని చెరగని ముద్రలను,

సహాజముగా నుండునట్లు చిత్రించి కథను చక్కగా నడిపెను.

లలితా శారదలు, తన మనః ప్రవృత్తికి తగిన భార్యలు కారని అవధాని గ్రహించెను. అప్పుడు శారద, సీత తమ కింటపడుచున్న బాధలను తెలిపి, ఆమె అతనికి తగిన భార్య అని వివరించి, ఆమెను వివాహమాడవలసినదని ప్రోత్సహించినది. ఆ ప్రోత్సాహముతో వివాహమునకు పూర్వమే ఆమెతో సంబంధమును పెట్టుకొనగా ఆమె గర్భవతియైనది. అచ్చట ఆమె పరిస్థితి తల్లకిందులుకాగా, చెల్లెలు విమల వద్దకు సీతను, శారదను పంపించెను. అచ్చట సీత మగపిల్లవానిని కనినది. అతనికి "గురుమూర్తి" యని పేరుపెట్టిరి.

అవధాని "నెల్లి" యను ఆంగ్ల వనితను లండనులో నుండగా వివాహమాడెను. ఆమె బొంబాయి చేరుకొని అతనివద్దకు వత్తునని ఉత్తరము వ్రాయగా, గురుమూర్తిని, రామారావును పిలిపించి "ఆమె కోరినంత డబ్బు ఇచ్చి, ఆమె నీడ తన జీవితముపై పడకుండ చేయవలసిన" దని కోరెను. వారు చాకచక్యముతో అతని కోరికను నెరవేర్చిరి.

అవధాని తన అభివృద్ధికి కారణభూతుడైన గురుమూర్తికి, అతని ఆస్తినంతటిని తిరిగి ఇచ్చుటయేగాక, అతనికి దత్తు చేసి, ఆ వంశమును నిలబెట్టి, అతనికి తన కృతజ్ఞతను వెల్లడించుకొనెను. అతని హృదయములో గొప్ప పరివర్తన కలిగినది. చక్రవర్తులమై తండ్రి రక్తపు చారి తీయకపోవుట కన్న, జేబుదొంగలమై తండ్రి రక్తపుదారి తీయుట శ్రేష్ఠము-

జేబుదొంగయో, భానిసయో, మహారాజో యెవ్వఁడైనను వాని జాతి చావరాదు - ఏవర్ణమున నేజాతిలో నేజంతువున నే గుణమున్నదో మానపున కేమి తెలియఁను. భగవంతుడే యెఱుగును.

ఈ నవలలోని "గురుమూర్తి" మహోదార హృదయుడు - "చంపతగిన శత్రువును సైతము కనికరించ" గల మహా పురుషుడు.

అవధాని, అప్పడు, గురుమూర్తి, రామారావు, విమల వంటి సహజ సుందరమైన పాత్రలను కల్పించి, జేబు దొంగలవంటి ఉత్తమ మనోవైజ్ఞానిక నవలను వ్రాసిన శ్రీ విశ్వనాథ నవలలోని ముఖ్య నాయికయైన సీతను, అవధాని తల్లియైన భవానిఁ అయిన మలచిన తీరు అంత సమంజసముగా లేదు. చూడుడు —

సీతకును అవధానికిని వివాహపూర్వమే లైంగిక సంబంధమును కల్పించి, కుమారుడు జన్మించినట్లు చూపును- ఇట్టి సంఘటనలు లోకములో ఈనాడు కోకొల్లలుగా జరుగుచున్నవి-నిజముగా ఇది సాంఘిక ధర్మమునకు వర్ణాశ్రమ ధర్మమునకు, వివాహ ధర్మమునకు, కర్మసిద్ధాంతమునకు వ్యతిరేకమైన విషయము - అయినను శ్రీ విశ్వనాథ శారదచేత "సీతసానలు తీరిన జాతి రత్నము ... భారతదేశ మత సాంఘికాభిప్రాయములు జీర్ణించిన, స్త్రీమాత్రమే భారతదేశ స్త్రీ-వారిలో సీత తలమానికము" అనిపించును (294 వ. పేజీ). అటులనే

అవధానిచేత "సీతయా సీత! ఆమె సనాతని. ఈ దేశము లోని ఆత్మ. ఆమెకు పుట్టుక లేదు. చావు లేదు, ఆమె యెవనిచెంత చేరునో యాతడు నిత్యజీవి. వానికి నాలుగు పురుషార్థములు గలవు (196 వ. పేజీ). మరల అతని చేతనే "సీతా! నీవు పారిజాత పుష్పమవు" అనిపించును (278 పేజీ). ఇట్లు పెక్కు పర్యాయములు శారదచేతనో, అవధానిచేతనో, లేక తనకు తానై శ్రీ విశ్వనాథయే వ్యాఖ్యానించును.

సీతను ఇట్లు ఆకాశమున కెత్తిచూపినచో దోషము పోవునా? శ్రీ విశ్వనాథ అయిన నిలబెట్టదలచిన సనాతన సంప్రదాయము ఆర్ష ధర్మము నిలబడునా? వివాహోత్పూర్వము వ్యభిచరించుట తప్పు కాకపోవునా?

శ్రీ విశ్వనాథయే మరల అవధానిచేత చెల్లెలు విమలతో "తాను చేసిన దోషములు రెండనియు, ఒకటి ఇంగ్లాండులో నుండగా నల్లిని పేర్మించుట; రెండవది సీతతో పెండ్లి కాకుండగనే శారీరక సుఖము ననుభవించుట" అను విషయములను వల్లెవేయించును (347 పేజీ). అంతటితో చేసిన దోషములు పోవునా? అది చేసిన తప్పుకు పశ్చాత్తాపమగునే గాని, పాపపరిహారము కాదుగదా?

శ్రీ విశ్వనాథ నిజముగా సీత పాత్రలో తన మనో గత విషయములను తనకు తానై చెప్పినేగాని, అంతకుమించి చేసినది లేదు. అతకని విషయమును అతికించుటకు విఫల ప్రయత్నము చేసెను. అది సహజమైన ఇంతటి ఉత్తమ

నవల అభూత కల్పనయై కుతూహలముగా మారినది. సీత పాత్రను చిత్రించునప్పుడు రామాయణమునందలి సీ త గుర్తుకు వచ్చినదేమో!

అవధాని తల్లి "భవాని". అధునాతన నాగరికతగల ఇంటిలో జన్మించి, కొంత స్వతంత్ర భావములను గనబరచి నది. భర్త మరణముతో ఎట్టి విషమ సంఘటనలు సంభ వించకుండగనే, నిర్లిప్తురాలై, యోగినిగా మారిపోయినది. ఈ మార్పునకు తగిన కారణము చూపించినచో మిక్కిలి సహజముగా నుండెడిది. అవధాని పైన చెల్లెలు విమల ప్రభావము ఈ నవలలో అధికముగా మనకు గనుపించును.

"పునర్జన్మ" సీలకంఠశాస్త్రి అను వృద్ధపూర్తి దాటిన వ్యక్తి జీవితమును, అతని వింత ప్రణయమును తెలుపునట్టి నవల. శాస్త్రి తన మొదటి భార్య మరణించగా మిత్రుల బలవంతముపైన ద్వితీయ వివాహమాడెను. ఆమె గయ్యాళి గంప. శారీరక, మానసిక సుఖములను రెండింటిని ఆమె నుండి పొందలేక, జీవితము ఒక నరకమైపోగా, అతడు అ స్తి నంతటిని రెండవ భార్యకు, బావమరదికి వదలిపెట్టి, తాను పోలుపోయిన జీవిత సుఖమును పొందుటకు, ప్రశాంత వాతా వరణములో జీవించుటకు హైదరాబాదులో నున్న త న మేనల్లుడు "మనోహరము" అనువాని వద్దకు వెళ్ళి రోజులు వెళ్ళబుచ్చుచుండెను.

ఒకనాడు సిటీబస్సులో వెళ్లుచుండగా, అదే బస్సులో

ప్రయాణముచేయుచున్న ఇరువది సంవత్సరముల ఈడుగల ఒక కాలేజి విద్యార్థిని కనుపించినది. ఆమెను చూడగనే తన ప్రథమ భార్య జానకమ్మ గుర్తుకు వచ్చినది. మరల ఆమెను చూచెను. మున్మూర్తుల ఈమె ఆమెను పోలియే యుండెను. ఆమె తన "మొదటి భార్య" అనియే నిర్ధారణ చేసికొనెను. పునర్జన్మమెత్తి మరల తనకొరకే ఈ లోక మున అవతరించినట్లు అయనకు తోచినది.

శాస్త్రి ఆ అమ్మాయి వెంటబడి, వారి ఇంటికిపోయి ఆమెకు సంభవించిన చిక్కుల నన్నింటిని పరిష్కరించి ఆమెను మరల వివాహము చేసికొని జీవితయాత్ర సాగించుచుండగా రెండవ భార్య మరణించినది. కొంతకాలమునకు మూడవ భార్యయు మరణించినది. ఆ దుస్సంఘటనతో అతని హృదయము మారిపోయినది. సంసార లంపటమును వదలించు కొని విరాగియై అతడు ఇంటినుండి వెళ్ళిపోవుటతో కథ ముగిసినది.

శాస్త్రితో జానకి కాను పునర్జన్మ నెత్తుటకుగల కారణములను చెప్పుచు, "ఈ జీవునికి వున్న లోకపు వాసనలు వదలక పోవడ" మను సంగతివల్ల విశదమగును.

ఈ నవలలో నీలకంఠశాస్త్రి మనస్సులో నుండి శ్రీ విశ్వనాథ కాని తొంగిచూచును. శ్రీ విశ్వనాథ కాను సృష్టించిన పాత్రలపైన అధికారముచేసి, వానిని తన ఇష్టా నిష్టములకు, తన అభిరుచులకు అనుగుణముగా త్రిప్పును. ఈ

నవలయందలి శృంగారము అసహజముగానున్నది. షష్టి పూర్తి చేసికొనిన నీలకంఠశాస్త్రియైన జానకి వంటి విద్యావతి, సౌందర్యవతి, తక్కువ వయస్సులో నున్నది అంతటి ప్రేమను గనబరచగలదా? పునర్జన్మ సిద్ధాంతమును నమ్మినచో ఇదంతయు సంభవమే. లేనిచో ఇది ఒక స్వప్నము-మధురాతి మధుర స్వప్నము.

"మోహయుతమొగ్గద" హిందూస్తాని గాయకుడైన ఒకానొక వ్యక్తి జీవితపు లోతులను తరచి చూపునట్టి మధుర ప్రవంతి. దీనిలో శ్రీ విద్యారహస్యములు పెక్కు నిబంధింప బడినవి.

"పద్మప్రభ దివ్య" "దమయంతీ స్వయంవరము" అను రెండు నవలలు నేటి ఆర్థిక, రాజకీయ పరిస్థితులను, దేశకాల పరిస్థితులను, స్థితిగతులను వివరించునట్టివి.

"అలు నదులు" అను నవల, ఉపన్యాసధోరణిలో నడచిన ఉత్తమ రచన. "పంతజలి" అను వ్యక్తి ప్రపంచ నాగరికతకు, భారతీయ నాగరికత మూలభూతమని ఇందు వివరించెను. ఇది చక్కని వ్యవహారిక భాషలో నడచినది.

పురాణ వైర గ్రంథమాల పద్ధతిన, భారతీయ చరిత్రను, నాగరికతను ప్రతిబింబింపజేయుచు కొన్ని నవలలను; కాశ్మీర, నేపాల దేశములకు సంబంధించిన చరిత్రలను వివరించుచు మరికొన్ని నవలలను ఈ మధ్యన శ్రీ విశ్వనాథ ప్రకటించెను. ఇవి ఆయన పురాణజ్ఞతకు, సాంస్కృతిక,

చారిత్రక పరిశోధనా పాటవమునకు నిదర్శనములు.

ఇంతటి ఉన్నతమైన సాహిత్యవేత్తుడైన శ్రీ విశ్వనాథ పండించిన హేమరాసిలో కొన్ని అభూత కల్పనలు, అసంబంధమైన వర్ణనలు, రచయిత తనకు కాస్తై నవలలో పాత్రల మధ్య కనుపించుటవంటి కొన్ని చిన్న లోపములు అచ్చటచ్చట కనుపించినను, నిస్సంశయముగా అయన తెలుఁగు నవలా సాహిత్య వికాస చరిత్రలో "తలమానిక"మని అంగీకరింపక తప్పదు.

శ్రీ ఏ. డి. ప్రసాదరావు మానవ మనస్తత్వము ప్రధానముచేసి "నాకబలి" నవలను రచియించెను (1950). రాఘవరావు అను నతడు ఉన్నత విద్యకొరకు కాశీకి వెళ్ళి తనకన్న వయసులో పెద్ద, వివాహితయైన "ప్రభావతి" అను స్త్రీని ప్రేమించెను. ఆ ఇరువురి ప్రేమ శిఖరాగ్రము నందుకొనిసది. రాఘవరావు మనస్సును ఆమె సంపూర్ణముగా వశపరచుకొని, అకస్మికముగా అతనినుండి దూరమైన చంచల ఆమె – ఇది అసలు కథ.

ప్రభావతి ఆనందముకొరకు యెంతటి త్యాగమునకైనను వెనుదీయని ఆదర్శ ప్రేమికురాలు రాఘవరావు. ప్రభావతి స్వార్థపరురాలు. చంచల హృదయ. ఆ ఇరువురి భిన్న మనస్తత్వములను సహజముగా చిత్రించి, రచయిత కృతకృత్యుడయ్యెను.

ప్రసాదరావు చక్కని వాతావరణమును సృష్టించుట

లోను, సంఘటనలు కల్పించుటలోను, విషయమును విడ
మరచి చెప్పుటలోను ఈ నవలలో మంచి నేర్పును గనబరచి,
చేవగల భాషను వ్రాసెను. పఠితలకు మంచి స్ఫూర్తిని,
మేధస్సుకు చక్కని ఆలోచనను అందించగల నవల ఇది.

స్వాతంత్ర్యోద్యమ కాలముననేగాక, నేటి నవభారత నిర్మాణ పథమునను మిక్కిలి ప్రధానమైనది హరిజన సమస్య. దీని ప్రాముఖ్యతను గుర్తించిన తెలుఁగు రచయితలు అసంఖ్యాకమైన రచనలు చేసిరి. ఈ సమస్యకు అధిక్షేప నిచ్చి "ఆదర్శం" అను నవలను శ్రీ అంతటి నరసింహం వ్రాసెను. ఇది చక్కని వ్యావహారిక భాషలో నడచినది. ఈ నవలలో ఒక హరిజన కుటుంబము, ఒక రెడ్డి కుంటుంబము, రెండు బ్రాహ్మణ కుటుంబములు, వానికి సంబంధించిన గ్రామీణ సాంఘిక జీవిత సమ్మేళనము, అది అసలు సమస్యను పరిష్కరించుటకు తోడ్పడిన విధము వర్ణింపబడినది. కేశవరావు, నారాయణరావు అను యువ ఆదర్శ ఉపాధ్యాయులిరువురు ఈ జటిల సమస్యను పరిష్కరించుటకు ప్రప్రథమమున విద్యార్థులను, అపిమ్మట పెద్దలను మార్చి హరిజన వితంతు, వర్ణాంతర వివాహములను దిగ్విజయముగా జరుగునట్లు కృషిచేసిరి. శ్రీ నరసింహం ఈ నవలలో కేవలము వివాహ వ్యవస్థకు ప్రాధాన్యతనిచ్చి, రచన చేసినేగాని, వారి ఆర్థిక, సామాజిక పరిస్థితులను అభివృద్ధిపరచుటకు తగిన సూచనల నిచ్చియుండి నచో నవలకు మరికొంత పటుత్వము చేకూరియుండెడిది.

స్వాతంత్ర్యము లభించిన పిమ్మట వెలువడిన ప్రఖ్యాత నవలలో ప్రప్రథమముగా పేర్కొనదగినది. డాక్టర్. శ్రీ బి. వి. కృష్ణారావు "కీలుబొమ్మలు" నవల.

"పుల్లయ్య" అను ఒక గ్రామ మోతుబరి రైతు, అదే గ్రామస్తుడైన "చంద్రశేఖరము" అను ఒక ఆదర్శ సామ్యవాది, కాగితముల మిల్లు యజమానికి ఐదు వేల రూపాయలకు మారువాడికే అడ్డముగా వుండి ఆడిన "అబద్ధము" వలన ఆ గ్రామ జీవితములో ఏర్పడిన అనర్థములను, సంభవించిన కల్లోలములను, రాజకీయ కతలను, పగలను, తెగలను ఈ నవలలో శ్రీ కృష్ణారావు విశ్లేషించి చెప్పెను.

మిల్లులో పనిచేయు కార్మికులు ఎదుర తిరుగుటతో ఆదర్శవాది, కామ్యూనిష్టు అయిన "చంద్రశేఖరము" పరిస్థితి తల్లకిందై మిల్లుకు కాళముపడినది.

పుల్లయ్య కాను అంత పెద్ద మొత్తమునకు చంద్రశేఖరమునకు అడ్డము వున్నట్లు భార్య లక్ష్మమ్మకుగాని, తది తరులకుగాని తెలియజేయలేదు. ఈ విషయము ఆ నోట ఆనోట పడి కూతురు "సీత" ద్వారా భార్యకు తెలిసినది. భర్త మౌనమును చూచిన లక్ష్మమ్మ, తన భర్త ఆ డబ్బుకు అడ్డమే ఉండనట్లు భావించి, అమాయకుడైన తన భర్తను "శేఖరమే" భోర్జరీచేసి తప్పుడు పత్రములను సృష్టించినట్లు తన అన్న కొడుకు "శేషగిరి" అను స్నేహితుతో అతనికి నోటీసు ఇప్పించినది. దీనితో కథ తారాస్థాయికి పోయినది.

పుల్లయ్య పొరపాటున ఆడిన ఒక్క అబద్ధమును నిల బెట్టుకొనుటకు చేసిన విఫల ప్రయత్నములు ఇందులో కన బడును. నిజస్థితిని భార్యకు ముందే తెలిపియున్నచో ఇట్టి పరిస్థితి సంభవించియుండెడిది కాదు. ఆత్మాభిమానము సంపూర్ణముగా గల అతడు మనస్సులోనే మధనపడిపోయి "కింకర్తవ్యతా" మూఢుడై వ్యవహరించదొడగెను. ఆయన వ్యవహారము గుమస్తా సత్యనారాయణకు నచ్చలేదు. తన యజమాని ఈ విధముగా యెందుకు వ్యవహరించుచున్నాడో తోచక, ఆయనకు నచ్చచెప్పలేక అతడు మతిచెడిపోయి తిరుగుచుండెను.

పుల్లయ్య భార్య లక్ష్మమ్మ ఇచ్చిన నోటీసు చంద్ర శేఖరమునకు అందినది. అన్నిటిని పోగొట్టుకొనిన అతడు పగటిపూట గ్రామములోనికి గూడ వచ్చుట మానివేసెను. అనాడు తనకు అడ్డమువున్న పుల్లయ్య ఈవిధముగా యెందుకు మారెనో తోచక, తాను కార్మికపక్షము నవలంభించినవాడు గనుక, ధనికవర్గమునకు చెందిన పుల్లయ్య, తనపైన కత్తిగట్టి పగతీర్చుకొనుచున్నట్లు అతడు భావించెను.

"రామారావు" పుల్లయ్య కొడుకు. ఉన్నత విద్యా వంతుడు. అతడు తండ్రిని, చంద్రశేఖరము విషయములో పట్టుపట్టవలదని కోరెను. అప్పుడు కుమారుని మందలించెను.

చంద్రశేఖరము, పుల్లయ్య గుమాస్తా సత్యనారాయణను తనకు సహాయము చేయవలసినదని అర్థించెను. యజమాని

తప్పుడు మార్గములో నున్నట్లు సత్యనారాయణకు తెలిసినను, శత్రుపక్షమున చేరుటకు అంగీకరించక, తన యుజమాని పక్షమునసే యుండి పనిచేసెను. అతని ఇల్లు తగులబడిపోయినది. శాస్త్రి ఇంటిలో తలదాచుకొనదొడగెను.

పుల్లయ్యకు పరికట్టియైన మల్లయ్య పెద్ద గడ్డివామి, హరిజనాశ్రమము అన్నియు పరశురామపీఠి యైపోయినవి. అవకాశవాది, స్వార్థపరురాలు అయిన అమ్మాయమ్మ ఈ పంచు విద్రోహచర్యలన్నియు 'కమ్యూనిస్టులు' చేయుచున్నట్లు పత్రికలకు వ్రాసి అబద్ధ ప్రచారము చేసినది. ఇది చూచి డాక్టరు శాస్త్రి విస్తుపోయి, ఎట్టెటెనను పుల్లయ్యకు, చంద్రశేఖరమునకు రాజి చేసి, గ్రామములో కలరేగిన ఈ సంక్షోభమును తుదముట్టించుటకు విశ్వప్రయత్నము చేసెను.

కేసు విచారణ జరుపుటకు ఒకరోజు ముందు రామారావు స్వగ్రామమునకువచ్చి తల్లికి, తండ్రికి నచ్చజెప్పుటకు గట్టి ప్రయత్నముచేసి, ఫలితము శూన్యముకాగా, తండ్రికి వ్యతిరేకముగా కోర్టులో సాక్ష్యమునిచ్చుటకు నిశ్చయించెను. ముల్లయ్య, అమ్మాయమ్మ ఇద్దరు పుల్లయ్యను మానసికముగా హింసింపనెంచి, రామారావును కమ్యూనిష్టని పోలీసులకు నచ్చజెప్పి అరెస్టుచేయించిరి. అఖండురాలైన అమ్మాయమ్మ అంతటితో ఆగక, పుల్లయ్య దగ్గరికిపోయి "నీ కుమారుడు క్రిమినల్ కేసులో అరెస్టు అయినాడని చెప్పి, ఆయనను రాజకీయ డిటెన్యూగా మార్పించుటకు నని తెలిపి," ఐదు వందల రూపాయలు తీసుకొనినది.

రామారావు తన వదినగారైన రంగమ్మ ద్వారా, తన తండ్రి స్వయముగా తనను పోలీసులకు పట్టించుటకు పన్నిన కుట్రను తెలిసికొని తానే స్వయముగా పోలీసులకు పటుబడెను.

చంద్రశేఖరము ఆర్థిక స్థితి క్రమముగా తగ్గిపోయినది. అతని మామ అతని వలన తలపన్నలేనుటకు గురియయ్యెను. అయినను అతడు నిత్యము కార్మికులను ఉత్సాహపరచుచు, వారికి తోడ్పడుచునే యుండెను. ఒక నాడు కార్మికులు పెద్ద ఊరేగింపుగా వెళ్ళుచుండిరి. పుల్లయ్య తోడుదూడ అకోలాహలమునకు బెదిరి పోబయ్య కొమ్ముకు డొక్కలో పొడిచినది. ఆ పిల్లవాడికి పేగులు బయటకు వచ్చినవి. గోపోద్రిక్తుడైన పోలయ్య ఆ గిత్తను కొట్టగా అది మరణించినది. పుల్లయ్య దీనితో రెచ్చిపోయెను. గ్రామములో ఉద్రిక్తత ఏర్పడినది. మలబారు పోలీసులు గ్రామములో ప్రవేశించి ప్రజలను బాధించిరి. ఈ దుస్సంఘటనకు శాస్త్రి నిరసన తెలిపెను. పోలీసులు అయ్యనను కొట్టబోగా పోలయ్య అడ్డుపడి రక్షించెను. అతనిని వారు చిత్రవధ చేసిరి. డాక్టరు శాస్త్రి తన పలుకుబడి నంతటిని ఉపయోగించి మలబార్ పోలీసులను ఆ గ్రామము నుండి తిప్పి పంపునట్లు చేసెను.

ఫోర్జరీ కేసులో చంద్రశేఖరమునకు మూడు సంవత్సరముల శిక్షను న్యాయస్థానము విధించినది. పుల్లయ్య కు

కోర్టులో లభించిన ఈ ఘనవిజయమునకు ఆ గ్రామమంతయు ఉత్సాహముతో పొంగిపోయినది. దూరదృష్టిగల అమ్మాయమ్మ మల్లయ్యతో కలసి, పుల్లయ్యకు భూరి సన్మానము చేయించి "సర్దార్" బిరుదము నిప్పించినది.

సన్మానానంతరము పుల్లయ్య ఇంటికి వచ్చినప్పుడు లక్ష్మమ్మ భర్తతో "ధర్మమే జయిస్తుంది. ఇది లోకానికి ఆదర్శప్రాయం-" అటుంది. "నిజమే సత్యం ధర్మం కాక పోతే మరేమి జయిస్తుంది." అంటాడు పుల్లయ్య, యథాలాపముగా. మతి తప్పిపోయిన గుమస్తా సత్యనారాయణ అదే సమయములో "యదాయదాహి ధర్మశ్చ..." అను గీతాశ్లోకమును మధుర కంఠముతో పాడదొడగెను. ఇది వ్యంగ పూర్వకమైన ఎత్తిపొడుపు.

డాక్టరు శాస్త్రికి - సత్యనారాయణ భార్య పద్మకు ఒక దుష్ట ముహూర్తమున శారీరక సంబంధమేర్పడినది. ఆమె గర్భవతియైనది. ఆమె కోరిక ననుసరించి తన వృత్తి ధర్మమునకు వ్యతిరేకముగా ఆమె గర్భ విచ్ఛిత్తికి తోడ్పడి, ఇక అక్కడ వుండలేక ఆ గ్రామమును విడిచిపెట్టి పట్నము నకు వెళ్ళిపోయెను.

పుల్లయ్యకు "సర్దార్" బిరుదప్రదానము జరుగుచున్న సమయమునకే డాక్టర్. శాస్త్రి, రామారావుతో కలసి ఆ ఊరుకు వచ్చి ఆ సభలోనే "కారణాంతరముల వలన తాను ఆ గ్రామమును విడిచిపెట్టిపోవలసి వచ్చిన"దని తెలిపి, తన

ఇంటిని పోలయ్య కుటుంబమునకు దానముచేసితినని ప్రకటిం చెను. పుల్లయ్య అది జరిగిన ఒక గంటలోనే ఆ ఇంటిని తనపేర వ్రాయించుకొని, పోలయ్య కుటుంబమునకు ఐదువేల రూపాయలు ఇచ్చివేసెను.

వర్గ, మత, వర్ణద్వేషములకు, సంకుచిత భావములకు అటపట్టైన పల్లెపట్టులపైన రామారావుకు, డాక్టరు శాస్త్రికి మనస్సు విరిగిపోయినది, ఆ ఇరువురు ఆ రాత్రికి రాత్రే తమ గ్రామమును విడిచి పట్నమునకు వెళ్ళిరి.

ఈ నవల కమ్యూనిజమునకు, ధనికవర్గమునకు గల అంతరములను, ఆ రెండు వర్గముల మధ్యగల మౌలిక సంబంధమైన వ్యత్యాసములను, సంఘర్షణలను వ్యక్తీకరించును.

ఈ నవలయందలి పాత్రలు మిక్కిలి విచిత్రమైనవి. చూడుడు – పుల్లయ్య, చంద్రశేఖరము చేసిన పనికి ఒక వంక బాధననుభవించుచు, వేరొకవంక తమ పనులను సమర్థించుకొనుటకు ప్రయత్నించి ఆత్మవంచనకు పాల్పడిన విభిన్న దృక్పథముగల వ్యక్తులు.

పుల్లయ్యకొడుకు రామారావు; మల్లయ్య కొడుకు గంగాధరము, యువతరమునకు, మారుచున్న పరిస్థితులకు ప్రతినిధులు–దుర్మార్గమును, కాలుష్యమును సంఘమునుండి పారదోలి మంచిని స్థాపించుటకు ప్రయత్నించిన ఆశాజీవులు.

అమ్మాయమ్మ, మల్లయ్యలు అవకాశవాదులు-స్వార్థ పరులు. పోలయ్య - మంచికి మారుపేరు. ఇతరులకొరకు బలియైపోయిన నిస్వార్థపరుడు. లచ్మమ్మ గయ్యాళి. పట్టిన పట్టు విడువని మూర్ఖురాలు. డాక్టరు శాస్త్రి గాంధేయ పథగామి. జైలు శిక్ష ననుభవించిన దేశభక్తుడు. అన్యాయములను, అక్రమములను సహించలేని వ్యక్తి. పల్లెపట్టులను స్వర్గధామములుగా మార్చనెంచి, ఎదురు దెబ్బలతో విసిగి పట్టణమునకు చేరిన ఆశోపహతుడు.

గ్రామీణ పరిసర విభిన్న మనస్తత్వములను ఆచ్చటి యథార్థ పరిస్థితులను అతి వాస్తవ దృక్పథముతో శ్రీకృష్ణా రావు ఈ నవలలో చూపెను. నవల ప్రారంభించినప్పటి నుండి ముగియునంతవకు ఏక బిగితో పాఠకులను చదివించి, గొప్ప జిజ్ఞాసను రేకెత్తించి, విజ్ఞాన వినోదములను అందించు నట్టి ఆణిముత్యము "కీలుబొమ్మలు". ఇది ప్రప్రథమమున స్వతంత్ర వారపత్రికలో వెలువడి, 1951 లో పుస్తకరూప మున వచ్చినది. గ్రామీణ జీవితమును చిత్రించుటలో మాలపల్లికి ఇది శేష గ్రంథమని కొందరు పరిశీలకుల భావన.

శ్రీ కృష్ణారావు "కీలుబొమ్మ" లకు వ్రాసిన ప్రస్తావ నలో "బోజర్" అను పాశ్చాత్య రచయిత వ్రాసిన "ది పవర్ ఆఫ్ ఎత్తై" అన్న రచన చేసిన సూచన ననుస రించి వ్రాసినట్లు తెలిపెను. "తన రచన అంతటికి మూలము అరచనే-" అంటాడు. ఇది అనుసరణ, అనువాదము కాదు.

స్వతంత్ర రచన. పైన చెప్పిన ఆయన మాటలు యథార్థమైనవి. నిజాయితీతో కూడినవి.

✦ "రాగ రేఖలు" శ్రీ కృష్ణారావు మరొక నవల. ఇది ఆంధ్రజ్యోతి దిన పత్రికలో ధారా వాహికముగా వెలువడి. (1962)లో గ్రంథ రూపమున వచ్చినది - బౌద్ధ యుగమున శకులకు, యవనులకు, ఆంధ్రులకు మధ్యనగల కక్షలు, వైషమ్యములు అధికముగా ఉన్న రోజులలో ఈ కథ జరిగినట్లు వివరించినను, ఆనాటి వాతావరణము, సంప్రదాయము, నాగరికతా వైభవములు దీనిలో అంతగా కనుపించుట లేదు. ఈ నవల శ్రీ కృష్ణారావునకు గల ప్రతిభను వ్యక్తీకరించుట లేదు. కాలక్షేపమునకు చదవతగినది.

"గుణవర్ధను" డను శక జాతి గాయకునికి, జన్మ రహస్యము అతి గూఢముగా నిక్షిప్త పరుపబడిన "చిత్ర" అను పేరుగల అదే జాతి అమ్మాయికి మధ్య నడచిన ప్రేమను సఫల మగునట్లు చేయుటలో తన తల్లి శాంతా దేవికి నచ్చకపోయినను, ఆమెకు వ్యతిరేకముగా సుస్వభావ సంపన్నుడైన "ధర్మకీర్తి" తన శుభాశీస్సులతో జరిపిన వివాహ గాథయే ఈ నవల.

"పాపికొండలు" శ్రీకృష్ణారావు వ్రాసిన మరొక మంచి చదువతగిన నవల.

శ్రీయుతులు విశ్వనాథ, గోపీచందు, కటుంబరావుల తరె శ్రీ కృష్ణారావును విశుద్ధము, విలక్షణమునైన తెలుగు

నవలలు వ్రాసి తనరచనల ప్రభావము అనంతర రచయితల పైన పడునట్లు చేసిన ప్రతిభావంతుడు.

శ్రీ ఉప్పల లక్ష్మణరావు వ్రాసిన "అతడు-ఆమె" దిన చర్యల రూపమున (Diaries) నున్న ప్రశస్తమైన నవల. ఇది రెండు భాగములు. 1950 సంలో ప్రథమ భాగము ప్రచురితమైనది. ఆ పిమ్మట ద్వితీయ భాగము "అభ్యుదయ" పత్రికలో ధారావాహికముగా వెలువడి 1964 వ సంలో ఆ రెండును ఒకే పుస్తక రూపమున ప్రచురింపబడినవి.

1930-1942 సంవత్సరముల మధ్య కాలమును అనగా ఉప్ప సత్యాగ్రహము నుండి - బొంబాయిలో జరిగిన భారత స్వాతంత్ర్యోద్యమ చరిత్రలో చివర ఘట్టమైన "క్విట్ ఇండియా" ఉద్యమము వరకుగల కాలమును పృష్ఠ భాగము చేసి శ్రీ లక్ష్మణరావు ఈ నవలను మలచెను.

ద్వితీయ ప్రపంచ సంగ్రామ కాలమున ఐరోపా, ఆసియా ఖండములలో చెలరేగిన వివిధ పరిస్థితులను, ఆనాటి రాజకీయ వాతావరణమును, ప్రజల మనోభావములను, నాయకుల చిత్తవృత్తులను, సుభాస్‌బోసు అంతర్ధాన గాధను, ఆజాద్‌హింద్‌ఫౌజు భారతదేశ దాస్య విమోచనకై చేసిన మహత్తర కృషిని రచయిత ఇందు వివరముగా చర్చించెను.

అతడు (పల్లవజోస్యుల చిదంబరశాస్త్రి). లండనులో

బారిష్టరు చదివి చెన్నపట్టణములో ప్రాక్టీసు చేయుచున్న వ్యక్తి. ఆమె (శాంతమ్మ) ఎం. ఏ; చదివి క్వీన్స కాలేజీలో ఉపన్యాసకురాలుగా పనిచేయుచున్న విదుషీమణి. ఆ ఇరువురు ఒకరినొకరు ప్రేమించుకొని వివాహమాడిన వ్యక్తులు. శాస్త్రి జమీందారుల కేసులనుపట్టి తన అసాధారణ మేధాశక్తితో ఘన విజయమును, పుష్కలముగా ధనమును సంపాదించి మద్రాసులో "లీడింగు" లాయరై గణుతి కెక్కిన ప్రముఖుడు.

మహాత్ముడు నడుపుచున్న స్వాతంత్ర్యోద్యమముపై శాంతకు అసక్తి కలిగినది. ఆమె కాను నిత్యము ధరించుచున్న విలువైన విదేశ వస్త్రములను తగులబెట్టి, మోటు ఖద్దరు దుస్తులను ధరించి, ఉప్పు సత్యాగ్రహోద్యమములో ఒక సామాన్య కార్యకర్తయై పాలుగొని, లాఠీ దెబ్బలు తిని అస్పత్రిలోచేరి యమయాతనలు అనుభవించినది. శాస్త్రికి ఆమె ఉద్యమములోచేరి పని చేయుట గిట్టలేదు – తాను అడ్వకేటుజనరల్ కావలెనని, వైస్రాయ్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిలులో మెంబరు కావలెనని ఉవ్విళ్లూరుచుండెను. తన భార్య మహాత్ముని శిష్యురాలై, ప్రభుత్వ వ్యతిరేక కార్యకలాపములలో పనిచేయుచున్నయెడల తన ప్రతిష్ఠ దెబ్బతిని, భవిష్యత్తు నాశనమగునని తలచి ఆ మార్గమునుండి ఆమెను తప్పించుటకు, తన మేధాశక్తి నంతటిని వినియోగించి, అది సాధ్యము కానందున, పరిస్థితులను తన అభివృద్ధికి అనుకూల

ముగా మార్చుకొననెంచి, రాజాటికి కుడిభుజమై ఆయన రాజకీయ మార్గమున వ్యవహరించుచు, తన భవిష్యత్తును తీర్చి దిద్దుకొనుటకు ప్రయత్నించెను. కాంగ్రెస్ నాయకులు స్వార్థ చింతన లేని శాంతను తమ పార్టీ పక్షమున ఎన్నిక లలో పోటీ చేయుటకు అభ్యర్థిగా నిర్ణయించిరి. శాస్త్రి తాను ఎన్నికలలో పోటీ చేయుదునని, తన అభ్యర్థిత్వమును, పెద్దలు బలపరచునట్లు చూడవలసినదని "శాంతను" కోరెను. దీనికితోడు అతడు రైతులకు వ్యతిరేకమైన కేసులలో జమీందారుల పక్షమున వ్యవహరించి గొప్ప ధనమును సంపాదించుటయు ఆమె మనస్సునకు తీరని ఆరాటమును కలిగించినది. ఈ రెండును ఆమె మనస్సులో చేయిపెట్టి కల బెట్టినట్లు చేయగా పెంపుడు కుమార్తె "సుభ"ను, స్వంత కూతురు పాపాయిని వెంటతీసుకొని భర్తను, సంబోధించి "... సర్కసులో హాస్యగాడు పరుగెడుతున్న గుర్రం మీద నిలబడి నిమిషానికో దుస్తులు మారుస్తుంటాడు. నీ ప్రవర్తన ఆలాగే వుంది. ఎందుకీ మొగ్గలు పట్టలునూ?... నీ ఔన్నత్యం ఏమిటో - అందుకు నువ్వు చేసే సాధనాలు ఏమిటో... బాగా ఆలోచించుకో..." అని చివాట్లు పెట్టి, లేఖ వ్రాసి దేశాటనకు వెళ్ళినది-

భార్య వెళ్ళిపోయిన పిమ్మట శాస్త్రికి మనస్సు వికలమైనది. అతడు తన తప్పును గ్రహించి, భార్యను తృప్తి పరచుటకై జమీందారులకు వ్యతిరేకముగా, రైతులకు అను

కూలమైన ఒక పెద్ద కేసులో లండను నందలి ప్రీవికౌన్సిలు లో వాదించుటకై, వారినుండి ఫీజు తీసుకొనుటయే పని చేయుటకు నిశ్చయించి, కాశ్మీరులో పర్యటించుచున్న భార్యకు తన నిర్ణయమును తెలిపి, విదేశ పర్యటనకై బొంబాయిలో తనను కలసికొన వలసినదని తెలిగ్రాము పంపెను. భర్తలో వచ్చిన ఈమార్పుకు శాంత మిక్కిలి సంతోషించి, బొంబాయి చేరుకొని, అయునతో పాశ్చాత్య దేశముల నన్నింటిని సకుటుంబముగా పర్యటించి, పెక్కుమంది పెద్దలను కలసికొనిరి. శాస్త్రి ప్రీవికౌన్సిలులో కైతులపత్రమున వాదించి విజయమును పొంది స్వదేశమునకు తిరిగివచ్చెను.

వ్యక్తిసత్యాగ్రహోద్యమములో శాంతమ్మ పాలుగొని జైలుశిక్ష ననుభవించినది. ఇష్టము లేకున్నను ఆమెతోపాటు శాస్త్రిగూడ జైలుకు వెళ్లెను- ఇది ప్రథమ భాగపు కథ.

గాంధీ మహాత్ముని, అయన కార్యక్రమములను నిశితముగా విమర్శించి, తూర్పార బట్టిన శాస్త్రిని, శాంతమ్మ తన శక్తినంతటిని వినియోగించి, తన కార్యక్రమములకు ఇష్టానిష్టములకు అనుకూలముగా మార్చి, దేశ సేవకు నడుము బిగించునట్లు చేసినది. "భార్య ప్రభావము భర్త" పైన ఎట్లు ప్రసరించినది రచయిత నవలలో చక్కగా వివరించెను-

"ఎదిగిన పిల్ల - పరాయిది. మనఇంట్లో పెట్టుకున్నాం అంటే నాకు అపఖ్యాతి-" అంటాడు "సుభ" తన ఇంట్లో వుండటము గిట్టని శాస్త్రి చిరాకును కనబరుస్తూ భార్యతో-

"ఎంతసేపు నీ ఖ్యాతి - నీ గొప్ప - నీ మర్యాదా - నీ స్వార్థం చూచుకోవడమేనా? ఒకరికి ఉపకారం చేద్దాం - అని అక్కరలేదూ? ఈ పిల్ల నా ఇంటి కొచ్చింది- నా శరణు అడిగింది- ఈ పిల్ల ఇక్కడే వుంటుంది- బోధపడిందా? ఇక ఈ ప్రస్తావన ఇందుతో ఆపు -" అంది, శారా చువ్వాలా లేచి కాలు క్రింద కొడుతూ భర్తతో (175 పే.). "ప్రేమ కంటే అతీతంగదా దేశం-" అనుకుంటుంది ఒక సందర్భంలో ఆమె (210 పే.). మరొక సందర్భములో నిర్మొగమాటముగా భర్తను "కొరదు బారిన కేపిటలిస్టు" అంటుంది (207 పే.). ఈ మాటలనుబట్టి శాంత స్వతంత్ర ప్రవృత్తి, దేశభక్తి, ధృడచిత్తము విశదమగును. శాస్త్రి స్వభావము ఈ మాటల వలన అర్థమవగలదు-"ఆ గాంధీ వెర్రి - సోషలిస్టు రుగ్మత, రెండు కలసి మళ్ళీ తిరగబెట్టితే చస్తాం-" అనుకుంటాడు. ఆమె ప్రవృత్తిని భాగుగా గ్రహించిన ఆయన లొంగుబాటు తత్వముతో. అనాథ బాలికయైన "సుభ"కు శాస్త్రి దంపతులు "అమ్మా-నాన్నలు". సుభ వారి ప్రేమాదరములతో, పరిసరముల ప్రభావముతో పెద్దదై తన అపూర్వ సౌందర్యముతో చతురములైన సంభాషణములతో ఉక్తి ప్రయుక్తులతో హేమా, హేమాలను ఢీకొని తల్లక్రిందులుచేసి, అడుగడుగున తన శీలమును పరిరక్షించుకొనిన వివేకవతి (ఆమె)- నీళ్ల బిందెలు మోసి నికృష్ట జీవితము గడిపిన "అచ్చమ్మ" కొడుకు జనార్ధనరావు. అతడు వారాలు చేసికొని స్వయం

కృషితో విద్యనభ్యసించి, రైల్వే ఇంజనీయరై "నీతి-నిజాయితీకి" మారుపేరై వ్యవహరించిన శీల సంపన్నుడు- ఆదర్శవాది. ఆ డిపార్టుమెంటులో పేరుగొని పోయిన కుళ్లును, అవినీతిని సమూలముగా తొలిగించి, న్యాయమును కాపాడుటకు అహర్నిశలు పాటుబడిన సత్యసంధుడు (అతడు). శ్రీ ఉప్పల ఈ ఇరువురి జీవితమునకు అధిక ప్రాధాన్యత నిచ్చి, ఈ భాగములో సమర్థవంతముగా రచన చేసెను.

అశ్వద్ధ నారాయణమూర్తి, తీర్థగిరి జూనియర్ అడ్వకేట్లు. మదన గోపాలరావు సబ్ కలెక్టరు. కేప్టెను జనార్ధనరావు రైల్వే ఇంజనీయరు. వాసుదేవరావు, పురుష్ అమృతరావు ప్రొఫెసరు- కారు డ్రైవరు - అండరుగాండు కమ్యూనిస్టు. సీతారాం ప్రైవేటు కంపెనీలో ఇంజనీయరు - అతడు అస్సాంలో యుద్ధకాలమున "మంచాలు" నడిపిన కార్పెడుగాడు, కంట్రాక్టరు అయిన "అప్పల నాయుడు" కొడుకు. వీరందరు "సుభ"ను ప్రేమించి తమ దానినిగా చేసికొనుటకు ప్రయత్నించిన వ్యక్తులు. ఎవరికి చిక్కకుండగ తన వ్యక్తిత్వమును, శీలమును పరిరక్షించుకొనుచు, అందరి మధ్య చాకచక్యముతో తిరిగిన ప్రజ్ఞాశాలి సుభ-

"లేడి అయ్యంగార్ - సుబ్రహ్మణ్య"ముల ఆదర్శ వివాహము నవలలో ఒక ప్రత్యేక మధుర ఖండము. ఆ రెండు పాత్రలను రచయిత చక్కగా పోషించి, కథకు మంచి

పుష్టిని సమకూర్చెను-

డాక్టర్లు, లాయర్లు, ఇంజనీయర్లు, కాంట్రాక్టర్లు ప్రజా సేవ పేరుతో చేయుచున్న దోపిడీ విధానమును రచయిత ఈ నవలలో నేర్పుతో ఎనమండుంచెను.

రచయిత ద్వితీయ ప్రపంచ సంగ్రామ కాలమున అక్రమార్జన చేసిన వివిధ వ్యక్తులను, పద్ధతులను, ప్రజల ఆంతరంగిక చిత్త వృత్తులను దర్పణములోవలె ఇందు ప్రతిబింబింపజేసెను.

ఇంతటి గొప్ప నవలకు ముగింపు అంత బాగుగాలేదు. దానికితోడు ఇంజనీయరింగు సాంకేతికమునకు సంబంధించిన పెక్కు వివరములుండుటచే, అవి కథా కథనమునకును, సార శ్యమునకును అడ్డుపడి పాఠకుల పఠనాభిరుచిని తగ్గించి, కొన్ని పట్టుల విసుగును కలిగించుచున్నది. గంగా ప్రవాహమువలె సాగిన "వ్యావహారిక" రచనలో అక్కడక్కడ అడ్డురాళ్ళవలె కొన్ని "గ్రాంధిక" వాక్యములు దొర్లి రచనకు కృత్రిమత్వమును కలిగించినది.

కీలుబొమ్మలు నవలలోని "అమ్మాఅమ్మ", "అతడు-ఆమె"లోని "ఊర్వశి" ఇద్దరు స్వార్థపరత్వనము కవలలు- ఆ ఇరువురు - ఒకరికి మరొకరు తీసిపోని అవకాశవాదినులు-

పాపాయి వయస్సు పన్నెండు సంవత్సరములు. కథా కాలము వ్యంగ్య రూపమున దీనితో చూపబడినది - కమ్యూనిస్టు పార్టీపైన ప్రభుత్వము విధించిన ఆంక్షను తొలిగించు

టతో కథ ముగిసినది - ఆ నాటి కాంగ్రెసు, కమ్యూనిస్టు ఉద్యమములు రెండు ఇందులో వివరింపబడినవి.

జాగ్రత్, స్వప్న, సుషుప్త్యవస్థల మూడింటియందును మానవ మస్తిష్కములో నిరంతరము చైతన్య రూపమున చెలరేగు విభిన్న భావతరంగములను జేమ్సు జాయిస్, వర్జీనియా ఉల్ఫ్, విలన్ వాఘ్, ఆడ్లర్ ప్రభృతులైన పాశ్చాత్య తత్వవేత్తలు మానసిక శాస్త్ర దృక్పథముతో పరిశోధించి తత్ఫలితములైన అధిమానసిక స్థితులను నవలా రచనలో చొప్పించి మంచి ఫలితములను సాధించిరి. ఆ దృక్పథముతో శ్రీయుతులు గోపీచంద్, జి. వి. కృష్ణారావు, కుటుంబరావులు తెలుఁగులో రచనలుచేసి కొంతవరకు కృతకృత్యులైరి. దీనిలో పరిణతిని సాధించిన కీర్తి శ్రీ బుచ్చిబాబునకు దక్కినది. ఆయన వ్రాసిన "చివరకు మిగిలేది" మన నవలా లోకమున నినూతన సృష్టియై, రచనా శిల్పములో క్రొత్త తీరు తెన్నులతో వెలసి, ఒక ప్రత్యేకతతో ఉన్నతముగా పేరొకొనబడు చున్నది. ఇది 1946 వ సంవత్సరమున "నవోదయ" పత్రికలో సీరియల్‌గా వెలువడి 1953 వ సంవత్సరమున పుస్తక రూపమున వచ్చినది. తెలుఁగులో ఇంతవరకు వెలువడిన "మనో వైజ్ఞానిక" నవలలలో దీనిది అగ్రతాంబూలము. "రెండు మహా సంగ్రామముల మధ్యకాలంలో, తెలుఁగునాట కొందరు యువతీ యువకుల జీవితం చిత్రితమైంది. ఈ నవలలో." అన్నాడు, శ్రీ బుచ్చిబాబు

తమ నవలకు ప్రారంభించిన సమర్పణలో,

ఇది పది అధ్యాయముల నవఁ. రాయలసీమ సర్కారు జిల్లాల ప్రజల మధ్యనగల వైషమ్యములు, పరస్పర విరుద్ధములైన భావములు వీని బుచ్చిబాబు హృదయమును కలత పరచి, ఇదిప్రారంభించునట్లు చేసినది. కథానాయకుడైన "దయానిధికి" తన తల్లియందు అపారమైన గౌరవము, ఆమె శీలమును గురించి సంఘములో పరిపైన అభిప్రాయము లేదు. ఆమెను నలుగురు నాలుగు విధములుగా మాటలాడు కొనుచుండుటను విని సహించలేక అతడు సంఘమునుండి విడివడి ఏకాకియై, ఏకాంత జీవితమును వెళ్లబుచ్చు చున్న ప్పుడు జీవితమునకు అర్థము ఏమిటి? అను ప్రశ్న ఉత్పన్నమై, అతని సత్యాన్వేషణకు, ఆధ్యాత్మిక, తాత్విక చింతనకు దారి తీసినది. ఈ పరిశోధనలో అతడు కనుగొనిన సత్యములు రెండు. ఒకటి ప్రేమించలేక పోవుట, రెండు పెద్దలు చేసిన తప్పిదములకు పిన్నలు బాధ్యులై వారి జీవితములు వికసించ వలసిన తీరున వికసించకపోవుట.

దయానిధి తల్లిని, సుశీల, ఇందిరలు అవహేళన చేసి నందువలన వారు, అతని నుండి దూరమై అతని జీవిత భాగస్వాములు కాజాలక పోయిరి. అతని తల్లియందు మిక్కుటమైన ప్రేమను గనబరచిన "అమృతం" అతనికి సన్నిహితురాలై జీవిత భాగస్వామిని యైతది.

దయానిధి తల్లి ఈ నవలలో ఎచ్చటను గనుపించదు.

కాని ఆమె చేసిన తప్పిదము అతనిని నీడవలె వెన్నాడి, సంఘ విమర్శన రూపమున బహిర్గతమై, అతని చిత్తవృత్తిని కలుషిత మొనరించి, ఒక క్రొత్త జిజ్ఞాసను రేకెత్తించి, అసలైన మానవతను గుర్తించునట్లు చేసినది. అంతేగాదు-శరీరమునకు, ఆత్మకు గల సంబంధమును, ఆపైన ఆత్మజ్ఞాన మును పొందుటకు హేతువును నిరూపించి చూపినది. ఆత్మ జ్ఞాన సంపన్నునకు సర్వ భూతములు సమానమేగదా? అతడు ఈ ఆధ్యాత్మిక, తాత్విక జిజ్ఞాసతో విశ్వ మానవతను, సర్వ మానవ సౌభ్రాతృత్వమును దర్శించుటకు యత్నించెను.

దయానిధి వృత్తిచేత డాక్టరైనను, పరిసరముల ప్రభావముచేత, జీవిత యాత్రలో తారసిల్లిన సంఘటనలతో గొప్ప తాత్వికుడై, భావుకుడై, సంకుచిత వాతావరణము నుండి బయటపడి, విశాల విశ్వమును దర్శించుటకు, యదార్థ పరిస్థితులను గ్రహించుటకు అబ్బురులు చాచిన సత్యాన్వేషి - దూరదృష్టితో కూడిన అతని అన్వేషణకు, సత్యశోధనకు ప్రోదిచేసి తోడ్పడినవే మిగిలిన భూమికలు - ఇవన్నియు అతనిచుట్టు పరిభ్రమించి వివరణాత్మకమైన పరిశీలనకు తోడ్పడినవి.

సమకాలమున సాగుచున్న స్వాతంత్ర్యోద్యమము గూడ దయానిధిపైన ప్రభావము వేసినది. పునస్సంధానము నాటి తొలి చారిత్రియే దేశమాత పిలుపు నందుకొని అరెస్టు అయిన దేశభక్తుడు అతడు.

ఈ నవలయందలి రోమలి, అమృతము, సుశీల, ఇందిర మొదలైన వారందరును దయానిధికి ఆత్మీయులు. అయినను అతని హృదయమును అమృతము సంపూర్ణముగనూ, రోమలి రోంతవరకును చూరగొన గలిగిరి. ఈ నల్గురు స్త్రీల మధ్యన అతడు నాలుగు స్తంభముల ఆట ఆడినను. అతని చిత్త వృత్తికి సన్నిహితురాలైన రోమలి ఒక్కతియే చివరవరకు అతనితో ఉండిపోగలిగినది.

"వ్యక్తిని ద్వేషించుటకన్న వ్యక్తిలోని దౌర్బల్యము లను, బలహీనతలను ద్వేషించుట మంచిది". అన్న మాన వతా వాద సిద్ధాంతమునైన దయానిధి జీవితము నడచినది.

శ్రీ బుచ్చిబాబు ఈనవలలో సృష్టించిన కృష్ణమూర్తి, జగన్నాధం, సోమయ్య, రెడ్డి మొదలైన వ్యక్తులందరు ప్రతి వ్యక్తికి సన్నిహితులుగానుండి, అందరితో కలిసి, మెలిసి జీవించుచున్నట్లు కనుపింతురు.

పరిసరములలో మార్పు కలగినను, పెద్దల గతచరిత్ర పిన్నవారి అమాయకపు జీవితములపైన, చెరుపుటకు వీలు గాని ముద్రవేసి, వారి జీవితములు వికసించకుండ చేసిన పరిస్థితుల తాకిడిని ఈ నవలలో మానసిక శాస్త్ర దృష్టితో భిన్న రోణములనుండి పరిశీలించి, తాత్విక దృష్టితో వానిని విశ్లేషించి శ్రీ బుచ్చిబాబు "దయానిధి" పాత్రలో నిక్షిప్తముచేసెను.

దయానిధి ఈ మహా జీవిత ప్రవాహములో పొందిన

అనుభవములతో, అనుభూతులతో గ్రహించిన సత్యమిట్టిది- "మానవునికి కావల్సింది మతాలు, దేవుళ్లు గ్రొత్త-బల్లు, రాజకీయాలు కావు. మానవుడికి కావల్సింది దయ. అది కొంచెం ఉన్నా చాలు.-" ఇదే రచనయందలి ఉత్కృష్టమైన ధ్యేయము. ఇది ఆయన మనకు అందించిన సర్వకాలీనమైన దివ్య సందేశము.

ఆధునిక పాశ్చాత్య మానసిక తత్వవేత్తలు వెలువరించిన పెక్కు-సిద్ధాంతములు, సమస్యలు, "చివరకు మిగిలేది" నవలలో శ్రీ బుచ్చిబాబు సంపుటీకరించి చూపి, మన తెలుఁగు నవలా సాహిత్యములో నూతనాధ్యాయమును సృష్టించి అనంతర రచయితలకు గ్రొత్తమార్గము సుగమము చేసిన మేధావి- ఈ నవలా గ్రాదుర్భావముతో, మన తెలుఁగులో ఒక నూతన శకము ఏర్పడినదని, పెక్కు-మంది విమర్శకులు ముక్త కంఠముతో వక్కాణించిరి. "తల్లి గ్రభావము కుమార"నిపై పడిన రీతిని, దీనిలో ఆయన గొప్ప నేర్పుతో గ్రదర్శించి, సర్వకాలీనమైన ఒక ఉత్తమ సాహిత్య సంపత్తిని, పెన్నిధిని తెలుఁగు వారి కందించి, చిరయశస్కుడయ్యెను-

వైధోరణి రచనలకు జీవమపోసిన మరియొక ఉత్తమ మనో వైజ్ఞానిక నవల తెనుఁగు కథానికా గ్రపంచమున జగాదివ్విటీలను వెలిగించిన శ్రీ రాచకొండ విశ్వనాధశాస్త్రి గ్రాసిన "అల్ప జీవి" అనునది. ఇది 1954వ సంవత్సరమున

ప్రముఖ సాహిత్య మాన పత్రిక భారతిలో ధారావాహిక ముగా వెలువడి పెక్కు-మంది ప్రశంసల నందుకొని 1955వ సంవత్సరమున పుస్తక రూపము దాల్చినది.

భయము, తక్కు-వ తనము (Inferiority complex) అను రెండు మానసిక ప్రవృత్తులను అలంబనముచేసి, శ్రీ శాస్త్రి "అల్పజీవి" నవలను వ్రాసెను. ఈ రెండు స్వభావ ముల చుట్టు అల్లుకొనిన కథయే సుబ్బయ్య జీవితము. అదియే అల్పజీవి నవల- నవలయందలి ఇతివృత్తము మిక్కిలి అల్ప మైనది. కథానాయకుడైన సుబ్బయ్య ఒక ఆఫీసు గుమాస్తా. తల్లిని తండ్రిని కోలుపోయిన అభాగ్యుడు. అమాయకుడు. అతడు తన అంతస్తుకు మించిన జమీందారుల ఇంటి బిడ్డ యైన సావిత్రిని వివాహమాడి, పిల్లలను కనినను, ఆమెతో పొందవలసిన జీవిత సుఖమును పొందజాలక పోయిన వ్యర్థ జీవి. అతడు ప్రతి నిత్యము తన ఇంటి ముందున్న అరుగుపైన గూరుచుండి వచ్చిపోవు వ్యక్తులనుచూచుచు, వారిని గురించి మనస్సులోనే అహర్నిశలు ఏవేవిదియో ఊహించుకొనుచు, అంతర్మథన పొందుచుండెడివాడు.

ఇక సుబ్బయ్య బావమరది వేంకటరావు టోపీలు మార్చుటలో, ఇతరులకు వానిని తగిలించుటలో ఘటికుడు. గొప్ప అవకాశవాది. అతడు సుబ్బయ్యద్వారా తన అవసర మునకు గవరయ్య అను కాంట్రాక్టరు వద్దనుండి ఐదు వందల రూపాయలు తెప్పించుకొని తిరిగి ఇవ్వక బాధ పెట్టెను.

సుబ్బయ్య ఆఫీసులో గవరయ్య పనిని పూర్తిచేయలేక పోయెను. పని పూర్తి కాకపోవుటతో గవరయ్య రెచ్చి పోయి తన డబ్బును తిరిగి ఇవ్వవలసినదని సుబ్బయ్యను నిర్బంధింప దొడగెను. అతడు నిరాకరించుటతో, గవరయ్య మనుష్యులు అతనిపై నౌర్జన్యముచేసి వేయి రూపాయలకు ప్రామ్సరీనోటు వ్రాయించుకొని వెళ్ళిరి. ఇట్టి అసహాయ స్థితిలోనున్న సుబ్బయ్యను హృదయమున్న మనోరమ అను వితంతువు ఆదుకొని ఆ గండమునుండి తప్పించినది.

శ్రీ శాస్త్రి ఈ కథ నంతటిని "సుబ్బయ్య" విచిత్రమైన ఊహలతో, అంతర సంభాషణలతో జరిగినట్లు చిత్రించి, నవలా కథనమున ఒక క్రొత్త పంథాను ప్రవేశపెట్టి, విల క్షణమైన మార్పులకు మార్గదర్శకుడు అయ్యేను. సుబ్బయ్య పరిస్థితులపట్ల యెంతటి కఠిన హృదయుని కైనను జాలి కలుగక మానదు- నవలలో కరుణ రసము సర్వత్ర జాలు వారు చుండును-

శ్రీ రాచకొండ వ్రాయనెంచిన "రాజు - మహిషి, ప్రేమ - మనిషి, దైవం - న్యాయం, ధర్మం - సత్యం" పేరుగల నవలలో "రాజు - మహిషి" అనునది ప్రథమ భాగము. స్వార్థపరత్వముతో కరుడుగట్టి పోయిన నేటి సమాజమున జీవిత సత్యములను వెలికితీసి వెలుఁగు నిచ్చు టకు శ్రీ శాస్త్రి అహరహముపొందిన అంతర్మథనయే ఈ భాగము. "అవసరం ఉన్నవారికే హాక్కు" అన్న సిద్ధాంత

మును మూల భూతముచేసి దీనిని ఆయన వ్రాసెను. ఆయన లోతైన ఆలోచనా సరళిని, వ్యంగ్యపూరిత ధోరణిని గ్రహించ దలచినచో ఈ వాక్యములను గమనించుడు- "ఎంత ఎక్కువ పంస్కారం ఉంటే, అంతచిన్న విషయాలు అంత ఎక్కువగా బాధపెడతాయి" (27 పే.). "అపతలి వాణ్ణి అణిచిపారేసి అదే దైవ నిర్ణయమని, దైవ న్యాయమనీ సమర్థించడానికి దైవం దొరికినంతవీలుగా ప్రపంచంలో మరేదీ లేదనే విషయం భీమసేనరావుగారు ఏనాడో గ్రహించారు" అంటాడు (93 పే.). ప్రవాహ సదృశమూ, జీవ భావములో నుండు శ్రీ శాస్త్రి శైలి తెలుఁగు భావములో ఒక ప్రత్యేకమైనది-

"మంచీ-చెడూ" "అపస్వరాలు" అను ప్రశస్తమైన నవలలను వ్రాసిన శారద అసలు పేరు నటరాజన్. అతడు తమిళుడు. తెలుఁగునాట జీవించి, తెలుఁగు సరస్వతిని ఆరాధించి, తెనాలిలో హోటలు సర్వరుగా జీవితము గడిపి, సామాన్య తెలుగు ప్రజల నిక్కృష్ట జీవితమును తరిచి చూచి, దానిని ఇతివృత్తముచేసి పై నవలలను మనకందించి, అకాలమరణము పాలయ్యెను. 1951, 52 సం. లలో ఆంధ్ర సచిత్ర వార పత్రికలో ఈ నవలలు ధారావాహికముగా వెలువడి, ఆ పిమ్మట ఆంధ్ర గ్రంథమాలలో పుస్తకములుగా వచ్చినవి. ఆ నవలలు పత్రికలో ప్రచురింపబడు చున్నప్పుడు "శారద" స్త్రీయా లేక పురుషుడా? అన్న

సందిగ్ధము కలిగి, రచయిత వివరములను గోరుచు, పెక్కు-మంది అపరిచితాధిపతులకు లేఖలు వ్రాసిరి. వివరములు తెలిసిన పిమ్మట అందరికి ఆశ్చర్యము కలిగినది.

నడిమి తరగతి ప్రజల స్థితిగతులను, వారి జీవిత విధానమును వర్ణించు నవల "మంచీ-చెడూ". సంపన్న గృహస్థు, వయస్సు మళ్లిన భద్రయ్య, పేద ఇంటి పిల్ల, విద్యావతియైన పద్మను, సుదర్శనము అను అవకాశవాది, స్వార్థపరుని ప్రోద్బలముతో ద్వితీయ వివాహమాడి, కొద్ది దినములలో తన సర్వస్వమును గోలుపోయి, నిలువ నీడలేక పరితపించి, మనోవ్యాధితో కన్నుమూసెను. ఆయన మొదటి భార్య కుమారుడైన భాస్కరరావు శీల సంపన్నుడు. పినతల్లి పద్మ పన్నిన ఉచ్చులనుండి తప్పించుకొని, కుటుంబ గౌరవమును కాపాడుటకు పాటుపడిన ఆదర్శజీవి - వివాహమైన మరుక్షణమునుండి పద్మ జీవిత సుఖమును కోలుపోయి, పరిస్థితులకు తలవొగ్గి పతితయై నికృష్ట జీవితమును గడిపి, తన అంతస్తునుండి దిగజారి ప్రవర్తించిన దురదృష్టవంతురాలు-ఇక సుదర్శనము "స్వార్థము"నకు మారుపేరు. ఆయన కుమార్తె సరోజిని, పినతల్లి క్రూర స్వభావమునకు బలియై పోయి, అంగవికలురాలై అజన్మాంతము బాధపడిన మరొక దయనీయ. విజయవాడలో ప్రతి సంవత్సరము జరుగు మిగ్గి ప్రమాదములను రచయిత ఇందు కన్నులకుగట్టినట్లువర్ణించెను.

"అపస్వరాలు" నవల దళితజాతి ప్రజల పరిస్థితులను

చిత్రించును. విజయవాడలో ఆదునట్టి "కాటన్ మార్కెట్టు" నుండి-ఫుట్ పాత్ పైన జీనించు అభాగ్యుల వరకుగల అన్ని వర్గములవారి, మానసికస్థితి గతులను, ఆస్థితికి వారు దిగజారుటకు కారణభూతమైన పరిస్థితులను, పరిసరముల ప్రభావము మానవుని పతనమునకు ఎట్లు దారితీయునది దీనిలో చక్కగా నిరూపించెను-అశేషాంధ్రుల ప్రశంసల నందుకొన్న నవలలివి.

"దొరా! నీ భాన్చిను. నీ పాదాలు మొత్తత. నీ పియి తింట—" ఈ మాటలు ఒకనాటి తెలంగాణపు గ్రామీణ ప్రాంతములో సర్వ సాధారణముగా ప్రతి నోట వినిపించి నవి. గ్రామ దేవతలైన "జమీందారు"ల కబంధ హస్తములలో తరతరములుగా బంధింపబడి, తినతిండి, కట్టబట్ట, ఉండుటకు ఇల్లు లేక అలమటించి పోయిన మూగ జీవుల దుస్థితిని, తొలగించి వారి నుద్ధరించుటకు ఆంధ్ర మహాసభ, ఆర్య సమాజమునకు చెందిన ప్రగతి శీలురు, ఉత్సాహ వంతులునైన కార్యకర్తలు చేసిన మహత్తర కృషి, అదు గదుగున నిరంకుశ ప్రభుత్వము నెదిరించుటలో వారు ప్రద ర్శించిన ధైర్య సాహసములు, అనుభవించిన కడగండ్లు, తత్ఫలితముగా ప్రజలలో కలిగిన జాగృతి, ఆ పిమ్మట 1938 వం. స్టేటు కాంగ్రెసు సంస్థ స్థాపింపబడుట వరకుగల కాల మును ఇతివృత్తముచేసి, ఉత్తమ దేశభక్తులైన శీ) వట్టికోట ఆళ్వారుస్వామి "ప్రజల మనిషి" అనునవలను వ్రాసెను.

నిజామాబాదు జిల్లా, కామారెడ్డి తాలూకాలో,

"దిమ్మగూడె" మను గ్రామమునకు దొరయైన రామభూపాల రావు అధికారుల అండతో, సామాన్య ప్రజలను పీడించి పిప్పిచేసి, కుతంత్రములతో, కుత్సితపు ఆలోచనలతో వారి ఆస్తులను స్వాధీన పరచుకొని, చెప్పులక్రింది "తేళ్ళ" వలె అణచి ఉంచి, అచ్చట తన ప్రభుత్వమును యథేచ్ఛగా నెరపిన తీరు ఇందు చిత్రించబడినది - కథా నాయకుడైన కంఠీరవము, గ్రామ కాపైన కొమరయ్య, పాలేరైన కన కయ్య, వకీలు వేంకటేశ్వరరావు, చంద్రయ్య ప్రభుతు లందరును ఆయన దుర్మార్గములకు ప్రత్యక్షముగనో, పరోక్ష ముగనో గురియైనవారే.

హైదరాలి, వేంకటాచారి, వేంకటాద్రి మొదలైన అవకాశ వాదులు రామ భూపాలరావు పన్నుగడలను సమర్థించి ఆయనకు కుడి భుజముగా మెలగిరి.

కంఠీరవము, తండ్రి రఘునాథాచార్యుల మరణా నంతరము అన్నయైన వేంకటాచార్యులచేత అవమానింపబడి, స్వగ్రామమును వదలి నిజామాబాదుకు వెళ్ళి, డాక్టరు మోహనాచార్యుల ఆశ్రయముతో క్రమముగా పైకివచ్చి, గ్రంథాలయములో సభ్యుడై ముఖ్య కార్యకర్తయై సాం స్కృతిక కార్యక్రమములలో పాలుగొనుచు, ఒకనాడు తన గ్రామమునకు తిరిగి వెళ్ళినపుడు, హైదరాలి కొందరు ఇత్తెహాదుల్ ముసల్మాను నాయకులతో కలిసి పోలీసు సహా యముతో కొందరు హరిజనులను "మత పరివర్తన" పేరుతో

మహామ్మదీయులను చేయుచుండగా చూచి సహించలేక వారిని ఎదిరించి మాట్లాడెను. దానితో అతనిని, కొమరయ్యను పోలీసులు అరెస్టుచేసి చెక్కు హింసలకు గురిచేసి, కోర్టులో దొంగకేసు పెట్టిరి. కొమరయ్యను అధికారి ప్రథమ తప్పుకింద విడుదలచేసి, కంఠీరవమునకు 3½ సంll లు కఠిన శిక్షను విధించెను. అతడు కొంతకాలము నిజామాబాదు జైలులోను, మరికొంతకాలము హైద్రాబాదు జైలులోను కఠినశిక్ష ననుభవించెను. జైలులో "బషీర్" అను దొంగతో అతనికి స్నేహము కలిసినది- పరిస్థితుల ప్రభావమునకు తల వొగ్గిన "బషీర్" దొంగగా మారిన విషాదగాధ ఈ నవలకు ప్రాణము. జైలుశిక్ష ముగిసినపిమ్మట కంఠీరవము అతనితో కలసి తిరిగివచ్చి, వేంకటేశ్వరరావు తోడ్పాటుతో దిమ్మగూడెమున రామభూపాలరావు తన తాబేదారుల తోడ్పాటుతో చేసిన అక్రమ చర్యలను బహిర్గత పరచి, వారి పాపములకు తగిన శిక్షలు పడునట్లుచేసెను.

కంఠీరవముతల్లి అండాళమ్మకుగల మాతృ ప్రేమ, కొమరయ్య తల్లి అన్నమ్మకుగల వీరత్వము ఇందు చక్కగా వివరించబడినవి.

పూర్ణ మానవత్వముతో తోటి ప్రజల క్షేమమునకై నిరంతరము పాటుపడిన స్వార్థత్యాగి కంఠీరవము. అతడే ప్రజల మనిషి-ఒక్క మాటలో చెప్పవలెనన్న "కీ॥ ఆళ్వారు స్వామి"యే అతడు.

ఆనాటి తెలంగాణమున (1) వెట్టిచాకిరి, (2) చీటీలు వ్రాయుట అను దురాచారములుండెడివి. వాటిని రూపు మాపుటకు నడచినదే గ్రంథాలయోద్యమము. "వెట్టిచాకిరి" పద్ధతినుండి "కైతు కూలి ఉద్యమము" "చిట్టీలు" వ్రాయు దురాచారమునుండి వర్తక సంఘముల స్థాపన, ఆ రెండిం టికి కేంద్రమై వర్ధిల్లిన "గ్రంథాలయోద్య"మము నుండి (Political Consciousness) వంటి నూతన భావ తరంగ ములతో నిద్రాణమైన తెలంగాణము చైతన్య వంతమైనది. ఈ విషయములను ఈ నవల వ్యక్తీకరించినది.

ఇంతటి మంచి నవలలోను ఒకటి రెండు దోషము లున్నవి- కంఠీరవము నిజామాబాదులో గ్రంథాలయ కార్య కర్త. ప్రభుత్వము అతనిపైన మోపిన దొంగకేసు విచారణ లో ఎందరో మేధావులను కోర్టులో అతడు ఎదిరించెను. అంతటి విజ్ఞానమును అతడు ఎట్లు అలవరచు కొనినది నవలలో ఎచ్చటను చూపలేదు- అక్కడ ఎవరి వద్దను విద్యాభ్యాసము చేసినట్లును తెలుపలేదు- నిస్వార్థ కార్యకర్తయైన అతడు బంధింపబడి, కోర్టులో విచారణ జరుగునప్పుడు అపట్టణము నందలి ఏ ఒక్క వ్యక్తియైనను సానుభూతిని తెలుపకుండునా? ఏ ప్లీడరైనను అతని పక్షమున వాదించకుండునా? అక్షయ మిచ్చి కాపాడిన డాక్టరు మోహనాచారి యైనను అతని పక్షమున పనిచేయుక మిన్నక యుండునా? జైలులో అతడు "బషీరు" పైన పోలీసులు జరిపిన అకృత్యాచారములను

గురించి స్వయముగా, అనుగుట అంత సమంజసముగా లేదు. తానును పోలీసుల అకృత్యాచారములను, హింసలను చవి చూచినవాడేగదా? ఇతరు లెవరైనను అతనిని ఆ విషయము అడుగుచున్నట్లు దానిని అతడు విని బాధపడినట్లు, అతని పట్ల సానుభూతి వేర్పడినట్లు చిత్రించినచో నవల మరింత సహజ శోభావంతముగా నుండెడిదేమో! కథా కాలమునకు వ్యక్తుల వయస్సునకు అంత పొంతన కుదురుట లేదు. అంత చిన్న వయస్సులో ఇంటినుండి బయలుదేరిన కంఠీరవము నిజామాబాదులో ఎంతకాలముండెను? ఈ లోపల స్వగ్రామమునకు ఒక్కసారి యైనను పోకయుండునా? కొన్నికొన్ని ఘట్టములలో శ్రీ ఆళ్వారుస్వామి తాను అనుభవించిన బాధలను, చవిచూచిన దెబ్బలను వివరించి చెప్పుటకు, ఆ కాలపు పరిస్థితులను చిత్రించిమాపుటకు చేసిన తొందరల వలన ఈ చిన్న లోపములు కొన్ని దొర్లినవి - తెలంగాణ ప్రాంతపు పరిస్థితులను చిత్రించు ఉత్తమ రాజకీయ నవల ఇది-

శ్రీ స్వామిత్రివాసిన మరొక రాజకీయ నవల "గంగు". ఇది 1938-48 సం॥ మధ్యన హైద్రాబాదు సంస్థానమున చెలరేగిన రాజకీయ, మత, సాంఘిక పరిస్థితులను, సామాన్య ప్రజల స్థితిగతులను, నిరంకుశమైన భూస్వామ్య వ్యవస్థను వివరించును. ఆ మహోద్యమమున విజయ సాధనకై ఆంధ్ర మహాసభ, స్టేటు కాంగ్రెసు, కమ్యూనిస్టు పార్టీల కార్యకర్తలు ప్రదర్శించిన సాహస కృత్యములను నిరంకుశ

ప్రభుత్వపు అధికారులు, రజాకారులు దాని నణచుటకు పన్నిన పన్నుగడలు దోపిడీలు, గృహదహనములు వివరముగా ఆయన ఇందు చూపెను.

"గంగు"నవలలోని కథాకథన పద్ధతి, "ప్రజల మనిషి" నవలకన్న మిక్కిలి సహజముగా నున్నది. పాత్రల చిత్రణ, సంభాషణలు, వర్ణనలు, విభిన్న సంఘటనలు నేర్పుతో మలచబడినవి. అనాటి ప్రజల చిత్తవృత్తులు, ముఖ్యముగా హరిజనులు, వెనుకబడిన తదితర దళితజాతి ప్రజలు అనుభవించిన కడగండ్లు, దుర్భర దారిద్ర్యము; అవ్యవస్థనుండి వారిని రక్షించుటకు కార్యకర్తలు చేసిన విఫల యత్నములు, వారు అధికారుల దమననీతికి, అహంకార ప్రవృత్తికి చిత్ర హింసలకు ఎఱయై పోయిన తీరును దీనిలో ఆయన విశ్లేషించి చూపెను.

"ప్రజల మనిషి" యందలి ప్రజా కంటకుడైన రామ భూపాలరావు కన్న, ఇందలి జగ్గయ్య, వేంకట రావులు సర్వ విధముల "ముక్కు కోసిసను మునుపటి మొగుడే నయం" మని పించగల ఘటికులు. పండుపంటి కాపురములలో చిచ్చుపెట్టి పరమానందముతో పాయసములను భక్షించి ఆనంద డోలిక లలో ఊగులాడిన పరమ నీచులు. ఒక వైపు అధికారుల అడుగులకు మడుగులొత్తి, వారి దయా దాక్షిణ్యములతో వారి కను సన్నలలో మెలగి, వేరొక వైపు తమ గ్రామము లలో సింహములై వ్యవహరించి, అమాయకుల ధన, మాన

ప్రాణములను హరించిన కిరాతకులు.

నవనీతము. నాగభూషణము, వీరలింగయ్య, రాజ మౌళి వంటి నిస్వార్థ ప్రజా సేవకులను, శీల సంపన్నులైన ఉద్యమ కార్యకర్తలను సృష్టించి, మానవత్వముప్పట్లు, మంచి పట్లు వారు చూపిన అవ్యాజమైన ప్రేమానురాగములను వివరించెను. ఇట్టి ఉత్తమ భూమికలతో శ్రీ స్వామి నవలకు ఒక విశిష్టతను చేకూర్చెను.

"అంతమ్మ" వంటి పతివ్రతను, అభిజాతవతిని, శీల సంపన్నురాలిని సృష్టించి నవలకు గొప్పస్ఫూర్తిని కలిగించెను. గంగు, సుజాతలు నవలలో నిర్వహించిన పాత్ర చాల ప్రధానమైనది. కీలకమైనది, వారి దేశభక్తి అత్యంత శ్లాఘనీయమైనది. మున్సిఫ్ హృదయమున్న ప్రభుత్వాధికారి. అధికారపు "హద్దు" లను అధిగమించలేక, తోటి మానవుల పట్ల జరుగుచున్న అన్యాయములను, అక్రమములను చూచి సహించలేక, అంతర్మథనతో అలమటించిన సుస్వభావుడు- "అమీను" నరరూప రాక్షసుడు. ప్రజా కంటకుడు. ఉద్యమ కార్యకర్తలను అమానుషమైన పెక్కు హింసలకు గురిచేసి అధికారదర్పముతో విర్రవీగి తన మదాంధతను చాటుకున్న వ్యక్తి. చూడండి-నవనీతము తనకు ఎదురు తిరిగి మాట్లాడి నప్పుడు అధికార గర్వముతో గొనెసంచిని తెప్పించి "ఈ పందిని దాంట్లో కట్టి వేలాడదీయండి. చింతకండోలె నలగ గొట్టండి- ఏమైనాకాని చూద్దాం. తెలిసిపోతుంది నిజాం

ప్రభుత్వమంటే ఏమిటో" అని గర్జించెను (123 పేజీ). ఈ దృశ్యము ఒక్కటిచాలు, ఆనాటి అకలంక దేశభక్తులపట్ల వారు ప్రవర్తించిన తీరును తెలిసికొనుటకు.

విశాల ప్రాతిపదికపైన ఆనాటి మహోద్యమమును చిత్రించుటకు శ్రీ అళ్వారుస్వామి పూనుకొని, అసంపూర్తిగా వదలి ఇహయాత్ర ముగించినను, ఇది ఒక మహోజ్వల రాజకీయ చరిత్రను గర్భమున ఇముడ్చుకొనిన అసమానమైన అసంపూర్ణ కళా ఖండము. మానవత్వపు మహనీయమైన విలువలను, లోతులను, అభాగ్యుల కన్నీటి గాథలను హృదయ విదారకమైన పరిస్థితులను వివరించి చూపునట్టి రాజకీయ, చారిత్రక నవలారాజము "గంగు". (1965 సం.)

పై రెండు నవలలు తెలంగాణపు ప్రజల సజీవమైన వాడుక భాషలో నడచినవి.

పరిస్థితుల ప్రభావమునకు ఏదురొడ్డి నిలచి, అడుగడుగున విషవలయములను సృష్టించు నీచులనుండి తప్పించుకొని, అనాథలై పరితపించు స్త్రీల నుద్ధరించుటకు నాగవిమల చేసిన కృషిని శ్రీ ఘట్టి ఆంజనేయశర్మ "పునరాగమము" నవలలో నిరూపించెను.

ఒక పడవ ప్రమాదములో నాగవిమల భర్త కేశవమూర్తి మరణించెను. కుమారుడు ఆ భీభత్సములో తప్పిపోయెను. సామాన్య కుటుంబమునకు చెందిన ఆమె ఆ దుస్సంఘటనతో ధైర్యమును కోలుపోయి, ఏ దుష్టుని చేతి

లోనో పడి జీవితమును పాడుచేసికొనక "ఆశ్రమ" మును స్థాపించి, పతితలైన స్త్రీలకు ఆశ్రమమును కలిపించి వారి శీలమును తీర్చిదిద్ది, అందరిచేత మాతృదేవిగా గౌరవింపబడి తప్పిపోయిన అతిథి కుమారుని పునరాగమనముతో కథను మంగళాంతము చేసెను. శీలమునకు, సేవాభావమునకు ప్రాధాన్యతనిచ్చి రచయిత దీనిని రచియించెను (1955 సం.)

రాజకీయ నవలా రచన శ్రీ మహీధర రామమోహన రావుకు ఉగ్గుపాలతో అలవడిన విద్య. ఆయన గచనలను చదివిన యెడల కాంగ్రెసు, కమ్యూనిష్టు, సోషలిస్టు పార్టీల మూల సిద్ధాంతములతో ఆయనకుగల అభినివేశము, వానిని అవగాహన చేసికొనిన విధము వ్యక్తమగును.

"కొల్లాయిగట్టితేనేమి" నవల ఆయన రచనలకు మేలు బంతి. ఇది 1955 సం. వెలువడినది. 1921 వ. సం. మార్చి 31, ఏప్రియల్ 1 వ. తేదీలలో బెజవాడలో జరిగిన అఖిల భారత కాంగ్రెస్ కమిటి సమావేశమునాటినుండి, స్వాతంత్ర్యము ప్రాప్తించువంతవరకు, తెలుఁగు దేశమునందలి ఆర్థిక, రాజకీయ, సామాజిక పరిస్థితులను దీనిలో వివరించెను. బ్రిటిష్ వారిని ఈ దేశమునుండి వెళ్ళగొట్టినంతమాత్రమున సరిపోదని, మన సమాజములో పేరుకొని పోయివున్న మూఢ విశ్వాసములను, ప్రాచీన నమ్మకములను పారదోలి దేశమును సర్వమానవ సౌభ్రాతృత్వమువైపు మళ్ళించి, విశ్వమానవ కళ్యాణమును, అభిలషించి పనిచేసినప్పుడే అది సిద్ధించి,

దేశము సౌభాగ్యవంతమగునని ఆయన నిరూపించెను. అప్పుడే దేశమున చెలరేగిన అశాంతి దూరమై, కళ్యాణాత్మకమై మనగలదని ధ్వనింపజేసెను. కథానాయకుడైన రామనాథం మహాత్మ్యని పిలుపుతో చదువుకు స్వస్తి చెప్పి, వివిధ ఉద్యమములలో పాలుగొని స్వాతంత్ర్యసిద్ధికై పాటు పడిన దేశభక్తుడు. "స్వరాజ్యం" అను వర్ణాంతర స్త్రీని ప్రేమించెను. అతడు వివాహితుడు. ఆమె వివాహిత. అయినను ఆ ఇరువురు ప్రేమించుకొని వివాహమాడిరి. ఇది వర్ణాంతర, వివాహాంతర వివాహము. దీనిని సమర్థించు సంస్కర్తలు లేకపోయినను, రామనాథం గురువుగారితో "మేము ప్రపంచాన్నే ధిక్కరించి నిలబడకాము మాష్టారు! మేం చేస్తున్నది తప్పుగాదు...మా వివాహాన్ని గుర్తించని సమాజాన్ని మేము గుర్తించము" అంటాడు. ఇది అతని ధృఢ వైఖరికన్న తిరుగుబాటుతనమును, సంస్కరణాభిలాషను వ్యక్తముచేయును. దీనిలో ప్రేమకు కొంత ప్రాధాన్యత నిచ్చినను, వైయక్తిక వికాసమునకు రచయిత అధక్యతను కనబరచెను. గోదావరీ తీరమైన "ముగండ" దీని కార్యస్థానము. ఇది మూలపల్లివంటి ప్రేమల రాజకీయ నవల. దట్టితో శ్రీ మహీధర దీనిని తీర్చిదిద్దెను.

"మృత్యువు నీడల్లో" నవల తెలంగాణమున నైజాం పరిపాలనకు, రజాకార్ల చర్యలకు వ్యతిరేకముగా ఆంధ్ర మహాసభ, కాంగ్రేసు, కమ్యూనిస్టు కార్యకర్తలు నడిపిన

విప్లవమును వివరించును. వారు ప్రభుత్వ దౌర్జన్యములను ఎదిరించుటకు, దౌర్జన్యపద్ధతులు అవలంభింపవలసి వచ్చినను వెనుదీయక, తమ నిండు ప్రాణములను "పణము" గా పెట్టి ధైర్యముతో పోరాడిన సంగతిని అది వివరించును.

"ప్రజల మనిషి" "గం గు" నవలలో శ్రీ అళ్వాళ్ స్వామి తెలంగాణములోని మారుమూల ప్రాంతములలో చెలరేగిన ప్రజా ఉద్యమమును చిత్రించగా, శ్రీ మహీధరవీర తెలంగాణకు సరిహద్దులైన గుంటూరు, కృష్ణా జిల్లాల పొలిమేర గ్రామములలో దవానలమై ప్రజ్వరిల్లిన అవాంఛనీయ సంఘటనలను ఇందు వివరించెను. ఆనాటి రాజకీయ సమరముతో సంబంధముగలిగివున్న ప్రతి వ్యక్తి, మృత్యువు నీడల్లో జీవించి, అరచేతులలో ప్రాణమునుంచుకొని చరించిన విధమును ఇది వ్యక్తీకరించును. గ్రామ కుటుంబమునకు చెందిన భాగ్యరెడ్డి అనునతడు ఉద్యమదళములో చేరి, పీడిత ప్రజల హక్కుల రక్షణార్థము సలిపిన పోరాటము, అదుస్సంఘటనలను ఎదిరించుటలో అతడు ప్రదర్శించిన వీరోచిత పాత్రయే ఈ నవల. చాకలి మంగమ్మ ఉద్యమ నిర్వహణలో ప్రదర్శించిన సాహసము పేర్కొనదగినది. కత్తిఖాది సాములవంటి ఆనాటి కార్యకర్తల జీవిత పరిస్థితులను రచయిత నవలలో చక్కగా వివరించెను.

విశాలాంధ్ర పత్రిక 1961 సం. నడిపిన పోటీలలో "కత్తులవంతెన" నవల ప్రథమ బహుమతి నందుకొనినది

ఇది ఆంధ్రదేశములో కమ్యూనిష్టుపార్టీ కార్యకలాపములను వివరించు నవల. ఇందలి పాత్రలద్వారా రచయిత తన మనోభావములను వెల్లడించెను.

"స్వయంవరణం" నవల తెలుఁగునాట పాతుకొని పోయిన వర్ణవ్యవస్థను, మూఢ నమ్మకములను రూపుమాపి, నవసమాజమును నిర్మించుటకు, వివాహవ్యవస్థలో మార్పు ప్రధానమని, వర్ణాంతర, మతాంతర వివాహములు జరిగి నప్పుడే అది సాధ్యమని, రచయిత తన అభిప్రాయమును వ్యక్తమొనర్చెను. వయస్సునమ్మిన పెద్దలు, లేత వయస్సులోనున్న యువతీ యువకులమధ్య గల అంతరములను భావ సంఘర్షణలను ఇది వ్యక్తీకరించును. ఈ నవలలో రచయిత పాత్రల మధ్య సంభాషణలు ఎక్కువగా నడిపి చర్చా వేదికవలె కొన్ని చోట్ల భాసింపజేయుటవలన కొంత సహజత్వము లోపించినది.

సంఘముచేత బహిష్కరింపబడి, అనాదరణతో, అవహేళనతో చూడబడుచున్న వ్యక్తుల సమస్యలను సదవగాహనముతో పరిశీలించి, వారిపట్ల సానుభూతి చూపి, వారికి న్యాయము చేయ సంకల్పించి కథలను, నవలలను వ్రాసిన వర్తమాన రచయిత్రి బలివాడ కాంతారావు. ఈ క్రింది నవలలు ఆ సత్యమును రుజువుచేయుచున్నవి.

"దగాబడిన తమ్ముడు" గ్రామీణ జీవితమును అచ్చటి ప్రజల విశ్వాసములను, వారి సమస్యలను, ఆనవాయితీలను

చిత్రించుటతోపాటు, జీవన భృతిని అన్వేషించుచు పట్టణములనాశ్రయించు అమాయకులు ఎదుర్కొను చిక్కులను, ధనవంతులు వారిపట్ల గనబరచు అవహేళనను, మిక్కిలి సానుభూతితో రచయిత వివరించెను. ఇది ఆంధ్ర సచిత్ర వార పత్రికలో వారం, వారం ప్రచురింపబడి, 1961 వ. సం. గ్రంథరూపము దాల్చినది.

"మత్స్యగంధి" బొంబాయి సమీప గ్రామ జాలరుల పరిస్థితులను తెలుపు నవల. "మహాద్వా" జాలరుల కుల పెద్ద. అతని మాటకు తిరుగులేదు - బాటకు ఎదురులేదు. అతని గారాబుపట్టి "హాసి" నార్వా అను వానిని ప్రేమించి, అతనితో పలాయనము చిత్తగించుచున్నప్పుడు, ఆయన వాడ్డని చావచితక బాదవగా, ఆ రహస్యము వెల్లడియై కులములో అతనికి తలవంపులైనది. ఒక మంచి సంబంధము తండ్రి కూతురునకు తెచ్చినను ఆమె తిరస్కరించినది. "నార్వా చదువుకున్నవాడు - వాడికి మీ అమ్మాయి పోని నిచ్చి పెళ్ళిచేయి" అని మహాద్వాతో ఒక పెద్ద చెప్పగా "బాగా అరుస్తుందని గాడిదకు గుర్రాన్నిచ్చి పెళ్ళిచేస్తారోయ్" అని చెప్పిన దృఢచిత్తము.

ఒకనాడు మహాద్వా సముద్ర మధ్యమున పెనుతుపానులో చిక్కుకొని రబ్బరు గొట్టము సహాయముతో తిరిగి వచ్చుచుండగా, వేరొకడు ప్రాణాపాయ స్థితిలో నున్నట్లు గ్రహించి, తన గొట్టమును అతనికిచ్చి, తాను ధైర్యముతో

ఈదుకొనుచు పోవుచున్నప్పుడు ఒక నావ కనుపించగా, ఆశతో దానిని ఎక్కుటకు ప్రయత్నించెను. నావలోనున్న 'నార్యా' మహాదాబ్బను గుర్తించి, తన ప్రేమకు అడ్డుపడుచున్న అతనిని కాలితో బలవంతముగా తన్నినప్పుడు అతడు ప్రాణములను గోలుపోయెను. నార్యా "పోసీని" వివాహమాడి, కుల పెద్దయై స్వేచ్ఛగా కాలము వెళ్ళబుచ్చుచున్నను, తానుచేసిన దోషము పెనుభూతమై వెంటాడుటవలన జరిగిపోయిన కథను పోసీకి తెలుపగా, అతని సీచ పరివర్తనకు ఆమె హృదయము దెబ్బతిని, మనోవ్యాధితో మరణించినది.

వాచవులూరించు చిన్న వాక్యములతో, జీవితపు విలువలను, లోతులను వ్యక్తముచేయు నేర్పు, కథాకథన దక్షత శ్రీ బలివాడకు సమృద్ధిగానున్నట్లు "మత్స్యగంధి" నిశదపరచివది.

"ఇష్టములేని ఆడది ఇనుపకడ్డీలాంటిది - దాన్ని వంచడం ఎంత బలమైన మగాడికైనా వీలుపడదు-" వంటి చురకత్తివంటి చక్కని ప్రయోగములతో రసవత్తరముగా నవల నడచినది. మహాదాబ్బ, నార్యా, పోసీల పాత్ర చిత్రణ లోను, వారి మనస్సులలోని భావములను వెలికి తీసి చెప్పుటలోను, నిండైన సానుభూతిని కనబరచుటలోను, శ్రీ కాంతారావు ప్రదర్శించిన నేర్పు శ్లాఘనీయమైనది.

"సంపంగి" నవలలోని సంపంగి, నరహరి ప్రియురాలు. ఆ ఇరువురు వివాహితులు. నరహరి భార్య సుందరమ్మ.

సంపంగి భర్త పరదేశి. వారు అమాయకులు. మంచి వారు. వారికి ద్రోహముచేసి యథేచ్ఛగా సంచరించుచున్న ఈ ప్రేమికులపట్ల, సానుభూతిని గనబరచుట యెంత మంచి వారికైనను సాధ్యముకాదు. అయినను రచయిత వారి పట్ల కాను సానుభూతిని గనబరచుటయేగాక, ఇతరులు గూడ సానుభూతితో ప్రవర్తించునట్లు కథను మలచిన తీరు శ్లాఘనీయమైనది.

నరహరి వ్యవహార్త. తనను దేవునికన్న మిన్నగా భావించి ఆరాధించిన "సంపంగి" పట్ల అతనికిగల చులకన భావమును, గమనించినచో అతని మనస్తత్వము అర్థమగును. చూడండి – "తన భార్య ఈ తృణీకారం వల్ల సంపంగిలా తయారైతే – సంఘంలో తను తలఎత్తుకో తిరగ్గలడా?" (56 వ. పేజి). తనతో జీవయాత్ర సాగించుచు, తన ఇష్టా నిష్టములకు తలవొగ్గి తిరుగుచున్న సంపంగిని హృదయమిచ్చి ప్రేమించలేని వ్యక్తి అతడు – ఇక – సంపంగి కులటయైనను కాను మనసార ప్రేమించిన వ్యక్తికి, తన సర్వస్వమును అర్పించిన తీరు గమనించినచో, స్త్రీజాతికి పురుషులపట్ల గల సహజ ప్రేమ, ఆర్ద్రమైన మనస్సు, త్యాగశీలత వ్యక్తమగును. ఇది ఈ నవలకు ప్రాణతుల్యము.

"సుగుణ" ఒక నవలిక. విద్యావతి, గుణవతి యైన "సుగుణ" తనను ప్రేమించగల వ్యక్తిని వివాహమాడి. తన వ్యక్తిత్వమునకు, ఇష్టానిష్టములకు అనుకూలముగా

అతనిని మార్చిన సంఘటనయే ఇందలి ప్రధాన విషయము. స్త్రీ వ్యక్తిత్వ వికాసము ఉమ్మడి కుటుంబ వ్యవస్థను సమర్థించునట్టి మరొక నవలిక "అన్నపూర్ణ".

1955 వ. సం. ఆంధ్ర వారపత్రికలో "సామాన్య కుటుంబజీవితము" అను పేరుతో నిర్వహింపబడిన నవలల పోటీలో శ్రీ పోతుకూచి సాంబశివరావు "ఉదయకిరణాలు" నవలకు ప్రథమ బహుమతి లభించినది. నడిమి తరగతి ప్రజలు ప్రైసందిన జీవితములో అనుదినము ఎదుర్కొనుచున్న ఆర్థిక చిక్కులను, మారుచున్న కాలమును గుర్తించలేక, సంప్రదాయములు, కట్టుబాట్లు, ఆచార వ్యవహారముల పేరుతో బలియైపోవుచున్న పరిస్థితులను సమర్థతో ఆయన దీనిలో వర్ణించి చూపెను.

కార్యశీలి, భారీబుద్ధిగల అవధాని, తన భావనసింహం దుష్ట సహవాసములతో తాగుబోతై, జూదరియై ఇల్లుపట్టక తిరుగుచున్నప్పుడు, సహాయపడుటయేగాక, అతని హటాన్మరణముతో, ఆ కుటుంబ పరిస్థితులు కారుమారై పోయినప్పుడు సర్వవిధముల తోడ్పడి, వారి అభివృద్ధికి అతడు పల్చిన కృషియే "ఉదయకిరణాలు" లోని ప్రధాన ఇతివృత్తము. ఆ కుటుంబమును దరిజేర్చుటకు తోడ్పడిన మరియొక నిస్వార్థపరురాలు రాధమ్మ. చిట్టిబాబు మరణముతో ఆమెకు మతి చలించి పరివర్తించిన తీరు హృదయమున్న ప్రతి వ్యక్తిని కదిలించి తీరును.

ప్రకాశం యువతరమునకు, నవతరమునకు ఆశా జ్యోతి. తన స్థితిని, కుటుంబస్థితిని ఆకళింపు చేసికొని ప్రవర్తించిన ధీరుడు. తన అభివృద్ధిని చూచి ఈర్ష్యపడిన మేనమామ పరంధామయ్య కూతురు చేమంతి వితంతువై నప్పుడు, ఆమెపట్ల జాలి గనబరచి ఆమెను వివాహమాడి అందరిని సంభ్రమాశ్చర్యములలో ఉంచి చిక్కిరి చేసిన ప్రగతిశీలియైన మానవతావాది. సోమయాజులు, శీతమ్మలు నరరూప రాక్షసులు. వారి గారాబముతో రామలింగశర్మ సర్వవిధముల భ్రష్టుడై చరించిన అవివేకి. చిట్టిబాబునకుగల పరోపకారచింతన, స్నేహశీలత్వము నవలకు అలంకార ప్రాయమైనను, అతని అకాల విషాద మరణము పఠితల హృదయమును ద్రవింపజేయును. పూబంతి, సాంబుల ఆదర్శ ప్రేమ, రామలింగశర్మతో ఆమెకు జరిగిన వివాహము, దాని విచ్ఛిత్తి, పూబంతి ఈ లోకమునకు ఇచ్చిన కడపటి వీడ్కోలు సందేశము; సాంబు గాడితప్పిన విరక్తి జీవితము కాత్విక చింతన, వైరాగ్య పరివర్తన ఈ నవలలో చక్కగా చిత్రించబడినవి. నరసింహం భార్య "మాణిక్యం" ఉత్తమ ఆదర్శ గృహిణి. శ్రీ పోతుకూచి హృదయసాగరమునుండి వేరొక రూపమున వెలువడిన ప్రతిబింబమే "అవధాని".

విభిన్న మనస్తత్వములతో నిండిన పాత్రల సహజ మనోభావములను, అతి వాస్తవ దృక్పథముతో వ్యక్తీకరించునట్టి నవల "ఉదయకిరణాలు".

శ్రీ పోతుకూచి మరియొక మంచి నవల "అన్వేషణ". ఇది తెలుఁగు భాషాసమితివారి ప్రథమ బహుమతి నందు కొనినది. నియత సిద్ధాంతములను, మానసిక ఉద్వేగము లను, పాత్రల భిన్నగతులకు అనుగుణముగా చిత్రించి, కథా కథన విధానములో వినూతన మార్గమును దీనిలో చూపిం చెను. నవల ప్రారంభించినప్పటినుండి, ముగియునంతవరకు రచనలో ఒక విధమైన తపన, ఆవేదన అంతర్లీనమై గోచ రించి, హృదయములలో ఉత్కంఠను రేపి, చదివించునట్లు చేయు నేర్పు రచయితకు పుష్కళముగా నున్నట్లు సాక్ష్య మిచ్చును. వేశ్యాగృహముల వాతావరణమును, నాటక సమాజముల స్థితిగతులను దీనిలో చక్కగా వివరించెను. ప్రతి వ్యక్తి జీవితములో తెలిసియో, తెలియకయో తప్పు చేయుననియు, దానిని సవరించుకొని బాగుపడుటకు అవకాశ మును కలిగించుట ముఖ్యమనియు, శ్రీ పోతుకూచి నవలలో సందేశరూపమున అందించెను.

మన నవలాకారులలో శరత్ ప్రభావముతో రచ నలు చేసిన వారిలో శ్రీ కొమ్మూరి వేణుగోపాలరావు ప్రము ఖుడు. ఆ ప్రభావముతో వెలువడిన తొలి నవలలు పిల్ల దొంగ, పెంకుటిల్లు, చిన్నక్క మొదలైనవి. మధ్య తర గతి ప్రజల దైనందిన జీవితపు వెలుఁగునీడలను ఇతివృత్తము లుగ మలచి 1956-57 సంవత్సరములలో పై నవలలు వ్రాసి రచయితగా స్థిరపడిన ఆయన, హౌస్ సర్జన్, హారతి, ఒకే

పాటకు రెండు రాగాలు, వ్యక్తిశ్వంలేని మనిషి మొదలైన నవలలు వ్రాసి తాను లోగడ గడించిన ఖ్యాతిని స్థిరపఱచు కొనెను. వృత్తిచేత శ్రీ కొమ్మూరి డాక్టరైనను సాహిత్య పిపాసతో పెక్కు కథలు, నవలలు వ్రాసి తెలుఁగు సాహిత్య మును శోభావంతమొనరించిన ఇతరులతో తానును భాగ స్వామి యగుట హర్షించదగిన విషయము.

వైద్యవృత్తిని చేయువారు రోగులపట్ల చూపవలసిన దయా దాక్షిణ్యములోను, రోగ నిధానము చేయుటలో'ను, మందుల వాడకములోను, కనబరచవలసిన శ్రద్ధాసక్తులను విడనాడి విధి నిర్వహణములో ఏమరుపాటుతో ప్రవర్తించి నప్పుడు సంభవించు హానిని "హూ ఈజ్ సర్జన్" నవలలో శ్రీ కొమ్మూరి వివరించెను. ఇది వైద్యవృత్తికి సంబంధించిన లోతుపాతులను తెలుపు నవల. సాంకేతిక సంబంధమైన పద జాలముతో, విపిధ రోగముల పేర్లతో, చదువరులకు కొంత విసుగు కలిగించినను, ఆ వృత్తికి సంబంధించిన మర్మములు కొన్ని దీనివలన తెలియగలవు.

డాక్టర్ మధుకరరావు హూ ఈజ్ సర్జన్ని చేయుచున్న అవివాహితుడు. వృత్తిపట్ల మంచి అభినివేశము కలిగి సేవా భావముతో ఆ ధర్మమును నిర్వహించుచున్న ఆదర్శ యువ కుడు. అతని చుట్టు ఎన్నియో పాత్రలు తిరిగినను, అతని అభిమానమునకు పాత్రమైనది 'నళిని' అను నర్సు, 'మృదుల' అను హౌస్ సర్జన్. వారిద్దరి మధ్యన వాదు.

డాక్టర్ మధు తన అనుభవములను ఈ నవలలో ఉత్తమ పురుషలో చెప్పి కథను వివరించెను.

మధు, మృదుల, నళిని పాత్రలను పోషించుటలో రచయిత మరింత శ్రద్ధ కనబరచినచో, నవల మరింత సజీవ సంపన్నమై, చదువరులను మిక్కిలి ఆకర్షించియుండెడిది.

ఒక కైలు ప్రమాదములో అత్త "సుశీల", కోడలు "హరిలీల" మరణించగా, తండ్రి, కొడుకులైన ఆదిశేషయ్య, శ్రీధర్‌లు పొందిన వియోగ దుఃఖపు పర్యవసానమే 'హారతి' నవల ఇతివృత్తము. తండ్రీ పేకాటకు, కొడుకు క్రికెట్‌కు దాసులై ఇల్లు పట్టక తిరుగుచున్నప్పుడు "హారతి" అను యువతి హఠాత్తుగా ఆ ఇంటిలో ప్రవేశించి, మనుమడు "చిట్టిబాబు" ను ఆకర్షించి, మాతృభావముతో అక్కడ స్థిరపడిపోయి, ఎట్టి ఉపన్యాసములు చేయకయే, తన సత్ప్రవర్తనతో తండ్రి, కొమారులను వారి వారి దుర్వ్యసనముల నుండి కాపాడిన విజ్ఞురాలు.

"హారతి" నవలలో తెలుగు వాతావరణము కృతిమముగా గోచరించును. శ్రీ శరత్ తన రచనలలో "స్త్రీ" ని మలచినట్లు "హారతి" ని మలచుటకు ప్రయత్నించి శ్రీ కొమ్మూరి విఫలుడయ్యెను. శ్రీధర్ కాగుడు మైకములో ఒక నర్తకితో జరిపిన సంభాషణ దేవదాసు నవలలోని కాగుడు ఘట్టమును గుర్తుకు తెచ్చి, "ఎబ్బెట్టు"గా నొనరించి, సహజత్వము లోపించునట్లు చేసినది. ఒక్కమాటలో

చెప్పినచో అది ఆంధ్ర సామాజిక వ్యవస్థను అంతగా ప్రతిబింబించుట లేదు.

పేరింది పెళ్ళిచేసుకున్న "శివరాం-కమల" ల విచిత్ర దాంపత్యము, కళ్యాణి ఆ జీవితములో రేపిన కల్లోలము "ఒకే పాటకు రెండు రాగాలు" అన్న నవలలో అతి విచిత్రముగా కనుపించును. ఈ నవలలో శివరాం ఒక తాగుబోతును, తన భార్యయైన కమలను మానభంగము చేయవలసినదని ఉసిగొలిపి పంపెను. ఇది అసహజముగను, కృతిమముగను ఉన్నది,

"వ్యక్తిత్వములేని మనిషి" నవలలో చిత్ర విచిత్రమైన మనస్తత్వముగల వ్యక్తులెందరో కనుపింతురు. వారిలో మృత్యుంజయరావు అల్పత్వము, అతని అంతరములో చెలరేగిన భావ సంఘర్షణలు ఎంతయో సహజముగా నుండి, ఆ వ్యక్తి కలకాలము పఠితల మనస్సులో నిలచిపోవును. ఇది ఒక ఉత్తమశ్రేణి నవల.

మానవ మస్తిష్కములో చెలరేగిన వివిధ భావ ఘంజములను సూక్ష్మదృష్టితో విశ్లేషించి వానికి చక్కని అక్షర రూపము నివ్వగల నేర్పుతో చేయితిరిగి రచనలుచేసిన శ్రీ కొమ్మూరి "శరత్ మార్కు" నవలల సృష్టినుండి విడివడి ఇంకను శక్తివంతము, రసవంతము నైన స్వతంత్ర ప్రతిపత్తి గల రచనలను తెలుఁగు పాఠకులకు అందించినయెడల బాగుగా నుండును.

"యుగసంధి" - "వింతపరిణయము" నవలలతో తెలుఁగు నవలా సాహిత్యమున చోటు చిక్కించుకొనిన శ్రీ భాస్కరభట్ల కృష్ణారావు ప్రాచ్య పాశ్చాత్య ఆధ్యాత్మిక, తాత్విక భావ సమన్వయముతో "వెల్లువలో పూచికపుల్లలు" అను ఉన్నతశ్రేణి మానో వైజ్ఞానిక నవలను 1960 సం. లో ప్రచురించెను.

"చివరకు మిగిలేది" నవలలోని దయానిధి తల్లి శీలమును శంకించి, సంఘమునకు దూరమై ఏకాంత జీవితము వెళ్ళబుచ్చినను, ఆమెపట్ల అపారమైన గౌరవము. ఆమెను గురించి చులకనచేసి యెవరు మాట్లాడినను సహించలేక విలవిలలాడిపోయెను. "అల్పజీవి" నవలలోని సుబ్బయ్యను భయము, తక్కువతనము అను రెండు అవగుణములు అన మర్దునిగామార్చినవి. కించిద్భేదములో ఈ రెండు నవలల చిత్తవృత్తుల సమాహారమే "వెల్లువలో పూచికపుల్లలు" నవల. కథానాయకుడైన మధుసూదనరావు తన తల్లి వరలక్ష్మమ్మకు, గ్రామ పెద్దయైన రంగనాయకులకు మధ్య అక్రమ సంబంధమున్నట్లు ఆనోట ఆనోట విని వారి ప్రవర్తననుబట్టి ధృవపరచుకొని, ఆమె శీలముపట్ల, నడవడిపట్ల ద్వేషము కలుగగా, సంఘమునుండి వేరై తన జీవితము ఆమె వలన అపహాస్యముపాలై పోవుచున్నట్లు తలచి, ఒక విధమైన భయము, తక్కువతనము, సంకుచిత మనస్తత్వముతో ప్రవర్తించి, తన స్వగ్రామమునకు కూడ వెళ్ళక, హైదరాబాదు

లోని ఉస్మానియా విశ్వవిద్యాలయములో ఎం. ఏ; పరీక్షకు చదువుచుండెను. మధు, రామచంద్రయ్య తోడ్పాటుతో పల్లెర్ల గ్రామ జాగీర్దారైన ఉమామహేశ్వరావు గృహములో కిశోరు అను బాలునికి ట్యూషను చెప్పుచు, ఆ ఇంటిలోగల కుసుమ, నళిని అను యువతులలో ప్రపథమమున కుసుమను పేమించి, ఆ వెనుక వివాహమాడుటకు అంగీకరించి, స్వేచ్ఛగా పర్యటించి, ఒకనాడు గాఢాలింగనముచేసికొను చున్నప్పుడు ఆమె రెండు చేతులకు ఉన్న గాజులు ఒకేసారి చిట్లిపోవుట, నుదిటిపైనున్న కుంకుమ చెరిగిపోవుటతో, అది అపశకునముగా భావించి అతడు తన నిర్ణయమును మార్చు కొనెను. ఇంతలో నళిని తల్లి రాములమ్మ మరణించగా దుఃఖములోనున్న ఆమెను ఓదార్చుటకై ఇంటిలోపలికి పోయి, ఆమె మనస్సును వశపరచుకొని మధు వివాహమాడెను. ఈ నూతన పరిణామమును గమనించిన కుసుమ హృదయము దెబ్బతిని, మతిభ్రమణము ఏర్పడినది. నళిని, మధుల వైవాహిక జీవితము సుఖముగా గడచిపోవుచున్నను, ఆమె రెండవ సారి గర్భముధరించి ప్రసవ సమయమున మరణించుటతో కథ విషాదాంతమైనది.

దీనిలో ఉమామహేశ్వరరావు భోగజీవితము, రామ చంద్రయ్య సంకుచిత స్వార్థపరత్వము, కనకాంగి ప్రలోభ త్వము, రాములమ్మ వ్యవహారదక్షత, కుసుమ విచిత్ర ప్రవృత్తి రచయిత చక్కగా అభివర్ణించెను.

"వెల్లువలో పూచికపుల్ల" వలె కొందరు అల్పజీవులు, దుర్బలులు జీవితములో సంభవించు పరిస్థితుల ప్రభావమునకు తట్టుకొనలేక, ప్రవాహ వేగములో తమ గమనదిశను సైతము గుర్తించలేక పర్యవసించు కొన్ని దురదృష్టజీవుల విచిత్ర చిత్తవృత్తులను శ్రీ భాస్కరభట్ల ఇందులో కన్ను లకు గట్టుగనట్లు చూపెను. యువతీ యువకుల స్వేచ్ఛా విహారములు, వర్ణాంతర వివాహములు, హైదరాబాదు నగర మందలి వివిధ సుందర దృశ్యములు వర్ణించబడినవి.

తల్లి మరణించిన దుఃఖముతో కృంగిపోవుచున్ననళిని, అదేరోజు మధుతో జరిపిన ప్రేమయాత్ర సహజ మానవ ప్రకృతికి, భిన్నముగానున్నది. రచయిత దీనిని మరొక సమయమున చూపినచో నవల మరింత నిండుదనముతో శోభించెడిది.

శ్రీ. మంజుశ్రీ తన లోకానుభవములకు, సుందరమైన ఆకృతిని కల్పించి రచనలుచేసిన లేఖనీ సంపన్నుడు. గ్రామీణ సమస్యలను, భిన్న మనస్తత్వముగల పాత్రలను వైవిధ్యరీతిలో సృష్టించి 1958 వ. సంవత్సరమునుండి జారుడు మెట్లు, జీవిత వలయాలు, ఋణానుబంధం, నూరు శరత్తులవంటి పెక్కు నవలను వ్రాసెను.

మంజుశ్రీ "నూరు శరత్తులు" నవలలోని లక్ష్మీపురం అగ్రహారము పాతసంప్రదాయములను వదలలేక, కొత్త వానిని ఆహ్వానించలేక సంధిగ్ధస్థితిలో పడిన పల్లెటూరు. ఈ

నవలలో లక్ష్మీపురముతోపాటు గుంటూరు. మద్రాసు, శ్రీరంగం, హైదరాబాదు మున్నగు పట్టణముల ప్రసక్తి వచ్చినను, ప్రధానముగా కథ అగ్రహారము నాశ్రయించియే సాగినది. దీనిలో ప్రధాన భూమిక గోపాలాచారి. అతనికి ప్రత్యర్థి గాఁగ మునసబు రామిరెడ్డి. ఆచారి పతనమునకు ఆర్థిక దుస్థితికి రెడ్డియే కారకుడు.

ఆచారికి ముగ్గురు కొడుకులు. పెద్దవాడు స్వాతంత్ర్య యోధుడు. ఇల్లుపట్టక తిరుగుచుండెను. రెండవవాడు విదేశములలో చదువుకొని అక్కడనే స్థిరపడిన డాక్టరు. మూడవవాడు ఘోర్తుహారముతో విద్య ముగించి శ్రీరంగము చేరెను. దీనితో ఆచారి మరీ చితికిపోయెను.

నవలా కాలమునకు రామిరెడ్డి కొడుకు చిన్నపురెడ్డికి జబ్బుచేయుటవలన అతడు మానోవ్యాధికి లోనై కుమారుని ఆస్పత్రిలో చేర్పించెను. కుమారునికి వైద్యము జరుగుచున్నప్పుడు రామిరెడ్డి తన భార్యపైన గనబరచిన ప్రేమాభిమానములు ఏకొలతబద్దకు అందనివి. రచయిత తనకు స్త్రీలపట్ల గల అభిమానమును, తన ఇతర రచనలన్నిటిలో వలెనే దీని లోను "రామిరెడ్డి" పాత్రద్వారా వ్యక్తముచేసెను. దయ-ప్రకాశరావుల ప్రేమకలాపములు నవలకు ఒక నూతనత్వమును కలిగించినవి. ముఖ్యముగా "దయ" పాత్ర చిత్రణములో స్త్రీ మనస్తత్వమును రచయిత దక్షతతో వ్యక్తీకరించెను.

మంజుశ్రీ ఈ నవలలో ఒక పాత్రతో వేరొకపాత్రకు ఎట్టి సాదృశ్యము లేకుండునట్లు పెక్కు పాత్రలను కల్పించిన తీరు ప్రశంసనీయమైనది. కాని వస్తైక్యము కొంత కొర వడినది. గోపాలాచారి రెండవ, మూడవ కుమారుల కథ ప్రధాన ఇతివృత్తమునకు అంత పుష్టినిచ్చుటలేదు. నవలా కాలమున మనకు కనపడు రామిరెడ్డికి అతని పూర్వచరిత్రకు బొంతన ఋదురుటలేదు. ఒకప్పుడు కూళగాడైనను ప్రస్తు తము అతని స్వభావము తద్భిన్నముగానున్నది. అయినను పల్లెపట్టుల యదార్థజీవనమును విశదీకరించునట్టి నవలలలో "నూఱు శరత్తులు" ఎన్నదగిన మంచి నవల.

ఎట్టి డొంకతిరుగుడులేక అరటిపండు వొలిచి చేతిలో పెట్టినట్లు ఒడుపుతో కథను చెప్పగల సమర్థులైన కొద్దిమంది తెలుఁగు రచయితలలో శ్రీ అకుండి నారాయణమూర్తి ఒకడు. ఆయన ప్రసక్తి వచ్చిన వెంటనే 1953 వ. సం. భారతిలో ప్రచురితమైన మళ్ళీ పెళ్ళి, చిట్టిబాబు, భయం, బాబు మున్నగు కథలు గుర్తుకు రావడము సహజము. ఆ తరపు యువతీ యువకుల హృదయములను అవి మిక్కిలి ఉత్తేజితుల నొనరించినవి. శ్రీ అకుండి లేఖినినుండి వెలు వడిన "విశ్వనాథం" నవల చదివినయెడల ఆది సత్యమని తెలియగలదు. "విశ్వనాథం" అను పేరుగల యువకుడు దీనిలో కథానాయకుడు. అతడు తనకు జీవితములో అవసర మైన వస్తువులేవియో తెలిసివుండియు, పైటపెట్టక తనలో

పాటు, ఇద్దరు ముగ్గురు యువతుల జీవితములను అయో మయము చేసిన విచిత్ర సంఘటనయే ఈ నవల. ఇందలి విశ్వనాథం, రాధ పాత్రలను రచయిత యెంతయో వైవిధ్య విలసితమొనరించి, మనకందించెను.

చెప్పదలచిన విషయములను వాస్తవిక జీవితమునకు చేరువగా నుండునట్లు శ్రద్ధవహించి, మధ్యమ తరగతి కుటుంబముల స్థితిగతులను సమర్థనీయముగా నిర్దేశించి వివరించగల నేర్పు శ్రీ పురాణం సూర్యప్రకాశశాస్త్రికి కలదు. 1960 వ. సం. ఆంధ్ర వారపత్రికలో ఆయన వ్రాసిన "జీవనగంగ" ధారావాహికముగా వెలువడి, 1961 వ. సం. లో గ్రంథరూపమున వచ్చినది. దీనిలో వయస్సు మళ్ళినవారి వివాహములను, పేరు ప్రతిష్ఠలకొరకు తమ అంతస్తులకు మించి ధనము వెచ్చించిన గంగాధరం, మధుసూదనం వంటి నడిమి తరగతి కుటుంబీకుల జీవన సరళిని భాగుగా ఆయన వివరించెను. కుటుంబ నిర్వహణమున బాధ్యతలను గుర్తించి ప్రవర్తించవలసిన పురుషులు తద్భిన్నముగా వ్యవహరించిన యెడల ఆ కుటుంబములలోని స్త్రీలు ఎదుర్కొను పలు చిక్కులను రచయిత దీనిలో చక్కగా వివరించెను. స్త్రీ పురుషు లిరువురు చదివి తెలిసికొనవలసిన విషయములు దీనిలో చాల వున్నవి.

మారుచున్న కాలమును, అంతకన్న వేగముగ మారుచున్న మనుష్య ప్రవృత్తులను, మార్పు గిట్టక

అవిభక్త కుటుంబముల సాధ్యతను నెత్తిన వేసికొని నిరంత రము ఏటికి ఎదురీదిన పరస్వతమ్మ విచిత్ర మనస్తత్వమును వ్యక్తీకరించునట్టి నవల శ్రీ పురాణం వ్రాసిన "మా రే మను షులు" అనునది. ఇందులో కాల తీవ్రతను, మారుచున్న విలువలను గుర్తించి తదనుగుణముగా భార్యను నడచుకొను నట్లు చేయుటకు యత్నించి విఫలుడైన ధర్మారావును, పరస్వ తమ్మ సీడలో ఉన్నతిని పొందిన వేంకటాచియుడు, కృష్ణ మొదలైన పాత్రలను రచయిత ప్రతిభాతంరముగా చిత్రిం చెను. కృష్ణ, అనూరాధల భగ్న ప్రేమ హృదయమును ద్రవింపజేయును.

పురాణం వ్రాసిన వేరొక నవల "కాగితపు పల్లకి". దీనిలో చలపతి తనను అన్నివిధముల ఆదరించి ప్రేమించిన ఎల్లమ్మను అన్న ప్రోద్బలముతో వదలిపెట్టి రాధమ్మను వివాహమాడెను. వంచింపబడిన ఎల్లమ్మ తీర్థయాత్రలకు వెళ్ళినది. రాధమ్మ క్షయవ్యాధికి గురియై బాధపడినప్పుడు చలపతి ఆమెను అధికముగా ప్రేమించి వైద్యము చేయించు చున్నప్పుడు, విశాఖపట్టణములో "రాజారాంతో" స్నేహము కలిసి, ఎల్లమ్మ అతని సోదరి అని తెలిసికొనెను. తన తండ్రి వలన పతనమైన ఎల్లమ్మతల్లిపై నగల జాలితో ఆమెకు పగము అస్తి వ్రాసి, దీనికి సంరక్షకుడుగా చలపతిని నియ మించగా రాధమ్మ కోపముతో పుట్టినింటికి పోయినది. ఎల్లమ్మ మరణవార్త వినిన చలపతి మంచముపట్టి బాధపడు

చున్నట్లు తెలిసి రాధమ్మ తిరిగి వచ్చుటతో కథ ముగిసినది. ఈ నవల ముగింపు, పాత్రలను పోషించిన విధము, శ్రీ పురాణం దక్షతకు తగిన స్థాయిలో లేదు.

తెలుఁగులో హాస్యము పేరొత్తిన వెంటనే శ్రీయుతులు మొక్కపాటి, భమిడిపాటి, ముని మాణ్యం, ముళ్ళపూడి వేంకటరమణుల పేరులు వెంటనే స్ఫురించును. వీరిలో శ్రీ వేంకటరమణ శబ్ద, అర్థ ధ్వనిగతమైన హాస్యముతో, సాంఘిక, సాంసారిక రచనలతోపాటు, అతి క్లిష్టమైన రాజకీయ సమస్యలనుసైతము అలతి అలతి పదములతో, చాకచక్యముగను, చమత్కార జనకముగను, వ్యంగ్యస్ఫోరకముగను, భాసించు రీతిలో కథలు, నవలలు వ్రాసి "ముళ్ళపూడి మార్కు సంభాషణలు" అన్న పేరును దేశము నలుమూలల స్థిరపరచుకొనిన లబ్ధ ప్రతిష్ఠుడు. ఈయన "ఋణానందలహరి" నవల యందలి ప్రతి వాక్యము కడుపుబ్బ నవ్వించుచు, మంచి హాస్య రస స్ఫూర్తిని కలిగించి గిలిగింతలు పెట్టును. "అబద్ధాలకు మనిషే కావాలేమిటి? మా ఆడంగులు చాలరూ - మొగనాగుల కోరలు పీకేశారు కాబోసు సుబ్బన్నకి పాపం" అన్న కాకమ్మ మాటలు మిక్కిలి భావగర్భితముగను, జాలిగొలుపు నట్టివిగను వుండి పాఠకుల హృదయములలో స్థిరముగా గూడు కట్టుకొని నిలచిపోగలవు. నాగలక్ష్మి, సుబ్బన్న, కాకమ్మ మున్నగువారందరు, మానవసహజమైన ఋణము చేయునట్టి గుణమును ప్రోత్సహించిన విచిత్ర పద్ధతి ఇందు హృదయంగమముగా చెప్పబడినది.

ఈయన వ్రాసిన మరియొక మంచి నవల "ఇద్దరు అమ్మాయిలు – ముగ్గురబ్బాయిలు". ఇందలి ప్రధాన ఇతివృత్తము, సామాన్యమైన పేరుకు సంబంధించినదే యైనను, కథను చెప్పిన విధము, సంభాషణలు నడిపిన పద్ధతి, సంఘటనలను కల్పించిన శక్తి, ప్రతి మాటలోను గంభీరమైన భావములను ఇమిడ్చి; ఆయా పాత్రలు నాటకములలోవలె మన ముందు ప్రదర్శింపజేసి, విజ్ఞాన వినోదములను, నేర్పు తో పఠితలకందించెను. ఆధునికులలో తెలుగు హాస్యరసావిష్కరణ చేసిన వారిలో శ్రీ వేంకటగమణ ప్రముఖుడు.

కుంటి, గుడ్డి, చెవిటి, మూగ, నంగి, నత్తి మున్నగు వికలాంగుల మానసిక స్థితిగతులను, వారి విభిన్న సమస్యలను శాస్త్రీయదృక్పథముతో, సదవగాహనతో, సానుభూతితో పరిశీలించి రచనలు చేసిన కొద్దిమంది రచయితలలో శ్రీ శ్రీరంతి కృష్ణమూర్తి ఒకడు. ఆయన వ్రాసిన "మూగ భార్య" నవల 1958 వ. సం. లో వెలువడినది. ఇది మూగజీవుల మనోవేదనను, హృదయగత ఆక్రందనను, వివరించును.

మానసిక శాస్త్ర దృక్పథము, తాత్విక, ఆధ్యాత్మిక చింతన కలిగి, సంసారపక్షమైన గ్రామీణ జీవితమునకు ప్రాధాన్యతనిచ్చి, చిన్న చిన్న మాటలతో విపులార్థమును ఇవ్వగల నవలలు వ్రాసిన ప్రగతిశీలక రచయిత శ్రీ కందుకూరి లింగరాజు. 1959 వ. సం. ఆంధ్ర పచిత్ర వారపత్రిక 'స్వర్ణోత్సవ' ముల సందర్భమున "గత యాభై ఏళ్ళ ఆంధ్ర

రాజకీయ, సాంఘిక పరిణామాలను ప్రతిపదిక" చేసి వ్రాసిన నవలకు బహుమతి విచ్చుటకు నిర్ణయించిరి. శ్రీ కందుకూరి "స మ ర్ప ణ" నవలకు ఆ బహుమతి లభించినది. దీనిలో సహజ సంపదకు నిలయమైన గోనసీమయందలి ఒక అగ్రహార మును ప్రతిపదిక చేసి, సోమయాజులు అను మార్పు గిట్టని అహితాగ్నిని సృష్టించి, ఆయన ఆలోచనలకు, ఆశయము లకు భిన్నముగా ఆయన కుటుంబములో చెలరేగిన విప్లవము లను, ఆయన మాటకు తిరుగులేని ఆ అగ్రహారములో చెలరే గిన తిరుగుబాటులను చూపి, కాలము ఎంతటి శక్తివంతుల నైనను మార్చగలదని ఆ ప్రవాహగతికి ఎదురొడ్డి నిలుచుట మూర్ఖుల లక్షణమని నిరూపించెను. శారదా చట్టము, వితంతు వివాహములు, హరిజన సమస్య, ఆంగ్ల విద్య, స్వాతంత్ర్య పోరాటమువంటి సమస్యలు మన మూఢ విశ్వా సములను, ఆచార వ్యవహారములను మార్చి ఆంధ్రదేశ ప్రజా జీవనరంగములో తెచ్చిన విలక్షణమైన మార్పులను ఇందు వర్ణించెను. "కాను ఈ అగ్నిజ్వాలలమధ్య మూల విరాట్టు కావలసి వచ్చిం" దని అనుకుంటాడు మార్పు ను ఏమాత్రము సహించలేని యాజులు. "ఈ మూఢ విశ్వాస మున్నది వంశానికి రాచకురుపులా తయారైంది" అని అను కుంటాడు మార్పును గుర్తించిన యాజులు కొడుకు అవధాని.

శ్రీ లింగరాజు మరొక నవల "మనం మిగిలేం". దీనికి ఆంధ్రప్రభ వారపత్రిక 1963-64 సం. నిర్వహించిన ఉగాది

నవలల పోటీలో ప్రథమ బహుమతి లభించినది. శ్రీ విశ్వనాథ "పునర్జన్మ" నవలలో వలెనే, ఇదియు పునర్జన్మ సిద్ధాంతమును ప్రతిపాదించును. ఆ నవలలో భార్య చిన్నది, భర్త వయస్సున్నవాడు. కాగా దీనిలో భార్య పెద్దది. భర్త చిన్నవాడు. భర్త నిరోగి, భార్య వైదీక కుటుంబమునకు చెందినది. ఆ నవలలో ఇరువురు ఒకే శాఖవారు.

అవధాని ఏకైక కొడుకు రామం, 1984 స. సం. లో. మరణించి, మరల స్థితిపరుడైన రామచంద్రయ్య ఇంటిలో రాజుగా జన్మించి, తనను ప్రాణముకన్న అధికముగా చూచిన తల్లి మరణముతో, తన వివాహమునకై నిర్దేశింపబడిన అపురూప లావణ్యవతియైన "రుక్మిణిని", తనను భర్తను చేసికొనుటకు సంకల్పించిన సుందరాంగియైన "సత్య" ను నిరాకరించి, తాత్విక జిజ్ఞాసతో దేశదిమ్మరియై నిలకడలేని జీవితము గడిపి, నిరంతర అన్వేషణతో, నిర్లిప్తుడై తన పూర్వపు తల్లిదండ్రులను, భార్య "శాంత" ను అన్వేషించిన కథ ఈ నవల. కుమిలింపు, లొకాయింపు, నిరుకు, రువ్వు, రుంజు వంటి మారుమూల శబ్దములు తరచుగా చిత్ర విచిత్ర రీతులలో వాడి, గభీరమైన అర్థములు వచ్చునట్లు చేసిన విధము ప్రశంసనీయమైనది. ఇందలి పాత్రలన్నియు సజీవ సంపన్నములై ప్రవర్తించి, ప్రధాన పాత్రయైన "రాజు" చుట్టు పరిభ్రమించి, దాని వికాసమునకు తోడ్పడినవి.

అనుక్షణము మారుచున్న కాలముతోపాటు, మారు

చున్న పరిస్థితులను అవగాహన చేసికొని తనకు కలిగిన అనుభూతుల ప్రేరణములో, ఆలోచనలను రేకెత్తించి, విజ్ఞాన సంపత్తిని సమకూర్చి మేధస్సునకు పనికల్పించగల మంచి నవలలు వ్రాసిన ప్రముఖులైన ఒకరిద్దరు ఆధునిక నవలా రచయితలలో శ్రీ ఆర్. యస్. సుదర్శనం ఒకడు. 1958 సం. నుండి ఆయన విమర్శకుడుగను, కథకుడుగను, నవలాకర్తగను తెలుఁగునాట విఖ్యాతుడై, పాశ్చాత్య రచనా రీతులలోని అనుకరణను నంభవించుచున్న పెక్కు మార్పులను మానసిక శాస్త్ర దృక్పథములో విమర్శనాత్మకముగా పరిశీలించి ప్రాచ్య సంస్కృతీ సంప్రదాయములకు అనుగుణముగ రచనలు చేసిన మేటి రచయిత.

ఫ్రాయిడ్ మున్నగు పాశ్చాత్య తత్వవేత్తలు ప్రతిపాదించిన స్వాప్నిక సిద్ధాంతములను "మళ్ళీ వసంతం" అను నవలలో ప్రయుక్తమొనరించి సుప్త చైతన్య స్థితిని ఇందులో చక్కగా వివరించెను. డాక్టర్ ఊర్మిళ జీవితములో పన్నిహిత సంబంధము కలిగివున్న భూషణం, మాధవ్, శేఖర్, మొదలైన వ్యక్తుల జ్ఞాపకములు, తత్సంబంధమైన అనుభూతులు, ఆమెకు కలిగిన ఊహాలకు, స్వప్నములకు గల సన్నిహిత సంబంధము, అవి ఒకదానితో మరొకటి పెనవేసికొని నడచిన రీతి రచయిత దీనిలో మెలకువతో వివరించి, ప్రాచ్య, పాశ్చాత్య జగత్తులను రెండింటిని సన్నిహితమొనరించి కృతకృత్యుడయ్యాను.

శ్రీ సుదర్శనం వ్రాసిన "అసురసంధ్య" మరొక ఉత్తమ మనోవైజ్ఞానిక నవల. ఇది భారతి మాసపత్రికలో 1965 వ. సం. జూన్ నెలనుండి అక్టోబరు వరకు ధారావాహికముగా వెలువడి, 1966 వ. సం. లో గ్రంథరూపమున వెలువడినది. 1948 వ. సం. జనవరి 30 వ. తేదీనాటి అసురసంధ్య వేళ మహాత్ముని హత్యతో ప్రారంభమైన ఈ నవల 1962 వ. సం, లో చైనా మనదేశముపైన దురాక్రమణ జరిపినప్పటివరకు గల సుదీర్ఘ కాలాములో భారతదేశమునను, ఆంధ్రదేశమునను ఆర్థిక, రాజకీ, సాంఘిక, వైజ్ఞాని రంగములలో సంభవించిన కల్లోలములను, తత్ఫలితముగా ఉత్పన్నమైన పెక్కు పరిణామములను ఇది వ్యాఖ్యానించును. కథానాయకుడైన శ్రీధర్ గాంధీమహాత్ముని హత్యావార్త విని పరధ్యానముగా బందరు వీధులలో నడచుచుండెను. ఆ వార్త విని వేరొక కుర్రవాడు త్వరత్వరగా ఆదే మార్గము వెంట నడచుచు అతనిని ఢీకొని "గాంధీగారు చచ్చిపోతే స్వారాజ్యం పోదా అండీ_" అన్న ప్రశ్నతో బాహ్యస్మృతి కలిగి, అతని హృదయములో ఒక విధమైన జిజ్ఞాస బయలు దేరినది. తత్ఫలితముగా అతడు జీవిత రణరంగములో అదుగదుగున ఎదుర్కొనిన బాధలతో, అనుభవములతో, అనుభూతులతో, బాహ్య అంతర సంఘర్షణలతో, నిరంతర జిజ్ఞాసతో చైతన్యవంతుడై స్వధర్మమును, వైయక్తిక విలువలను గుర్తించుటకు తోడ్పడిన వివిధ పరిస్థితులను అవగాహన

చేసికొనుటకు పొందిన తపన ఆవేదనల ఫలితముగా నైనా దండయాత్రతో అతనిలో చెలరేగిన వివిధ ప్రశ్నా పరంపర లకు, కలిగిన ఆత్మ విశ్వాసమునకు "స్వరాజ్యం పోదు. నైనా డాడిచేసినా పోదు" అన్న సమాధానమే దీని ఇతివృత్తము.

శ్రీధర్ నడుస్తున్న వ్యవస్థతో సంబంధమును తెంచు కొనలేక, పరిస్థితుల ప్రభావమునకు ఎదురొడ్డి నిలవలేక తనలో తాను సంఘర్షణపడిన సుకుమార హృదయుడు. శీల సంప న్నుడు. ఇక అతని మిత్రుడైన నాగరాజు ఎంతటి ఘటికులనైనను నిమిషములో పలిటీలు కొట్టించగల చతు రుడు. అతని స్నేహితురాండ్రయిన మాయలరా, సిసిలి యాలు, అతనివలెనే జీవితముపట్ల, ఆదర్శములపట్ల నమ్మ కములేక నిర్లక్ష్యభావముతో ప్రవర్తించిన వ్యక్తులు. శ్రీధర్ వారితో స్నేహముచేసి వారివెంట తిరిగినను "నీటికి రాము రాకుకు గల సంబంధము" వలెనే ప్రవర్తించిన సుగుణ సంప న్నుడు. ఇక నవలలో మిగిలిన చంద్రావతి, మంగమ్మ, పద్మావతి, ఓబయ్య, నరసింహులు, రాధ, రుక్మిణమ్మ పాత్రలు నవలకు మంచి పరిపుష్టిని, నిండుదనమును సమకూర్చినవి.

"చంద్రావతి" వంటి మంచి పరోపకార పరాయణను, ఉత్తమ ఆదర్శ ప్రేమమూర్తిని సృష్టించిన శ్రీ సుదర్శనం రచనాశక్తి, ఆలోచనాధోరణి ప్రశ్యేకముగా ప్రశంసింప దగినది. ఇక "పద్మావతి" పాత్ర నవలకు ఒక ప్రత్యేకతను, ప్రాముఖ్యతను కల్పించుచున్నది. నవలలోని స్త్రీ పాత్రలు

సజీవ సంపన్నము లై మనతో ఆత్మీయతను నెరపుచు హృద యంగమముగా నిలచిపోవుచున్నవి.

శ్రీధర్‌లోని నిరంతర జిజ్ఞాసకు, స్వధర్మాన్వేషణకు సానుభూతిని గనబరచి, ధైర్య సాహసములను కలగించి, మార్గమును సుగమము చేసి లక్ష్యసిద్ధిని పొందుటకు తోడ్పడిన మహోన్నత వ్యక్తి ఆత్మానందస్వామి. రచయిత కథానాయకుని పాత్రను నిర్వహించిన విధము శ్లాఘనీయమైనది. ఈ నవలలో ఆంధ్ర, రాయలసీమ ప్రాంత ప్రజల మనోభావములను రచయిత సూక్ష్మ దృష్టితో పరిశీలించి, సమర్థవంతముగా చిత్రించెను. కథను చెప్పటలో, ప్రాతలను ప్రవేశపెట్టి నిర్వహించుటలో, చమత్కారయుక్తమైన సంభాషణలు నడుపుటలో, కథకు పుష్టినిచ్చునట్టి సహజ వర్ణనలు చేయుటలో శ్రీ సుదర్శనం గనబరచిన ప్రౌఢ, చూపిన నేర్పు అసదృశమైనది. నేటి తెలుగు నవలా సాహిత్యములో "అసుర సంధ్య" ఒక విలక్షణమైన సృష్టి.

శ్రీ సింగరాజు లింగమూర్తి వ్రాసిన "అవర్ణాలు - అంతర్వాలు" 1961 వ. సం. ఆంధ్రపత్రిక నిర్వహించిన నవలల పోటీలో ఉత్తమ రచనగా యెన్నిక చేయబడి దానిలో ధారావాహికముగా ప్రచురింపబడి, 1962 సం. లో గ్రంథ రూపము ధరించి అశేష జనాదరణ పొందినది. ఇది తెలంగాణమునందలి రాజకీయ పరిస్థితులను, రజాకార్ల దురంతములను, వివరించునట్టి ఉన్నత శ్రేణి నవల. దానికితోడు ఎన్ని

కలకు ముందు గ్రామములలో పదవులకొరకు మంచిసీళ్ళవలె ధనమును వెదజల్లుచు, విచ్చలవిడిగా సంచరించు వెద్దమను ష్యుల చిత్రవిచిత్రమైన పోకడలు, భయంకరమైన మనస్తత్వ ములు వివరింపబడినవి. నీతికి, నిజాయతీకి దూరుడై పద వులకొరకు ప్రాకులాడిన చలమయ్య, ఆదర్శజీవియైన రాజా రావు, మంచికి మాయపేరై ప్రవర్తించిన పోలాయి పాత్రలను రచయిత దక్షతతో తీర్చిదిద్దిన పద్ధతి శ్లాఘనీయమైనది.

శ్రీ లింగమూర్తి లేఖిని నుండి వెలువడిన మరొక నవల "ఆకర్షణలో అపస్వరాలు." ఇది 1962-63 సంవత్సర ములలో భారతిలో సీరియల్‌గా ప్రచురింపబడి, ఆ పిమ్మట పుస్తకరూపమున వెలువడినది. ఇది మధ్యతరగతి కుటుంబ ములకు చెందిన గుమస్తాల జీవిత పరిస్థితులను, ఆశయములను ఆలోచనలను వివరించును. కథానాయకుడైన దాసు తండ్రి భూషణం నాటకములలో వేషములువేసి కీర్తిప్రతిష్ఠల నార్జించిన కళాతపస్వి. తండ్రివలె గుమస్తాయైన కొడుకు గూడ నాటక కళోద్ధరణకు అహరహము చేసిన కృషి, ఎదుర్కొనిన చిక్కులు, చివరకు అతడు సాధించిన ఘనవిజయము దీనిలో సమర్థవంతముగా చిత్రింపబడినది. ఇందలి కథా సంవిధా నము, పాత్రపోషణము, సంభాషణలు సహజసుందరముగా తీర్చిదిద్దబడినవి.

శ్రీ సింగరాజు వేరొక నవల "రంగులమేడ" పలురక ముల మనస్తత్వములుగల వ్యక్తులు దీనిలో కనుపింతురు.

డాక్టర్ సుందరం గొప్ప మనస్తత్వవేత్త. కార్మికుడు. మానవతావాది. ఆయన విఫల ప్రేమ, ఆదర్శ జీవిత విధాన మును రచయిత నేర్పుతో కుంచె సారించిన తీరు, రంగులను పులిమిన పద్ధతి అద్భుతమైనది.

శ్రీ లింగమూర్తి ఇంకొక నవల "చిగురించిన విలువ". బస్ కండక్టరైన మధు నిజాయితీపరుడై జీవయాత్ర సాగించి, తీరిక వేళలలో చిత్రలేనములద్వారా ధనార్జనచేసి తల్లిని, చెల్లెలిని గుట్టుగా పోషించిన వ్యక్తి. అతనికి శేఖర్ మనోహర్ లాల్ మూడవ భార్య "శోభారాణి" తో స్నేహము కలసి, కొంతకాలము తరువాత ఆ ఇద్దరు విడివడడము సంభవించగా దిగులుతో ఆమె దేహయాత్ర ముగించినది.

"శోభారాణి" పాత్రను అత్యుత్తమముగా చిత్రించి రచయిత పాఠకుల సానుభూతి ఆమెపట్ల ఏర్పడునట్లు వహించిన శిల్పి ప్రశంసనీయమైనది. "చిన్న కుంచెతో పెద్ద బొమ్మలను వేయగలిగిన సామర్థ్యం ఈ రచయితకు సమృద్ధిగా నున్నది-" అని "అదర్శాలూ, అంతర్యాలు" నవలకు వ్రాసిన పరిచయములో శ్రీ గోపీచంద్ వ్రాసిన పై వాక్యమును గమనించినచో శ్రీ సింగరాజుకుల రచనా సామర్థ్యము అవగతమగును.

మనస్సులో గూడుకట్టుకొని పోయివున్న భావములను చాకచక్యముగా వెలికి తీసి నేర్పుతో రూపకల్పనచేసి నవలల నందించవలెనన్న ఆవేదనగల రచయితలలో శ్రీ హరికిషన్

ఒకడు. ఆయన 1960 సం. నుండి పెక్కు నవలలు వ్రాసి బహుమతుల నందుకొనినను, నాలుగు కాలములపాటు జ్ఞాపక ముంచుకొనదగిన మంచి నవల ఆయన లేఖినినుండి ఇంత వరకు వెలువడక పోవడము చిత్రముగానున్నది.

"పన్నీటిజల్లులు" నవలలో నాయకుడైన కాళిదాసు వివాహమాడనని బిట్టుపెట్టుకొన్న వ్యక్తి. పేమించిన స్త్రీని పొందలేనివాడు రాయలు. ఆ ఇరువురి జీవితములు పరస్పర సంబంధము కలిగివున్నవి. రాయలు వివాహమాడిన "సుశీల" యే కాళిదాసు పొందిన స్త్రీగా నవలలో చిత్రిత మైనది. రాయలు ఈపెను వదలివేసి "కాంతం" అను అమ్మాయిని వివాహమాడెను. సుశీల తన స్వప్రతిభతో సినిమాస్టారై గొప్పగా వెలిగి చివరకు తనను అనాదరణ చేసిన భర్తయైన రాయల పాదములవద్ద తీమా భితీను కోరుతూ కన్నుమూసినది. కాళిదాసు చనిపోయెను. ఇదీ కథ. నవలలో విశేషములేదు. పాత్రలు అసహజముగా పరివర్తించి, అసహజముగానే నిష్క్రమించినని. సంఘటనలలోగాని, సంభాషణలలోగాని, వర్ణనలలోగాని నూతనత్వమేమీలేదు. ఇదే గమనముగల మరొక నవల "సుమంగళి". రవీంద్రుడను యువకుడు పలుమంది స్త్రీలతో పరిచయము చేసికొని వారి జీవిత విశేషములను ఇందులో వివరించును. "సుజాత" అను అమ్మాయి కథ ఇందులో ముఖ్యమైనది. ఆమెపట్ల పతితలకు జాలికలిగినను, ఆమె పతితయైపోవుటకు

గల కారణమును రచయిత విడమరచి చెప్పుకొండుట మిక్కిలి ఆశ్చర్యమును కలిగించును. సుజాత మొదటి భర్త కాంతా రావు. ఆతని ద్వితీయ కళత్రము లోలాక్షి. రవీందు)ని స్నేహితుడు నారాయణ. అతని చెల్లెలు పద్మ. ఆమె భర్త రంగనాధం. వీరి జీవితముల సమాహారమే ఈ నవల. దీనిలో తెలుగు వాతావరణము అంతగా కనుపించుటలేదు. రచయితకు ఏదో కథ వ్రాయవలెనన్న బలమైన ఆకాంక్షకు ఫలితమే ఈ "సుమంగళి" నవల అన్నట్లు ఇందు గోచరించును.

శ్రీ హరికిషన్ మరొక నవల "ఈడొచ్చిన కోరికలు" ఇది కాలేజీలో చదువునట్టి విద్యార్థినీ, విద్యార్థుల సమస్యలను, వేరు కలాపములను ఇతివృత్తముచేసి వ్రాసిన నవల. నాయక ప్రతినాయకులైన సుధాకర్, అమరనాధుల భగ్న ప్రేమోదంతము దీనిలో వివరింపబడినది. నవల ఎత్తుగడలోను, ముగింపులోను అంత పొందిక కనుపించుటలేదు. కాని నవలకు రచయిత పెట్టిన పేరు మిక్కిలి సమంజసముగా నున్నది.

నవలా రచనయందలి లోపములను అళవింపుచేసికొని రచనలు చేయుచున్న సీనియర్ రచయితలలో శ్రీ ముద్దంశెట్టి హనుమంతరావు ఒకడు. ఆయన వ్రాసిన "వార
లోని పురుషోత్తము మగశంతతిలేని గొప
ఆయన ఆస్తిసంతటిని కొట్టివేయ సంకల్పి
చిత్రుచేసి, ఆయన రెండవ భార్య

కొడుకు, మాజీ మిలటరీ వ్యక్తి అయిన భాస్కరరావు ఆ ఇంటిలో చేరి నేర్పుతో పక్కయింటి అమ్మాయి పద్మ హృదయమును, పురుషోత్తము ఆస్తిని చేజిక్కించుకొని తాను వారసుడై అందరి ఆశలను అడియాసలు చేసిన సర్వ సమర్థుడు. విచిత్రమైన ముగింపు, (1964).

"విధి వంచితులు" నవలలో ప్రేమోన్మాదముతో ప్రియులను నమ్ముకొని ఇల్లు విడచివెళ్ళి పడుచు పిల్లలు అనుభవించు అవస్థలను కన్నులకు కట్టునట్లు శ్రీ ముద్దంశెట్టి వర్ణించెను. "సరస్వతి" పాత్ర చిత్రణపట్ల పఠితలకు సానుభూతి జనించునట్లు రచయిత తీర్చిదిద్దిన విధము, ప్రవాహ సదృశమైన రచనాశైలి ఈనవలలో ఉటంకించదగిన ప్రత్యేక లక్షణము. తనకు నచ్చిన విధముగా ప్రవర్తించి, తప్పుచేసిన తమ బిడ్డలపట్ల తల్లిదండ్రులు గనబరచు ప్రేమను, సానుభూతిని నవలలో హృదయంగమముగా చిత్రించెను (1963).

"అహం_అనర్థం" నవలలో "పార్వతమ్మ" అను స్త్రీ భర్తయైన వెంకట సుబ్బయ్యను, కొడుకైన వాసును, కోడలైన యమునను తోసిరాజని, కూతురైన నిర్మలను, అమె భర్తయైన జగన్నాథమును నమ్ముకొని గృహ యాజనూన్య [illegible]ంచుకొని ఆమె పోయిన విచిత్రమైన పోకడలను, ఉత్పన్నమైన విభిన్న సమస్యలను రచయిత [illegible]ుగా చిత్రించెను. స్త్రీలు గృహ యాజ [illegible] ఉండుటవలన సంభవించు అనర్థములు

తెలుఁగు నవలా విశ్లేషము

ఈ నవలలో వివరించబడినవి. తెలుఁగు కుటుంబముల గృహ జీవనము దీనిలో నిండుగా కనుపించును. పార్వతమ్మ ప్రపథమమున గర్వముతో విశృంఖలముగా ప్రవర్తించి, మధ్యలో దెబ్బతిని, చివరలో తనను తాను గుర్తించి ప్రవర్తించిన తీరు నవలలో చక్కగా వివరించబడినది. మిగిలిన పాత్రలన్నియు సందర్భోచితముగా, తమ హద్దులలో ప్రవర్తించి, గుట్టుగా పార్వతమ్మ చెప్పుచేతలలో నడచి, గృహ గౌరవము చెడగొట్టకుండ వ్యవహరించినవి.

వివాహములు ఇహలోక సంబంధమైనవి కావని, అవి పరలోక నిర్ణయమును బట్టి జరుగుచున్నవని, వానిని మార్చుటకు ప్రయత్నించుట వ్యర్థమని తెలుపునట్టి కర్మ సిద్ధాంతమును బలపరచు "దైవ ఘటన" అను వేరొక నవలను శ్రీ ముద్దంశెట్టి రచించెను. సుందరరావుకు, శశిరేఖతో వివాహము నిశ్చయింపబడినను అంతస్తులభేధము అడ్డువచ్చి అది తప్పిపోయి డాక్టర్ రామారావుతో నిశ్చయింపబడి మరల సుందరరావుతో దైవికముగా వివాహము జరిగినది. నీరజ, రామారావులకు; శేఖరం, సునందలకు, జరిగిన వివాహములును ఆ సిద్ధాంతమును బలపరచునట్టివే.

శ్రీ ఖండవల్లి సాంబశివుడు వ్రాసిన "పాపికొండలు" మధ్యతరగతి ప్రజల వైవాహిక జీవితములందలి మిట్ట పల్లములను వివరించు నవల. "..... పాపికొండలవద్ద పడవ ప్రయాణంలాగ అజాగత్తగా వుంటే ప్రమాదానికి గురి అయ్యే

జీవనయాత్ర గురించి" వ్రాయుడంచేత నవలకు ఆ పేరిట్టి నట్లు ప్రకాశకులు తమ ముందుమాటలో తెల్పినది యదార్థము. ఉన్నత విద్యావంతుడు, కళాశాల అధ్యాపకుడునైన శ్రీనివాసరావు "శాంత" అను స్త్రీని వివాహమాడి దురాశా పరులైన తన తల్లిదండ్రుల కోరిక ననుసరించి ఆత్తమామల నుండి ధనము లాగుటకై భార్యను పుట్టినింటికి పంపి దుర్వ్యసనములకు లోనై పాపపంకిలములో కూరుకుపోయి కాలగర్భములో కలసిపోయెను. భర్త అనాదరణకు గురియైన శాంత తన సర్వస్వమును కోలుపోయినను ధైర్యమును కోలుపోక విద్యావతియై, గాయకురాలై రాలై సంఘములో సభ్యజీవనము గడిపి తన చరిత్రను శుభ్రజ్యోత్స్నా సదృశమొనరించుకొనిన శీలవతి - చదవదగిన మంచి నవల (1962).

తెలుగునాటి పల్లెసీమల జీవనవిధానమును, కులము, మతము, వర్గముల పేరిట సంఘములో పొడచూపు విభిన్న సమస్యలను వివరించు నవల "మా ఘంటం". ఈ నవలా వికాస వివర్శక రచయిత శ్రీ పుల్లాభొట్ల వెంకటేశ్వర్లు దీని రచయిత. ఈ నవలను స్వయముగా తాను సమీక్షించుట కన్న విజయవాడ "ఆకాశవాణి వెలువరించిన అభిప్రాయమును" వారి సౌజన్యములో దిగువ పొందుపరచడమైనది.

ఇందలి ప్రధాన పాత్ర ఘంటం. ఇందు ఘంటం పరోపకార పరాణుయుడుగా, "మానవ సేవయే మాధవ సేవగా" భావించిన అసామాన్య వ్యక్తిగా చిత్రింపబడినాడు. ఘంటం

జన్మించినది బెస్తకులములో'. ఇతని చిన్ననాటనే తండ్రి చని పోయినాడు. కొంకుడినగాని డొక్కనిండని కుటుంబము వాఁది. తల్లి రంగమ్మ. జన్మస్థానము కృష్ణానదీ తీరమున గల శివాపురము. ఇతడు తన గృహమునే పాఠశాలగా భావించి, ఉత్కృష్ట గ్రంథములనే తన గురువులుగానెంచి విశేష విజ్ఞానము సార్జించినాడు. ఇతడు తనపై కాలరువ్వినవారిని, పూలరువ్వువాడు. పారుష్యము ప్రకటించిన వారిపై కారుణ్యము చిలకించు కరుణాస్వరూపుడు. ఇరువది ఒక్క సంవత్సరముల వయస్సులోపలనే బుద్ధ, రామకృష్ణ, వివేకానంద, బాపూజీ మున్నగు మహాపురుషుల పవిత్ర చరిత్రలను పఠించి అందలి సారమును వంట పట్టించుకొన్న లోకోత్తర వ్యక్తి ఘంటం. ఇతడు ఆజీవిత బ్రహ్మచారి. ఇతనికి నీలకంఠమను మిత్రుడు కలడు. అతడు బ్రాహ్మణవంశ సంజాతుడు. ఇతని తండ్రి అకారణ దారుణహత్య గావింపబడినాడు. ఈ మరణవార్తని తల్లికూడ కృశించి, నశించినది. ఇక ఆకుటుంబములో మిగిలినది నీలకంఠం. ఆతని చెల్లెలు ఉమ. నీలకంఠము నకు ఘంటముతో మిత్రుతప్ప, ఆ గ్రామమున కన్నెత్తికనికరించువారుగాని, పన్నెత్తి పలుకరించువారుకానిలేరు. మిత్రుడైన నీలకంఠముకకు, ఘంటం పరోపకార పారీణతనుగూర్చియు, ధర్మాధర్మములనుగూర్చియు, స్వర్గ నరకములను, జననమరణములనుగూర్చియు బోధించి ఆదర్శ మానవుడుగా తయారు చేసినాడు. కృష్ణానది వరద పెల్లుబికి గ్రామసీమలను పొట్టబెట్టు

కొన్నతఱి ఎన్నియో పా)ణులను కరుణతో కాపాడినారు. ఆ గా)మములోని దుర్మార్గులు వీరిరువురిపైన అనేకాభాండ ములనువేసి, శిక్ష విధింపకేసినను వానిని శాంతి సహనములతో అనుభవించినాకేకాని ప్)తిక్)యకు సన్నద్ధులు కారైరి. "ప్రద ర్శనీయమైన వాకు, దర్శనీయమైన రూపము ఏదియో యొక నిందకు పాల్పడుచుండును ... ..." అను విషయము వీరి యెడల సార్థకమైనది. "ఎద్దు ఈనినదనగా గాటకట్టివేయమను" వారేకాని, అందలి సామంజస్యమును పరీశీలించువారు లేరైరి. అసూయాపరులు మూఢ విశ్వాసములను, ముసుగులో అమా యకుల మనసుల మళ్ళపెట్టి వీరినానేక కష్టనష్టములకు గురిచేసి నను, బాధాసహిష్ణతవలననే ప్రత్యర్థులహృదయములను మార్చి వైచినారు వీరు. నాడు వెలివేసిన వ్యక్తులే అనంతరము ఆ గా)మమునకు వెలుగుబాట చూపించినారు. గా)మస్తుల నందరను సన్మార్గమున నడిపించి, గా)మమును స్వర్గధామ ముగా చేసినారు. ఘంటం ప్)పంచమున ఆస్తికతా భావము ప్)ధ్వనిష్టమగుచున్నందులకు వనటజెంది, అమరలింగేశ్వర పదాబ్జ ధ్యానపూజా మహోత్సవమందు నిమగ్నుడైనాడు. నేటి నవలలన్నియూ కామవిలాసములకు, ప్రేమకలాపములకు ప్రాముఖ్యమొసంగి, ఆ సుడిగుండమునుండి ఈ రచయిత వైటబడి మానవ ధర్మసూత్రములను పోషింపవలెనను సత్సం కల్పము కలవాడై, తన ప్రపంచానుభూతికి రూపకల్పనచేసి "ఘంటం" అను పాత్రద్వారా సందేశమునందజేసినారు.

అసలైన సిసలైన తెలుగు నుడికారపు పసందు వీరి నవలా రాజములో అచ్చు గ్రుద్దినట్లుండును.

జేమ్సు జాయిస్, మొ రే వి యా, లారెన్సు వంటి పాశ్చాత్య నవలా రచయితల రచనలలోని శిల్పమును, ఇంపు సొంపులను జీర్ణించుకొని నవలలు వ్రాసినవాడు శ్రీ వినుకొండ నాగరాజు. నేటివరకు వెలువడిన అయన నవలలలో, కొంత వరకు అచ్చటచ్చట ఆ రచనారీతులు ప్రతిబింబించినను; మరి కొంత ప్రశ్ధవహించి ఆవాఙ్మయణమునుండి విడివడి చక్కని, చిక్కని తెలుఁగుదనముతో వాచవులూరించగల నవలల నందిం చగల ప్రతిభ అయన కలనునకున్నట్లు అయన రచనలు విశద పరచును.

సువర్ణ నవలలోని "సువర్ణ" న్యాయశాస్త్రము నభ్య సించి, గొప్ప ఉద్యోగముచేయుచున్న వ్యక్తిని వివాహమా డిన అందగత్తె. తాను పెండ్లిచేసుకొనిన భర్త తనకు తగిన వాడు కాడని భావించి, తనను కాంక్షించుచున్న ఎందరినో ఉన్నత విద్యాసంపన్నులైన అధికారులను, సుందరవ్యాపులైన యువకులను నిరాకరించి, తన తండ్రివద్ద బానిసయై బ్రతు కుచు, తన అంతస్తుకు తగని వ్యక్తియైన "కాతబ్బాయిని" వివాహమాడినది. కారణము - "అతని ఉక్కు లాం టి తొ డ లు, సు డి తి రి గి మెలితిరిగిన పిక్క" లలో గల ఆకర్షణ - పచ్చి శృంగారముతో నిండిన వర్ణనలు అధికముగా నవలలో ఉన్నను, ఆంధ్ర ప్రాంతములోని వీజన్ని ప్రాంతము

కథాస్థానమగుటయేగాక, అచ్చటి సహజసుందరమైన ప్రకృతి వర్ణనలు నవలకు మంచి దీప్తినిచ్చినవి (1963).

శ్రీ నాగరాజు మరొక నవల "రాగుబోతు". దీని కథానాయకుడు రాగుబోతైన మూడిగలింగడు. అతని మనస్తత్వమును, విచిత్రమైన అనుభూతులను ఆయన దీనిలో వివరించెను. ఇది ఒక ప్రయోగాత్మక నవల. లింగడి ఏక పాత్రాభినయమై కథ నడచినను, పిచ్చమ్మ, వెంకమ్మల పాత్ర చిత్రణములో రచయిత చూపిన ప్రౌఢ ప్రశంసనీయమైనది.

భారతదేశముపైన చైనా 1962 వ సం. లో దండయాత్ర జరిపినది. దేశమంతయు ఒక్కటియై శత్రువును ఎదిరించినప్పుడు, దేశభక్తితో శ్రీ వినుకొండ "ఆచరణలో రాజ్యము నకు సిద్ధముకండు" అను దివ్యసందేశముతో "నన్ను పిలిచింది" అన్న దేశభక్తి ప్రపూరితమైన నవలను వ్రాసెను. ఇందులో చైనా బలమదాంధతతో కన్నులు కానక, శాంతి మార్గమున విశ్వశ్రేయస్సును, సహజీవనమును కాంక్షించు భారతదేశముపైన అకారణముగా దండయాత్ర సలిపిన విధమును వివరించెను. రామినీడు, సుబ్బారావు, కుమారివంటివారిలో ప్రతిబింబితమైన దేశభక్తిని, అన్నారావు వంటి దేశద్రోహి, విదేశభక్తుని కథలో రచయిత మలచిన తీరు ఎన్నదగినది.

ఈ సమస్యపై వెలువడిన మరియొక ఉత్తమ నవల

శ్రీ మాధురి వ్రాసిన "విముక్తి". దీనిలో శ్రీ నెహ్రూ అలీన విధానమే సక్రమమైనదని రచయిత రుజువుచేసెను. ప్రజలు యుద్ధ సమయమున పెక్కు రంగములలో జాగరూకులై ప్రవర్తించి, యుద్ధావసరములకు కావలసిన వివిధ వస్తువులను సేకరించుటకు తోడ్పడవలసిన రీతిని దీనిలో వ్యక్తముచేసెను. వరదరాజులు, హైన్‌లవంటి దేశద్రోహులను ఒక కంట కని పెట్టతగిన గుణపాఠము నేర్పిన విధము, రాజ్యలక్ష్మివంటి దేశ భక్తురాలు ప్రదర్శించిన ధైర్యసాహసములు ఇందు చక్కగా వివరింపబడినవి. చైనా దండయాత్ర సమయమున ప్రజలు ఇచ్చిన చేయూతను మన సైనికులు ఎత్తైన ఆపర్వత శ్రేణులలో శత్రువులను ప్రతిఘటించుటకు సలిపిన త్యాగనిరతిని "శ్రీ మాధురి" సముచితరీతిలో ఇందు చిత్రించెను (1963).

మారుచున్న కాలగమనమును గుర్తించక ఎదిరించుట మూర్ఖుల లక్షణము-అయినను సంకుచితబుద్ధిగల స్వార్థపరులు అప్రయత్నమును విరమించరన్న విషయమును నిర్ధారణ చేయుటకు, నిస్వార్థ ప్రజా సేవకులు తమకు సంభవించిన కష్టనష్టములను లెక్కించక విజయులమని చాటించుకొనునంతవరకు పట్టినపట్టు విడువక నిరంతరము జరిపిన విప్లవమును శ్రీ తోర్లపాటి కృష్ణమూర్తి తన "కాలప్రవాహము" అను నవలలో నూతన రచనారీతిలో, మధురమైన భాషలో సహజ సంఘటనలతో నుండునట్లు నిరూపించెను. కథానాయకుడైన "రాజు" గ్రామసేవకుడుగా ఒక క్రొత్త గ్రామములో ప్రవే

శించి, అభ్యుదయ భావములుగల మరికొందరు కింది తర గతి యువకులను కూడగట్టుకొని, ఆ ఊరిని బాగుచేయుటకు యత్నించినప్పుడు మునసబు, కరణము, సుబ్బయ్య, పెట్టి అను నలుగురు అభ్యుదయ నిరోధకులు అడుగడుగున వారి ప్రయత్నములను చిత్తుచేసినను, అకుంఠిత కార్యదక్షతతో వారు ఆ గ్రామమును స్వర్గధామముగా మార్చిరి. ఎన్నికలలో పెలరేగిన కక్షలతో మునసబు, రాజును, అతని అనుచరులను హత్యచేయించి తన పగను సాధించినను, చివరకు అతని తమ్ముడే విప్లవ సంఘమునకు ప్రతినిధియై నిలచి యెదిరించెను. దానితో అతని ఆటకట్టి విప్లవము వర్ధిల్లినది. "నీరజ" రాజు చెల్లెలు. బాల వితంతువు. ఆమె మెడికల్ కాలేజీలో చదువుచు జీవితములో అనుభవించిన కష్ట పరంపరలు, పొందిన చిత్తచాంచల్యము, డాక్టరు మూర్తి చేసిన చికిత్సతో ఆమె బాగుపడుట, ఆమెలో వచ్చిన పరివర్తనము దీనిలో చక్కగా వివరింపబడినది. ఇది విప్లవ పంథాను సమర్థించు సరికొత్త నవల (1962).

"జీవన్మృతులు", "చిత్రశాల" మున్నగు నవలలతో 1962 వ. సం. నుండి రచన సాగించుచున్న శ్రీ మేఘుశ్యాం క్రమముగా 1971 వ. సం. ఆంధ్రప్రభ వారపత్రిక నిర్వహించిన ఉగాది నవలలపోటీలో "లహరి" నవలకు ప్రథమ బహుమతిని పొంది పలువురి మన్ననలందుకున్న యువ రచయిత. జీవితాలకుగాని, ఆ జీవితాల్లోని కొన్ని భాగాలు ఒకప్పు

వేర్పడిన నవలకు కానీ ముగింపు లేదు" అని ఒకవిధమైన నిర్వచన పరిధిలో, ఆలోచనలు రేకెత్తించు రీతిలో నడచిన నవల ఇది. మానసికశాస్త్ర ధృక్పథముతో నిండిన జీవితపరిశీలనమే ఇందలి ముఖ్య ఇతివృత్తము. ఈ నవలలో ప్రధాన వ్యక్తులు నలుగురు. డాక్టరు రవి, అతని భార్య అనూరాధ, రామ్ అతనిని ప్రేమించిన విజయ-వీరి పరస్పర విచిత్రమైన మానవ మానసిక స్థితిగతులను చిత్రించుటలో రచయిత కనబరచిన శ్రద్ధ గమనించదగినది. డాక్టర్ రవి లక్ష్యరహితమైన భ్రష్ట యోగ జీవితము, అస్థిమితమైన ఆలోచలు ఎవరికి తెలియని దూరతీరములలో ఇహలోకయాత్ర సమాప్తముచేసిన తీరు చదువరులకు అతని యందు సానుభూతి వేర్పడునట్లు చేయును. అనూరాధ త్యాగశీలత, విజయ భగ్నప్రేమ నవలలో చక్కగా చిత్రింపబడినది. కొత్త పొంతలు తొక్కిన కొత్త రీతి రచన ఇది.

శ్రీ అర్జున వ్రాసిన "కామనేత్రం" కొండితెర నవల వంటిది. దీనిలో చాకచారు సినిమాలో విలన్ పాత్రధారియైన "విశ్వం" అను వ్యక్తి విశృంఖల ప్రవర్తన, నీతి బాహ్యమైన అతని కామకలాపములు వర్ణింపబడినవి. పెక్కు మంది స్త్రీలను వంచించిన అతడు "మందాకిని" అను స్త్రీతో కొంపదెబ్బ తిని, శీలవతియైన తన వదిన మణిని కాంక్షించి విఫలుడై, ఆమె ఇచ్చిన విషముతో జీవయాత్ర ముగించిన భ్రష్టజీవి. మణి తనకు జరిగిన అవమానమును ఇతరులతో

చెప్పుకొనక ఆత్మహత్యచేసికొనుట కొంత ఎబ్బెట్టుగానున్నది. చెప్పుకొనతగిన విశేషము దీనిలో కనుపించకపోయినను రోడ్లపైన ప్రేమకలాపములు సాగించువారికి ఇది గుణపాఠము నిచ్చును (1963).

వర్ణాంతర వివాహములను బలపరచు నవల శ్రీ. మిత్రశ్రీ "క్యాగవ్హాదయులు". కాపుకులమునకు చెందిన భూషణం కూతురు కమల, హరిజనుల పెంపకములో పెరిగిన సుధాకర్ అను వ్యక్తిని ప్రేమించి వివాహమాడినది. చివరకు ఆమెకు అతడు మేనత్తకొడుకని తేలినది. గ్రామ పురోహితుడైన విద్యాస్న పంతులు కుమారుడు శివం హరిజన బాలికయైన కళ్యాణిని వివాహమాడెను. ఈ వర్ణసాంకర్యమును సహించలేక పంతులు కాశీకి వెళ్ళిపోయెను. రచన చక్కగా సాగినది (1963).

కవి, నవలా రచయితయైన శ్రీ శీలా వీరరాజు చిత్రకారుడుగూడ కగుట గొప్ప విశేషము. ఆయన నవలలోని పాత్రలు చిత్రపటములందలి బొమ్మలవలె కన్నులకు గట్టును. ఆయన వ్రాసిన "వెలుఁగు రేఖలు" నవల "శారద" అను ఒక ఆదర్శ స్త్రీ జీవితమును చిత్రించును. చిన్నతనములో "సుందరము" అను నతడు ఆమెను ప్రేమించి, మోసముచేసి పలాయనము చిత్తగించినప్పుడు చిత్తస్థైర్యమును గోలుపోక వేరొకనిని వివాహమాడినది. విధి వశించి అతడు చని పోయినను ఆశ్చర్యపడక సంఘసేవ చేయుచు జీవించుచున్న

ప్పాను, ఆమె పరిధమ పేరిమికుడైన సుందరము యుద్ధములో చేయి పోగొట్టుకొని తిరిగివచ్చినప్పుడు ఆతనిని ఆదరించుటయే గాక, అతని సోదరీమణుల వివాహమునకొరకు ఎన్నియో త్యాగములు చేసినది. అయినను అతడు కొంతకాలము పిమ్మట ఆమె అండదండలతో జీవించుటకిష్టపడక ఒక ఆశ్రమములో కొంతకాలము గడపినను మనశ్శాంతి పొందజాలక "నిశ్చలమైన జీవితాన్ని గడపాలంటే అండగా ఆదుకొనే ఒక తోడు కావాలి" అన్న నగ్న సత్యమును గుర్తించి, తిరిగి ఆమె వద్దకు వచ్చెను. శారద శీలమును, త్యాగనిరతిని, సుగుణములను రచయిత ఆదర్శపాత్రముగ తీర్చిదిద్దెను (1962).

మాధురీ పంపన్నమైన "మైనా" శ్రీ "శీలా" వ్రాసిన మరియొక నవల. "సాయిబాబా" అను కానిస్టేబులు ఒక కానిటోరియములో హీయగోగిగా జీవితము గడిపి, రచయితకు తన జీవితములో సంభవించిన కొన్ని విచిత్రమైన విషయములను తెలుపును. శ్రీ వీరరాజు ఆ విషయములకు తన బుద్ధివైభవమును, లోకజ్ఞానమును మిళితముచేసి ప్రవాహసదృశమైన భాషతో, విభిన్న సంఘటనలను కల్పించి, సాయిబాబా జీవితములో మలుపు, మలుపుకు మధ్య నడచిన చిత్ర విచిత్రమైన సన్నివేశములను; స్వేచ్ఛను పరిరక్షించుకొనుటకు అతడు సలిపిన పోరాటములను, జరిపిన ప్రేమకలాపములను, తగిలిన ఎదురు దెబ్బలను, పన్నిన పన్నాగడలను, ద్విగుణీకృతోత్సాహముతో సాధించిన విజయములను ఇలిదుల్

దఱుతతో చిత్రించెను. ఇది రచయిత చిత్తశుద్ధితో చేసిన ప్రయోగాత్మక రచన. సాయిబాబా పాత్రను అలంబనము చేసి మిగిలిన పాత్రలు నడచినవి. "తెలుఁగులో నీరసమైన బ్రతుకులే తప్ప ప్రపంచవ్యాప్తమైన ఇతివృత్తంగల జీవితాలే లేవు అనేవారికి సాయిబాబా జీవితం ఒక సమాధానం" అన్న రచయిత వాక్యములు కొంతవరకైనను ఇందులో ప్రతిబింబించుచున్నవి (1965). ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీవారి బహుమతినందుకున్న నవల ఇది.

శ్రీ శీలా మరియొక మంచి నవల "కాంతి పూలు." దీనిలోని "దాలమ్మ" హృదయమున్న స్త్రీ. పరోపకార పరాయణశీలి. ఈ నవలయాదలి వర్ణనలు, వాక్యనిర్మాణ పద్ధతి ప్రశంసింపదగినవి- "చంటా బయటా చీకట్లు సన్నని ఉల్లిపొరలా అలముకున్నాయి. ఆరిపోతున్న దీపం ఆఖరి మంటలాగ మరీ ఎర్రగా మండిపోతోంది. చీకటి వెనక ఆకాశం. గదిలో తామరపువ్వు గర్భంలోలాంటి పల్చటి కాషాయరంగు కాంతి పరచుకుంది. క్రమక్రమంగా ఆ రంగుమీద బూడిదలాంటి లేత నలుపు రాలి, మెల్లమెల్లగా చిక్కపడి మసిబొగ్గులాంటి, కంటిపాపలాంటి, పాంతకుడి మనసులాంటి, పాపంలాంటి చీకటి వ్యాపించింది ఎప్పుడో ఆది దంపతుల పాపంతో పుట్టిన రాత్రి అగడిలో నల్లకలువలా విచ్చుకుంది." (13 వ పేజీ.)

"కుర్రాడు లాగిపారేసిన మొక్కలా కాలం తీర

కుండానే వాడిపోయినట్లు అతని ముఖం వడలిపోయింది-"
(10 వ. పేజి).

గ్రామీణ జీవితమునందలి ఒక విభమైన మందగొడి తనమును, వ్యక్తులలో పేరుకొనిపోయిన స్తబ్ధతను నిరూపించి చూపుటకై శ్రీ ఇనుకపల్లి దక్షిణామూర్తి వ్రాసిన "బ్రతుకుబాట". చిత్ర విచిత్రమైన గతులలో జీవితమునకు అలవాటు పడిన "నారాయణ" అను యువకుడు ఒక గ్రామములో ఉపాధ్యాయుడైన రామయ్య కుమారుడు. నియమ విరుద్ధమైన జీవితములో సంభవించు పరిస్థితులవలన తాను పొందిన అనుభవములు, అతనిని మనిషిగా మార్చి, తనను తాను తెలిసికొనునట్లుచేసినవి. ఆమార్పు ఫలితముగనే అతడు ఆగ్రామములో ఉపాధ్యాయుడై, క్రమముగా ఉన్నత పరీక్షలకు చదివి, పైపెట్టును చేరుకొనవలెనను బలమైన ఆకాంక్ష అతని హృదయములో స్థిరపడుటతో నవల సమాప్తమైనది, మంచికథలు వెక్కువ్రాసి విఖ్యాతుడైన శ్రీ దక్షిణామూర్తి ఈ నవలను పకడ్బందీగా చివరవరకు ఒకుదుడుకులు లేకుండునట్లు సాఫీగా నడిపెను (1963)

సరస సంభాషణలతో పఠితలకు ఔత్సుక్యమును కలిగించు, "ప్రభావంలో అబల" అను నవల శ్రీ ఇనుకపల్లి లక్ష్మీసరసింహశాస్త్రి రచించెను. యథార్థ జీవిత పరిస్థితులను దినగండము నూరేండ్లు ఆయుర్దాయముగ సాగుచున్న నేటి మన మధ్యతరగతి కుటుంబముల పరిస్థితులను ఆయన

దీనిలో వివరించెను. కథానాయకియైన "మాలతి" భర్త యెవరికి చెప్పకుండ యెటో పారిపోయెను. ఆమె, అత్త ఆడ బిడ్డల పోరుకు తట్టుకొనలేక వేసు కాపురముపెట్టి జీవయాత్ర వెళ్ళబుచ్చుచున్నప్పుడు పెద్ద సుస్త్రీ చేసినది. ఆపరేషను కొరకు ఆస్పత్రిలో చేరిన పిమ్మట ఆమె పరిస్థితి యేమి జరిగినది తెలుపకుండ రచయిత కథను ముగించెను. ఈలోపున దేశాంతర్గతుడైన భర్త తిరిగివచ్చెను. ముగింపు కొంత అపరిష్కృతముగా కనుపించినను వాస్తవ పరిస్థితులను చిత్రించుటలో, సంఘటనలను కల్పించుటలో, వర్ణనలు చేయుటలో రచయిత చూపిన శ్రద్ధ సమర్థనీయమైనది.

శ్రీ రావూరి భారద్వాజ వ్రాసిన పెక్కు నవలలలో "మంజరి" అను సినీతారను నాయికను చేసి వ్రాసిన "పాకుడు రాళ్ళు" నవల ఉత్తమ శ్రేణికి చెందినది. "మంజరి" సీతి నియమములను రెండింటిని విడిచిపెట్టి అతి సామాన్య పరిస్థితినుండి ఒక మెట్టు తరువాత మరొక మెట్టును అధిరోహించి, చిన్ననాటక సమాజములో సామాన్యమైన వేషములు వేయుట నుండి సినీరంగములో శిఖరాగ్రమును చేరుకొని, సన్మాన పరంపరలలో ఖండాంతరఖ్యాతి నార్జించి ఉక్కిరి బిక్కిరియైనను, శరీరసౌందర్యమూ, ఆకర్షణ తగ్గిపోయినపిమ్మట ఆ సమాజములో కలిగిన నిరాదరణముతో ఆమె కృంగికృశించిపోయిన దౌర్భాగ్య జీవితమును, విషాద మరణమును హృదయము ద్రవీభూతమగునట్లు ఆతి సహజ

ముగ నుండురీతిలో కథను మలచిన తీరు చెప్పుకొనతగినది. పాకుడు రాళ్ళపైన నడక అతికష్టముమీద కొంత సాగినను అది ప్రమాదభూయిష్టమైనదని ధ్వనిపూర్వకముగా వివరించెను. కవల ఎత్తుగడ, ముగింపు, దానికి తోడు ఇతివృత్తమును ప్రతిబింబింపజేయునట్లు దానికి పెట్టిన పేరు, పాత్ర చిత్రణ, సంభాషణలు అన్నియు రచయిత దీనిలో సార్థక మగునట్లు చేసెను. శ్రీ రావూరి మరొక ప్రఖ్యాత నవల "జలప్రళయం". ఇది అంతర్జాతీయ రాజకీయములలో ముఖ్యముగా చంద్రలోక యాత్రలో రష్యా, అమెరికాలు పడుచున్న పోటీని, అందులో రష్యాది పై చేయి యైనట్లు రచయిత వ్యంగ్యముగా వివరించిచెప్పిన విజ్ఞానాత్మకమైన చక్కని నవల.

ఈమధ్య వెలువడిన నవలలో శ్రీ కాళ్లూరి నాగేశ్వర రావు "కొత్త ఇల్లు" పేరొందినదగినది. ఆంధ్రప్రభ వార పత్రిక నడిపిన కీలక సంవత్సర ఉగాది నవలల పోటీలో దీనికి ప్రథమ బహుమతి వచ్చినది. పాత కొత్తలమధ్య జరిగిన సంఘర్షణ దీనియందలి ఇతివృత్తము. ధర్మయ్య పాత తర మునకు, సంప్రదాయమునకు ప్రతినిధి. అప్రతిహతముగా తన కళ్ళముందు లోకముతోపాటు తన ఇంటియందు జరుగు మార్పులను చూచి సహించలేక కుమిలిపోయిన వ్యక్తి. తన కుమారునిలో, మనుమనిలో, మనుమరాండ్లలో కొత్తరంగు లలో చిగురించిన వినూతన భావములు, సంస్కారాభిలాష, అయనకు గిట్టలేదు. మారుచున్న కాలమునను సరించి ఒక

కొత్త ఇల్లును, కొత్త సమోవాలో నిర్మించుటగూడ అయ్య నకు నచ్చలేదు. తన తాత తండ్రులు కట్టించిన పాత ఇంటి యందే తానును కళ్ళుమూయుటకు అయ్యన సంకల్పించెను. కుమారుడు రఘురామయ్య మౌనముగా తండ్రిమాటకు ఎదురుచెప్పకయే కొత్త ఇల్లు నిర్మించి, ఎన్నికలలో పాలు గొని, పెక్కు అధికారపదవులను చేజిక్కించుకొని అన్యాయ ముగా ప్రజలను పీడించి లంచములు గడించెను. మనుమడు దుర్గాప్రసాద్ డాక్టరు పరీక్షలో ఉత్తీర్ణుడై "మిరీస" అను అమ్మాయితో మతాంతర వివాహము చేసికొనెను. కూతురి బిడ్డ "సుమతి" రాజబాబు అను వ్యక్తిని వర్ణాంతర వివాహము చేసికొనినది. వితంతువైన తన కుమారుని బిడ్డ "వసంతలక్ష్మి" భాస్కరరావను వానితో మరొక పెండ్లి చేసికొనినది. ధర్మయ్యకు తన ఇంటిలో జరిగిన ఈ మార్పులన్నియు హృదయమునిండ సమ్మోదమొట్టి మనస్సును సంక్షోభ పరచినవి. కొత్త ఇంటిలో గృహప్రవేశ మహోత్సవము జరుగనున్న సమయమున కుమారుడు తండ్రిని అక్కడికి రావలసినదని బ్రతిమాలినప్పుడు "నేను ఆ ఇంటి మొహము చూడను - నేను పాతవాణ్ణి. మా నాన్న తనువు ఈ ఇంటిలోనే చెళ్ళుమారింది. నా తనువు గూడ ఈ పాత ఇంటిలోనే చెళ్ళుమారనివ్వు..... ఏ అన్యాయము జరుగుతున్నా నోటితో ఖండించడమేకాని, అది జరుగకుండా ఆపుదల చేయలేని దుస్థితికి గురికావలసివచ్చింది. తరాన్ని నిలుప

లేక పోయానన్న దిగులే నా గుండెలో గూడు కట్టి కట కట కాకుతోంది-" అనిచెప్పి శ్రీమన్నారాయణుని కబురందుకొని ఇహయాత్ర ముగించిన పట్టుదలగల వ్యక్తి. పాతను పూర్తిగా విడనాడజాలక, కొత్తను హృదయపూర్వకముగా స్వాగతము పలుకలేక రఘురామయ్య దీనిలో తన సాధ్యత యెంతవరకో గ్రహించలేక మనస్సులో కుమిలిపోయినను కొత్త ఇంటిలో గృహప్రవేశమైన వెంటనే గొండెనొప్పివచ్చి స్పృహతప్పి ఆ గండమునుండి బయటపడిన పిమ్మట కొడుకు దుర్గాప్రసాద రావుతో "కొత్త నీరు వచ్చిపడుతూవుంటే, పాత నీరు అందులో ఐక్యమై సహకరించడం సహజ ధర్మంకదా!" అంటూడు కాలగమనమును గుర్తించిన అయిన. గ్రామీణ జీవితములో కొత్త పాతలమధ్య జరిగిన సంఘటనలు అద్భుతముగా దీనిలో ప్రదర్శింపబడినవి. తుణతుణము మారుచున్న ఈ నవసమాజమున ప్రగతి పథమున, ఎందరో అడ్డగించినను, అగక ఉజ్వలమైన భవిష్యత్తు వైపు యెట్టుల ప్రయాణము సాగించుచున్నది, శ్రీ కాళ్ళూరి దీనిలో ప్రతిభావంతముగా వివరించెను. వెక్కుమంది పఠితల హృదయమును ఆకట్టు కొనిన మంచి రచన ఇది.

★ "తొలి మజిలీ" నవలిక 1962 సం. జూన్ భారతిలో వెలువడినప్పుడు పలువురి దృష్టిని ఆకర్షించిన రచయిత శ్రీ ఆదివిష్ణువు. మధ్యతరగతి కుటుంబమునకు చెందిన 'రఘు' దీనిలో కథానాయకుడు. అతడు కాకినాడలోని ఒక ఆఫీ

సులో ఉద్యోగిస్తై జీవితపు తొలిమజిలీలో పొందిన అనుభవ
ములను, అనుభూతులను పూసగుచ్చినట్లు ఉత్తమపురుష ఏక
వచనములో చెప్పెను. పూర్వపరిచితురాలైన ఒక స్త్రీ
స్నేహితముతో అతనికి సంభవించిన ఆపదలు, అపవాదులు
ఇందు చిత్రితములు. "మనసులో మధించుకొన్నది కాయితం
మీద పెట్టడం కేర్చి..." అని తొలి మజిలీకి వారి మిత్రులు
కీ) పాంచజన్యం వాసిన మాటలుయు దార్ధములని ఈ నవల
రుజువు చేసినది. "మనిషి మిథ్య" అను ఈయన ఏ ఓక
నవల ఆంధ్ర వారపత్రిక నవలల పోటీలో బహుమతి
నందుకొనినది. శంకరం ఇందలి నాయకుడు. అతడు
తనకు పరిచయమున్న కొందరు వ్యక్తుల చిత్ర విచిత్రమైన
జీవితములను దీనిలో ఏకసూత్రగథితముచేసి మనకందించెను.
వైకి సభ్యతగొరకు, పరువుగొరకు, కుటుంబ గౌరవముగొరకు
భార్యాభర్తలై అన్యోన్య ప్రేమలు వుట్టిపడునట్లు ప్రవర్తించి
చిరునవ్వులు చిందించినను, వారి హృదయాంతరాళములలో
మండుచున్న అగ్నిగోళములు వారి జీవితములను దహింప
జేసి, నిస్సారవంతమొనరించిన సత్యములను ఆయన తన
మిత్రుడు శంకరం, అతని భార్య సుజాత జీవిత గాథలలో
వివరించెను. మరొక విచిత్రమైన కథ శంకరం అన్న
నిరంజనముది. అతడు ప్రేమించిన యువతిని వివాహమాడి,
మామగారి ఆఫీసులో మేనేజరుగా వ్యవహరించినను మన
సులో ఏర్పడిన అంతస్తుల భేదము అతని హృదయమును

కృంగతీసినది. ఇట్టివే అభిరుచులతో కలసి పనిచేయుచున్న మరి కొందరి జీవిత రహస్యములను అందులో తెలిపెను. మరియు చున్నవంతయు బంగారము కాదని, జీవితము ఒక మిథ్యా నాటకమని ఇందలి ప్రబోధము. రచయిత పాత్రలను చిత్రించిన తీరు, కథలను వివరించిన పద్ధతి మెచ్చుకొనదగినది. "స్నేహము" అన్న మరియొక నవలలో స్నేహము యొక్క విలువలను, కాలేజీ జీవితములో తొణికిసలాడుచుండు మాధుర్యమును, తీయని కలలను అయిన కన్నులకు కట్టించెను.

చైనా దురాక్రమణను నిరసించుచు వ్రాసిన మరొక నవల శ్రీయుగ్రం చంద్రశేఖరం "ఆనందనిలయం". సరిహద్దు ప్రాంతములలో ఎత్తైన పర్వతములపైన ప్రతికూల వాతావరణములో దేశభక్తులైన సైనికులు సలిపిన వీరోచిత పోరాటమును, ప్రజలు దేశముకొరకు వస్తురూపమునను, ధనరూపమునను సలిపిన త్యాగములు ఇందు వివరించెను. దీనిలో రమేశ్, జానకి, రఘు, శారదల ప్రేమకలాపములు ఫలోన్ముఖులై తారాస్థాయి చేరుకొన్నప్పుడు చైనా యుద్ధము వచ్చినది. దానిలో వారు నిర్ణయించుకొనిన తమ వివాహములను వాయిదావేసి, తమ కర్తవ్యమును నిర్వహించుటకు దేశభక్తితో సరిహద్దులకు పోయి ధైర్యసాహసములతో పోరాడి, శత్రువులపై విజయమును సాధించినపిమ్మట తిరిగి వచ్చి వివాహమాడుటతో కథ సుఖాంతమైనది. రచయిత పకడ్బందీగా కథను ముగించెను - శ్రీ చంద్రశేఖరం మరొక

నవల "మల్లెలు - ఎర్రగులాబీలు". ఇది ఆంధ్ర సచిత్ర వార పత్రికలో (1971) నుండి ప్రచురింపబడి ఆపిమ్మట గ్రంథ రూపముదాల్చినది. మల్లెపూవువంటి స్వచ్ఛమైన మనస్సు గల శారద నవలలో నాయిక. పాఠకుల మెప్పుల కుప్పలనందు కొనిన మరొక యువతి నీరజ. సుందరం పేరుకొరకు శాంత, నీరజలు శాపత్రయపడిన విధమును అయన చక్కగావర్ణించెను. రామం ఆదర్శజీవితము, వ్యవహార దక్షత, పరోపకారబుద్ధి, పిన్న, పెద్ద భేదము పాటించక అందరితో కలసిమెలసి తిరిగిన పద్ధతి నవలలో విస్మరించుటకు వీలులేనిది. స్వార్థప్రవృత్తికి, నిస్వార్థప్రవృత్తికి; చదువుకు, సంస్కారమునకు; గల అంతర మును వివేచనా దృక్పథముతో ప్రయోగశీలకముగా రచ యిత దీనిలో చక్కగా పరామర్శించెను. ఈ రచయిత మరొక మంచి నవల "గూడుచేరిన పక్షులు". ఆంధ్ర సచిత్ర వార పత్రికలో ఇది సీరియల్‌గా ప్రచురింపబడి పలువురి ప్రశంసల నందుకొనిన ఉత్తమ రచన. దీనిలో కథను విలక్షణమైన పద్ధతిలో చెప్పెను.

నవలా ప్రక్రియలో మూఁడలికములను, ముఖ్యముగా జానపదుల పలుకుబడిని, అద్యంతము నవలలో వాడి పసుగుపు మెప్పు పొందిన ప్రఖ్యాత రచయిత శ్రీ పోరంకి దక్షిణా మూర్తి. ఆయన తన "తెలుఁగు పెన్నెల గోదావరి" నవలలో ఉభయ గోదావరి మండలములందు వ్యవహారములోనున్న ఒక విధమైన "యాస" భాషను ప్రయోగించి కృతకృత్యు

డయ్యేను. అదేవిధముగ "ముత్యాలపందిరి" అను నవలను ఆద్యంతము తెలంగాణ జానపదుల వ్యావహారిక భాషలో వ్రాసెను. ఇందు చేనేతవృత్తికి చెందిన పద్మసాలీ కుటుంబ ముల జీవిత చిత్రణము కడు రమ్యముగనున్నది. "ముత్యాల వాడ" గ్రామము ఈ కథాకేంద్రము. లచ్మ్మయ్య, భావనా ఋషి, బావ బావమరదులు. ఒకరిని అదృష్టము వరించగా మరొకరిని దురదృష్టము వెన్నాడినది. లచ్మ్మయ్య కూతురు ముత్యాలు. భావనాఋషి కొడుకు చంద్రయ్య. అంతస్తుల భేదము అ ఇరువురు గాఢముగా ప్రేమించుకొనినను వివాహము కాకుండచేసినది. ముత్యాలు పుట్టినరోజు పండుగకు చేయించిన ఉంగరమును చంద్రయ్య తన వేలికి పెట్టుకొని ఎక్కడనో పారవేసి, ఆ భయముతో గ్రామము విడిచి పారిపోయెను. లచ్మ్మయ్య తన కుమార్తె ఇష్టమునకు వ్యతిరేకముగా "రాములు" అను ఒక అనామకునితో ఆమెకు పాణిగ్రహణము జరిపెను. భావనాఋషి ఆ దిగులుతో మరణించెను. దేశాంతర్గతుడైన చంద్రయ్య తన కులవిద్యలో మంచి ప్రావీణ్యము గడించి తిరిగి ఇంటికి వచ్చెను. తండ్రి మరణించుట, ముత్యాలుకు వేరొకనితో వివాహముజరుగుటకు వగచి, తన ప్రేమసంతటిని గూడుకట్టునట్లు ముత్యాల పందిరితో ఒక చీరను సిద్ధముచేసి, ముత్యాలుకు కానుకగా సమర్పించుటకై ఆమె అత్తవారింటికి పోవుచుండగా, ముత్యాలు భర్తచేత మోసగింపబడిన "లచ్మ్మి" అను

లంబాడి స్త్రీవలన అతని నిజస్వరూపమును తెలిసికొని, తనను అతడు మోసగించినందులకు ప్రతీకారముగా ఆమె అతనిని మాయముచేసిన సంగతిని గ్రహించి, ఆ ఊరు వెళ్ళెను. ముత్యాలు ఏకాకియై జీవించుచున్నప్పుడు చంద్రయ్య అక్కడికి వచ్చుటతో ఆమెలో దాగివున్న ప్రేమ పెల్లుబికినను, సంఘమునకు వెరచి, ఆమె ఆత్మహత్య చేసికొనినది. దానితో కథ దుఃఖాంతమైనది. చంద్రయ్య, ముత్యాలు పాత్రల పోషణములో శ్రీ పోరంకి చూపిన నేర్పు, వారిపట్ల జాలి కలుగునట్లు కథను మలిచిన తీరు మెచ్చుకొనతగినది. శ్రీ పోరంకి వాడిన తెలంగాణ జానపదుల వాడుకభాషకు ఒకటి రెండు వాక్యములు వాచవి. "ఒక్క తాపబండమీద సెయ్యేపెట్టి నిల్చున్నాడు - కాని దగ్గు ఎక్కువయితనే వున్నది - అట్లనే దగ్గుత, డగ్గుత బండమీద తలవాల్చిండు" - మరొక చోట "ఒక దిక్కు నక్కలు కూస్తున్నయి .. ఇంకొక దిక్కు బాజా లినొస్తున్నాయి" అంటాడు.

శ్రీ పోరంకి "నీడలు జాడలు" నవలలో 1919 సం. నుండి నడచిన భారత స్వాతంత్ర్యోద్యమము, రాజకీర్ల దురంతములు, చైనా, పాకిస్తానులు సలిపిన యుద్ధములు వివరింపబడినవి. లక్ష్మీనారాయణ, పద్మారావు, రంగారావుల విభిన్నదృక్పథములతో నడచిన జీవితములను వివరించుటలో రచయిత మిక్కిలి కృతకృత్యుడయ్యెను.

మానసికశాస్త్రపు పరిచితిని ఉపయోగించి జాగరూక

తతో మఁంచి నవలలు వాసిన రచయిత శ్రీ గొల్లపూడి మారుతీరావు - "పిడికెడు ఆకాశం" ఒక ఉత్తమ నవల. దీనిలో పరిస్థితుల ప్రభావమునకు తలవొగ్గి పతనమైపోయిన 'సీత' దుర్భరజీవితముపట్ల రచయిత సానుభూతిని గనబరచుచు ఆ పాత్రను పోషించిన తీరు ప్రశంసనీయమైనది. గోపాలం, నాగరాజు, మాధవరావు, గుర్నాధం మొదలైన వారందరు సీతను గొంతులోతు ఊబిలోనికి దిఁపి, కొద్ది భేదముతో ఒకరి తరువాత మరొకరు వీలైనన్ని కాట్లువేసి, శరీరము నిండా మచ్చలు పడునట్లుచేసి, మానసిక బాధలకు గురిచేసి, అతుకుల బొంతగా మారిన ఆమె వ్యథాకులిత జీవితమును దర్శిష్టలై చూచినవారే! హృదయమును స్పందింపజేయుగల చైతన్యవంతమైన పాత్రలతో నడచిన ఈ నవల ఒక మధుర జీవన స్రవంతి.

శ్రీ మారుతీరావు లేఖిని నుండి వెలువడిన ఇంకొక ఉత్తమ మనోవైజ్ఞానిక నవల "మళ్ళీ రైలు తప్పిపోయింది". బడిపంతులు కొడుకైన చంద్రునిలోని న్యూనతాభావము, (Inferiority complex) గాఢమైన మోతుబరియైన కాంతయ్య కూతురు వలచకు గల అధిక్యతాభావము (Superiority complex) దీనిలో ప్రతిభాసమున్నతముగా శ్రీ గొల్లపూడి వ్యక్త పరచిన పద్ధతి పేరొనదగినది. "సిరితామోకాలొడ్డి" నిలిచినవాడు చంద్రుడు - తనను మనసిచ్చి ప్రేమించిన వలజ ప్రేమను చూరగొనలేని అసమర్థుడు - అదృష్టహీనుడు -

కాగా ఆమెలో దాగివున్న శృంగార వాంఛలను తన యుక్తి చాతుర్యముతో, ఆధునిక నాగరికతా ప్రభావముతో ప్రకోపింపజేసి, స్వాధీనపరచుకున్న అదృష్టవంతుడు రంగరాజు.

చంద్రుడు ఎదిగి పెద్దవాడై తన అంతస్తుకు తగిన తులసిని వివాహమాడి, ఫిస్మాయిల్ అను మిత్రుని సహాయముతో హైదరాబాదులో ఉద్యోగము సంపాదించి, ఒక కూతురును కని, ఆమెకు వివాహముచేసి సుఖముగా జీవయాత్ర సాగించుచుండగా, కాగుచున్న పాలు కాళ్ళబూద పోసికొని తులసి అవిటిదైనప్పుడు, బాగుచేయించుటకు రాయవేలూరు వెళ్లుచూ, అల్లుడు కూతురుకొరకు విజయవాడ స్టాటు ఫారమునిండ ఎదురుచూచుచుండగా చంద్రుని పాతస్నేహితులైన వలజ, రంగరాజులు కలసినప్పుడు, గత స్మృతులు గుర్తుకురావడముతో, కథ ప్రారంభమై, ఆ ఇరువురు వెళ్ళిన రైలుకు ప్రమాదము సంభవించడముతో కథ ముగిసినది. వలజ వెళ్ళుతూ చివరసారి చంద్రునితో "మళ్ళీ రైలు తప్పిపోయింది" అన్న వాక్యమునే రచయిత నవలకు పేరుగా పెట్టుట సమంజసముగానున్నది. కథను కట్టుదిట్టముగా మలచి, వాచవులూరించు భాషతో నడచిన "మళ్ళీ రైలు తప్పిపోయింది" నవల గొప్పది.

"వెన్నెల కాటేసింది" కీ॥ గొల్లపూడి మరొక నవల. దీనిలో కథకుడు, సుబ్బులు అనే అమ్మాయి, ముఖ్యపాత్రలు. కథకుడు సుబ్బులును ప్రేమించినను, తన మనోభావములను

ఆమె ముందు పెట్టలేని పిరికివాడు. ఇక సుబ్బులు వేరొక అరవ యువకుణ్ణి ప్రేమించి, తల్లిదండ్రులు అభ్యంతరము పెట్టినప్పుడు తాతగారి ఇంటికి వచ్చి మన కథకుణ్ణి ప్రేమించి నట్లు నటించి, యుక్తితో తన ప్రేమను సఫలము చేసికొనినది. అసలు కథ ఈవిధముగా సాగుచున్నప్పుడు రచయిత కథను మరొక 22 సంవత్సరములు ముందుకు తెచ్చి, సుబ్బులు కు జన్మించిన కొడుకు ఎం. బి; బి. యస్; చదువుచు ఒక పంజాబీ పిల్లను ప్రేమించినప్పుడు కొడుకు ప్రేమకు అభ్యంతరము తెలిపి, తనకు పూర్వపరిచితుడైన కథకునితో తన విఫల ప్రేమగాథను చెప్పించినది. ఇది విన్న కొడుకు "ప్రేమించిన వ్యక్తిని దక్కించుకోడానికి ఏంచెయ్యాలో తెలీక పతమత మాతూవుంటే - నీకథ చెప్పించి నాకు మేలేచేశావు. ఆ అమ్మాయిని తీసుకొని నేను వెళ్ళిపోతున్నాను-" అని నిష్క్రమించినప్పుడు సుబ్బులుకు కడివెడు కన్నీరు మాత్రమే మిగిలినది. "పెద్దలైనవారు తమ సమకాలీక సంప్రదాయమును కాలదన్ని తమకు నచ్చిన మార్గము ననుసరించి నడచినప్పుడు, తమ సంతతియే అపని చేసినయెడల అడ్డుపెట్టు హక్కు వారికి వుండదు-" అని నిరూపించు నవల ఇది.

సాహిత్యవాదముపట్ల ఆదరణ కలిగి రచనలు చేసిన ప్రగతిశీలి శ్రీ గోసరాజు శేషయ్య - అయన తన "పల్లెవాసి" నవలలో అంత్యంతము కమ్యూనిస్టు సిద్ధాంతముకు ప్రాధాన్యతనిచ్చి, గ్రామీణ వాతావరణమును అందులో ప్రతి

బింబింపఁజేసెను. కరణము, మునసబు చెలి ఒక పార్టీకి ప్రతినిధులు. లక్ష్మి శ్రామికజీవులకు ప్రాతినిధ్యము వహించి వారి ఆభ్యున్నతికి పాటుపడిన యువతి. సుశీల బ్రాహ్మణ వితంతువు. వర్ణ విభేదమును పాటించక ఒక క్రిష్టియనును, కమ్మ్నాయువకుని వరుసగా ప్రేమించినది ఆమె. పెక్కు సంఘటనలకు ఆకరమైన ఈ నవలలో వస్తైక్యము, సాహిత్య విలువలు తగ్గి, అక్కడక్కడ కొన్ని బూతులుండి, నవలయందు జీవత్వము లోపింపఁజేసినది. ఐనను బహుళ ప్రయోజనమును సాధించునట్టి శ్రీ కోసరాజు మరొక నవల 'లాడ్జింగులో ఒక రాత్రి'. ఘరానాపద్ధతిలో పట్టణములలో 'లాడ్జింగు' ల పేరుతో సాగుచున్న వ్యభిచార పద్ధతిని, ఆసుడిగుండములో పడికొట్టుకొనిపోవుచున్న అభాగ్య యువతుల జీవితగాథలను, వారు ఆపరిస్థితులకు దిగజారిపోయిన పరిస్థితులను, రచయిత దీనిలో వివరించెను. కథానాయకుఁడైన మోహనరావునకు ఒక లాడ్జింగులో కనకం, తార అను ఇరువురు స్త్రీలతో పరిచయమైనది. కనకం తనకు పరిచయమున్న కరణంగారి కూతురు. ఇక తార తన స్నేహితుఁడు ప్రేమించి వివాహమాడిన వధువు - ఆ ఇరువురిని పై అధికారుల సహాయముతో ఆ నరక కూపమునుండి రక్షించి కనకము, నాగేశ్వరరావులకు వివాహము జరిపి, తారను ఆమె భర్త మరల స్వీకరించునట్లు చేసి, రచయిత కథను ప్రగతిశీలకమైన ఉదార వైఖరిలో ముగించెను. మోహనరావు మానవతావాద దృక్పథము

ఆదర్శపాత్రముగ చిత్రించబడినది (1966).

"గద్వాలచీర" రచనతో గొప్ప నవలా రచయితయై తెలుఁగునాట స్థిరపడిన శ్రీపన్యాల రంగనాధరావు వెలువరించిన మరొక ఉత్తమ నవల "ఒకే రక్తం-ఒకే స్పర్శ". దీనిలో "నిజాయితీ ఎంత గొప్పదయినా, హిపోక్రసీకున్నంత బలం దీనికి లేదు-" అని చెప్పి. ఆ విషయమును రచయిత బలమైన నిదర్శనములతో నవలయందు చొప్పించెను. ఢిల్లీ, విశాఖ పట్టణము, మద్రాసు నగరములలో తెలుఁగు జీవన స్రవంతిని, మనము తిలకించుచున్న ఈ ప్రపంచమునకన్న భిన్నమైన సినీ ప్రపంచమును, అందలి వొడుదుడుకులను వివరించు మధుర స్రవంతి ఈ నవల. చిన్నతనమునే తల్లి ప్రేమకు కరవైన చలపతి, అందరు తెలుఁగు యువకులవలెనే ఉద్యోగాన్వేషణలో ఢిల్లీ చేరి శ్రీమతి గుమ్మడిదల దుర్గాబాయి నడుపుచున్న ఆంధ్ర విద్యాసంస్థలో నిస్వార్థబుద్ధితో కార్యదర్శిగా పనిచేసిన ఆదర్శవాది. తండ్రి మరణవార్తతో అతడు విశాఖకు పోయి, అడ్డడ పినతండ్రి రామమూర్తితో అవమానింపబడి, తన తండ్రి చేరదీసిన పినతల్లిని. ఆమె కూతురు అనసూర్యను వెంటతీసుకొని ఢిల్లీకి బయలుదేరుచుండగా బాల్యమిత్రుడైన చక్రపాణి ఆదరణకు వారు పాత్రులై, ఆ పిమ్మట ఢిల్లీకి చేరి మిత్రుల ప్రోద్బలముతో "సంస్కారి" నాటకములో అన్నా చెల్లెండ్రు అద్భుతముగా పాత్రధారణ చేసి, పేరుప్రతిష్టలను గడించుట, అనసూయను ప్రేమించిన

చక్రపాణి ఆ నాటకమును ప్రచ్ఛన్నముగా చూచి, తాను మద్రాసులో తీయుచున్న సినిమాలో వారిని నటించుటకు ఆహ్వానించెను. వారు అతనివెంట అక్కడికి వెళ్ళి అతడు తీసిన 'ప్రతీకారము' సినిమాలో నటించి, దానిలో ఎదురైన వెక్కా చిక్కులను అధిగమించుట, "గోయపిల్ల" సినిమాలో అనసూయ హీరో పాత్రను ధరించుట, చక్రపాణి దర్శకత్వము, వెంకటచలం, సత్యం, కామాక్షమ్మలవంటి పరోక్ష విషకుంభముల విచిత్ర ప్రవర్తన; చలపతి, చక్రపాణి, అనసూయల హృదయములలో రేగిన కల్లోలములు, మనస్పర్ధలు, యథార్థపరిస్థితి బయటపడినప్పుడు, ఆ ముగ్గురి హృదయములు తేటపడిన విధము, ఇందులో చూపబడినది. రామమూర్తి భార్య చేసిన పోరపాటుకు పశ్చాత్తాపపడినప్పుడు "స్వార్థానికి గెలుపు ఎప్పుడుకూడా శాశ్వతమే తల్లీ!" అని అన్న అన్న మాటలకు అనసూయ తన అన్న విషయములో వెంకటచలం మాటలతో పోరపాటుపడి అతనిని అనుమానించినందుకు ఆమె నోటినుండి పశ్చాత్తాపముతో వెలువడిన ఈ మాటలు చూడండి - "దేముడంటి ఈ అన్నయ్యనేనా పరిపరివిధాల భావించింది-" అంటుంది ఎంతో ఉద్వేగముతో. చలపతి శీలము, అతని నిస్వార్థ ప్రజాసేవ నవలకు జీవము. మూరన్న ఒక పనిమనిషి. హృదయమున్న తెలుఁగువాడు. నిజాయితీతో తన విద్యుక్త ధర్మమును నెరవేర్చిన కర్తవ్య పరాయణుడు.

నవలలు వ్రాయుటయందును, వానికి తగిన పేర్లు

పెట్టుటయందును, రసవత్తరముగా వానిని తీర్చిదిద్దుట యందును, పెక్కు యదార్ధ విషయములను, నగ్నసత్యములను నీతులవలె బోధించక, పొందికగా నవలలో అతుకునట్టు తగిన శ్రద్ధవహించి రచన చేసినవాడు శ్రీ వీరాజి. "ప్రేమకు పగ్గాలు" నవలలో ప్రేమకు గల హద్దులను, ఆ హద్దుల పరిమితికి అనుగుణ్యముగా భాస్కరం, పద్మావతి, సురేఖ మున్నగు వివిధ వ్యక్తుల జీవితములతో ముడివడిన ప్రేమను రచయిత చక్కగా నిరూపించెను. "నేను నిన్ను ప్రేమించడం వల్ల నా పిన్నికి కష్టం. నా చెల్లెలికి చెల్లి అవదు. నీ కుటుంబానికి గల అపకీర్తి ఒక అడ్డు" అని తనను హృదయమిచ్చి ప్రేమించిన పద్మావతికి చెప్పలేని అసమర్థుడు భాస్కరం. అటులనే పిసతల్లి జానకమ్మతోను తన ప్రేమను చివరవరకు చెప్పలేక, తన ప్రేమను పగ్గాలతో బిగించుకొనెను. ఇక సురేఖ తన మిత్రురాలైన పద్మావతి, భాస్కరమును ప్రేమించుచున్నట్లు గ్రహించి, తనకు భాస్కరమునకు దొడ్డమ్మ వివాహము స్థిరపరచినను నిరాకరించి స్నేహితురాలిపట్ల ఔదార్యమును ప్రకటించి తన ప్రేమకు తానే పగ్గాలువేసి బిగించుకొనిన ఆదర్శ యువతి. ఈ ముగ్గురి మధ్య ఏర్పడిన ప్రేమలు, వాటికి అడ్డుపడిన విభిన్న సమస్యలు, అంతస్తుల కారణమ్యములు, వాటివలన కలిగిన అఘాతములు దీనిలో వివరింపబడిన తీరు మెచ్చుకొనతగినది.

"ఇద్దరం ఒకటే" శ్రీ వీరాజి రచనలలో గణింపదగిన

మరొక మంచి నవల. యౌవన ప్రాంగణములో అడుగిడిన యువతీ యువకులు పోవునట్టి విచిత్రమైన పోకడలను, విభిన్నమైన ప్రవర్తనలను నేర్పుతో రచయిత దీనిలో చిత్రించెను. మంజుల కళాశాల విద్యార్థిని. మనోహరమూర్తి అదే కళాశాలలో ఉపన్యాసకుడు. ఆ ఇరువురిమధ్య ఏర్పడిన ప్రేమ, అంతస్తుల భేదము ఆ ప్రేమికుల మధ్య వచ్చిన గొడవలు, ఆ గొడవల మధ్య చిత్ర విచిత్రమైన పద్ధతులలో కథ సాగిన తీరు ప్రశంసనీయమైనది. హృదయమిచ్చి ప్రేమించగల జానకి మంజుల ముఖ్య స్నేహితురాలు. జానకి, మంజుల స్నేహానుబంధము, ఆ త్మీయత, నవలలో ఉన్నతస్థాయి నందుకొనినది. ఈ నవలలోని "మధురిమ" పాత్ర పాఠకుల హృదయములలో కలకాలము నిలచి వుండగలట్టిది. ప్రవాహ సదృశమైన శైలితో, సరస సంభాషణలతో, విచిత్రమైన వర్ణనలతో నడచిన ఉత్తమ శ్రేణి రచన ఇది.

మౌలికమైన సూత్రముల అవగాహనముతో చక్కని రచనలు చేయుచున్న రచయితలలో శ్రీ నండూరి విఠల్ పేర్కొనదగినవాడు. "కాలకన్య" అనునది ఆయన రచించిన అమృత నవలాఖండము. "మనిషి జీవితంలోని కాలాని కున్న తిరుగులేని అధికారం ఎటువంటిదో ఇందలి కథలో చెపటానికి ప్రయత్నించాను-" అని రచయిత నవలకు ముందువ్రాసిన "పాఠకునికి రచయిత లేఖ" అన్న, విన్నపము నందలి వాక్యము పై విషయమును స్పష్టపరచుచున్నది. ఈ

నవలలో కరుణాకరం, వసంత; రాజారావు, కళ్యాణి; మున్నగు వానిమధ్య నడచిన ప్రేమగాథలను చివరవరకు బిగువు చెడ కుండగ పాఠకులకు ఉత్కంఠతను కలిగించుచు రచయిత నేర్పుతో కథను నడిపెను. ప్రతి చిన్న సన్నివేశము దృగ్గో చరమగునట్లు చూపుటయేగాక, సంభాషణలుగూడ సహజ సుందరముగా రూపొందింపబడినవి.

"ఏమో ముత్తెం - నాకు చాలా విసుగ్గావుంది. ఆ దేవుడిచ్చిన ఐశ్వర్యంతో అందరికీ సహాయం చేద్దామనే ప్రయత్నించా. నేను పెట్టిన అన్నం వివంగామారి చివరకు నన్నే దహిస్తుందిరా" అని కరుణాకరం తన బాల్యమిత్రు డైన ముత్తెంతో అన్న మాటలతో, అతని అమ్మాయి హృద యము, పరోపకారబుద్ధి, మంచిపట్ల, మానవతపట్ల అతనికి గల మమత, కృతఘ్నులవల్ల అతడు పొందిన బాధలు వ్యక్తము కాగలవు. (234 పేజి).

స్వార్థమునకు మారుపేరై విశృంఖలముగా ప్రవర్తిం చిన వరదాచార్యులు చివరకు పొందిన అధోగతిని, గ్రామీణ జీవితములో అడుగడుగున స్వార్థపరులైన పెద్దలు, నిస్వార్థపరు లైన కార్యకర్తలపట్ల, వారి సాంఘికాభివృద్ధికి సంబంధించిన కార్యకలాపములపట్ల గనబరచు ఈర్ష్యాసూయలను, ప్రగతి మార్గమునకు కలిగించు అడ్డంకులను రచయిత ఇందులో చక్కగా వివరించి "ధర్మము" నకు కలుగు విజయమును నిరూపించి చూపెను. విశ్వపతి మాష్టరు అయిన ధర్మపత్ని

గౌరమ్మ పాత్రలను రచయిత విశిష్టరీతిలో పోషించిన పద్ధతి ఎన్నటికీ మరచిపోలేనిది (1968 సం.). శ్రీ నండూరి విఠల్ వ్రాసిన మరొక ఉత్తమ నవల "మా ని షి" - మనిషికి తన భవిష్యత్తు తెలిసినచో ఎట్లుండునో వివరించు" నవల ఇది- ఉత్తమ పురుషలో కథను రచయిత వివరించెను. పార్థ సారధి అందమైనవాడు కాకపోయినను, ఒకవిధమైన ఆకర్షణ శక్తికలవాడు-కనుకనే అతనిని మోహిని, హెలెన్, కళ్యాణి, వైదేహి, సుమబాలలు మోహించినను, తాను ఇరువది తొమ్మిదవ ఏట చనిపోవుదునని తెలిసినవాడు గనుక ఎవరికి అందకుండగ తెగిన గాలిపటమువలె సంచరించి, జీవితములో ఎన్నో మలుపులు చవిచూచిన వ్యక్తి - ఇన్ని మలుపులు తిరిగిన అతనిలోను మళ్ళీ బ్రహ్మకవలెనను కాంక్ష, లోకము నంతటిని తనది చేసికొనవలెనను కాంక్ష నిండుగా కలిగిన వాడు - చివరకు మరణము తప్పలేదు. తన భవిష్యత్తు తెలిసిన సారధి జీవితములో పొందవలసిన ఆనందమును పొందలేదు, గనుక అది తెలియకుండగా వుండుటమే మంచిదేమో ననిపించును శ్రీ నండూరి విఠల్ రచించిన ఈ నవల గూడ చక్కని గాడిలో నడచిన కమనీయ రచన.

"నిశిత పరిశీలన, మానవ అంతరాంతరాల్లోకి తొంగి చూడగల ప్రతిభ, అధో జగన్నమోదరుల జీవకాన్ని ప్రతిబింబించగల సామర్థ్యమూ రచయితకున్నాయి" అని శ్రీ తాడిగిరి పోతరాజు "మట్టిబొమ్మలు" నవలకు ప్రకాశకులు వ్రాసిన

పరిచయవాక్యములతో పూర్తిగా వీక్షించుట కష్టమైనను, కొంతవరకు సత్యమని దీనిని చదివినవారు గ్రహించగలరు. ఇది 1967 వ. సం. ఆంధ్రపత్రిక నిర్వహించిన ఉగాది నవలల పోటీలో ప్రథమ బహుమతి నందుకొని, 1967 వ. సం. నవంబరులో గ్రంథరూపము ధరించినది. పల్లెపట్టులు స్వర్గధామములని అభివ్యక్తీకరించు కాలము అంతరించినది. నేడు పల్లెలలో కృత్రిమ వ్యవహారములది పైచేయి. "ఆదర్శ ప్రవర్తనగల వ్యక్తులు అధోగతిపాలై అవమానములకు గురికాక తప్పదు" అను సత్యమును దీనిలో మాష్టరు పాత్రద్వారా రచయిత హేతుపూర్ణముగా రుజువుచేసెను. "ప్రేమ-పెళ్ళి" అను ఈ రెండు సమస్యలకే నేటి రచయితల వలె ఈ రచయిత గూడ అధిక ప్రాధాన్యము నిచ్చినట్లు పైకి కనుపించినను, విభిన్న సంఘర్షణలు, సమస్యలు కల్పించి, వాటికి పరిష్కార మార్గములను చూపుటలో ఆయన గనబరచిన వైవిధ్యము పై లోటును కప్పిపుచ్చి నవలకు మంచి "హుందా" తనము నిచ్చుచున్నది. న్యాయపక్షము నవలంభించిన మాష్టరు, శివరామయ్య ఆగ్రహమునకు, అచ్చమ్మ బెదిరింపులకు గురియై, ఉద్యోగము పోగొట్టుకొనినను, పెద్దకూతురు శారద మధుతో వెళిపోయినను, చిన్నకూతురు భానును ప్రసాదు తిరస్కరించినప్పుడు ఆమె ఆత్మహత్య చేసుకొనినను, ఆ వూరి ప్రజలు మట్టిబొమ్మలై చూచిరేగాని ఆ అన్యాయమును ఎదిరించి వేలెత్తి చూపరైరి. ఈ దుస్సంఘటనలన్నియు మాష్టరు

జీవితమును కదలించి మథించునట్లు చేసినవి. కథ విషా దాంతమై ముగిసినది. నవల చదువుటకు ఇంపైన భావలో నడచినది.

వాస్తవమైన విషయములను ప్రజలముందుంచుటకు ఎట్టి భయసంకోచములులేక రచనలు చేసినవ్యక్తి శ్రీ గొల్ల పూడి నారాయణ. "పాతరోజులు" నవలలో 'పరిపాలన' అన్న పేరుతో ప్రజలను - అందున, నోరులేని అమాయక ప్రజలను పీడించి పిప్పిచేయుచున్న ప్రభువుల అగడములను, వారి దుర హంకారపూరిత దుష్ట వ్యూహములను యథాతథముగా అయన చిత్రించెను. ఇందులో అమాయకులు క్రమముగా కామనుభవించు దుర్భరమైన బాధలనుండి బయటపడి వెలుఁగువైపుకు ప్రయాణమును సాగించిన తీరును మిక్కిలి నేర్పుతో వివరించెను. అధికారులు విధించిన 'జుత్తు' పన్ను చెల్లించలేక బాధపడుచున్నప్పుడు, ఆ అధికారులే తనింటికి రాగా అప్పుడు పుట్టిన ఆ బిడ్డను కుండలో పెట్టి గడ్డివామి చాటున దాచివుంచి "నా బిడ్డ పుట్టగానే చచ్చిపోయింది" అని నవమాసములుమోసిన కన్నతల్లి అన్న హృదయ విదా రకమైన మాటలివి. శ్రీ నారాయణ తన మరొక నవల "వైకుంఠంలో కల్లోలం" లో మన పురాణములపట్ల, దేవ తలపట్ల మనకుగల మూఢ విశ్వాసములను, నమ్మకములను వ్యంగ్యధోరణిలో విమర్శించి, అధునిక విజ్ఞానశాస్త్ర సహాయ ముతో మానవుడు దేవతలపైన సాధించిన ఘన విజయము

లను వివరించెను. (మేన్ × యాంటిమేన్) మానవుడు × మహా విష్ణువుల మధ్య జరిగిన విచిత్ర సంఘర్షణ దానితో దేవతలపైన మానవుడు గడించిన విజయము తెలుపబడినది.

ప్రతిభావ్యుత్పత్తులు రెండును సమృద్ధిగా కలిగి నవలలు వ్రాయుచున్నవాడు శ్రీ రంధి సోమరాజు. ఆయన వ్రాసిన 'సౌందర్యమూ-సౌశీల్యమూ' నవలను పరామర్శించినయెడల అవిషయము మనకు ద్యోతకమగును. జీవితమార్గములో గాడితప్పిన ఒకానొక స్త్రీవలన ఒక యువకుని జీవితములోను, అతనివలన ఆమె జీవితములోను కలిగిన పరివర్తనములను అంశములతో ఈ నవలయందలి ఇతివృత్తము రూపొందించ బడినది. ఈ నవలలో రాజమహేంద్రవర పట్టణముయొక్క సౌభాగ్యములను, దానినంటి ప్రవహించుచున్న గోదావరీ నది అపూర్వ సౌందర్యమును అయిన ప్రతిభాపూర్ణముగా చేయితిరిగిన చిత్రకారునివలె చిత్రించెను (1962). శ్రీ సోమరాజు మరొక ప్రథమశ్రేణి నవల "దుఃఖతులు". భద్రం అను ఒక ఆదర్శ చిత్రకారుని జీవితమును రచయిత భిన్నకోణములనుండి పరిశీలించి, అతని ఆలోచనలకు అను గుణమైన ఆశయసిద్ధికొరకు అతడు పడిన పాట్లను, ఆవి సిద్ధిం చక విసిగి వేసారి తన జన్మభూమిని విడిచి ఫ్రాన్సుకు పోయి అక్కడ అజ్ఞాత జీవితము గడిపి అనామకుడిగా కన్నుమూసి నను, ఆపిమ్మట అతడు చిత్రించిన చిత్రములకు అధికమైన ప్రశస్తి, ఆదరణ లభించి అమితమైన డబ్బు, అఖండమైన

కీర్తి లభించినది. అతనిపేర ఒక చిత్రకళాశాలను నిర్మించి నప్పుడు భార్య జమున అచటికి వెళ్ళి అతని శిలా విగ్రహమును ఆవిష్కరించుచు మరణించినది. కథ విషాదాంతమై ముగిసినను, ఆ అమరశిల్పి జీవితగాథను రచయిత మిక్కిలి నేర్పుతో మలచి, తెలుఁగువారికి శోభాసమన్వితమైన నవలా రాజము నందించి కీర్తిని గడించుకొనెను. ఇది ఒక వినూతన పద్ధతిగల రచన.

శ్రీ చెవరకొండ చిన్నికృష్ణశర్మ పెక్కు నవలలు వ్రాసిన ప్రసిద్ధ రచయిత. ఆయన "స్నేహలత" నవలలోని 'అప్పి' తక్కువ కులమునకు చెందినదైనను ఉత్తములాలు. భర్త త్యాగులోతై చెడ్డగా తిరిగినను సహించి మంచిమార్గమున పెట్టుటకు ప్రయత్నించినది. అమె తన తమ్ముడు గోపీ బాల్యమునసే ఇంటినుండి వెళ్ళిపోయి జాతీయోద్యమములో చేరి జైలుశిక్ష ననుభవించి, దేశసేవ చేసి, గోపాలకృష్ణుడై ఇంటికి తిరిగివచినప్పుడు రతి అనే అమ్మాయిని పెండ్లిచేసి అమెను రత్నావళిగా మార్చివేసినది. జాతీయ పాఠశాలను స్థాపించుట, రాట్నము వడకుట, హిందూ ముస్లిముల ఐక్యతకు పాటుపడుట మున్నగు గాంధేయ నిర్మాణాత్మకమైన కార్య క్రమములకు ప్రాధాన్యతనిచ్చెను. ఇందలి అప్పి పాత్ర చిత్రణము బాగుగానున్నది (1962). ఆయన మరొక నవల "మధూక కుసుమాలు". 'రాము' అను బాలుడు చిన్న తనములో కౌసల్యాదేవి, రాఘవరావను తన తల్లిదండ్రుల

నుండి తప్పిపోయి ఒక బీద బ్రాహ్మణ దంపతులకు లభించి అక్కడ దినదినప్రవర్ధమానుడగుచుండగా ఆ దంపతుల మరణానంతరము ఒక సంపన్న గృహస్తురాలైన రాజ్యలక్ష్మీదేవి వద్దకు చేరుటయు, తనకు మల్లవిద్య నేర్పిన భైరవశాస్త్రి వలన ఆమెకు అపాయము సంభవించనున్నదని గ్రహించి, ఆమెను రక్షించుటము, శాస్త్రి దుస్తంత్రములతో అతడు పోలీసులకు పట్టుపడటము, అన్యాయముగా జైలుశిక్ష ననుభవించటము, అక్కడ అతడు పడిన పాట్లు, శిక్షననుభవించినపిమ్మట విడుదల, మరల వివిధరకములైన బాధలు సహించుచు, పరోపకారచింతనతో చేసిన ఉత్తమ కార్యక్రమములు, మేన మామ కూతురు జయశ్రీతో జరిగిన వివాహముతో, కథ సుఖాంతముగా ముగిసినది. 'మానవసేవయే మాధవసేవ' అని భావించిన రాము జీవిత చిత్రణము ఆదర్శప్రాయమైనది.

శ్రీ పెద్దిభొట్ల సుబ్బరామయ్య "ధ్రువతార" నవల తెలుఁగు నవలా వికాస సాహిత్యములో ఒక ధ్రువతార వంటిది. "కాళిదాసు" అను ఒక సామాన్య ఉపాధ్యాయుడు తన భార్యను గోలుపోయి విషాదభూయిష్టమైన విధుర జీవితమును గడిపినను, అతని చుట్టుపున్న పిల్లలు వారి చదువు సంధ్యలు, ఆటపాటలు అతని జీవితమునకు ఒక విధమైన దీప్తిని, ఆనందమును ప్రసాదించగలిగినవి. అయన మంచితనము, సత్ప్రవర్తన సహ ఉపాధ్యాయులలోను, అల్లరి పిల్లలలోను గొప్ప మార్పును, స్ఫూర్తిని ప్రసాదించగలిగి

నవి, ఈ నవలలోని వర్ధనమ్మ ప్రదర్శించిన వలపు. ఆమె విషాద మరణము హృదయములను కదలించివేయుగలట్టివి. కాళిదాసు పాత్ర సృష్టి విషాద, ఔదార్య త్యాగభావముల సమ్మేళనమై గోచరించుచున్నది.

నవలా రచనమున ఒక ప్రత్యేక టెక్నిక్ సాధించిన వ్యక్తి శ్రీ అవసరాల రామకృష్ణారావు. "సంపెంగలూ - పన్నజాజులు" నవలలో ప్రసాదరావు, మంజుల, అన్నా - చెల్లెలు. ఆ ఇరువురు ఆదర్శప్రాయముగా ఒకరి అభివృద్ధికి మరొకరు, ఒకరి ఆశయసిద్ధికి మరొకరు పాటుపడుచు తమవలె ఉన్నతభావసంపన్నులైన మంగళను, ప్రసాదరావు; రామ మోహనరావును మంజుల వివాహానంతర జీవిత మాధుర్యమును నిండుగా అనుభవించిరి. ఆ రనవత్తర ఘట్టములలోని కొన్ని విశేషముల సంపుటీకరణమే ఈ నవల. రచయిత తన రచనా సామర్థ్యముతో దీనిని సుందరాతి సుందరముగా మలచెను. ఈ రచయితదే మరొక ఉత్తమ కథాఖండము "అది ప్రశ్న-ఇది జవాబు". "మనకు తెలిసినదే దుఃఖమనీ, మనం ఎరిగినదే కష్టమనీ" భావించి అది ప్రశ్నగా బాధపడటము లోకసహజము. మనము కనీనినీ ఎరుగని కరుణామయ గాథ కళ్ళముందు నిలబడి "ఇది జవాబు" అని వివరించినప్పుడు ఆశ్చర్యపడటమూ సహజమే. ఆ నగ్నసత్యమునే దీనిలో కర్తవ్యనిష్ఠాగరిష్ఠులు, ఉత్తమ దేశభక్తులునైన మిలటరీ డాక్టర్. విజయకుమార్, సిగ్నలింగ్ ఆఫీసర్

శ్రీ కృష్ణమూర్తి వ్యధాకులితమైన తమ తమ జీవితగాథలను, వ్యధలను చిత్తమ పుస్తకంలో చెప్పుకొనిపోయిరి. దీనిలో వ్యాసమూర్తి పై అల్లరిపిల్లవాడై కనుపించినను పరోపకార చింతనగల పరమ పవిత్రుడు. సరళ జీవనమూ, సచ్చింత నమూ రెండును అతని దివ్యాభరణములు. అతడు డాక్టర్ విజయకుమార్‌తో కర్తవ్యమును బోధించుచు అన్నమాటలు చూడుడు - "అమ్మ అంటే మీ అమ్మ సుభద్రమ్మ" అని కాదు - "నీకు నాకు అందరికీ అమ్మ, మన అమ్మలందరికీ అమ్మ, మనల్ని కని, కనిపెట్టే మన దేశం. మన భారత మాత. మనదీ ఒక జాతి అనీ, మనకీ ఒక సంస్కృతీ ఉందనీ తలెత్తి మనం నలుగురిలో చెప్పుకోవలసిన మన పుణ్య మూర్తి. మన ఆర్యభూమి. అమ్మ ఆపదలో వుండి నిన్ను పిలుస్తోంది" (55 పేజి). 'గీత' మరొక మహోన్నత ఆదర్శ యువతి. హృదయమున్న తెలుగుల అడపడచు. కనుకనే ఆమె తండ్రితో అన్న యీ మాటలు చూడండి - "వియత్నాంలో యుద్ధం మరీ ఘోరరూపం దాల్చిందట..." అని అక్కడి ప్రజలకు సంభవించిన కష్టనష్టములను చూచి విలవిల లాడిపోయినది (59 పేజి). ఇక శ్రీ కృష్ణమూర్తి (పిచ్చిబాబు) మూరుతల్లి విజయులమ్మ. మొదటిలో అందరూ మూరుతల్లుల వలె పైకి కనుపించి ప్రవర్తించినను నిండైన మానవత్వ మున్న స్త్రీ. తన మూడు కొడుకును కన్న కొడుకుకన్న మిన్నగా భావించినను, హృదయకుహరములో యేమూలనో

దాగియున్న ప్రేమభావమును పైకి వ్యక్తముచేసి అపహాస్యము పాలుగాక, అక్కడనే నలిపివేసి అతని అభివృద్ధికి, ఉన్నతికి మార్గముకల్పించి తనకుతానై తెరనుండి నిష్క్రమించి అతని పూర్ణమును సుగమము చేసిన ఆదర్శ ప్రేమమూర్తి. ఆమె చివరిసారి వ్రాసిన ఈ లేఖను చూడండి - "నేను మళ్ళీ బన్నిస్తాను. నా బ్రతుకు పండేలాగ. నా మనసు నిండేలాగ నిన్ను కంటాను. నాకు ఆశ్రయమిచ్చిన ఈ చల్లని నీటిలోని అనంతకోటి బిందువుల్లో కలసి నశించిపోను ..... ఈ పిచ్చి వాడికి ఈ పెరిన్ అమ్మ ఎప్పుడూ ఉంటుంది-" నీపిన్ని (182 పేజి). ఇండలి పాత్రలన్నియు సజీవ సంపన్నములై కాము కదలుతూ ఇతరులను కదలించివేయగల, కలచివేయు గల సమర్థములైనవి. ప్రతి సన్నివేశము, ప్రతి సంఘర్షణ, ప్రతి వాక్యము నవనీతము. భావగర్భితము.

కథనానుశీలనై, ఒడిగివచ్చు భాషాధికారములో, మన స్తత్వ పరిశీలనముతో రచనలు చేయగల నేర్పరి శ్రీ వి. యస్. అవధాని. ఈయన పెక్కు నవలలు వ్రాసినను అవి నాలుఁగు కాలములపాటు జ్ఞాపకముంచుకొనదగినవి కాకుండుట కొంత ఆశ్చర్యమును కలిగించును. "చారుమతి" అన్న నవలలో చదలం, చారుమతి, కాంతం, మోహనరావు, లిల్లీ మున్నగు వారి ప్రేమకలాపములు అపహాజముగా నున్నవి. "చదువు కొని ఉద్యోగాలు చేస్తున్న ఆడవాళ్ళకు మతిస్థిమితం ఉండదు-" వంటి మాటలు పాత్రల నోటితో చెప్పించినను,

స్త్రీపురుషు లిరువురు సమాన విద్యాగౌరవములతో చెట్టా పట్టాలు పట్టుకొని ప్రగతిపథమున ముందుకు సాగిపోవుచున్న ఈ కాలమునకు సరిపడునట్టివి కావేమో! ఈయన మరొక నవల "ఇంటిదొంగ"లోని శాస్త్రి కల్పితకథారాహిత్యమునకు మచ్చుతునక. ఇక ఆయనతో పరిచయము కలిగించుకొనిన స్త్రీలందరును ఆ కోవకు చెందినవారే. విశృంఖల ప్రవృత్తికి ఇది మరొక ఉదాహరణ. ఆయన వేరొక నవల "ప్రాణాంతక పణయం". దీనిలోని ఇతివృత్తము విచిత్రమైనది. భావ నారాయణ మొదటి భార్య కొడుకు నారాయణ పదునాలు గేండ్లవాడుగా నున్నప్పుడు, పద్దెనిమిది సంవత్సరముల అన్న పూర్ణ తండ్రికి రెండవ భార్యగా ఆ ఇంటికి వచ్చినది. కొంతకాలమునకు భావనారాయణ మరణించగా, పినతల్లి అన్నపూర్ణ, నారాయణకు లీలావతి, రూపాదేవి, మున్నగు వారితో వివాహము జరుపుటకు ప్రయత్నించినను, అవి విఫలమైపోయి, అన్నపూర్ణకు నారాయణకు అక్రమ సంబంధము ఏర్పడినది. దానికి రచయిత ఒక పరిష్కారమార్గమును చూపియుండిన బాగుగా నుండెడిది. సాంఘిక సమస్యలపట్ల నూతన దృక్పథమును పేటి, ఆయన యీ నవలా కథన మున ప్రవేశపెట్టిన సన్నివేశములు కృత్రిమములై సహజత్వ మును కోల్పోయినవి.

తెలంగాణాప్రజలు తరతరములుగా అనుభవించిన కడగండ్లను, ప్రముఖముగా 1946 - 48 సం. మధ్య ఆనాటి

నిరంకుశ ప్రభుత్వమునకు వ్యతిరేకముగా నడచిన వీరోచిత పోరాటమును చిత్రించుచు పెక్కు గద్యపద్య రచనలు వెలువడినను నవలారూపమున ఆ మహోద్యమమును చిత్రించిన మొదటి రచయిత బహుళ: శ్రీ బొల్లిముంత శివరామకృష్ణయే కావచ్చునని అయన వ్రాసిన "మృత్యుంజయులు" నవల ద్వితీయ ముద్రణకు (1968 సం) ముందుమాటలలో శ్రీ తుమ్మల వెంకట్రామయ్య వెలిబుచ్చినది సత్యమనిపించును. దాని ప్రథమ ముద్రణ 1947 సంవత్సరము గనుక ఆ దృష్టితో చూచినచో శ్రీ ఆళ్వారుస్వామి, శ్రీ మహీధర, శ్రీ దాశరథి రంగాచార్యులు మున్నగు రచయితలు ఆ ఉద్యమము గురించి వ్రాసిన నవలలకన్న ముందే ఇది వెలువడినది. ప్రభుత్వ అండదండలతో, తన కాంట్రాక్టుల కుతంత్రములతో దేశముఖు వెంకటరామనారాయణరెడ్డి తన గ్రామములో పేదప్రజల పైన దౌర్జన్యకాండను సాగించినప్పుడు బీద రైతైన మల్లారెడ్డి, అతని కుమారులైన నర్సిరెడ్డి, ఎల్లారెడ్డి ఆంధ్రమహాసభలో కార్యకర్తలై అటు ప్రభుత్వ యంత్రాంగమును, దేశముఖులను, వారి పెప్పుచేతలలో వ్యవహరించినవారిని ధైర్య సాహసములతో ఎదిరించి ప్రజా ఉద్యమమును నడిపి, ఆ నిరంకుశ అధికారుల చేతిలో నర్సిరెడ్డి ప్రాణములను వదలును. ఈ సంఘటనను వాస్తవముగా రచయిత చిత్రించెను. మల్లారెడ్డి భార్య రాములమ్మ ఆ దుర్మార్గుల చేతులలో అనుభవించిన హింసలు వర్ణనాతీతము. అనాడు జరిగిన మాన

భంగములను, దోపిడీలను, గృహదహనములను, అమాయక ప్రజలు పడిన పాట్లను రచయిత దీనిలో చక్కగా వివరించి చూపినను, దీనిలో వాడినభాష, కొన్ని సంఘటనలు వాస్తవమునకు అంత సన్నిహితముగా లేకుండుట గమనార్హము.

బొంగరం గిర్రున తిరుగుతుంటే చిన్న, పెద్ద భేదము లేకుండగ అందరికి ఆనందము కలుగుట సహజము. దాని వడి తగ్గి క్రిందపడినపెంటనే మనస్సు చివుక్కుమని బాధ కలుగుటకూడ సహజమే. మనిషి బ్రతుకును బొంగరముతో పోల్చి, తాత్విక అనుశీలనముతో శ్రీ రావులపాటి సీతారామారావు "బ్రతుకు బొంగరం" నవల వ్రాసి, ఆంధ్రప్రభ తృతీయ బహుమతిని గెలుచుకొన్న యువ రచయిత. సుకుమారహృదయుడైన రవిచంద్ర దీనిలో ప్రధాన భూమిక. అతడు కళాశాలలో అధ్యాపకుడు. అతడు విధివంచితుడై, ఒంటరి జీవితములో పొందిన అనుభవములు, పరిస్థితుల ప్రభావము అతని హృదయముపైన వేసిన గాఢమైన ముద్ర, వానితో ఏర్పడిన అతని చిత్తవృత్తుల చక్రభ్రమణమే ఈ నవలా కథనము. "మూగయువతి" అతని జీవిత భాగస్వామిని యైనది. వివాహమునకు పూర్వము ఆమె మూగయని తెలియదు. అతని వైవాహిక జీవితము అగాధములో పడిపోయినది. హృదయమునకు తగిలిన బలమైన ఈ గాయముతో ఇల్లు వదలి పెక్కు ప్రయాణములుచేసి చివరకు నాగపూరు చేరి అక్కడ అసిస్టెంటు కలెక్టరై ఎండలతోనో

పరిచయము కలిగినను హృదయతాపము చల్లారలేదు. అతడు అన్వేషించిన "శాంతిని" పొందజాలక ఉద్యోగము వదలి తిరుపతికిపోయి, శ్రీస్వామి సన్నిధిన విచ్చమెత్తుకొనువాని పక్కన కూరుచున్నప్పుడు 'వీణ' తో వచ్చిన అతని తండ్రియే అతనికి ఐదు పైసలు ముష్టివేసినప్పుడు తండ్రిని గుర్తించి "నాన్నా!" అని అరవడము 'వీణ' అతని పాదములపై పడటముతో కథ ముగిసినది. అసిస్టెంటు కలెక్టరుచేసిన రవిచంద్ర ముష్టివారి పక్కన కూర్చొనుట సంభవమా? శ్రీరావులపాటి విశాల ప్రతిపదికపైన నిర్మించిన ఈ నవల అందమైనదైనను, దానిని ఉత్తమ రచనగా తీర్చిదిద్దుటకు చేసిన ముగింపు ప్రయత్నము మొత్తము అసహజముగ నున్నది.

నవీన్ వ్రాసిన "అంపశయ్య" దేమున్నాయిన్, వర్జీనియా ఉల్ఫ్‌లు నవలా సాహిత్యములో ప్రయుక్తముచేసిన Stream of consciousness Technique (చైతన్య స్రవంతి) ననుసరించి తెలుఁగులో వెలువడిన ప్రయోగాత్మకమైన నవల. ఈ పద్ధతి రచనలలో ప్రతివ్యక్తి చెక్కు-విషయము తో నిండిన బాహ్యప్రపంచమునుండి వేరై, తన లోనికి తాను చొచ్చుకొనిపోవలెనన్న అంతర్దృష్టిని, జిజ్ఞాసను ప్రకోపించును. జాయిస్ "యులీసిస్" నవలలో కథాకాలము పదునాలుగిది గంటలుకాగా, నవీన్ అంపశయ్య పదహారు గంటలలో ముగిసినది. కథానాయకుడైన రవి తెల్లవారు ఝామున నిద్రలేచినప్పటినుండి అతడు రాత్రి పడుకునువరకు

జరిగిన విభిన్న సంఘటనాత్మక భావ పరంపరలను రచయిత నేర్పుతో కూర్చి, చిత్రించెను. అమ్మ స్మృతితో కలలో నుండి మేల్కొనిన రవి ఆలోచనలతో మొదలైన ఈ కథ మరల అదే అమ్మ స్మృతితో నిద్రకుపక్రమించుటలో ముగి యును. ఇది ఒక విశిష్టమైన ఎత్తుగడ - విచిత్రమైన ముగింపు. వ్యక్తిపరముగా పారంభమైన ఇది, విభిన్న సమస్యలకు, సంపూర్ణములకు తావలమైన సంఘపరముగా ముగియుట గమనించదగిన ప్రత్యేక లక్షణము. విద్యాదానము చేయవలసిన విశ్వవిద్యాలయములలో అధ్యాపకులలోను, విద్యార్థులలోను పెరిగిపోవుచున్న అవినీతిని, కుళ్ళును యిది చక్కగా విశదీకరించును. కలవారికి లేనివారికి మధ్య పెరిగిపోవుచున్న అంతరములను శ్రీశైలం, రెడ్డిని ఒక కక్ష్యకు; రవి, వేణులను వేరొక కక్ష్యకు ప్రతీకలుచేసి నేర్పుతో రచయిత విషయమును వివరించెను. "కిరణ్మయికి" రవిని తన్మయాత్వపరచగల చతురతను, శృంగారసంబంధమైన భావనను కలిగించగల నేర్పును రచయిత మెలకువతో నిర్వహించిన విధము అత్యంత ముదావహమైనది.

"అంపశయ్య" నవల ఇతివృత్త సేకరణకు, కథాకథన శిల్పవిధానమునకు, నిస్సంశయముగా ఒక నూతన ప్రయోగము అని చెప్పవచ్చును. శ్రీ నవీన్ ఇందు కృతకృత్యుడు.

"గాలివాన" కథానికతో అంతర్జాతీయ ఖ్యాతి నార్జించుకొనిన శ్రీ పాలగుమ్మి పద్మరాజు మానసిక శాస్త్ర

ములో అనుఘటనము మారుచున్న పరిణామములను అవగహనచేసికొని ఇటీవల నవలారచన కుపక్రమించిన సమర్థుడు. ఆయన వ్రాసిన "నల్లరేగడి" గ్రామీణ జీవితమును అందలి తెలుఁగు నీడలను వివరించు సాంఘిక నవల. సహజ సంభాషణలతో, ఉదాత్తమైన ఇతివృత్తముతో, నిండైన మానవత్వముతోలొణికిసలాడుచున్న ఈ నవల ఈ మధ్య వెలువడిన వానిలో చెప్పుకొనదగినది.

శ్రీ పద్మరాజు "బ్రతికిన కాలేజి" హాస్యభరితమైన నవల. ఇది ఆంధ్రపత్రిక మాసపత్రికలో సీరియల్‌గా 1965 లో ప్రచురింపబడి, 1967 లో గ్రంథముగా ప్రకటింప బడినది. నవలలోని మిష్టర్ చింతా, పట్టూ ఇద్దరూ స్నేహితులు. కల్యాణి, రాధ అక్కచెల్లెండ్రు. ఆ నలుగురి మధ్యన నడచిన కథయే ఈ నవల. జ్ఞాపకముంచుకొనదగిన మరి రెండు పాత్రలు కామన్న, కాంతమ్మలు. మిష్టర్ చింతా ఎంతటివారినైనను ఇట్టే పల్టీకొట్టించగల సమర్థుడు. ఇతరులకు చెప్పినది చెప్పకుండగా, ఎన్నియో విషయములు చెప్పి, వాడు చెప్పినది కాను వినకుండగా తప్పించుకొని తిరిగిన వ్యక్తి. నవలలో ఈ పాత్ర ప్రముఖమైనది. శ్రుతి మించని హాస్యముతోపాటు, పాత్రల మనోచిత్రణములో రచయిత నేర్పును కనబరచెను.

"రామరాజ్యానికి రహదారి" శ్రీ పాలగుమ్మి వ్రాసిన మరొక సాంఘిక నవల. దాస్యశృంఖలములను విచ్ఛేదించు

టకు భారతదేశమునందలి ఇతర ప్రాంతములవారితోపాటు స్వాతంత్ర్యోద్యమములో తెలుగువీరులు చేసిన త్యాగములనూ, వారి ఆదర్శ జీవితములను వర్ణించుటకు రచయిత ఏర్పరచుకొనిన బృహత్తర పథకములో ఇది ప్రథమ సోపానము. దీనిలో అనాటి ప్రజల మనస్తత్వములు, త్యాగనిరతి, చిత్తశుద్ధి, నిరాడంబరజీవితము, పలుకోణములనుండి పరామర్శింపబడినవి. ఇందలి పంతులుగారు, సుబ్బన్నశాస్త్రి, సుబ్బరాజు, నాయుడుగారు, డాక్టరు, కథకుడు గోపాలం, భార్య సీతమ్మ, కొడుకు రంగడు అందరు నిత్యము సమాజములో మసలుచున్న వ్యక్తులుగ కనుపిస్తారు. 1930 సం. జనవరి 26 వ. తేదీన ఒక గ్రామ ప్రజలు పూర్ణ స్వరాజ్య స్థాపనకు దీక్షబూనుటతో కథ ప్రారంభమై, ఆ మహా సంగ్రామములో పెక్కుమంది దేశభక్తులు అనుభవించిన బాధలు శక్తివంతముగా ఇందు చిత్రింపబడినవి. పంతులుగారు ఉద్యమ నిర్వహణలో కార్యకర్తలను కూడగట్టుకొని పనిచేసిన విధము, సుబ్బరాజు ఉప్పుసత్యాగ్రహ సమయమున ప్రదర్శించిన ధైర్యసాహసములు చదువరులకు ఒడలు పులకరింపచేయును.

అమెరికన్ తత్వవేత్తయైన జాన్ డ్యూయీ ప్రభావముతో "ఇహపరాలు" వంటి గొప్ప నవలను అందించిన రచయిత శ్రీ వాసమూర్తి. గిరిధర్, సుశీల, సీతాపతి, సుందరరావులు ఇందు ముఖ్యపాత్రలు. గిరిధర్ మిగిలిన పాత్రలకు వారధి. "మంచీ - చెడూ" రెంటి మధ్య కొట్టు

మిట్టాడిన అవివాహిత యువకుడు. "కర్తవ్యము - కోరికల" మధ్య అనుపమము నలిగిపోయిన వ్యక్తి. ఇక సుశీల పాశ్చాత్య నవలా పవనముతో విశృంఖలముగా ప్రవర్తించి ఏటికి ఎదురీదిన కామకి. ఇట్టి విచిత్ర ప్రవృత్తిగల స్త్రీ బహుశః ఏ సమాజములో ఉండదేమో! కథాసంబంధమైన నవల సాధారణ నిర్వచనములకు అందక, పెక్కు సిద్ధాంతములకు అతీతమైన ఒక చర్చావేదికయై నడచిన సాంఘిక రచన ఇది. (1965). అయిన వేరొక నవల "కోనేరు - సెలయేరు". ఇది మధ్యతరగతి జీవితములకు, సమస్యలకు దర్పణము. తెలుగు పాఠకుల మన్ననల నందుకొన్న ఉత్తమశ్రేణి రచన (1968). నవలా రచనమునందు సిద్ధహస్తుడనిపించుకొనిన రచయిత శ్రీ హితశ్రీ. "సామాన్యునికామన" ఆయన రచనలలో పేరొందినదగినది. స్వార్థపరులు తమ స్వప్రయోజనముల కొఱకు చేసిడి పమ్మెలు, కుట్రలు ఇందులో చిత్రితమైనవి. శ్రీనివాస్ స్పిన్నింగ్ మిల్లు యజమాని శ్రీనివాసరావు పెట్టు బడిదారి మనస్తత్వములేని ఆదర్శవాది. అయినను స్వార్థ పరుల దుశ్చింతనలకు లోనై అడినమాట తప్పినను, మానవత్వముతో ప్రవర్తించిన ఉదాత్తుడు. ఇక నవలలో రెండవ వాడు ఆనందరావు. ధర్మమును అంటిపెట్టుకొని నడిచి విఫల మనోరథుడైనవాడు ఆయన. రేఖ, పద్మ, గీత ఒకే మూస నుండి ఒకే రూపముతో పెలువడిన వేరువేరు స్త్రీమూర్తులు. కథా పథకములో, పాత్ర చిత్రణములో వైవిధ్యమును గన

బరచిన ఆయన వాక్యనిర్మాణపద్ధతిలో మఱొంత శ్రద్ధ గన బరచిన భాగుఁడొడిది. ఐనను ఇది ఒక ఉత్తమశ్రేణి రచన (1968).

దుర్గానంద్ తాను వ్రాసిన "రంగపతి" నవలలో 'తెలుఁగుదనము అంటే ఏమిటి?' అన్న ప్రశ్నను వేసుకొని దానికి సమాధానముగా పోతరాజు వంశస్తుడైన రంగపతిని, అతని కుటుంబములోని వ్యక్తులను తీసికొని వారిలోని వైవిధ్యమును అభివ్యక్తము చేయుచు, తద్వారా తెలుఁగుదేశము లోను, తెలుఁగువారి నాగరికతలోను, సంస్కారములోను, సభ్యతలోను అనుక్షణము ఏర్పడిన మార్పులను దీనిలో వర్ణించెను. ఆయుర్వేద వైద్యుడైన రంగపతి ఆ విద్యను తన మనుమనిలో పునఃప్రతిష్ట చేయుటకు చేసిన విఫల యత్నము, పాశ్చాత్య నాగరికతవలన మన గ్రామీణ జీవితములో ఏర్పడిన అనర్థములు ఈ నవలలో వర్ణితములు.

సంస్కృతాంధ్రములయందు అభినివేశముగల విద్వద్రచయిత శ్రీ ఉషశ్రీ. "ప్రియసి - ప్రియంవద" నవలికలు రెండును అందుకు తారాణములు. బావ మరదళ్ళమధ్య యేర్పడిన విచిత్ర ప్రేమ సంబంధమును, సరస సంభాషణలను, చతురోక్తులను భావగర్భితముగా రచయిత ఇందు వివరించెను. "ప్రియసి" నవలికలోని కళ్యాణలక్ష్మి తన భావను మనసార ప్రేమించినను వెర్రిబాగుల అక్కయ్యకు ద్రోహము చేయలేక అన్న స్నేహితుడైన రామనాథమునకు ద్వితీయు

కళతోపాటు అతనిలో దాగియున్న కళాకౌశలమునకు మెరుగులు దిద్దిన వివేకవతి. ఆమె తండ్రి సీతారామశాస్త్రి స్థిరచిత్తుడైనను హృదయమున్న సంస్కారి. "మనం బ్రతుకుచున్న సమాజానికి అనుకూలంగా మనం మారలేకపోతే, ఎంత మేధావులమూ, సంపన్నులమూ అయినా నవ్వులపాలు అవుతాం" అని గుర్తించగల సమయజ్ఞుడు అయన. "ప్రియంవద" నవలికలో పద్మావతి ఒక చైతన్యప్రవంతి. భావశంకరరావును హృదయపూర్వకముగా ప్రేమించినను తనవ్యక్తిత్వమును నిలుపుకొన్న జాణ ఆమె. ఈ నవలికలోని పాత్రలు చమత్కార ధురీణమైన మాధురవచో గుంభనతో, విరాజమానమగుచున్నది. నిండైన అనుభవముతో, చక్కని శైలితో రచనలు చేయగల నేర్పరి శ్రీ ఉషశ్రీ.

శ్రీ పోలాప్రగడ సత్యనారాయణమూర్తి రచించిన "సంఘము చేసిన మనిషి" స్వాతంత్ర్యానంతరము వచ్చిన సాంఘిక పరిణామములను భిన్న కోణములనుండి పరిశీలించుచున్నది. రాజకీయ ప్రభావము, పైనుండి క్రిందివరకు అన్ని అంతస్తులలోను ప్రవేశించి ప్రతి చిన్న సమస్యపైన ఆది వేయుచున్న ముద్రను; దాని పరిధికి లొంగని సమస్యలు లేవనియు అట్టి పలు సమస్యలను రచయిత ఈ నవలలో చిట్టిబాబు పాత్ర చిత్రణద్వారా నిరూపించెను. పల్లెటూరి అమాయకుడైన చిట్టిబాబు క్రమముగా పెరిగి పెద్దవాడై పెక్కు అధికార పదవులను చేజిక్కించుకొని వింతపోకడలుపోయి,

చివరకు ఎన్నికలలో పరాజయముపొంది తిరిగి యథాపూర్వ స్థితికి చేరిన విధమును అయిన నేర్పుతో దీనిలో వివరించెను. పదవులకొరకు నేటి ప్రజలు పడు తాపత్రయములను, కీర్తి కొరకు వారు పోవు పోకడలను శ్రీ పోలా ప్రగడ ఇందు చక్కగా వివరించెను. ఈ నవలలో పాత్రచిత్రణము, విషయ వ్యక్తీకరణము ప్రశంసనీయమైనది. నేటి పల్లెజీవితపు కలుషిత వాతావరణము ఇందులో చక్కగా విపరించబడినది. "దీప శిఖ" "కైకేయి" నవలలలోను అయిన మధ్యతరగతి ప్రజల జీవితములందలి వివిధ్న సమస్యలను చక్కగా వివరించెను.

శ్రీ ఎవిఎస్ వ్రాసిన "చిన్న స్వప్నం - నేడు సత్యం" నవల నేటి విద్యారంగమున జరుగుచున్న అస్తవ్యస్తమైన మార్పులను, వాని అనర్థములను వివరించుచున్నది. స్వార్థపరులు విద్యారంగమున ప్రవేశించి నేటి యువతరపు కోరికలను, ఆశలను, ఆశయములను వమ్ము చేయుచు తమ ఇచ్చవచ్చినట్లు వేదికలపైన ఉపన్యాసము లిచ్చుచు వెనుకముందులు ఆలోచించక కేవలము యువకులను మాత్రమే విమర్శించు పద్ధతి ఇందులో వివరింపబడినది. 'రమణ' పొంగిపొరలుచున్న నేటి యువతరపు నూతన భావ పుంజములకు ప్రతీక. పెద్దలు తమ బాధ్యతలను తాము గుర్తించక, తమ పిల్లల పెంపకము విషయములో తగిన శ్రద్ధ వహించక దారుణముగా ప్రవర్తించుచున్న పద్ధతిని అతడు

నిశితముగా విమర్శించెను. శ్రీ ఎమ్వీయల్ యదార్థపరిస్థితు లను ఎట్టి జంకుగొంకులులేక ఇందులో వివరించెను. యువతీ యువకులు అవశ్యము చదవతగిన మంచి నవల.

శ్రీ విభావసు సామాజిక వ్యవస్థలో మార్పును వాంఛించి "పూజాఫలం" నవల వ్రాసిన ప్రగతిశీలక రచయిత. అనంతలక్ష్మి, అనూరాధ ఇద్దరు తమతమ భర్తల చేత వంచింపబడి, తమ దురదృష్టమునకు చింతించి కృంగి కూలారిపోక, కలసివచ్చిన అదృష్టములో అనంతలక్ష్మి భాస్క రమును; అనూరాధ డాక్టర్ మహమ్మద్ డేవిడ్ గోపీని వివాహమాడి జీవిత మాధుర్యమును అనుభవించి, సుఖజీవ నము చేసిరి. ఇది సంస్కరణాత్మకమైన నవల (1971).

ప్రముఖ కథారచయిత శ్రీ మధురాంతకం రాజారాం "కారణభూతుడు" "మరీచిక" అను రెండు ఉత్తమ నవలిక లను వ్రాసిన దిట్ట. "కారణభూతుడు" నవలికలో రచయిత యైన 'కారణభూతుడు' ఒక పట్టణములో సృష్టించిన భయం కర వాతావరణమే అందలి కథ. "నాగరికత అంటే ఏమిటి?" అన్న ప్రశ్నకు రచయిత తెలిపిన సమాధానమే "మరీచిక". "నగరములలో వున్నదంతయు నాగరికత కానట్లే, పల్లెలలో ఉన్నదంతయు అనాగరికత కాజాలదు" అన్న సత్యమును నిరూపించు నవలిక ఇది. ఏది సరియైన నాగరికతయో గ్రహించలేని శోభ తన జీవితమును అయోమయస్థితికి దిగ జారునట్లు చేసికొనినట్లే, నాగరికతయొక్క నిర్వచనమును

తెలిసికొనిన ప్రకాశం గూడ జీవిత వాంఛలను పరిపూర్తి చేసికొనలేని అభాగ్యుడు. ఆ ఉభయుల జీవితముల చిత్రీకరణమే 'మరీచిక' నవలిక. ఈ నవలికాధ్యయమునందు పాత్ర చిత్రణ, కథాకథనము, సంభావణలు, ఎత్తుగడ, ముగింపు అన్నియు చక్కగా నడచినవి.

శ్రీ కె. ఆర్. కె. మోహన్ తన "వక్రించిన సరళ రేఖలు" నవలలో ఏదియో మానవాతీతమైన అతీంద్రియ శక్తి ఒకటి ఆయా ఘటనలకు అనుగుణముగా నడిపించుచున్నదను సత్యమును, సుందరరామయ్య, వేంకటాద్రి, శాంతమ్మ పాత్రల ద్వారా చూపెను. కర్మ సిద్ధాంతమునకు ప్రాధాన్యతనిచ్చి వ్రాసిన నవల ఇది. ఇందు పెక్కు పుణ్యక్షేత్రముల మాహాత్మ్యమును ప్రయత్నపూర్వకముగ చొప్పించుటవలన నవలయండలి బిగువు కొంత సడలినట్లు కనిపించును.

శ్రీ పి. వి. కృష్ణమూర్తి వ్రాసిన "బంధమూ - అను బంధమూ" నవల చలనచిత్ర పరిశ్రమలోగల అవకతవకలను కరదీపికవలె ఎత్తిచూపును. లక్షాధికారులు, కోటీశ్వరులు నైన దర్శకులు, నిర్మాతలు, డిస్ట్రిబ్యూటర్లు స్వార్థబుద్ధితో నటీనటులను తమ చేతి కీలుబొమ్మలుగా మార్చుకొను పద్ధతి ఇందులో వివరించబడినది. ఆత్మాభిమాన సంపన్నులైన దయానిధి, శ్రీలేఖలు వారినుండి పొందిన బాధలను, పడిన కష్టనష్టములను రచయిత ఇందు వివరించెను (1968). ఆయన మరొక నవల "రాగి-యోగి", దీనిలో రాజగోపాలం బాల్య

మునసే తండ్రిని గోలుపోయి తల్లితో గురు నా ధ మును లాయరు ఆశ్రయములో పెరిగి, ఆయన కుమా ర్తె ఆశాలతను ప్రేమించి, ఆ మె చే తిరస్కరింపబడి, జీవితము పై విర క్తి జనించగా స్వామి విజయానందభారతి అనందాశ్రమములో చేరి "కుమారగిరి" అన్న పేరుతో వైరాగ్య జీవితమును గడి పెను. ఈ పాత్రచిత్రణయందు గనుపించు సహజ మానసిక పరిణామము ఆశాలత పాత్రలో లోపించినది. లాయరు కుమా ర్తియైన ఆశాలత నర్తకిగా, సినీతారగా, ఫస్టుక్లాసు మేజస్ట్రేటు భార్యగా, ఆశ్రమవాసినిగా మారుటలోగల హేతువులను రచయిత ఇందులో కట్టుదిట్టముగా వివరించ జాలకపోవ్రుట చిత్రము. కథాకథన పద్ధతిగూడ కొంత కొర వడినది.

"చంద్రునికో నూలుపోగు" అను నవలను శ్రీ పురాణం సుబ్రహ్మణ్యశర్మ రచించెను. ఇది కళాకారుల జీవిత సమస్య లను తరచిచూచి వ్రాసిన ఉత్తమ రచన. రచయితకుగల చక్కని లోకానుభవము, సుసంపన్నమైన శైలీసంవిధానము రెండును నిండుగా కలిగివున్న ఈ నవల చదువుటకింపైనది.

శ్రీ మురళీధర్ "అంతుపట్టని మనిషి" నవల గురుశిష్య సంవాదకరూపమైన వ్యంగ్యాత్మక అవహేళనాత్మక రచన. ఇది సులభ వ్యావహారికభాషలో రచింపబడియుండి, ప్రతి పన్నివేశము, సంఘటన హృదయమును రంజింపజేయు చుండును (1971).

"రసపట్టాక" మనదగిన కరుణమును అంతట పరిసరింప జేయునట్టిది శ్రీ కొండముది శ్రీరామచంద్రమూర్తి రచించిన "కరుణ" అను నవల. ఒకానొక విస్వత్ కుటుంబములో పొరపాటువలన అనుజన్మలై నవారి మధ్య జరిగిన వివాహము వలన ఉత్పన్నమైన పరిస్థితులను, అసభ్యతకు తావులేకుండు నట్లు కరుణరసభరితముగా రచయిత ఇందు చిత్రించెను. నడిమితరగతి ప్రజల జీవితసమస్యలు నిశిత దృష్టితో ఇందు వివరింపబడినవి.

శ్రీమాన్ తిరుమల నల్లాన్ చక్రవర్తుల వేంకట వరదాచార్యులు తన "మాతృజ్యోతి" నవలలో క్షీణించిపోవు చున్న పూర్వ సంప్రదాయమును, ధర్మములను, ఆచార వ్యవహారములను, సభ్యతానాగరికతలను చక్కగా వివరించెను.

శ్రీ చంద్రమౌళి "అన్నపూర్ణ" నవలలో కాళీపాద అను చిత్రకారుని విషాదభరిత జీవిత కథను, చిత్రకారుడుగా అతడు సంఘములో నిలదొక్కుకొనుటకు ఎదురొక్కొనిన వివిధ సమస్యలను, సంఘటనలను, శక్తివంతముగా చిత్రించెను. కుముద్వతి, సుమిత్ర, ఎమిలియాలు కాళీపాద జీవితములోఁ ప్రవేశించి కలుగజేసిన ప్రభావమును రచయిత బాగుగా నిరూపించెను. ప్రచురణకర్తలు వ్యాపారదృష్టితో గ్రంథకర్తలకు స్వల్ప ప్రతిఫలమునిచ్చి వారి అమూల్యమైన గ్రంథములను తాము తీసుకొని కుబేరులైనట్లు, చిత్రకారుల నుండియు అతి విలువైన చిత్రములను స్వల్ప మూల్యమునకు

తీసుకొని ఐశ్వర్యవంతులైన విధమును నేర్పుతో చిత్రించెను. ఈ నవల కరుణరసాత్మకమైన మరొక కళాఖండము.

"శ్రీదేవి" నవలకు లభించిన బహుమతితో శ్రీ కౌముదిని విస్తరించుకొన్న రచయిత శ్రీరంగధామ్. ఆయన వ్రాసిన మరొక నవల "ధనమూల మిదం జగత్". తల్లి దండ్రుల మాటకు ఎదురుచెప్పలేని, అంతస్తుల భేదమును అధిగమించలేని "కర్మ" అను యువకుడు రాగిణి, లత, లక్ష్మి, ఆమె స్నేహితురాలైన మరొక లతను ప్రేమించి ఎవరిని వివాహమాడక, ఎవరితోను కలసి జీవించలేక చిత్రమైన జీవితమును గడపిన అతని పరిస్థితిని రచయిత దీనిలో వివరించెను. ఈ నవలలో ఫ్యాక్టరీలకు సంబంధించిన సమస్యలు, కార్మికుల కష్టనిష్ఠురములు విపులముగా చర్చించబడినవి. ఈ నవల పఠితలకు కొంత విసుగును కలిగించునట్టిదిగానున్నది.

1961 వ. సం.లో విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ సంస్థ పక్షమున "ఆంధ్రప్రదేశ్‌లో వచ్చిన, వస్తున్న బహుముఖ పరిణామాలను" చిత్రించుటకు నవల పోటీని నడిపిరి. ఆ పోటీలో శ్రీ గంగినేని వేంకటేశ్వరరావు రచించిన "పాము-నిచ్చెన" అను నవలకు ద్వితీయ బహుమతి లభించినది. జీవితమునందలి ఇతరదశలకన్న విద్యార్థిదశలో మిట్టపల్లములు అధికము. అత్యంత ప్రధానమైన ఈ దశలో "జీవిత వైకుంఠపాళీలో నిచ్చెన ఎక్కి ఉన్నతస్థాయికి చేరుకోనువచ్చు-లేదా పాముకరచి అధోలోకానికి చేరనూవచ్చును-". అత్యంత

ప్రధానమైన ఈ యవ్వనదశయందలి వెలుఁగునీడలను ప్రతిభాసమున్నతముగా శ్రీగంగినేని దీనిలో వివరించెను. ఉత్తరములద్వారా ఈ నవలను ఆమూలాగ్రము నిర్వహించుటయిందలి కొత్తదనము. ఇందు రాజకీయ, సాంఘిక, వైజ్ఞానిక పరిస్థితుల వివరణముతో పాటు విద్యార్థినీ విద్యార్థుల కళాశాలల జీవితములందలి పలువిషయములను, విద్యార్థి వసతి గృహములలో జరుగుచున్న అవకతవకలను, 'ప్రేమ-పెండ్లి' వరకట్నములు; ఉన్నత విద్యాసముపార్జనములో ఏర్పడు అడ్డంకులను విమర్శనాదృష్టితో ఆసక్తికరముగా నుండునట్లు మలచి ఈ రచయిత తెలుఁగునవలా వికాస సాహిత్యపథమున ఒక నూతన మార్గమును తొక్కెను. పెక్కు పాత్రలతో భిన్న ప్రదేశములనుండి నడచిన ఈ నవల కథాకథనము ముంటువడని విధముగా ఉత్తర ప్రత్యుత్తరములను నడపి, వాక్రు మనోగత రహస్యములు, వర్ణనలు, వానియందు ప్రతిబింబించునట్లు రచించెను, ఈ పద్ధతిలో నవలారచనము అత్యంత క్లిష్టమైనను రచయిత తన శక్తినంతటిని ఉపయోగించి అది రసవత్తరముగా నుండునట్లు చేసెను. అందరు చదవదగిన ప్రక్రియావిలసితమైన రచన ఇది.

వ్యక్తులు వ్యక్తిగతమైన 'స్వంత' అస్తి కలిగియుండుట వలన సామాజికముగా సంభవించు అనర్థములను సామ్యవాద దృక్పథమున కొ. శే. పొన్నలూరి రాధాకృష్ణమూర్తి "అస్తి" నవలలో సిద్ధాంతపరముగా చర్చించెను. ఇది

ఆర్థిక సంబంధమైన విలువలను, సంఘమునందలి ఎక్కువ తక్కువలను వివరించునట్టి రచన (1967).

శాస్త్రీయమైన విజ్ఞానాధికృతితో శ్రీ వరిగొండ రామచంద్రరావు "ఆవేదన" అన్న ఉత్తమ మనోవైజ్ఞానిక నవలను రచించెను. ఉత్తమ నటుడు, ప్రముఖ గాయకుడు, చలనచిత్రములో ప్రధాన భూమికను నిర్వహించి, గొప్ప ఖ్యాతి నార్జించిన "మోహన్" అను అభాగ్య యువకుని విషాదభరితమైన విచిత్ర జీవితగాథ ఇది. నవల ప్రారంభించి నప్పటినుండి ముగియునంతవరకు "ఏమి జరుగనున్నదో" నను ఔత్సుక్యము పఠితలకు అనుక్షణము కలిగితీరును. అతని సాంఘిక జీవితము ఎంత శోభాయంతమై భాసించినదో; వ్యక్తి గత జీవితము అంత దుఃఖభూయిష్టమై హృదయ విదారక ముగా పరిణమించినది. తొందరపాటుతో కూడిన అతని పొరపాటు వాగ్దానము, అన్న రంగారావు పోగ్గ బ్బ లము రెండును కలసి సుమతితో అతనికి వివాహముజరిగినది. 'రీటా' అను వేరొక నర్తకి ఇతనిపై అభాండములువేసి అవమాన ములపాలుచేసినను తనకుగల శారీరక లోపమును బయట బెట్టక, లోలోననే తనకు కాను తీరని పరితాపము ననుభ వించి, చివరకు తనను తానే శిక్షించుకొనెనుగాని, ఇతరులను పల్లెత్తియైన నిందించని సాధుస్వభావుడు. ఈ నవలలో శ్రీ రామచంద్రరావు లైంగిక సుఖమునకు నోచుకొనని మోహన్ మానసిక క్షోభను, విశ్వంఖల వర్తియై మిరిలేని

కామదాహముతో విచిత్రముగా ప్రవర్తించిన 'రీటా' హృదయమును, మనసిచ్చి ప్రేమించి వివాహమాడిన మోహన్ తనకు అందక దూరమై సంచరించినను, తన భర్త యదార్థ స్థితిని అతని మరణానంతరము ఉత్తరముద్వారా తెలిసికొన్నను, యెంతమాత్రము తొందరపడక భవిష్యజన్మలో నైనను అతడే తన భర్తకావలెనని కోరుకొనిన ఉదారశీలగా రచయిత చేసిన 'సుమతి' పాత్ర చిత్రణము శ్లాఘా పాత్రము. నవలలో అంతస్తుల భేదములు, మానసిక పరిస్థితుల చిత్రణము ఉచితరీతిలో వర్ణింపబడినవి (1969).

1960 వ. సం. లో శ్రీ తాతాశంకరబెనర్జీ మున్నగు ప్రముఖ వంగ రచయితలు ఆరుగురు కలసి ఒక నూతన పంథాలో "నాగరిక" అను నవలను సరికొత్త రీతిలో వ్రాసిరి. ఇది ఒక గొలుసుకట్టు రచన. తెలుగులో సుప్రసిద్ధ రచయితలైన శ్రీయుతులు పురాణం సుబ్రహ్మణ్యశర్మ, గొల్లపూడి మారుతీరావు, కొమ్మూరి వేణుగోపాలరావు మున్గుగను కలసి "ఇడియట్" నవలను అదృష్టవశముతో ప్రయోగాత్మకముగా రచించి, ఆంధ్రజ్యోతిలో ధారావాహికముగా 1968 సం. లో ప్రచురించిరి. 1969 లో అది గ్రంథరూపము ధరించినది. దానిలో విశాఖపట్టణములో రైల్వే రన్నింగ్ స్టాఫ్‌లో పనిచేయుచున్న 'రావు'; రంగూను నుండి తిరిగివచ్చి అక్కడనే స్థిరపడిన డాక్టర్ పానకాల రావుల కుటుంబముల కెంటికి సంబంధించిన కథ నిబద్ధింపబడి

నది. రావు తన ఇంటిలో అందరికి స్వేచ్ఛనిచ్చి అనుభవము మీద అన్ని విషయములు వారే తెలిసికొనగలరని ప్రవర్తించిన ఆదర్శవాది - 'రావు' భార్య రంగమ్మ మరిస్థితము తప్పిన వ్యక్తి - ఇక ఆయన కూతురు శ్యామల, పెద్దకొడుకు కృష్ణ, రెండవకొడుకు మోహన్; ఆయన పెల్లెలు, ఆమె చిడ్డ ఇంటిలో సంపూర్ణ స్వేచ్ఛ ననుభవించి యధేచ్ఛగా ప్రవర్తించిన వ్యక్తులు. మిక్కిలి పేదవాడైన పానకాల రావు బాల్యమున శమంతకమణి అను వేశ్య సహాయముతో పైకివచ్చి ఆమె పెద్దకూతురు పుష్పను వివాహమాడి, ఒక కూతురును కని మరణించగా ఆమె పెల్లెలు "కనకలత" ను రెండవభార్యగా చేసికొనిన వ్యక్తి. ఆ వుభయ కుటుంబములు ఆర్థిక సంబంధమైన చిక్కులు లేనట్టివి. ఆ కుటుంబముల కలయికకు మోహన్, కుసుమల ప్రేమ వివాహము కారణభూతమైనది. ఈ నవలలోని శ్యామల, జగదంబ, మొదలగు పాత్రలన్నియు కలుపుగోలుతనము, పదవగాహనము గలవారై సజీవసంపన్నములై మసలినవి. అరకులోయ సౌందర్యమును, అక్కడి ప్రజల జీవన సరళిని, రచయితలు చక్కగా వివరించిరి. విశాల ప్రతిపదికతో నవలను శ్రీ పురాణం ప్రారంభించాగా, చక్కని మానశికశాస్త్ర దృక్పథముతో శ్రీ మారుతీరావు కొంతవరకు నడిపెను. దానిని శ్రీకొమ్మూరి తనకుగల లోకానుభవముతో ముగించెను. ఈ నవలలో ప్రారంభమునకున్న నిండుదనము ముగింపులో

లోపించినది. గొలుసుకట్టురీతిలో నడచిన సరిక్రొత్త ప్రయో
గాత్మక రచన ఇది. తెలుఁగు నవలా సాహిత్య వికాస
ప్రగతిలో కొసుమించి, నూతన గుబాళింపులతో పలువురి
దృష్టిని ఆకర్షించిన సుందర సుమ మాల ఇది.

తెలంగాణా ప్రజా పోరాటమును ప్రత్యక్షముచేసి
వాసిన మరొక నవల శ్రీ దాశరథి రంగాచార్యులు "చిల్లర
దేవుళ్ళు". కమనీయమైన తెలంగాణ మాండలిక భాషలో
ఇది నడచినది. ఇందు ఆనాటి భూస్వామ్యవ్యవస్థను,
నిరంకుశప్రభుత్వ విధానములను, రాజకీయ, సాంఘిక, సామా
జిక, సాంస్కృతిక సంబంధమైన పెక్కు నిగూఢ విషయము
లను రచయిత కళ్ళకు కట్టునట్లు వర్ణించెను. కో. చే. ఆంధ్ర
పితామహ శ్రీ మాడపాటి హనుమంతరావు పంతులును
నవలలోని ప్రధానపాత్ర దర్శించి, వారివలన పొందిన ఉత్తే
జనముతో నైజాం ప్రజావ్యతిరేక విధానములను, జాగీరుదార్ల
నిరంకుశ పోకడలను, నిరుపేద ప్రజలు అనుభవించిన కడ
గండ్లను, గ్రామములలో నడచిన వెట్టిచాకిరి మున్నగు వానిని
ధైర్యముతో యెదిరించి పోరాడిన సంఘటనలను వివరించెను.
ఇది రసబంధురమై, చరిత్రకందని యెందరో త్యాగధనుల
అపార త్యాగములను విపరించిన సాహితీసంపన్నమైన ఉత్తమ
నవల. దీనికి ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి బహుమతి
కూడ లభించినది.

శ్రీ ఇచ్ఛాపురపు జగన్నాథరావుచే రచింపబడిన

"జీవనపథం" నవల సామాన్యులందరికన్నను ఆత్మాభిమానము అధికముగా కలిగివున్న "రామదాసు" అను యువకుని గురించి చెప్పినట్టిది. ఆశించిన జీవిత మాధుర్యమును పొందలేక, ఉన్నదానితో తృప్తిగా బ్రతకలేక అతడు ఆత్మహత్యకు సిద్ధపడినప్పుడు "రాధ" అన్న ధనికుల పిల్లను వివాహమాడి బాగుపడిన కథయే ఇందలి ఇతివృత్తము. ఈ నవల ఎత్తుగడ, నిర్వహణ, ముగింపు అన్నియు చక్కగా సాగినవి. సరళమైన వాడుకభాషలో వుండి పలువురి మెప్పులను పొందిన రచన ఇది (1972).

శ్రీ చామర్తి దుర్గాప్రసాద్ "అలకాపురి" ఒక కొత్త పంథాలో సాగిన నవల. ఇందలి ప్రధానపాత్ర అయిన రాఘవయ్య సమాజములో గూడుకట్టుకొనివున్న నిమ్నోన్నతములను రూపుమాపి ఆదర్శప్రాయమైన ఒక కొత్త జీవితమును ప్రారంభించనెంచి, రెండు కొండలమధ్యనగల ఒక నిర్మానుష్య ప్రదేశమునందలి బంజరుభూమిలో ఒక గుడిసెను వేసుకొని వ్యవసాయమును ప్రారంభించెను. అతని కృషికి కొండయ్య, వెంకటస్వామి తోడ్పడిరి. ఆ ఒక్క గుడిసెయే కాలక్రమమున పెరిగి, పెరిగి ఒక పెద్ద ఊరైనది. అదియే అలకాపురి. రాఘవయ్య నిర్మించుకొనిన అశ్రమ, ఆశయములకు వ్యతిరేకముగా, అతడు ఊహించిన సమసమాజ నిర్మాణమునకు వ్యతిరేకముగా సంఘములో వెనుకటి పరిస్థితులే తలెత్తినవి. 'మార్పు సహజము' అన్న సత్యమును

రచయిత దీనిలో చక్కగా నిరూపించెను. రాఘవయ్య, కొండయ్య, వెంకటస్వామి, వేదవతి, సావిత్రివంటి ఉత్తమ ఆదర్శపాత్రమైన వ్యక్తులను రచయిత నవలలో సృష్టించినను యదార్థజీవితములో అట్టివారు కనుపించరేమో! ఈ నవల తరముల మార్పునందలి అంతరములను చూపునట్టిది (1972).

శ్రీ కలువకొలను సదానంద "గాడిద బ్రతుకులు" నవలలో ఎదుగుబొదుగులేనట్టి మధ్యతరగతి ప్రజల జీవిత సమస్యలను చిత్రించెను. ఇది అవహేళనాత్మక రచన. 'గాలిగాడు, చలువ గురవం' అను రెండు గాడిదలు తమ యజమానిపెట్టు బాధలకు తట్టుకొనలేక ఆత్మహత్య చేసికొని, యమలోకములో తమ గతజన్మకు సంబంధించిన కర్మఫలము ననుభవించుటకై యముని అనుగ్రహముతో మరల భూలోక ములో రాజశేఖరం, చంద్రశేఖరం, అను పేర్లతో తండ్రి కుమారులై జన్మించిరి. గజలక్ష్మి రాజశేఖరం భార్య. గయ్యాళిగంప. అమెకు చంద్రశేఖరం మాత్రమేగాక, వన మోహిని అను విశృంఖలవర్తిని యైన మరొక కుమార్తె యున్నది. చంద్రశేఖరం తనకు జోడైన ఒక అమ్మాయిని వివాహమాడగా, వనమోహిని తనకు నచ్చిన వెంకటపతిని పెండ్లిచేసికొనినది. ఆ ఇంటిలో అన్ని విషయములలోను ఆడవారిది పైచేయియై, సంసారము నరకప్రాయముగా మారి నది. రాజశేఖరం, చంద్రశేఖరం ఈ పరిస్థితిని భరించ లేక తీర్థయాత్రలకు బయలుదేరి వెళ్లిరి. ఆ ఇంటిలో ఆడ

వారికి కావలసిన డబ్బు, తదితర సుఖములు లభించనందున వారు విలవిల లాడిపోవుచున్న సమయమున తండ్రి కొడుకులు తీర్థయాత్రలనుండి తిరిగిరాగా ఆ ఇంటి స్త్రీలు తమ భర్తలను ఆప్యాయతతో ఆహ్వానించి గౌరవించిరి. స్త్రీ మను గడమ, అభివృద్ధికి పురుషుల అండదండలు అవసరమని నిరూపించునట్టి నవల ఇది. చిత్తూరు జిల్లా రచయితల సహకార సంఘపత్రమున ప్రచురింపబడినది (1972).

కృష్ణా జిల్లా రచయితల సహకార సంఘ పత్రమున శ్రీ సి. నరసింహారావు వెలువరించిన ఆరు నవలలలోను "సంఘర్షణ" నవల పేర్కొనదగినది. ఇది పల్లెసీమల నవీన సరళిని, సమస్యలను సవిమర్శకముగా చిత్రించునట్టిది. నవలలోని శ్రీపతి, రంగారవులవంటి సంస్కారయుతమైన ఉన్నత పాత్రలతోపాటు, ఆ గ్రామమునందలి పాపయ్య, చలమయ్య మున్నగు పాత్రలలో పేరుకొనివున్న కుళ్ళును, స్వార్థ చింతనను, కుట్ర ఆలోచనలను రచయిత ప్రశంసనీయముగా చిత్రించెను (1972).

పెక్కు రచనలు చేయుచున్న నేటి నవలా యువ రచయితలలో శ్రీ రా ఘవ పేర్కొనదగినవాడు. ఆయన "గృహిణి" నవలలోని శివానందం గొప్ప శీలవంతుడు. ఉదారస్వభావుడు. అతడు తన చిన్ననాటి గురువైన దుర్గయ్య తన కుమార్తె వరలక్ష్మి వివాహముకొరకు ప్రయత్నించుచున్నప్పుడు ఆయనతోపాటు తానును ప్రయత్నించి.

తగిన సంబంధము లభించనందున ఆమెను కానే వివాహ మాడి గురుభక్తిని వ్యక్తపరచిన ఆదర్శవాది. శివానంద పాత్రపోషణలో రచయిత చూపిన ఔచిత్యము ప్రశంసింప తగినది. ఆయన మరొక నవల "దిగంతాలకు అవతల". ఇందు మధ్యతరగతి ప్రజల జీవన సమస్యలు వర్ణింపబడినవి. ఈయన వేరొక నవల "శిఖరాలు-సెలయేళ్లు". నేటి యువకుల ఆశలను, ఆశయములను, తత్సాధనలో వారు పొందిన జీవన వైఫల్యములను భిన్నకోణములనుండి విభిన్న దృక్పథములతో చూపించుటకు రచయిత మంచి కృషి సలిపెను. కథానాయకుడైన సుందరం ఉన్నత శిఖరమువంటివాడు. కొండశిఖరమును తమదిగా చేసికొనుటకు, దానిని లోబరచుకొనుటకు పెక్కు సెలయేళ్ళు నిరంతరము ప్రయత్నించి దాని దృఢత్వమును సడలించలేక తమకు కానై తప్పుకొని పాయలై ప్రవహించినట్లు, యెందరో స్త్రీలు పెక్కువిధములుగా సుందరమును ప్రేమించి తనువానినిగా చేసికొనుటకు ప్రయత్నించి విఫలమనోరథులైరి. సుందరములోని కళాహృదయము ఈ ప్రేమకలాపములకు లొంగక, అనుఋణము పొందిన స్పందనను, ఆ వేదనను, ఆ కాకిడికి అతడు ధీరోదాత్తుడై నిలచిన విధమును రచయిత దక్షతతో ఇందు వివరించెను.

పైనవలలతోపాటు ఈక్రింద పేర్కొనబడిన నవలాకారుల రచనలుగూడ తెలుఁగు నవలా వికాస సాహిత్య చరిత్రకు వన్నెచిన్నెలు సమకూర్చుటలో కొంతవరకు తోడ్పడినవి.

సర్వశ్రీ సి. శేషగిరి "వికసించని కుసుమాలు"; జనమంచి రామకృష్ణ "విరిగిన కలలు"; పి. వి. సుబ్బారావు "ఆమె చెప్పింది"; పల్లంపాటి వెంకటసుబ్బయ్య "దూరతీరాలు"; గంథం యాజ్ఞవల్క్యశర్మ "వెలుఁగులో వెలది"; రావి శ్రీమన్నారాయణ "కేడియో సిలోన్"; మురయ్య "చిత్రకారుడి భార్య"; బాలశౌరిరెడ్డి "జీవనసూత్రం"; వీరమల్లు రామకృష్ణ "పెద్దగోడలు"; ఓగేటి శివరామకృష్ణ "మురది"; దోనేపూడి రాజారావు "ధర్మలోగిలి"; సామవేదం జానకీరామశర్మ "ధన్యజీవి"; వర్ధా రాఁపా "కామేశ్వరి కథ" "ఊరి తీసిన ఉంగరం"; సి. ఆశ్వద్ధ "మూసిన తలుపులు"; అరవింద "పగిలిన ప్రతిమ"; చిట్టిబాబు "చిత్రమైన జీవితం"; సుంకర పాటి గంగాధరం "కాగితం పులి"; శ్రీ గోరాశాస్త్రి "సెలవుల్లో"; పసుపులేటి మల్లికార్జునరావు "సమాంతర రేఖలు"; విడియాల చంద్రశేఖరరావు "వెన్నెలనీడ"; పి. వి. రాజమన్నార్ "శ్రుతితప్పినరాగం"; రావూరి సత్యనారాయణరావు "నెలవంక"; పడాల "అల్లూరి సీతారామరాజు".

పైన పేర్కొనబడిన నవలారచయితల రచనలేకాక, నా సమీపమునకు అందని మరెందరో రచయితల రచనలు తెలుఁగు నవలా భానూదయ కాంతిపుంజమున కలసియున్న కాంతికిరణములే. అనంతమైన కాలమునందు, నా వక్తవ్య పరిమితిని దృష్టియందుంచుకొని, ఈ గ్రంథమున కెక్కని రచయితల మేలిరచనలకు, రచయితలకు నా ప్రత్యయపూర్వక మైన శుభాభినందనములు తెలుపుచు, ముందటి ప్రకరణములో రచయిత్రుల నవలా సాహిత్యకృషిని వివరింతును-

తెలుఁగు నవలా స్వర్ణయుగ సంక్రాంతిని ముత్యాల రంగవల్లులతో తీర్చిదిద్దిన రచయిత్రులు

నవ్యాంధ్ర సాహిత్యయుగ ప్రవక్తయైన శ్రీ వీరేశలింగం పంతులు జీవితాంతము యే మహిళాభ్యున్నతికై కలలుకని అహర్నిశలు పాటుపడియుండెనో, ఆయన ఆశోరిక దేశమునకు స్వాతంత్ర్యము లభించిన పిమ్మట సగ్వాంఛితముగా ఫలించినది. పురుషులవలె నేడు స్త్రీలును సాహిత్యసంబంధమైన విభిన్న ప్రక్రియలలో రచనలు చేయుచు వారితో సరిసమానముగా గౌరవమును పొందుచుండుట సహృలకు విదితమే. నవలా సాహిత్యప్రక్రియలో వారి కృషి నేడు వసంతారామమై ప్రకాశించుచున్నది, ఈనాడు యే దిన, వార, మాసపత్రికలను తిప్పిచూచినను, పురుషులకన్న స్త్రీల రచనలే రాసిలోను, వాసిలోను అత్యధికముగా కనుపించి కను విందు చేయుచున్నవి. ప్రతి సంవత్సరము పత్రికలు నిర్వహించు నవలల పోటీలలోను వారికిగూడ పెక్కు బహుమతులు లభించుచున్నవి. దీనికి మనము ఆనందించి ఇంకను వారినుండి ఉత్తమ రచనలను ఆశించుచు, హృదయపూర్వక సుస్వాగతమిచ్చి గౌరవించవలసినదే.

Stereotype రచనలు స్త్రీల లేఖినినుండి అత్యధికముగా వెలువడుచున్నవనియు, కొత్తదనము (Variety) అంతగా కనుపించుటలేదనియు ఒక అభిప్రాయము వారి రచనలపట్ల యున్నది. శతజయంత్యుత్సవము జరుపుకొనిన మన

తెలుఁగు నవలకొ "ఇంకను మైనారటీ తీరిందా? లేదా?" అన్న సంశయమును కొందరు సాహితీపరులు వెలిబుచ్చుచున్న ఈ తరుణమున రచయిత్రుల రచనలలో ఆమాత్రము లోప మున్నను పరిగణనలోనికి తీసికొనవలసిన అవసరము లేదేమో!.

భారత జాతీయోద్యమము, మహాత్ముని నిర్మాణ కార్య క్రమములు రచయితలను ఆకర్షించినట్లే మన తెలుఁగు రచ యిత్రులను గూడ మిక్కుటముగా ఆకర్షించినవి. ఆ ప్రభా వము వారి రచనలపైనను బహుముఖములుగా పొడసూపినది.

మహిళాభ్యుదయమునకై శ్రీమతులు గుమ్మడిదల దుర్గాబాయి, ఊన్నవ లక్ష్మీబాయమ్మ, కొండా పార్వతి, కడప రామసుబ్బమ్మ, భారతీదేవి రంగా, సూర్యదేవర రాజ్యలక్ష్మమ్మ, సూర్యదేవర అన్నపూర్ణమ్మ, మూడపాటి మాణిక్యాంబ, బూర్గుల అనంతలక్ష్మి, సంగెం లక్ష్మీబాయమ్మ, రంగమ్మ ఓబులరెడ్డి, ఆయుట్ల కమలాదేవి, ఎల్లాప్రగడ సీతా కుమారి, మాగంటి అన్నపూర్ణ మున్నగువారు స్వాతంత్ర్య ద్యమకాలమునను, ఆపిమ్మటను ప్రత్యక్ష పరోక్షముగా సలిపిన కృషి ప్రశంసనీయమైనది. దానికితోడు ప్రభుత్వమును స్వాతం త్ర్యము సిద్ధించినపిమ్మట స్త్రీ జనాభ్యుదయమునకై ప్రణాళి కలద్వారా ప్రత్యేకమైన శ్రద్ధను చూపుచున్నది. దిన, వార, మాసపత్రికలు ప్రతిసంవత్సరము వేల సంఖ్యలో బహుమతు లను ప్రకటించి పోటీలను నిర్వహించి ఉత్తమ నవలా సాహిత్య

సృజనకు తోడ్పడుచుండుటవలన మహిళలు అధిక సంఖ్యలో ఆ పోటీలలో పాలుగొని ఉత్తమ నవలా సృజనమున పురుషుల కంటే వారే ముందడుగు వేసిరను కొండొకభావము పాఠక సామాన్యమున ఏర్పడినది. శ్రీమతులు ఊటుకూరి లక్ష్మీ కాంతమ్మ, కాంచనవల్లి కనకాంబ, కనపర్తి వరలక్ష్మమ్మ, చావలి బంగారమ్మ, చిలకపాటి సీతాంబ, కప్పగంతు సుబ్బలక్ష్మమ్మ, సీరము సుభద్రాంబ, పిల్లలమఱ్ఱి సుశీల, బురాణ సూరమాంబ, నాళం సుశీలమ్మ, న్యాపతి కామేశ్వరి, చెలికాని చెల్లాయమ్మ, జూలూరి తులశమ్మ, దేశిరాజు భారతీదేవి, నేమాని భారతీరత్నాకరాంబ, గ్రంథి మాణిక్యాంబ, చుండూరు రమాదేవి, బండారు అచ్చమాంబ, పులవర్తి కమలాదేవి మున్నగు విదుషీమణులలో కొందరు ఇతర సాహిత్యప్రక్రియలతోపాటు నవలాసాహిత్య ప్రగతికిని చేసిన సేవలు ప్రశంసనీయమైనవి. అంతియేగాక పెక్కు సంస్థలు, పత్రికలు మహిళల సాహిత్యాభివృద్ధికి ప్రత్యేక కృషి సలుపుచు, సృజనాత్మకమైన రచనలు వారినుండి వెలువడుటకు దోహదము చేయుచున్నవి.

మన తెలుఁగు సమాజమున చేవగల సారవంతమైన భావలో పెక్కు నవలలు వాసి స్త్రీ పురుషులలో లైంగిక భావ విప్లవమును రేకెత్తించి తెలుఁగు నవలా సాహిత్య జగత్తులో నూతన దృక్పథమును సృష్టించిన ప్రతిభాశాలి శ్రీ చలం అన్న సంగతిని లోగడ తెలిపియుంటిని. ఆయన

కుమార్తెయే సౌరీస్. ఆమెయు తండ్రితోపాటే ఆ మహోద్యమములో భాగస్వామినియై స్వాతంత్ర్యము సిద్ధించుటకు పూర్వమే పెక్కు రచనలుచేసి మహిళాసమాజ వికాసమునకు అహర్నిశలు పాటుపడిన విప్లవ రచయిత్రి. గొప్పమేధావిని. ఆమె వ్రాసిన "అనావీలక్", "జీవనరాగం" రెండు నవలీకలు చదివినయెడల ఆ విషయము యదార్థమని తెలియగలదు. పాత్రపోషణములోను, సంభాషణలు నడపుటలోను, విషయవ్యక్తీకరణలోను తండ్రి హృదయమును పుణికిపుచ్చుకొనిన తనయ ఆమె. తండ్రితోపాటే ఆమెయూ రచనారంగమునుండి తప్పుకొని అరుణాచల మహాక్షేత్రమున యోగనిష్టలో నిమగ్నుడైయున్న శ్రీరమణుని శ్రీచరణముల నాశ్రయించి ఆధ్యాత్మిక చింతనతో కాలము గడుపుచున్న యోగజీవిని ఆమె.

స్వాతంత్ర్యము సిద్ధించకముందు నుండియే కలము చేపట్టి, నేటివరకు రచనలు విరివిగా చేయుచున్న విదుషీమణి శ్రీమతి ఇల్లిందుల సరస్వతీదేవి. "పండుగ బహుమతి" అన్న కథల సంపుటితో పటువుర్ది దృష్టిని ఆకర్షించి "దరిజేరిన ప్రాణులు" అన్న ఉత్తమ నవలా సృష్టితో ఆమె సాహిత్య శిఖరాగ్రమును చేరుకొనినది. ఇందు పారంపర్యముగా వచ్చుచున్న వివాహవ్యవస్థకు సంబంధించిన పెక్కు విషయములు చర్చించి, ఒకనాటి పెండ్లి నూరు సంవత్సరముల పంట యని అది సశ్రీమముగా జరిగినయెడల యెట్టి యిక్కట్టులు

సంభవించనేరవని, అ ది అ స్తవ్య స్తమై పరిణమించినప్పుడు స్త్రీ పురుషుల ఇరువురి జీవితములలోను కొద్ది హెచ్చు తగ్గులతో అర్పుటకు వీలుకాని మంటలు రగులుకొని హృదయములను దహింపజేయుచుండునని రచయిత్రి నేర్పుతో ఇందు వివరించెను. ఈ నవలలోని 'నిర్మల' తాను చేయని తప్పుకు జీవితాంతము అనుభవించిన శిక్షను, పొందిన హృదయ వేదనను, పాఠకుల మనస్సులను కలచివేయునట్లు, హృదయమున్న ప్రతివ్యక్తి అమెపట్ల నిండైన సానుభూతిని ప్రకటించి, రెండు కన్నీటిబిందువులు కాల్చునట్లు రచయిత్రి కథను చక్కగా మలచినది. ఇక ఆమె భర్త రమణ పరిస్థితుల తాకిడికి తట్టుకొని నిలువలేని వట్టి పిరికివాడు.

భర్త పరిత్యక్తలైన స్త్రీలు సమాజములో పొందు అవమానములను, అవహేళనలను శ్రీమతి సరస్వతీదేవి మిక్కిలి నేర్పుతో, సానుభూతితో ఇందు చిత్రించినది. మంగళసూత్రమును మెడలో ధరించిన స్త్రీ సంఘములో యెట్లు ప్రవర్తించిను, పుత్రవతియైనను గౌరవింపబడుచున్న దనియు, అదిలేని స్త్రీ యెంతటి ఉత్తమురాలైనను, గుణవంతురాలైనను, సంతానవతియైనచో కాకులను, గద్దలను పొడిచినట్లు పొడిచి హింసించుచున్నదను సత్యమును రచయిత్రి ఇందులో చక్కగా ప్రతిష్టించినది.

అనాథబాలికల సంరక్షణ, నర్సింగ్ హోంను నడుపుట, మహిళా సంఘములు, ఆ సంఘ సభ్యుల కార్యక్రమములు

ఇందు బాగుగా వివరింపబడినవి. ఈ నవలలో అందరిని ఆక
ర్షించి, అందరి మన్ననలను పొందిన మరొక వ్యక్తి వెంక
టాద్రిమధ్య. ఈ నవల పఠితవ్యక్తి చదవతగినది.

ఆంధ్రపభ సచిత్ర వారపత్రికలో పతివారము పచు
రితమగు "పమదావనం", "వంటా-వార్పూ" మున్నగు
మహిళలకు సంబంధించిన ప్రత్యేక శీర్షికలలో నేగాక,
"వింతలు-విడ్డూరాలు" "జవాబులు" మొదలైన విజ్ఞానాత్మక
మైన వెక్కు రచనా పకియలద్వారా తెలుఁగుపఠితలకు
సుపరిచితురాలైన సీనియర్ రచయిత్రి శీమతి మాలతీ
చందూర్. ఆమె రచనా సంవిధానము పలువుర రచయిత్రు
లను ఆకర్షించి రచనలు చేయునట్లు పోత్సహించినది.

శీమతి మాలతీచందూర్ వాసిన "చంపకం - చెద
పురుగులు" నవల ఉద్యోగముచేయు ఒక మహిళ ఎదుర్కొనిన
బాధలను, చిక్కులను వర్ణించునట్టి రచన. "మేఘాల మేలి
ముసుగు" ఆమె మరొక నవల. అరుణగిరి, రోజారాణి,
విశాల ముగ్గురిమధ్య నడచిన విచిత్ర ప్రేమగాధయే ఇది. కాము
పమాదములో రాజమ్మ పొందిన విషాద మరణము పఠిత
లను కదలించివేయును. "లావణ్య" ఆమె వాసిన ఒక
నవలిక. ఈ నవలికలోని లావణ్య, సుందరరామయ్య అను
ధనవంతుడైన ఒక వ్యాపారి ఏకైక కుమార్తె. ఆమె తన
తండ్రివద్ద పనిచేయుచున్న రాఘవేంద్రరావను యువకుని
పేమించి, తన అభిజాత్యముతో తిరస్కరింపబడినది, ఈ

సంగతి తన భార్యవలన తెలిసికొనిన సుందరరామయ్య కోప ముతో అతనిని ఉద్యోగమునుండి తీసివేయగా, అతడు వేరొక చోటికిపోయి కాలము వెళ్ళబుచ్చుచున్నప్పుడు లావణ్య మరల అతనివద్దకుపోయి, అతని కుటుంబముతో సన్నిహిత సంబంధమును ఏర్పరచుకొని, మరల తన తండ్రితో చెప్పి అతనికి వేరొక ఉద్యోగమిప్పించినది. లావణ్య తనను ప్రేమించుచున్నట్లు తెలిసికొనిన రాఘవేంద్ర రావు ఆమెనుండి తప్పుకొని తిరిగినను, కాను తన మేన గోడలు సుశీలను ప్రేమించినట్లు తెలియపరచినను వినక ఆమె అతని కంటబడినది. అతడు ఆమెను గట్టిగా మందలించి నప్పుడు భగ్నప్రేమతో తన బావను వెంటతీసికొని విదేశ ములకు వెళ్ళుటతో కథ ముగిసినది. ఈ కథలో కొత్తదనమేది యును లేదు. వివిధ సాహిత్య రచనలతో చేయితిరిగిన ఈ రచయిత్రి లేఖిని నుండి కొన్ని నవలలు వెలువడినను నవలా సాహిత్య వికాస చరిత్రదృష్ట్యా అవి ఒక స్థాయిని అందుకొని నట్లు కనిపించదు. నవలలకు ఆకర్షణీయమైన సరికొత్త పేర్లు పెట్టుట యనునది ఈమెకుగల ప్రత్యేక నైపుణ్యము.

"నిక్కమైన మంచి నీలమొక్కటెచాలు" అన్న శ్రీవేమన్న సూక్తికి సాదృశ్యముగ కీ. శే. రాజైన శ్రీదేవి వ్రాసిన ఒకే ఒక్క నవల "కాలాతీతవ్యక్తులు" తెలుఁగు నవలా కుటుంబమునకు శోభను చేకూర్చినట్టిదనుటలో సందే హములేదు. నిండైన మానవత్వపు అవగాహనములో,

దూరదృష్టితో రచింపబడిన ఈ నవల నవలా సాహిత్య వికాస చరిత్రలో ప్రముఖస్థానము వహించుచు కలకాలము నిలచివుండగల మణిపూస. ఈ నవల ఆద్యంతము సరస సంభాషణములతో, చక్కని సన్నివేశములతో సొంపైన తెలుఁగు భాషలో నడచినది. ఇందు ఇందిర, కళ్యాణి, వైదేహి, కృష్ణమూర్తి, ప్రకాశం, రామానాయుడు మున్నగు స్త్రీ పురుష పాత్రలు పెక్కు ఉన్నను, అందరిని ఆకర్షించగల అందముతోపాటు, చిత్ర విచిత్రమైన పోకడలతో, సరస సంభాషణలతో తాను కదలుతూ, ఇతరులనుగూడ తన వెంట కదిలించగల జాణతనముతో పాఠకులను ముగ్ధులనుచేసి ప్రవర్తించిన విచిత్రమైన పాత్ర ఇందిర. ఆ పాత్ర ను చుట్టియే కథ నడచినది. ఒక కంపెనీలో స్టెనోగా పనిచేయు చున్న ఆమె తన శరీర సౌందర్యాకర్షణతో కృష్ణమూర్తి, ప్రకాశంవంటివారితో తిరిగి చెడ్డ పేరు తెచ్చుకొనినను, కించపడక స్వతంత్రబుద్ధితో స్వేచ్ఛగా ప్రవర్తించిన ధీరురాలు. తన మనస్సులో చెలరేగిన భావములను యెట్టి జంకు గొంకులునులేక నిర్భయముగా బయటపెట్టిన ప్రజ్ఞాశీలి- చూడండి - "నా ఇల్లు నేను కట్టుకుంటుంటే ప్రక్కనుంచి నడిచివెళ్ళేవారి నొత్తిమీద ఇటుకలు పడ్డాయంటే నేనేం కొయ్యగలను? ఎవరిమట్టుకు వాళ్ళు చూసుకు నడవాలి" అంటుంది. మరొక సందర్భమున "నామీద నాకే జాలి లేనప్పుడు ఇంకొకళ్ళను గురించి ఎక్కడ ఆలోచించను?

దేనికైనా ఒక లిమిట్ ఉంటుంది. అది దాటాక విరక్తి అనే పెద్ద మైదానంలో అన్ని అభిమానాలు ఇంకిపోతాయి" అంటుంది వేదాంతధోరణిలో. ఒకానొక సందర్భములో ప్రకాశంతో "ఈ ప్రపంచంలో ఒకరికోసం ఒకరు ఏదీ చెయ్యరు. ఎవరికోసం వారే చేస్తారు. నువ్వు చెన్నెముకలేని మనిషివి. తోముగా తోముగా గట్టి పడతావనుకున్నాను. నువ్వాసలు పుట్టుకతోనే సగం మనిషివి. బీటలు వేసిన వ్యక్తిత్వంనీది" అంటుంది ఆమె. వాడిగల కాణములకంటెను, విచ్చు కత్తులకంటెను పదునైన మాటలతో ఎదిరి పాత్రల గుండెలను గ్రుచ్చి రోషమును, ఆవేశమును పుట్టించు రీతిలో. స్త్రీలంతదివలెనే ఇందిరగూడ గతస్మృతులకు సంబంధించిన ఆలోచనలతో బుర్ర బద్దలు చేసికొనక, భవిష్యత్తుపైన అచంచలమైన ఆత్మవిశ్వాసముతో బ్రతికిన ఆశావాది. తెలుగు నవలా సాహిత్య చరిత్రలో ఇందిర ఒక వైవిధ్య విలసితమైన, విచిత్రమైన పాత్ర. సంఘ దృష్టిలో దిగజారి పోయిన కళ్యాణిని డాక్టరు చక్రవర్తి పేమించుట విచిత్ర ముగానున్నది. ప్రపథమమున కళ్యాణి ఒంటరి జీవితమును చూచి మిక్కిలి జాలిని, సానుభూతిని గనబరచిన ఇందిరయే ఆమెకు ప్రకాశం చేయూత లభించిన పిమ్మట అసూయతో ప్రవర్తించిన తీరు స్త్రీ సహజమైన మానసిక ప్రవృత్తిని చక్కగా వ్యక్తముచేసినది - "కాలాతీతవ్యక్తులు" అందరు చదవతగిన మధుర కళాఖండము. అద్యంతము జాగరూకతతో చిత్రించబడిన ఉత్తమ నవల.

పెక్కు సంవత్సరములు ఆంధ్రప్రభ సచిత్ర వార పత్రికలో ధారావాహికముగా వెలువడిన "ఊహాగానం" శీర్షిక క్రింద సుసంపన్నమైన భావపరంపరలతో ఆంధ్ర ప్రజానీకమును ఉత్తేజపరచిన 'లత' యే శ్రీమతి తెన్నేటి హేమలత. "పృథ్వీహీన", "మోహనవంశి", "మహోదగ రంలో స్త్రీ", "ఎడారి పువ్వులు", మున్నగు ఇరువది ఐదు నవలలను వ్రాసి పెక్కుమంది రచయితలను, పఠితలను ఆకర్షించి నవలా రచయిత్రిగా ఆమె స్థిరపడినది. కొంత కాలము శ్రీ చలం సాహిత్య సృష్టి అనంతర వాతావరణమై ఆయనవలెనే స్త్రీ పురుషుల స్వేచ్ఛా ప్రవృత్తికి, ప్రణయ భావములకు అధిక్యతనిచ్చి రచనలు చేసినను ఆ పిమ్మట ఆయన కక్ష్యనుండి విడివడి స్వతంత్ర పత్రిపత్తిగల ఆలోచ నలతో తార్కిక, ధార్మిక పరమైన అన్వేషణముతో నేడు రచ నలు చేయుచున్న విధుషీమణి. పదునైన భాష, నిశితమైన ఆలోచన, పాత్రోచితమైన సంభాషణలు ఆమె కథన దక్షతకు మేలి ఉదాహరణములు.

లత తాను వ్రాసిన "ఎడారి పువ్వులు" నవలలో స్త్రీ పురుషుల స్వేచ్ఛా ప్రేమకు ప్రాధాన్యతనిచ్చి విజయవాడను కథా కేంద్రము చేసినది. ఆ పట్టణ వాతావరణము పరిసర స్థితిగతులు అందు వాస్తవముగ చిత్రింపబడినవి. పెక్కు పాత్రలతో నిండిన ఈ నవలయందలి వ్యక్తులందరును నీతి - అవినీతి; ప్రేమ - వివాహము; వంటి మున్నగు విషయముల

రాద్ధాంత సిద్ధాంతములతో, ఘర్షణలతో నలిగిపోయిన విచిత్ర పరిస్థితులు వర్ణింపబడినవి. ఒక వ్యక్తి వేరొక వ్యక్తిని కలసినయెడల సెక్సుకు సంబంధించిన చర్చతే తప్ప మరే విషయములు వారి ప్రసంగములలో కనుపించుటలేదు. వీటి సెప్సుకు సీతి, అవిసీతి, ధర్మము, అధర్మము, ధనము, అంతస్తుల భేదములుగూడ అడ్డుపడుటలేదు. నవల ఆద్యంతము సెక్సుతో నిండిపోయినది. ఒక్క పార్వతి తప్ప - రాజు, సత్యవతి, డాక్టర్ మధుసూదనరావు, కామాక్షి, సునంద, శివరావు, లీల, చిత్రకారుడు శంకరరావు మున్నగు వారందరును ఆ సుడిగుండములోపడి సెక్సుకు దాసులై చిత్రవిచిత్రముగా ప్రవర్తించినవారే. ఆమె నవలలన్నిటిలో ఉన్నతస్థాయి నందుకొనినది "మోహనవంశి". రాధాకృష్ణుల దివ్యప్రేమ తత్వమును పవిత్ర శృంగార భావములను అత్యున్నతస్థాయిలో ఆమె ఇందు చిత్రించినది. రాధాకృష్ణుల దివ్యప్రేమను గురించి ఆమె చెప్పిన ఈ మాటలు మన తెలుఁగు సాహిత్యజగత్తులో చిరస్థాయిగా ఉండునట్టివి. చూడండి - "ఆ మహాసంయోగానికి మొదలు, చివర్లు లేవు. కాలా కాలాలు లేవు. నీతి అవినీతులు లేవు. అది ఒక దివ్యానుబంధం. మాటలకు, చేతలకు అందని ఒక మహాసుభవం" అని. "రాధ" పేరు చెపితే అంతకు మిక్కుటమైన ప్రేమ ఉన్నట్లు ఈ నవల చదివినయెడల తెలియగలదు. అదే ఈ క్రింది వాక్యములు ధ్రువపరచును. "నా ఆలోచనలకి,

ఆంతర్యానికి, అనుభవానికి, ఆవేదనకి అన్నిటికీ ప్రతిరూపం రాధ" అని చెప్పి, "ఈ రాధ నేనై తే!" అని తనను తాను ప్రశ్నించుకొని ఆ నిర్ణయాన్ని తీర్చుకొనుటకే దీనిని వ్రాసితినని ఆమె ప్రత్యుత్తరమిచ్చినది. నవలలో రాధకన్న, కృష్ణునికే ఆమె అధిక ప్రాధాన్యత నిచ్చినది. 'స్త్రీ' మనుగడకు పురుషుని అవశ్యకతను ధ్వనిపూర్వకముగా ఆమె ఈ నవలలో వ్యాఖ్యానించినది. ఈ నవలలో రాధా తత్వ వివేచనమును దివ్య సౌరభము గుబాళించెడి "రాధ" పాత్ర చిత్రణము అపూర్వోపము. శ్రీమతి హేమలత పొందిన దివ్య ప్రేమ భావోన్మీలనమే రాధ పాత్ర సృష్టిగా గమనించగలము. ఇంపలి ప్రతి భావ ప్రసారమును, రచయిత్రి పొందిన మహా త్తర అనుభూతిచేత శబలితమే.

నేడు తెలుఁగులో అచ్చగుచున్న అత్యధిక పరిశీలలో, పందెమువేసుకొని "నీవా - నేనా" అనునంత శరవేగముతో ఒకరికన్న మరొకరు ముందుకు దూసుకొని పోవుచున్నట్లు కథలు, నవలలు వ్రాయుచున్న ప్రసిద్ధ రచయిత్రులు శ్రీమతులు ముప్పాళ రంగనాయకమ్మ, కోడూరి (అరికెపూడి) కౌసల్యాదేవులు. వైవిధ్య విలసితము, సునంపన్నము, కథాకథన దక్షత గల వారి రచనలు వర్ధిష్ణువులైన పెక్కుమంది రచయితలను, రచయిత్రిలను ఆకర్షించి విరివిగా రచనలు చేయునట్లు ప్రోత్సహించుటయేగాక, అవి తెలుఁగు నవలా వికాస ప్రగతికి ప్రత్యూష సుగంధ పవనములై మంచి పటుత్వమును కూర్చినవి.

శ్రీమతి ముప్పాళ్ళ రంగనాయకమ్మ తాను సృష్టించిన పాత్రలను తన గుప్పిటలో నుంచుకొనక, వాటికి కావలసిన స్వేచ్ఛా స్వాతంత్ర్యములనిచ్చి, హృదయములోనున్న తన బాధలను, గాధలను యథేచ్ఛగా వెలికి చెప్పుకొనునట్లు చేసినది. ఆమె వ్రాసిన పెక్కు నవలలలో ఈ సత్యము గోచరించును. ఆమె నవలలలో కథాకథనము, పాత్రచిత్రణము, సన్నివేశముల కల్పనము, సంభాషణలు చక్కగా నడచినవి. "కృష్ణవేణి" ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక నడపిన పోటీలో ప్రథమ బహుమతి నందుకొనిన రచయిత్రి ప్రథమ నవల. దీనిలో కథ ఉత్తరములరూపమున ఆద్యంతము నడచినది. కృష్ణవేణి చూపులతోనే వివాహితుడైన మాధవును ప్రేమించి, అతనికి ఉత్తరములు వ్రాసి స్వేచ్ఛగా సంచరించినది. కొంతకాలమైన పిమ్మట అతడు "అరుణ" అను అమ్మాయితో తనకు వివాహముజరినగిట్లు తెలిపెను. దానితో ఆమె పరిస్థితి తారుమారుకాగా, ఆమె అన్న ప్రోత్సాహముతో ఆమెకు శ్యామసుందర్‌తో వివాహము జరిగినను, అటు మాధవు ప్రేమను తిరస్కరించిలేక, ఇటు శ్యామసుందర్ ప్రేమను కాదనలేక శిక్షకపడినది. మాధవ్‌కు, కృష్ణవేణికి మధ్య నడచిన ప్రేమలేఖలు శ్యామసుందర్ కంటపడినవి. అంతటితో ఆ సంసారములో అగ్ని రగుల్కొనినది. నేర్పుతో రచయిత్రి ఈ కథను మలచినది. శ్రీమతి రంగనాయకమ్మను రచయిత్రిగా స్థిరపరచిన నవల "జలిపీఠం".

వర్ణాంతర, మతాంతర వివాహములను వానివలన కలుగు అనిష్టములను రచయిత్రి దీని లో నేర్పుగా చిత్రించినది. కథానాయిక "అరుణ" బ్రాహ్మణ యువతి. విద్యాధికురాలు. అభ్యుదయ భావములు గలది. కరుణాశ్రమములో మానవసేవకు జీవితమును అంకితముచేసి పనిచేయుచున్న "భాస్కర్" అను హరిజన ఆదర్శయువకుని ప్రేమించి పెండ్లి చేసికొనినది. ఆ యిరువురు కొంతకాలము కాపురముచేసి సంతానవంతులైనను, వారి దృక్పథములు, ఆలోచనలు, పూర్వ సంస్కారములు, భేదించి క్రమముగా ఒకరినుండి మరొకరు దూరమై పెక్కు మానసిక వ్యథలకు గురియై, పెద్ద సుడిగుండములో చిక్కుకొని, తర్క వితర్కములమధ్య నలిగి పోయిరి. వివాహమునకు పూర్వమున్న వారి ఆదర్శములన్నియు తల్లక్రిందులై పోయినవి. అరుణ ఆడిగులుతో గుండెజబ్బుకు లోనై భాస్కర్ చేతిలో తన అసువులను బాయుటతో కథ విషాదాంతమైనది. కొందరు ఆదర్శముల పేరుతో శాతాకాలికోద్రేకములకు లోనై వర్ణాంతర వివాహములు చేసికొనినను. అవి శాశ్వతముగా వారిని బధించి వుంచజాల వనియు, సంప్రదాయము, సభ్యత, నాగరికత, అడ్డుగోడలై నిలచి వారి మనస్తత్వములను భేదింపజేయుననియు రచయిత్రి దీనిలో వ్యంగ్యస్ఫోరకముగా తెలిపినది. సంఘము దాని చిత్ర విచిత్రమైన పోకడలు దీనిలో చక్కగా వివరింపబడినవి.

"పేకమేడలు" నవలలో భానుమతి, రాజశేఖరముల

మధ్య జరిగిన వివాహము, అది విచ్ఛిత్తి అయిన విధము, భానుని విషాద మరణము, బాగుగా వివరింపబడినవి. ఈ నవలలో రచయిత్రి "భానుమతి" పాత్ర చిత్రణములో చూపిన నేర్పు ప్రశంసనీయమైనది. పల్లెపట్టులయందలి యాదార్థ స్థితిగతులను, సమస్యలను, సంకుచితస్వభావములను చిత్రించు నవల "ఇదేనా న్యాయం" అనునది. ఇది శంకరం అను పేద విద్యార్థి జీవితమును యథాతథముగా, వాస్తవ దృక్పథముతో చిత్రించు నవల. ఇక "కూలిన గోడలు" నవల పిల్లల మనస్తత్వము, పెద్దల మనస్తత్వముతో పోటీ పడినప్పుడు సంభవించు అనర్థములను, యదార్థ విషయములను మానసికశాస్త్ర దృక్పథముతో శోధించి వ్రాసిన నవల. ఇది చక్కని, చిక్కని నిండైన రచన. పిల్లల మనస్తత్వమును 'మనసు పాత్ర' లోను, పెద్దల మనస్తత్వమును 'విశ్వనాథము' పాత్రలోను ఈ నవలలో శ్రీమతి రంగనాయకమ్మ అద్దములో వలె ప్రతిబింబింప చేసినది.

జీవితముపట్ల, రచనలపట్ల ఒక సక్రమ దృక్పథముతో కథలు, నవలలు వ్రాయుచున్న రచయిత్రి శ్రీమతి కోడూరి (అరికెపూడి) కౌసల్యాదేవి. ఆమె వ్రాసిన "చక్రభ్రమణము" నవలకు ఆంధ్రప్రభ వారపత్రిక ఉగాది నవలల పోటీలో ప్రథమ బహుమతి లభించుటతో ఆంధ్రదేశము నాలుఁగు చెరగుల ఆమె కీర్తి విస్తరించినది. చలనచిత్ర నిర్మాతలు "డాక్టర్ చక్రవర్తి" అన్న పేరుతో చలనచిత్రముగా దీనిని

మలచిరి. ఈ నవలలో డాక్టర్ చక్రవర్తి అతని భార్య నిర్మల; రవీంద్రుడు, అతని భార్య మాధవి ప్రధాన భూమికలు. ఆ నాలుగు పాత్రల విచిత్రమైన మానసిక స్థితిగతులను రచయిత్రి దక్షతతో ఇందు ప్రదర్శించి కథను సుఖాంతము చేసినది. "సంసారచక్రం" నవలలో చలపతి, రామారావు అను ఇరువురు మధ్య వయస్కులు. తమ ప్రథమ భార్యలను గోలుపోయిన పిమ్మట సంతానవంతులైనను భద్రమ్మ, రమ అను వారిని తమ జీవిత భాగస్వాములనుగా చేసికొని వారితో గడపిన జీవితము ఇందు వర్ణింపబడినది. చలపతి, సుభద్రమ్మల జీవితమునందలి ప్రతి మలుపును, ఆ మలుపులలో సంభవించిన చిత్ర విచిత్రమైన పరిణామము లను రచయిత్రి నేర్పుతో మనముందుంచినది. రచయిత్రి, రమ జీవితము ఆదర్శవంతము, ఆనందప్రదమునై నెగడిన తీరును శ్లాఘనీయముగా వివరించినది.

"ప్రేమనగర్" నవలలో ఒక బిచ్చాండారుగారి చిన్న బ్బాయికి, ఒక ఏయిర్ హోస్టెస్‌కు మధ్య ఏర్పడిన ప్రేమ అంతస్తుల భేదముతో విఫలముకాగా, ఆ యువకుడు, ఆ యువతి ప్రేమకు ప్రతీకగా ఒక అపూర్వమైన "ప్రేమ నగర్" ను నిర్మించెను. దానిలో ఆ ఇరువురు భగ్న ప్రేమికులు మానవకల్పితమైన వివాహబంధమునకు, సాంసారిక సుఖమునకు అతీతులై మానవ సేవకు, లోక కళ్యాణమునకు తమ జీవితములను అంకితముచేసిన విచిత్ర ప్రేమో

దంతమును వివరించును. ఆమె "కళ్యాణమందిర్" నవల సంసార జీవితమునందలి ఒడు దుడుకు లను చిత్రించును. "కళ్యాణి" అను పేరుగల యువతి తన అంతస్తుకు మించిన ప్రకాష్ అను ఉన్నత ధనిక కుటుంబమునకు చెందిన యువకుని ప్రేమించి అతనితో స్వర్గసుఖములను అనుభవించుచున్నప్పుడు, మైలేయి అను వేరొక యువతితో అతనికి సంబంధము ఏర్పడి, చివరకు ఆ ఇరువురు వివాహము చేసికొనుటతో 'కళ్యాణి' జీవితము నరకతుల్యమై, విషాదాంతముగా కథముగిసినది. శ్రీమతి కొసల్యాదేవి "ధర్మచక్రము" నవల దేశభక్తికి సంబంధించినది. సత్య, ధర్మారావు అను భార్యాభర్తలకుగల దేశభక్తిని, వారు సాధించిన ఘన విజయమును రచయిత్రి నేర్పుతో వివరించినది. దేశభక్తులైన ఆ ఇరువురు పథమున ఎదురొక్కునట్టి చిక్కులను, కష్టనష్టములను వారు చివరకు పొందిన విజయములను ఇది చక్కగా నిరూపించును.

"ఇది నారీదృక్పథము", "ప్రశ్నావళి", "పుస్తక విమర్శ" మున్నగు శీర్షికలతోనే గాక మహిళలకు సంబంధించిన పెక్కు వ్యాసములతో ఆంధ్ర దినపత్రిక, సచిత్ర వారపత్రిక, భారతి మాసపత్రికలలో తరచుగా వ్యాసములు వెలువరించుచు, అక్షరాస్యులైన వారందరికిని సుపరిచితురాలైన విదుషీమణి, సీనియర్ రచయిత్రి శ్రీమతి కె. రామలక్ష్మి. నవలా రచన ఆమె కొంత ఆలస్యముగా ప్రారం

భించినను, వ్రాసినవి అందరికి సులభముగా గ్రాహ్యమగు నట్లు సరస సంభావణలతో విభిన్నమైన సన్నివేశములతో, విచిత్రమైన సంఘటనలతో నుండునట్లు ఒక లక్ష్యముతో నవలలు వ్రాయుచున్న రచయిత్రి అమె. కథను ప్రారంభించు టలోను, చక్కగా దానిని నడుపుటలోను, ముగింపులోను ఒక ఆరోహణావరోహణ క్రమముతోపాటు శాస్త్రీయ దృక్ప థము గూడ కలిగివున్న నవల అమె వ్రాసిన "హృదయం చిగిర్చింది" అనునది. పద్ధనిమిది మాసములు అత్తవా రింటిలో కాపురము చేసి, ఒక పాపనుగూడ కని వితంతువై తిరిగి పుట్టింటికే చేరిన రమ తన జీవితమును నిస్సారము చేసికొనక, సుందరం భావ ఇచ్చిన చేయూతతో మరల కాలేజీలో చేరి, చదువు ప్రారంభించి హాస్టలులో వుండి, తన రూమ్మేటు సరళ సహకారముతో లెక్చరర్ రామా రావును వలచి, వలపింపజేసి వివాహమాడి తన జీవితమును పూలవాటికగా మార్చుకొనిన వివేకవతి. ఉన్నత విద్యా సంపన్నుడు, గొప్ప ఉద్యోగియైన రామారావు, రమ వివా హితయని, ఒక పాపను కని మాతృమూర్తి యైనదని తెలి సియు అమెపట్ల జాలి గనబరచి, విశాల దృక్పథముతో, సానుభూతితో వ్యవహరించి వివాహమాడిన తీరు మిక్కిలి ఆదర్శవంతమైనది. తమ దాంపత్య జీవితముపట్ల ఏవ గింపుతో వ్యవహరించిన వారిని చూచి ఈర్ష్యపడక ఈ విశాల ప్రపంచములో వి భి న్న మన స్తత్వములు కలిగిన

వారుందురనియు, వారికి భయపడక తాము నమ్మిన సిద్ధాంత ములకు అనుగుణముగా వ్యవహరించిన చాలునని, "ముందు బాట సుగమంగా ఉండాలంటే మనం పడ్డ మనఃక్లేశాన్ని మరచిపో" వాలని గ్రహించిన దూరదృష్టిగలవాడు రామా రావు. అతడు ఆశాజీవి. రామారావు, రమ పాత్రలను రచయిత్రి బాగుగా పోషించినది. "లలిత - మోహాను"ల మధ్య ఏర్పడిన ప్రేమ అంతస్తుల భేదముతో విచ్ఛిత్తియైన విషయమును, లలిత వెంకటాద్రినాయుడు అను లాయరు, అతని మిత్రుడు బలరామ శాస్త్రి మున్నగువారి సహాయ ముతో, ఆమె తన అత్తయ్య ఆస్తికి వారసురాలైన విధ మును వివరించుచు రచయిత్రి "ప్రేమించు ప్రేమకై" అన్న మరొక నవలను వ్రాసినది. ఈ నవలలో సంఘటనలు, వాతావరణము అంత బలమైనది కాకపోయినను రచయిత్రి కథను నేర్పుతో వివరించిన తీరు ప్రశంసనీయమైనది. ఆమె వ్రాసిన "చీకటిదారి", "చిన్న వదిన" రెండు నవలికలు. చీకటిదారిలోని 'భారతి', చిన్న వదినలోని 'లక్ష్మి' ఇరువురు మంచివారు. వారికి దగ్గరి పోలికలుండి తోటివారి అభివృద్ధికి పాటుపడిన విశాలహృదయులే యైనను భారతి తన మంచితనముతో ఆడపడచు శశిరేఖ జీవితమును రక్షించలేకపోగా, లక్ష్మి నేర్పుతో సంస్కారబద్ధమైన తన తెలివితేటలతో తన మరదలు శ్యామల ప్రేమను ఫలో న్ముఖమగునట్లు చేయుటలోను, గయ్యాళిగంపయైన పెద్ద

వదినను మార్చుటలోను చూపిన ప్రతిభ మెచ్చుకొనతగినది. భారతి, లక్ష్మి పాత్రలను శ్రీమతి రామలక్ష్మి చక్కగా నిర్వహించినది.

స్త్రీ, పురుషుల హృదయములను సూక్ష్మ దృష్టితో పరిశీలన చేసి పరిణామికాబద్ధముగా నవలలు వ్రాయగల రచయిత్రులలో శ్రీమతి ద్వివేదుల విశాలాక్షి అందె వేసిన చేయి. ఆమె వ్రాసిన "గ్రహణం విడిచింది" నవల ఉత్తమ పురుషలో నడచినది. భర్తను గోలుపోయిన భారతి, ధనాశతో తన చుట్టు మూగిన బంధుమిత్రులను చూచి, అనుమానించి వెలుఁగును అన్వేషించుచూ, సంఘమునకు దూరముగావెళ్ళి సర్వసంగ పరిత్యాగులైన సన్యాసులవెఁట తిరిగి, వారిలోను గూడు కట్టుకొనివున్న ధనాశకు ఆశ్చర్యపడి, కోరిన మనశ్శాంతిని అక్కడ పొందలేక, తిరిగి ఇంటికిచేరి సంఘముతో సంబంధము పెట్టుకొనుటతో ఆమెలో గొప్ప మార్పు వచ్చినది. భర్తృ విహీనలై ధనవంతులైన వితంతువులు సంఘములో పొందు అవమానములను, అవహేళనలను, మనోవేదనలను రచయిత్రి దీనిలో సహజధోరణిలో వర్ణించినది. ఈ నవలలో "భారతి" పాత్ర చిత్రణము మెచ్చుకొనతగినది. ఆమె మరొక మంచి నవల "వారధి". ఒక పల్లెటూరిలో "శివయ్య - మీనాక్షి" అను ఆదర్శ దంపతులు తమకున్న ఆస్తినంతటిని పోగొట్టుకొని, తమ మాతృ తమ్ముఁడైన వరదరాజులను కన్న కుమారునికన్న మిన్నగా

చూచుకొని, ఉన్నత విద్యావంతునిగా నొవరించి తాము కష్టములపాలై పోయిరి. ఇక వరదరాజులు పట్టణములో రాఘవయ్య అను ధనవంతుని కూతురైన "అనూరాధ"ను వివాహమాడి తన అంతస్తుకు, హోడాకు మించిన భోగములు ననుభవించుచుండగా, అనూరాధ గర్భవతియై ప్రసవ సమయమున అకస్మాత్తుగా మరణించుటతో అతనికిని, ఆ ఇంటికిని సంబంధము తెగిపోగా మరల తన అన్న వదినెలను చేరుకొనెను. విశాలహృదయులైన వారు తము గతము నంతటిని మరచిపోయి, అతనిని ఆప్యాయతతో ఆదరించిరి. పల్లె పట్టుల సహజ జీవన సరళిని, వారి ప్రేమాభిమానములను రచయిత్రి దీనిలో చక్కగా చిత్రించినది. గోపాలమునకు భార్యకావలసిన గోమతి పరిస్థితులు వర్ణించుటతో గోవిందు నకు భార్యయై జీవిత మాధుర్యమునకు దూరురాలై, కృంగి, కృశించి అవమానముతో, అనుమానముతో జీవయాత్రను చాలించిన ఆమె కథను శ్రీమతి విశాలాక్షి "గోమతి" నవలలో నేర్పుతో మలచినది. ఇది ప్రతివారు చదవతగిన నవల.

శ్రీమతి యద్దనపూడి సులోచనారాణి తన హృదయ కుహరమునుండి వెలువడిన భావపరంపరలను నిరాఘాటముగ వాస్తవమునకు చేరువగనుండునట్లు చేసి, తాను సృష్టించిన ప్రతి పాత్రయందును వైవిధ్యము గోచరించునట్లు రూపకల్పనము చేయగల ప్రతిభావంతురాలు. ఆమె వ్రాసిన నవల

లన్నియు బహుజనాదరణను బొందినవే. అట్టి ఉత్తమ శ్రేణి నవలల వరుసలో ఎన్నదగిన రచన "సెక్రటరీ". దీనిలో వ్యక్తులు వివిధ ప్రజాసంస్థల పేరుతో చేరి గుత్తాధిపత్యమును కహించి, తమ స్వార్థములకొరకు వానినెట్లు వినియోగించుకొందురో వివరించుటయేగాక, కామే సర్వస్వముగా వ్యవహరించుచు తోటి మానవులపట్ల యెట్లు ప్రవర్తింతురో చక్కగా రచయిత్రి ఇందు ఆవిష్కరించినది. ఉద్యోగములుచేయు స్త్రీలపట్ల వై అధికారులు కనబరచు కపటప్రేమలను, స్వార్థ చింతనతో కూడిన సంకుచిత దృష్టిని, వారి వికటాట్టహాసములను, పటాటోపములను నేర్పుతో పాఠకులముందుంచినది. 'స్త్రీలు' జీవిక కొఱకు ఉద్యోగములు చేయుచు అనుభవించు మానసిక వ్యథలను, హృదయవిదారకమైన వారి పరిస్థితులను సానుభూతితో పరిశీలించినది. ఆమె మరొక నవల "ఆరాధన". దీనిలో 'అన్నపూర్ణ' అను మూగపిల్ల జీవితమును, ఆమె విచిత్రమైన మనఃప్రవృత్తిని రచయిత్రి బహు చమత్కారముగా చిత్రించినది. ఈ మూగపిల్ల "ఆనంద్" అను యువకునికి రెండవ భార్యయై కాపురముచేయుచుండగా అత్తప్రోద్బలముతో తన భర్త మరొక అందమైన స్త్రీని వివాహమాడనున్నట్లు, తనకు ఘోరమైన అన్యాయము జరుగబోవుచున్నట్లు తెలిసియు తొణకక, గంభీరముగా ప్రవర్తించిన ధీరురాలు. రచయిత్రి అన్నపూర్ణ హృదయము లోని మూగబాధను, రంపపు కోతను సమర్థవంతముగా

చిత్రించినది. ఆమె తన సత్ప్రవర్తనతో, సచ్ఛీలముతో, సేవాభావముతో భర్త హృదయమును హరించి మూడవ పెండ్లి జరుగకుండగ చేసినది. దీనితో కథ సుఖాంతమై వరలినది. మన తెలుఁగు కుటుంబములలో సర్వసాధారణముగా చెలరేగు పరుషములను, పట్టింపులను, హెచ్చుతగ్గులను అంతస్తుల భేదములను, వానివలన సంభవించు అనర్థములను చర్చించుచున్న మరొక ప్రథమశ్రేణి నవల శ్రీమతి యద్దనపూడి వ్రాసిన "మీనా". దీనిలో పట్టణ వాతావరణమునకు, నవనాగరికతకు కృష్ణవేణిని, గ్రామీణ జీవితమునకు "మీనాక్షి"ని ప్రతీకలు చేసి రచయిత్రి ఈ నవలను చిత్రించినది. హనుమంతరావు, సారథి, కృష్ణ, సుందరి, మున్నగు పాత్రలను మలచి చూపుటలో రచయిత్రి ప్రదర్శించిన నేర్పు, ప్రతిభ శ్లాఘనీయమైనది.

శిల్ప సౌందర్యవిలసితమగు రీతిలో కథను మలచి నవలలు వ్రాయుటయందును, వానికి తగిన పేర్లు పెట్టుటయందును కడు శ్రద్ధవహించు రచయిత్రి శ్రీమతి సి. ఆనందారామం. ఆమె వ్రాసిన "ఏది సత్యం - ఏదసత్యం" అను నవల ఆ సత్యమును ధ్రువపరచును. మారుచున్న నేటి కాల పరిస్థితిని, సామాజిక వ్యవస్థను గుర్తించలేక ఊహాలోకములో విహరించి ఆకాశ హర్మ్యములను నిర్మించుకొని యదార్థ పరిస్థితులను గుర్తించలేక కన్న కలలు, కల్లలై పరిణమించినప్పుడు కలుగు పరితాపములో, ఆవేదనలో ఏది

సత్యమో ? ఏది అసత్యమో గుర్తించలేక కుమిలి, కుళ్ళి పోయిన "కళ్యాణి, మాళి" అను ప్రేమైక జీవుల జీవితము లను వారి హృదయ పరితాపములను భిన్నకోణములనుండి పరికీలించి, వివరించిన నవలయే ఇది. సంప్రదాయబద్ధమైన వివాహవ్యవస్థయందలి పవిత్రతను, ఆదర్శ నారీధర్మమును నిరూపించి చూపుటకు "కళ్యాణి" పాత్రను ప్రతీకగాచేసి రచయిత్రి కథను నడిపిన విధము అత్యంత శ్లాఘనీయము. ఆదర్శము పేరున 'మాళి' తనను తాను వంచించుకొనుటయే గాక, ప్రేమించి వివాహమాడిన భార్యనుగూడ వంచించిన దూరదృష్టిలేని అసమర్థుడు - అవివేకి. విభిన్న ప్రవృత్తుల కలయికయైన ఈ జంటకు సంబంధించిన కథను, అతి వాస్తవ దృక్పథముతో, మానసిక శాస్త్రానుశీలనముతో, ప్రయోగాత్మకముగా రచయిత్రి నవలను చిత్రించి కృతకృత్యు రాలైనది. ఆమె మరొక నవల "నిశ్శబ్ద సంగీతం". దీనిలో కుసుమ జీవితము ద్వారా రచయిత్రి "స్త్రీ" సమాజమును ధిక్కరించుటవలన సంభవించు అనర్థములను వివరించినది. మాధవరావు, జానకి, సరళల మధ్య నడచిన ప్రేమాను బంధమును రచయిత్రి చతురతతో చూపినది. పై రెండు నవలలలోను రచయిత్రి ప్రేమకన్న సంప్రదాయబద్ధమైన వివాహమే ముఖ్యమైనదని నిరూపించినది. ఆమె ఇంకొక నవల "ఆత్మబలి". దీనిలో ఆమె "శోభ - ఉమ" అను అక్కా, చెల్లెండ్ల భిన్నధోరణిలో నడచిన విచిత్ర ప్రవృత్తు

లను ప్రయోగాత్మకముగా రచించినది. నేటి సమాజమును గురించి ఆమె చేసిన ఈ వ్యాఖ్యానము ఆమెకుగల భావ తీవ్రతను తెలుపుటయేగాక తెలుఁగునవలా సాహిత్య చరిత్రలో ఒక మణిపూసయై అనుగదుగున ఆలోచనలను రేకెత్తించును. చూడుడు - "ఏంటీ సమాజం? పోలేక, పోలేక పోయే పాతకాలపు ఆచార్యాచారాల గ్రీష్మ కాపానికి, రాలేక, రాలేక అతి మెల్లగా వచ్చే సంస్కారయుత సభ్య సమాజానికీ నడుమ, అందంగా, ఆకర్షణీయంగా ఆశలూ, భయాలూ కలబోసుకొని విరిసిన ఈ సంధ్యాకాగంలో విజ్ఞానములవరించుకొని, సంస్కారం సంతరించుకొని, పరిపూర్ణ వ్యక్తిత్వాన్ని పొంది దాని విలువలను గుర్తించిన స్త్రీ ఎంత కాలమీ అయోమయంలో తడుముకు లాడాలి" అని.

కథా కథనములో చెప్పుకొనదగిన విశేషముగాని, పాత్రల మనస్తత్వమును వ్యక్తపరచుటలో నేర్పుగాని అంతగా లేకపోయినను, ఉత్సాహముతో రచనలు చేయుచున్న రచయిత్రి శ్రీమతి ఉన్నవ విజయలక్ష్మి. ఆమె రచించిన "అర్ధాంగి" నవలలో డాక్టర్ హరీష్, మంజుల, శంకరం, పద్మావతి, జానకి మున్నగు వారికి సంబధించిన కథ నిక్షిప్తము చేయబడినది. మంజుల, పద్మావతి పాత్రలు కొంతవరకు వాస్తవమునకు సన్నిహితముగా నున్నవి. పద్మావతి, జానకి ఇరువురిలో పద్మావతి తన ప్రవర్తనద్వారా నిజమైన అర్ధాంగిగా రుజువుచేసికొనినది. ఆమె మరొక

నవల "నిరీక్షణ". తల్లిచాటున పెరిగి పెద్దైన రాధ అత్త యింటిలో యెట్టి సుఖమునకు నోచుకొనకయే, భర్తను పోగొట్టుకొని పుట్టింటికి చేరి అక్కడ గూడ అన్న ప్రకాశము తోను, వదిన కామాక్షితోను, తమ్ముడు ఆంజనేయులతోను, నానా ఇక్కట్లపాలై, ఆమె పైలుకిందపడి ఆత్మహత్య చేసి కొనుటకు సిద్ధపడినప్పుడు వేణుగోపాలరావు అను వ్యక్తిచేత హఠాత్తుగా రక్షింపబడి, చివరకు అతనినే వివాహమాడినది. ఒక రచయిత్రి తనతోటి స్త్రీపట్ల చూపునట్టి సానుభూతి, దయ, ప్రేమ లొంతవరకు దీనిలో గోచరించును. ఈ నవలా ద్వ్యయము లో జ్ఞాపకముచుకొనగల సంఘటనలేవియు అంతగా లేవు.

ఆంధ్రప్రభ వారపత్రికలో వెలువడిన "అడవి మల్లెలు" నవలతో శ్రీమతి వాసిరెడ్డి సీతాదేవి పలుపురి దృష్టి నాకర్షించి, "సమత" నవల రచనతో రచయిత్రిగ స్థిరపడినది. పొందికలేని జీవిత విధానములో "సమత" కొరకై అర్రులు చాచిన ప్రయోజనముండదని, పరస్పర అవగాహన, ఆలోచనాశక్తి కలిగివున్నయెడల సమత అన్నిట సిద్ధించగలదని, దర్పముతో, అహంకారముతో, మిడిమిడి జ్ఞానముతో అందరిని తూలనాడినయెడల, అవమానములకు గురియై, అపహాస్యములపాలై, అపనిందలతో దుఃఖభూయిష్టమైన జీవితమును గడపవలసివచ్చునను సత్యమును రచయిత్రి ఈనవలలో అరుంధతి పాత్ర ముఖమున చాటినది. అరుంధతి

యొక్క స్వేచ్ఛావృత్తి, విశృంఖలత్వము అమె కీల వినా శనమునకు హేతువై చివరకు అమెను ఈ భౌతిక ప్రపంచము నుండి వేరగునట్లు చేసినది. అమెలో ప్రవేశించిన అవధులు లేని అధికారవాంఛ మహోత్తమురాలైన అత్త శాంతమ్మ నుండి వేరగునట్లు చేసినది. యోగ్యుడైన తన భర్త సీతాపతి ప్రేమను కాదని, వెర్రి వ్యామోహముతో రాజా రావును చేపట్టి తన సర్వస్వమును గోలుపోయినది. ఈ నవ లలో శాంతమ్మ పాత్ర ఆదర్శనీయమైన ఒక జీవన స్రవంతి. శ్రీమతి సీతాదేవి రచించిన "మట్టిబొమ్మలు" అను మరొక నవల ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితమైనది. దీనిలో గ్రామీణ జీవితము, పట్టుదలలు, పంతములు, మమతాభి మానములు, స్పర్ధలు సహజముగ వివరింపబడినవి. ధనికు డైన బలరామయ్య తండ్రి భద్రయ్యవద్ద, వెంకయ్య పాలేరై పనిచేసి కొంత భూమిని సంపాదించెను. అతని కొడుకు సాంబయ్య మట్టి మనిషి. అతని కొడుకు వెంకటపతి జడుడు. లౌకిక ప్రవర్తనగల కనకయ్య సాంబయ్యకు మంత్రి. నమ్మిన బంటు. భూస్వామియైన బలరామయ్య తన కుమార్తె వధూధినిని వెంకటపతికిచ్చి వివాహముచేసెను. ఆమె గొప్ప సౌందర్యవతి. రామనాథమను వేరొక యువకుని ప్రేమించి యథేచ్ఛగా తిరిగి చివరకు దిక్కుమాలిన చావు చచ్చినది. వెంకటపతి తాగుబోతై తన యావదాస్తిని గోలుపోయి, తన కొడుకు 'రవి'ని తన తండ్రివద్దకు పంపెను. రవి గొప్ప

విప్లవకారుడు. తొలి, మనుమల మధ్య నడచిన సంభాషణలు సముచితముగా నున్నవి. సన్నివేశ కల్పనము. సంభాషణా చాతుర్యము, కథనకుశలతగల రచయిత్రిగా శ్రీమతి సీతా దేవికి ఉజ్వల భవిష్యత్తు గలదు.

చక్కని భావస్ఫూర్తితో, స్త్రీ సమస్యల అవగాహనతో నవలలు వ్రాయుచున్న రచయిత్రి శ్రీమతి కొలిపాక రమాదేవి. ఈమె రచించిన "ఏటి వొడ్డున నీటిపూలు" నవలకు ఆంధ్రప్రభ వారపత్రిక కీలక సంవత్సర నవలల పోటీలో ద్వితీయ బహుమతి లభించినది. చారుమతి, పద్మ, శ్రీదేవి బాల్య స్నేహితురాండ్రు. వారి స్నేహానుబంధములు వయస్సులో దినదినాభివృద్ధినందినను, అవి పై వాహిక జీవితములో మూడు మారములై చీలిపోయినవి. పేదరు గుమస్తాయైన తండ్రి సూర్యారావు దేహయాత్ర చాలించుటతో విద్యావతియైన చారుమతి ఉపాధ్యాయినియై తండ్రి గౌరవ ప్రతిష్ఠలు, కుటుంబ మర్యాదలు చెడకుండగ గంపంత సంసారమును నెత్తిన వేసికొని తన అనుజన్ముల నందరిని పైకి తీసికొనివచ్చుటకై అడుగడుగడుగున ఆమె ఎదుర్కొనిన చిక్కులను, చేసిన త్యాగములను రచయిత్రి దీనిలో సమర్థతతో చిత్రించినది. ఇక పద్మకు మాధవరావుతో వివాహము జరిగినను, అతడు తల్లి కాంతమ్మచేతిలో ఆటబొమ్మయై ప్రవర్తించి, అందాలబరణియైన పద్మను ఆదరించలేక అసమర్థతతో ప్రవర్తించగా, దుఃఖముతో, హృదయవేదనతో

అమె పుట్టిన ఇంటికి చేరుకొనినది. శ్రీదేవికి హనుమంత రావుతో వివాహము జరిగి, వారి జీవితము మూడు పూవులు ఆరు కాయలై వర్ధిల్లినది.

స్త్రీ సహజమైన వాంఛలు చారుమతిని ఎడతెగక వెంటాడినను ఏమార్పులేనిది తన జీవితమేనని ఆమె నిరాశ, నిస్పృహలతో తనచుట్టు అనుక్షణము జరుగుచున్న మార్పులను చూచి క్రుంగిపోయినను, తన త్యాగములతో పాఠకుల సానుభూతిని చూరగొనగలిగినది. ఆమె జీవితపు ప్రతి మలుపులోను కథ రసవత్తరముగా నడచినది. ఆమె తన జీవితములో కొంత మార్పు రాగలదన్న ఆశతో తనకన్న పెద్దవాడైన "భగవతి" శావను వివాహమాడుటకు అంగీకరించుటతో కథ విచిత్రముగా ముగిసినది. స్త్రీలకు పురుషుల ఆలంబనము అవసరమన్న సత్యమును, రచయిత్రి వయస్సు ముదిరిన వారైన రామారావుతో భానుమతికి, భగవతి భావతో చారుమతికి, శంకరముతో పద్మకు వివాహములు జరిపి నిరూపించినది.

నాణెమువకున్న బొమ్మ - బొరుసులో, బొమ్మను చూచి ఆనందించుటకు ప్రతి వ్యక్తి ప్రియత్నించును. అటులనే, ఈ జీవితమునకు సంబంధించిన వెలుఁగు నీడలలో వెలుఁగునేగోరి దానికొఱకు పరుగిడుదురు. ఇది లోక సహజము. మానవ సహజము. ఈ చిత్తవృత్తి ననుసంధించియే మన రచయితలు, రచయిత్రులు తమ రచనలు చేసియుండిరి.

శ్రీమతి గంటి (శిఖా) వెంకటరమణ అందరివలెగాక, తద్భిన్నముగా తన నవలలలో జీవితములో సంభవించు సుఖములను గాక కష్టములను, వెలుఁగును గాక చీకటిని ప్రదర్శించి చూపుటకు పూనుకొని తన ప్రయత్నములో చాలవరకు కృతకృత్యురాలైనది. ఆమె "మొగిలిపొదలు" నవలయందు ఈ విషయము ప్రతిపాదితమైనది. ఈ నవలలోని గోపాలము జీవితము, దెబ్బను అశ్రయించి దాని చుట్టు పరిభ్రమించినది. శ్రీనివాస్, సరస్వతి అను ఇరువురు పిల్లలను వదలి అతని మొదటి భార్య లోకయాత్ర ముగించినది. అతడు సుభద్ర అను మరొక యువతిని ద్వితీయ భార్యగా స్వీకరించి తానును తెరనుండి నిష్క్రమించెను. భర్త మరణానంతరము సుభద్ర యథేచ్ఛగా విహరించినది. గోపాలం కూతురు సరస్వతి హృయవ్యాధికి గురియై కన్నుమూసినది. కొడుకు శ్రీనివాస్ రాజేశ్వరి అను అమ్మాయిని వివాహమాడినను, ఆమె అతనిని వదలి వేరొకని ప్రేమలో చిక్కుకొనినది. దుష్ట ప్రవర్తనకు నిలయమైన ఆ కుటుంబపు స్థితిగతులను, చెప్పుకొనఁదగు, పుట్టకొనఁదగునై ప్రవర్తించిన తీరును ఇందులో రచయిత్రి నేర్పుతో మనముందుంచినది. ఈ కోవకు చెందినదే. ఆమె మరొక నవల "ప్రగతిమధ్య మనిషి". శ్రీమతి వేంకటరమణ నవలా రచయిత్రిగా మంచిపేరు తెచ్చుకొనుచున్న వర్ధమాన రచయిత్రి. ఆమె నవలలు తెలుఁగునవలా వికాస చరిత్రలో మరొక గోణమును స్పృశించుచున్న విశిష్టమైనవి.

సామాజిక స్థితిగతులను ఆధారము చేసికొని ఆసక్తికరమైన సాంఘిక నవలలు వ్రాయగల బహుకొద్దిమందిలో శ్రీమతి ఐ. వి. యస్. అచ్యుతవల్లి ఒకరు. ఆమె తన "గొడిగట్టిన దీపాలు" అన్న నవలలోని వ్యక్తులు, తోటి వ్యక్తుల మనస్సును గ్రహించలేక ప్రవర్తించుటవలన కలిగిన అనర్థములను, చిక్కు సమస్యలను చిత్రించినది. ఇందలి కొన్ని పాత్రలు పరిస్థితులకు అనుగుణ్యముగా నడచుకొని గమ్యమును చేరుకొనగా, మరికొన్ని పాత్రలు కొడిగట్టిన దీపాలై, కాంతి విహీనమై మిగిలిపోయినవి. సంగీత సాహిత్య ములపట్ల ఆసక్తిగల విశ్వనాథమునకు పల్లెటూరి అమ్మాయి యైన దేవకి భార్యయైనది. అందచందములను చూచి ఆనందించలేని అయోగ్యుడైన మహేశమునకు యశోద పెండ్లామై నరకయాతనలు అనుభవించినది. వర్ణవిభేదములను పాటించక ప్రేమకు ప్రాధాన్యతనిచ్చి మంగళను వివాహమాడి, సర్వసుఖములను చూరగొనిన ధీరుడు చలపతి. కులమునకు తక్కువైనను, గుణములలో మిన్నయైన నారాయణ బాల వితంతువైన రమణ హృదయమును చూరగొనజాలకపోవుట నవలకు పెద్దలోటు. ఈ నవలలోని చలపతి - మంగళల జీవితముల వైన ఎట్టి కొడిగట్టక కాంతివంతమై ప్రకాశించినవి. నారాయణ, రమణలకు వివాహము జరిపి, కథను సుఖాంతము చేసినచో బాగుగానుండెడిది. ఆమె మరొక నవల "ఇదెక్కడి న్యాయం". తండ్రిని గోలుపోయిన మాలతి అను

అమ్మాయి ఉద్యోగముచేసి తన తోబుట్టువులను పైకి తీసి కొనివచ్చుటకై పడిన శ్రమను, ఆమె తన వివాహానంతరము గూడ వారి అభివృద్ధికై కట్టుకున్న భర్త రామనాథమును, కన్నపిల్లలైన గిరిజ, రేవతి అను వారిని సైతము విడిచిపెట్టి పుట్టింటికి చేరినది. ఎవరి అభివృద్ధికొరకై మాలతి అహరహము కృషిచేసినదో, వారే చివరకు తనను అవహేళన చేసినప్పుడు మిక్కిలి ఖేదపడినది. ఈ నవలలో మధ్యతరగతి కుటుంబముల కష్టసుఖములు చక్కగా ప్రతిబింబించుచున్నవి.

స్త్రీ పాత్రలకిచ్చినంత ప్రాముఖ్యతను, ప్రాధాన్యతను పురుషపాత్రలకివ్వకపోయినను, కథా కథనములో మంచి ఉద్యోగముతోపాటు, లోతైన భావములలో నిండిన వైవిధ్యవిలసితమైన నవలలు వ్రాయు సమర్థతగల రచయిత్రి పరిమళా సోమేశ్వర్. ఆమె "సుగంధి" నవలలో నిండైన భావ పరిపక్వత, కథాకథన దక్షత వ్యక్తమగును. సుగంధి బాల్యమునుండి తన భవిష్యజ్జీవిత భాగస్వామినిగూరించి కనిన కలలు ఫలించక, ఒక అతి సామాన్యుడు తనకు భర్తగా లభించుటతో కలలకు, యదార్థజీవితమునకుగల అంతరమును తెలిసికొనగలిగినది. ఐనను తన కలల సమ్మోహములను విడిచిపెట్టలేక చికాకుతో ప్రవర్తించి, చివరకు తన అన్న తదినెలు, స్నేహితురాండ్రు, వారి భర్తలమధ్య చెలరేగిన ఘర్షణలను, అంతరంగిక కల్లోలములను చూచి ఆమె తన హృదయమును విశాలపరచుకొని పరిస్థితులను అదుపులోనికి తెచ్చుకొని

చక్కగ ప్రవర్తించుటకు నిశ్చయించుకొనునంతలో భర్త మోహన్ కేన్సర్ వ్యాధితో కన్నుమూసెను. ఆమె సౌఖ్య రహితమైన ప్రేమ దుఃఖాంతమై అట్లే నిలచిపోయినది. ఈ నవలలో పురుషపాత్రలైన మోహన్, కృష్ణమూర్తి, స్త్రీ పాత్రల ఛాయలై ప్రవర్తించిరేగాని, పరిపూర్ణ వ్యక్తిత్వము గలవారై మనజాలరైరి. ఈ రచయిత్రి "తప్పటడుగులు" నవలలోని డాక్టర్ రవీంద్ర, "నర్తకి" నవలలోని కృష్ణకాంత్ స్త్రీ భూమికలైన మెహరున్నీసా, సుజాతల వ్యక్తిత్వము ముందు లొంచైచ్చి ప్రవర్తించినవారే.

శ్రీమతి మాదిరెడ్డి సులోచన వ్రాసిన "సంధ్య" నవలకు నవలాలక్షణములు అంతగా ఒదగకపోయినను వెండితెర నవలనుపోలియున్నదనవచ్చును. నాయికయైన సంధ్యాదేవి తన విధ్యుక్త ధర్మములను చక్కగా నిర్వహించు సికండరీగ్రేడు ఉపాధ్యాయిని. తోటి ఉపాధ్యాయుల అసూయా ద్వేషములకు గురియైనను చలించక సైన్సుశాస్త్ర ఉపాధ్యాయుడైన శ్రీరామ్ సహాయముతో బి.ఏ; పరీక్షకు చదువుచున్నప్పుడు ఆ ఇరువురి హృదయములు యేకమైనవి. అవివాహితయైన సంధ్యాదేవి వద్ద పెరుగుచున్న 'రవి' అను అనాథ బాలుడు శ్రీరామ్ ప్రేమకు, గతములో ప్రకాశ్ ప్రేమకు వలెనే కొంత అటంకమైనప్పుడు అధైర్యపడక తన గత చరిత్రకు సంబంధించిన విషయములుగల 'వ్రాత ప్రతిని' అతనికిచ్చినది. అది పఠించిన పిమ్మట అతని హృదయ

ములో నాటుకొనిన అనురాగము దూరమైపోయి ఆమెను ఏదుకొండలవాని సన్నిధిలో వివాహమాడును. ఈ నవల అంతయు ఫ్లాష్‌బేక్‌లో నడచినది.

శ్రీమతి తురగా జానకీరాణి "వేయబోవని తలుపు" నవలలో ఆలోచనలను రేకెత్తించగల కొన్ని సన్నివేశములున్నవి. కమల ప్రవర్తన నింద్యమైనదైనను ఆమెపట్ల పఠితలకు సానుభూతి కలుగును. కామాక్షి, రాధలు వరుసకు అక్కా చెల్లెండ్రైనను, పెండ్లి సంబంధము విషయములో ఒకరినొకరు అపార్థము చేసికొని ప్రవర్తించినను, చివరకు ఆ ఇద్దరు అసలు సమస్యను అర్థముచేకొని ఒకటైపోయిరి. నవలలో స్వభావసిద్ధమైన వాస్తవిక చిత్రణమున్నది. కామాక్షిలో స్త్రీసహజమైన ఆవేశము, అసూయ మున్నగు గుణములున్నను నిండైన హృదయముతో సమస్యలను అర్థముచేసికొని ఆదరించగల గొప్ప హృదయమున్నది కనుకనే ఆమె ప్రప్రథమమున తన సవతితల్లి కమల, తండ్రి గతించిన చాలకాలమునకు దారితప్పి పరివర్తించి గర్భవతియై కుమారునిగని, ఇహలోకయాత్ర చాలించినను, అనాథగా బ్రతకవలసిన ఆ పిల్లవానిని నిండు హృదయముతో ఆదరించినది. ఈ నవలలో చక్కని మనస్తత్వ చిత్రణము ఉన్నది. కామాక్షి హృదయమున్న యువతి. గ్రామీణ, పట్టణ వాతావరణములు రెంటికి సంబంధించిన ఆర్థిక, రాజకీయ, సామాజిక స్థితిగతులు చక్కగా చిత్రింపబడినవి. అందరు చదవదగిన నవల.

శ్రీమతి డొక్కా కమలాశంకర్‌రావు చాల కాలము నుండి ఆంగ్ల, ఉర్దూ భాషలలో రచనలు చేయుచున్న రచయిత్రి. తెలుఁగులోను వీరు లోగడ కొన్ని కథలు వ్రాసిన ను "పాలనురుగుల్లో పంచదార" నవలలో కథా కథనములో గాని, పన్నివేశ కల్పనములోగాని, పాత్ర చిత్రణములోగాని గమనించతగిన ప్రత్యేకత కనుపించుటలేదు. ఇద్దరు స్నేహితురాండ్రైన యువతులు ఒక అందమైన అబ్బాయిని ప్రేమించగా, అందులో ఒకరి ప్రేమ ఫలవంతమై వివాహానునకు దారితీయగా, మరొకరి ప్రేమ విఫలమై చివాట్లతో ముగిసినది. నూత్తదనములేని మామూలు ప్రేమ కథ ఇది. సరియైన వాక్య నిర్మాణముగూడ లేక పేలవమైన భాషలో నడచినది. చేయితిరిగిన ఈ రచయిత్రి పాల నురుగుల్లో పంచదారను సమ్మిశ్రితముచేసి మరికొన్ని మంచి నవలలను వ్రాయ ప్రయత్నించి కృతకృత్యురాలు కాగలదని ఆశించుదము.

శ్రీమతి హజారా వ్రాసిన "జీవన మాధురి" నవల రచయిత్రి ప్రథమ ప్రయత్నము. భావమైన ఆమెకు తగినంత అధికారము లేకపోయినను కథను కొంతవరకు సంపూర్ణంగా వివరించగలిగినది. సుశీల, శారద యిరువురు బాల్య స్నేహితురాండ్రు. ఆ ఇరువురు మాతృవిహీనలై సవతి తల్లులవలన బాధలుపడినవారే. సుశీల తన అన్న రామం పెంట మద్రాసుకుపోయి అతని సహాయముతో బి. ఏ; పరీక్షలో ఉత్తీర్ణురాలై తనకాళ్ళపైన తాను నిలబడిన ధీరురాలు. ఇక శాంత

లోగడ భారతి అను అమ్మాయిని ప్రేమించి, ఆమె మరణించుటతో మనోవ్యాధికి లోనై కాలము వెళ్ళబుచ్చుచున్న శేఖర్ అను వానిని వివాహమాడి, కొంతకాలము భర్త విరాదరణకు గురియై చివరకు తన మంచితనముతో, ఓపికతో, సచ్ఛీలముతో భర్త హృదయమును చూరగొని జీవన మాధుర్యమును సంపూర్ణముగా అనుభవించగలిగిన వివేకవతి. ఆ బాల్య స్నేహితురాండ్రిరువురు తమకు సంభవించిన కష్టములను, ధైర్యముతో యెదుర్కొని జీవిత మాధుర్యమును చవి చూచిరి. కష్టసహిష్ణుతయునది యెట్టి అవాంతరములనైనను అధిగమింపజేయునను నీతిని రచయిత్రి ఈ నవలలో చక్కగా వివరించినది.

శ్రీమతి రేవనూరి శమంత మధ్యతరగతి కుటుంబముల జీవనసరళిని, అందలి ఒడుదుడుకులను గ్రహించి, రచనలు చేయుచున్న రచయిత్రి. "రత్నకంబళి" నవలలో ఆమె బలరామయ్య అను వ్యక్తి కుటుంబ పరిస్థితిని వివరించినది. ఆయనకు ముగ్గురు పిల్లలు. చదువు ఆబ్బని రఘు మాతా మహుల అస్తికి వారసుడై కన్ను, మిన్ను గానక సర్వ దుర్గుణములను అలవరచుకొని, స్నేహలత అను వేశ్య వలలో చిక్కుకొని సర్వస్వమును గోలుపోయి హంతకుడై చివరకు జైలు శిక్షను సైతము అనుభవించిన అభాగ్యుడు. రెండవ వాడైన ఆనంద్ తండ్రి ఆర్థిక దుస్థితిని గ్రహించి రాఘవ రెడ్డి సహాయముతో డాక్టరు పరీక్షలో ఉత్తీర్ణుడై స్వార్థ

చింతనగల జగన్నాధరావు కూతురు, మనోరమను వివాహ
మాడి కలసివచ్చిన అదృష్టముతో వ్యవహరించిన వ్యక్తి.
బలరామయ్య తన ఆర్థిక ఇబ్బందులలో కూతురు కమలను
రెండవ పెండ్లివానికిచ్చి వివాహముచేయగా, కృష్ణ అను పిల్ల
వాడు జన్మించిన పిమ్మట అతడు ఇహలోకయాత్ర చాలించు
టతో ఆమె ధైర్యమును గోలుపోక తన కుమారుని విద్యా
వంతునిగా నొనరించుటకై పెక్కు శ్రమలుపడి, పరపంచల
నాశ్రయించినది. కృష్ణ పెద్దవాడై, తన తల్లి పద్మనాభము
ఆశ్రయముతో బ్రతుకుచుండుటవలన చెలరేగిన అపవాదుకు
విచారపడి, తల్లితో ఆవిషయమును ముఖాముఖిగా చెప్ప
లేక ఒక ఉత్తరమును వ్రాసెను. ఆత్మాభిమానముగల
కమల ఆవేదనతో కుమిలిపోయి, ఆత్మహత్య చేసికొనినది.
నవల అంతటిలోను ప్రముఖముగా అందరికిని కనుపించునది
కమల. ఆమె హృదయవిదారకమైన చరిత్ర పఠితల మనస్సు
లలో నిలచిపోవునట్టిది. రాఘవరెడ్డి సేవాభావముతో, ఆర్ద్ర
హృదయముతో బలరామయ్య కుటుంబమును పెక్కు చిక్కు
సమస్యలలో ఆదుకొనిన త్యాగి. స్నేహలత వేశ్య. సంగీత,
సాహిత్య నృత్యకళలలో మంచి అభినివేశము కలిగివుండి తన
అపురూప సౌందర్యముతో, వాక్చమత్కృతితో డబ్బు చేసి
కొనిన నెరజాణ. బలరామయ్య ఆర్థిక దుస్థితి ఇదు చక్కగా
వివరింపబడినది. ఈ నవలలో ఎత్తుగడ, ముగింపు రెండును
చక్కని సమన్వయముతో కుదిరినవి.

శ్రీమతి కె. రాధాదేవి "శిధిల సౌధం" నవల వివాహ వ్యవస్థకు, వ్యక్తి ధర్మాకు మధ్య ఉత్పన్నమైన సంఘర్షణను వివరించి, వ్యక్తులపట్ల సానుభూతిని చూపుటకు ప్రయత్నించి, ఆ ప్రయత్నములో విఫలమైనది. శశి, వేణుకు మధ్యగల అను బంధము లైంగిక వాంఛాతీతమైన పవిత్రతలో నిండినది. తన తండ్రి శశిని, భానుమూర్తికిచ్చి వివాహము చేసినప్పుడు యెమో చెప్పక అంగీకరించినది. ఆపిమ్మట ఆమె వెనుకటి వలె వేణుతో వ్యవహరించుటకు భర్త, అంటే వివాహ వ్యవస్థ అడ్డుచుని భావించి, ఆ అడ్డును తొలగించుకొనుటకు యెట్టి ప్రయత్నము చేయకయే భర్తను నిందించినది. ఈ నవలలో మాధవి మరొక యువతి. ఈమె నరేంద్రబాబుకు ప్రేమించినది. అతడు ఆమెవద్దకువచ్చి వివాహమాడవలసిన దని బలవంతముగా తిరస్కరించినది. శశి, మాధవి తమ తమ ఆలో చనలకు, ఆదర్శములకు తగినట్లు కార్యసాధన కుపక్రమించక తమలో తామే మధనపడి తమ పండువంటి నిండైన జీవిత ములను పాడుచేసికొని తాము నిర్మించుకొనిన ఊహా సౌధ ములు తమ కన్నులనుండే శిధిల సౌధములై, కళావిహీన ములై పోవుచున్నప్పుడు దర్శకులై ప్రవర్తించిరేగాని, కర్తవ్య పథమును అన్వేషింపజాలరైరి. దీనికి పరిచయవాక్యములలో శ్రీ సంజీవదేవ్ అన్నట్లు "హృదయానుభూతి, ఆవేదన" రెండును ఇందులో ఇమిడివున్నవి.

'నవనాగరికభావాల ప్రభావం చిత్రించే' నవల

శ్రీమతి రేవనూరి సువర్ణ రచించిన "అచలం - చంచలం" అని, ఆ నవల ప్రచురణకర్తలు వెలిబుచ్చిన అభిప్రాయము కొంత అతిశయోక్తితో కూడినదని పఠితలకు బోధపడును. దీనిలో చెప్పుకొనతగిన నూతనత్వముగాని, నవనాగరిక భావ ముల ప్రభావముగాని గోచరించుటలేదు. కథలో సెక్సునకు అధిక ప్రాధాన్యముండుటచే, రచయిత్రికి ఇంకను సరియైన భావ పరిపక్వత, లోకానుభవము సిద్ధించినట్లు తోచదు. పద్మ, రాధ అను అక్కా చెల్లెళ్ళ ప్రేమగాథలకు సంబంధించిన ఈ కథలో, రాధ తన అక్క భర్త మాధవరావుతో స్వేచ్ఛగా తిరిగి గర్భవతియై, తనకు కాబోవు భర్త స్థితి మంతుడైన కృష్ణకాంత్‌కు ద్రోహము చేయలేక హుస్సేన్ సాగరులో ఆత్మహత్య చేసికొనినది. కృష్ణకాంత్ రాధ పైనగల వ్యామోహముతో వివాహము మాని ఆజన్మాంతము బ్రహ్మచారిగా గడిపెను- అతి సామాన్యమైన కథ ఇది.

శ్రీమతి వేదుల కళుంతల "శారద రాత్రులు" నవలలో అసహజత కొంత కనుపించినను చివరంట చదివించగల రచన. చాలకాలము పిమ్మట జన్మించిన శంకరముపట్ల అన్నదమ్ములకు అనాదరణ కలుగవచ్చునేమోగాని, తల్లిదండ్రులకు ప్రేమలేదనుట లోకసహజము కాదేమో! తల్లిదండ్రుల మరణానంతరము శంకరమును అతని సోదరులు సరిగా చూడకపోవుటవలన ప్రబుకుదెరువుకై ఇంటినుండి బయటపడి, లలితక్క ఇంటికి చేరి, శారదను ప్రేమించి వివాహమాడెను.

ఇందలి కథా వస్తువు స్వల్పమైనదైనను రచయిత్రి నేర్పులో నవలను మలచిన విధము మాత్రము మెచ్చుకొన తగినది.

కీ॥ శే॥ బుచ్చిబాబు ధర్మపత్ని శివరాజు సుబ్బలక్ష్మి భర్త సహచర్యముతో చక్కని లో కా ను భ వ ము ను గడించుకొని చెక్కు కథలు వ్రాసి, ఆయన మరణానంతరము "అదృష్టరేఖ" అన్న నవలను వ్రాసినది. ఇది ఆమె ప్రథమ ప్రయత్నము. నవలయందంతటను ఆవిషయము స్పష్టముగా కనుపించుచున్నది. దీనిలో ఆమె కొంతకాలమునుండి ఆంధ్ర దేశములో మాధ్యతరగతి ప్రజలు యెదుర్కొనుచున్న వైవాహిక సంబంధమైన చిక్కులను, అనాదీయమైన ఆచార వ్యవహారముల వలన ఉత్పన్నమగుచున్న సమస్యలను చిత్రించినది. గుర్తుంచుకొనదగిన విశేషములేవియు లేని నవల ఇది.

"ప్రేమ గుడ్డి" దను సార్వజనీనమైన నానుడిని శ్రీమతి పొలకంపల్లి శాంతాదేవి "పూజా సుమం" అను నవలలో ఆచరణాత్మకముగ ప్రతిపాదించినది. అంజన సంపన్న కుటుంబములో జన్మించిన విద్యావతి. ఆమె కృష్ణ తనను ప్రేమించుచున్నది, లేనిది తెలిసికొనకయే గాఢముగా ప్రేమించినది. తండ్రికి ఆమె ప్రేమ నచ్చక, వాడి పేరెత్తినయెడల కాల్చి చంపివేయుదునని బెదిరించి, నీలకాంత్‌తో ఆమెకు పెండ్లి చేసెను. శోభనమునాటి రాత్రియే అంజన భర్తతో తన పాత ప్రేమనుగురించి తెలిపినది. విశాల హృదయుడైన నీలకాంత్ అంజనితో ఒకే ఇంటిలో కలసిమెలసి యున్నను

యెట్టి బహీనతలకు కావివ్వక ఆమె ప్రియుని అన్వేషించి, తీసికొనివచ్చి వారిద్దరికి వివాహముచేయ నిశ్చయించెను. పిరికివాడు, అసమర్థుడైన కృష్ణ, నీలకాంత్ కంట పడకుండగ తిరుగుచున్నను, ఒకనాడు హఠాత్తుగా అతనికి కనుపించెను. నీలకాంత్ అంజన ప్రేమనుగురించి చెప్పినప్పుడు "నీ భార్యను నేనేంచేసుకుంటాను?" అని ప్రశ్నించెను. నీలకాంత్ సంకోచ పడక అంజన ప్రేమను వివరించి, కొంత డబ్బుగూడ ఇత్తు నని ఆశజూపుటవలన వివాహమునకు అంగీకరించెను. ఇది తెలిసికొనిన అంజన మనస్సు కోపముతో, ద్వేషముతో నిండిపోయి, తన సౌఖ్యము కొరకు నానా పాట్లు పడుచున్న నీలకాంత్ పట్ల ఆమెకు గాఢమైన అనురాగమేర్పడినను, అప్పటికే పరిస్థితులు చేయిదాటిపోవుటతో, తన హృదయ ములో కృష్ణపట్ల స్థిరపడిన వ్యతిరేక భావమును అతనితో చెప్పుకొనలేక కుమిలిపోయినది. దానితో ఆమె జీవితము విషా దాంతమై ముగిసినది. చదువు, సంస్కారము, గౌరవ మర్యా దలు లోపించిన కృష్ణను, గుడ్డిగా ప్రేమించిన అంజనకు విశాలహృదయుడైన నీలకాంత్ భర్తగా లభించుట మిక్కిలి అదృష్టము. అతని ప్రేమను వదిలించుకొనజాలక పోవుట ఆమె దౌర్భాగ్యము. చక్కని భావలో రచన చిక్కగా సాగినది.

శ్రీమతి ఎ. శ్యామలాదాణి రచించిన "హరిణి" నవల చక్కని గాడిలో నడచినది. బాల్యముననే మాతృ విహీన యైన హరిణి, తన తల్లిపై నగల అనుమానముతో తండ్రి బల

సాహాయుడై అనాదరణచేయగా, తనలోని కోరికలను చంపు కొని జీవచ్ఛవమై కాలము వెళ్ళబుచ్చుచున్నప్పుడు, ఆ కన్న తండ్రియే మరల తీరని కార్యముతో కురూపియైన గణపతిని భర్తగా కట్టబెట్టినప్పుడు మౌనముగా అంగీకరించిన పవిత్ర హృదయ. ఆమె అత్తవారింటిలోను అవే కష్టములు అనుభవించినది. వదిన రోహిణి, హరిణి హృదయములో అణిగి యున్న నిగూఢ శక్తిని వెలికి తీసి, చైతన్యవంత మొనరించి ఆత్మహత్యనుండి కాపాడినది. ఆమె వెలిగించిన జ్ఞాన జ్యోతితో హరిణి తనను తాను సంభాళించుకొని, కన్న కూతురు రేఖ తనవలె అన్యాయములకు, అక్రమములకు గురి కాకుండునట్లు తీర్చిదిద్దుకొనినది. రచయిత్రి కథా నిర్వహణ మును చక్కని మెలకువతో కొనసాగించినది. హరిణి, రోహిణి పాత్రల చిత్రణము ఉదాత్త గాంభీర్య విలసితముగ కనుపించును.

వైవాహిక వ్యవస్థకు ప్రాధాన్యమునిచ్చి కుమారి నందుల సుశీలాదేవి "సరళీస్వరాలు" అను నవలను రచించినది. యువతీ యువకులు ప్రేమించి పెండ్లిచేసికొనుట, కొన్ని అవాంఛనీయమైన పరిస్థితులు ఏర్పడుటతో అవి విచ్ఛిత్తి యగుట మరల వారు కలసికొనుట - దానితో ఏర్పడిన చిక్కు సమస్యలు, అవి పరిష్కరించులోపల మరికొన్ని సమస్యలతో పతిత హృదయ తంత్రులను స్పందించునట్లుచేసి రచయిత్రి కథను వివరించినది. ప్రేమించిన వ్యక్తిని పెండ్లిచేసికొనలేని

మాధురి, ప్రేమించిన వ్యక్తినిచేరి సుఖముగా సంసారయాత్ర సాగించలేని పద్మజ, ప్రేమించిన వ్యక్తిని వివాహమాడి, పిల్లల తల్లియై ఆర్థిక ఇబ్బందులతో బాధపడిన విజయ, తన వ్యక్తిత్వమును గౌరవించగల సమర్థునికోరకు నిరంతరము అన్వేషణ సలిపి, అపజయముల మధ్య అనుమానములతో అలమటించిపోయిన శారద మున్నగువారి విభిన్న జీవిత సమస్యలను రచయిత్రి మన ముందుంచినది. ఈ నవలలోని పాత్రలు స్పష్టముగా వైకి చెప్పుకొనుటకు వీలులేని తమ హృదయగత వేదనలను, మూగ బాధలను తామే భరించి, అలజడితో, అశాంతితో కాలమును వెళ్ళదీసిరి. వారి దయనీయ పరిస్థితులపట్ల పాఠకులకి సానుభూతి జనించునట్లు రచన సాగినది.

శ్రీమతి బీనాదేవి వ్రాసిన "పుణ్యభూమీ కళ్ళు తెరు!" అను నవల, తెలుఁగుదనమును ప్రతిబింబించు మానసిక విశ్లేషణాత్మకమైన రచన. నవలలోని ప్రధాన భూమికలైన 'సింహాచలం, రాజమ్మ' దంపతులిరువురు శ్రమజీవులు. తమ మనుగడకొరకు, జీవితముతో హోరాహోరీగా పోరుసలిపి, ఉన్న కాస్త ఆస్తిని గోలుపోయి, అక్కడ నిలువలేక, ఏదిక్కూ తోచక, చివరకు పుట్టిన ఊరు వదలి పట్టణము చేరుకొని అక్కడకూడ విధిచేత వంచితులైన వారి కష్టాల కడలియే ఈ రచన. జబ్బునపడ్డ తల్లి మందులకొరకు, ఆమె మరణానంతరము చేయవలసిన కర్మలకొరకు ఉన్న ఆస్తి నంతటిని

పోగొట్టుకొని కోర్టులపాలై చివరకు ఇక్కడికి చేరిన సింహాచలం రిక్షా నడిపి, రాజమ్మ కలవారి ఇండ్లలో పనిపాటలు చేసి జీవించుచున్నప్పుడు, గోరుచుట్టుపై రోకలిపోటన్నట్లు ఒక ఎన్నికల పోట్లాటలో సింహాచలం కాలువిరిగి మూలన పడగా, రాజమ్మ తమ జీవిక కొరకు పడరానిపాట్లుపడి చెక్కు అవమానములకు గురియై, చివరకు ఒక దొరను హత్య చేసిన దన్న నేరముపైన జైలుశిక్ష అనుభవించుచు, అక్కడ కన్న కొడుకు కొరకు అమె పడిన క్షోభ ప్రతి వ్యక్తిని కదలించి వేయగలదు. కాల్చివేయగలదు – కన్న కొడుకును, అవిటి భర్తను కుక్కలను తరిమినట్లు ఆ ఊరినుండి స్వార్థపరులు తరిమిరన్న వార్త విన్న ఆ ఇల్లాలి హృదయములో నిండుకొని పోయిన బాధను ఎవరు వర్ణించగలరు? 'డబ్బే' సర్వస్వముగా భావించి, అది ఉన్నవారికే అన్ని సౌకర్యములు సమకూరు చున్న ఈరోజులలో రాజమ్మ వంటి దౌర్భాగ్యుల నుగురించి యోచించుటకు తీరిక యెవరికున్నది? అయినను ఆశావాది, దూరదృష్టి, మానవతాదృష్టిగల రచయిత్రి నవల ముగింపులో అన్న ఈ మాటలలో ఈనాటి వ్యవస్థ యేనాటికైనను మారక తప్పదన్న ఆశాభావము, ఆశా జ్యోతియై మనముందు నిలచివుండును. చూడుడు – "ఈదేశం ఏ కొత్త దేముడు వచ్చినా గుండె విప్పి అంచులో ప్రతిష్ఠ చేసింది. ఏ కొత్త మతంవచ్చినా చేతులుచాచి ఆహ్వానించింది. కాబట్టి కొత్త సిద్ధాంతాన్ని ఆమోదిస్తుంది" అని. ఉత్తమస్థాయినందుకొనిన నవల ఇది.

"విధివంచితులు" నవలలో డి. కామేశ్వరి అందని ఆదర్శములను చిత్రించుటకై అభూత కల్పనలను కొన్నింటిని చేసినను, పఠితలకు ఆసక్తికరముగ కథను వివరించిన పద్ధతి ప్రశంస నీయమైనది. పైకి వివరించి చెప్పుటకు వీలుపడని మానసిక సంఘర్షణలతో ఉక్కిరి బిక్కిరియైపోయిన సుజాత, పార్వతి అను వారిరువురు విధికి ఎదురు తిరిగి, కాని తాకిళ్ళను తట్టుకొనలేక కృంగుమార్గాన, అపహాస్యముల పాలైపోయిరి. ఆ ఇరువురిలో ఒకామె ఆత్మహత్యకు పాల్పడగా, మరొకామె చైతన్యవిహీనురాలై లోకములో మిగిలిపోయినది. పార్వతి, సుజాత చేయూతతో ఉన్నత విద్యావతియైనను, ఆమెలో సంస్కారము, సభ్యత లోపించుటతో కన్నుగానక పరివర్తించి కట్టుకొన్న భర్త ప్రకాశమునకు దూరమై పెక్కు ఇడుములకు గురియైనది. ఇక సుజాత సున్నితమైన మనస్తత్వము కలదగుటవలన పరిస్థితులను అవగాహన చేసికొనలేక, ఎదురుతాకిళ్ళను తట్టుకొనలేక మోహభువలె మిగిలిపోయినది. ప్రకాశము, అభిమానము, ఆవేశము గలవాడైనను, దూర దృష్టి లోపించినవ్యక్తి. అతడు పార్వతిని కాదని మరొక వివాహము చేసికొనినను, రెండవ భార్యతోను జీవనమాధుర్యము చవిచూడలేకపోయెను. ప్రకాశంపట్ల రచయిత్రికి ఎక్కువ సానుభూతి వున్నట్లు కనుపించదు - చదవతగిన నవల.

సరళమైన భాషలో క్రొత్త భావములను హృదయంగమముగ చొప్పించుచు రచనలు చేయగల సమర్థురాలు

శ్రీమతి పిల్లలమర్రి వేదవతి. వివాహమనునది సంఘములో ఒక వర్గమువారు తమ ప్రభుకుదెరువునకై స్వార్థబుద్ధితో యేర్పరచిన వ్యవస్థయని భావించి, దానిని తోసిరాజన గలందులకై హేమ, సరళ అను అధునాతన నాగరిక యువతులిరువురు తమ ఇండ్లనుండి పారిపోయి, అనుక్షణము తమ మనుగడకై వారు ఎదుర్కొనిన చిక్కులను రచయిత్రి "విధివిధానం" అను నవలలో వ్యక్తపరచినది. ఆ ఇరువురు జీవితములో తాము నమ్మిన వ్యక్తుల వలనను, సంఘము వలనను, గడించిన అనుభవములతో, యెదుట తాకెళ్ళతో ఆ వ్యవస్థయొక్క పవిత్రతను, ఆవశ్యకతను గ్రహించగలిగిరి. ఇది ఒక ప్రయోగాత్మకమైన చక్కని నవల.

చెప్పుకొనదగిన విశేషము కథలో మ్రుగ్యమైనను ఒక చిన్న ఇతివృత్తమును ఆధారముచేసి శ్రీమతి గోళ్ళమూడి లలిత "పాప నవ్వింది" అను నవలను నేవళముగా వ్రాసినది. దానిలో పట్టభద్రురాలైన కమల ఒక శ్రీమంతుని ఇంటిలో తల్లి చనిపోయి, తండ్రి విదేశములలో ఉన్నప్పుడు మాధురి అను చిన్నపిల్ల పెంపకపు బాధ్యతను స్వీకరించి, అచిరకాల మునకే ఆ పిల్ల నాయనమ్మ రాజేశ్వరీదేవి మనస్సును చూరగొని, ఆ ఇంటిలో తాను ఒక్కతియై జీవితము గడుపు చున్నప్పుడు ఆ పిల్ల తండ్రి శ్రీపతి విదేశములనుండి తిరిగి వచ్చి, అతడు లోగడ తన భార్యవలన దెబ్బతినివ్యక్తి యగుటవలన ఇంటిలో స్వేచ్ఛగా ప్రవర్తించుచున్న కమలను

నమ్మక ఆమెను అనుమానముతో చూడదొడగెను. తన పట్ల ఇంటి యజమాని ప్రవర్తన సరిగా లేనందున కమల ఆ ఇల్లు వదలి వెళ్ళిపోయినది. మాధురి, కమల కానరానందున దిగులుతో మంచము పట్టినది. కమల సత్ప్రవర్తనను, సచ్ఛీలమును తెలిసికొనిన శ్రీపతి మరల ఆమెను ఆహ్వానించెను. తిరిగివచ్చిన కమల పట్ల శ్రీపతికి క్రమముగా అభిమానమేర్పడి, ఆమెను తన జీవిత భాగస్వామినిగా స్వీకరించుటతో కథ సుఖాంతమై ముగిసినది.

అస్తి, అంతస్తులు, కులమతములు, మనిషికి, మనిషికి అడ్డు తెరలై నిలచి ప్రగతిని నిరోధించుచున్న విధమును వివరించి, అవి రూపుమాసినచో సమాజము పొందగల వికాసమును, ప్రగతిని, వివరించి మంచి లోతైన ఆలోచనలు మేధస్సులో చెలరేగునట్లు కథను నడిపించగల సమర్థురాలు శ్రీమతి కె. వసుంధరాదేవి. ఆధునిక నాగరికతవలన సంభవించు అనర్థములను, అనూహ్యమైన కొన్ని విచిత్ర పరిణామములను, పరిశీలనా దృక్పథముతో రచయిత్రి తన రచనలలో పొందుపరచినది. 'మతము మనస్సులకు అడ్డుపడి స్త్రీ పురుషుల ఆదర్శ ప్రేమలను మార్చజాల' దన్న సత్యమును "ఆదర్శాలు-అనుబంధాలు" నవలలోను; "పవిత్ర ప్రేమకు" కులము అడ్డుపడదన్న విషయమును "రాగోదయం" నవలలోను రచయిత్రి హృదయంగమముగా వివరించినది.

చదువరుల మనస్సును, హృదయమును కదిలించి,

కథిగించగల నవల యలమంచిలి ఝాన్సీలక్ష్మి వ్రాసిన "గాజు బొమ్మ". హిమబిందువు హృదయ విదారకమైన విషాద గాథయే ఈ నవల. ఆమె తన బావ వేణుగోపాలును మన సిచ్చి ప్రేమించి వివాహమాడినది. అకస్మాత్తుగా అతడు తన దేహయాత్ర చాలించుటతో, అతని పవిత్ర ప్రేమకు చిహ్నముగా తన "డైరీ" ని మిగిలించిపోయెను. విషాద భరితమైన వియోగ దుఃఖముతో కుమిలి, కుళ్ళిపోవుచున్న హిమబిందువు జీవితములో శ్యామసుందర్ అను యువకుడు ప్రవేశించి, ఆమెను గాఢముగా ప్రేమించి తన తల్లిదండ్రులను, ఆమె తల్లిదండ్రులను ఒప్పించి వీడుకొండలవాని సన్నిధిలో ఆమెను వివాహమాడినను, ఆమె హృదయ సామ్రాజ్యము పైన చోటును సంపాదించుటకు అతడు చేసిన విఫల యత్నములను రచయిత్రి నేర్పుగా నవలలో వివరించినది. శ్యామసుందర్ ప్రేమావేశములో ఆమె శరీరమును వశపరచుకొనగలిగినను, హృదయమును తనదిగా చేసికొనజాలక విఫల మనోరథుడై పర్యవసించిన తీరును రచయిత్రి చక్కగా వివరించినది. కరుణ రసము జాలువారునట్లు కథను చిత్రించి, ప్రతి మలుపులోను కొత్తదనమును గనబరచి, నవలను సాగించినతీరు ముదావహమైనది. పాత్రల మానసిక చిత్రణలో రచయిత్రి కడు శ్రద్ధవహించి అందరి మెప్పులను ఆమె పొందగలిగినది. ఈ నవలకు 1978 వ. సం. ఆంధ్ర ప్రభ వారపత్రిక ఉగాది నవలల పోటీలో ద్వితీయ బహుమతి

లభించినది. ఈ రచయిత్రి మంచి నవల "రాగమయి". రాగమయియైన "భానుమతి" పాత్ర చిత్రణలో రచయిత్రి కనబరచిన శ్రద్ధ ప్రశంసా పాత్రమైనది.

శ్రీమతి కావిలిపాటి విజయలక్ష్మి వ్రాసిన "విధి విన్యాసాలు" నవల ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రికలో ప్రచురితమైనప్పుడే పలువురి మెప్పుల నందుకొని, అది "తాజ్‌మహల్" పేరుతో సినిమారూపమున వెలువడి యెందరి దృష్టినో ఆకర్షించినది. ఆమె మరియొక నవల "అపశ్రుతులు". దీనిలో ఉత్తమ దంపతులైన శ్రీనివాసరావు, రమ ఒకరి స్వభావము మరియొకరికి సరిపడక విడిపోయిరి. రమ తన కన్నకూతురు రాధను తన స్నేహితురాలికి అప్పగించి జీవితమునుండి విముక్తి పొందినది. రాధ పెరిగి పెద్దదైన పిమ్మట రామకృష్ణ అనువానిని ప్రేమించి వివాహమాడినను అతడు తన మేనత్తకొడుకని తెలియదు. రామకృష్ణ ఉన్నత విద్యకై విదేశములకు వెళ్ళెను. రాధను ఆదరించిన పుణ్యదంపతులు కన్నుమూయుటవలన, వారి కుమారుడైన విశ్వనాధన్ తాను నడుపుచున్న హోటలులో దిగిన శ్రీని వాసరావునకు, రాధను తార్చుటకు ప్రయత్నించెను. కాని శ్రీనివాసరావునకు ఆమె కథ వినిన పిమ్మట పుత్రికా వాత్సల్యమేర్పడి, ఆమెను తన ఇంటికి తీసికొనిపోయి తనవద్దనే ఉంచుకొనెను. అక్కడ సుఖముగా ఆమె కాలము వెళ్లబుచ్చుచున్నప్పుడు రామకృష్ణ అక్కడికి తిరిగివచ్చి రాధ తన

భార్య అని వెల్లడించుటతో కథ సుఖాంతమైనది.

"లలిత" నవలలో శ్రీమతి జయలక్ష్మి "లలిత, సుధాకర్" దంపతుల కథను ఆలంబనముచేసి, కుటుంబ జీవితములలో సంభవించు కలతలను, సుఖదుఃఖములను మిక్కిలి జాగరూకతతో వివరించినది. సుధాకర్ ఇద్దరు పిల్లలు పుట్టిన పిమ్మట వేసెక్టమీ చేయించుకొనుట, ఆ పిమ్మట భార్యా వియోగము సంభవించుటతో, వేసెక్టమీనిగురించి యెవరికి తెలుపకయే లలితను మరల వివాహమాడెను. ఆ పిమ్మట అతడు పెక్కు దుర్వ్యసనములకు లోనై, ఆర్థిక ఇబ్బందులతో బాధపడుచున్నప్పుడు, విద్యావతియైన లలిత గూడ ఉద్యోగముచేసి భర్తకు తోడ్పడుచుండగా ఆమె గర్భవతియైనది. ఈసందర్భములో సుధాకర్ అక్కా, పిల్లలెళ్లు, లలితను నానా మాటలు అని అవమానపరచిరి. దానితో ఆమె తన స్నేహితురాలైన విమల ఇంటికి పోయి కాలము గడప దొడగినది. విమల నేర్పుగా సుధాకర్‌ను పిలచి, వేసెక్టమీ కొన్ని సందర్భములలో సరిగా పనిచేయదని డాక్టర్లే అంగీకరించినట్లు తెలిపి, లలిత శీలవతియని నచ్చచెప్పి, ఆ ఇద్దరిని ఏకముచేసినది. లలిత పాత్ర చిత్రణములో రచయిత్రి కన బరచిన శ్రద్ధ, సుధాకర్ పాత్ర విషయములో చూపలేదు. ఆ పాత్రకు నవలలో ఉండవలసిన నిండుదనము లేదు. ఈ రచయిత్రి మరికొంత శ్రద్ధతో వ్యక్తులను నిశితముగా పరిశీలన చేసి రచనలు చేసినచో ఆమెకు మంచి భవిష్యత్తుగలదని

చెప్పవచ్చును. "కుటుంబ నియంత్రణ" వలన కలుగు లాభ నష్టములు, అనర్థములు రచయిత్రి నేర్పుతో ఈ నవలలో చిత్రించినది.

శ్రీమతి యస్. రమాదేవి వ్రాసిన "తల్లీ బిడ్డలు" నవల మానవ మానసిక పరివృత్తులను చిత్రించునట్టి చక్కని రచన. కన్నతల్లి దుర్వ్యవహర్తనను ప్రత్యక్షముగా చూచిన అన్నా, చెల్లెలు యొక్క చిత్ర విచిత్ర మనోభావములను, వారి జీవితములో కారసిల్లిన విభిన్న సంఘటనలను కన్నులకు కట్టు కట్లు ఇది వ్యక్తపరచును. చివరకు రచయిత్రి ఎన్ని లోపము లున్నను మాతృ ప్రేమను మించినది వేరొకటి లేదను నిత్య సత్యమును ఇందులో చక్కగా ధృవపరచినది. శేషగిరి పాత్ర చిత్రణలో అమిత కనబరచిన నేర్పు ప్రశంసనీయమైనది.

కుమారి పండా శేషంతకమణి "వసంతరాజీయం" నవలలో ప్రాచీన అలంకారిక సంబంధమైన అష్ట విధ నాయికా లక్షణములను ఆధునిక సమాజమునకు సరిపడునట్లు 'వసంత' అను యువతికి అన్వయించుచు వ్రాసినది. రాజేశ్వరము నాయకుడు. వివాహానంతరము ఆషాఢమాస ప్రవేశ ముతో ఆ నూతన దంపతులు విడిపోయిరి. వసంత గర్భవతియై మాతృమూర్తి యగునంతవరకు జరిగిన ఈ కథలో ఎనిమిది ప్రకరణములకు క్రమముగా స్వాధీన పతిక, అభిసారిక, మున్నగు నామములనే యుంచి ప్రతి స్త్రీయందును అవస్థా భేదములతో అంతర్నిగూఢమై అణగియున్న ఈ లక్షణము

లను చమత్కారముగా, రసము చిప్పిలునట్లు రచయిత్రి వివరించినది. ప్రాచీన, అర్వాచీన సాహిత్యముల రెంటికి పొంతన చేకూర్చు నవల వంటి నవల ఇది. "వసంతరాజీయ" మను నొక ప్రాచీన కావ్యము ఈ రచనకు తనను ప్రోత్సహించినట్లు రచయిత్రి తెలుపుకొనినది. అష్టవిధ నాయికా లక్షణములను ఒకే నాయికలో చొప్పించి చూపుట ఒక నూతన ప్రయోగము. 1972 తరుణ మాసపత్రికలో ఇది ప్రచురితము.

వంగ రచయితలు ప్రారంభించిన గొలుసుకట్టు రచనా పద్ధతి ననుసరించి శ్రీయుతులు పురాణం, గొల్లపూడి, కొమ్మూరి ఈ మువ్వురు "ఇడియట్" నవలను వ్రాసిరి. అట్లే రచయితలును ప్రయోగాత్మకముగా కొన్ని నవలలు వ్రాసిరి. నవలను కొన్ని ఖండములుగా విభజించి, ప్రతి ఖండమునకు ఒక శీర్షికనుంచి "సప్తపది" నవలను శ్రీమతులు ఇల్లెందుల సరస్వతీదేవి, మాలతీచందూర్, దుర్గాకుమారి, కె. రామలక్ష్మి, మున్నగు విదుషీమణులు పూరించినను అది వారి ప్రతిభకు తగినట్లులేదు. ఇట్టిదే మరొక నవల "అపరాజిత". దీనిని శ్రీమతులు సి. ఆనందారామం, తురగా జానకీరాణి, వాసిరెడ్డి సీతాదేవి, నాయని కృష్ణకుమారి సంయుక్తముగా రచియించిరి. ఈ నవల మాధవి, శ్యామల, రాధ, రాజారావు మున్నగువారి ప్రేమ కలాపములతో ప్రణయలేఖలతో, ఉపన్యాస పరంపరలతో అతుకుల బొంతగా తయారైనది. "షణ్ముఖప్రియ" వేరొక నవల. దీనిని

శ్రీమతులు సరళాదేవి, ఉమా దేవి, రంగనాయకమ్మ, సులోచనాకాణి, అచ్యుతవల్లి, వాచస్పతి మున్నగు రచయిత్రులు రచియించిరి. ఈ నవలలో కథా నాయికయైన 'దేవసేన' విద్యావతి, ధనవంతురాలు. ఆమె జీవితముతో సంబంధమున్న వివిధ వ్యక్తుల మనస్తత్వములను ప్రదర్శించుటలో ఈ రచయిత్రులు చూపిన నేర్పు, కథను నడుపులలో గనబరచిన శ్రద్ధ ప్రశంసనీయమైనది.

తెలుఁగు నవలా వికాస సాహిత్య చరిత్రకెక్కదగిన పై రచయిత్రుల రచనలతోపాటు అన్నివిధముల పరిపోలగల ఈ క్రింది రచయిత్రుల రచనలను నామమాత్రముగా స్మరించి విడిచి పెట్టితిని - శ్రీమతులు వీరపనేని పరోజనీదేవి "చక్ర భ్రమణం"; రోములాదేవి "ఆరాధన", పుట్టవర్తి తులజ "ధీరసమీరే"; సుమతి "కుంతల"; మనుపల్లె సరోజనీదేవి "బహుకుటుంబి"; కె. సువర్చలాదేవి "అఖరి మజిలి"; ఎ. రాధారాణి "అన్వేషి"; శ్యామలా జయరామిరెడ్డి "వాసన లేని పూలు"; చెరుకూరి రమాదేవి "బాంధవ్య బంధితులు"; పవని నిర్మల ప్రభావతి "మనుషులు - మమతలు"; నాయని కృష్ణకుమారి "గాతమి"; కొత్త లక్ష్మీరఘురాం "ధన్య జీవులు"; డి. పద్మాలాకుమారి "తెగినతీగెలు", జి. సుందర రమ్మ "సుడిగాలి"; ఎన్. రుక్మిణీరాణి "మంచిగోరే మనసు", కుమారి. పద్మకుమారి "మకో మలుపు"; కుమారి. పద్మావతి "మహోదయం"; మున్నగునవి.

తెలుఁగు నవలాభారతికి – నేపథ్యభూమికలై వెలుగొందిన అనువాద, అనుసరణములు– 3

ఆది కవి నన్నయ నాటి నుండి నేటివరకు తెలుఁగు వాఙ్మయమున వివిధ సాహిత్య ప్రక్రియలలో యేదియో ఒక రూపమున అనువాదములు, అనుసరణములు జరుగుచు, మన సాహిత్యసంపద దిన దిన ప్రవర్ధమానమగుచున్న విషయము సర్వ విదితమేగదా !. కుంఫినీ పాలనము దేశమున స్థిరపడిన పిమ్మట మన సాహిత్యక్షేత్ర పరిధి విశాలతమమై విశ్వ సాహిత్య క్షేత్రములో మనకు సన్నిహిత సంబంధమేర్పడి, అయా దేశ సాహిత్యములలో నిత్య నూతనముగా సంభవించు చున్న మార్పులతో అవినాభావ సంబంధమేర్పడి, అయా సాహిత్య ఛాయలలో మన సాహిత్యము సుసంపన్నమగుచు వచ్చినది. ప్రధానముగా మన తెలుఁగు నవల ప్రపంచ సాహిత్యముతో సన్నిహితత్వమును యేర్పరచుకొని, అయా సాహిత్యముల ప్రభావముతో రూపురేఖలు దిద్దుకొనుచు నవ్య వసంతారామమై వర్ధిల్లుచున్నది. ఇరువదియవ శతా బ్దారంభమునుండి తదితర సాహిత్య ప్రక్రియల వికాసమునకు తోడ్పడినట్లే. స్వాతంత్ర్యము లభించిన పిమ్మట ఈ నవలా సాహిత్యప్రక్రియలో అనువాద భారతికి విశేషముగా తోడ్పడినది "ఆంధ్రపతికాధిపత్య" మేనని చెప్పినచో అది అత్యుక్తి యెంతమాత్రము కాజాలదు. "అది ఒక మహోజ్వల మహా యుగం – వల్లకాటి అధ్వాన్న శకం; వెల్లివిరిసిన విజ్ఞానం – బ్రహ్మజెముడులా అజ్ఞానం; ఆశాకుసుమాలు పుష్పించిన ఆ

మధుర వసంతం ... నై రా శ్య పు చలి గుబుళ్ళు యీ చు కున్న శిశిరాస్యం; సర్వసంపత్సమృద్ధి - సర్వతోముఖక్షామం; సూత్మంగా చెప్పాలంటే - నేటి పరిస్థితికి నకలుగా వుంది నాటి పరిస్థితి_" అట్టి విషాదభూయిష్టమైన విషమ పరిస్థితిని కన్నులకు కట్టునట్లు చిత్రించుచు ఆంగ్ల నవలా ప్రపంచ నిర్మాతయైన శ్రీ చార్లెస్ డికెన్సు వ్రాసిన "టేల్స్ ఆఫ్ టూసిటీస్" అను నవలను "రెండు మహానగరాలు" అన్న పేరుతో శ్రీ తెన్నేటి సూరి చేసిన అనువాదము ఆంధ్ర పత్రికలో ధారావాహికముగా ప్రచురితమై, తెలుఁగు ప్రజల ఆదరాభిమానములను చూరగొన్నినది. లండన్, పారిస్ నగరముల రెండింటిని ఏకముచేసి సాగిన ప్రణయ బలిదాన గాథయే ఈ నవల. ప్రసిద్ధ ఫ్రెంచి నవలాకారుడైన అలెగ్జాండర్ డ్యూమా రచించిన "క్వాంట్ ఆఫ్ మాంట్ క్రిస్టో" నవలను, శ్రీ సూరంపూడి సీతారాం ఆంధ్ర పత్రిక వారపత్రికలో సరళమైన వాడుక భాషలో మహా ప్రతిభావంతముగా వ్రాసి ప్రకటించెను. మరొక విశ్వ విఖ్యాత ఫ్రెంచి వలా రచయిత శ్రీ విక్టర్ హ్యూగో రచించిన "నాటర్ డాం" నవలను, "ఘంటారావం" అన్న పేరుతో శ్రీ తెన్నేటి సూరి చేసిన అనువాదము అందరి దృష్టిని ఆకర్షించిన మంచి నవల. శ్రీ సెరివాన్ టెడ్ వ్రాసిన "డాన్ క్విక్ సేట్" నవలను శ్రీ విశ్వాత్మల నరసింహమూర్తి రమ్యమైన వాడుక భాషలో అనువదించెను. డాన్ క్విక్ సేట్

సలిపిన విచిత్ర దండయాత్రలు కడుపుబ్బ నవ్వించి ఒక విచిత్ర లోకమును సృష్టించినవి. ఈనవలలన్నియు ఆంధ్రగ్రంథమాల పత్రికమున పుస్తకరూపమున పునర్ముద్రితములైనవి. విశ్వ విఖ్యాత రష్యన్ నవలా రచయితలైన శ్రీ లియో టాల్ స్టాయి రచనలన్నియు దాదాపు తెలుఁగులోనికి అనువదింప బడినవి. ఆయన రచనలలో ప్రథమశ్రేణి రచనగా పేర్కొన బడిన "ఆనాకెరినినా" నవలను ఆంధ్ర విశారద శ్రీ తాపీ ధర్మారావు అనువదించెను. ఈ అనువాదము మూలమునకు వన్నె తెచ్చునట్టిది. ఆయన మరొక విశ్వవిఖ్యాత నవల "వార్ అండ్ పీస్" అనునది. దీనిని "సమరము-శాంతి" అన్న పేరులో శ్రీ రెంటాల గోపాలకృష్ణ, శ్రీ బెల్లంకొండ రామదాసులు అనువదించిరి. ఈ అనువాదము సరళ సుందరమై నడచినది. "ఇవాన్ ఇలీయచ్ మృతి" అన్న టాల్ స్టాయి మరొక నవలను శ్రీ పి. గణపతిశాస్త్రి భారతి మాస పత్రికలో ప్రకటించెను. ఈ చిన్న నవల టాల్ స్టాయి రచనా ప్రతిభను చక్కగా ద్యోతకముచేయుచున్నది. శ్రీ రోమారోలా వంటి విఖ్యాత నవలా రచయిత మన్ననలను పొందిన రచన ఇది. "పాశ్చాత్య ధనికవర్గ ప్రజల జీవితములను ఇది ప్రతిబింబించు" చున్నది. దీని అనువాదములో శ్రీ గణపతి శాస్త్రి గనబరచిన శ్రద్ధ ప్రశంసనీయమైనది. భారతిలో ప్రచురితమైన మరొక ఉత్తమ నవల ఆల్ఫాంజీ డాడె వ్రాసిన "శాఫో". దీనిని శ్రీ వి. డి. ప్రసాదరావు సజీవమైన తెలుఁగు

భాషలో అనువదించెను. ఈనవలలో పాత్రపోషణము, సంభాషణలు చక్కగా సాగినవి. ఇది అనువాదమైనను స్వతంత్ర రచనవలె హాయిగా సాగిపోయినది. విశ్వవిఖ్యాత రష్యన్ రచయిత శ్రీ టూర్జినీవ్ (Fathers and Sons) నవలను తెలుఁగులోనికి "తండ్రిలూ-కొడుకులు" అన్న పేరుతో ఇరువురు అనువాదములు చేసిరి. ఆ రెంటిలో శ్రీ పాలగుమ్మి పద్మరాజు మూలమును ననుసరించి అనువాదము చేసెను. ఇది చక్కని తెలుఁగు నుడికారపు సొంపుతో నడచి, ఆంధ్ర వారపత్రికలో ధారావాహికముగా వెలువడినది. మరియొక రష్యన్ రచయిత శ్రీ ఎల్మర్ గ్రీన్ వ్రాసిన "దక్షిణ పవనం" నవలను శ్రీ మహీధర జగన్మోహనరావు తెలుఁగు చేసెను. ఇది స్టాలిన్ ఆహ్వానము మీద నందుకొనిన నవల. దీనిలో ఫిన్లేండు దేశమునకు సంబంధించిన ప్రజల జీవిత విధానము నిబంధింపబడినది. రష్యాకు, ఫిన్లేండునకు జరిగిన పోరాటములో భూస్వాముల కబంధ హస్తములనుండి సామాన్య ప్రజలకు విముక్తి లభించి, వారు ప్రశాంత జీవనము నెరపుటలో కథ సమాప్తమైనది.

శ్రీ చఖోవ్‌స్కీ వ్రాసిన "ది లైట్ ఆఫ్-ఎ-డిస్టెంట్ స్టార్" నవలను ప్రముఖ పత్రికా రచయిత శ్రీ కొంటాల గోపాలకృష్ణ "ప్రేమజ్యోతి" అన్న పేరుతో చేసిన అనువాదము మిక్కిలి రమణీయమైనది. ఇది పేరుకు ప్రేమజ్యోతి యైనను చూచుటలు ప్రేమకథ కాక, యదార్థరీతిలో నడ

చిన అమలిన శృంగార గాథ. మధురాతి మధురమైన సజీవ స్రవంతి. ఈ నవలయందలి 'జవ్యలోవ్" పాత్ర పట్ల పాఠకుల హృదయమును కలచి వేసి, మానసను మరొక లోకములో విహరించునట్లు చేయుగలదు. ఈ నవలలో రష్యా ప్రజల జీవితము, సమాజ పరిస్థితులు, చిత్ర విచిత్రమైన వారి మనస్తత్వములు వర్ణింపబడినవి. ఏదో ఒక దినపత్రికలో "ఓల్గా" చిత్రపటమునుచూచి "జవ్యలోవ్" అమె పట్ల తన అనురాగమును పెంచుకొని, ఆమె అన్వేషణములో నిరంతరము పరితపించి, తన జీవిత మాధుర్యమును మరచిపోయి ప్రవర్తించిన తీరు, ఆ పై మైక జీవిపడ్డ అవేదన, ఆందోళన, రచయిత ఈ నవలలో ఉదాత్తరీతిలో చిత్రించెను. శ్రీ రెంటాల గోపాలకృష్ణ రచనలోని మూలతత్వమును జీర్ణించుకొని దీనిని అనువాదమువలెగాక, ఒక స్వతంత్ర రచనవలె కథను కొనసాగించెను. ప్రతివారు అవశ్యము చదవదగిన నవల ఇది.

ప్రముఖ అమెరికన్ నవలా రచయిత్రి శ్రీమతి విల్లా శేతర్ వ్రాసిన నవలను "పేమగాథ" అన్నపేరుతో శ్రీ ఎన్.ఆర్. చందూర్ అనువదించెను. రచయిత్రి ముఖ్యముగా రోమన్ కేథలిక్ మత ప్రభావముతో ఈ నవలను వ్రాసినది. సౌత్ వెస్ట్ ప్రాంతమునందు మత ప్రచారముచేయుచు జీవించు చున్న ఒక క్రైంచి మిషనరీ జీవితమును ఆమె ఈ నవలలో

చక్కగా వర్ణించినది. మరొక ప్రముఖ అమెరికన్ నవలా రచయిత శ్రీ ల్లేడిస్ హెస్టీకరోల్ వ్రాసిన "ఏడ్ ది యార్ట్‌టర్న్‌ను" కు శ్రీ చంపూకారే చేసిన వేరొక అనువాదము "మాతా - భూమాతా!" అనునది. దీనిలో రెండు విషయములు ప్రముఖముగా చిత్రింపబడినవి. ఒకటి అమెరికాలోని పల్లెవాసుల జీవిత విధానము, రెండు ఒక సంవత్సర కాలములో ఆ దేశపు వాతావరణములో ఋతుబద్ధమైన, ప్రకృతి పరమైన మార్పు. ఈ నవలయందలి ఇతివృత్తము సంవత్సరము కాలములో నుగిసినది. దీనిలో పాత్రల వ్యక్తిత్వము కన్న, ప్రకృతియొక్క మహత్తర తత్వమును నిరూపించి చూపుటలో రచయిత చూపిన నేర్పు అత్యంత ప్రయోజనకరమైనది. అమెరికాయందు పల్లెప్రజలు తమ పొలములలో, ఇండ్లలో ప్రవర్తించు పద్ధతిని రచయిత బహు చమత్కారముగా వివరించెను. మార్క్‌పా, జెన్, లిజ్ పాత్రల చిత్రణములో రచయిత కనబరచిన నేర్పు ప్రశంసనీయము. ఈ నవల కొంత వరకు అమెరికనుల నాగరికతా విశేషములను చిత్రించు దర్పణమువంటిదనవచ్చును.

జపాను దేశపు నవలాకర్త శ్రీ ఒ సా ము డా జ్ యొ వ్రాసిన నవలను "అ స్త మ యం" అన్న పేరుతో శ్రీ పర్వతనేని గంగాధరరావు చేసిన అనువాదము మిక్కిలి ప్రశస్తమైనది. ఇందులో తనవారందరిని కోలుపోయి మరల వివాహమాడుటకు అవకాశములేని యవ్వనవతియైన ఒక

వితంతువు మాతృమూర్తి కావలయునన్న ఆశతో పడ
తపన, ఆరాటము దీనిలో సమర్థవంతముగా వర్ణింపబడినది.
ఏ సంఘ వ్యవస్థ అడుగడుగున తనకు అడ్డుపడి హింసించినదో,
ఆ వ్యవస్థను కూకటి వేళ్ళతో కూలదోయవలెనన్న
ఆకాంక్షతో, ఆవేదనతో ఆమె వట్టి మూర్ఖుడైన ఒక ర చ
యితను పేమించి, అతనివలన ఒక కుమారుని కనినది. త న
బిడ్డను గురించి ప్రశ్నించినవారికి ఆమె ఇచ్చిన సమాధానము
యెంత తోత్తైనదో చూడుడు- "అ స్త మిం చే ఈ వ్యవ
స్థకు నేను గుర్తు - రాబోయే నూతన తరానికి గుర్తు నా
బిడ్డడు-" అంటుంది ఆమె భావిపైన తనకు గల ఆ శ తో.
బిగువైన నిండు రచన. హృదయమును కదిలించగల నవలా

శ్రీ లూయిస్ ఛార్లైన్ కాయర్ పేరించి నవలను శ్రీ
కె. దేశపతిరావు "మన్మథరాజ్యం" అన్న పేరుతో తెనిగిం
చెను ఉత్తమ జాతి స్త్రీ పురుష సంపర్కమువలన ఉత్తమ
వీరులు జన్మించగలరన్న ఆశతో శ్రీ హిట్లర్, వీరులైన సైని
కోద్యోగులకు బలిస్టులకు, ఆరోగ్యవంతులు నైన యువతులకు
మధ్య శారీరక సంబధమును కల్పించి వారి ద్వారా తన ఆశ
యములను నెరవేర్చుకొనుటకు చేసిన యత్నములను పృష్ఠ
భాగముచేసి, శ్రీ రాయర్ ఈ నవలను వ్రాసెను. కాని
రచయిత తన హృదయములోని ఆశయమును ఇందులో
చక్కగా నిరూపించ జాలకపోయెను. ఉత్తమప్రేమకు లైంగిక
సంబంధమొక్కటే మూలముకాదని, బలమైన ఆత్మీయత, అను

రాగము అనవసర" మని వెర్నర్, హెడ్విగ్‌ల ప్రేమోదంత ముల ద్వారా అమూల్యమైన నిత్య సత్యమును రచయిత ఈ నవలలో వెల్లడించెను. ఆంగ్ల కథక చక్రవర్తియైన శ్రీ సోమర్సెట్ మామ్ ప్రపంచ ప్రజలందరికిని సన్నిహితుడు. ఆతడున వ్రాసిన "దిరేజర్స్ హెడ్జ్స్" నవలను శ్రీ పి. యల్. బాబు "ఆసిధార" అన్న పేరుతో అనువదించెను. "లారీ" అను పాశ్చాత్య యువకుడు తన దేశములో జీవితమునకు సంబంధించిన సమగ్రమైన పరిజ్ఞానమును గ్రహించజాలక, విజ్ఞాన తృష్ణతో భారతదేశమునకు వచ్చి, ఈ పవిత్ర భూమిలో పొందిన అనుభూతి, వేదాంతపరమైన ఆత్మజ్ఞానము ఇందు చక్కగా వివరింపబడినది. అనువాదము సరళ సుందరము.

రష్యన్ రచయిత శ్రీ వ్లాడిమర్ "దుడిస్టనెఫ్" నవలను "జ్యోతిర్బిందువు" అన్న పేరుతో శ్రీ బి. వి. సింగరాచార్య చేసిన అనువాదము మూలానుసారియై చక్కని రీతిలో సాగినది. ఒక రష్యన్ విజ్ఞాన శాస్త్రవేత్త కర్తవ్య నిర్వహణములో జీవితము వెళ్ళబుచ్చుచున్నట్లు భావించి, తొందరపాటుతో ప్రవర్తించి చివరకు తాను ఏమియు చేయనట్లు గ్రహించి పశ్చాత్తాపపడిన విధమును రచయిత చక్కగా వివరించెను. ఈ నవలలో నేటి రష్యన్ జీవిత విధానముతోపాటు మానవ జాతి నాగరికతా పరిణామమునుగురించి, దాని భవిష్యత్తును గురించి చక్కని వ్యాఖ్యానములు చేయబడినవి. ఫ్రెంచి భాషలో శ్రీ అనటోల్ ఫ్రాన్సు వ్రాసిన "థాయిస్" నవ

లను, శ్రీ కెంటాల తెనిగించెను. అనువాదము ఫ్రెంచినుండి గాక, ఆంగ్లమునుండి జరిగినను, ఇది సరళముగను, ఆకర్ష వంతముగను ఉన్నది. నగర వేశ్య, నర్తకి, సౌందర్యరాసి యైన థాయిస్ నైతిక పతనమును, ఆ మె పతనమునకు హేతుభూతమైన కారణములను శ్రీ అనటోల్ ఫ్రాన్సు అద్భుతముగా మలచెను. మూల రచనయందలి సౌందర్య మును, సునిశితభావ పరంపరలను తెలుఁగువారికి అందించు టకు శ్రీ గోపాలకృష్ణ పడ్డ శ్రమ ఇందులో ఫలించినది.

శ్రీమతి మురాసఖి జపాను భాషలో వేయి సంవత్సర ములకిందట వ్రాసిన "గెంజిగాథ" నవలను డా॥ శ్రీమాన్. నండూరి రామకృష్ణమాచార్య గ్రాంథిక భాషలో పరివర్త నముచేసినను, అది ఆంధ్ర పరస్వతికి ఒక అమూల్యాలంకార మని అంగీకరించక తప్పదు. "గెంజి" రాకుమారుని శృంగార జీవితమును చిత్రించు నవలయే "గెంజిగాథ". దీనికి జపానుదేశ చరిత్ర నేపథ్యము. గెంజిగాథయందలి పాత్ర లన్నియు ఒకనాడు మహోజ్వలముగా వెలుగొందిన సజీవ మూర్తులే. ఇందు ఏదియు కల్పితముకాదు. శృంగారము ఈ నవలకు ప్రాణము. సర్వస్వమూ. చక్రవర్తి ప్రియురాలైన "కిరీట శోభ" ఏకైక పుత్రుడు "గెంజి". ఈ అపురూప సౌందర్యమూర్తి బాల్యమునసే మాతృవిహీనుడై, తండ్రి ఆదరాభిమానములతో పెరిగి పెద్దవాడై గడిపిన శృంగార జీవిత రసపేటికయే ఈ నవల. రచయిత్రియైన మురాసఖి,

కథానాయికయైన మురాసఖి ఇరువురూ ఒకరేమో యను నంత భ్రాంతి చదువరులకుకలుగును. ఇది ఒక రసఖండము.

భారతీయుఁడైన ప్రొఫిసర్ శ్రీ హుమాయూన్ కబీరు వ్రాసిన ఆంగ్ల నవలకు "నరులు - నదులు" అన్న పేరుతో శ్రీ పాలగుమ్మి పద్మరాజు చేసిన అనువాదము మెచ్చుకొన తగినది. వంగరాష్ట్రమునందలి నిరాధారులైన కొందరు ముస్లిములు పద్మావతీ నదీతీరమునకు వలసపోయి, అక్కడ బంజరు భూములను సంపాదించి శారీరక కష్టముతో చమటోడ్చి పైకి వచ్చిన విధము, ఆపిమ్మట వారిలో వారికి ఉత్పన్నమైన చిరుతగవులు, క్రమముగా అవి చిలికి చిలికి అభివృద్ధియై వారిని అధోగతికి తెచ్చిన తీరును అస్గర్ మియా, నాజూమియా, అను ఇరువురు ప్రాణస్నేహితుల కథలద్వారా రచయిత ఇందు చక్కగా వర్ణించెను. ఆపిమ్మట పద్మావతి నదికి వచ్చిన వరదలు వారి సర్వస్వమును హరించుటతో తిరిగి వారు దేశద్రిమ్మరులై వలసపోయిన విధమును చక్కగా రచయిత ఇందు చిత్రించెను.

భారతీయ ఆంగ్ల నవలా రచయితలలో అగ్రేసరుఁడైన శ్రీ ఆర్. కె. నారాయణ్ "గైడ్" నవలను "మార్గదర్శి" అన్న పేరుతో శ్రీ మల్లాది నరసింహశాస్త్రి భాషాంతరీకరణ మొనరించెను. భారతీయుల సామాజిక జీవిత విధానమును, సంస్కృతీ సభ్యతలను, నాగరికతావైభవములను, ఆచార వ్యవహారములను, పాశ్చాత్యులకు తన నవలలద్వారా విశదము

చేసి చూపిన రచయిత శ్రీ నారాయణ్. ఆయన లేఖిని ఆంగ్లములో నడచినను స్వీకరించిన ఇతివృత్తములు భారతీయాత్మను, మూల తత్వమును ప్రతిబింబింపజేయును. ఈ నవలలో "క్వేక్వో రాజు" అను ఒక సామాన్య వ్యక్తి జీవితమును, ఆ జీవితములో ముడివడిన స్థితిగతులను పరితలపు ఉత్కంఠ కలుగునట్లు రచయిత వివరించెను. ఈ రాజు తన జీవిక కొరకు ధరించిన విచిత్రమైన వేషములను చివరకు అతడు మహా విచిత్ర పరిస్థితులలో ఈ లోకమునుండి నిష్క్రమించిన తీరును ప్రతిభా సముజ్వలముగా రచయిత చిత్రించెను. ఈ నవల విశ్వసాహిత్యమునందలి పెక్కు భాషలలోనికి పరివర్తనము పొందినది. శ్రీ నరసింహా శాస్త్రి తెలుఁగు సేత గూడ మూలమునకు వన్నె తెచ్చునట్లున్నది.

పైన తెలిపిన నవలనేగాక విశ్వ విఖ్యాతి నార్జించిన ఈ క్రింది నవలలను సైతము అనువదించి మన తెలుఁగు సాహిత్యమును సుపంపన్నమొనరించిన అనువాదకులు, ప్రకాశకులు అభినందనీయులు. సర్వశ్రీ. విక్టర్ హ్యూగో "బీదల పాట్లు"; మాక్సిం గోర్కీ "భయస్తుడు" "ముగ్గురు మిత్రులు" "అమ్మ"; గైడీ మపాసా "కస్తూరి"; ఎమిలీ జోలా "కళంకం" "నానా"; జాన్ ఆస్టిన్ "అహం - అసూయ"; థోరే "నవనాగరికతకు దూరంగా" జాక్ లండన్ "ప్రకృతి పిలుపు" బెస్లామితోవో "అధికారపిపాసన"; స్లోవోమిర్ రావిక్ "దీర్ఘయాత్ర" జార్జి ఇలియట్ "అనురాగం"; ఫాంటస్ "దేశం ఏమైంది" మున్నగునవి.

విశ్వసాహిత్యసంబంధమైన అసంఖ్యాక నవలలను అనుభవజ్ఞులైన పెక్కుమంది అనువాదకులచేత భాషాంతరీకరణము చేయించి, తెలుఁగు వారికి ఆ మధుర కళా ఖండముల నందించిన విశాలాంధ్ర ప్రచురణ సంస్థ, దేశికవితా మండలివారి కృషిని ఇచ్చట స్మరించుట సముచితము.

మన అనువాదకులు విశ్వసాహిత్యమునుండి వలెనే, భారతీయ భాషలనుండియు శ్రీ వీరేశలింగం పంతులు నాటి నుండి, నేటివరకు కోకొల్లలుగా నవలలను భాషాంతరీకరణము చేసి ఆంధ్ర భారతికి అపూర్వ శోభలను సమకూర్చిరి. అది నుండియు వంగ నవలా రచయితల ప్రభావము తెలుఁగు రచయితలపైన విశేషముగా ప్రసరించియున్నట్లు లోగడనే తెలిపి యుంటిని. కనుకనే భారతీయ నవలా చక్రవర్తులనదగిన శ్రీయుతులు బంకించంద్ర, రవీంద్ర, శరత్చంద్రుల నవలల నన్నింటినో తెలుఁగులోనికి పరివర్తనము చేసికొని ఆ మధుర సౌరభంతో తనివితీర ఓలలాడిరి. అప్పటికిని వారికి సంతృప్తి కలుగక ఆ మహారచయితల పెక్కు గ్రంథములకు ప్రచురణ కర్తలు ఐదేసి, ఆరేసి అనువాదములను గూడ చేయించి ప్రచురించిరి. పై ముగ్గురి నవలలను తర్జుమాచేసి, ప్రజా హృదయములను రంజింపజేసిన వారిలో పర్వశ్రీ వేంకట పార్వతీశ్వర కవులు, స్వామి శివశంకరులు, త్రిపురారిభట్ల వీరరాఘవస్వామి, శతావధాని వేలూరి శివరామశాస్త్రి, చక్రపాణి, బొందలపాటి శివరామకృష్ణ, శకుంతలాదేవి

మున్నగువారు పేర్కొనదగిన ప్రముఖులు. ఇవిగాక మిగిలిన కొన్ని ప్రముఖ అనువాదములను ఇచ్చట వివరింతును-

విశ్వసాహిత్యమునందలి ఉత్తమశ్రేణి రచనల సరసన నిలుపదగిన నవల ఒరియా భాషలో శ్రీ గోపీనాథ మహంతి వ్రాసిన "అమృత సంతానం". బహుముఖ ప్రజ్ఞాశాలియైన శ్రీ పురిపండా అప్పలస్వామి మధురమైన వ్యావహారిక భాషలో దీనిని అనువదించెను. ఒరిస్సా రాష్ట్రమునందలి దక్షిణప్రాంతపు కొండకోనలలో నివసించు అనాగరిక 'గోదు' జాతి ప్రజల జీవన సరళిని అది చిత్రించును. ఆజాతి ప్రజలు నిత్యము పులితో పోరాడుచు, అప్పుడప్పుడు కనబడు ఫారెస్టుగార్డునకు లంచమిచ్చి అతనిని వెడల నదుపుచుందురు. ధర్తినీమాత (ధరిత్రీమాత) ధర్మ (సూర్యుడు) భీమదేవుడు (వర్షదేవత) మున్నగు దేవతలను పూజించి, తృప్తిజెందునట్టి జాతి అది. మాద్యాద, మూటనిలకడ వారి సొమ్ము. ప్రతి గ్రామమునకు ఒక సావోతా (కులపెద్ద) ఉండును. అతని మాటకు, బాటకు తిరుగు ఉండదు. నిస్పక్షపాతమైన తీర్పులనిచ్చి ప్రజా హృదయములను చూరగొనుచుండును. స్త్రీ పురుషు లిరువురు స్వేచ్ఛా ప్రవృత్తితో జీవించుటకు తగిన వీలున్నజాతి అది. శ్రీ మహంతి ఈ ప్రజలను భిన్న దృక్కోణములనుండి పరిశీలించి, పరామర్శించి, సానుభూతితో చిత్రించెను. ఈ నవలయందలి ప్రకృతి వర్ణనలు అత్యద్భుతమైనవి. నవలలో రాజు తమ్ముడు - 'గోదు'. అన్న.

రమ్ణమ అన్యాయముగా రాజ్యమును అపహరించి, అన్నను అవమానపరచినను సహించి ఓమించిన పద్ధతి ప్రశంసనీయమైనది. నవలలోని ఉ యయు, పుబులి, హాకీనా, పదుబు సావోతా, డిసోరి మున్నగు పాత్రలన్నియు సజీవ సంపన్నములైనవి. అవి మనముందు కదులుచూ, మనలను కదిలించును. మరొక ఆధునిక ఓడ్రభాషా విఖ్యాత నవలా రచయిత శ్రీ కాళిందీ చరణ పాణిగ్రాహి రచించిన "మట్టిరో మనిషి" నవలను శ్రీ పురిపండాయే "మట్టి మనిషులు" పేరున సుసంపన్నమైన వాడుక భాషలో తెనిగించి ఆంధ్రుల కందించెను. ఇది మహాత్ముని సిద్ధాంతముల ప్రతిపదికపైన రచియింపబడి, పెక్కు భాషలలోనికి పరివర్తనము చెందినది.

ప్రముఖ మళయాళ రచయిత శ్రీ తగళి శివశంకరపిళ్లై "రెండు సేర్లు" నవలను, శ్రీ గన్నవరపు సుబ్బరామయ్య తెలుఁగు చేసెను. దీనిలో కేరళ రాష్ట్రములోని కుట్టునాడు ప్రాంతపు నదీలోయలయందలి నీటిగుంటలలో వరయలు, పులియలు అను కూలి ప్రజలు చెమటోడ్చి వ్యవసాయము చేయుచుందురు. వారు శ్రీమపడి పండించిన పంటను కాంబురా'నులు అనబడు భూస్వాములు అనుభవించుచు, వారిపైన పెత్తనము చేయుచుండిరి. ఆ ప్రాంతపు భూస్వాములకు, వ్యవసాయ కూలీలకు మధ్యగల సంబంధములను ఈ నవలాకారుడు సత్య దృష్టితో ఒక చరిత్రకారునివలె వివరించెను. పతనమైపోవుచున్న భూస్వాములు తమ పాత్ర

లను కాపాడుకొనుటకై చేసిన వెరి) ఆలోచనలును, వ్యవసాయ కూలీలు తమ హక్కులను సాధించుకొనుటకు చేసిన ప్రయత్నములును ఇందు విపులముగా వివరింపబడినవి. ప్రజా ప్రభుత్వములు శాంతి పరిరక్షణ నెపముతో, వెల్లువలై విజృంభించిన ప్రజా ఉద్యమములను అణచివేయుటకు పన్నిన దుస్తంత్రములను, ఆయన ఇందులో ప్రతిభా సమన్వితముగా చిత్రించి, మిక్కిలి సానుభూతిని గనబరచి రచన చేసెను. ఇది ఆధునిక గ్రామీణ జీవితమును చిత్రించునట్టి రచన.

శ్రీ తగళి రచనా సౌరభమును విశ్వవ్యాప్తముచేసిన ప్రముఖ నవల "చెమ్మీన్". దీనిని "రొయ్యలు" అను పేరున శ్రీ గన్నవరమే అనువదించెను. ఈ అనువాదము అంత ప్రశస్తముగాలేదు. పడమటితీరపు బెస్త ప్రజల జీవితమును వాస్తవ దృష్టితో పరామర్శించి రచయిత దీనిని వ్రాసెను. బెస్తవారికి సముద్రమే సర్వస్వము. వారు ఆ తల్లి ముద్దు బిడ్డలు. వారిని ఆమె సర్వవిధముల పోషించి కాపాడును. ఆ తీర ప్రాంతములందు నివసించు వారి స్త్రీల పాతివ్రత్యమే, అపారమైన కడలిపైన అహోరాత్రములు సంచరించు పురులకు 'రక్ష' అని వారి ఆత్మ విశ్వాసము. కుల పెద్దల అదుపు ఆజ్ఞలలో ఆ జాతివారు నడుచుకొనుచు, సంప్రదాయబద్ధమైన జీవితమును గడుపుచుందురు. "పెంబన్ కుంజు" అను నాతడు కులపెద్ద అండదండలతో తనకుగల అర్థ, కామవాంఛలను నెరవేర్చుకొనుటకు పోయిన పోకడలు ఈ నవలలో

చిత్రింపబడినవి. అతనిని ఆవేశించిన ధనవాంఛ అతని భార్య మరణమునకు, కుమార్తె వినాశనమునకు దారితీసినది. అయినను తన మార్గమును వదలలేదు. కండకోరన్ అను ధనవంతుడు మరణించగా, పూర్వము తాను కాంక్షించిన అతని అందాలరాసియైన భార్యను తీసికొనివచ్చి తన ప్రియురాలినిగా చేసికొని ఆ జాతిలో పారంపర్యముగా వచ్చుచున్న కట్టుబాట్లను ఎదిరించినను, అతడు అసించిన మానసికానందమును పొందజాలకపోయెను. కుమార్తె పట్ల తాను ప్రవర్తించిన తీరు సరియైనది కాదని గ్రహించినను, పరిస్థితులు చేయిజారిపోవుటతో అతడు దిగజారిపోయి పశ్చాత్తాపముతో నశించిపోయెను. ఇక కుమార్తె కరుత్తమ్మ తన భర్త పళని పట్ల అనురాగమును ప్రదర్శించలేక, తన ప్రియుడైన పరికుట్టిని విడిచిపెట్టలేక పొందిన మానసికక్షోభ, చివరకు తన ప్రియుడైన పరికుట్టి కౌగిలిలో పొందిన విషాద మరణము పఠితల హృదయములను కదలించివేయును. ఈ నవలలో చివర వరకు కరుత్తమ్మ నైతిక విశ్వాసముతో ప్రవర్తించినను, చెంజిన్ కుంజు పరంపరాగతమైన ఆచార వ్యవహారములను ఎదిరించి విజయమును సాధించినను, ఆ ఇరువురు భగ్నజీవులే. చక్కని వాతావరణముతో రచయిత ఈ కథను మలచి విశ్వసాహిత్యముతో భారతీయ రచయితలకు స్థానముకల్పించెను.

అస్సామీ భాషలో శ్రీ రజనీకాంత బర్దలై వ్రాసిన "మిరీజియరీ" నవలను శ్రీ భాగవతుల మార్కండేయశర్మ

"మిారీబాల" పేరున తెనిగించెను. దీనిలో బ్రహ్మపుత్రకు ఉపనదియైన సువర్ణశ్రీ నదీ ప్రాంతములో నివసించు ఆదిమ జాతి వారిలో 'మిారీ' అనునది ఒక తెగ. ఆ ప్రజల మత విశ్వాసములను, గుణగణములను, వ్యక్తిగతమైన రాగద్వేషములను, సమర్థతో రచయిత ఇందు ప్రతిపాదించెను. 'పట్టుదల' అనునది వారికి ఒక పుణ్యవ్రతము. ఎట్టి విపత్కర పరిస్థితులలోను తమ పట్టుదలను విడువక దానికి అత్యధిక ప్రాధాన్యతనిచ్చి స్వేచ్ఛగా మసలుకొందురు. రచయిత పానేయా, జంకీ అను ఇరువురు యువతీ యువకుల విషాదాంతమై ముగిసిన ప్రేమగాథను పరితల హృదయములు దర్శించునట్లు ఇందు చిత్రించెను.

ఈ సువిశాల భారత భూమియందు ఒక ప్రాంతపు ఆచార వ్యవహారములతో మరియొక ప్రాంతమునకు సంబంధము అంతగా గోచరించక, కొన్ని సందర్భములలో అది విభిన్నతమై ఏవగింపు కలిగించుచుండును. భిన్న నాగరికతలకు తావలమైన పలుప్రాంతములను గురించిన విషయములను తెలిసికొనుట అవసరము. శ్రీ కాశేంద్రసింగు బేది పంజాబు యువతికి సంబంధించిన ఒక కరుణరస ప్రధానమైన కథను "ఏక్‌చందర్ మైలిసి" పేరున ఉరుదూలో వ్రాసిన నవలకు "తెగిపోని బంధం" పేరుతో తర్జుమాచేసి శ్రీ కె. గోపాలకృష్ణారావు మనకందించెను. రాణి, తిలోచనుడు భార్యాభర్తలై కొంతకాలము గడపినను, చివరకు వారిమధ్య అభి

ప్రాయభేదములు పొడసూపి, భర్త మరణముతో ఆమె తాను స్తన్యమిచ్చి 'అమ్మా' అని పిలిచి, పెంచి పెద్దచేసిన మరది "మంగళు" నే సంఘము తృప్తికొరకు పునర్వివాహ మాడినను, ఆ ఇరువురి హృదయములలో చెలరేగిన "తెను తుఫాను" ను చిత్రించువట్టి నవల ఇది. ఇట్టి విచిత్ర పరిస్థితులలోను నిండు హృదయముతో రాణి, మంగళునిపట్ల తల్లిగా మాతృవాత్సల్యమును, మరదిగా మమతను, భర్తగా గౌరవ మర్యాదలను ప్రదర్శించి, ప్రవర్తించినతీరు ప్రశంసనీయమైనది, రాణి పాత్ర చిత్రణ శ్లాఘనీయము.

ప్రఖ్యాత ఉర్దూ రచయిత శ్రీ హీరాలాల్ మోరియా "తుఫాన్ ధష్ గయా" నవలను శ్రీ కొలిపాక మధుసూదన రావు "ఆగిన తుఫాను" పేరున అనువదించెను ఇది మధురమూ, సరళమూ నైన తెనుఁగుభాషలో సాగినది. శాశ్వాయిని అను యువతి తారానాథ్ అను ముసలి జమీందారును వివాహమాడి, శారీరక, మానసిక ఆనందములకు దూరమై, తన భర్త చేరదీసిన విఠల్ అను యువకుని తన అపురూప సౌందర్యముతో వశపరచుకొని విశృంఖలముగా అతనితో శారీరక సుఖములను అనుభవించి చివరకు మతి స్థిమితమును గోలుపోయినది. బీదరికపు చివరి అంచులను చవిచూచినను మార్గము తప్పక, శీలమును ప్రాణముకన్న మున్నగా భావించి ప్రవర్తించిన వ్యక్తి అపర్ణ. నీతి నియమములు, పాపపుణ్యములకు సంబంధించిన విచికిత్సతో కాలమును వ్యర్థ

పరచి, చేతికందిన ఐహిక సౌకర్యములను వమ్మ్నాచేసికొనక యధేచ్ఛగా ప్రవర్తించిన విచిత్రవ్యక్తి మణి. ఈ నవలలో రచయిత తాను సృష్టించిన చిక్కు సమస్యలకు కొంతవర కైనను తృప్తికరమైన పరిష్కార మార్గములను చూపి కథను చక్కగా ముగించెను. శ్రీ మోరియా మరియొక ఉర్దూ నవల "హల్‌చల్" ను, "విరగని విగ్రహాలు" పేరుతో శ్రీ కొలి పాకయే తెనిగించెను. దీనిలో ఒక జిల్లా కలెక్టరు దుర్మ్ద్ధాంధతతో, దుర్వ్యసనములతో తన ఆలుబిడ్డలను పట్టించుకొనక, అధికారమును దుర్వినియోగపరచి చివరకు జైలు పాలైపోగా, శీలవతియైన అతని భార్య ఆ కుటుంబమును చక్కదిద్దుటకు పడిన శ్రమను, పెద్ద కూతురు కమల పరిస్థితుల తాకిడికి తట్టుకొనలేక పరితపించిపోయి, కొంత వక్రముగా ప్రవర్తించి, చివరకు ఆమె రచయిత రాజుని వివాహమాడినసంగతిని శ్రీ మోరియా ప్రతిభాపూర్ణముగా వివరించెను.

ప్రముఖ భారతీయ ఉర్దూ రచయిత శ్రీ కిషన్ చందర్ ఉర్దూనవలను "గాడిద ఆత్మకథ" పేరున శ్రీ పిచ్చేశ్వరరావు ముచ్చటైన తేట తెనుఁగుభాషలో అనువదించెను. అట్ట వక్ర గ్రామమునకు చెందిన ఒక మామూలు గాడిద పత్రికా పఠనమను వ్యసనముగలదై ప్రవర్తించగా, యజమాని దానిని ఇంటినుండి తరిమివేసెను. పుస్తకములకు, పండితులకు ఆదరములేని ఆ గ్రామములో వుండుటకు ఇష్టములేని ఆ గాడిద స్వతంత్ర భారతదేశమునకు రాజధాని

యైన, ఫిల్లీకి చేరుకొని పెక్కుమంది పెద్దలతో పరిచయము చేసికొని, సాహిత్య అకాడమీ నుండి పార్లమెంటు భవనము వరకు ఎగబ్రాకి, సన్మానములపైన సన్మానములు పొంది, అపుడూప సౌందర్యవతియైన ఒక యువతి తనను వివాహ మాడదలచినప్పుడు, తనిష్టము లేకపోయినను అంగీకరించి, చివరకు ఆ మాటలాడ నేర్చిన గాడిదయే అజ్ఞాత వ్యక్తుల చేతిలో ఘోరాతి ఘోరమైన చావుదెబ్బలు తిని అతి ప్రమాదస్థితిలో చావు బ్రతుకుల మధ్య మిగిలిపోయినది. "బెల్లించుట్టూ ఈగలు మూసినట్లు" పెద్దవారితో పరిచయ మున్నదను భ్రమతో స్వార్థపరులైన రాజకీయవేత్తలు, తదితర పెద్దలు ఆ గాడిద చుట్టును తిరిగి, దానిద్వారా తమ పనులను నెరవేర్చుకొనుటకు వారుచేసిన ప్రయత్నములను వ్యంగ్యాస్పోరకముగను, ఆహ్లాద జనకముగను ఉండునట్లు రచయిత కడు సమర్థతతో రచియించెను.

గాంచి, చెడు రొంటిని చూచి, తాను నమ్మిన దానిని నిర్భయముగా చెప్పగల సమర్థుడు శ్రీ కవిరాజమూర్తి. శ్రీ మూర్తి ఉరుమూ నవలను, "చివరిరాత్రి" అన్న చిన్న కీ॥ శే॥ ఓటుకూరి రంగారావు తెనిగించెను. ఈ తెలుగు సేత స్వతంత్ర రచనవలె చదువరులను గిలిగింతలు పెట్టు చుండును. దీనిలో ఉన్నత కుల పంజాతయైన పద్మ పరిస్థితుల ప్రభావముతో పతనమై, గత్యంతరము లేక శరీరమును నడి వీధిలో పెట్టి అమ్ముకొని అయినవారితోను, కానివారితోను

"ఛీ" అనిపించుకుంటూ, నికృష్టమైన జీవితమును వెళ్ళబుచ్చుచున్నప్పుడు "నరేన్" అను హృదయమున్న యువకుడు తటస్థపడి ఆమెనుగురించి పృచ్ఛించినప్పుడు, ఆమె హృదయ విదారకమైన తన గత జీవితపు స్మృతులను అతనికి పూసగ్రుచ్చినట్లు వివరించినది. ఆమె ఈ విషాదగాధ విన్న అతని హృదయము ద్రవించిపోయినది. ఇతరులవలె ఆమె శరీరముపైన కానును మరొక కాటు వేయక "దయా మయుడైన పరమేశ్వరుడు భక్తకోటిపుని ఐక్యం చేసు కున్న విధంగా నరేన్ ఆవిడని తనలో నింపుకున్నాడు. ఆ విశాల హృదయం లోతుల్లో పద్మ కానరాకుండా మునిగి పోయింది. ఆవిడ పాపజీవితంలో ఇదే చివరి రాత్రిగా గడచి పోయింది. ఇక ఇప్పటినుంచీ మరో కొత్త జీవితం చివుళ్లు వేస్తుంది-" అని అంటాడు భవిష్యత్తుపైన మహోన్నతమైన ఆశగల శ్రీమూర్తి. ఇట్టి అనాధల గాథలను సానుభూతితో విని "చప్పగా నిట్టూర్పులు విడిచిపెట్టునట్లు" చేయక రచ యిత కథకు ఒక పరిష్కార మార్గమును చూపిన పద్ధతి ప్రశంసనీయమైనది.

అఖిలభారత ప్రసిద్ధ ఉర్దూ రచయిత శ్రీ మిర్జారుస్వా వ్రాసిన "ఉమ్రావ్ జాన్ అదా" నవలను తెనుఁగు లోనికి అ పేరుననే శ్రీ కాశరథి రంగాచార్య అనువదించెను. బాల్యమునసే తల్లిదండ్రులనుండి వేరుచేయబడిన ఉమ్రావ్ జాన్ అదా, లక్నోలో వేశ్య వృత్తిలో జీవించు "ఖానమ్"

అన్న కృద్ధస్త్రీ వద్ద పెరిగి, తన సంగీత, నృత్య, సాహిత్య విద్యలతో పెక్కుమంది పెద్దలను ఆకర్షించి, ధనము సంపాదించినను, శ్రీరుస్వాతో పరిచయమైన పిమ్మట తన వృత్తి పట్ల యేహ్యభావమేర్పడి, తన లలితకళా పాండిత్యముతో స్వేచ్ఛగా జీవించవలెనను అభిలాష కలుగగా శేష జీవితమును భగవధ్యానమునతో "అల్లా పిలుపు కొరకు" ఎదురు చూచుచు పవిత్రముగా గడపినది. ఇది లక్ష్మీయందలి వేశ్యల జీవితమును, సంగీత సాహిత్యములపట్ల వారికి గల అభిమానమును, సంఘములో ఆనాడు వారి స్థానమును వివరించును.

చెప్పుకొనతగిన కథ యేదియు లేకపోయినను ఆధునిక భావములను ఇతివృత్తముచేసి మంచి జిజ్ఞాసను, తార్కికాను శీలనమును, భావుకతను పఠితల హృదయములలో రేకెత్తించుచు చైతన్యస్రవంతి రూపమున నడచిన ఉత్తమ నవల "అసురగణ". తమిళములో క. నా. సుబ్రహ్మణ్యం రచించిన దీనిని శ్రీయుతులు బి. వి సింగరాచార్య, పి. సభాపతి "అసురగణం" పేరుతో తెనిగించిరి. ఇది 1965 సం. భారతి మాసపత్రికలో ప్రచురితమైనది. 'రాము' అను విద్యార్థి వ్యక్తిత్వములోని ద్వంద విధానము, నడవడిలోని వైరుధ్యము, ఇందు వివరింపబడినవి. అతడు తన హృదయములో భిన్నమైన పెక్కు ఆలోచనలను అనుక్షణము చేయగలిగినను, బైటబెట్టలేని విచిత్ర వ్యక్తి. జీవితములో స్థిరమైన భావమేదియు అతనికి లేదు. రచయిత నవలకు వ్రాసిన

ముందుమాటలలో "మానవుని ఛాయలో దాగివున్న దేవ, అసుర, మనుష్యగణాల్ని కొంతవరకు చూపడమే నా నవల లక్ష్యం" అన్నాడు. మరొకచోట ఆయన అసుర గణమనగా వివరించుచు "ఆ దర్శాలు, ఆలోచనలు, సందేహాలు మెండుగా కలిగివుండటమే" అని అంటాడు. ఆ భావములను రాములో సమర్థనీయముగా చిత్రించెను. ఏది ఊహ? ఏది నిజం? అన్న రాము జిజ్ఞాసయే దీనిలో ప్రధానాంశమై వివరించబడినది. తెలుఁగులో వెలువడిన శ్రీ రాచకొండ "ఆల్పజీవి", గోపీచంద్ "అసమర్థుని జీవితయాత్ర", నవీన్ "అంపశయ్య" నవలలను పోలివున్న రచన ఇది. ఈ నవల లన్నిటిపైన పాశ్చాత్య తత్వవేత్తల మనో విశ్లేషణత, ఆధ్యాత్మిక చింతన స్ఫుటముగా గోచరించును.

మహాపురుషుడైన శ్రీ కందుకూరి, స్త్రీ జనోద్ధరణకై ఆంధ్రదేశమున నడపిన మహోద్యమ ప్రభావము ఆయన సమకాలికుడైనతమిళ మహాకవి శ్రీ సుబ్రహ్మణ్య భారతిని సైతము కదిలించి, శ్రీ పంతులును, ఆయన భార్య రాజ్యలక్ష్మమ్మను, స్వదేశమిత్రన్ పత్రికాధిపతి జి. సుబ్రహ్మణ్యయ్యరును ముఖ్య భూమికలుగా చేసి "చంద్రికకథ" అన్న అసంపూర్తి నవలను వ్రాయునట్లు ప్రేరేపించినది. దీనివలన అనాడు దక్షిణ భారతమున శ్రీ వీరేశలింగం పంతులు నడపిన ఆ ఉద్యమము ఎంతటి శక్తివంతమైనది విశదమగును. దీనిని సర్వశ్రీ గోపాల, కృష్ణ, రాఘవన్, లు తెలిగించిరి.

వేలాంగుడి గ్రామములో సంభవించిన భూకంపముతో మొదలైన ఈ నవలలో 'గోమతి' అను స్త్రీ ప్రసవించి ఆడపిల్లను కని, ఆ పసికందును బాల వితంతువైన తన ఆడబిడ్డ విశాలాక్షి చేతిలో పెట్టి ఆమెను పునర్వివాహము చేసుకొన వలసినదని ప్రోత్సహించి కన్నుమూసినది. ఆ పసికందు పేరు చందిక. అదే నవల పేరు ఆ పిమ్మట విశాలాక్షి పెక్కు ఇక్కట్లపాలై మద్రాసు చేరి శ్రీసుబ్రహ్మణ్యయ్యరు చేయూతతో శ్రీవీరేశలింగం పంతులు నాశ్రయించి వారి ప్రోత్సాహముతో ఆమె తనను పేర్మించిన బాలసన్యాసి శ్రీనిత్యానంద స్వామిని బ్రహ్మసమాజ పద్ధతిలో వివాహమాడినది. ఆ నిత్యానందస్వామి విశ్వనాధశాస్త్రి అను లౌకిక నామముతో విశాలాక్షితో కొంతకాలము గడపి, మానసిక రుగ్మతతో కన్నుమూయునంతవరకు కథ నడచి, అది అసంపూర్తిగా మిగిలిపోయినది. దీనిలో కథా కథన పద్ధతికన్న శ్రీ పంతులు ఆనాడు నడపిన మహోద్యమముల ప్రభావము సమాజమును అది మొట్టు తేజపరచినది విశదమగును.

ప్రముఖ కన్నడ రచయిత్రి శ్రీవేణి నవలను "పాప పరిహారం" పేరుతో శ్రీశార్వాణి ఆంధ్రీకరించెను. ఇది స్వతంత్ర రచనవలె సాగినది. రచయిత్రి నవలలో స్పృశించిన ఇతివృత్తము పాతదైనను, నూతన మార్గము నన్నుసరించి నడచి సహజ శోభావంతమై వర్ధిల్లినది. భారతి, ఆనంద్ అను నూతన దంపతులు, సుధీర్ఘమైన యెడబాటు

వలన జీవిత మాధుర్యమును గోలుపోయి, వారు పొందిన మానసిక సంబంధమైన ఆందోళనను నీతి-అవినీతి, ధర్మము-అధర్మము మున్నగు సాంఘిక సూత్రముల మధ్య వారి హృదయములో చెలరేగిన పెనుతుఫానులతో వేగిపోయి చివరకు పరిస్థితుల కాకిడికి తట్టుకొనలేక ఆ ఇరువురు సమానమైన తప్పునే చేసిరి. రచయిత్రి ఆ ఇరువురి పరిస్థితులను సానుభూతితో మనోవిశ్లేషణాత్మక దృష్టితో పరిశీలించి కథను ప్రతి మలుపులో సారస్యము చెడకుండ ప్రతిభాపూర్ణముగా వివరించినది. భారతి, చందూతో వడపిన ప్రేమకలాపమును తల్లివలన తెలిసికొని ఆనంద్ ఉద్రేకముతో ఆమెను అవమానపరచినను, ఇంగ్లాడులో ఉన్నప్పుడు కానును పరిస్థితుల కాకిడికి తట్టుకొనలేక అట్టి తప్పునే చేసియున్న సంగతిని గుర్తుకు తెచ్చుకొని, తన కోపమును తగ్గించుకొని ఆమె పరిస్థితులను సానుభూతితో గ్రహించి క్షమించెను. ఈ రచయిత్రి పరిస్థితుల ప్రభావమునకు ఎదురొడ్డి నిలువలేక ఒకే విధమైన తప్పుచేసిన ఆనంద్, భారతి పాత్రల కెండింటిపట్ల సమానమైన సానుభూతిని గనబరచి ఇతర సామాన్య రచయితలవలె వారిని హత్యలకు, ఆత్మహత్యలకు పాలుపడునట్లు చేయక, కథను నవీన దృక్పథముతో సుఖాంతముచేసినది.

వంగ మహారచయితలైన శ్రీ బంకించంద్ర, రవీంద్ర, శరచ్చంద్రులలో తుల్యుడైన శ్రీ ప్రేమ్ చంద్ తెలుగు వారికి సుపరిచితుడైన హిందీ రచయిత. ఆయన రచన

లన్నియు తెలుఁగులోనికి పరివర్తనము పొందినవి. విశ్వ విఖ్యాతి నార్జించిన ఆయన "గోదాన్", "నిర్మల్" నవలల వలె బహుజనాదరణను పొందిన మరియొక ఉత్తమ నవల "రంగభూమి". కీ॥ యశులు సుంకర, ఆలూరి, కౌముది దీనిని అనువదించిరి. రచయిత ఉత్తర హిందూదేశమునందలి ఒక గ్రామమును తీసికొని, దాని చుట్టు కథను మలిచి, గ్రామీణ జీవితమును చక్కగా చిత్రించెను. 'సూరదా'సను గుడ్డి చిచ్చగాని కథ ఇందు వివరింపబడినది. 'అపకారికి సైతము ఉపకారము చేయు' నట్టి మహా పురుషుడు అతడు. తాత, తండ్రులనుండి తనకు సంక్రమించిన భూమిని ఆ గ్రామ ప్రజలు తమది చేసికొని అనుభవించుచున్నప్పుడు మిక్కిలి ఆనందమును పొందుచుండెను. ఆ చోటులో జాన్ సేవక్ అను పెద్ద సేటు సిగరేటు ఫ్యాక్టరీని నిర్మింపచదలచి, సూరదాసుకు వలసినంత ధనమిత్తునని, దానిని తనకు విక్రయించమని కోరెను. ధనాశారహితుడైన దాసు గ్రామస్తుల కుపయోగపడుచున్న ఆ భూమిని అమ్మనొల్లకు నిరాకరించెను. దానితో ఆ సేటుకు పట్టుదల అధికమై, తన కోరిక నెరవేర్చుకొనుటకు, అతడు దాసు గుడిసెపైన చేసిన దాడిలో దాసు మరణించెను. ఆప్రదేశమున సేటు సిగరేటు ఫ్యాక్టరీని నిర్మించెను. ప్రధాన కథతోపాటు ప్రేమ్‌చంద్ రసాత్మకమైన మరికొన్ని ఉపకథలను సైతము కల్పించి నవలను సజీవ సంపన్నమొనరించెను. స్వాతంత్ర్యోద్యమ కాలమున దేశ

ప్రజల హృదయ కుహరములలో జాగియున్న విభిన్న భావములను, వారి అభిరుచులను, ఆలోచనలను దర్పణములో వలె ఈ నవలలో దర్శించవచ్చును. శ్రీ ప్రేమ్‌చంద్ తన రచనలలో భారతీయ సంస్కృతీ వైభవముల మూలతత్వమును చక్కగా ఆవిష్కరించెను.

సంస్కృత, హిందీ, వంగభాషలలో నిష్ణాతుడైన మహాకవి శ్రీ నిరాలా వ్రాసిన "అప్సర" ననలను శ్రీ కె. రమేష్ తెలుఁగుచేసెను. శాకుంతల నాటకప్రదర్శన సందర్భమున రంగస్థలముపైన విద్వాంసుడైన ఒక యువకుడు వృత్తితో జీవించు ఒక వేశ్యకూతురు కలసి నటించి బహు జనాదరణను పొందిరి. ఆ పరిచయముతో ఆమెను గాఢముగా ఆతడు ప్రేమించెను. సంఘమునకు వెరచి తన ప్రేమను బహిర్గతముగా వ్యక్తము చేయజాలకపోయెను. ఆ యువతి మాత్రము అతనికొరకు యెన్ని త్యాగములైనను చేయుటకు వెనుదీయలేదు. ఈ రహస్యము తెలసిన అతని మిత్రులు వారిద్దరిమధ్య పూలమాలలను మార్పించి భార్యా భర్తలగునట్లు చేసిరి. కథ చిన్నదైనను తన సునిశిత మేధా సంపత్తితో, లోకానుభవముతో శ్రీ నిరాలా ఒక శిల్పివలె నవలకు చిన్నెలు, వన్నెలు సమకూర్చి ఆపాత మధురముగా నుండునట్లు తీర్చిదిద్దిన పద్ధతి మెచ్చుకొనతగినది.

ఆధునిక హిందీ నవలా రచయితలలో తలమానికమని చెప్పదగిన శ్రీ గుల్షన్ నందా "ఝిల్‌కే ఉస్‌పార్" నవలను

శ్రీమతి ఆచంట అంబని "ఏటి ఆవతల" అన్న పేరుతో అనువదించినది. జమీందారి కుటుంబమునకు చెందిన సమీర్, అపురూప సౌందర్యవతి, అంధురాలు ఐన 'నీలూ' అను కొండజాతి పిల్లను ప్రేమించినప్పుడు అస్తి, అంతస్తులు, హెచ్చుతగ్గులు అడ్డగోడలై నిలువగా తల్లి బలవంతముపై అతడు 'జు గ్నూ' అను వేరొక యువతిని వివాహమాడెను. సమీర్ బంధువులు పన్నిన కుట్రలకు, కుయుక్తులకు తట్టుకొనలేని నీలూ త్యాగబుద్ధితో రంగమునుండి తప్పుకొని విషాదభూయిష్టమైన అజ్ఞాత జీవితమును గడుపుచున్నప్పుడు, జుగ్నూ ప్రసవించి హఠాన్మరణము నొందగా, సమీర్ తన పాత స్మృతులతో లోగడ తాను నీలూ, కలసి ప్రేమతో తిరిగిన ప్రదేశములలో మానసిక వ్యధతో అన్వేషించుచున్నప్పుడు హఠాత్తుగా ఆమె కనుపించుటతో, ఆ ప్రేమైక జీవులిరువురు మరల ఏకమగుటతో కథ సుఖాంతమైనది.

మరాఠి తన మాతృభాషయైనను శ్రీ అనంతగోపాల్ షెవ్‌డే హిందీలో చెక్కు నవలలు వ్రాసి అఖిలభారత ఖ్యాతి నార్జించెను. ఆయన "నిశాగీతి" నవలను శ్రీ శేషం శ్రీనివాసాచార్య తెనుఁగు చేసెను. డాక్టర్ మధుసూదన్ తనవద్ద నర్సుగా పనిచేయుచున్న వితంతువు, ప్రౌఢ వయస్కయైన సుశీలను గాఢముగా ప్రేమించి వివాహమాడ సంకల్పించినప్పుడు, ఆమెకు ఇష్టమున్నను తనను వివాహమాడుటవలన అతని భవిష్యత్తు నాశనమైపోగలదని భావించి, దూర

దృష్టితో, కార్యగబుద్ధితో అతనిని విడిచి పోయినది. విధి వక్రించి డాక్టర్ గుడ్డివాడైపోయెను. సుశీల ఒక అపరిచిత వ్యక్తివలె అతనివద్ద మరల ప్రవేశించి, నిర్మలమైన మన స్సుతో అతనికి సేవలు చేయదొడగినది. కొంతకాలమునకు ఆ ఇరువురు ఆ ప్రదేశమును వదలి కొండ ప్రాంతములను పోయి, అటవిక ప్రజలకు నిష్కామ ప్రవృత్తితో సేవలు చేయుచు తమ శేష జీవితములను గడిపిరి. రచనా సమర్థత గల శ్రీ షేక్‌డే బహు నిగ్రహముతో కథను నడిపి, అశ్లీల తకు, అసభ్యతకు కావివ్వక ఉత్తమ నవలగా దీనిని రూపొం దించిన పద్ధతి ప్రశంసనీయమైనది. స్థల, కాల, పాత్రల సమై క్యతను గుర్తించి, ఒక నిర్ణీత పద్ధతి ననుసరించి రచనలు చేయగల దిట్ట ఆయన.

శ్రీ అనంత గోపాల్ వలెనే తెనుఁగువాడైన శ్రీ అరిగె పూడి రమేష్ చౌదరి హిందీలో పెక్కు నవలలు వ్రాసి అఖిలభారత కీర్తితోపాటు, ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వ బహు మతిని గూడ పొందెను. అయన హిందీలో వ్రాసిన "దూర్‌కే ఢోల్" నవలను శ్రీ పిచ్చేశ్వరరావు "ప్రతిధ్వని" అన్న పేరున తెనిగించెను. మద్రాసు నగరమునందలి ఉన్నతశ్రేణి ప్రజల జీవిత విధానములను, వారి విలాస, వినోద ములను, అభిరుచులను, ఆలోచనలను, విచిత్ర ప్రవర్తనలను, ఆడంబరములను కథానాయిక రమా చౌదరి ద్వారా అతి వాస్తవముగా ఉండునట్లు ఇందులో వివరించెను. రమ

భర్త 'చౌదరి' నిష్కళంకమైన వ్యక్తి. రమ, చౌదరిని ఒక సాధనముగా చేసికొని తన స్వార్థముకొరకు నాగరికత, సభ్యత పేరుతో ఉపయోగించుకొనినప్పుడు అతడు ఎరయై, కొంత కాలము పర్యవర్తించెను అపిమ్మట తన బలహీనతలను గుర్తించి, ఆవేశముతో, ఆవేదనతో తన జీవితమును పరి సమాప్తము చేయదలచినప్పుడు 'రావు' అను మిత్రుడు మెల కువతో ఆ గండమునుండి అతనిని రక్షించెను. రమ మార్గముతప్పి పర్యవర్తించినను, భర్తగా తన బాధ్యతలను గుర్తించిన చౌదరి పరిణామ మూడువందల రూపాయలను మనియార్డరు చేయుచున్నట్లు రచయిత కథను సమాప్తముచేసి చూపుటనుబట్టి అతని ఆర్ద్రహృదయము, ఉదాత్త గుణము మనకు తెలియగలదు.

ప్రముఖ రచయిత శ్రీ పన్నాలాల్ పటేల్ గుజరాతీ నవలను శ్రీ వేమూరి అంజనేయశర్మ "కలసిన జీవితాలు" పేరున చక్కని శైలిలో, రసవంతమైన భాషలో అనువదించెను. అవిద్య, అజ్ఞానము పేరుకొనియున్న గుజరాత్ ప్రాంతపు గ్రామస్తుల జీవితమును వాస్తవ దృక్పథముతో పరిశీలించి, అది కన్నులకు కట్టునట్లు చిత్రించెను. అచ్చటి సామాన్య ప్రజలలో కనుపించునట్టి నిష్కల్మషమైన ప్రవృత్తిని, అల్ప సంతోషమును స్పష్టముగా ముఖ కవళికలలో గోచరించునట్లు పాత్రలను సజీవ సంపన్నములుగా చేసి కథను మలిచెను. కాన్జీ భాయి, జీవి ఒకరినొకరు గాఢముగా

ప్రేమించుకొనినను కులములు వేరైనందున వారి వివాహము విఫలమైనది. కాన్హీ తన ఇష్టప్రకారమే భగవ్‌జీతో జీవికి వివాహము జరిపినను, ఆ ఇరువురి హృదయములు కలియక భగవ్‌జీ విషము కలిపిన రొట్టెలను తిని మరణించెను. ఆ పిమ్మట జీవి దుర్భరమైన యాతనలను అనుభవించుచున్న ప్పుడు కాన్హీ అకస్మాత్తుగా వచ్చి ఆమెను తనతో పట్టణము నకు తీసుకొని వెళ్లుటతో కథ విచిత్రముగా సుఖాంతమైనది.

మరాఠీ సాహిత్యమునకు తలమానికమని ప్రసిద్ధిగనిన శ్రీ హరినారాయణ ఆప్టే ఆ వాఙ్మయ చరిత్రయందు ఆచంద్ర తారార్కము వర్ధిల్లగల పెక్కు నవలలను వ్రాసిన కారణ జన్ముడు. ఆయన నవలలు మహారాష్ట్ర ప్రజల వాస్తవ జీవితమును, వారి ఆచార వ్యవహారములను, పారంపర్యముగా నడచుచున్న వైవాహిక సంబంధమైన కట్టుబాట్లను, వాటి విచ్ఛిత్తికి ఆనాటి సంస్కర్తలు చేసిన కృషిని హేతువాద దృక్పథముతో వివరించెను. అవిద్య, అంధకారముతో హృదయ విదారకమైన పరిస్థితులమధ్య కుళ్ళి కుమిలిపోవు మహిళల స్థితిగతులను మానవతాదృష్టిగల ఆయన ఒక ప్రవక్తవలె వివరించెను. ఆయన నవలలలో శిఖరాగ్రమైన "యమునా" ఆత్మకథను "అబలా జీవితము" పేరుతో బహు భాషా పండితుడైన శ్రీ పి. వి. నరసింహారావు మృదు మధురమైన సరళ వ్యావహారిక భాషలో తెనిగించెను. యమునాబాయి అను యువతి తన సర్వస్వమును గోలుపోయి

విషాదభూయిష్టమైన పరిస్థితులమధ్య రంపపు కోతతో శోక సముద్రమై నడచిన తన ఆత్మకథను తోటి మహిళలకొరకు వివరించి చెప్పినది. ఈ నవలయందలి ప్రతి పాత్ర, ప్రతి సన్నివేశము, ప్రతి సంఘటన మన కన్నులముందు తిరుగుచు "మా పరిస్థితులను సహృదయముతో, సానుభూతితో యోచించండి" అని మనతో చెప్పుకొనుచుండును. మనకు తెలియకయే, మన కన్నీరు కాల్వలై ప్రవహించును. యశోదాబాయివంటి ఆదర్శ మాతృమూర్తి, రఘునాథ రావు వంటి భర్త, గణపతిరావు వంటి సోదరుడు, దుర్గి వంటి స్నేహితురాలు, ఉమాదేవి వంటి ఉత్తమ ఇల్లాలు, వాసుదేవరావు వంటి చుక్కోపి, బనివంటి శూర్పణఖ, శంకర్ వంటి లోభుల చిత్ర విచిత్రమైన మనస్తత్వము సంపుటీకరణమే ఈ నవల.

శ్రీ శరత్ వలె భారతీయుల ప్రగాఢాభిమానములను చూరగొనిన మరొక వంగ రచయిత శ్రీ తారాశంకర్ బందోపాధ్యాయ్. అయన "ఆరోగ్యనికేతనము" నవలను శ్రీ జొన్నలగడ్డ సత్యనారాయణమూర్తి తెనిగించెను. శ్రీ తారా బాబు దీనిలో కల్పనలకు తావివ్వక వ్యధాకులిత జీవితముల యందలి యదార్థ స్థితిని వాస్తవిక దృక్పథముతో పరిశీలించి వివరించెను. జీవితముపట్ల మమతగల అయన, పాత్రల స్థితి గతులను సానుభూతితో వివరించెను. ఈ నవల పాత క్రొత్తల మధ్యగల సంధికాలమున ఆయుర్వేద వైద్యమునకు, ఆలో

పతి వైద్యమునకు మధ్య వీర్పడిన సంఘర్షణను, ఆయుర్వేద వైద్య విధానములో నాడీ పరిశీలన ద్వారా రోగ నిర్ణయము చేయు పద్ధతిని రచయిత ఇందు చక్కగా వివరించెను. నవగ్రామమునకు చెందిన జీవన్ డాక్టర్ ఆ విద్యలో పరిపూర్ణుడు. రాబోవు మరణమును జ్యోతిష్కునివలె వివరించి చెప్పగల సిద్ధహస్తుడు. అతని భార్య గయ్యాళి. కాందీపురమున అల్లోపతి వైద్య విద్యార్థిగా నున్నప్పుడు 'మంజరి' అను పిల్లను ప్రేమించినను, ఆమెను భూపీ బోసు వివాహమాడుటవలన, భగ్న ప్రేమతో తన స్వగ్రామము చేరి, పారంపర్యముగా వచ్చుచున్న ఆయుర్వేద వైద్యమును చేపట్టి లబ్ధప్రతిష్ఠుడై యున్నప్పుడు భర్త మరణముతో తన పర్వస్వమును గోలుపోయి అంధురాలై కట్టుకొనుటకు వస్త్రములు సైతము లేని స్థితిలో మంజరి అతని వద్దకు వచ్చి 'కాను యెప్పుడు మరణించగలనో వివరించవలసిన' దని కోరినది. పాత ప్రేమికుల ఈ పునస్సమాగమమును శ్రీ బందోపాధ్యాయ్ ప్రతిభావంతముగా జరిపి, కథను ఉదాత్తరీతిలో ముగించెను. డాక్టర్ జీవన్ బాబు విశాల దృక్పథముతో చేసిన ప్రజాసేవ మానవత్వముపట్ల అతడు గనబరచిన ప్రేమాదరములు పాఠకులను ఉత్సుకతతో చివరంట చదివించగలవు. వేరొక ప్రముఖ వంగ రచయిత శ్రీ మాణిక్ లాల్ బందోపాధ్యాయ్ రచించిన "పద్మావతీ నదీర్ మాఝీ" నవలను శ్రీ నీలకంఠం "పల్లెజీవులు" పేరుతో అనువదించెను. ఈ నవలలో చేపలు

పట్టి జీవించు బెస్తవారి అలవాట్లను, అభిరుచులను అతి వాస్తవ దృక్పథముతో రచయిత చిత్రించెను. హిందూ ముస్లిములు మతసంబంధమైన విభేదములను మరచి, సోదరులవలె, ఆత్మీయులవలె అన్యోన్యముగా గడుపు ప్రశాంత జీవనమును ఇందు వివరించెను. పెక్కు విదేశ భాషలలోనికి ఇది అనువదింపబడినది. ఆధునిక వంగ సాహిత్యమున అగ్రగణ్యుడైన శ్రీ వనఫూల్ నవలను "అంతర్ద్వేషాలు" అను పేరుతో శ్రీ నీలకంఠమే అనువదించెను. ఇరువురు జమీందారులు తమలో తమకుగల పగలను అంతర్ద్వేషములను మనస్సులో అణచిపెట్టుకొని మిత్రులవలె మైకి నటించుచు నిత్యము చదరంగమాడుచు 'లోకగ్నుల్ బహిస్సున్ధల్' అను నట్లు కాలక్షేపము చేసిరి. ఇట్టివారి విచిత్ర మనస్తత్వములను రచయిత సమర్థతతో చిత్రించెను. 'వహ్ని' కుమారి పాత్రను అత్యంత ప్రతిభావంతముగా మలిచెను. విభిన్న మానవ, మానసిక తత్వములను విశ్లేషించి చూపుటలో 'వనఫూల్' సమర్థుడన్న సత్యమును ఈ నవలలో ఆయన రుజువుపరచుకొనెను.

పెక్కు నవలలను ఇతర భాషలనుండి మనము అనువదించుకొనినటులనే, తెలుఁగులో వెలువడిన కొన్ని నవలలను ఉత్సాహవంతులు, కార్యదక్షులు నైన రచయితలు కొందరు వానిని భాషాంతరీకరణములు చేసినను, అవి ఆయా భాషలలో ప్రజాహృదయములను అంతగా చూరగొనినట్లు

కనుపించుట లేదు. అయినను ఈసందర్భమున కొన్నింటి నిచట ఉటంకించుట ఉచితమని భావించి ఈ క్రింద పొందుపరచితిని. మాలపల్లి, నారాయణరావు, వేయిపడగలు, రుద్రమదేవి హిందీలోనికి పరివర్తనము పొందినవి. "తొలిమలుపు" నవల బెంగాలీ భాషలోనికి అనువదింపబడినది. మరికొన్ని నవలలు మన ఇరుగు పొరుగు భాషలైన కన్నడము, అరవము, మళయాళము, ఒరియా భాషలలోనికి గూడ పరివర్తనము పొందినవి. ఈ పరివర్తనలు చేయువారిలో సర్వశ్రీ) చల్లా రాధాకృష్ణశర్మ, పి. వి. నరసింహారావు, వేమూరి ఆంజనేయశర్మ, బొమ్మన విశ్వనాధం, శార్వాణి, పిచ్చేశ్వరరావులు ప్రముఖులు.

సర్వశ్రీ పురిపండా అప్పలస్వామి ఒడియా భాషనుండి అనువదించిన "అమావాస్య చంద్రుడు", వంగభాషలో ఆగు గురు రచయితల గొలుసుకట్టు నవలకు 'సత్య' చేసిన "నాగరిక" అనువాదముతో పాటు, అదే భాషనుండి సూరంపూడి సీతారాం అనువదించిన "వనవాసి", మద్దిపట్ల సూరి "జల్సాఘర్": కన్నడమునుండి శార్వాణి తెనిగించిన "అభయదానం", "వసంతగానం", హిందీనుండి పోలూరి శేషగిరిరావు అనువదించిన "పదిరూపాయలనోటు" నవలలను ఈ సందర్భమున పేర్కొనుచు, తదితర జాతీయ భాషలనుండి గూడ నేడు పుంఖాను పుంఖముగా వెలువడుచున్న వివిధ అనువాద రచనలను గూడ ప్రశంసించుచు ఈ భాగమును ముగింతును-

భారతేతిహాస గర్భితములైన చారిత్రక నవలలు - ౪

నవలా రచనయందలి ఇతర పద్ధతులవలె భారతీయులకు ఆంగ్లభాషా సహచర్యముతోనే, చారిత్రక నవలా రచనా పద్ధతియు అలవడినదని చెప్పక తప్పదు- సర్ వాల్టర్ స్కాట్, ఛార్లెస్ డికెన్సు, అలెగ్జాండర్ డ్యూమాస్, విక్టర్ హ్యూగో, లియోటాల్ స్టాయి వంటి పద్ధతి ప్రముఖ పాశ్చాత్య రచయితల చారిత్రిక నవలలను మనవారు పఠించి ఆ ఉద్దేశముతో భారతీయ భాషలలోను ఈ దిగువ తెలిపిన వానిలో కొన్ని చారిత్రకాంశములను ఇతివృత్తములుగ స్వీకరించి అయా కాలములందలి చారిత్రిక, రాజకీయ, మత, సాంఘిక, సాంస్కృతిక, వైజ్ఞానిక, నాగరికతా వైభవములను వ్యక్తీకరించుచు ప్రగతిశీలురైన రచయితలు ఈ సంబంధమైన చారిత్రిక నవలా రచన కుపక్రమించిరి-

నంద, మౌర్య, గుప్త, రాజపుత, బానిస, ఖల్జీ, మొగలు, మహారాష్ట్ర, ఫ్రెంచి, డచ్చి, ఆంగ్లేయులు ఈ భారతావనిని తమ నిరాఘాట పరాక్రమాటోపముతో పాలించిరి. ప్రథమాంధ్ర మహారాజులైన శాతవాహనులు దక్షిణాపథమును మాత్రమేగాక, ఉత్తరాపథమున పాటలీపుత్రమువరకు గల భూభాగమునంతటిని ఆక్రమించి ఏక చ్ఛత్రాధిపత్యమును నెరపిరి. వీరేగాక ఇక్ష్వాకులు, ఆనంద గోత్రులు, సాలంకాయనులు, కాదంబులు, పల్లవులు,

చోళులు, చాళుక్యులు, కాకతీయులు, పద్మనాయక, రెడ్డి ప్రభువులు, విజయనగర రాజులు, తంజావూరు, మధుర, రామనాథపురముల నేలిన నాయక రాజులు, కళింగులు, బహమనీ సులతానులు, ఆసఫ్‌జా వంశీయులు, కుతుబ్‌షాహి ప్రభువులు ఈ మహాంధ్రభూమిని పాలించిరి.

ఈ దేశమున వైదిక, జైన, బౌద్ధ, చార్వాక, మహమ్మదీయ, క్రైస్తవమత సంస్కృతులు మూడు పూవులు, ఆరు కాయలునై వర్ధిల్లినవి. వర్ధమాన మహావీర, బుద్ధ, సిద్ధనాగార్జున, శంకర, రామానుజ, మధ్వాచార్యాది మహా మత ప్రవక్తలు; అశోక, చంద్రగుప్త, శ్రీముఖ శాతకర్ణి, రాజరాజనరేంద్ర, ప్రతాపరుద్ర, రాణా ప్రతాప, శివాజి, శ్రీకృష్ణదేవరాయ, రఘునాథరాయలవంటి మహా ప్రభువులు; రాణి రుద్రమదేవి, ఝాన్సీలక్ష్మీబాయి వంటి వీరనారీమణులు; రాణి సంయుక్త, విమలాదేవి, అహల్యాబాయివంటి పతివ్రతామతల్లులు; జిజీబాయి, ఏకాంబవంటి వీరమాతలు; చానమ్మ, మాంచాలవంటి వీరపత్నులు; చాణక్య, యుగంధర, తిమ్మరుసు, ఖడ్గతిక్కన వంటి మహామంత్రులు; తానాజీ, గోనగన్నారెడ్డి, బ్రహ్మయ రుద్రుడు వంటి ప్రభుభక్తి పరాయణులు; నన్నయ, తిక్కన, ఎఱ్ఱన, శ్రీనాథ, దూర్జటివంటి మహాకవులు; రామకృష్ణ పరమహంస, వివేకానంద, మహాత్మా గాంధి వంటి లోకోత్తర పురుషులు జన్మించి తమ మహోన్నత కార్యకలాపములతో,

దివ్య తేజఃపుంజములతో ఈ నేలను పునీత మొనరించి, జగ త్కల్యాణ సంధాయకములైన ఘనకార్యములను పెక్కింటిని నెరవేర్చి, అచంచల తారార్కము తమ యశఃకాంతులను దిగంతముల వరకు వెలయించిరి.

కొందరు రచయితలు చారిత్రిక నవలతోపాటు, పురా ణములయందలి కొన్ని ఉజ్వల ఘట్టములను గ్రహించి అందలి రహస్యములు ఎల్లరకును విదితమగునట్లు 'పౌరాణిక' నవలలను వెలువరించిరి. అవియు నేడు ప్రజల ఆదరాభిమానముల నందుకొనుచున్న సంగతి సర్వ విదితమే.

ఇక 'చారిత్రిక నవలారచనలో చరిత్రకు సంబంధించిన విషయ మెంతవరకుండవలెను? కల్పన యెంతమేరకుండవలెను?' అను విషయములో రచయితలమధ్య భిన్నాభిప్రాయము లున్నవి. చారిత్రక నవలలు గనుక చరిత్రకు సంబంధించిన విషయములకు అధిక ప్రాధాన్యతనిచ్చి, కల్పన తక్కువ పరి ధిలోనుండునట్లు శ్రద్ధవహించుట మంచిదని కొందరి తలంపు. అంతేగాక ఐతిహాసిక నవలలలో యేకాలమును గ్రహించి మనము విషయమును వివరించుచున్నామో ఆ కాలమునకు సంబంధించిన వాతావరణము, వేషభాషలు, ఆచార వ్యవ హారములు అధికముగా వర్ణించిన భాగుగానుండునని మరి కొందరి తలంపు. చారిత్రక విషయములను తెలిసికొనుటకు చరిత్రకు సంబంధించిన గ్రంథములు ప్రత్యేకముగా నున్నవి గదా! అట్టి స్థితిలో ఈ నవలలలో అధికముగా చారిత్రక

పరిస్థితులను వర్ణించినచో పఠితలకు విసుగు జనించి, వానిని చదువుటయే మానివేయుదురని వేరొక కొందరి భావన. అది యునుగాక చారిత్రిక పరిస్థితుల వర్ణన అధికమైనచో నవల కుండ వలసిన జిగి బిగి తగ్గి, కేవలము అది కొన్ని చారిత్రక విషయముల సమాహారమై నిస్సారమై పోగలదని వాదింతురు. కనుక చారిత్రక విషయములకన్న, కల్పనలకు ప్రాధాన్యతనిచ్చి అవసరమని భావించినచోట్ల చారిత్రక విషయములను తగు పాళ్లలో చొప్పించి రచనలు చేసిన బాగుగా నుండునని వేరొక కొందరి ఊహ- ఏది ఎట్లైనను రచయితలు చరిత్రకేయవలసిన ప్రాముఖ్యతనిచ్చి, తదనుగుణమైన కథా సన్నివేశములను కల్పనచేసి పఠితలకు చరిత్రపట్ల అభిరుచి కలు గునట్లు ప్రోత్సహించుచు, వారి ఉత్సుకత చివర వరకు చెడ కుండ నవలలను పఠించునట్లు చేయుట వారి ధర్మము. ఆ విషయమును విస్మరించి రచయితలు ప్రవర్తించిన యెడల 'వారు నేలవిడిచి సాముచేసినట్లగు' నేగాని అశించిన ఫలితములు సమకూరజాలవు- ఈదృష్టితో భారతీయ భాషలనుండి ఆంధ్రభాషలోనికి పరివర్తనము చేయబడిన కొన్ని నవలలను గురించి సంక్షిప్తముగా ముందు తెలిపి, స్వాతంత్ర్యము సిద్ధించిన పిమ్మట తెలుఁగులో వెలువడిన చారిత్రక నవలలను గురించి ఆపిమ్మట ప్రస్తావింతును-

వంగ భాషలో శ్రీ ధీరేంద్రనాథ్ పాల్ వ్రాసిన Mysteries of the Moughal Court నవలను శ్రీ మొసలి

కంటి సంజీవరావు "మొగలాయిదర్బారు" పేరున నాలుగు భాగములలో తెనిగించెను. ఈ నవలలయందు మొగలాయి ప్రభుత్వమునందలి నిరంకుశ విధానము, భోగలాలసత, స్వార్థపరత్వము కన్నులకు గట్టునట్లు గోచరించును. ముఖ్యముగా జహాంగీరు, షాజహాన్, ఔరంగజేబు మున్నగు పాదుషాల పరిపాలనలో చెలరేగిన అంతఃకలహాములు, తత్ఫలితముగా ఉత్పన్నమైన అనర్థములు చిత్రింపబడినవి. అంతఃపురాలపు స్త్రీ పురుషుల, పిన్న పెద్దల, బలవంతుల బలహీనుల, సజ్జనుల దుర్జనుల, ప్రభువుల బానిసల, చిత్ర వృత్తులు, వేషభాషలు వర్ణింపబడినవి. షాజహాను పాదుషా యొక్క కుమార్తెలయిన రోషనారా, జహానారా పాత్ర పోషణ అత్యద్భుతముగా జరిగినది. ఈనవలలలో రసపుష్టుల గుణదోషములను సైతము శ్రీ ధీరేంద్రపాల్ పక్షపాతరహితముగా వివరించెను.

బహుభాషావేత్తయైన శ్రీ రాహుల్ సాంకృత్యాయన్ వ్రాసిన "జయ యౌధేయ" అను నవలను శ్రీ అలూరి భుజంగరావు ఆంధ్రీకరించెను. ఇందు క్రీ. శ. 350-400 ప్రాంతపు భారత రాజకీయ, సామాజిక స్థితిగతులు చిత్రితమైనవి. 'యౌధేయగణ' అను ఒక వీరజాతి యమునానదికి, హిమాలయ పర్వతములకు మధ్యనగల భూభాగమున నివసించుచుండెడిది. ఆ జాతివారు కుషానులను భారతదేశమున చికాకుపరచి పారద్రోలిన ధీరులు. చంద్రగుప్త విక్రమా

దిత్యుడు ఈ జాతివారిని ధ్వంసముగావించినను, నేటికిని వారు భారతదేశములో అచ్చటచ్చట గనుపించుచుందురు. ఈయన వ్రాసిన "దివోదాసు" అను మరొక నవలను శ్రీ భుజంగ రావే తెనిగించెను. దీనిలో క్రీ. పూ. 1220-1195 సంవత్సరములలో నివసించిన వేదకాలమునాటి ఆర్యుల మత, సాంఘిక, రాజకీయ జీవితము వర్ణింపబడినది. దివోదాసు ఈ నవలకు నాయకుడు. ఇతడు త్యన్తుగణనాకుయ్డైన వర్ధిష్ణుని కుమారుడు. దీనిలో ఆర్యగణములవారి ఆచారవ్యవహారములతోపాటు, వారికి అనార్యులైన కిరాతులు, వణులతో జరిగిన యుద్ధములు వర్ణితములైనవి. ఇది మార్క్స్ట్ దృక్పథముతోనడచిన నవల. ఈయన వేరొక నవల "సింహసేనాపతి". ఇది క్రీ. పూ. 5 వ శతాబ్దికి సంబంధించినది. ఆకాలపు చారిత్రక పరిస్థితులను వివరించుటకు శ్రీ రాహుల్‌జీ చేసిన కృషి అసాధారణమైనది. నేటి పరిస్థితులకు భిన్నమైన ఆనాటి పరిస్థితులను మిక్కిలి మెలకువతో అయన మనముందుంచెను.

శ్రీ హెచ్. సి. ఛటోపాధ్యాయ్ వంగభాషలో వ్రాసిన "ఉజ్జయిని పతనం" నవలను 'శ్రీ విజయ' ఆంధ్రీకరించెను. క్రీ. శ. 6 వ. శతాబ్దములో బుధగుప్తుడు ఉజ్జయినిని తన రాజధాని చేసికొని పాలించుచున్నప్పుడు శ్వేత హూణులు పెక్కు పర్యాయములు దండయాత్రలు సలిపిరి. బుధగుప్తుని సేనానాయకుడైన పుష్పభూపతి తన ధీశక్తితో, స్వభుజశక్తితో ఆ దండయాత్రలను తిప్పికొట్టుటచేత హూణ

రాజైన 'తోరమాణుడు' పరాక్రాంతుడై, స్వయముగా రణరంగ
మున దూకి కుతంత్రములు పన్ని పుష్పభూపతిని హత్య
చేయించెను. దానితో బుధగుప్తుడు ధైర్యమును గోలుపోయి
రాజ్యమును పురగుప్తునికి అప్పగించి యెటో వెడలిపోయెను.
అంతటితోను వారు వదలక పుర గుప్తుని సైతము హత్య
యొనరించి, ఉజ్జయినిని సర్వనాశనమొనరించిరి. అనాడు
చైనావాడు 'టి బ్బెట్టు'ను స్వాధీనపరచుకొనుటకు పన్నిన
పన్నాగములను రచయిత చక్కగా ఇందు వివరించెను. మన
మిత్రుడు సైతము నశ్యపుడై చేసిన వినాశనమునకు నోడ్పడిన
విధమును ఇందు రచయిత బాగుగా వివరించెను. ఉజ్జయినీ
పతనమునందలి చారిత్రిక సత్యములెట్లున్నను, ఈనాటి మన
దార్ఢ్యస్థితిగతులను ఇందు దర్శించగలము. ప్రతివారు
చదువతగిన మంచి చారిత్రిక నవల ఇది.

వంగ నవలా చక్రవర్తియైన శ్రీ బంకించంద్ర ఛటో
పాధ్యాయ్ రచించిన 'సీతారామ' నవలను శ్రీ వేంకట
పార్వతీశ్వర కవులు "సీతారామరాయలు" అన్న పేరున తెని
గించిరి. ఢిల్లీ చక్రవర్తియైన అక్బరు పాదుషా సన్నిధిలో
ఈ 'సీతారామ' అను సామాన్యుడు తన బాహుబలముతో,
బుద్ధిచాతుర్యముతో చెక్కు సాహసకార్యములనొనరించి మహా
రాజ బిరుదమునుగూడ పొంది, హైందవ సామ్రాజ్యమును
స్థాపించుటయేగాక, హిందూ ముస్లిములను సమానముగా
చూచి, కర్మసిద్ధాంతము ప్రతిబింబించునట్లు ధర్మ పరిపాలన

చేసిన ఆ వీరునిగాథ ఇది. ఈ నవలలో ఆనాటి చారిత్రిక వాతావరణము కన్నులకు గట్టును. భావ సజీవ సంపన్నమై యుండి పఠితలను తరిత లూగించుచుండును. ఆయన మరొక నవల "కపాలకుండల". దీనిని గూడ శ్రీ వేంకట పార్వతీశ్వర కవులే ఆంధ్రీకరించిరి. దీ ని లో మొగలు పాదుషాలైన అక్బరు; జహంగీరుల కాలమునాటి భోగ జీవి తములు, రాజకీయ, మత పరిస్థితులు వర్ణింపబడినవి. ఆనాడు మహమ్మదీయులకు, పఠానులకు మధ్య ఘోర సంగ్రా)ము ములు జరుగుచుండెడివి. పఠానులు మార్గమధ్యమున తమకు చిక్కిన హిందువుల, ధన మాన ప్రాణములను హరించుచు, బలవంతముగా వారిని మహమ్మదీయ మతములో కలుపుకొను చుండిరి. అటులనే ఈ దేశములో నూతనముగా ప్రవేశించిన క్రైస్తవులు తమ ప్రాబల్యముకొరకు హిందువులను అపహ రించి, వారి మతములో చేర్చుకొనుచుండిరి. ఒక ఓడ ప్రయా ణములో తీర్థయాత్రలు చేయుచు తనవారినుండి విడివడిన బ్రాహ్మణ యువకుడైన నవకుమారుడు, పరిస్థితుల ప్రభావ ముతో "లుత్ఫున్నిసా"గా మారిన అతని ప్రథమ భార్య యైన పద్మావతి, క్రైస్తవ మతస్థుల చురాగతముల నుండి ఒక ఓడ ప్రయాణములో బయటపడి కాపాలికునిచేత పెంచ బడుచున్న "కపాలకుండల" అను ఆ మువ్వురి మధ్య నడచిన విచిత్ర ప్రణయగాథయే ఈ నవల. దీనిలో కా పా లి క మతము పేరున ఆనాడు దేశమున జరిగిన ఘోర దుగంత

ములు, దుస్తంత్రములు, బలులు, హోమములు వర్ణింపబడి నవి. బంకింబాబు తన సునిశిత బుద్ధివైభవముతో ఈ నవల యందలి పాత్రల యన్నింటికి ప్రాణప్రతిష్ఠ సలిపి, అవి సజీవ సంపన్నముగా మసలునట్లు తీర్చిదిద్దెను.

విజయనగర సామ్రాజ్యము ఆంధ్ర చరిత్రలో అఖండ వైభవముగా వెలుగొందినది. ప్రతిభా సంపన్నులైన హరి హర, బుక్కరాయ సోదరులు విద్యారణ్యమహర్షి మహాదా శీస్సులతో, అండదండలతో హైందవమత సముద్ధరణము కంకణము కట్టుకొని ఈ మహారాజ్య సౌధమునకు గట్టి పునా దులను వేసిరి. సంగమ, సాళువ, తుళువ వంశీయులు రెండున్నరశతాబ్దములు మహా వైభవముగా దీనిని పాలించిరి. వారి పాలనాకాలమున సంభవించిన జయాపజయములను చరిత్రకారులు తమకు తోచినట్లు చిత్రించిరి. కన్నడములో శ్రీ కొరటి శ్రీనివాసరావు 'విద్యానగర చరిత్ర నవలా గుచ్ఛము' అను పేరున ఆ విషయమునే ఇరువది నవలలలో వ్రాసెను. శ్రీ 'శ్రీనివాసపురము' సోదరులు వానిని మధుర మైన భాషలో అంధ్రీకరించిరి. "జగన్మోహిని" పదకొండవ నవల. ఈ 'జగన్మోహిని' ప్రతాపరుద్ర గజపతి కూతురైన చిన్నమాదేవి. శ్రీకృష్ణదేవరాయలు తమ దిగ్విజయ యాత్ర లలో గజపతిని ఓడించి పోట్నూరువద్ద దిగ్విజయ స్తంభ మును నాటించి అతని పుత్రికయైన చిన్నమాదేవిని వివాహ మాడెను. తండ్రి ఆదేశమున ఆమె రాయలను చంపుటకు

కుట్రపన్నినది. రాయలు అది గ్రహించి ఆమెను పరిత్యజించుటయే ఇందలి ఇతివృత్తము. అతరువాత నవల "శాంతి వాణి". దీనిలో ఆవేశపరుడైన శ్రీకృష్ణరాయలు ఆనాలోచిత ముగ బీజాపుర సులతానులపట్ల ప్రదర్శించిన విచిత్ర రాజనీతి వలన "రక్కస తంగడి" యుద్ధము సంభవించి విజయనగర సామ్రాజ్య వినాశనమునకు దారితీసిన పరిస్థితులను శ్రీ శ్రీనివాసరావు హేతుబద్ధముగా వివరించెను. రాయలు తనకు ప్రాణప్రదుడు, మహామంత్రియు నైన తిమ్మరుసు హిత వాక్యములను సైతము కాదవినిపెట్టి ప్రవర్తించెను. శాంతి సందేశమిచ్చుటకై వచ్చిన శాంతి దూతను అవమానపరచి. కడకు తన ప్రాణాపాయస్థితిలో అతని చేతనే రక్షింపబడిన విధము ఇందు వివరింపబడినది. ఈ నవలా మూలికలో పదునేడవ పుష్పగుచ్ఛము "రఘునాథ విజయము". అఖండ శ్లేముషీ దురంధరుడు, రాజనీతి చతురుడు, కళాభోవిదుడూ, విద్వద్రాజ కవియునై, మధుర, తంజాపుర ప్రాంతములను వైభవోపేతముగా యేలినవాడు రఘునాథరాయలు. ఆంధ్ర భోజుడైన శ్రీకృష్ణదేవరాయలతో సర్వవిధముల తులతూగ గల సమర్థుడు అయన. ఆ ప్రభువు కాలమున దాక్షిణాత్యాంధ్ర వాఙ్మయము సర్వకళాశోభితమై, సర్వ సమృద్ధమై వెలుగొందిన విషయమే ఇందలి ఇతివృత్తము.

శ్రీ కె. వి. అయ్యరు కన్నడ నవల "శాంతల" ను శ్రీ తిరుమల రామచంద్ర తెనిగించెను. కర్ణాటక రాష్ట్ర

మునగల బేళూరు, హళెయవీడు నందలి ప్రాచీన దేవాలయ ముల శిల్ప సంపద యావద్భారత విఖ్యాతిగాంచినది. ఈ దేవాలయములను హోయసల ప్రభువైన శ్రీ విష్ణువర్ధన మహారాజు నిర్మించెను. ఆ మహారాజు, ఆయన పట్టమహిషి శాంతలాదేవికి సంబంధించిన సాంసారిక సంబంధమైన జీవిత రహస్యములను తెలుపు రసభండిక ఈ నవల. శ్రీ విష్ణువర్ధనుడు శాంతలను, ఆమె స్నేహితురాలైన లక్ష్మిని వివాహమాడినను, సింహాసనమును అధిరోహించగల కుమారుడు జన్మించకపోయెను. శాంతలకు ఇది చిక్కు సమస్యయై మనస్తాపమును కలిగించినది. రాజు, రాణి ఇరువురు తమకు అత్యంత సన్నిహితుడైన శ్రీ కుమార విష్ణువును యువరాజుగ చేయునంచిరి. అతడు వారికి తెలుపకయే "గరుడి" అయ్యెను. "గరుడి" అనగా రాజు మరణించినప్పుడు ఆయనతో ఇతడును ప్రాణత్యాగము చేయుట. ఇది ఒక వీరవ్రతము. ఆత్మత్యాగము - దీనితో శాంతల హృదయము గాయమైనది. కుమార విష్ణువును వెంటదీసికొని ఆమె తీర్థయాత్రకై శివగంగ క్షేత్రమునకుపోయి, శిఖరారోహణము చేయుచు దైవవశమున కాలుజారి కిందపడి మరణించినది. ఆ దృశ్యమును తిలకించిన కుమారవిష్ణువు పైనుండి కానును దూకి మరణించెను. ఈ జన్మతో రాజ్యభారమును మోయగల బౌరసుని కని ఇవ్వలేని శాంతల భక్తిభావముతో స్వశరీర త్యాగముచేసి, తన ఆత్మను లక్ష్మి శరీరములో నిలిపి, ఆమెదాఁగా

సంతానవతియై, తన వంశమును నిలిపిన మహా సాధ్వి-మహా పతివ్రత. ఆ దివ్య చరిత్రయే ఈ నవల. ఆ సుందర దేవాలయములను మలిక్ కఫూర్, గంగు సాలార్‌లు దోచుకొని ఆ అపురూప విగ్రహములను కళావిహీనమొనరించిరి.

శ్రీ యశపాల్ హిందీలో రచించిన "దివ్యా" అను బౌద్ధయుగపు నవలను శ్రీ పోలు శేషగిరిరావు రమ్యమైన భాషలో తెనిగించెను. పైదీక, బౌద్ధమతములమధ్య చెలరేగిన సంఘర్షణలను ఇది వివరించును. వర్ణాశ్రమ ధర్మముల పేరున అగ్రవర్ణములవారు మద్ర రాజ్యములో, కులతంత్ర గణరాజ్యము పేరుతో ఇతర వర్ణములపైన నిరంకుశముగా అధికారము నెరపుచున్నప్పుడు ధైర్యముతో దాసకులమునకు చెందిన పేష్ఠ మహా శ్రేష్టి పుత్రుడైన పృథుసేన్ ఆ వ్యవస్థను ప్రతిఘటించి విజయమును సాధించినను, ఆ రాజ్యములో వర్ణాశ్రమ ధర్మమునకు తథాగతుని అభిధర్మమునకు మధ్య తీవ్రమైన సంఘర్షణ ప్రబలినది. ప్రవర్ధమానాచార్యుల పుత్రుడైన ఆచార్య రుద్రధీర్ మొలకువతో వంశపరంపరాగతమై వచ్చుచున్న కులాధిక్యతను, ధనముతో కూలద్రోయుచున్న దాసులపైన అంతర్యుద్ధమును లేవదీసి కూకటి వేళ్ళతో వారిని పెకలించి వైదిక ధర్మమును పునఃప్రతిష్ఠ చేసి, యజ్ఞయాగాది మహా క్రతువులు, లలిత కళలు దేశమున ప్రవర్ధమానమగునట్లు ప్రోత్సహించెను. ప్రధాన పాత్రయైన 'దివ్యా' అభిజాత్య వర్గమునకు చెందిన వయో

వృద్ధులు, న్యాయ నిర్ణేతలు నైన దేవశర్మ ప్రిపౌత్రి సాగల్ నగరమునందలి మల్లికాదేవి కళామందిరమున గుమిగూడిన రాజ్యాధినేతలు, ప్రజల సమక్షమున తన అసాధారణ కళా నైపుణ్యముతో అమె నాట్యము సలిపి, మంత్రముగ్ధులను గావించి 'సరస్వతీ పురస్కార' అను అత్యున్నత గౌరవ బిరుదమును పొందగలిగిన భాగ్యశాలిని. పృథుసేన్ అమెను ప్రేమించి, గర్భవతియైనప్పుడు మోసగించగా, ఆత్మాభిమానముతో అపట్టణమును వదలి విదేశములలో భానిసయై యమయాతనల నసుభవించి, చివరకు ప్రాణాపాయస్థితిలో మధురా పురి జానపద నర్తకియైన రత్నప్రిభ చే రక్షింపబడి, తన నాట్యచతురతను అమె కళామందిరమున ప్రదర్శించి, తన కీర్తిలతలను దిగంత విశ్రాంతమొనరించుకొని, మాతృసమానురాలగు తన గురుదేవియైన మల్లికాదేవి ఆజ్ఞిననుసరించి తిరిగి సాగల్ నగరమునకుపోయి, సరస్వతీ కళామందిరమునకు ఉత్తరాధికారిణి కాబోవుచున్నప్పుడు సభలోని కొందరు అమెను అభిజాత్యవంశయైన 'దివ్యా' గా గుర్తించి వేశ్యలకు యోగ్యమైన ఆ పీఠము నలంకరించుటకు వీలులేదని అభ్యంతరము తెలిపి, తుదకు న్యాయనిర్ణేతయైన రుద్రధీర్ తీర్పునకు వదలిరి. సభా సమక్షమున ఆయన ఇచ్చిన తీర్పుననుసరించి అమె తిరిగి ఆ నగరమును వదలిపోవునప్పుడు మోహావేశముతో అతడే ఆమెను కలసికొని వేశ్యలకు యోగ్యమైన ఆ పీఠమునుగాక, తనను వివాహమాడి కులమహాదేవి పీఠము నలంకరించి సర్వ

సుఖముల ననుభవించవలసినదని ప్రార్థించెను. దివ్యా లియన
ర్థోరికను తిరస్కరించినప్పుడు, ఆపక్కనే సన్యాసి వేషములో
నున్న ఆమె పూర్వ ప్రేమికుడైన పృథుసేన్ తథాగతుని పాద
పద్మముల నాశ్రయించి తనతో కలసి జీవించి నిర్వాణ పథ
మును పొందమని కోరినను నిరాకరించి; తనవలెనే మాన
వతావాది, సామాన్యుడు మహాశిల్పియైన 'మారిష్' అభ్యర్థి
నను మన్నించి, తన నారీ ధర్మమునకు మూలభూతమైన
సృష్టికి అతడే యోగ్యుడని గ్రహించి "ఆర్యా! ఆశ్రయ
మివ్వండి" అని రుద్ధకంఠముతో అతని హస్తములలో తన
హస్తములను వుంచినది. ఈ నవలయంతి ప్రతి పాత్ర, సన్ని
వేశము, ప్రతి వాక్యము హృదయమును స్పందింపజేయును.
ఈ నవల శుష్క వేదాంతపరమైన కులవ్యవస్థకు ప్రతీకయైన
మోక్షమునుగాని, తథాగతుని పేరున చెప్పబడుచున్న
నిర్వాణపథమునుగాని కాక, యదార్థమైన దీన మానవసేవను,
పతితజనోద్ధరణను చేసి తోటి మానవులపట్ల మమతతో
మెలగవలసినదని ప్రబోధించుచున్నది. సంగీత నాట్యకళా
మర్మజ్ఞురాలైన 'దివ్యా'కు, మహాశిల్పియైన 'మారిష్'నకు
చివరన ప్రేమ సంబంధమును కల్పించి ముగింపులో కథకు
రచయిత చక్కని సమన్వయమును కలిగించెను.

బుద్ధభగవానుని దివ్య సందేశమును, మహిమను వివ
రించు ఆయుగపు మరియొక నవల "అంబాపాలి". శ్రీరామ
రతన్ భటనాగర్ ఈ నవలను శ్రీ కె. రమేష్ తెనిగించెను.

శ్రీ గురుదత్ హిందీలో వ్రాసిన "పుష్యమిత్ర" నవలను శ్రీ కందర్ప రామచంద్ర ఆంధ్రీకరించెను. పుష్యమిత్ర పంగుడు మౌర్యవంశజుడైన బృహద్రథుని వధించి మగధ రాజ్యమును వశపరచుకొని అశ్వమేధయాగము చేసిన విషయము ఇందలి ప్రధాన ఇతివృత్తము. వైదిక, పౌరాణిక వాఙ్మయమును విమర్శనాదృష్టితో పరిశీలించిన శ్రీ గురుదత్ భగవద్గీతాతత్వమును ఇందు వివరించుటయేగాక, నేటి భారతీయ పరిస్థితులను తెలిపి ప్రజల కర్తవ్యమును ఒక ప్రవక్త వలె బోధించుటవలన, దీనిలో చారిత్రిక, పౌరాణిక నవలల కుండవలసిన విలక్షణత కొంత లుప్తమైనది.

వైదిక సాహిత్యము నంతటిని పుక్కిట బట్టిన శ్రీ కె. యం. మున్షీ ఋగ్వేదకాలమునాటి ఆర్యుల ప్రారంభ జీవితమును వివరించునట్టి "విశ్వరథుడు" నవలను గుజరాతీభాషలో వ్రాసెను. దానిని శ్రీ వేమూరి ఆంజనేయశర్మ తెనిగించెను. ఆనాడు వరుణుడు సర్వ ప్రియుడైన దేవత. అగ్ని, సూర్య, సోములు ఆపిమ్మట వారి ఆరాధ్యదేవతలైరి. ఈ ఆర్యులు అనార్యులైన దస్యులపైన పెక్కు యుద్ధములుచేసి క్రమముగా వారిని లొంగదీసికొనిరి. ఆర్యులు గౌరవర్ణులు. సుందరులు. పొడవైనవారు. ఆనాడు స్త్రీలు, పురుషులు, ఋషులు కాగలిగిరి. ఋషిపదవిగాని, రాజ్యపదవిగాని జన్మచేతగాక, కర్మచేత లభ్యమయ్యెడిది. స్త్రీలు విద్వాంసులై పురుషులతో సమాన గౌరవప్రతిపత్తులను కలిగియుండి వివిధరకము

లైన వృత్తులను చేయుచుండిరి. దస్యులు లేక దాసులు కృష్ణ వర్ణులు. బలవంతులు. వారిది చప్పిడి ముక్కు. ఈ దేశమున అనాదికాలమునుండి నివసించిన జాతి అది. అనాడు సామా న్యులు మద్యము, ఋషులు మున్నగువారు సోమ రసము సేవించుచుండిరి. వర్ణాశ్రమ ధర్మములు ఇంకను ప్రారంభము కాలేదు. ప్రాణము, ఆత్మవంటి శబ్దములు వాడుకలో లేవు. గాయత్రీ మంత్రమునకు సంఘములో మంచి ప్రభావముండెడిది. ఆ మంత్ర ప్రభావముతోనే రంగు భేదము నశించి, సంస్కారము, సభ్యతనుబట్టి సంఘములో వారి స్థానము నిర్ణయింపబడెడిది. ఈ నవల వలన మనకు వేదకాలమునాటి నాగరికత, సంస్కృతి విశదమగును.

స్వతంత్ర చారిత్రక నవలలు.

శ్రీ కందుకూరి యుగమునకే స్వతంత్ర తెలుఁగు చారిత్రక నవలా రచనమునకు ప్రారంభోత్సవము జరిగినది. ఆనాడు సర్వశ్రీ ఖండవిల్లి రామచంద్రుడు, చిలకమర్తి లక్ష్మీనరసింహం, భోగరాజు నారాయణమూర్తి, కేత వరపు వేంకటశాస్త్రి, శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి, వేంకట పార్వతీశ్వర కవులు ఒకవైపు అన్యభాషలనుండి పెక్కు నవలలను అనువాదము చేయుచునే, మరొకవైపు స్వతంత్ర రచనలను గూడ చేయుచు, వానికి జనాదరణ లభించునట్లు ప్రయత్నించిరి. తెలుఁగు చారిత్రక నవలలకు ప్రత్యేక ప్రతి

పత్తిని, విశిష్టతను సమకూర్చి నవ్యరీతులలో దానికి రూప కల్పన చేసి మనకందించిన ప్రతిభాశాలురు శ్రీ విశ్వనాథ, శ్రీ అడవి, శ్రీ నోరి. ఈ త్రిమూర్తులలో తెలుఁగు చారిత్రక నవల శ్రీ విశ్వనాథ చేతిలో పరిపక్వత నందినట్లు స్వాతంత్ర్యము లభించకముందు వెలువడిన చారిత్రక నవలలను వివరించు సందర్భమున తెలిపియుంటిని. స్వాతంత్ర్యానంతరము వెలువడిన చారిత్రక నవలా రచయితలలోను పైచేయి అయినదే. నవలా రచన అయినకొక హేలాలీల. శ్రీ విశ్వనాథ గతములోవలె కేవలము ఆంధ్రేతిహాసములతో తృప్తిజెందక కాశ్మీర, నేపాలదేశములకు సంబంధించిన చారిత్రక విషయములను ఇతివృత్తములుచేసి నవలలను వ్రాసెను. "మిహిరకులుడు" నవల అట్టి వానిలో ఒకటి. ఇందలి కథ శ్రీ కల్హణ పండితుని "రాజతరంగిణి" లోనిది. ఆ కథను నవలకనుకూలముగ పెంచి వ్రాసెను. ఈ మిహిరకులుడు హూణుడని పాశ్చాత్య చరిత్రకారులు భావించిరి. అతడు హూణుడు కాడని సుప్రతిష్ఠితుడని, కాశ్మీరదేశపు రాజని శ్రీ విశ్వనాథ సప్రమాణముగా వివరించెను. ఈ మిహిరకులుడు క్రూరుడు. ఇతని ప్రవృత్తి యంతయు ఇందు వివరింపబడినది. ఆ రాజు క్రూరతకు రచయిత కల్పించిన కల్పనలన్నియు సమంజసముగానున్నవి. అతడు తాను "రాముడ" నని గూడ భావించెను. రాముడు లంకను జయించెను. ఇతడు లంకను జయించెను. ఇతని భార్య మహా పతివ్రత - కథాకథన దక్షురాలైన శ్రీ విశ్వ

నాథ ఈ నవలను తనకు సత్యమని తోచిన రీతిలో మలిచెను. శ్రీ విశ్వనాథ నేపాలుదేశ చరిత్రకు సంబంధించి వ్రాసిన నవల "దిండుక్రింద పోకచెక్క". ఇది కపట శాక్యసింహుని కథ. ఇతడు శాక్యమునియైన బుద్ధుడు కాడు. కపట సన్యాసి. ఐదువేల అరువదియేండ్లకు పూర్వము నేపాలు రాజ్యము నేలిన "జితేదాస్తి" మహారాజు కాలమున అంధ్రుడైన 'శాకయ్య' తన భార్యాపిల్లలను ఇక్కడ వదలి, కపటయోగి రూపమున అక్కడికిపోయి పన్నిన కుట్రలు, చేసిన మాన భంగములు, తలపెట్టిన దురాలోచనములు, దుష్ట వ్యూహాములు, అతడు చివరకు పొందిన విషాద మరణము, ఈ నవలలో వర్ణింపబడినవి. అతడు శ్రీకృష్ణుని విరోధి. రచయిత మహాభారత యుద్ధకాలమునాటి రాజకీయ పరిస్థితులను, సాంఘిక మతాచారములను వివరించుటకు ప్రయత్నించెను. శైలీ భద్రసన్నత, వర్ణనానిపుణత రెండును సమృద్ధిగాగల అయన జితేదాస్తి, శాకయ్య, గోస్వామి, గీలా మున్నగు వారి పాత్ర చిత్రణములో ప్రదర్శించిన ప్రతిభ ప్రశంసనీయమైనది. పాశ్చాత్య చరిత్రకారులు మన పురాణేతిహాసము లకు తప్పుడు కాలనిర్ణయముచేసి, వక్ర భాష్యముతో అప మార్గము పట్టించిరని తలచి అయన కాశ్మీర, నేపాలదేశ చరిత్రలకు సంబంధించిన నవలలతోపాటు, పురాణ వైర గ్రంథమాల పద్ధతిన "ధూమకేతు", "నందోరాజభవిష్యతి", "అమృతవల్లి", "పులిమురుగ్గు" నవలలను వ్రాసిరి. శ్రీ విశ్వ

నాథ తన మేధాసంపత్తితో కాను నమ్మిన రీతిలో వివరించిన కార్యకబద్ధమైన ఈ చారిత్రక సత్యములను నేటి చరిత్రకారులు శ్రద్ధగా పరిశీలించి యదార్థ విషయములను లోకము నకు వెల్లడిచేయవలసియున్నది.

చారిత్రక నవలా రచనలో కొత్త బాణిని ప్రవేశపెట్టి పెక్కు నవలలు వ్రాసి భావి రచయితలకు కవిసమ్రాట్ శ్రీ నోరి నరసింహశాస్త్రి మార్గదర్శకుడైన విధమును మొనుక తెలిపి వారి కొన్ని నవలలను పరిచయము చేసితిని. శ్రీ శాస్త్రి వ్రాసిన "కవిసార్వభౌముడు" అట్టివానిలో మరొకటి. దీనిలో పదిహేనవ శతాబ్దపు ఆంధ్రసాహిత్య చరిత్రకు యుగకర్త యైన శ్రీనాథ కవి సార్వభౌముని జీవితము, ఆయన సలిపిన సాహిత్య ప్రస్థానములు వర్ణింపబడినవి. దక్షిణాపథము వందలి ప్రముఖ రాజ్యములైన కొండవీడు రెడ్డి ప్రభువులు, విజయనగరమునేలిన శ్రుఙ్గేరి సంస్థానము, రాచకొండ వేలిక్లైన వెలమ ప్రభువుల రాజ్యములతో ఆయనకున్న సన్నిహిత సంబంధము వివరింపబడినది. శ్రీనాథుడు తన పాండిత్య ప్రకర్షను ప్రదర్శించుటకై విద్యానగరమునకుపోయి శ్రీకృష్ణదేవరాయల కొలువులో విద్యాధికారియైన డిండిమ భట్టును ఓడించి, ఆయన కంచు ఢక్కాను పగులగొట్టించి, ముత్యాల పందిరిలో కనకాభిషేకము చేయించుకొని మహా సభా సముఖమున కవిసార్వభౌమ బిరుదమును స్వీకరించి, అచ్చటినుండి రాచకొండకుపోయి పెక్కుమంది పండితులను

గెలచి దిగ్విజయముతో గొండవీడు చేరుకొనుటతో కథ సమాప్తమైనది. శ్రీ శాస్త్రి గొన్ని సందర్భములలో అచ్చటచ్చట చరిత్రలో పారంపర్యముగా వాడుకలోనున్న గొన్ని విషయములను మార్చి, తమ నవలా రచనకు అనుకూలముగా చేసికొనిరి. దీని వలన పాఠకులకు గొన్ని సందేహము లేర్పడును. "ధూర్జటి" అయన వేరొక నవల. శ్రీకృష్ణ దేవరాయ ప్రభువుల అష్టదిగ్గజ కవులలో ఈ ధూర్జటి ఒకడు. ఇతడు పరమ భక్తాగ్రేసరుడు. శ్రీ కాళహస్తి మహాత్మ్యము, శ్రీ కాళహస్తీశ్వర శతకము వ్రాసిన దిట్ట. ధూర్జటి నవలలో ప్రధానమైన కథలు నాలుగు. (1) ధూర్జటి కథ (2) మోహినీ, మదనికల కథ (3) శిల్పి శిర లూత కథ (4) శ్రీకృష్ణదేవరాయల కథ. ఈ కథా చతుష్టయమును రచయిత ఏకసూత్రగ్రథితముచేసి, అందలి విభువు పెడకుండగ పఠితలకు కడవరకు ఉత్సుకత కలుగునట్లు వర్ణనలుచేసి, పాత్రల వేషభాషలు, మనోభావములు సహజశోభావంతములుగా నుండునట్లు రూపకల్పనచేసెను. "శివభక్తి" ఈ నవలకు మూలము. ప్రాణము. అయినను శ్రీ శాస్త్రి ఇతరుల హృదయములకు నొప్పి కలుగకుండునట్లు శివకేశవులకు అభేదమును చూపుచు కథను నడచిన పద్ధతి సర్వశ్లాఘనీయమైనది. శ్రీ శంకర భగవత్పాదుల అద్వైత సిద్ధాంతములను ఆయన నవలలు ధ్వన్యంతరముగా వివరించుచున్నవి.

"ఛంఘీజ్ ఖాన్" అను చారిత్రక నవలను శ్రీ తెన్నేటి

సూరి ప్రవాసి, ప్రప్రథమమున ఆంధ్రపత్రిక సారస్వతానుబంధ
ములో ప్రకటించెను. అపిమ్మట అది గ్రంథరూపమున వెలు
వడినది. క్రీ. శ. 12, 13 శతాబ్దముల మధ్యగల ఆసియా
ఖండ చరిత్రకు మహత్తర గర్వకారకుడైన మహాపురుషుడు
ఛంఘిజ్ ఖాన్. ఆ మహా వీరునికి సంబంధించిన యదార్థ
చరిత్రను తెర మరుగునకు నెట్టి పాశ్చాత్య చరిత్రకారులు
అతనిని మహా హంతకుడుగను, అధికార దుర్మదాంధుడుగను,
శాసన నియంతగను, నరరూప రాక్షసుడుగను తమ చరిత్ర
గ్రంథములలో వివరించిరి. క్రీ సూరి ఎక్కు శ్రమలతో
యదార్థ చరిత్రను ప్రాచ్య, పాశ్చాత్య చరిత్ర గ్రంథములను
అవలోకనచేసి, మిక్కిలి దక్షతతో ఈ నవలను మధురమైన
వ్యావహారిక భాషలో నిర్మించెను. దీనిలో ఛంఘీజ్ ఖాన్
మానవతా దృష్టితో చేసిన ఆలోచనలను, ఆయనకుగల
పరిపాలనా దక్షతను, యుద్ధ తంత్రములను నెరపుటలో గన
బరచిన శక్తి సామర్థ్యములను, తన క్రింది అధికారులపట్ల
కనబరచిన ప్రేమాదరములను చక్కగా వివరించెను. చైనా
వాజ్మయము నంతటిని ఆపోశనబట్టి, మహా వీరుడని ప్రఖ్యాతి
వహించిన ఛంఘీజ్ ఖాన్ సోదరుడైన "చమూగాఖాన్"
పాత్రను సైతము సమర్థవంతముగా మలిచి, అతడు తన సోద
రుని ఘన విజయములకెట్లు తోడ్పడినది వివరించెను.
చమూగా భార్యయైన "ఖుర్చాన్" పాత్రచిత్రణలోను, ఒమూ
జిన్, సుబుటాయ్, ఖాఖాన్‌జి మున్నగువారి సాహసములను

వివరించుటలోను రచయిత ప్రదర్శించిన ప్రజ్ఞ అసాధారణమైనది. 12, 13 శతాబ్దముల ఆసియాఖండపు ఆర్థిక, రాజకీయ, సామాజిక పరిస్థితులను ఇందుచక్కగా దర్శించవచ్చును.

ప్రముఖ నాటకకర్త, సంస్కృతాంధ్రాంగ్ల భాషలలో చక్కని అభినివేశముగల శ్రీ కాళ్ళకూరి నారాయణరావు వ్రాసిన "ప్రతాపరుద్రమదేవి" నవలలో కాకతీయులనాటి చారిత్రిక, భౌగోళిక, రాజకీయ, మత, సాంఘిక పరిస్థితులు చక్కగా వ్యక్తము చేయబడినవి. ఈ నవలలో రచయిత కల్పిత పాత్రలకుగాక, ఆనాటి చారిత్రిక వ్యక్తులకు, తత్సంబంధమైన సంఘటనలకు ప్రాధాన్యతను కల్పించి వారి వేషభాషలను, మానసిక చిత్తవృత్తులను చిత్రించుటకు ప్రయత్నించెను. రుద్రమదేవియే ఈ నవలకు ప్రధాన నాయిక యైనను, ఆమె సింహాసనమును అధిరోహించుటకు వ్యతిరేకించిన వ్యక్తులను, ఆ వ్యక్తులు పన్నినకుట్రలను, వానికిగల కారణములను చాకచక్యముతో వివరించెను. మహాదేవరాజు దుర్బుద్ధితో చేసిన దాడిని, దానిని ప్రతిఘటించుటకు సలిపిన ప్రయత్నములును నేర్పుగా వివరింపబడినవి. సామాన్య వీరుడొకడు ప్రభుభక్తితో చేసిన యుద్ధము, తత్ఫలితముగా అతడు మహారాణి పదవిని పొందిన "విజయ విహార" పతకము నవలలో బాగుగా వివరింపబడి పఠితలకు మంచి ఉత్తేజమును కలిగించును. ఈ నవలలోని శైలీ విన్యాసము, తెలుఁగు నుడికారపు తీపి, చతుర వర్ణనలు పఠితలను చివర

వరకు ఉత్సుకతతో చదివించగలవు. అసంపూర్తిగా ఉన్న ఈ నవలను "శ్రీ వాత్సవ" పూర్తిచేసి మంచి పీఠికను వ్రాసెను.

కళాప్రపూర్ణ శ్రీ కొండూరు వీరరాఘవాచార్యులు తన "కళారాధన" నవలలో 12వ శతాబ్దపు ఆంధ్ర, తమిళ, కన్నడ దేశములకు సంబంధించిన మత, రాజకీయ, కళాసంస్థ్రలను వివరించెను. దక్షిణాపథ శిల్పచరిత్రకు మకుటమని చెప్పదగిన జక్కణాచార్యుల దివ్యగాథయే ఈ నవల. ఆ మహా శిల్పి హోయసల ప్రభువైన వీరబల్లాలదేవుని కోరిక ననుసరించి శ్రావణ బెళగొళయందు 60 అడుగుల గోమటేశ్వరుని విగ్రహమును అత్యంత రమణీయముగా తీర్చిదిద్దెను. జక్కణకు, అతని కుమారునికి, చలువ చన్నిగరాయమూర్తికై నిర్ణయించిన శిలాదోషమునకు సంబంధించి నడచిన వివాదము ఇందు పొందుపరచి తుదకు దానిని చమత్కారముగా పరిష్కరించి కథను రచయిత్రి ముగించినది. చారిత్రిక నవలలకు ఇది మేలుబంతి. ఆయన మరొక మంచి నవల "మోహనాంగి". ఆమె సాహితీ సమరాంగణ సార్వభౌముడైన శ్రీకృష్ణదేవరాయల పట్టమహిషి తిరుమలదేవికి జన్మించినది. ఈమె ఆర్వీటి అళియరాయల అర్ధాంగి. "మారీచీ పరిణయ" మను శృంగార ప్రబంధమును రచించిన కవయిత్రి - ఈమె చెలికత్తె బసివి. రాయలు తమ ఏకైక కుమారుని మరణముతో స్వర్గస్థుడైన పిమ్మట వారసులమధ్య రాజ్యకాంక్షతో చెలరేగిన కుమ్ములాటలు, అంతఃకలహములు

ఇందు చక్కగా వివరింపబడినవి. తళ్ళికోట యుద్ధములో అళియ రామరాయలు వీరస్వర్గము నలంకరించిన వార్త విని మహా పతివ్రతయైన మోహనాంగి తన ఇహయాత్రను చాలించినది. తనవారందరి మరణములను చూచి సహించ లేని "బసివి" యోగమార్గమున పరమేశ్వరునిలో ఐక్యమైనది.

ఆచార్యత్రయములోని వాడైన శ్రీ రామానుజాచార్యులు విశిష్టాద్వైత మతస్థాపనకై ప్రయత్నించినపుడు యెదురొక్కిన చిక్కులను, పడిన శ్రమలను, శత్రువులు ఆయువును బంధించుటకై పన్నిన కుట్రలను, కుతంత్రములను ఆ ప్రమాదములనుండి బయటపడుటకు ఆ మహానీయుడు సలిపిన ప్రయత్నములను, వివరముగను, ఆకర్షణీయముగను "రామానుజుని ప్రతిజ్ఞ" అను నవలలో శ్రీ పి. రాజగోపాలనాయుడు యుక్తి యుక్తముగా వివరించెను. శ్రీ రామానుజులు పతిత జనోద్ధరణకు, అస్పృశ్యులకు సంఘములో స్థానమును కల్పించుటకు చేసిన ప్రయత్నములు అనితర సాధ్యమైనవి. తియమంత్రమును అందరికిని బోధించి తన మతములో తరతమ భేదములు లేవని చాటి, తనపై క్రోధముతో రాళ్లు విసిరినవారికి సైతము చిరునవ్వులను అందించిన ప్రేమ స్వరూపము – తన మత ప్రాబల్యముకొరకు ఆయన రాజుల నాశ్రయింపక ప్రజల ఇష్టానిష్టములకు ఆ సమస్యను వదలిపెట్టిన చతురుడు. శైవమతావలంబియైన కులోత్తుంగ చోళరాజు తన అధికారదర్పముతో శైవులు కానివారు తన రాజ్యమున

ఉండుటకు వీలులేదని శాసించినను లెక్కచేయక ఆయన పన్నుగడలను ధైర్యముతో యెదుర్కొని ప్రజా హృదయములను తనవైపు మళ్ళించుకొనగలిగెను. దానితో రాజు తన తప్పిదమును గ్రహించి మతసంబంధమైన ఆ ఆంక్షను తొలగించినేగాని, ఆపిమ్మట సంభవించిన పరిణామములను చూడజాలక ఆయన ఇహలోకయాత్ర ముగించెను. దీనితో శ్రీ రామానుజాచార్యులకు విజయము లభించి ఆయన చేసిన ప్రతిజ్ఞ నెరవేరినది. ఈ నవల యందలి ముఖ్య పాత్రలలో రామానుజుడు, కులోత్తుంగుడు, తిల్యా, త్రిపురాంతకుడు, సోమదేవుడు, కురేశుడు ముస్సగువారు పాఠకుల హృదయములపైన చెరగని ముద్ర వేయగలరు. 'తిల్యా' వేశ్యయైనను తన జాతి ధర్మములను పాటించక, గోవిందరాజస్వామిపై భక్తిని ప్రదర్శించి నాట్య గాన విద్యలలో ఆ స్వామి అనుగ్రహమును సంపూర్ణముగా పొందుటకు ప్రయత్నించి సఫల మనోరథురాలైనది. ఈ చారిత్రక నవల ఆపాత మధురముగానున్నను, ఇందు మత ప్రాబల్యముకొరకు కేవలము నైవులే దురాచారములను చేసిరని చెప్పుట కొంత అతిశయోక్తిగా నున్నది. ఆనాడు శైవ, వైష్ణవ లిరువురును తమ తమ ప్రాబల్యములకొరకు పాటుబడి ఒకరినొకరు హింసించుకొనిన సత్యమును విస్మరించుట ఆంత సమంజసము కాదేమో!

చరిత్ర ప్రసిద్ధినందిన 'జహాంగీర్ - నూర్జహాన్' ల ప్రేమోదంతములను శ్రీ యస్. రామచంద్ర "నూర్జహాన్"

అను నవలలో చిత్రించెను. పెరిషియానుండి భారతదేశమునకు వలస వచ్చిన గయాన్ బేగ్, మొగలాయి దర్బారులో ఉద్యోగము చేయుచుండెను. అతని కూతురు మెహరున్నిసా. ఆమె అపురూప లావణ్యవతి. జహంగీర్ ఆమెను ప్రేమించెను. ఇది గ్రహించిన అక్బరు మొలకువతో "షేర్ ఖాన్" అను వానితో ఆమెకు వివాహము జరిపించి, ఆ ఇరువురిని వేరొక ప్రదేశమునకు పంపించెను. జహంగీర్ వ్యామోహముతో ఆమె భర్తను చంపించి "నూర్జహాన్" అను పేరుతో వివాహమాడి తన పట్టమహిషిగా చేసికొనెను. నవల చివరనగల రెండు పేజీలలో తెలిపిన చారిత్రక సత్యములను ఇంకను చక్కగా విడమరచి చెప్పి, నవలను నిర్వహించినచో దానికి మరింత దీప్తి చేకూరి యుండెడిదేమో!

శ్రీ తిక్కనసోమయాజి కవిత్రయములో ద్వితీయుడై, ఉభయ కవి మిత్రుడు, కవి బ్రహ్మ బిరుదములతో 'ఆంధ్రావళి మోద' మందునట్లు, బుధులు సంతోషించు రీతిలో అమృతము జాలువారునట్లు నిర్వచనోత్తర రామాయణ, మహా భారతాది గ్రంథములను జాను తెనుగులో వ్రాసి, శివకేశవా భేదమును నిరూపించుచు 'హరిహర నాథ తత్వము' ను ప్రతిపాదించి, తన కాలమున చెలరేగిన మత కల్లోలములను, భాషా విషయక వాగ్వివాదములను రూపు మాపిన మహామహుడు. అయన మనుమసిద్ధి మహారాజునకు మహా మంత్రియై, శాంతిదూతయై వెలుగొందెను. బహు

ముఖినమైన ఆయన జీవిత చరిత్రను, రాజనీతి చతురతను, యుద్ధవ్యూహ నిర్మాణదక్షతను, బహుముఖ పాండితీ ప్రకర్షను వివరించుచు "తిక్కన సోమయాజి" అను చారిత్రక నవలను శ్రీ తుమ్మలపల్లి రామలింగేశ్వరరావు లిఖించెను. ఈ రచయిత తిక్కన సోమయాజి, ఖడ్గతిక్కన, మనుమసిద్ధి మహారాజు, చిన చానమ్మ, పెద చానమ్మ మున్నగు వారి గుణశీలనులను తీర్చిదిద్దుటలో గనబరచి నేర్పు ప్రశంసనీయమైనది. ఈ నవలలో శ్రీ రామలింగేశ్వరరావు తిక్కన సోమయాజిని గురించి నేడు దేశమున ప్రచారమందున్న కొన్ని చారిత్రకాంశములకు భిన్నమైన విషయములను కల్పించి వ్రాసినను, అవి సమయోచితముగానుండి, ఆయా సందర్భములకు అతుకునట్లుగాను, హృదయానందకరముగాను ఉన్నవి. ఇందలి విషయములను పండితులు శ్రద్ధతో పరిశోధించినచో తిక్కనను గురించిన వివాదాంశమైన పెక్కు సమస్యలకు తగిన పరిష్కారమార్గము లభించునని తోచును.

"మధురావిజయ" మను నామాంతరము గల "వీరకంపరాయలు" అను నవలను శ్రీ వేలమూరి ప్రసాదరావు రచించెను. 1371 వ. సం॥ విజయనగర ప్రభువైన కుమార వీరకంపరాయలు, సాళువ మంగరాజు, సాళువ గోపన్న మున్నగువారి సహాయముతో మధుర నాక్రమించిన, నజీరుద్దీను దామ్ఘన్‌షాను యుద్ధమున ఓడించి మ్లేచ్ఛులను అచ్చటి నుండి పారద్రోలిన ఉదంతము ఇందలి ఇతివృత్తము.

'మాణిక్యాంబ' అను దేవదాసి 'సింగప్పరాను' అను విప్రుడు, సులతానును పరాభూతుని గావించుటలో కంపరాయలకు తమ సర్వాశిక్తులతో తోడ్పడిరి. వైష్ణవులకు శ్రీరంగమే "పెరియ రంగము". తిరుపతి "సిరియ రంగము". ఇవి రెండును వారికి దివ్యక్షేత్రములు. శ్రీరంగ దేవుని నిత్యము సేవించుచు మాణిక్యాంబ హైందవధర్మ వ్యతిరేకియైన సులతానుపైన పగబట్టి అతనిని లోబరచుకొని చంపి, తానును మరణించినది. ఈ మహాకార్యమున ఆమెకు "సింగప్పరాను" తోడ్పడెను. రచయిత ఆమె అపూర్వ కార్యములనేగాక, దక్షిణాపథమున హైందవ మత సంస్కృతీ పునరుజ్జీవనమునకు తోడ్పడిన విద్యారణ్యస్వామి, వేదాంత దేశికులను గురించి విపుల ముగా వివరించెను. వేయి పుటల నాక్రమించిన ఈ నవల వలన అపూర్వమైన పెక్కు చారిత్రక సత్యములు తెలియగలవు.

ఆచార్య డాక్టర్. కె. వి. ఆర్. నరసింహం వ్రాసిన "కనకాభిషేకము" నవలలో శ్రీనాథ కవిసార్వభౌముడు దేవ రాయల సభలో డిండిమభట్టును వాదమున ఓడించి, కనకాభిషేక సత్కారమును పొందిన విషయము, తదనంతర పరిస్థితులు వర్ణింపబడినవి. దీనికి తొలిపలుకు వ్రాయుచు ఆచార్య డా॥ శ్రీ దివాకర్ల వేంకటావధాని "ఆ కనకాభిషేకము నిజ మునకొక్క శ్రీనాథునికి మాత్రమే జరిగినదికాదు. ఒక విధ ముగా నది ఆంధ్ర సరస్వతికి కూడ జరిగిన కనకాభిషేకమని చెప్పవచ్చును" అని అన్న మాటలు యదార్థము. సత్యము.

అద్భుత కల్పనలతో, వివిధ రసాశ్రయమైన డిటెక్టివ్ నవలా సాహిత్యము

ద్వితీయ ప్రపంచ సంగ్రామము ముగిసిన పిమ్మట డిటెక్టివ్ నవలా సాహిత్యము తుఫానువలె విజృంభించి విశ్వము నంతటిని చుట్టుముట్టి కోట్లకొలది పఠితల హృదయములను ఆకట్టుకొనినది. భారతదేశమునందలి తదితర జాతీయ భాషలలో వలెనే ఆంధ్ర భాషలోను స్వాతంత్ర్యము సిద్ధించిన అనంతరము ఈ శాఖా సాహిత్యము అభివృద్ధి చెందినంత నవలలోని తదితర శాఖలేవియు అభివృద్ధి చెందలేదు. నేను ఆంధ్రదేశమునందలి యే మారుమూల తుగ్రామమునకైనను పోయి, యే క్లీసాపులో చూచినను 'డిటెక్టివ్ నవలలు అద్దెకు ఇవ్వబడును, అనునట్టి బోర్డు కనుపించును. పది సంవత్సరముల వయస్సునుండిన విద్యార్థినీ విద్యార్థులనుండి విశ్వవిద్యాలయములలో విద్య సభ్యసించువారి వరకు, పూరి గుడిసెలలో జీవించు మామూలు అక్షరాస్యులనుండి, పెద్ద పెద్ద ప్రాసాదములలో నివసించు విద్యాధికులవరకు, సామాన్య బంట్రోతుల నుండి ప్రభుత్వ యంత్రాంగమును నడుపు మహా మేధావులవరకు, వయోభేదమును పాటింపక అందరును వీసిని అత్యంత కుతూహలముతో పఠించి తన్మయత్వము జెందుచున్నారని చెప్పినచో అది అత్యుక్తి యెంతమాత్రము కానేరదు. ఈ సాహిత్య సంబధమైన ఏజంట్లు రైల్వే పార్శిల్సు విప్పి విప్పక మునుపే, కొందరు పఠితలు యెగబడి

వాటిని కొని ఆ పెంటనే విప్పి చదువుకొనుచు యేవేవో మధు
రానుభూతులతో మార్గము పెంట నడచిపెళ్ళి వారిని ప్రతి
బస్తీలోను చూడగలము. కొందరు రోజుకు పది పైసలనుడి,
ఇరువది పైసల వరకు ఒక్కొక్క పుస్తకమునకు అద్దె చెల్లించి
నిద్రాహారములను సైతము మరచి వీనిని పఠించుచుందురు.
ఇంతటి విస్తృత ప్రచారముతో, ఇంతటి జనాకర్షణముతో
నిత్య నూతనముగా వర్ధిల్లుచూ పఠితల నాకర్షించుచున్న ఈ
డిటెక్టివ్ సాహిత్యమును కొందరు పెద్దలు ద్వేషబుద్ధితో 'శవ
సాహిత్య' మని, 'అశ్లీల సాహిత్య' మని చెప్పుచు పెదవి విరచి
ఈసడింపుతో వెక్కిరించుచుండుటయు గోచరమగును. దీనికి
గల కారణమేమి? ఈ సాహిత్యమునందలి లోపమా? వాడి
దృష్టిలోపమా? అనునది విచారించవలయును. ఈ రకమైన
సాహిత్యము మానభంగములతో, హత్యలతో, భూగృహా
ములతో, భూతగృహములతో, కొండగుహాలతో, కుమ్ము
లాటలతో, గుద్దులాటలతో, మారణాయుధములతో,
వికృతవేషములతో, విపరీత వర్ణనలతో నిండియుండి
యదార్థ మానవజీవితమునకు విరుద్ధముగను, జుగుప్సాకర
ముగను, అభూత కల్పనలతోను, సమ్మిశ్రితమైయుండును
గనుక దానిని పఠించినచో, అట్టి వారి మానసిక
స్థితిగతులు పాడై పోయి, అధోగతి పాలగుదురని
వారి భయము. ఎవరైనను చెడిపోవుటగాని, బాగుపడుట
గాని వారి వారికి గల సంస్కార బలమునుబట్టి, అదృష్ట

బలమును బట్టి యుండునుగాని గ్రంథ పఠనము వలన బరుగదేమో! ముఖ్యముగా ఈ సాహిత్యమున అనాధల పట్ల, అమాయకులపట్ల, బలహీనులపట్ల; బలవంతులు, పలుకు బడిగలవారు, మతము పేరుతో ప్రేమ పేరుతో, రాజకీయ, ఆర్థిక, సాంఘిక సమస్యల పేరుతో, జరుపు మోసములను, కుట్రలను, కుట్రలను, ముసుగులో జరుపు కుమ్మక్కులను స్వార్థరహితులైన "డిటెక్టివులు" సత్య బుద్ధితో, సమ్యక్ బుద్ధితో అహోరాత్రములు శోధన చేసి, నేరస్తులను పట్టుకొని. నేర నిరూపణముగావించి, వారి అపరాధమునకు తగిన శిక్ష విధింపబడునట్లు చూచుట తమ విద్యుక్తధర్మమని వారు భావించి పనిచేయుచుందురు. గనుక ఇట్టి సాహిత్యమునుబూని యెవరును బడుసుకొన నక్కరలేదు. తదితర సాహిత్య ప్రక్రియల వలెనే ఇదియు గుణదోషముల పోహళించి గ్రహించిన చాలును. ఇందును వాస్తవిక జీవితమునకు సంబంధించిన మధురాతి మధురమైన సన్నివేశములెన్నియో గనుపించును. ఈ పుస్తకములపైన ఆకర్షణ నిమిత్తమై వేయు బొమ్మలను చూచిగాని, వాటికి పెట్టబడిన పేర్లను చూచిగాని భయపడనక్కరలేదు. వానిని చదివి, అందలి మంచిని స్వీకరించి, దోషములను పరిహరించవచ్చును. ఈనాడు డిటెక్టివ్ సాహిత్యమును ప్రోత్సహించుటకై వెక్కు పత్రికలు వివిధ భాషలలోను వెలువడుచున్నవి. ఆ నవలలు వెండితెర నాక్రమించి ప్రజాహృదయములను రంజింపజేయు

చున్నవి. ఇట్టి స్థితిలో వాటిని అనాదరణతో ఈసడించు కొనుట మంచిది కాదేమో! ఆ విషయమును సహృదయులైన వాచకుల కే వదల వేయుట మంచిదనిభావించి, ఇంతటితో ఆ చర్చను ముగింతును. ఇక నేడు ఈ సాహిత్యశాఖపైన విమర్శన చేయబూనుట అకస్మమున చుక్కలను లెక్కించుటకు ప్రయత్నించుట వంటిదే యగునేమో! "వాచవి" కొరకు నాలుగైదు నవలలను ఇచ్చట పరామర్శించి ముగింతును.

శ్రీ కొమ్మూరి సాంబశివరావు వ్రాసిన నం. "666" ఒక మంచి డిటెక్టివ్ నవల. ఇది దేశభక్తిని, కర్తవ్యనిష్ఠను ప్రబోధించు రచన. "పరిస్తాన్" గూఢాచారులు అకారణముగా పగబట్టి, కుట్రలుపన్ని ఈ దేశమున అంతఃకలహాములను రేపి, అస్థిరపాటు చేయుటకు ఒక గూఢాచారిముఠా పని చేయుచున్న సంగతిని ప్రభుత్వము గ్రహించి స్పెషల్ గూఢచారిని ఆ దేశమునకు విషయసేకరణకై నం. 666 పంపినది. అతడు తన విద్యుక్తధర్మమును నేర్పుతో నిరవేర్చుచు ప్రాణాపాయస్థితిలోను వెనుకంజవేయక పెక్కు రహస్యములను సంపాదించి తిరిగివచ్చునపుడు "నళిని" అను యువతి అపురూపసౌందర్యమునకు మోహపోయి, ఆమెకు బుండీగా చిక్కెను. "666" పంపిన నీలిరంగు కవరు తప్ప అతని జాడలు తెలియక ప్రభుకార్యాధినేతలు కల్లోలపడుచున్నప్పుడు మద్రాసులో అంతర్జాతీయ ఖ్యాతి నార్జించి నృత్యప్రదర్శనలు చేయుచున్న కుమారి చిత్రలేఖను, ఆమె ప్రియుడు మేజర్ విూనన్‌ను,

ఢిల్లీలో హోంశాఖ ముఖ్య కార్యదర్శి శిర్మలరావు భార్య సుశీలా దేవిని ఒక క్రిమి పద్ధతిలో హత్యచేయుటకు గల కారణములు గ్రహించలేక హోంమంత్రి సిన్హా, అపరాధ పరిశోధకశాఖ ఉన్నతాధికారి భండార్కర్ ఆదేశముల ననుసరించి డిటెక్టివ్ యుగంధర్, అతని సహాయకుడు రాజు, తమ చాకచక్యముతో, శక్తిసామర్థ్యములతో, యుక్తి ప్రయుక్తులతో శత్రువుల ఆచూకీని కనుగొని ఆ ముఠాకు నాయకురాలైన "నళిని" ని, ఆమె సహచరులను వశపరచుకొని ఉత్తమ దేశభక్తుడైన '666' ను ఈ అపాయమునుండి తప్పించిన ఉదంతమే ఇందలి ఇతివృత్తము. "నళిని" పరిస్థాన్ గూఢాచారి ముఠాకు నాయకురాలైనను, ఆ వృత్తియుమున్నస్త్రీ. తమ దేశ వైపు వృత్తిధర్మము ననుసరించి, తన ప్రభుత్వ ఆదేశములను నిర్వహించినను, వేరొక వైపు తన ధర్మములోని అవకతవకలను అక్రమములను సహించలేక అంతర్మథనముతో అలమటించిన వివేకవతి. ఆమె తన మనోవేదనను నాం "666" తో తెలుపుచు చెప్పిన ఈ మాటలు, యెంతటి విలువైనవో, లోతైనవో గమనించండి - "నా మాతృదేశముపట్ల నాకున్న బాధ్యతకీ, నా ప్రేమకీ సంఘర్షణ యేర్పడింది. రెండింటిలో ఏదో ఒకటి త్యజించాలి. నీలా నేను ఒక సామాన్య గూఢచారిణిని అయినట్లైతే, నా దేశం తరఫున గూఢాచారిత్వం సాగించేందుకు నాకన్న పెద్ద అధికారులు ఉండివుంటే తప్పకుండా, గూఢాచారిత్వం త్యజించి నీకు దాసురాల్ని అయ్యే

దాన్ని..." (పేజి 85). "పి)యుడా! విద్యుత్కధర్మమా!" అన్న విచికిత్సతో ఆమె పొందిన ఆవేదన, అంతర్మథన ఉపాత్తమైనది. ఆ విచికిత్సతోనే ఆమె తన విద్యుత్కధర్మమును విస్మరించి మన గూఢాచారులకు తోడ్పడినది. ఆమె చేసిన సహాయమునకు కృతజ్ఞతగా ప్రభుత్వము ఆమెపైన చర్యనైతొలగించి స్వేచ్ఛాస్వాతంత్ర్యములనిచ్చినప్పుడు తన మాతృదేశమునకు వెళ్ళక భారతదేశపు పౌరసత్వమును కోరిన విశాలహృదయ ఆమె. ఇది ఉన్నతస్థాయి డిటెక్టివ్ నవల.

"హంతకుడు పిలుస్తున్నాడు", "ప్రాణభయం పరుగెత్తిస్తోంది" అను ఈ రెండు పృథమ, ద్వితీయ భాగములుగా వెలువడిన ఒకే డిటెక్టివ్ నవల. రచయిత శ్రీ గిరి శ్రీ భగవాన్ ఈ నవలాద్వయమున 1972-73 సం. లలో చెలరేగిన ప్రత్యేక ఆంధ్రరాష్ట్రోద్యమమునుండి, ప్రధానమంత్రి శ్రీమతి ఇందిరాగాంధి ప్రకటించిన షట్సూత్ర పథకమువరకు గల మధ్య భాగమును పృష్ఠభూమి చేసి దీనిని వ్రాసెను. జపానుదేశ గూఢాచారులు తమ స్వప్రయోజనములకొరకు ఆంధ్రోద్యమమును ఎట్లు వినియోగించుకొనినది ఇందు వివరించెను. విదేశ గూఢాచారి, హంతకుడు నైన నం. 117 ఈ మహోద్యమమును పెడమార్గము పట్టించుటకు ఈ దేశమునగల ధనవంతులను, రాజకీయనాయకులను, పలుకుబడిగల వ్యక్తులను బెదరింపులతో, హత్యలతో లొంగదీసికొని వారిని తన కీలుబొమ్మలుగా మార్చికొని ఇష్టమువచ్చినట్లు

ఆడించెను. గూఢాచారి శాఖ ఉద్యోగులు. డిటెక్టివ్ నరసన్ సహాయముతో ఆదుర్గార్గుల ముఠా ఆటకట్టించుటకు పడిన శ్రమ, యెదురొక్కొనిన చిక్కులు లెక్కించ నలవి గానివి. నెం. 117 ఇచ్చట అల్లకల్లోలములను సృష్టించుటకై రహస్యముగా ఆయుధములను ఒకచోటినుండి, వేరొకచోటికి చేరవేయుచు అల్లరిమూకలకు తోడ్పడిన విధమును, ప్రాణము శూణప్రాయముగా నుంచి ఐ. జి. పి. కుమార్, డిటెక్టివ్ నరసన్‌లు, ఆతని యెత్తులకు పై యెత్తులు వేసి లోబరచుకొనిన విధమును రచయిత నేర్పుతో చిత్రించెను. నెం. 117 ప్రాణాపాయస్థితిలో పడుగెత్తి, చివరకు నరసన్‌కు లొంగిపోయినప్పుడు ఆ ఇరువురి మధ్య నడచిన సంభాషణలు ఉన్నత పరిమాణములతో కూడినవై ఔచిత్యభరితమై పఠితలను తన్మయత్వపరచును. చూడండి- "చావు బ్రతుకులమధ్య గొట్లు మిట్టాడుతూ కూడ ఇంతటి ఆత్మ విశ్వాసాన్ని కలిగివున్న మీతో విరోధాన్ని పెట్టుకోవాల్సి వచ్చినందుకు విచారిస్తున్నాను! అయినా మీ అంతటి మేధావికి ప్రత్యర్థి నైనందులకు నాకు గర్వంగా వుంది." అన్నాడు నెం. 117 నెమ్మదిగా నరసన్‌కు గల నీతిని, నిజాయతీని మెచ్చుకొంటూ. "వృధా కాలయాపనెందుకు? కర్తవ్యం ముందు మన అంతఃకరణలు లొంగిపోకూడదు- కమాన్- ఎటాక్! నా గొంతు చుట్టూ నీ చేతులని బిగించు" అన్నాడు నరసన్ గంభీరముగా. "సారీ! మిమ్మల్ని చంపలేను- చంపను" అంటూ

డిటెక్టివ్ గొంతు చుట్టూ ఉన్న చేతుల్ని వెనక్కి తీసుకొని "మీ ఇష్టం! మీరు వచ్చేంతవరకూ అనుభవించటానికి సిద్ధమే" అని చెప్పి తలవంచుకున్నాడు నెం. 117. "ప్రత్యర్థి తనంతట తానుగా తలవంచుకున్నాడు. ఆలాంటి వాడిని బంధించటమా?" అంటూ నవ్వేశారపోయాడు సర్వన్. (ద్వి. 85 పే). సమాన ధాయాగల ఆ ఇరువురు యోధులు తమ తమ ప్రాణ ములకన్న వృత్తి ధర్మాకు, మానవధర్మాకు ఇచ్చిన విలువలు యెంతటి ఉదాత్తమైనవో పై సంభాషణలు మనకు వ్యక్తపర చును. నెం. 117 నరహంతకుడైనను, ప్రత్యర్థియొక్క శక్తి సామర్థ్యములను గ్రహించి మానవ ధర్మమును, వృత్తి ధర్మ మును ఉల్లంఘించి పట్టి, ఇక సర్వన్- చేతికందిన శత్రువు లోని బలహీనతలతోపాటు, మంచినిగూడ చూచి ఆరెంటికి 'బేరీజు' కట్టి అతనిని ప్రాణములతో విడిచిపెట్టి, అతని పక్ష మున ఐ. జి. పి. కుమార్ తో హోరాహోరీగా పోరాడి, వాదించి తాను చేసిన పని ధర్మసమ్మతమైనదని నిరూపించు కొని చివరకు అధికారుల ప్రశంసల నందుకొనిన చతురుడు.

"మిస్ ఇండియా" అను మిస్టరీ నవలను రచించిన శ్రీ విశ్వప్రసాద్ లోగడ వెక్కా డిటెక్టివ్ నవలలు వ్రాసి లబ్ధప్రతిష్ఠుడైన రచయిత. "మిస్ ఇండియా" పోటీలలో పాలుగొనగలందులకు ఆహ్వానాలపడుచు వచ్చిన తొమ్మిది మంది అపురూప సౌందర్యవతులను విదేశ ముఠాకు చెందిన కొందరు వ్యక్తులు వారిని వేరువేరుగా కలసికొని యోగనిద్రా

వివశులను చేసి వశపరచుకొనజూచిరి. డిటెక్టివ్ "భగవాన్" తన బుద్ధికుశలతతో 'మిస్ ఇండియా గా' ఏన్నుకొనబడిన మిస్ మాలతో పాటు మిగిలిన వారందరిని ఆ దుష్ట వ్యూహమునుండి సురక్షితముగా కాపాడెను. ఈ నవలలో భాష సరళముగానుండి, పఠితలు చివర వరకు చదువునట్లు రచయిత గొప్ప సన్నివేశముతో కథను మలచినతీరు ప్రశంసాపాత్రమైనది.

ఈవిధమైన నవలా రచయితలలో ప్రముఖుడైన శ్రీ పెంపోరావు రచించిన "కిల్లర్ మేనియర్" ఒక మంచి నవల. మోహన్ అను యువకుడు "సుధ" అను యువతిని ప్రేమించి వివాహమాడెను. ముక్తానందస్వామి అను సన్యాసి ఆ సంసారములో ప్రవేశించి సుధను తన దానినిగా చేసికొనుటతో మోహన్ హృదయము వికలమైపోయినది. దానితో అతడు కిల్లర్ మేనియర్ గా మారి కాషాయ వస్త్రములు ధరించి, దేవుని పేరుతో, మోక్షము పేరుతో దుస్తంత్రములు చేయుచు, అమాయక స్త్రీలను వశపరచుకొని కామవిలాసములతో మోసగించువారిని తన పరశువుతో హత్యలుచేయుటయేగాక, తన మార్గమునకు అడ్డువచ్చిన పెక్కుమందిని హతమార్చి మద్రాసు పట్టణమును అల్లకల్లోలమొనరించెను. డిటెక్టివ్ వాలి, అతని సహచరుడు గిరి, పోలీసు ఐ. జి. పి. ఈ హంతకుని అన్వేషణములో తమ సర్వశక్తులను వినియోగించి ఫలితమును పొందజాలక విసిగిపోయిరి. ఆ స్థితిలో శ్రీ పుట్టపర్తి సాయిబాబావారు మద్రాసునకువచ్చి, భక్తులకు దర్శనమిచ్చు

చున్నప్పుడు ఆ హంతకుడు పూర్వమువలెనే సన్యాసులపైన పగదీర్చుకొనుటకు ప్రయత్నించి, స్వామివారి దివ్య మహిమలకు ముగ్ధుడైపోయి, తనకుకావాల్సిన స్వామీజీకి లొంగిపోవుటతో కథ ముగిసిపోయినది. మోసప్రవృత్తిగల ముగ్గురు వ్యక్తులకు, దివ్యపురుషులకు మధ్యగల తారతమ్యమును రచయిత ఈ నవలలో ప్రతిభతో చూపి "సత్యమేవ జయతే" అను ఆర్ష సిద్ధాంతమును మహోదాత్తరీతిలో వివరించెను. శ్రీ సత్య సాయిబాబా వారి నోటినుండి వెలువడిన వేదాంతపరమైన ఈ దివ్య సందేశమును మీ ముందుంచి దీనిని ముగింతును-చూడుడు. "భగవంతుడు సర్వాంతర్యామి. ఇక్కడ ఉన్నాడు- అక్కడ లేడని చెప్పడం మూర్ఖత్వం-" "నగలకు అనేక రూపాలుండొచ్చుకాని అన్నీ బంగారంతో చేసినవే! శరీరం రంగులు వేరైనా లోన ప్రవహించే రక్తం ఒకటే! అహం మనుషులను వేరుచేస్తోంది అహం అదృశ్యమైతే సృష్టిలోని ఐక్యత మనకు గోచరిస్తుంది-" "గ్లాసునిండా నీళ్లున్నాయి. నీళ్ళ అడుగున పంచదార వుంది. నీళ్ళను తాగితే తీపిగాలేదు. పంచదారను కలపాలి. నీళ్ళలో అది పూర్తిగా కరిగాక తాగితే తీపిగా వుంటాయి. పంచదారలా భగవంతుడు ప్రతిచోట దాగివున్నాడు. ఆధ్యాత్మిక సాధనచేసి దైవం తీపిని మన జీవితంలో కలుపుకోవాలి. ఇది చేయలేక అనేకులు జీవితంలో తీయదనం లేదంటారు. సూర్యుడు ప్రకాశించడంలేదని గుడ్డివాడన్నట్లుంది."-

శ్రీ జనప్రియ "డెవిల్స్‌క్లబ్" ఒక మంచి మిష్టరీ డిటెక్టివ్ నవల. పాకిస్తాన్ గూఢాచారులైన జాన్సన్. రీటాలు తండ్రి చిడ్డలవలె నటించి 'డెవిల్స్‌క్లబ్' ను స్థాపించి, ఒక పట్టణములో రామారావు, సరిత, కృష్ణమూర్తి, సంగయ్య, లక్ష్మీకాంతమ్మ మున్నగువారిని హత్యలుచేసి, ఆ శవములను డమ్మీస్థైలెన్సర్‌తో కాల్చి దయ్యాలుగా మారినట్లు భ్రమ కల్పించి వారిని తమ చెప్పుచేతలలో నుంచుకొని, పరలోకముల పేరుతో మోసగించుచున్నప్పుడు ప్రఖ్యాత డిటెక్టివ్ పేమ్‌కీ, రిపోర్టర్ రాజు, ఇన్‌స్పెక్టర్ ఈశ్వరరావు, శారాణి ఈ రహస్యములను కనిపెట్టి, తమ అపూర్వ పరిశోధనలతో దోషుల కుట్రలను బట్టబయలు చేసి వారి ఆటలను విచిత్రముగా కట్టించిన కథ ఈ నవల.

ఫై డిటెక్టివ్ నవలలతోపాటు ఈ క్రింది రచయితల కొన్ని రచనలను గూడ ఇక్కడ పేర్కొని ఈ ప్రకరణమును ముగింతును- శ్రీ ఆరుద్ర "పలకల వెండిగ్లాసు"; శ్రీ కృష్ణ మోహన్ "పాపాలభైరవుడు"; శ్రీ ఎం. ఆర్. ఎన్. ప్రసాదరావు "కిస్ మి నాట్-మిస్ మి నాట్"; శ్రీమతి ప్రసన్నకుమారి "వాచ్‌డాగ్"; శ్రీ సాయి "ఎగిరే మనిషి"; శ్రీ విశ్వమోహన్ "చీరముడి-కత్తిపిడి"; శ్రీ భయంకర్ "దెయ్యాలదీవి"; శ్రీ చిత్ర "నరరూపరాక్షసి"; శ్రీ జై భగవాన్ "గరత్ హుంటక్స్"; శ్రీ ప్రతాపరావు "అద్దెకో ఆడది"; శ్రీ బ్లూస్ స్టైర్ "భగవాన్"; శ్రీ అంకిశ్రీ "అందుకే చంపాను";

శ్రీమతి కిరణ్‌కుమారి "చిచ్చర పిడుగు"; శ్రీ విజయబాపినీడు "సుడిగుండంలో బోడిగుండు"; శ్రీ కొప్పిశెట్టి "సౌండ్ ఆఫ్ హార్న్"; శ్రీ కనకమేడల "మహామాయి"; శ్రీ శరత్ బాబు "మృత్యుభయం పీడిస్తోంది" మున్నగునవి-

ఆకార వాక్ చేష్టా విన్యాసములతో కడుపుబ్బ నవ్వించు

తెలుఁగు హాస్య నవలలు - ౬

శ్లో: శృంగార హాస్య కరుణ రౌద్ర వీర భయానకాః
భీభత్సాద్భుత శాంతాశ్చ నవనాట్యే రసాఃస్మృతాః

శ్రీభరతమునీ తమ "నాట్యశాస్త్ర" మున యెనిమిది రసములను పేర్కొనగా, ఆ గ్రంథ వ్యాఖ్యాతయైన భట్టోద్భటుడు పై నవరసములను పేర్కొనెను. క్రమముగా అవి పెరిగి, పెరిగి "అనంతా వైరసాఃు" అను సిద్ధాంతమువరకు ప్రాకిపోయినవి. మన ఆలంకారికులు నవరసములకు ఆశ్రయమైన మానవ జీవితమునకు రసదాయిని శృంగారము పిమ్మట హాస్యమునకు ద్వితీయ స్థానమునిచ్చి గౌరవించరి. శృంగార హాస్యరసములు రెండును, అవినాభావ సంబంధములు కలిగియుండి జీవితమునకు నిత్య వసంతారామములు నొనరించుచున్నవను సంగతిని గురించి వేరుగా చెప్పవలసిన పనిలేదుగదా! గనుక హాస్యము యొక్క ప్రాముఖ్యతను గురించి అన్యముగా చెప్పవలసిన దేమియులేదు. హాస్యమునకు స్థాయీభావము హాసము-

అనగా నవ్వు - ఆనందము. "విక్రుతాకార, వాగ్వేష, చేష్టాదేర్ష్యాకోర్భవేత్" అను త్రివిధములు హాస్యమందు అని సాహిత్యదర్పణ గ్రంథకర్తయైన శ్రీ విశ్వనాథుడు తెలిపెను. (1) విక్రుతమైన ఆకారము (2) విక్రుతమైన వాక్కు (3) విక్రుతమైన చేష్ట. వీని నాశ్రయించి హాస్యము ఉత్పన్నమగును. (1) ఆకార చేష్టలవలన కలుగు హాస్యము బాహిరమైనది. (2) వాక్కు అనగా మాటలు (శబ్దములు) వలన జనించు హాస్యము ఆంతరమైనది. అనగా మానవుల స్వరూప, స్వభావ, చేష్టల వలనను; వారి విచిత్ర వాగ్వ్యాపారముల వలనను, హాస్యముపుట్టి, అది సర్వులకు ఆనందమును కలిగించుచున్నది. ఈ త్రివిధగామియైన హాస్యమును కవులు, రచయితలు, కళాకారులు, శిల్పులు, నటులు లోకమునుండి తాము పొందిన అనుభూతితో, అనుభవముతో, సముపార్జించిన విజ్ఞానముతో ఉత్తేజితులై, మరల దానిని తమ బుద్ధి వైభవముతో తీర్చిదిద్ది లోకమునకందించి, అది సర్వకాలీనమై, సర్వజనీనమై వర్ధిల్లునట్లు చేయుచుందురు. సంస్కృత నాటకములలో విమూషకుడు తన ఆకార వేషభాషలతో కలిగించు నట్టి హాస్యము ఎంతటి విశిష్టమైనదో వేరుగా చెప్పనక్కరలేదు! మొన్న మొన్నటివరకు తోలుబొమ్మలాటలలో "కేతిగాడు" "బంగారక్క" యెంతటి రసభరితమైన హాస్యమును సామాజికుల కందించి కడుపుబ్బ నవ్వించిరో తెలియనివారుండరను కొందును. హరికథలలో హాస్యమునకున్న ప్రాధాన్యత

అసలు కథకు గూడ లేదనిన అది అతిశయోక్తి యెంత మాత్రము కాజాలదు. ఎంత ఉత్తమ నాటకమైనను, లేక సినిమాయైనను, సర్వజనాదరణ పొందవలెనన్నచో అందులో హాస్యము పాలు అధికముగా నున్నప్పుడే సాధ్యమగుచున్నది. సర్కస్‌లో జిఫ్సూన్ వేషమునకు, అతని విచిత్ర చేష్టలకు ఉన్నంత ప్రాముఖ్యత తదితర ప్రముఖ సన్నివేశములకు లేదు గదా! అబంతా, అమరావతి, నాగార్జున కొండలలోని చిత్ర, విచిత్రమైన వింత బొమ్మలు పొట్ట చక్కలగునట్లు నవ్వించ గలుగుచున్నవి. శ్రీనాథుడు, తెనాలి రామలింగడు, కూచి మంచి భట్టకవి మున్నగు పండిత ప్రకాండులు తమ ప్రబంధ రాజములలోను, చాటువులలోను నిబంధించిన హాస్యమును గురించి యెంతచెప్పినను తక్కువే యగును - వేయేల. భారత దేశమును యేకచ్ఛత్రముగా పాలించిన అక్బరు పాదుషా దర్బారులో బీర్బలు అను నాతడు అను నిత్యము తన హాస్య ప్రసంగములతో శ్రోతలను పొట్ట వ్రయ్యలగునట్లు నవ్వించి రంజింపజేయుచుండెడి పడట! దీనినిబట్టి హాస్యరసము జీవిత ప్రగతికి చాల ముఖ్యమని, అది మానవునికిగల అశాంతిని, చిత్త దౌర్బల్యమును, చాంచల్యమును తొలగించి మానసిక ానందమును ప్రసాదించగల దివ్యౌషధమని గ్రహించిన చాలును. ఈ దృష్టితో తెలుఁగులో హాస్యగపప్రధానములైన నవలలను గురించి ఇచ్చట కొంత వివరింతును. ప్రథమ నవలా రచయితగా తెలుఁగునాట కీర్తింపబడుచున్న శ్రీ వీరేశలింగం

పంతులు వ్రాసిన "సత్యరాజా పూర్వదేశ యాత్రలు" అను నవలయే, హాస్యరస ప్రధానమైన ప్రథమ తెలుగు నవల అని పండితుల పరిశోధనలు విశదపరచుచున్నవి. ఈ నవల యందు సత్యరాజాచార్యుల దక్షిణ దేశ యాత్రలకు సంబంధించిన కథ వర్ణింపబడినది. అది రెండు భాగములు. మొదటిది ఆడ మళియాళము. రెండవది లంకాయాత్ర. మొదటి దానిలో ఆయన అవహేళనతో నిండిన హాస్యమును, రెండవ దానిలో సంఘటనాత్మకమైన హాస్యమును చొప్పించి తెలుగుపు పాఠకి అందించెను. ఆపిమ్మట ఆయన శిష్యుడైన శ్రీ చిలకమర్తి "గణపతి"; "దుంధుభి" అను రెండు హాస్య ప్రధానమైన నవలలను వ్రాసెను. "గణపతి" వలెనే "దుంధుభి" ఒక అంద వికారమైన దౌర్భాగ్యురాలు. ఆ ఇరువురి ఆకారములు, చేష్టలు, మాటలు హాస్యపూరితములై నవ్వు తెప్పించును. ఈ రెండు నవలలలోను ఆకారచేష్టాగతమైన హాస్యము అధికము. శ్రీ పానుగంటివారి "సాక్షి" సంపుటములు నవలలు కాకపోయినను, అందలి పాత్రలు, విషయము, సంభాషణలు కడుపుబ్బ నవ్వించగలవు. సాక్షి, జంఘాలశాస్త్రి, కాలాచార్యులు, బొర్రయ్య శెట్టి, వాణీదాసు మున్నగువారి వేషములలో, సంభాషణలలో, చేష్టలలో వ్యంగ్య గర్భితమైన హాస్యము తొణికిసలాడుచుండును. వేషగత, వాక్యగత హాస్యములందు సమృద్ధిగా లభించును.

శ్రీ మొక్కపాటి హాస్యమును, అంగిరసముచేసి "బారి

ష్ణు పార్వతీశం" నవలను రచించెను. అది ప్రారంభించి
నప్పటినుండి మూగియుండిపోవువరకు కడుపుబ్బ నవ్వించుచుండుము.
తెలుఁగులో నేటివరకు వెలువడిన హాస్యరస ప్రధానములైన
నవలలకు అది పతాక. దానిలో ఆకార, వాక్, చేష్టాగత
ములైన త్రివిధ హాస్యములు మిళితములైయుండును.

హాస్యబ్రహ్మ శ్రీ భమిడిపాటి కామేశ్వరరావు నవలా
రచన చేయుక పోయినను, ఆయన రచనలన్నియు భావగర్భిత
మైన హాస్యమును కలిగించి, పఠితలను తన్మయుల నొనరించును.

శ్రీ మునిమాణిక్యం భార్యాభర్తల గార్హస్థ్య జీవితము
నకు సంబంధించిన చిత్ర విచిత్రమైన సన్నివేశములను తన
నవలలకు ప్రధాన ఇతివృత్తములుచేసి. శృంగారపరమైన వారి
చతుర సంభాషణలతో నిండిన రసభరితమైన మధుర హాస్య
మును తెలుఁగువారి కందించిన చరితార్థుడు. ఆయన రూప
కల్పనము చేసిన అపురూప లావణ్యవతియైన 'కాంతం'
తెలుఁగు సాహిత్యమనడి సమున్నత సౌధ సీమలో నిత్య దర
హాస చంద్రికలను విరజిమ్మి పుత్తడి బొమ్మ

శ్రీ అడవి బాపిరాజు "కోనంగి" నవలయందలి ముఖ్య
పాత్రయైన కోనంగి నడవడిలోను, మాటలలోను, చేష్టల
లోను సున్నితమైన హాస్య చిత్రణము గోచరించును

శ్రీ విశ్వనాథవారి "విష్ణుశర్మ ఇంగ్లీషు చదువు" ఒక
అధిక్షేప రూపక హాస్యనవల. దీనిలో మొదటినుండి తుదివరకు
వ్యంగ్యభరితమైన హాస్యము చిప్పిలుచుండును. ప్రధానముగా

ఇందు శబ్ద, వాక్యగతమైన హాస్యము ప్రతి సంభాషణలోను నిబద్ధంపబడియుండి, నేటి సాంఘిక స్థితిగతులను, విద్యావిషయక పరిస్థితులను వర్మగర్భితముగా యెత్తిపొడుచుచుండును. విష్ణుశర్మ శ్రీ విశ్వనాథను "ప్రతి సభలోను చెప్పిన విషయమునే మరల మరల చెప్పినచో శ్రోతలకు విసుగు పుట్టదా?" అని ప్రశ్నించినప్పుడు ఆయన ఇచ్చిన సమాధానము యెంత గడుసుగను, అధిక్షేపయుక్తముగను ఉన్నదో గమనించుడు. "వాళ్లు ఎప్పుడూ వినరండీ. సభలో కూర్చున్న వాళ్ళందరూ వాళ్ళల్లో వాళ్లు నవ్వుకుంటూ వుంటారు. మాట్లాడుకుంటూ వుంటారు. వాళ్ళు వినసే వినరు. వాళ్ళదారి వాళ్ళది. నాదారి నాది. వాళ్ళు ఒక్కటే వింటారు. వాళ్ళసు పని పించేందుకు మధ్యమధ్య మేమందరమూ కొంచెం శృంగార రస విషయకంగా, కొద్ది గా అసభ్యంగా మాట్లాడుతూ ఉంటాము. వాళ్ళు దానిని మాత్రం వింటారు. ఆ విన్న ప్పుడు పెద్దగోలచేస్తారు. అందుచేత వాళ్ళు మా ఉపన్యాసాలు వింటారని లేదు. ఒకటే ఉపన్యాసం ఎన్నాళ్ళు చెపితే ఏం? ఆ మూడు విషయాలతో ముప్పై ఏళ్ళు గడిపాను. ఏమో! ఇంకొక పదిదేళ్ళు గడవకపోతుందా" అని (46 పేజి). విష్ణుశర్మ స్వర్గలోకములో తనకూ, దేవేంద్రునికీ మధ్యనడచిన కథ నంతటిని వివరించి, విశ్వనాథతో "పాల ముంచినా నీట ముంచినా నువ్వే" వన్నాడు ప్రాధేయపూర్వకముగా. అప్పుడు ఆయన "మాకు పాలూ, నీళ్లు రెండు

విడి విడిగా ఉండవు. కలిసే ఉంటాయి. ఇల్లు దూరమైన కొద్దీ నిళ్ళెక్కువ వస్తవి" అని (43 వ. పేజీ). శ్రీ విశ్వనాథ తిక్కనసోమయాజికి, విష్ణుశర్మకు ఫలాహారం బజారునుండి తెద్దామనుకోగానే వచ్చిన ఆలోచన చూడండి. "సరుకంతా డబ్బా ఆయె. పాపం వాళ్ళకి కడుపునొప్పి వస్తుందేమో!" అని. ఆయన మరొక వ్యంగ్యప్రధానమైన హాస్య నవల "హహా హూహూ".

హాస్యమును అంగిరసముచేసి నేడు రచనలు చేయుచున్న ప్రముఖ రచయిత శ్రీ ముళ్ళపూడి వెంకటరమణ. ఆయన రచనలలోని ప్రతి మాటలోను హాస్యము ఊటలూరుచుండును. ఆయన "రాజకీయ బేతాళ పంచవింశతి" నవలలో శబ్ద, అర్థ, వాక్యగత హాస్యము ప్రతి పుటలోను గోచరించును. మన సమాజమున అనుదినము మారుచున్న రాజకీయ,సాంఘిక, మత, సాంస్కృతిక పరిస్థితులను తన రచనయందలి ప్రతి సన్నివేశములోను, ప్రతి సంఘటనలోను ప్రతిబింబించునట్లు కడు చతురతతో ఆయా విషయములను చర్చించి వానిలో హృదయాంగముగా నుండునట్లు పొందుపరచెను. అందలి హాస్యము పఠితల హృదయములో ఒకవిధమైన గిలిగింతలను కలిగించును. మచ్చుకు ఒకటి రెండు వాక్యములను ఉదహరింతును. చూడుడు-"అర్ధంకానివాటిని 'చూద్దాం' అని అపుచెయ్యడం పెద్ద పెద్ద మంత్రులందరికన్న చాలచప్పున పట్టుపడిందతనికి-" (9 వ. పేజీ). "ఆయన వయసు

మీద ఉన్నప్పుడు గర్జిస్తే పొలాల్లో కూలీలు జడుసుకునే వారు. ఇప్పుడు వయసే మీదపడింది. అంచేత గర్జన తగ్గించి గురక పెట్టడం మాత్రం డైనందిన వ్యాసంగంగా పెట్టుకున్నాడు. నేటికి కదిల్తే మనిషికాడని కదిలించి చూచిన వాళ్ళందరికి బాగా తెలుసు....." (1వ వ. పేజి). "నువ్వింకా ఎలక్షన్లో దిగలేదు కాబట్టి ఒట్లు, సత్యాలమీద గురుంటుంది..." (16 వ. పేజి). "లంచాలు రుసుముల స్థాయికి వచ్చి గౌరవ ప్రతిష్ఠలు గడించేసుకున్నాయి..... .....సిఫార్సులు అధికార్ల ఉత్తర్వుల మోదా గడించేసు కొని పబ్లీకున మైమీద కండువా వేసుకు తిరుగసాగాయి. ధర్మాసుపత్రి రంగునీళ్ళ మందులస్థాయితో అయా స్థానా లను అలంకరించాయి. పరువుగలవారి పన్నుల బరువులు కూడా ఆ పనులే మిగతా బస్తాలూ, గంపలతోపాటు మోసే అవకాశం వచ్చింది" (18 వ. పేజీ). "అక్కౌంట్లు మహా కవులకు సన్మానాలు చేయించాడు. నాలుగేళ్ళనాటి ఎల క్షనుకు చేసిన వాగ్దానాలు తీయించి, గత మూడేళ్ళవి పరికీ లించి ఒక్కొక్కటి పనులు ఆరంభం చేశాడు. రాజవీధిలో చాకుదగ్గర, బజారులో లేచిన ఎన్కాచ్మెంట్ మకాణా లను వారికి వసతులు చూపించాడు. పాలు, వాటిలో పాపాలూ బేరీజు వేయించాడు. ఇన్కంటాక్సు వాళ్ళకి మాట సాయం చేశాడు..." (28 వ. పేజి). "ఎలక్షనులో లక్ష చెప్తారు. కాని చెప్పినవన్నీ చెయ్యడం తెలివి తక్కువ

తనమే. పనిచెయ్యకుండా పదవిలో ఉండడమే సమర్థుడి లక్షణం..." (2వ వ. పేజి). పై వాక్యములలోని ప్రతి మాటలోను వ్యంగ్యము గర్భితమై వుండి, వింత సోయగముతో అవి వీనులవిందొనర్చుచుండును.

శ్రీమతి ముప్పాళ్ళ రంగనాయకమ్మ రచించిన "స్వీట్ హోమ్" అను నవల రెండు భాగములు, భార్యాభర్తలైన విమల, బుచ్చిబాబుల దాంపత్య జీవితమునకు సంబంధించిన మధుర హాస్యముతో నడచినది. సమర్థుడైన బుచ్చిబాబు, విమల గీసిన గీతను దాటకుండ, ఆమె ఆలోచనలను, అభిరుచులను గౌరవించుచు గడిపిన జీవితము, నేటి సమాజము నందలి ఒక సరికొత్త దృక్పథమును సూచించుచున్నది. రంగనాయకమ్మ ఈ నవలలో పురుషుడి చేతిలో 'స్త్రీ' ఆట బొమ్మ కాదని "ఒక సజీవ చైతన్యమూర్తి" అని, దానిని గ్రహించక పురుషుడు, అహంకారముతో, సంప్రదాయము పేరుతో, దేవుడి పేరుతో, పాపపుణ్యముల పేరుతో, కుల మతముల పేరుతో ఆమెను బానిసగా చేసికొని తన ఇష్టము వచ్చినట్లు ఆడించుచున్నాడని, పాతరోజులు గతించినవి గనుక, ఇకనైనను "స్త్రీ పురుషులు" ఒకరిని, మరొకరు అర్థముచేసికొని, యదార్థమైన దాంపత్య సుఖమును అనుభవించి, తమ నిండు జీవితములను ఆనందమయము చేసుకొనవలెనని, చక్కని యుక్తి ప్రయుక్తులతో ఈ నవలలో నిరూపించినది. దీనిలోని హాస్యము కొంత వెటకారముతో కూడి

నవై, పైకి వెక్కిరింతగను, మొరటుగను కనుపించినను, భావగర్భితమై ఆలోచనా పరంపరను ప్రేరేపించి, ఆస్వాద యోగ్య మొసరించుననుటలో యెట్టి సందేహమును లేదు. చూడుడు- "ఏమిటేవ్, మొద్దబ్బాయిని అంత పరీక్షగా చూస్తున్నావ్" అని రజని, విమలతో ఆ మొరకాబోవు భర్తను గురించి అడిగిన ప్రశ్నను లోతుగా ఆలోచించి నప్పుడే అందలి హాస్యము బోధపడును. పిల్లలు రైలు ఆట ఆడుకుంటూ వుంటే "ఫ్రెండింకా రాలేదూ!" అంటూ లోపలికి వచ్చినది విమల. "గంటన్నర లేటు" అన్నారు వాచస్సు. "ఛ! బ్యూటీ నడిపే రైళ్ళకూడా లేట్ అవుతాయా! నీజ్ వెరీబాడ్" అంది ఆమె. మరొక సందర్భమున విమల గేటు కురవానితో అన్న ఈ మాటలను పరికించండి- "మినిష్టర్ కోసం దేవుడైనా వేళగానివేళ ప్రత్యేక దర్శనం ఇస్తాడే! మీరు గేటైనా తీయరా!" అంటుంది. బుచ్చి బాబు విమలతో "పెళ్ళంటే నీకు సంతోషం వేసిందా!" అని అడిగినప్పుడు "నాకేం వెయ్యలేదు - ఈ మొద్దుమొహంతో ఎల్లా వేగుతానా అని బెంగపెట్టుక చచ్చాను-" అంటుంది. విమల సినిమా తనకు నచ్చక బుచ్చిబాబును ఇంటికి వెళ్ళుదాము రమ్మని పిలిచినది. అప్పుడు అతను "నాకు చాలా బాగుంది నేరానను - నువ్వెళ్ళు" చిరాకుగా అన్నాడు. విమల కోపముతో "నీకు హృదయంలేదు" అన్నది. "రేపు డాక్టర్‌కు చూపిద్దాం" అన్నాడు అతను నింపాదిగా. మరొక సందర్భ

ములో ఎక్కువగా కారమువున్న ఫలహారము తినలేక బుచ్చి బాబు బాధపడుతూవుంటే విమల మండిపడుతూ "కారంతో అంత అవసపడడం యేమిటి?" అని కసిరింది. "పసిపిల్లలకే వేశావుకాదు. ఈ ప్లాలో పంచదార తింటే చెడిపోతా రన్నావ్ కదా." అన్నాడు, అంతకుముందు జరిగిన సంభాషణను గుర్తుకుతెస్తూ. "అది వాళ్ళమాట. ఇకమీరూ బాగు పడేదేముంది?" అంటూనే నాలుగు చమిచాలు వేసినది. విశాలను గురించి ఆమె భర్త శ్యామలరావుతో విమల తిన్న ఈ మాటలు మిక్కిలి చమత్కారయుక్తమైనవి. "అది నాకన్న బాగా చిన్నది. అయినా ఒక్క కంచంలో తిని, ఒక్క మంచాన పడుకున్నాం" "ఏం? మీ ఇంట్లో అందరికీ తలో కంచం లేదా? తలో మంచం ....." "ఉన్నా మీలాంటి వాళ్ళకి దానంచేసి ఒక్కటే మిగుల్చుకున్నాం". విమల వ్రాసిన పుస్తకములను విశాల చదువుటకు, ప్రకటించినప్పుడు విమల పట్టలేని తన ఆనందమును వ్యక్తముచేసిన ఈ మాటలలో యెంతటి హాస్యము ఇమిడివున్నదో గమనించండి. "నా తల్లీ యెంత మాటన్నావే! అవి చదివేనాధుడు లేక .....నానాధుడికి బోధపడక గుండెలుబాద కుంపట్లులా వున్నాయి నాకు...తల్లీ! తల్లీ నీఋణంవుంచుకోను. చీరా రవికలుగూడా పెడతాను. చదివి నీ అభిప్రాయం చెప్పవే" అంటుంది మిక్కిలి ఆతురతతో. ఒక సందర్భములో బుచ్చి, శ్యామలరావుతో "ఆవిడతో వాదంపెట్టుకుంటే మీరా బుర్ర

చెడుతుంది" అన్నాడు. వెంటనే ఆమె "రుజువు బుచ్చి బాబు తలకాయ యెట్టెదటే వుంది—" అంటుంది నవ్వి.

"బారిష్టరు పార్వతీశం" తరువాత అంతటి హాస్య ముతో తోణికిసలాడు మరొక విచిత్రమైన నవల కి) ఆర్వీయ వాసిన "అనామధేయుడి ఆత్మకథ". దీనిలో కడుపు చక్కలగునట్లు నవ్వించగల మంచి హాస్యమున్నది. కోణంగి అగ్రహారవాసియైన కాండూరి రామనాథాయ, విసన్న, లక్ష్మీపతి (ముద్దు పేరు తంబి) తన పూర్వ వైభవమును కోలుపోయి వారివీధి వీరివీధి కృతులు వాసి ధనార్జన చేయుటకన్న ఆత్మపరముగా రచనలు చేసినచో ఆత్మశాంతి లభించి, లోకోపకారము జరుగగలదన్న తలంపుతో తన వంశ చరిత్రను ముఖ్యముగా తన తండ్రి కాతలు గడించిన కీర్తిని వివరించి, ఆపిమ్మట సర్వస్వమును గోలుపోయిన తన ప్రస్తుత పరిస్థితులను విశదీకరించి, తన జీవిత నౌకను ఒక ఒడ్డునకు చేర్చగలందులకు సంఘములో కాను అడుగడుగున యెదు రొక్కొనిన చిక్కులను, పొట్టకొరకు వేసిన విచిత్ర వేషములను, కీర్తికొరకు, మనుగడకొరకు పోయిన విచిత్ర పోకడలను రచ యిత ఇందు దక్షతతో వివరించెను. కాత చుట్టలు, తండ్రి బీడీలు కాగి నిత్యాగ్నిహోత్రమై వరలగా, ఆ వంశమునకు చెందిన మన "అనామధేయుడు" సిగరేట్లు కాల్చుచు మొట్టి ఆర్థిక క్లిష్టపరిస్థితులలోను వంశానుగతముగా వచ్చుచున్న ఆచారమును విడిచిపెట్టక సంప్రదాయమును పరిరక్షించు

టుకు, తన ప్రగల్భపద్ధతి సైతము మొద్దిగించుటకు వెనుదీయని ఈ అనామధేయుని ఆత్మచరిత్ర అత్యంత శ్లాఘనీయమైనది. తనుక ఇందలి నిండైన హాస్యమును పరికించండి— అనామధేయుడు తమ గ్రామ జనాభాని గురించి చెపుతూ "ఆంధ్ర దేశంలో ఒక శోభనాద్రీ, ఒక కరటకుడూ, ఒకదమనకుడూ, మాత్రమే ఉన్నారు - మా వూళ్ళో మేం తప్ప అంతా అదే వరస! కాని సౌజన్యారావు ఒక్కడైనా కంచు కాగడావేసి వెదికినా మచ్చుకైనా దొరకడంచే నమ్మండి" అంటాడు. తన తాతకు 'రామనాధాయ' అన్న బిరుదు ఎట్లా [illegible] చెప్పుటాకి— "పెదవ! పుచ్చి పప్పు నా మొహాన్ని పాగేళాడు". "ఎవరండీ". "ఎవడో వల్లకాట్లో రామనాధాయ - పుల్లయ్యశెట్టి". "ఎ మం డీ! మొన్న మీ ఇంటికి వచ్చిన చుట్టం ఎవరండి" "వాడా! వల్లకాట్లో రామనాధాయ - మా మేనత్త కొడుకే" అని. ఈ రామనాధాయ "శ్రీమదరిమూరమణ గోవిందా" అని అరిస్తే అధమం ఆరువర్ల్లాంగులైనా వినబడేవని చెప్పుతూ, "ఆ రోజులు మరి రావు. ఈరోజులు మరి పోవు" అంటాడు. తన తండ్రి విసన్నను దొంగలు "కూర్చోండి బాబూ" అని ఆహ్వానిస్తూవుంటే రానున్న ఆపదను గ్రహించక మర్యాద కొరకు అక్కడే చతికిలపడ్డాడని తెలుపుతూ "పరివరుడుని సిద్ధుడిచ్చిన పాదలేపనం బంధించింది. మన విసన్నగారిని బీడీముక్క బంధించింది" అంటాడు యెం తో చమత్కా

రము గా తన అన్నను గురించి చెపుతూ "నామీద చాడీలు జాడీల్తో కుమ్మరించేవాడు" అంటాడు. తన పాఠశాల జీవి తమును గురించి చెపుతూ "అక్కడ చదువు గట్టిపడటంకన్నా ఒళ్ళు గట్టిపడింది" అంటాడు. తనను గురించి చెపుతూ "పిల్లకవి అనే బిరుదు నాకు వెనుక పిలకలాగ తగుల్తూంది" అంటాడు. ఈ నాటి విద్యాపరిస్థితులను వివరించుచు "ఇప్పుడు పంతులు మాష్టర్లు ఎక్కువై పోయేరు. చదువు కావలసిన పిల్లలు తక్కువై పోయేరు" అంటాడు. తన భార్యను గురించి తెపుతూ "ఆవిడకి గీర్వాణ భాష వొచ్చునని మహా గీర్వాణం" అంటాడు. అదే సంభాషణలో మా [illegible] దిదడంతో సరిపెట్టుకుంటే ..... చాల సరిపోయేదాడిని. కాని అప్పుడప్పుడు నన్ను దిద్దబోయేది. అప్పుడేవచ్చేది చిక్కు" అని. 'కళాకందూతి మండలి' నిబంధనలను వివరిస్తూ "నెలకు 29 రోజులకంటె గైరుహాజరు కాకూడదు. అలా అయిన పక్షంలో వారి సభ్యత్వం రద్దు చేయబడ్తుంది" అంటాడు. ఇక నాటకములలో వేషములు వేయు సందర్భమున, నటుకుల నటనా కౌశలమును వివరించు సందర్భమున, రచయిత అనామధేయుని విచిత్ర చేష్టలను యెంతయో సమర్థవంత ముగా వివరించెను. పోషకుల మనోభావములను వివరించు నప్పుడు రచయిత కనబరచిన మెలకువ అసాధారణమైనది. నాటకములంటే పడిచచ్చే తాత, పాండవోద్యోగ నాటకం చూడటానికి వచ్చి, మన అనామధేయుడి ద్వారా అసలు

రహస్యం తెలుసుకొని "నీ మాటల్లో నా కడుపు నిండి పోయింది. మరి చూడలేనురా నాయనా" అని వెళ్ళిపోవడానికి సిద్ధపడ్డప్పుడు అనామధేయుడు ఉండమని బ్రతిమాలగా "లేదురా! బాబూ!! మరోలా అనుకోకురా అబ్బీ - ఇంటి దగ్గర అర్జంటుపనుంది" అని, అక్కడినుండి ఉడాయించాడు. తాత తాను వ్రాసిన "విఘ్నేశ్వరాభ్యుదయము" అన్న గ్రంథమును అచ్చువేయించుటకు అనామధేయుడి వద్దకు వచ్చినప్పుడు "ఇక్కడ ముద్రారాక్షసాలు భారీ యెత్తున ఉంటాయి మరెక్కడికన్న పంపు" అన్నాడు. "తప్పొప్పుల పట్టిక చివర్న జేర్చుస్తే సరి". "తప్పొప్పుల పట్టికలో వెయ్యడానికి కొన్ని అక్షరాలు వాళ్ళ ప్రెస్‌లో లేవు. తప్పొప్పుల పట్టికలోని తప్పులు సూచించడానికి మరొక అనుబంధ తప్పొప్పుల పట్టిక కావాలి. ఆఖరికి అసలు గ్రంథంకంటె తప్పొప్పుల పట్టిక గ్రంథం ఎక్కువవుతుంది." అంటాడు. ఈ నవల చిత్ర విచిత్రమైన సంభాషణలతో కడుపుబ్బ నవ్వించ గల మంచి రచన.

శ్రీ వీరాజీ "ఇద్దరం ఒకటే" నవలలో యువతీ యువకుల మనస్తత్వ చిత్రణతోపాటు, సున్నితమైన హాస్యము మనకు గోచరించును. చూడండి- "స్వతంత్రం వచ్చాక దేశంలో డిగ్రీ కాగితం ముక్కలు కోకొల్లలుగా తయారవుతున్నాయే గాని.....వాటి చలామణి కొంచెం" అని మంజుల అన్న సీతారాం చాల అలస్యంగా గుర్తించినట్లు రచయిత యెంతో

భావగర్భితముగా చెప్పెను. చెల్లెలు సీళ్ళ్ళకోడుతూవుంటే అన్న సీతారాం ప్రేమతో "నువ్వు క్లాసు సంపాదించాలోయ్! సీళ్ళ్ళగట) తోడటం, పప్పు ఎట్ సెటా) రుబ్బటం కాదు" అని. సీతారాం తన భార్య జానకితో మంజుల పెళ్ళిని గురించి ప)స్తావించి దాని ఇష్టం యేమిటో తెలుసుకోమన్నప్పుడు "అయ్యా ఎద్దునడిగి గంతలు కడతామా?" అంటుంది. "ఓహో! మా చెల్లెలు నీకు ఎద్దూ మొద్దూనా?" అంటాడు. "అబ్బే మీ అమ్మగారన్నారండీ ఆ మాటలు" అంటుంది ఆమె చాకచక్యముగా. ఒక సందర్భములో సువర్ణ, మంజుల, మధురిమ, మూర్తి మధ్య నడచిన ఈ సంభాషణ యెంతటి హాస్యయుక్తముగానున్నదో గమనించండి. "ఓహో! సాహిత్తు తోటమాలి మాష్టారే. కొమ్మెక్కి కూర్చొని కసురుపిందెలు కొరుకుతూ వున్నారే!" అంటుంది నవ్వుతూ మంజుల. "నేను తినటంలేదు మనందరికోసం కోస్తున్నాను" అన్నాడు మూర్తి పులకించిపోయి- "కోతలా?" సువర్ణ. "కాదు - కోతులు" అంటాడు మూర్తి. ఒక సందర్భములో జానకి అడబదుచు మంజులను చూచి "ఏమిటే! అర్థమగడా!! నా మొహంలోకి అంత ఇదిగా చూస్తున్నావ్? అక్కడ కోతులాడుతున్నాయే!" అంటుంది. "అక్కడ దేవతలాడుతున్నారు" అంటుంది ఆమె. నవలలో 'మన్నా' 'అక్కమ్మ' అన్న పేర్లు విన్నప్పుల్లా నవ్వు వస్తుంది.

కీ) పాలగుమ్మి పద్మరాజు వ్రాసిన "బ్రతికిన కాలేజి"

చక్కని హాస్య ప్రధానమైన మంచి నవల. దీనిలో శంకరయ్య ఇంటిని వర్ణిస్తూ రచయిత చెప్పిన ఈ మాటలు చూడండి— "దేశాభిమానం కలవాడెవడూ పెనుకటికాలంలో మనుగుజ్జులుండేవారని చచ్చినా ఒప్పుకోడు. వాళ్ళంతా ఆజానుబాహువులు. అంచేత ఈ పొట్టి గుమ్మానికీ మరొక కారణం వుండివుండాలి. బహుశా ఆ ఆది పురుషుడు దొంగల్ని దృష్టిలో పెట్టుకొని చేయించివుంటాడీ ద్వార బంధం" అని. ఇంటి యజమానురాలు శాంతమ్మకు వార సత్వముగా లభ్యమైన పందిరి మంచమును గురించి చేసిన వర్ణన చదువుతే నవ్వకుండా వుండలేము. "ఆ మంచానికి నాలుగు కాళ్ళూ నేలమీద ఆనే అగ్నిష్టం చాని యజమానురాలు ఎక్కినప్పుడే పడుతుంది. ఆనిడ బరువు లేకపోతే మూడు కాళ్ళే ఆనుతాయి. ఆదోషం మంచానిదని శంకరయ్య. నేలదని శాంతమ్మ చాలాకాలంగా తర్కించుకొంటున్నారు. ఆవిషయమ్మీద వారిద్దరి మధ్యా ఇంతవరకూ అంగీకారం కుదర లేదు. అందుకే ఆ మంచం తన యజమానురాలిబరువును ధైర్యంగా మోస్తుంది. అప్పుడప్పుడు దాని ముసిలి కీళ్ళు మాత్రం పటపట శబ్దాలద్వారా తమ అసమ్మతిని తెలుపు తాయి". మిష్టర్ చింతాకు మరొక పెద్దమనిషికి జరిగిన ఈ సంభాషణను చూడండి. పెద్దమనిషి—"చూశారా! అన్ని పేచీ ఏమిటంటే నా పెళ్లాం సత్య". మిష్టర్ చింతా—"సత్యవర మేనా తమలపాకులకు మహాప్రసిద్ధి" పెద్దమనిషి—"కావచ్చు".

ఇంతకీ నేను చెప్పేదేమంటే మా బావమరదున్నాడే, వాడుట్టి లండాచోరి.

మిష్టర్ చింతా: చోరీ ఆ! చోరాచోరి ఆ! రాజకపూర్ పిక్చర్ కదండీ!

పెద్దమనిషి: అదెవడి పిక్చరైతే నాకేంకావాలండీ! నా మనసేమిటంటే నా బావమరది ఎంత చెపితే అంత నా పెళ్ళాం పీనుక్కు. మా అమ్మనీ, తమ్ముడినీ వేరే కాపురం పెట్టించమని నూరిపోశాడు. ఇంత ఒంపెత్తు బతుకైతే..... ...

మిష్టర్ చింతా: అవునవును. ఒంపెత్తు బతుకు కష్టం. పోనీ మీరు పెళ్ళి చేసుకోకూడదూ?

పెద్దమనిషి: అయ్యో కాకా! ఇందాకణ్ణుంచీ నే చెప్పేదేమిటండీ! నాకో పెళ్లాంపీనుగుంది. ఓ బావమరది పీనుగగూడ తగులడ్డాడు.

మిష్టర్ చింతా: అయితే పీనుగు తగలడిందిగా. ఇంతకీ మీ సమస్య ఏమిటి?

ఇలాంటి విచిత్రమైన మనస్తత్వంగల వ్యక్తి మిష్టర్ చింతా.

మన తెలుఁగు నవలా సాహిత్యములో మరెన్నిదో హాస్యరస ప్రధానములైన నవలలున్నప్పటికిని ఈ ప్రకరణమును ఇంతటితో ముగింతును.

బాల ప్రభలలోనే మిగిలి ఉన్న
బాలల తెలుఁగు నవలా సాహిత్యము –

ప్రపంచమునందలి ఇతర భాషలలో వలె బాల బాలికల వయఃపరిణామము ననుసరించి, వారి వారి మానసిక స్థితిగతులను, ఆలోచనలను, అభిరుచులను, అలవాట్లను ప్రతిబింబించునట్టి ఉత్తమ బాల నవలాసాహిత్యము తెలుఁగులో వెలువడక అది కేవలము బాల్యప్రభలలోనే మిగిలిపోవుచున్నది. ఈ బాల సాహిత్యాభివృద్ధికి మన ప్రభుత్వము, సాహిత్య సంస్థలు కొన్ని బహుమతులను ప్రకటించి కొంత ప్రోత్సాహపరచినను, ఉత్సాహ వంతులైన రచయితలు తమకు తామై కొంత కృషి సలిపి కొన్ని అమూల్య రచనలు వెలువరించినను, అది యెదగవలసిన రీతిలో యెదగక, మందకొడిగానే మిగిలిపోవుచున్నది. ఈ సాహిత్యపు ప్రథానోద్దేశములను కొందరు రచయితలు గమనించక వ్యాపార దృష్టితో ఈ బాలనవలాసాహిత్యం పేరున ఏవో కొన్ని అభూత కల్పనలు చేసి, అసందర్భపు వాక్యములు వ్రాసి, అసహజముగా నుండునట్లు చిత్రించగా, ప్రచురణకర్తలు పెద్దపెద్ద అక్షరములలో ఆకర్షణగా నుండునట్లు బొమ్మలు వ్రాయించి పుస్తకములను ప్రచురించి, విక్రయించుట జరుగుచున్నది. ఈనాడు జరుగవలసినది అదికాదు. ఈ శాఖా సాహిత్యము పేరుతో యేవో బూజుపట్టిన పాత భావములను ప్రచారముచేయుటయే

గాక, యదార్థమైన విజ్ఞాన వినోదములతో నిండిన రచనలు చేసి బాలబాలికల భావిజీవితములను తీర్చిదిద్దగల చక్కని ఇతివృత్తములతో ఆధునిక విజ్ఞానమునకు అనుగుణముగా వారి పురోభివృద్ధికి తోడ్పడునట్లు, వారి సర్వతోముఖులను అవి చేయగలిగినట్లు రచనలు జరిగినప్పుడే ఈ సాహిత్యపు యదార్థమైన విలువలు వ్యక్తము కాగలవు.

మన బాల వాఙ్మయము ఇంకను పాఠ్యగ్రంథ స్థితిలోనే వున్నది గనుక, నేడు ప్రపంచ బాల వాఙ్మయమునందు ధ్రువతారలై వెలుగొందుచున్న కొన్ని నవలలను ఇచ్చట ముచ్చటింది, అటుపిమ్మట మన తెలుగులో జరిగిన ఈ ప్రక్రియకు సంబంధించిన ప్రగతిని గురించి వివరింతును—

శ్రీ మార్క్‌ట్వైన్ వ్రాసిన "టామ్ సాయర్" నవలను శ్రీ నండూరి రామమోహనరావు వాచవులూరించు మధుర మైన పిల్లల భాషలో తెనిగించి ఆంధ్రుల కందించెను. దీనిలో మార్క్‌ట్వైన్, టామ్‌సాయర్ బాల్య జీవితమునకు సంబంధించిన చిత్ర విచిత్రమైన చర్యల నన్నింటిని కన్నులకు కట్టునట్లు వర్ణించెను. బాల్యములో అతడు చేసిన అల్లరి చిల్లర పనులు, అడ్డదిడ్డమైన విచిత్రపు ఆలోచనలు, వింతయైన అభిరుచులు ఇందు చక్కగా వర్ణింపబడినవి. ఇది చదివిన వారందరూ, ఈ దేశమూ, ఆ దేశమూ, ఈ ప్రాంతమూ, ఆ ప్రాంతమూ అను భేదమును పాటించక గత తమ బాల్య జీవితములను స్మరణకు తెచ్చుకొని ఆనందముతో, ఉత్సాహ

ముతో గంతులువేయుచు తన్మయులగుచుందురు. దీనికి రెండవ భాగముగా వెలువడిన "హకల్ బెరీఫిన్" నవలను గూడ శ్రీ రామమోహనరావే ఆంధ్రీకరించెను. ఈ నవలా ద్వ్యయమునందలి కథా వస్తువునకు అంత సన్నిహిత సంబంధము లేదు. 'ట్వేన్' మొదటి నవలలో కేవలము చిన్న పిల్లల మనస్తత్వమును చిత్రించుటకు ప్రయత్నించెను. రెండవ దానియందలి 'ఇతివృత్తము' మిక్కిలి విశాలమైన ప్రాతిపదికపైన నడచినది. రచయిత ఈ నవలలో అమెరికాలో జరిగిన అంతర్యుద్ధమునకు పూర్వ పరిస్థితులను వివరించుటకు ప్రయత్నించెను. అనాటి అమెరికన్ సమాజ స్వరూప స్వభావములను ముఖ్యముగా నీగ్రోజాతిపట్ల వారి విశ్వాసాల పరివర్తనను, బానిస వ్యాపార స్థితిగతులను ఇందు చక్కగా వివరించెను. ఇది బాలబాలికల మనస్తత్వ చిత్రణకు నిర్దేశింపబడినదైనను, ఇందలి ప్రతి సంఘటన, ప్రతి సన్నివేశము దేశకాల వయోభేదములను పాటించునట్లుచేయుట పఠితల హృదయములను కదలించివేయగలవు – నీగ్రో జాతీయుల మనస్తత్వమును, ముఖ్యముగా స్వేచ్ఛాస్వాతంత్ర్యములపట్ల వారికి గల అపార మైన ప్రేమాభిమానములను ఇందు రచయిత చక్కగా వర్ణించెను. మానవతావాది, విశాల హృదయ సంపన్నుడు కథానాయకుడునైన హకల్ బెరీఫిన్ తన స్వజాతి సిద్ధాంతములకు వ్యతిరేకముగా, తమ బానిసయైన "జిమ్" స్వేచ్ఛా స్వాతంత్ర్యముల కొరకు అడుగడుగున పడ్డ అంతర్మథనను,

యెదుర్కొనిన చిక్కు సమస్యలను రచయిత ప్రతిభాపూర్ణముగా వర్ణించెను. ఈ నవలయందలి ఈ క్రింది భాగములను పరికించి నచో, దీని ఔన్నత్యము గోచరమగును – జిమ్ ఆండ్రూస్, డ్యూఫిన్ కలసి నల్భై డాలర్లకొరకు 'జిమ్' ను అమ్మివేసి నప్పుడు హకల్ బెరీఫిన్ పడ్డ బాధను చూడండి– "మేము వాళ్ళకి చేసిన సహాయం, మర్యాద అన్నీ మరచిపోయి మాకే ద్రోహం చేశారు. తిన్న ఇంటి వాసాలు లెక్క పెట్టారు. అమాయకుడు, పరమ సాధువు అయిన 'జిమ్' ను నల్భై మురికి డాలర్లకోసం మక్కా మొహం ఎరగని వాళ్ళకి, క్షేమకరమైన దేశంలో ఎలా అమ్మివేయ బుద్ధి అయింది వాళ్ళకి? అతనికి జీవితాంతమూ బానిసతనమే తప్పకపోతే, ఈ దూరదేశంలో నాళ్ళం బిడ్డలకు ఎడంగా, బానిసగా ఉండటంకంటే మా వూళ్ళోనే ఉండటం మంచిదనిపించింది. హకల బెరీఫిన్ జిమ్ స్వాతంత్ర్యము కొరకు ఒకవంక తీవ్ర ప్రయత్నము చేయుచు మరొక వంక పడ్డ అంతర్మథనను గమనించండి– "జిమ్‌ను బానిసతనమునుంచి తప్పించటానికి నేను ప్రయత్నం చేసినట్లు అందరికీ తెలుస్తుంది. తెలిస్తే నాకెవరూ గౌరవమివ్వరు. పురుగును చూచినట్లు చూస్తారు. నీగ్రోను తప్పించటానికి ప్రయత్నించాడనే అనుమానం భరించడం కష్టం". హక్‌కు జిమ్ కు జరిగిన ఈ సంభాషణను చూడండి– "జిమ్! నువ్వు మళ్ళీ స్వతంత్రుడవయ్యావు. ఇక నీకు శాశ్వతంగా బానిసతనం తొలగిపోయింది". "హక్

గారు! మీ ఋణం, టామ్‌సాయర్‌గారి ఋణం తీర్చుకో లేనండీ" అన్నాడు కృతజ్ఞతతో. జిమ్ తనకు చేసిన సహాయమునకు సంతోషించి, టామ్ నలభై డాలర్లు బహుమతి ఇచ్చినప్పుడు అతడు వెలిబుచ్చిన ఈ అభిప్రాయము ఎంతటి ఉన్నతమైనదో, అతనికి తమ సంపదాయముపట్ల ఉన్న ప్రగాఢమైన నమ్మకము ఎంతటి లోతైనదో గమనించండి- "హక్‌గారూ! నేను చెప్పాను ఆరోజున జాక్సన్ లంకలో! మళ్ళీ ఎప్పుడో ధనవంతుణ్ణవుతానని చెప్పానా, లేదా? రొమ్ములోద భాగా బొచ్చుంటే మనిషి ధనవంతుడవుతాడని చెప్పలా! మీరు అప్పుడు నమ్మలేదు. ఇప్పుడు చూడండి. నలభై డాలర్లు చిటికెలో సంపాదించాను. ఇదిగో - నేనేం తెలివితక్కువ సన్యాసిననుకున్నారా? నేను తొలిసత్యం చెప్పానంటే అది జరిగితీరాల్సిందే". "అదిగో కైయిరో" అన్నప్పుడల్లా జిమ్ స్వాతంత్ర్యం పొంద బోతున్నందులకు తాను పొందిన ఆనందమూ, అతని విముక్తిని ఒకవైపు కాంక్షించుచునే, మరొకవైపు తాను చేస్తున్న అక్రమ కార్యక్రమమునకు హక్ పొందిన అంతర్మథనమూ, ఈ వాక్యములు పరిణించినచో వ్యక్తమగును-

"నా కర్తవ్యం నేను చేసితీరాలి. న్యాయ విరుద్ధంగా పారిపోతున్న సిగోర్‌ను పట్టి అప్పగించటం నా విధి." "నన్ను నమ్మినవాడు, అమాయకుడు, మంచివాడు అయిన జిమ్ కు ద్రోహంచేసి పట్టించినట్లయితే నా మనస్సు కు

శాంతి ఎక్కణ్ణించి వస్తుంది-?" అని.

మార్క్-ట్వెన్ వేరొక రచన "రాజు-పేద". దీనిని కూడ శ్రీ నండూరియే తెనిగించెను. ఇందలి ఇతివృత్తము 1547 వ. సంవత్సరమున ఆంగ్లదేశము నేలిన ప్రభువులకు సంబంధించినది. ఆనాడు ఆంగ్ల ప్రజలు, ఆ రాజుల యేలుబడి క్రింద జీవించిన విధానమును, వారి ఆచార వ్యవహారములను, వారనుభవించిన కష్టసుఖములను, నిక్కష్టమైన ఆనాటి వారి జీవిత విధానమును రచయిత ఈ నవలలో ప్రతిభాసమున్నతముగా వర్ణించెను. ఒకే ముహూర్తములో బక్కింగ్‌హాం పేలెస్‌లో జన్మించిన రాజకుమారుడు, ఒక మురికి కూపములో జన్మించిన పేద పిల్లవాడు ఒకే రూపము గలవారై సర్దాగా ఒకరి చుస్తులను మరొకరు మార్చుకొని రాజు పేదవాడై, పేదవాడు రాజై ఆ వాతావరణము ఇతనికి గిట్టక, ఈ వాతావరణము అతనికి గిట్టక అ ఇమువుసు అమాయకపు బాలకులు పొందిన మానసిక వ్యథలను, చిత్ర విచిత్రములైన హింసలకు గురియై వారు పొందిని వేదనలను ఇందు రచయిత చక్కగా వర్ణించెను. ఇది పిల్లల మనోభావములను, వారి వింత అనుభవములను, అనుభూతులను చిత్రించునట్టి చక్కని రచన.

పై మూడు నవలలు ఆంధ్ర పచిత్ర వారపత్రికలో ధారావాహికముగా వెలువడి అపిమ్మట ఆంధ్ర గ్రంథమాల పక్షమున పుస్తకరూపముదాల్చినవి.

"శ్రీమతి హెరియట్ బీచర్ స్టౌ" అను అమెరికన్ రచయిత్రి వ్రాసిన "అంకుల్ టామ్స్ కాబిన్" అను నవలను "అంకుల్ టామ్ కథ" అను పేరున శ్రీ దిగవల్లి వెంకటశివ రావు తెనిగించెను. భారతదేశమునందలి హరిజన సమస్యతో పెక్కు పోలికలు గల అమెరికాయందలి నీగ్రోల సమస్యను గురించి, ముఖ్యముగా వారు ఆదేశములో అనుభవించిన కడ గండ్లను గురించి వారు తమ స్వాతంత్ర్యము కొరకు సలిపిన పోరాటమును గురించి, రచయిత్రి తెలిపిన అభిప్రాయములను అనువాదకుడు బాలురకు అర్థమగు భాషలో వివరించెను. ఈ కథలో వచ్చేపాత్ర, సృష్టికర్త, క్రైస్తవ భక్తురాలు 'అంకుల్ టామ్' అను నీగ్రో తన యజమానుని కబంధ హస్తములలో అనుదినము అనుభవించిన ఘోర బాధలను, యెట్టి క్లిష్టస్థితి లోను అతడు చలించక తన విద్యుక్త ధర్మమును నెరవేర్చిన విధమును రచయిత చక్కగా ఇందు వివరించెను. ఈ మొట్ట మును తిలకించిన అనాటి ఘోరకలి మనకర్థమగును.

చూడుడు - పట్టించేను యజమానియైన లెగ్రీ ద్రోహబుద్ధితో, అధికార మదాంధతతో అమాయకురాలైన లూసీని కొరడాలో కొట్టవలసినదని టామును ఆజ్ఞాపించెను. కర్తవ్య నిష్ఠాగరిష్ఠుడైన అతడు అకారణముగా ఆమెను హింసించుట కంగీకరించలేదు. తన ఆజ్ఞను పాటించని టామును చావ మోదవలసినదని తన నమ్మిన బంట్లైన శాంబో, కింబోల కప్పగించెను. వారితనిని నిర్దయతో పసరమును బాదినట్లు

బాది చీకటి కొట్టులో పడవైచి కాగుటకు నీరైసను ఈయక బాధించిరి. తీరని దాహముతో అ కార్తి అంతయు బాధపడు చున్న అతని కడకు కాస్లీ వచ్చి గాయములకు ఉపచారము చేసి, దాహము తీర్చినప్పుడు అతడు ఆమెను హృదయ పూర్వకముగా అభినందించెను. "ఓయీ టామూ! ఈ కూరుని సంగతి నీవెరుగవు. నిన్ను చిత్రవధ చేయించును. నీ పట్టుదల విడువుము" అని ఆమె బ్రతిమాలినది. "అమ్మా! నా ప్రాణము పోయినను అన్యాయముసకొడిగట్ట" నని ప్రత్యు త్తరమిచ్చెను. అంతట ఆమె లెగ్రీ పన్నుచున్న కుట్రలను వివరించినది. "అమ్మా! నన్ను వదలుము. చేతనైనచో నీప్రభు ఎమ్మాలైనను తలపి పారిపోవ్రమ్మ" ని చెప్పెను. అది అసాధ్యమని వివరించి ఆమె వెడలిపోయినది. టామ్ మరణావస్థలో నున్నప్పుడు జార్జి షిల్బీ అక్కడికి వచ్చి "నీకు స్వేచ్ఛా స్వాతంత్ర్యముల నిప్పించి తీసుకొని పోవుటకు వచ్చితి" నని చెప్పగా తన చిన్న యజమాని రాకకు అతడు సంతసించుచు "నాయనా! నేను బానిసతనములేని దివ్యలోకమునకు పోవుచున్నాను. నాకింక నెట్టి కోరికలును లేవు. నా మరణ కారణములను మాత్రము నా ముదు సలి యిల్లాలికి చెప్పకుము. పాపము దాని గుండెలు పగు లును" అని చెప్పినప్పుడు యెంతటి కఠిన హృదయునికైనను గుండెలు అవిసిపోవ్రమ్మ— "అంకుల్ టామ్ కథ" నవలయందలి ప్రతి వ్యక్తి, ప్రతి సన్నివేశము, ప్రతి సంఘటన సజీవ సంప

న్నమై, అలనాటి నీగ్రో బానిసల దారుణ పరిస్థితులను హృదయ విదారకమైన వారి కన్నీటి గాథలను వివరించును.

ప్రముఖ నవలా రచయిత విక్టర్ హ్యూగో 'లెమిసర్బ్లే' నవలను "త్యాగమూర్తి" అను పేరున శ్రీ సన్నిధానం శ్రీధరశర్మ ఆంధ్రీకరించెను. పది భాగములుగల ఈ ఉద్గ్రంధము అనువాదకర్త పాఠశాల విద్యార్థుల ఉపయోగార్థము 128 పేజీలలో మూలమునందలి ముఖ్యాంశములను గుది గుచ్చి ఇందు ఇమిడించెను. మానవ నిర్మితములైన కఠిన శాసనములకు, మానవాధర్మములకు మధ్య వీర్పడుచుండు పోరాటములలో హృదయవిహీనములైన మానవ శాసనముల కన్న శాశ్వత విలువలుగల ఈశ్వర ప్రసాదితములైన శాసన ములే సర్వదా అనుసరణీయములను నగ్న సత్యమును రచ యిత ఇందు వివరించెను. ఒకమారు పరిస్థితుల ప్రభావము నకు లొంగినజాలక పాపమొనరించినవాడు శాశ్వతముగా పాపి కాజాలడనియు, సత్పురుషుడై అతడు ఉన్నత గతిని పొందగలడను సత్యమును రచయిత 'జావాల్ జా' పాత్రద్వారా నిరూపించి మానవలోకమున కందించెను. జావాల్ జా తన అభివృద్ధికై తోడ్పడి, ఆకలి మంటలతో బాధపడుచున్న తన అక్కకొరకు, ఆమె సంతానముకొరకు ఒక అంగడిలో రొట్టెలను తస్కరించుటతో 'దొంగ'యని న్యాయస్థానమున నిర్ణయింపబడి జైలుపాలై అతడు పడిన పాట్లను, పొందిన ఆవేదనలను ఇందు చక్కగా వివరించెను. ఆతని పవిత్రమైన

అంతరాత్మకు, క్రూరిమమై రసవిహీనమైన కట్టుబాట్లకుమధ్య అనుదినము చెలరేగిన సంఘర్షణను కన్నులకు కట్టునట్లుగా చక్కగా విపరించెను. అతనిని అహర్నిశలు రాబందులవలె పెన్నాడిన ఈ క్రూరి)మ సమాజములో "మిరియేలు" వంటి ఉన్నత పురుషుని దర్శనముతో, అతనికి హృదయపరివర్తనము కలిగినది. అయినను దుష్టశక్తులు తమ కబంధహస్తములతో పెన్నాడి హింసించుట మానలేదు. అతడు జీవిత రణరంగమున తన మనుగడకొరకు అనుదినము పోరాడి తనవలె నిర్భాగ్యులైన పెక్కుమందికి తోడ్పడి, స్వసుఖములను విడిచి పరోపకారబుద్ధితో జీవించెను. మహా దౌర్భాగ్యస్థితిలో నిర్భాగ్యురాలైన బాలిక 'గోసెట్' అతని జీవితములో కాలు పెట్టినది – ఆమెను అతడు తల్లిగా, తండ్రిగా, సోదరుడుగా పే)మించి, పెంచి, పెద్దచేసి మార్వీసునకిచ్చి వివాహము చేసెను, వివాహానంతరము ఆ దంపతులనుండిగూడ దూరమై అజ్ఞాతముగా పెక్కు ఇడుములతో గడిపి. అంత్య దశలో తనను చూచుటకువచ్చిన మార్వీసు గోసెట్‌లకు అతడు ఇచ్చిన అంత్య సందేశము మిక్కిలి ఉదాత్తమైనది. ఈ నవలయందలి భావ బాలబాలికల హృదయములను ఆకట్టుకొనగలిగినట్టి రసవత్తరమైనది. మచ్చునకు ఈ కి)ంది వాక్యములను చూడుడు- 'ఇదియొక చిన్న యిల్లు. చుట్టును తోట కలదు. కాని యదియు స్వల్పమే'. మిరియేలును పరిచయము చేయుచు - 'అతడు దీన

బంధువు. ఆర్త శరణ్యుడు, అనాథ రక్షకుడు. జనులాతని దేవదూతగా భావించుచుండిరి-' అని.

శ్రీయుతులు ఫుల్టన్ జె్ర్నలర్, విల్ జె్ర్నలర్సులు రచించిన(Father Flagan of boys Town) అను రచనను "బాలరాజ్యం" అను పేరున శ్రీ ఎన్. ఆర్. చందూర్ అనువదించెను. 'దేవుణ్ణి-మానవుణ్ణి' సమానముగా ప్రేమించిన ఎడ్వర్డ జోసఫ్ ఫ్లానగన్ అను రోమన్ కాథలిక్ మతగురువు పోలీసులు, న్యాయస్థానములు నిర్దాక్షిణ్యముగా విడిచిపెట్టిన దిక్కులేని దీనులైన పిల్లలు నివసించుటకు మంచి వసతిని కల్పించి, విద్యాబుద్ధులు గరపి, సంఘములో వారు గౌరవ ప్రతిష్ఠాన స్థిరస్థాన గణ్యులుగా లోకులచే. [illegible] సాధులు తమ తప్పులను గ్రహించి, సక్రమమైన మార్గము వెంట గౌరవప్రదముగా బ్రతుకుటకును, తమ భావి జీవితము లను తీర్చిదిద్దుకొనుటకును వలసిన యేర్పాట్లను చేసెను. ఆ మహోదార హృదయుడు ఆ బాల నేరస్థులకు చేసిన మేలు అనన్యసామాన్యమైనది. ఇది ఒక జీవిత చరిత్రయైనను బాల బాలికల విచిత్ర మనస్తత్వమును, వారి వింత అభిరుచులను విశదపరచునట్టి రచన. ఫాదర్ ఫ్లానగన్ కుల, మత, వర్ణ భాషా ప్రాంతీయ భావములను పాటించక, ఈ అనాథ బాలురకు దయార్ద్ర బుద్ధితో, మానవతా దృక్పథముతో సలిపిన త్యాగములను, మూల గ్రంథ రచయితలు విశదీకరించిన దానిని అనువాదకుడు పదునైన భాషలో తెనిగించెను.

ఫ్రెంచి నవలా రచయితలలో జూల్స్ వర్న్ ఒకడు. ఈయన భౌగోళిక, విజ్ఞాన శాస్త్రసంబంధమైన నిగూఢ విషయములను ఇతివృత్తములుచేసి బాలుల హృదయములను రంజింపజేయుచు నవలలను వ్రాసెను. ఈ యన వ్రాసిన "Around the world in 80 days"ను ప్రఖ్యాత నవలను శ్రీ కె. రమేశ్ "80 రోజులలో విశ్వవిహారం" అన్న పేరుతో ఆంధ్రీకరించెను. ఆకాశమున విరివిగా విమానములు పయనించుచున్న ఈ కాలమున ఈకథ కొంత అతిశయోక్తిగా కనుపించినను, ఇది వెలువడిన ఆకాలమున ఇందలి అద్భుత విషయములకు ప్రజలు మహదానందభరితులైరనుటలో యెట్టి అతిశయోక్తియును లేదు. నవలను పఠించుచున్నప్పుడు ఫ్లీపాతూ, ఫిలియాస్ ఫాగ్, జేమ్సునార్టన్, గూఢాచారి మున్నగు వారందరును సజీవ చిత్రములవలె మనముందు మసలుచుందురుగు. ఈ రచయిత మరొక నవల "సాగర గర్భంలో సాహసయాత్ర" తెనుఁగులోనికి అనువదింపబడినది.

"స్విస్ ఫామిలీ రాబిన్సన్" అను ఆంగ్ల నవలను సిధారము చేసికొని, అందలి కొన్ని ముఖ్య సంఘటనలను తీసికొని శ్రీ పోలిశెట్టి నాగేశ్వరరావు "అందాల దీవి" అను పేరున బాల బాలికలకు వినోదము కలిగించురీతిలో రచించెను. ఇది అనువాదము, అనుసరణమువలెగాక స్వతంత్ర రచనవలె సరళముగను, రమ్యముగను నున్నది. ఒక మత గురువు తన భార్య, నలుగురు కుమారులతోకలసి ఒక ఓడలో

ప్రయాణము చేయుచు, సముద్ర మధ్యమున భయంకరమైన తెనుతుఫానుకు ఆ ఓడ బ్రద్దలై పోయి, అందలి ప్రయాణీకులందరును చెల్లాచెదరై పోగా, ఆ కుటుంబమువారు పెక్కు కష్ట నష్టములతో చివరకు ఒక నిర్మానుష్యమైన "మృగాల దీవి"ని చేరుకొని, తమ స్వయంకృషితో, సహనశీలతతో దానిని "అందాల దీవి"గా మార్చిన అద్భుత సాహస యాత్ర దీనిలో వర్ణితమైనది- మతాచార్యుడైన తండ్రి, కుమారులకు కష్టదశలో అడుగడుగున బోధించిన నీతులు, జీవితపు విలువలను గురించి చెప్పిన మాటలు, హృదయములను కదలించును. ప్రతి బాలుడు, బాలిక చదువదగిన రచనయిది- ఇందలి ప్రతి వాక్యము, ప్రతి సన్నివేశము సహజసుందరముగానుండి నీతి పథమున నడిపించును. ఆ తండ్రి తనకుమారులకు భిన్న సమయములలో చెప్పిన ఈ వాక్యములను చూడుడు—

"చిన్నప్పటినుంచీ ధైర్యసాహసాలు నేర్చుకోవాలి. మిన్నువిచ్చి మీదపడినా ఏమాత్రం జంకకూడదు. నిర్భయంగా వుండాలి. పిరికివాడు ఎందుకూ పనికిరాడు. వాడి జీవితమే వ్యర్థమైపోతుంది-" అని (పేజి. 15). "ఫిట్టి నువ్వు అబద్ధమాడుతున్నావు. హాస్యానికైనా అబద్ధమాడకూడదు. అదే అలవాటైపోతుంది. ఏ దుర్గుణం అలవాటైనా మానడం మహాకష్టం..." అని (పేజి. 18). "పగవాళ్ళనికూడా పేదిం చడం నేర్చుకోవాలి" అని (20 పేజి). "ఇకనుంచి ఈ దీవిలో ఏవస్తువా ఎవళ్ళదీకాదు, అందరిదీను-" (45 పేజి). "కోపం,

గర్వం, భయం, స్వార్థం, అసూయ, సోమరితనం, దురాశ, పిసినారితనం మొదలైన దుర్గుణాల్ని మనసులోనికి చొరనివ్వ కూడదు-". "శాంతం, వినయం, ధైర్యం, త్యాగం, ప్రేమ, చురుకుదనం, దయ, దానం మొదలైన సద్గుణాలను అలవర్చు కోవాలి-" (90 పేజి). "తాగుడు తాగటం మహా పాపం. ఇల్లూ వొళ్ళూ గుల్లచేస్తుంది. మనిషిని పశువుగా మార్చి, అనేక పాపాలు చేయిస్తుంది. ఏ దురలవాటు ఉన్నవాడైనా బాగుపడతాడేమోగాని, తాగుబోతు మాత్రం బాగుపడడు" అని (110 పేజి). "భగవంతుణ్ణి నమ్మినవాళ్లకి ఆపదలు వచ్చినా వాటంతటవే తొలగిపోతాయి. ఇదేదో మన మంచికే వచ్చింది" అని (పేజి 126). ఇట్టి మహనీయ వాక్యములు ఈ నవలయందు కోకొల్లలుగా నున్నవి. వారు ఆ దీవియందలి భిన్న ప్రదేశములకు పెట్టిన పేర్లు, ప్రకృతిని సంబంధించిన వర్ణనలు చిత్ర విచిత్రములుగా నున్నవి- నవల అపాద మధురము. తెలుఁగు నుడికారపు సొంపుతో కడు రమ్యముగా ఈ రచన సాగినది.

"రాబిన్ హుడ్" సలిపిన విశ్వ విఖ్యాతమైన సాహస కృత్యములను కొన్నింటిని మన బాలబాలికలకు ఆనందము కలుగునట్లు శ్రీ ఉదయశంకర్ చక్కని భాషలో వేర్చి కూర్చి అందించెను. ఇంగ్లాండు దేశమును ప్లాంటాజెనెట్ ప్రభువులు తమ కఠిన శాసనములతో నిర్దయగా పాలించుచున్న ప్పుడు, సామాన్యపౌరుడైన ఈ రాబిన్‌హుడ్ "షెర్‌ఉడ్"

అడవిలో నివసించుచు, తనతో మరికొందరిని కలుపుకొని ఆ కఠినాధికారమును యెదిరించి, సామాన్యప్రజలకు గొప్ప మేలు చేసెను. పరోపకారబుద్ధితో అతడు అనాడు పలి పిన సాహస గాథలను నేటికిని ఆంగ్లేయులు స్మరించుచుందురు. ఒకానొక సందర్భమున రాబిన్‌హుడ్ పలికిన ఈ మాటలను గమనించినచో మనకు అతని ఆశయము తేటతెల్లమగును. చూడుడు. "అన్యాయమును నశింపజేయుట, న్యాయమును నిలబెట్టుట మా ఆశయము. పోరాటమనిన మాకెంతయు ప్రీతి_" అని. ప్రచ్ఛన్నవేషములోనున్న రిచర్డ్ ప్రభువుతో అతడు పలికిన ఈ మాటలను గమనించిన యెడల అతని హృదయము మనకవగతమగును. "నేను సన్మార్గులకు మిత్రుడను. దుర్మార్గులపాలిటి గండ్రగొడ్డలిని. ధర్మమును, న్యాయమును రక్షించుటయే నా పని" అని. ఇట్టిదే మరొక అద్భుత కథ "అల్లాఉద్దీన్ అద్భుతదీపము". దీనిని శ్రీ మొసలి కంటి పంజీవరావు తెనిగించెను. దురాశాపగుడైన ఒక మాయావి తన మంత్ర తంత్రములతో, కుతంత్రములతో "అల్లాఉద్దీన్" అను ఒక అమాయకపు బాలునికడకు వచ్చి, 'మీ పినతండ్రి' నని చెప్పి నమ్మించి, ఒక గుహలోనున్న అద్భుత దీపము సహాయముతో ధనము సార్జింపనించెను. భగవత్కృపవలన ఆ బాలుడే ఆ అద్భుతదీప సహాయముతో అతని దుస్తంత్రములను ఛేదించి విజయమును చేపట్టెను. బాలుర మనస్తత్వమును చిత్రించు చక్కని నవల ఇది.

జాన్‌రస్కిన్ వ్రాసిన 'Golden Valley' నవలను 'బంగారు లోయ' అను పేరున శ్రీయస్. కె. వెంకటాచార్యులు అనువదించెను. సిరియా దేశమునగల ఒక సార వంతమైన బంగారు లోయకు ప్వార్టు, హాక్సు, గ్లక్ అను సోదర త్రయము అధికారులు. మొదటి ఇరువురు దురాశా పరులు. దుర్మార్గులు. చివరివాడు దయార్ద్రహృదయుడు. పెద్దవారిరువురు ఆ చిన్నవానికి అహర్నిశలు దోహము తలపెట్టి చిత్రహింసలు చేసినను, సోదర ప్రేమతో, దయార్ద్ర బుద్ధితో అతడు వారిపట్ల ప్రవర్తించెను. దురాశాపరులైన ఆ సోదరులిరువురు తోటి మానవులకు యెట్టి సహాయము చేయక, సువర్ణప్రవాహ ప్రభువు శాపముతో శిలలుగా మారిపోయిరి. దయార్ద్రబుద్ధిగల గ్లక్ ఆ ప్రభువు దీవనలతో బంగారు లోయకు అధిపతియై దీనజనులకు మిక్కిలి తోడ్పడెను. ఈ నవల వలన ప్రేమాధిక్యత స్పష్టమగును.

ఆంగ్ల రచయిత జేమ్స్ దర్బల్ ఒక ప్రసిద్ధ కథను ఆధారము చేసికొని శ్రీ శ్రీ వ్రాసిన 'రతనాల నవ్వు' అను నవలను స్వతంత్ర రీతిలో రచియించెను. ఇందులో బాలుర మనస్తత్వమును చిత్రించుటకు రచయిత ప్రయత్నించి అందు సఫలీకృత మనోరథుడయ్యెను. నవలలోపల అక్కడక్కడ గీయబడిన బొమ్మలు కథా సందర్భములను చక్కగా వివరించు చున్నవి. ఇందలి సంభాషణలు భావగర్భితములై అత్యంత శోభావంతముగానున్నవి.

తమిళమున శ్రీ వల్లియప్ప బాలురకొరకు రచించిన ఒక చిన్న నవలను శ్రీ చల్లా రాధాకృష్ణశర్మ "చిట్టికి చిరుగంట" అన్న పేరుతో తెనిగించెను. ఈ అనువాదము సరళసుందరముగానున్నది. ఈ పుస్తకములో శ్రీయుతులు బాపు, ఉమాపతి వేసిన బొమ్మలు ప్రత్యేక ఆకర్షణీయముగానుండి భావము ఉట్టిపడునట్లు చేయుచున్నవి. కందన్ అను కుర్ర వాడు 'చిట్టి' అను ఒక మేకపిల్లను పెంచెను. "మేకపిల్ల మేకపిల్ల అందమైన మేకపిల్ల" యనుచు అతడు నిత్యము దానితో ఆడుకొనుచుండెను. దానికి ఒక చిరుగంట కట్టి ఆడించవలెనని కోరిక అతనికి కలిగి, ఆ విషయమును తండ్రితో చెప్పెను. తండ్రి కుటుంబపరిస్థితి వివరించి ఆ పని తన తలకు మించినదని తెలిపెను. ఆ బాలుడు విచారముతో ఆ మేకపిల్లను తోలుకొని దారిన పోవుచుండగా రాజభటుడొకడు కలసి, రాజుగారు చేయు యజ్ఞమునకై దానిని బలవంతముగా తీసికొనిపోయెను. కందన్ చాకచక్యముతో రెండు పర్యాయములు ఆ గండమునుండి దానిని రక్షించుకొనెను. చివర పర్యాయము రాజభటుడు అతనిపై దొంగ నేరమును మోపి శిక్ష విధించుచున్నప్పుడు రాజగురువైన ప్రేమానందస్వామి యదార్థస్థితిని తెలిసికొని, వారి నిర్బంధమునుండి అతనిని విడిపించి, అతని మేకపిల్లను తిరిగి ఇప్పించి "చిరుగంటను" గూడ బహూకరించుటతో కథ సుఖాంతమై ముగిసినది.

తెలుఁగులో చిన్నపిల్లల నవలలు-

శ్రీ కథావినోదిని రచించిన "విహారయాత్ర" నవల చిన్నపిల్లల మనస్తత్వమును చిత్రించునట్టి మంచి రచన. పాఠశాలా విద్యార్థులు కొందఱు తమ ఉపాధ్యాయులతో కలసి విహార యాత్రకు వెళ్ళిరి. వారిలో నలుగురు తమ ఉపాధ్యాయుల కనుగప్పి ఒక కొండలోనికి వెళ్ళి, ఒక గుహలో ప్రవేశించి అందులోగల రాతి విగ్రహము ముందు కొంతసేపు గడపిరి. ఆ బొమ్మను చూచుటవలన పాఠశాలలోకమునకు సంబంధించిన యేవో కొన్ని కథలు వారికి గుర్తునకు వచ్చినవి. వారికి వింత అనుభూతి కలిగినది. ఈ నవల పిల్లలను బాగుగా ఆకర్షించుటతోపాటు, తమ గురువ్రులమాట విననందువలన సంభవించు ప్రమాదములను గూడ పరోక్షముగా ప్రబోధముచేయును. ఇందలి భాష పిల్లలకు పఠన యోగ్యము.

శ్రీ నార్ల చిరంజీవి వ్రాసిన "పేనూ - పెసరచేనూ" నవల బాలురను బాగుగా ఆకర్షించును. ఒకే పేను పెసర చేను వేసినది. దానివలన అడవి జంతువులకు మంచి ఆనందము సమకూరినది. కాని ఆ దేశమునేలు రాజు దురహంకార ముతో, దుష్టబుద్ధితో ఆ చేనును పాడుచేయించెను. అల్ప జంతువైన ఆ పేను అశ్చర్యపడక ఉపాయముతో రాజును ఓడించి శాంతిని కాపాడినది. కిరీటములను ధరించు రాజులకు ఈ భూమిమీద జీవించుటకు యెంతటి హక్కు ఉన్నదో

పిపీలికాది జంతువులన్నింటిని అంతటి హక్కే కలదను సత్యమును ఈ పేను ఈ కథద్వారా రుజువుచేసి చూపినది.

ఇహనుముఖ ప్రజ్ఞాశాలియైన శ్రీ కె. సభా బాలబాలికల కొరకు రచించిన "కవీ - గాయకుడు" అను నవల అత్యుత్తమమైనది. బాల్యమునుండి ఒక కవీ - గాయకుడూ ఇరువురు మిత్రులుగానుండి పెద్దవారై పేరు ప్రఖ్యాతులను గడించినను వారు విడిపోక అన్యోన్యముగా కలసిమెలసి జీవించిరి. ఆ ఇరువురు మిత్రుల ప్రేమమయ జీవితములను, బాల బాలికల మనస్సులను రంజింపజేయువిధముగా సులభశైలిలో, వాచ్యము లూరించు మధురమైన భాషలో ఈ నవలద్వారా అందించిరి. ఇట్టి ప్రబోధాత్మకమైన చక్కని కథను మనకందించిన రచయిత కృషి మెచ్చుకొనదగినది.

తెలుఁగునాట ఈ శాఖా సాహిత్యమునకు ప్రాణము పోసిన మహనీయుడు శ్రీ చింతా దీక్షితులు. ఆయన వ్రాసిన "లీలాసుందరి" అను నవల చిన్న పిల్లల మనస్తత్వమును చిత్రించునట్టి ప్రముఖ రచన. ఇందలి భాష, భావములు పసిపిల్లల హృదయములను చక్కగా ఆకట్టుకొని చివరంట చదివించగలవు. వనబాల (చీకటి భూతం) అను రాక్షసి తన కుమార్తెను కోలుపోయి, కనుపించిన ఆడపిల్లల నందరిని మాయోపాయములతో ఎత్తుకొనిపోయి తాను నివసించు గుహలో బంధించుచుండెడిది. అటులనే ఆ రాక్షసి లీలాసుందరి అను అందాల బాలికయైన రాకుమారిని, ఆమె తోట

నుండి దొంగిలించుకొనిపోయి ఇతర కాలికంలోపాటు ఆమెను గూడ ఆ గుహలోనే బంధించినది. విదేశవళియైన ఆ రాజకుమారి ఆ రాక్షసినుండియే, కొన్ని విచిత్ర రహస్యములను తెలిసికొని, రాజమౌళి అను రాకుమారుని తోడ్పాటుతో ఆ మెు ఆటకట్టించి, తనతోపాటు మోసపోయిన తదితర బాలబాలికలకు గూడ విముక్తిని కలిగించి, వారికి తగిన వరులతో వివాహమాడుటకు తోడ్పడి, తాను రాజమౌళిని వివాహమాడుటతో కథ సుఖాంతమై ముగిసినది. ఇందలి వర్ణనలు సమయోచితముగానుండి, కథకు పుష్టిని చేకూర్చుచున్నవి. "లీలాసుందరి" వలెనే ఆయన వ్రాసిన మరొక మంచి పుస్తకము "సూరి, సీతి, వెంకి" అనునది.

సున్నితమైన రాజకీయములను వ్యంగ్యస్ఫోరకముగ మలిచి, నవలలు, కథలు విశేషముగా వ్రాయుచున్న శ్రీ ముళ్ళపూడి వెంకటరమణ అదే ధోరణిలో బాల బాలికల విచిత్రమైన మనస్తత్వమును చిత్రించుచు 'బుడుగు' అను నవల రెండు భాగములుగా రచించెను. ఆయన చేతిలో ఈ నవలా విభాగము తీగలుసాగినది. రెండుభాగముల లోపలను, అట్టపైన వేసిన బొమ్మలు అత్యంత ఆకర్షణీయముగా నుండి విషయమును సుబోధకము చేయుచున్నవి. ఈ నవలా భాగముల రెంటికిని కథానాయకుడు 'బుడుగు'. అతని మరో పేరు 'పిడుగు'. అతని వింతచేష్టలు, ముద్దు ముద్దు మాటలు కడు ఖుబ్బ నవ్వించగలవు. ఒక్కసారి చదివిన అది మీకే తెలి

యును - చూడండి. "ఎందుకు వాడిని బోడిగుండు అనాలి అసలు?" అంటూ తండ్రి బుడుగును కోప్పడ్డాడు. "వాడికి నిజంగా గుండు ఉందిగా" అన్నాడు బుడుగు. "వీళ్ళావు-బోడినిజం నువ్వూనూ-" అని తండ్రి గసిరాడు.

మరొక సందర్భములో - బాబాయి ఉత్తరం వ్రాసి బుడుగులో సీరకిచ్చిరమ్మన్నాడు. వాకిట్లో కూర్చొని వున్న ఆ అమ్మాయి నాన్నతో జరిగిన ఈ సంభాషణను తిలకించండి- "ఎవరికిరా! ఆ ఉత్తరం?". "ఎవరికో నీకెందుకురా?". "ధడవా ఖలారా" అనేసి బుడుగును గబుక్కున పట్టేసుకొని ఉత్తరం చూసి "హేం పొగరు రాస్కెల్-నాకూ తురికి ఉత్తరం రాస్తాడా! రెప్పా ఉండు వాడిపని" అన్నాడు. "లేకపోతే నీకు రాస్తాడా?" అన్నాడు బుడుగు. బుడుగు కొన్ని సందర్భములలో పదములకు ఇచ్చిన విచిత్రమైన నిర్వచనమును చూడండి - "శిక్ష" అంటే చిన్న పిల్లల్ని బళ్ళో వెయ్యడం. "ధైర్యం" అంటే పోలీసుతో మాట్లాడటం. "నీతి" అంటే "రోత" అని.

ఈ నవలలో అమ్మా, నాన్న, బాబాయి, సీగాన ప్రసూనాంబ, బామ్మ, లావుపాటి పక్కింటి పిన్ని, సీత అంతా చిత్ర విచిత్రముగా మనకళ్ళకగుపింతురు.

శ్రీ నోరి నరసింహశాస్త్రి ఆరు, పన్నెండు సంవత్సరముల మధ్యవయస్సుగల పిల్లల అభిరుచులకు అనుగుణ్యముగా నుండునట్లు "కర్ణాభార దీపయాత్ర" అను నవలను

రచించిరి ఆయన దీనిలో మన పూర్వ సంస్కృతిని, భారతీయుల ఆధ్యాత్మిక ఔన్నత్యమును జోడించి పిల్లల మనస్తత్వానుగుణముగా తగినట్లు చారి ఫ్రావములో కథను వివరించిరి. ఇంచుమించు ఇతివృత్తము ఇది. కర్పూర ద్వీపమునకు ఒక నావ వచ్చినది. దానిని చూచి వ్యామోహముతో నాలుగు జంటల పిల్లలు పక్షిరూపములుదాల్చి అందులో యెక్కి ప్రయాణము చేసి ఈ లోకము చేరుకొని విశేషముగా పుణ్యకార్యములు, స్వల్పముగా పాపకార్యములు చేసిరి. తాము చేసిన స్వల్ప పాప ఫలితముల ననుభవించుటకుగాను వారు ముందు నరకలోకము నకు పోయి అక్కడ తమ పాపములను క్షాళనము చేసికొని, ఆపిమ్మట ఉత్తమ ద్విజన్మలెత్తి స్వర్గమునకు వెళ్ళిరి. అక్కడ కొంతకాలము గడపిన పిమ్మట, ఈ లోకము వినాశనోన్ముఖముగా నుండుట గమనించి, వారి మనస్సులు కరిగి మరల ఈలోకములో అవతరించిరి. ముందు వారు గోరూపముదాల్చి, ఆపిమ్మట ఉత్తమోత్తమమైన మానవరూపము ధరించి, ఈ లోకమును మధుర మంజుల మొనరించి 'స్వర్గముకన్న మిన్న ఇదియే' నని లోకమునకు రుజువుచేసి, తమ కర్పూర ద్వీపము నకు యథాప్రకారము తిరిగి చేరుకొనిరి.

ఆ ద్వీపమునందలి పిల్లలను గురించి ఆయన ఈ మాటలను చూడండి- "ఆ ద్వీపములో పిల్లలు చేపలల్లే పాలల్లో, నీళ్ళల్లో ఈదగలరు; పక్షులవలె ఆకాశంలో దివ్వున ఎగిరిపోగలరు; మనుష్యులవలె నేలమీద నడవనూగలరు" అని.

శ్రీయుతులు కొలిపాక మధుసూదనరావు, పబ్బరాజు గోపాలరావులు, "మోగిన గంట" అను నవలను వ్రాసిరి. 'సూర్యాపతి' అను అమాయకపు బాలుని జీవితము ఇందు చిత్రింపబడినది. ఒక స్నేహితుడు ఆటలో అతనిని అన్న మాటలు అతని హృదయమునకు గాయము చేయగా, సరోజ అక్కవద్దకు వెళ్ళెను. ఆమె మరొకవిధముగా అతనిని గాయ పరచినది. మతి స్థిమితమును పోగొట్టుకొని ఆ బా లు డు సికిందాబాదు చేరుకొని అక్కడ పడ్డ బాధలు, చివరకు ఒక శరణాలయములో బు ద్ధ దే వు ని చిత్రపటము ముందు మోకరిల్లినప్పుడు అతడు పొందిన చిత్తశాంతి ఇందు వర్ణింప బడినది. పసిపిల్లల సున్నితమైన హృదయము లెట్లుండునో ఈ నవల మనకు తెలుపును. "సీత" దాయకమైన ఈ నవల పిల్లలందరు చదవతగినది.

శ్రీ శిష్ట్లా లక్ష్మీకాంతశాస్త్రి బాలబాలికల విజ్ఞానాభి వృద్ధికై "బ్రహ్మపుత్ర" అను రచనను చేసిరి. భారతావని యందలి పెద్ద నదులలో అది ఒకటి. దానికి సబంధించిన గాథలు, భారత, భాగవతముల యందును, తదితర పురాణ ములయందును లెక్కకు మిక్కిలి యున్నవి. అవి బాలుర కంచు బాటులో నుండవు గనుక, శ్రీ శాస్త్రి మిక్కిలి కృషిచేసి ఆయా విషయముల నన్నింటిని పెక్కు గ్రంథములనుండి సేక రించి సుబోధకముగా నుండునట్లు ఇందు పొందుపరచిరి.

శ్రీ నోరి రామకృష్ణ "సూర్యయానం" అను విజ్ఞా
నాత్మకమైన నవలను మధురమైన భాషలో రచియించెను.
విజ్ఞాన తృష్ణగల ఒక ఉపాధ్యాయుడు తన మేధా సంపత్తితో
విమానమునలె ఆకాశమున పయనించగల ఒక నూత్రన యంత్ర
మును కనిపెట్టి, ఆవిషయమును తరగతిలో బాలురకు వివ
రించి, త్వరలో తాను ఆఫ్రికా ఖండమునకు వెళ్ళి అక్కడి
భయంకరాటవులలో గల "ప్రకృతిని పరిశోధించగల" నని
చెప్పెను. ఈ విషయమును విని రామం, గురువుతో తానును
అక్కడికి వెళ్ళుదునని తల్లికి తెలిపెను. అంతకుముందే పరి
శోధనకొరకు వెళ్ళిన అతని తండ్రిని, అక్కనుగూరించి తెలిపి
ఆమె వెళ్ళవద్దని వారించినది. విజ్ఞాన తృష్ణతో 'రామం'తల్లికి
తన భావి కార్యక్రమమును వివరించి గురువు వెంట ఆఫ్రి
కాకు "సూర్యయాన" ములో పయనించి, అక్కడగల నర
మాంస భక్షకులతో పోరాడి, వారిని వశపఱచుకొని ఏనాడో
విడిపోయిన తన తండ్రిని, అక్కను కలసుకొని అక్కడి దట్టమైన
అడవులను మానవ వాసయోగ్యముగా నొనరించి దిగ్విజయ
ముతో తిరిగి భారతదేశమునకు వచ్చెను. పిల్లలందరు చదవ
దగిన ఉత్తమోత్తమమైన వైజ్ఞానిక నవల ఇది.

బుద్ధ భగవానుని పిమ్మట అంతటి మహామహిమాన్వి
తుడైన ఆచార్య నాగార్జునుని పవిత్ర జీవిత చరిత్రను శ్రీ
భార్వరి "నాగార్జున" అను పేరుతో బాలుల కొరకు
నవలగా మలిచెను. ఆ ఆచార్యవర్యుడు శ్రీ పర్వతము

(నాగార్జునకొండ)పైన నివసించి మహాయాన బౌద్ధ మత మున "మాధ్యమిక వాద" మను నూతన సిద్ధాంతమును ప్రతిపాదించి, దానిని యావత్ప్రపంచమునకు ప్రచారము చేసెను. ఇట్టి లోకోత్తర పురుషుని జీవిత చరిత్రను బాల బాలికలకు విజ్ఞాన వినోదములు కలుగునట్లు సులభశైలిలో అందించిన శ్రీ శాగ్వారి కృషి ప్రశంసనీయమైనది.

మరియొక వైజ్ఞానిక నవలిక శ్రీమతి కంచి రమాదేవి వ్రాసిన "అనంతంలో అంతం" అనునది. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ స్త్రీల చేత, పిల్లలకు వైజ్ఞానిక సాహిత్యము పట్ల అభిరుచి కలిగించుటకుగాను నిర్వహించిన పోటీలలో దీనికి బహుమతి లభించినది. మానవ కల్యాణమునకు దోహదకారి కాదగిన అణుశక్తి విజ్ఞానమును, అసూయగా ద్వేషముతో, స్వార్థపరత్వముతో ఉపయోగించుకొనినయెడల అది సర్వ నాశనమునకు యెట్లు దారితీయునో 'సునంద' లోకవాసియైన 'హరియన్' అను శాస్త్రజ్ఞుడు తన స్వానుభవములను ఇందు వివరించెను. గత రెండువందల కోట్ల సంవత్సరముల నుండి సునందలోకమునను, భూలోకమునను మానవ ప్రగతి కి సంబంధించిన విషయములను అతడు వివరించి, మారణాస్త్ర ముల ఉత్పత్తికొరకు జరిగిన పోటీలలో తమ దేశము తునాతుని యలై పోగా, తాను ఒక్కడు ఆ మహా శాస్త్రజ్ఞుల సహా యముతో, యోగశక్తులతో ఆ ప్రమాదమునుండి బయటు పడి, భూలోకమునకు వలస పచ్చిన విధానమును, ఇక్కడ దీర్ఘ

విద్యతో గడిపిన కాలమును వివరించి, ఇక్కడ గూడ ఆణు శాస్త్ర సంబంధమైన పరీక్షలు జరుగుచున్నవి గనుక, తన ఉనికికి ఇది కౌతుకమైన స్థానము కాదుగదుక, గూడవల్లి సోకని గుగ్గిహామునకు పోయి అక్కడ తన జాతివారిని మరల సృష్టించి వారి అభివృద్ధికి తోడ్పడగలనని తెలిపెను. రేడియో, టెలివిజన్, కాలయంత్రము మున్నగునవి తమ దేశప్రగతికి యెట్లు తోడ్పడినది చక్కగా వివరించెను. విజ్ఞాన శాస్త్రము పదునైన కత్తివంటిదని, దాని ఉపయోగ విధానము పైనే ప్రగతిగాని, వినాశనముగాని జరుగునని తెలిపెను.

ఈ శాఖా సాహిత్యమున బృహత్కృషి చేయుచున్న వ్యక్తి శ్రీ అంగటి నరసింహం. ఆయన తెలుఁగు బాల బాలికల హృదయములకు ఆహ్లాదము కలుగునట్లు తెలుఁగుల జీవితములను, ఆచార వ్యవహారములను, నాగరికతా వైభవములను ఇతివృత్తములు చేసి అవి బాలురకు అర్థమగు స్వచ్ఛమైన భాషలో రచనలు చేసెను. ముఖ్యముగా రాయలసీమయందలి కడప, అనంతపుర, నెల్లూరు జిల్లాలలో గల గ్రామములను, కొండలను, గుట్టలను, అరణ్యములను వాని నాశ్రయించిన మనోహర ప్రకృతి సౌందర్యమును కన్నులకు రూపుకట్టినట్లు రచనలు చేసెను. మన పాత చరిత్రను, భూగోళమును, జంతువులను, వృక్షములను గురించిన విజ్ఞానముతోపాటు, మన పంచు జీవన విధానమును గూడ తన నవలలో సందర్భోచితముగా ఆయన

వివరించెను. ఒకనాడు మన పంథములో సర్వత్రా వ్యాపించియుండి, ఈనాడు మటుమాయమై పోయిన మంత్ర తంత్ర విద్యలను, క్షుద్ర విద్యలను, దయ్యములు, భూతములు మున్నగు వానికి సంబంధించిన విషయములను తన రచనలలో పొందుపరచెను. మన పల్లెపట్టులు ఒకనాడు స్వర్గతుల్యములై యుండి, నేడు పాశ్చాత్యనాగరికతా ప్రభావముతో, కృత్రిమ వాతావరణములో యెట్లు మారిపోయినవో రచయిత కన్నులకు కట్టించెను. కడప, నెల్లూరు జిల్లాల సరిహద్దులలోగల వెలిగొండల లోన, కడప జిల్లా కోడూరు, చిట్వేలి మధ్యన రోడ్డులోవున్న వెంకట్రాజుపల్లెలోను ఆయన చిత్రించిన ప్రకృతి రామణీయకత వంటిని మనము ప్రత్యక్షముగా వీనిలో చూడగలము. ఆయన రచనలు కేవలము ఊహాలతో నిండిన కట్టుకథలు గావు. చాలవరకు యదార్థ పరిస్థితులనే పిల్లలకు ఉత్సాహము కలుగునట్లు చిత్రించెను. ఆయన వ్రాసిన "కోటవీరన్న సాహసం", "ఉదయగిరి పోలన్న ధైర్యం", "మంత్రాల రామన్న మొండి" తనం చదివినయెడల నాకు వివరించిన విషయములు సత్యమని రూఢియగును.

ఆంధ్ర సాహిత్యోద్యానమున విరిసిన పోకడలు పోయిన కవి సమ్రాట్ శ్రీ విశ్వనాథ పిల్లలకొరకు "కడిమి చెట్టు", "వీరవల్లడు", "పరీక్ష" మున్నగు నవలలను వ్రాసెను. అవి ఉన్నత పాఠశాలా విద్యార్థుల ఉపవాచకముల నిమిత్తము ఉద్దేశింపబడి వ్రాసినవైనను, వానిలో బాలబాలికల మనస్త

త్వమును, మధ్యతరగతి ప్రజల కష్టనిష్ఠురములను ఆ యన చిత్రించెను. "పరీక్ష" నవలలో గ్రామీణ ప్రాంతములోఁగల రామయ్య అను ఒక రైతు కుటుంబ పరిస్థితిని వర్ణించెను. అధునాతన నాగరికత, ఆంగ్ల విద్య, గ్రామీణ సౌభాగ్యమును రొట్లు కిందు మీదు చేసినది, రామయ్య కుటుంబముపై అది పోయిన పోకడలు ఇందు కన్నులకు కట్టునట్లు వివరించెను. గోపాలము, సూర్యము ఇరువురు ఆయన కొడుకులు. తండ్రి గుణములను పుణికి పుచ్చుకొనిన గోపాలము చితికిపోయిన తమ సంసారమును సుద్ధరించుటకు, తండ్రి గౌరవ ప్రతిష్ఠలను కాపాడుటకు చివరంట ప్రయత్నించి పరిస్థితుల ప్రభావమునకు తట్టుకొనలేక ఆత్మహత్య చేసికొనెను. రెండవవాడైన సూర్యము అధునాతన పోకడలకు దాసుడై సాయలా పాయలాగా జీవితమును వెళ్ళబుచ్చెను. ఇక రామయ్య మూడవ కుమారుడైన శ్యామల, అన్న గోపాలము వలె కుటుంబ బాధ్యతలను స్వీకరించి దాని గౌరవమును కాపాడుటకు ప్రయత్నించినది. దీనిలో విశ్వనాథ స్వర్గతుల్యములని విఖ్యాతమైన గ్రామీణ ప్రాంతములలో ఆర్థిక దృక్పథముతో పచ్చి పాలనుండి వెన్నతీయుట, పచ్చి పాలలో నీళ్ళు కలిపి అమ్ముటవరకు ఆధునిక నాగరికతా ప్రభావముతో వచ్చిన విభిన్న పరిణామములను ఇందు ఉల్లేఖించెను. ఈ సాహిత్య విభాగమున సాము గారడీలు సలిపి; మంచి ఫలసాయమును తీసిన వారెందరో యున్నను, ఇంతటితో దీనిని ముగింతును.

చతుర్థ భాగము.

తెలుఁగు నవలా వికాసములో పత్రికలు-వ్యక్తుల-కృషి.

దేశమునకు స్వాతంత్ర్యము సిద్ధించిన పిమ్మట ప్రజలలో పఠనాభిలాష అభివృద్ధియైనది. గనుక వివిధ భాషలలో పత్రికల ప్రచురణ కోకొల్లలుగా పెరిగిపోయినది. తెలుఁగు నాటగూడ పెక్కు దిన, వార, పక్ష, మాసపత్రికలు బయలు దేరినవి. ఆయా పత్రికలలో ప్రజల అభిరుచులకు, ఆలోచనలకు అనుగుణ్యముగా వివిధ శీర్షికల కింద విషయములను వింగడించి ప్రచురించదొడగిరి. ద్వితీయ ప్రపంచ సంగ్రామము ముగిసిన పిదప సర్వ ప్రపంచ ప్రజలను అధికముగా ఆకర్షించి తినదినప్రవర్ధమానము చెందుచున్న సాహిత్య ప్రక్రియ నవల. ఈ విభాగపు పఠనాభివృద్ధిని గ్రహించి పత్రికాధిపతులు రచయితలచేత స్వతంత్ర నవలలు వ్రాయించి ప్రచురించుటయేగాక, తదితర భాషలనుండి గూడ అనువాదములు చేయించి తను తమ పత్రికలలో ధారావాహికముగా ప్రచురించదొడగిరి. క్రమముగా పఠితల సంఖ్య విపరీతముగా పెరిగినకొలది పత్రికల ప్రచురణ సంఖ్య సహితము పెరుగజొచ్చినది. పత్రికాధిపతులు వ్యాపారదృష్టితోను, పఠాభిరుచులను పూరించు తలంపుతోను, వాసిలోను, రాశిలోను మేలి రకపు రచనలందించు తలంపుతోను, రచయితలకు ప్రోత్సాహకముగా తోడ్పడుటకై, పోటీలను నిర్వహించి ఉత్తమ రచనలకు వేల సంఖ్యలో బహుమతుల నిచ్చుటయేగాక, ప్రచుర

ర్వాహమైన మరి కొన్ని రచనలను గూడ, బహుమతుల నందు కొనినవాటితోపాటు తమ తమ పత్రికలలో ప్రచురింప మొదలిడిరి. ఈ పోటీలలో పురుషులతోపాటు స్త్రీలు గూడ సమ ఉజ్జీతో రచనలు చేయుటయేగాక, క్రమముగా వారిదే పైచేయి యనునంతవరకు వెళ్ళినది. కనుక ఇక పత్రికల, మరియు వ్యక్తుల కృషిని వివరింతును.

ఆంధ్ర పత్రిక–ఆంధ్ర సచిత్ర వారపత్రిక–భారతి. శ్రీ కాశీనాధుని నాగేశ్వరరావు పంతులు చూపిన ఒరవడిలో పై పత్రికల యాజమాన్యమును స్వీకరించిన శ్రీ శివలెంక శంభుప్రసాద్, ఆయన కుమారుడు శ్రీ రాధాకృష్ణ ఈ సాహిత్య విభాగమునకు చేయుచున్న మహత్తర కృషిని వివరింతును. ప్రతి ఆదివారమునాడు వెలువడు ఆంధ్ర పత్రిక "సారస్వతానుబంధంలో" ప్రముఖ రచయితలచేత నవలలు వ్రాయించి ప్రకటించిరి. శ్రీయుతులు విశ్వనాధ, నోరి, పిలకా గణపతిశాస్త్రి వంటి పండిత ప్రకాండుల నవలలలో చాల వరకు ఆ అనుబంధములలో వెలువడినవే. స్వాతంత్ర్యము లభించిన పిమ్మట ప్రప్రథమమున ఆంధ్ర సచిత్ర వారపత్రిక, నవలా రచనలో పోటీలను ప్రవేశపెట్టి, రచయితలకు గొప్ప ప్రోత్సాహము నిచ్చి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతుల నిచ్చుటయేగాక, ప్రచురణకు యోగ్యమైన మరికొన్నిటిని తమ వారపత్రికలో ధారావాహికముగా ప్రచురించి పారితోషికముల నిచ్చిరి. శ్రీ పోతుకూచి సాంబ

శివరావు "ఉదయకిరణాలు", శ్రీకందుకూరి లింగరాజు "సమర్పణ", శ్రీతాడిగిరి పోతరాజు "మట్టిబొమ్మలు", శ్రీమతి చెదుకూరి రమాదేవి "బాంధవ్య బంధితులు" వంటి ప్రముఖ నవలలు ఆ పోటీలలో బహుమతుల వందుకొనినవే. శ్రీమతి కోమలాదేవి వ్రాసిన "బంగారు పంజరం" నవల ప్రత్యేక బహుమతితో వెలువడినది. శ్రీ నోరివారి "నారాయణభట్టు", "రుద్రమదేవి", "కవిసార్వభౌముడు", మున్నగు నవి ఈ పత్రికాముఖమున వెలుగు చూచినవే. 'కౌంట్ ఆఫ్ మాంట్‌క్రిస్టో' 'రెండు మహానగరాల'వంటి ప్రపంచప్రఖ్యాత నవలలు అనువదింపబడి, దీనిలో వెలువడినవి. "భారతి" ప్రత్యేకముగా సాహిత్యము కొరకు పుట్టిన మాస పత్రిక గనుక, ఇందులో శ్రీ సింగరాజు లింగమూర్తి "ఆకర్షణలో అపస్వరాలు", హితశ్రీ "అంతర్వాహిని", శ్రీ ఆర్. యస్. సుదర్శనం "అసుర సంధ్య" వంటి నవల లెన్నియో వెలువడి మన నవలాసాహిత్యమునకు సరికొత్త కాంతినిచ్చినవి.

ఆంధ్రప్రభ – ప్రభ సచిత్ర వార పత్రిక. నవలా సాహిత్య ప్రక్రియ తెలుఁగునాటిలో మారుమూల పల్లెలకు పాకునట్లు విశేష కృషి సలిపినది ఈ పత్రికా ద్వయమేనని చెప్పినచో అత్యుక్తి యొంచుమాత్రమును లేదు. ఆంధ్ర పత్రిక నాటినుండి నేటివరకు సంపాదకులుగా వ్యవహరించిన శ్రీయుతులు న్యాయపతి నారాయణమూర్తి, నార్ల వెంకటేశ్వరరావు, నీలంరాజు వెంకటశేషయ్య, పండితారాధ్యుల

నాగేశ్వరరావు మున్నగువారు ముందు చూపుతో ఈ సాహిత్య విభాగమునకు విశేష పోత్సాహము నిచ్చి, పెక్కు నవలలను ఆదివారం ఆంధ్ర ప్రభ 'కళాసాహిత్య విజ్ఞాన వేదిక' లో ప్రకటించిరి. ఆంధ్రపత్రిక సచిత్ర వారపత్రిక నవలా రచనకు వేల సంఖ్యలో బహుమతులను ప్రకటించి, పోటీలను ప్రారంభించి నప్పటినుండి తెలుఁగునాట గొప్ప సంచలనము బయలుదేరినది. పలు ప్రాంతములనుండి రచయితలు, రచయిత్రులు అధిక సంఖ్యలో నవలలు వ్రాసి, ఆ పోటీలలో పాలుగొనదొడగిరి. ప్రతి సంవత్సరము మూడు, నాలుగు వందల నవలలు పోటీకి రాదొడగి, వానిలో ఉత్తమ రచనలకు బహుమతులు లభ్యము కాజొచ్చినవి. ఈ పోటీలలో ముఖ్యముగా స్త్రీలు గణనీయమైన సంఖ్యలో పాలుగొని పెక్కు బహుమతులను తమ కైవసము చేసికొనుట ప్రత్యేక విశేషము. ఈ పోటీలలో వెలువడిన కొన్ని ఉత్తమ నవలలు— శ్రీధర "రాగవిపంచి"; శ్రీ రామవరపు వేణుగోపాలరావు "పడగవీది మణి"; శ్రీమతి పోలాప్రగడ రాజ్యలక్ష్మి "కుంకితప్పిన వీణలు"; శ్రీమతి చిట్టా సూర్యకుమారి "మట్టిబొమ్మలు"; శ్రీమతి కొలిపాక రమాదేవి "గడ్డిపోచలు"; శ్రీమతి కావిలిపాటి విజయలక్ష్మి "లలితాదేవి"; శ్రీ వసుబాబు "అద్యంతాలు-అంతర్యాలు"; శ్రీ తులసీకృష్ణ "నత్తగుల్లలు"; "ఋతుపవనాలు"; కుమారి ఎస్. సీలమదేవి "యామినీ కుంతలాలు"; శ్రీమతి యమునారాణి ఇందూర్

"నా ఇల్లు - నా సంసారం"; ఏ. కామకృష్ణారావు "జీవన సమరం"; శ్రీ పాలగోడేటి సత్యనారాయణరావు "మనస్సాక్షి" శ్రీ అక్కల సరస్వతీబాబురావు "పచ్చల కలశంలో మేలి ముత్యాలు"; శ్రీ ఘంటిగోట బ్రహ్మాజీరావు "పరుగులిడే చక్రాలు - ప్రవహించే జీవితవాహిని"; శ్రీమతి సి. విజయ లక్ష్మి "మధుభూమిలో మల్లెతీగలు" మున్నగునవి.

ఆంధ్రజ్యోతి-ఆంధ్రజ్యోతి వారపత్రిక. తెలుగు నాట ప్రప్రథమమునుండియు నూతన సాహిత్య ప్రక్రియల ప్రవేశమునకు స్వాగతము చెప్పి, వాని అభివృద్ధికి పాటుపడు చున్న ముఖ్యులలో ఆంధ్రజ్యోతి సంపాదకులు శ్రీ నార్ల వెంకటేశ్వరరావు ఒకడు. పత్రికలయందలి భిన్నశీర్షికలకు పేర్లు పెట్టుటతోపాటు ప్రతి విషయములోను నూతనత్వమును కాంక్షించుచున్న వ్యక్తి ఆయన. ఆదివారమునాడు వెలు వడు "ఆంధ్రజ్యోతి" అనుబంధ పంచికలలో శ్రీ పురాణం కుమార రాఘవశాస్త్రి "పచ్చతోరణం", శ్రీ వీరమల్లు రామకృష్ణ "పెద్దగోడలు", డాక్టర్ జి. వి. కృష్ణారావు "రాగరేఖలు" నవలలను చదివిన ఆ విషయము తేలియును, శ్రీ నార్ల యాజమాన్యమున ప్రచురితమగు ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రికలో వెలువడిన శ్రీ యస్. ఆర్ ఘంటి "నైమిశారణ్యం" చదివినచో ఆ విషయము ధ్రువముగా వ్యక్త మగును. మన దేశమును పట్టి పీడించుచున్న ముఖ్య సమస్య లలో హరిజన సమస్య ఒకటి. ఆ సమస్యపైన "మాలపల్లి"

తరువాత అంతటి ఉత్తమ నవల వెలువడుటకు శ్రీ నార్ల విశాల దృక్పథమే కారణము. దీనికి పీఠిక వ్రాయుచు శ్రీ పురాణం సుబ్రహ్మణ్యశర్మ తెలిపిన ఈ క్రింది మాటలు చదివినచో అది ఏనాడు తొలియగలదు- "అగ్రవర్ణస్తులు తమకంటే తక్కువ జాతివారిలోని ఉత్తమ సంస్కారాన్ని చూచి ఓర్వరు. ఈ నవలలోని రామదాసు ఉత్తమోత్తముడు. ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక ఇటువంటి ఉత్తను నవలను తెలుగు పాఠకలోకానికి పరిచయంచేసి పాఠకుల ఆసక్తిని వారి అభిలాష స్థాయిని యెంతో యినుమడింపజేసింది" అంటాడు ఆయన. ఈ కోవకు చెందిన మరొక ఉత్తమోత్తను నవల శ్రీ వడ్డగ చండీదాస్ వ్రాసిన "హిమజ్వాల". ఇది కూడ ఆ వారపత్రికలో ధారావాహికముగా వెలువడి అశేష ప్రజాదరణను పొందినట్లదే. ఈ నవలకుగూడ శ్రీ పురాణం ముందు మాట వ్రాయుచు అన్న ఈ మాటలు అత్యుక్తి యెంత మాత్రము కావు. "..... సాహిత్యాకాశంలో పుగుమబ్బుల్ని పురిపించి, మెరుపుల్ని మెరిపించి మబ్బుల చాటునుంచి ఇందు దేవుని మదపు టేనుగులా ఘీంకారము చేస్తూ వచ్చిన రచయిత శ్రీ వడ్డెర చండీదాస్" అంటాడు ఆయన.

విశాలాంధ్ర :- శ్రీయుతులు కొత్రగడ్డ రాజగోపాల రావు, వేములపల్లి శ్రీకృష్ణ, సి. రాఘవాచారి మున్న గు ప్రగతి శీలకులు ఈ పత్రికకు సంపాదకులుగా నుండుట చేత వామపక్ష రాజకీయ, సాహిత్య, కళారంగములకు తెలుగునాట

ఇది కేంద్రమై నెగడుచున్నది. ప్రపంచ భాషలనుండియూ, భారతీయభాషలనుండియు వెలువడిన పెక్కు నవలల అనువాదములతోపాటు, తెలుఁగునాటియందలి యువతరపు రచయితల సరిక్రొత్త భావములనుగూడ ఈ పత్రిక ఆదివారమునాటి సారస్వతానుబంధములలో ప్రకటించి ప్రజలలో భావసంచలనమును కేకెత్తించినది. ఈ పత్రిక 1961 సం. లో నడపిన నవలల పోటీలలో శ్రీ మహీధర "కత్తుల వంతెన", శ్రీ గంగినేని "పాము-నిచ్చెన" వంటి ఉత్తమ నవలలకు బహుమతులు లభించి, అవి అశేష ప్రజాదరణను పొందినవి.

మిూ జాక్ పత్రిక :- పోలీసుచర్యకు పూర్వము హైదరాబాదు నుండి వెలువడిన ఈ పత్రికకు ప్రముఖ నవలా రచయిత శ్రీ అడవి బాపిరాజు సంపాదకులుగా నుండి, తాను వ్రాసిన "హిమబిందువు", "గోనగన్నారెడ్డి", "తుఫాను" మున్నగు నవలలను ఇందు ప్రచురించెను.

గోలకొండ :- గోలకొండ పత్రికా సంపాదకులుగా వ్యవహరించిన శ్రీ సురవరం ప్రతాపరెడ్డి, శ్రీ నూకల నరోత్తమరెడ్డి ఈ పత్రికలో తెలుఁగు నవలలను కొన్నింటిని వ్యాసానుబంధములలో ప్రకటించి, తెలుఁగు నవలల విస్తరణకు తోడ్పడిరి. ఆంగ్ల పాలకులు కుటిల రాజనీతితో వంగ రాష్ట్రమున 1942 వ. సం. న. భయంకరమైన కరువును సృష్టించిరి. ఎనిమిది లక్షలమంది ఆకరువునకు గురియై తమ ప్రాణములను గోలుపోయిరి. ప్రముఖ వంగ రచయిత

శ్రీ భభిసీ భట్టాచార్య ఆ భీభత్స పరిస్థితులను కన్నులకు గట్టు నట్లు వర్ణించెను. ఆ నవలను శ్రీ యం. కా కా చార్య "ఆకలి" అన్న పేరుతో తెనిగించి, ఆ పత్రికలో ప్రకటించిరి. ఇది ఆ పత్రికాముఖమున వెలువడిన ఉత్తమ నవల.

ఆంధ్ర భూమి :- ప్రముఖ ఆంగ్ల పత్రికా రచయిత, శ్రీ ఖాసా సుబ్బారావు యాజమాన్యమున వెలువడిన "తెలుఁగు స్వతంత్ర" వార పత్రికకు సంపాదకుడుగా పనిచేసి ఆ పత్రికలో పెక్కు నవలలు ప్రకటించి, ప్రస్తుతము 'ఆంధ్ర భూమి' దిన పత్రికకు సంపాదకుడుగానున్న శ్రీ గోరాశాస్త్రి ఈ పత్రిక ఆదివారమునాటి సంచికలలో కొన్ని ప్రముఖ రచయితల నవలలను ప్రకటించుటయేగాక, తాను స్వయముగా "సెలవు ల్లో" అను ఉత్తమశ్రేణి నవలను గూడ వ్రాసి తెలుఁగు పఠితల హృదయములను చూరగొని, ఈ సాహిత్య విభాగ విస్తరణకు గొప్ప చేయూతనొసగెను.

కృష్ణా పత్రిక :- 1902 వ. సం. స్థాపింపబడిన ఈ జాతీయ వార పత్రికకు సర్వశ్రీ ముట్నూరి కృష్ణారావు, కమలాకర వెంకటరావు, ముదిగొండ సుబ్రహ్మణ్యశర్మ వంటి ప్రసిద్ధులు సంపాదకులై ఈ నవలా సాహిత్య ప్రగతికి స్వాతంత్ర్యము సిద్ధించకపూర్వము, సిద్ధించిన అనంతరము యెనలేని కృషి సలిపిరి. ఈ సందర్భమున ఆ పత్రికలో వెలువడిన శ్రీ విశ్వనాథవారి "ఆఱు నములు", "బాణావళి", శ్రీ కొండమూరి శ్రీరామచంద్రమూర్తి "దైవోపహతులు";

జగద్విఖ్యాత ఆంగ్ల నవలా రచయిత శ్రీ సర్ వాల్టర్ స్కాట్ "ఐవాన్‌హో" నవలకు ఆంధ్రానువాదము పేరొందదగిన రచనలు. ఈ పత్రిక వజ్రోత్సవముల సందర్భమున 1964 వ. సం. లో జరిగిన నవలల పోటీలలో కుమారి పద్మావతి "మహోదయం"; శ్రీ జి. ఆంజనేయులు "విజయపథాక" శ్రీ కోదూరి రామమూర్తి "రాగమాలిక" నవలలకు క్రమముగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు లభించినవి.

ప్రగతి సచిత్ర వార పత్రిక :- అభ్యుదయ భావములుగల శ్రీ ముక్కామల నాగభూషణం దీని సంపాదకుడు. ఈ వారపత్రికలో కుమారి బద్దెపూడి సుధారాణి "ఉషోదయం", శ్రీ పినిశెట్టి శ్రీరామమూర్తి "పిచ్చోడి పెళ్ళి", శ్రీ రాజీవ్ "వికృత విజయం" వంటి ప్రగతిశీలక నవలలతో పాటు, ప్రసిద్ధ రష్యన్ రచయిత శ్రీ బోరిస్ లావరెనోవ్ "ఫార్టీ ఫస్ట్" నవలను శ్రీ పురిపండా అప్పలస్వామి "నీలి కళ్ళు" అను పేరునను, భారతీయ ప్రముఖ రచయిత శ్రీ కిషన్‌చందర్ నవలను శ్రీ మోహన్ రాజేష్ "ప్రేమజ్వాల" అను పేరునను అనువదించి ఇందు ప్రకటించిరి.

తెలుగు స్వతంత్ర, ప్రజామత, జాగృతి మున్నగు వారపత్రికలు ప్రగతిశీలక దృక్పథముతో తమ పత్రికలలో పెక్కు నవలలు ధారావాహికముగా ప్రచురించి తెలుగు నవలా వికాస విస్తరణకు మిక్కిలి తోడ్పడినవి గనుక వాటి పేర్లను సైతము ఇచ్చట స్మరించితిని.

తరుణ మాస పత్రిక :— నేటి యువతరపు భావములకు శ్రీ భాసాని సుదర్శన్ రెడ్డి సంపాదకత్వములో వెలువడు "తరుణ" ప్రతిబింబము. ఈ మాసపత్రికలో సీరియల్‌గా వెలువడుచున్న శ్రీ మతి యద్దనపూడి సులోచనా రాణి "బంధీ", చిట్టారెడ్డి సూర్యకుమారి "కన్నపిల్లలు". శ్రీమతి పరిమళా సోమేశ్వర్ "వలయం" నవలలు పరిచిన పై విషయము వ్యక్తమగును.

జయశ్రీ మాస పత్రిక :— 'సుధానిధి' సంపాదకత్వమున వెలువడు ఈ మాసపత్రికలో 'వసుంధర' వ్రాసిన "అలుముకున్న అంధకారం", శ్రీ సోమంచి రామం "పెద్దక్క", రంగనాయకమ్మ "అంధకారంలో" మొదలగు మంచి నవలలు.

యువ మాస పత్రిక :— నవలల ప్రచురణకే అధిక ప్రాధాన్యతనిచ్చి వడుపబడుచున్న మాసపత్రిక 'యువ'. దీని సంచాలకుడైన శ్రీ చక్రపాణి తెలుఁగునాట యువతరపు నవ పోకడలకు, ఆలోచనలకు ప్రాధాన్యతనిచ్చి అభ్యుదయ భావ సంపన్నములై వెలువడుచున్న పెక్కు నవలలను ఇందు ప్రకటించి ఈ సాహిత్యవికాసమునకు తోడ్పడుట మిక్కిలి ముదావహము. ఈ పత్రిక పాత సంచికలను తిరుగవేసిన యెడల ముఖ్యముగా రచయిత్రుల రచనలకు వారిచ్చుచున్న చేయూతను అంచనాకట్టి చెప్పుట చాల కష్టము. దిఙ్మాత్రముగా ఆ పత్రికలలో ధారావాహికముగా ప్రచురితములైన కొన్ని

నవలల నిచ్చట పేర్కొందును— శ్రీమతులు ఆలేటి నాగమణి "ఛాయ", గోదూరి కౌసల్యాదేవి "బృందావనం", యద్దన పూడి సులోచనారాణి "షేమ్", పోల్కంపల్లి శాంతాదేవి "మనసు ఒకరికే, మనిషి ఒకరికే", "రేకులు విరిసిన మొగ్గ", సి. ఆనందారామం "విద్య", "నీరజ", మాదిరెడ్డి సులోచన "అందని పిలుపు", "అగ్నిపరీక్ష"; కావిలిపాటి విజయలక్ష్మి "పోరాటం", గోపులాదేవి "గెలుపెవరిది?", ఇల్లిందుల సరస్వతీదేవి "మంచివాడు"; కె. రామలక్ష్మి "అన్నపూర్ణ", గోవిందరాజు సీతాదేవి "సిరి", మరియు శ్రీయుతులు ధనికొండహనుమంతరావు "తీర్పు", "లోకచరిత్ర"; కొడవటి గంటి కుటుంబరావు "నీకేం కావాలి"; షీలా శివరావు "భ్రమర": నవగిరి నంద "రాణి చిన్నాదేవి" మున్నగునవి.

విశ్వ రచన :— ప్రసిద్ధ నవలా రచయిత శ్రీ పోతుకూచి సంపాదకత్వములో వెలువడు ఈ మాస పత్రికలో శ్రీమతి పరిమళా సోమేశ్వర్ "చైతన్య ప్రవంతి": శ్రీ పోతుకూచి "చలమయ్య వప్పిపూర్తి" వంటి రసవత్తరమైన రచన లెన్నియో ప్రచురింపబడినవి.

జ్యోతి :— కీ. శే. వి. వి. రామయ్య మేనేజింగ్ ఎడిటర్‌గానున్న కాలమున శ్రీయుతులు నండూరి రామమోహనరావు, ముళ్లపూడి వెంకటరమణ, రావికొండలరావు, వి. ఎ. కె. రంగారావు సంపాదకవర్గముగా వ్యవహరించిన ఈ మాసపత్రికలో శ్రీ బి. ఎ. రంగారావు

"మూర్ధదర్శి", రంగనాయకమ్మ "చదువుకున్న కమల", యద్దనపూడి సులోచనారాణి "ఆశల శిఖరాలు" వంటి పేరెన్నికగన్న నవలలు వెలువడినవి.

ఆంధ్రప్రదేశ్:- ప్రభుత్వ సమాచార, పౌరసంబంధ శాఖలచే నిర్వహింపబడుచున్న ఈ మాసపత్రికలో శ్రీ విశ్వనాధ "మిహిరకులుడు", శ్రీ పాలగుమ్మి "బ్రతికిన కాలేజి", కుమారి వాసిరెడ్డి సీతాదేవి "అడవి మల్లె" వంటి నవలలు వెలువడి ప్రజాదరణను పొందినవి.

సృజన :- శ్రీ వరవరరావు సంపాదకత్వమున నడుపబడుచున్న ఈ త్రైమాసిక పత్రికలో శ్రీ నవీన్, మానో వైజ్ఞానిక నవల "అంపశయ్య" వెలువడి, తెలుఁగు నవలా ప్రపంచములో ఒక సంచలనమును కలిగించినది.

పసి పిల్లల ఆలోచనలకు, అభిరుచులకు అనుగుణముగా కొన్ని సచిత్ర మాసపత్రికలు వడువబడి, వాని లో బాల సాహిత్య సంబంధమైన కొన్ని అద్భుత రచనలతోపాటు మన సాహిత్య సంప్రదాయములు ప్రతిబింబించునట్టి కొన్ని నవలలు ప్రచురింపబడుచున్నవి. వానిలో కొన్ని పత్రికల నిచ్చట ముచ్చటింతును.

చందమామ :- శ్రీయుతులు నాగిరెడ్డి - చక్రపాణి సంయుక్త సంపాదకత్వమున వెలువడు ఈ సచిత్ర మాస పత్రికలో "విచిత్ర కవలలు", "యమ పర్వతము", "రాతి రథము", "శిధిలాలయము", "రాకాసి లోయ", "మహా

భారతం", "కృష్ణావతారం", "మిత్రభేదం", "శివపురాణం" వంటి అద్భుత రచనలు వెలువడి, బాలబాలికల హృదయము లను ప్రఫుల్లమొనరించినవి.

బొమ్మరిల్లు :- హృదయములను రంజింప జేయు నట్టి బొమ్మలతో శ్రీ విజయబాపినీడు సంపాదకత్వమున వెలు వడు మాసపత్రిక ఇది. "మృత్యులోయ", "మహాభాగవతం" వంటి రచనలు ఇందు వెలువడినవి.

బాలమిత్ర :- శ్రీ బి. వి. రాధాకృష్ణ సంపాదకత్వ మున వెలువడు ఈ మాసపత్రికలో "ఉక్కుపిడి", "మాయావి", "విషవలయం" వంటి విచిత్రాద్భుత సన్నివేశములతో నిండిన నవలలు వెలువడి బాలులను రంజింపజేసినవి.

బాలానందం :- శ్రీ యం. సాయికుమార్ సంపాద కత్వమున ప్రచురితమగుచున్న ఈ సచిత్ర మాసపత్రికలో "బంగారు నగరం", "బెక్‌హార్", "వృశ్చిక లోయ" వంటి నవలలు వెలువడి బాలుల హృదయములను చూరగొనినవి.

చలనచిత్ర సంబంధమైన తాజా వార్తలకు, కథలకు, విమర్శలకు, ప్రశ్నోత్తరములకు, రంగు రంగుల బొమ్మలకు రంగభూమియై నడచు చున్న రూపవాణి, చలనచిత్ర, విజయ చిత్ర, సినిమారంగము మున్నగు మాసపత్రికల సంపాదకులు పాఠకుల అభిరుచులను పూరించు తలంపుతో వివిధ దృక్పథ ములుగల రచయితలచేత నవలలు వ్రాయించి తమ తమ పత్రికలలో వానిని ధారావాహికముగా ప్రచురించు

టను బట్టి, నేటి పఠితలకు ఈ సాహిత్యముపై నగల అభిరుచి వ్యక్తమగును. ఈ సందర్భమున రూపవాణిలో వెలువడిన శ్రీ) ఆలపాటి "దేవుడిలీల - మనుషులగోల", శ్రీ) దగ్గుపాటి "పంతులుగారి అమ్మాయి", చలనచిత్రలో ప్రచురితమైన కుమారి వాసిరెడ్డి సీతాదేవి "రాబందులూ-రామచిలుకలు" పేర్కొనదగిన కొన్ని నవలలు.

అభిసారిక, రేరాణి, మదన, రసికపి)య మున్నగు మాసపతి)కాధినేతలు తమ పతి)కలద్వారా స్త్రీ, పురుషుల లై ంగిక సంబంధమైన వి జ్ఞా న ము నందించుటతోపాటు, తత్సంబంధమైన నవలలను గూడ తమ పత్రికలలో ప్రచురించి తెలుఁగునాట ఈ సంబంధమైన నవలలకు మంచి పో)త్సా హమునిచ్చిరి. ఈ నవలలు పై కి కొంత అశ్లీలముగా కను పించినను స్త్రీ, పురుషుల హృదయములను నిరంతరము వేధించుచున్న మానసిక రుగ్మతలను, శారీరక బలహీనతలను, అవి యేర్పడుటకుగల కారణములను, నివారణోపాయములను సూచించి చక్కని విజ్ఞానము నందించుచున్నవి.

"డిటెక్టివ్" సాహిత్యమునకు సంబంధించిన కొన్ని మాసపత్రికలు తెలుఁగునాట ప్రచురితమై తత్సంబంధమైన పెక్కు నవలలను ప్రచురించుచున్నవి.

పై పత్రికల సంపాదకులతో పాటు, ఆయా పత్రికలలో సహాయ సంపాదకులుగా వ్యవహరించుచున్న పెక్కుమంది, ప)పంచ వాఙ్మయమున ఈ శాఖా సాహిత్యమునకు గల ప్రాము

ఖ్యతను, పా్రధాన్యతను గుర్తించి తెలుఁగునాట దీని వికాస మునకు, విస్తరణకు మిక్కిలి తోడ్పడిరి. స్వాతంత్ర్యము సిద్ధించిన పిమ్మట ఈ శాఖాభివృద్ధికి పత్యక్షముగను, పరోక్షముగను దోహదము చేయుచున్నవారెందరో గలరు.

తెలుఁగు నవలా వికాసమునకు ఇవాలోకప్రాప్తి నందించిన ప్రచురణ సంస్థలు – సాహిత్య సంస్థలు – విశ్వ విద్యాలయములు.

తెలుఁగు నవలా వికాసమునకు వివిధ పత్రికలు. వ్యక్తులు సలిపిన కృషిని వెనుకటి భాగమున పా్రస్తావించితిని. ఇక్కడ ఆయా సాహిత్య సంస్థలు ఈ విభాగ పచురణకు ఇచ్చుచున్న చేయూతను వివరింతును. వ్యక్తుల పో్రత్సాహ ముతో పత్రికలు వెలువరించిన నవలలనేగాక వెక్కుమంది ఇతర రచయితల నవలలను గూడ గ్రంథరూపమున పా్రజల కందించి అవి బహుజనాదరణను సంతరించుకొనునట్లు చేయు నది ప్రచురణ కర్తలు, గ్రంథ విక్రేతలే గనుక వారు నిర్వ హించుచున్న ఈ గురుతర బాధ్యతను ఇచ్చట పత్రి పాదింతును. పా్రజలకు, రచయితలకు మధ్యన వారే వార ధులై, సారథులై వ్యవహరింతురు.

యం. శేషాచలం అండ్ కో :– తెలుఁగు నాట ఊరూర, వాడ వాడల నవలా సాహిత్య సమారాధనము

చేయుచున్న ఈ ప్రముఖ ప్రచురణ సంస్థను 1928 సం. న. శ్రీ మద్దూరి శేషాచలం మచిలీపట్టణములో 'విద్యావిషయక పాఠ్య గ్రంథముల' నిమిత్తము నెలకొలిపెను. ఆ పిమ్మట 1957 వ. సం. సికింద్రాబాద్‌లో 'ఆంధ్రప్రదేశ్ బుక్ డిస్ట్రిబ్యూటర్స్' అను సంస్థను యేర్పాటుచేసి దానికి అనుబంధముగా "ఇంటింటా స్వంత గ్రంథాలయం" అను సరికొత్త ప్రణాళికద్వారా తెలుగునాట ప్రజలలో గొప్ప సంచలనము కలిగించి, కొన్ని వందల స్వంత గ్రంథాలయములను యేర్పరచుకొనుటకు తోడ్పడెను. ఈ సంస్థ వ్యవస్థాపకుడైన శ్రీ శేషాచలం దూరదృష్టితో ప్రజాభిరుచులను గుర్తించి, నవలా సాహిత్య అవిరళ ప్రచారము నిమిత్తము భారీయెత్తున 1967 వ. సంవత్సరము అక్టోబరులో "ఎకొనోమీ పాకెట్" పుస్తక ప్రచురణను ప్రారంభించెను. నెలకు నాలుగు నవలలు చొప్పున ప్రతినెల ప్రముఖ రచయితలచేత నవలలు వ్రాయించి అందమైన ముఖచిత్రాలంకరణలతో ప్రచురింప మొదలిడెను. మొదటి నాలుగు నవలల ఆవిష్కరణ సందర్భమున అనాటి ముఖ్యమంత్రి శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డి అన్న ఈ మాటలు చూడండి. "విద్యావంతుల సంఖ్య పెరిగి, ప్రజలలో పుస్తక పఠనాభిలాష హెచ్చుతూవున్న ఈదశలో ప్రజలకు ఉత్తమ రచనలు అందజేయువలెనని, లేకపోతే ప్రజలు అవాంఛనీయమైన పుస్తకములను ఆశ్రయించటం కద్దూ అని, వాటి ప్రభావం మంచిగా ఉండదు" అని. "తెలుగు నవలా

సాహిత్య ప్రచురణలో మీ స్కీము పూర్తిగా సరిక్రొత్త బాట వేసింది" అన్నాడు ప్రముఖ రచయిత శ్రీ కొడవటిగంటి. "తక్కువ వెల. మంచి గెటప్ గనుక ఇవి ప్రజలలో బాగా వ్యాప్తి చెందగల" వని నా విశ్వాసం అన్నాడు ప్రముఖ జర్నలిస్టు శ్రీ డి. ఆంజనేయులు. ఫై పెద్దల శుభాకాంక్షలతో ప్రారంభమైన ఈ పంస్థ 1974 జూన్ చివర వరకు msco ప్రచురణలుగా 40 నవలలను, Emesco Pocket Books గా 136 నవలలను ప్రచురించినది. వీనిలో రచయితలు, రచయిత్రులు వ్రాసిన నవలలు చెరిపగముగా ఉండుట గమనించదగిన ప్రగతి. సాంఘిక, చారిత్రక, అనువాద నవలలతోపాటు, బాల వాఙ్మయమునకు సంబంధించిన నవలలను గూడ ఈపంస్థ ప్రచురించుట మరొక ప్రత్యేక విశేషము. ఈ పంస్థ రచయితలకు 10% రాయలటీ నిచ్చి ప్రోత్సహించుచున్నది. దీని పద్ధమున వెలువడు నవలల యోగ్యతను పరీక్షించి ప్రచురించుటకుగాను, ఇంతవరకు శ్రీయుతులు డి. రామలింగం, ఆచంట జానకిరాం, బి. వి. సింగరాచార్య, బాలాంత్రపు నళినీకాంతరావు వంటి ప్రముఖ రచయితలు, అనుభవజ్ఞులు సంపాదకులుగా వ్యవహరించిరి. వీరి పలహా, సంప్రదింపుల ననుసరించి, ఆ పంస్థ కార్యదర్శి, ఉన్నత విద్యాసంపన్నుడును నైన శ్రీయం.యస్. రావు ప్రచురణ కార్యక్రమమును చేపట్టును. శ్రీయుతులు విశ్వనాథ "దూత మేఘము", వి. యస్. అవధాని "ప్రాణాంతక

ప్రణయం"; వి. వి. రాజమన్నార్ "శ్రుతి తప్పిన రాగం": రావి కొండలరావు "(సి) నీతి చంద్రిక"; వీనితోపాటు సినీ సిద్ధ్రప్పునగా వెలువడిన ముళ్ళపూడి వెంకటరమణ "బుద్ధి మంతుడు"; యద్దనపూడి సులోచనారాణి "ప్రై జ వా న్"; ముళ్ళపూడి, ఆదుర్తిల "సంపూర్ణ రామాయణం"; శ్రీమతులు అద్దేపల్లి వివేకానందదేవి "కళ్యాణ ఘడియ"; ఎ. లక్ష్మీరమణ "బ్రతుకు జోడు"; వాసిరెడ్డి సీతాదేవి "వైతరణి"; మున్నగునవి ఈ సంస్థ పత్రికలలో వెలువడిన కొన్ని మంచి నవలలు. శ్రీ శేషాచలం, వారి కుమారుడు శ్రీ యం. యస్. రావు ఈ సంస్థ పత్రికలలో "పుస్తక ప్రపంచం" అను ఒక మాసపత్రికనుగూడ నడుపుచు తెలుఁగు నవలా సాహిత్య వికాసమునకు యెనలేని కృషి సలుపు చుండుట ప్రశంసింపదగిన విషయము.

ఆంధ్ర గ్రంథమాల: శ్రీ నాగేశ్వరరావు పంతులు 1926 వ. సం న నెలకొలిపిన ఈ సంస్థలో స్వాతంత్ర్యము సిద్ధించిన పిమ్మట గూడ ఆ సంస్థ యజమానులు ఆంధ్రపత్రిక, సచిత్ర వారపత్రిక, భారతి మున్నగు పత్రికలలో ధారా వాహికముగా వెలువరించిన పెక్కు నవలలను పుస్తక రూప మున వెలువరించిరి. శ్రీ విశ్వనాథ "స్వర్గానికి నిచ్చెనలు", "తెఱచిరాజు"; శ్రీ నోరి "నారాయణభట్టు", "రుద్రమదేవి"; శ్రీ శారద "మంచీ-చెడూ" వంటి స్వతంత్ర నవలలతోపాటు "రెండు మహానగరాలు", "కౌంట్ ఆఫ్ మాంట్ క్రిస్టో",

"టామ్‌సాయర్", "అల్లీ బిల్లీ లోకంలో అమ్మాయి కథ" వంటి అనువాద నవలలను సైతము ప్రచురించిరి.

వావిళ్ళ రామస్వామిశాస్త్రి అండ్ సన్సు : ప్రాచీన గ్రంథ ముద్రణకు పూనుకొనిన ఈ సంస్థ సమకాలిక ప్రజాభి రుచులను గుర్తించి, బంకింబాబు "ఆనంద మఠము", "కపాల కుండల"; శ్రీ భోగరాజు "ఆంధ్రరాష్ట్రము"; శ్రీ పానుగంటి "సాక్షి" సంపుటములతోపాటు పెక్కు ఇతర నవలలను ముద్రించి తెలుఁగు పాఠకుల కందించినది.

దక్షిణ భాషా పుస్తక సంస్థ :- దక్షిణాది భాష లలో ముఖ్యమైన తెలుఁగు, తమిళము, కన్నడము, మల యాళము, మొదలగు భాషలను ఒకదానితో మరొకదానిని సన్నిహితము చేసి, ఆయా భాషలలో వెలువడిన ఉత్తమ గ్రంథములను ఒక భాషనుండి మరొక భాషలోనికి సమర్థు లైన వారిచేత భాషాంతరీకరణము చేయించి, చౌక ధర లలో వానిని ప్రజలకందించు ఉద్దేశ్యముతో ముద్రాసులో ఈ సంస్థ నెలకొల్పబడినది. దీని పక్షమున వివిధ భాషలలో ఐదు, ఆఱువందల గ్రంథములు ప్రచురింపబడినవి. ఇతర సోదర భాషలలో వెలువడిన ఉత్తమ నవలలను, బాల వాఙ్మయమునకు సంబంధించిన పుస్తకములను ఇది ప్రచు రించి, పాఠకులలో జాగృతిని కలిగించినది.

వేంకట్రామా అండ్ కో., :- 'విద్యా విషయక పాఠ్యగ్రంథముల' ప్రచురణలోపాటు ఈ సంస్థ తన వివిధ

ప్రాంచీలద్వారా తెలుగులో వెలువడిన పెక్కు నవలలను వికసింపచేయుటయేగాక, విద్యార్థుల ఉపవాచకముల నిమిత్తము పెక్కు నవలలను సమర్థులచేత వ్రాయించి ప్రచురించినది. బాలబాలికల హృదయములు వికసింపజేయుటకు చిరుప్రాయములను విశేషముగా ప్రకటించి బాలవాఙ్మయ వికాసమునకు మిక్కిలి కృషి చేసినది. తెలుగునాట ఈ సంస్థకు ఉన్నన్ని ప్రాంచీలు మరి యే ఇతర విద్యా సంస్థలకును లేవు.

త్రివేణి పబ్లికేషన్సు :- మచిలీ బందరులో నెల కొల్పబడిన ఈ సంస్థ శ్రీ భావరాజు నరసింహారావు నేతృత్వమున 'విద్యావిషయక పాఠ్య గ్రంథముల ప్రచురణ'తో పాటు శ్రీ అడవి, శ్రీ విశ్వనాథ, శ్రీ నోరి మున్నగు ప్రముఖ నవలా కర్తల నవలల నెన్నింటినో ప్రచురించి, అందమైన గెటప్‌తో ప్రజల కందించుచున్నది.

స్వాతంత్ర్యము వచ్చిన అనంతరము విజయవాడ నవలా ప్రచురణకు కూడలియైనది గనుక ఈ సాహిత్య విభాగమునకు అక్కడ జరుగుచున్న కృషిని పొందుపరతును.

దేశి ప్రచురణలు :- ప్రముఖ వంగ నవలా రచయిత శ్రీ శరత్ నవలల నెన్నింటినో పెక్కు సంవత్సరముల నుండి ఇతరులు అనువాదములు చేసి ప్రకటించినను, దేశి ప్రచురణాల వ్యవస్థాపకులైన శ్రీ బొందలపాటి శివరామకృష్ణ, శ్రీమతి శకుంతలాదేవి "శ్రీకాంత్ నుండి, ఒడదీది" వరకు గల పెక్కు నవలలను స్వయముగా అనువాదములు చేసి, ఇత

రులచేత చేయించి, ఈసంస్థ పత్రికలో సంపుటములుగా వెలువరించి తెలుఁగునాట ఈ సాహిత్యమునకు అధిక ప్రచారము కలిగించి, శరత్ 'తెలుఁగు వాడే' నను నంతటి భ్రమను ప్రజలలో రేకెత్తించి ఒక దశాబ్దము పాటు తెలుఁగు నవలా సాహిత్యజగత్తులో "శరత్ యుగ" మును సృష్టించిరి. శరత్ నవలలతో పాటు భారతీయ భాషలలో వెలువడిన విశిష్టమైన వెక్కు నవలలను వీరు అనువదించి ప్రకటించిరి.

విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ :- శ్రీయుతులు దాశరథి రంగాచార్య "మాయ జలతారు"; నిడదవ్రోలు సత్య నారాయణమూర్తి "సుశీల"; అంగర వెంకటకృష్ణారావు "విరామం" మున్నగు ప్రగతిశీలక తెలుఁగు రచయితల స్వతంత్ర నవలలేగాక, శ్రీయుతులు రాహుల్ సాంకృత్యాయన్ "నూకపంచాది"; ప్రేమ్‌చంద్ "గబన్"; కిషన్‌చంద్ "ఐదుగురు లోఫర్లు"; సుబ్రహ్మణ్యభారతి, "చండికథ" మున్నగు భారతీయ రచయితల నవలలతో పాటు ప్రపంచ సాహిత్యమున ఉన్నతస్థానము నలంకరించిన శ్రీ యుతులు ఎ. జె. క్రానిన్ "ఎదురుదెబ్బలెన్ని తగిలినా"; చళోవస్కీ "ప్రేమజ్యోతి"; యం. స్టీల్‌మన్ "వచ్చాయి మంచిరోజులు" వంటి ప్రపంచశ్రేణి నవలల సెన్నింటినో ప్రముఖులచేత భాషాంతరీకరణము చేయించి తెలుఁగు వారికి విశ్వసాహిత్యముతో చక్కని సన్నిహితత్వమును ఈ సంస్థ కలిగించినది. వీనితో పాటు బాలబాలికలకు వినోద విజ్ఞానముల వందించునట్టి

ఉన్నత శ్రేణి పుస్తకముల నెన్నింటినో మన రచయితల చేత వ్రాయించి ప్రకటించుటయేగాక, ఇతర భాషలనుండియు అనువదింపజేసి ప్రచురించినది.

ఆదర్శ గ్రంథ మండలి :- రచయిత, ప్రచురణ కర్తయైన శ్రీ గద్దె లింగయ్య "కథా వాహిని" అను పేరున తెలుఁగు జీవితములను ప్రతిబింబించునట్టి కథా సంపుటములను పెక్కింటిని ప్రచురించుటయేగాక, శ్రీ ఆర్. యస్. సుదర్శనం "అసుర సంధ్య"; శ్రీ సి. శివరాము ప్రసాద్ "తరగని తరంగాలు", శ్రీ చందూ సోముబాబు "మనసు - మమత" వంటి స్వతంత్ర నవలలతోపాటు, పెక్కు అనువాదములను ప్రచురించి ప్రముఖ ప్రచురణ సంస్థగా రూపు దిద్దుకొనినది.

నవజ్యోతి పబ్లికేషన్సు :- అనేక పత్రికలలో ధారావాహికముగా వెలువడి, అశేష ప్రజాదరణను పొందిన రచయిత్రుల నవలల నెన్నింటినో ఈ సంస్థ ప్రచురించినది. శ్రీమతులు చిట్టా రెడ్డి సూర్యకుమారి "పరిభ్రమణం"; పోల్కంపల్లి శాంతాదేవి "ప్రేమబంధం"; పరిమళా సోమేశ్వర్ "సుగంధి"; యలమంచిలి రుూస్నీలత్మ్మ "రాగమయి"; కె వసుంధరాదేవి "గాలివాన"; శిఖా వెంకట రమణారాజా "నీటి ముత్యాలు"; ఆ సంస్థ వెలువరించిన కొన్ని ఆణి ముత్యాలు.

నవభారత్ పబ్లికేషన్సు :- శ్రీ వడ్డెర చండీదాస్ "హిమజ్వాల"; శ్రీధర "రాగ విపంచి"; శ్రీ కొ[illegible]ంటి

"తా ర"; శ్రీమతి కె. రామ లక్ష్మి, "అ డ ది"; శ్రీమతి బీనా దేవి "పుణ్యభూమీ కళ్ళు తెరువూ!"; శ్రీమతి మాదిరెడ్డి సులోచన "తరం మారింది"; శ్రీయుతి యద్దవపూడి సులోచనా రాణి "జీవన తరంగాలు" వంటి చాపగల నవలలనెన్నింటినో ప్రచురించి, ఈ సంస్థ తెలుగువారి కందించినది.

స్టూడెంట్స్ బుక్ సెంటర్ :- మంచి గెటప్‌తో న వ ల ల ను ప్రచురించు సంస్థ యిది. దీని పట్టికమున శ్రీ యస్. ఆర్. నంది "నైమిశారణ్యం"; శ్రీ రాచకొండ విశ్వనాధశాస్త్రి "రాజు మహిషి-ప్రేమ మహిషి"; శ్రీ చలం "స్త్రీ"; శ్రీయుతులు పురాణం, గొల్లపూడి, కొమ్మూరి వాసిన గొలుసుకట్టు నవల "ఇ డి య ట్"; శ్రీ మతి ద్వివేదుల విశాలాక్షి "ఈ వ్యా క్తి"; శ్రీ మతి వాసిరెడ్డి సీతాదేవి "తిరస్కృతి" వెలువడిన మంచి నవలలు.

నవోదయ పబ్లికేషన్స్ :- ఈ సంస్థ నిర్వాహకుడైన శ్రీ రామమోహనరావు, దీని పట్టికమున ప్రచురితమగు నవలలను యెంచుకొనుటలోను, వానిని ముద్రించుటలోను కడు శ్రద్ధ వహించును. శ్రీ ముళ్లపూడి "ఇద్దరమ్మాయిలూ-ముగ్గురబ్బాయిలూ", "ముళ్లపూడి వారి", "బు డు గు 1", "బుడుగు 2"; శ్రీ అవసరాలరామకృష్ణారావు "సంపెంగలూ-సన్నజాజులూ"; శ్రీ బి వి. రమణ "సంధ్య"; శ్రీ గోపీచంద్ "చీకటి గదులు", "పండిత పరమేశ్వరశాస్త్రి వీలునామా" మొదలైన కొన్ని గుర్తుంచుకొనదగిన మంచి నవలలు.

శ్రీ పబ్లికేషన్సు :- ఉత్సాహశీలియైన శ్రీ వైకా గోపాలం ఈ సంస్థను స్థాపించి, ఒడియా భాషలో బారిష్టర్ గోవిందదాస్ వ్రాసిన పంచలనాత్మక నవలను" అమావాస్య చందు)డు" అను పేరుతను, బోరిస్ లావరీనోవ్ ప్రసిద్ధ రష్యన్ నవల "ఫాట్‌ఫిఫ్ట్" ను, "నీలికళ్ళు" అను పేరుతను శ్రీ పురిపండ అప్పలస్వామిచే అనువదింపజేసి ప్రచురించెను. అటులనే "స్విస్ ఫామిలీ రాబిన్సన్" అను ఆంగ్ల నవల యందలి కొన్ని సంఘటనలను ఆధారము చేసికొని శ్రీ పోలి శెట్టి నాగేశ్వరరావు "అంబాలదీవి" అను పేరున పిల్లల కొరకు సరికొత్త రీతిలో అనువదింపజేసి ప్రచురించెను.

నటరాజ పబ్లికేషన్సు :- మంచి ఆలోచనను కేకెత్తించి, హృదయమును స్పందింపజేయుగల ఉత్తమ నవలలను తెలుఁగు పఠితల కందించు తలంపుతో శ్రీ కొండపల్లి నర్సయ్య దీనిని స్థాపించెను. అందమైన ముఖచిత్రములతో, చక్కని గెటప్‌తో తప్పులు లేకుండునట్లు శ్రద్ధ వహించి, నాలుగు కాలములపాటు ప్రజల మధ్యన నిలువగల కొన్ని నవలలను దీని పక్షమున ప్రచురించెను. శ్రీమతి మునిపల్లి సరోజినీదేవి "మనసు-మనుషు", శ్రీమతి ఝాన్సీరాణి "పసిడి పంజరం", "సంధ్యవిరిసిన పంపంగి", శ్రీ ఎ. బి. వి. నరసింహారావు "మల్లెల మనసులు", శ్రీ ప్రశాంత "అనుభూతీ నీకు మరణంలేదు"; శ్రీ దంతలూరి గోపాలకృష్ణంరాజు "జీవిత వలయాలు": అట్టి వానిలో కొన్ని. "జీవితవలయాలు"

'ప్రజామిత్ర' వారపత్రికలో సీరియల్‌గా ప్రచురితమైన నవల. 'మారే లోకంతోపాటుగా మారలేక, మానవత్వాన్ని వదలుకోలేక, నీతిగా, నిజాయితీగా, ఆదర్శవంతంగా బ్రతకాలని ఎన్నో-ఎన్నెన్నో కలలుగన్న ఒక అమాయకుడి ఆత్మకథ' ఈ నవల. హృదయమును పిండివేయుగల నవల ఇది.

వి. యస్. ఎన్. అండ్ సన్సు ప్రచురణలు :- శ్రీ విశ్వనాథ "వేయిపడగలు" నవల నుండి "పరీక్ష" వరకు గలనవలలన్నియు ఈ సంస్థ పక్షమున ప్రచురితమైనవి.

ప్రగతి ప్రచురణాలయం :- ప్రస్తుతము విశాలాంధ్ర 'సాహిత్యానుబంధ' సంపాదకులైన శ్రీ నిడమర్తి ఉమారాజేశ్వరరావు తమ సోదరులైన శ్రీ అశ్వనీ కుమార దత్తతో కలసి పశ్చిమ గోదావరి జిల్లా 'నిడమర్రు' గ్రామములో ఈ ప్రచురణాలయమును స్థాపించెను. శ్రీ ఉమారాజేశ్వరరావు ప్రపంచ భాషలనుండి పెక్కు నవలలను అనువదించి ఈ సంస్థద్వారా ప్రచురించి మన నవలా సాహిత్యమునకు మంచి పుష్టిని చేకూర్చెను. శ్రీ క్లాస్ న్యూకాంబ్ Barricader in Berlin అను నవలను "అన్నా" అను పేరునను, శ్రీ లియోటాల్‌స్టాయి Family Happiness నవలను "సంసార సుఖం" అను పేరుననను, శ్రీ ఇ. కజకేవిచ్ Blue Note Book నవలను "నీలం నోట్ బుక్" అను పేరుననను, శ్రీ ముల్క్‌రాజ్ ఆనంద్ Two leaves and a Bud నవలను "రెండు ఆకులు ఒక మొగ్గ" అను పేరుననను తెనిగించెను.

విశ్వసాహిత్యమాల: రాజమహేంద్రవరము నందలి ఈ సంస్థకు శ్రీ మహీధర జగన్మోహనరావు సంపాదకుడు. విశ్వ సాహిత్య సంబంధమైన ఇతర వివిధ రచనలతోపాటు శ్రీ మహీధర రామమోహనరావు "రథ చక్రాలు", "ఒ నమూలు", శ్రీ బలివాడ కాంతారావు "బూచి", శ్రీ భట్టిప్రోలు కృష్ణమూర్తి "గారి" వంటి స్వతంత్ర నవలలు, శ్రీ ఎల్నార్ గ్రేస్ నవలను "దక్షిణ పవనం" అను పేరున శ్రీ మహీధర జగన్మోహనరావు, శ్రీ అడవిబాంబో నవలను "నాడు - నేడు" అను పేరున శ్రీ రామమోహనరావులు అనువదించిరి.

సరస్వతీ గ్రంథమాల :- శ్రీ అద్దేపల్లి లక్ష్మణస్వామి ఈ సంస్థను నెలకొలిపి మన నవలా సాహిత్యమునకు మిక్కిలి తోడ్పడినట్లు లోగడ తెలిపియుంటిని. నేటికిని ఇది దినదిన పరివర్ధమానముగా వర్ధిల్లుచు పెక్కు స్వతంత్రనవలలను, అనువాద నవలలను, అపరాధ పరిశోధక నవలలను వెలువరించుచు ఈ సాహిత్య వికాసమునకు తోడ్పడుచున్నది.

కొండపల్లి వీరవెంకయ్య అండ్ సన్స్: దీని పక్షమున ప్రచురితమైన నవలలు 'సత్యనారాయణ బుక్ డిపో' ద్వారా విక్రయించబడుచున్నవి. శ్రీ మునిమాణిక్యం నరసింహారావు "దీక్షితులు", "రుక్కుతల్లి" నవలలతోపాటు "అల్లాహో అక్బర్", "ధర్మ సామ్రాజ్యము" వంటి పెక్కు నవలలు ఈ సంస్థ ప్రచురించినది.

పత్తగిరి పబ్లికేషన్స్:- నవలా రచయిత

శ్రీ మేఘశ్యాం దీనిని ఖమ్మంలో నెలకొలిపి తన స్వంత నవల లైన "చిత్రశాల", "ప్రియా న్వేషి", "సజీవ శిల్పాలు"; "లహరి" మున్నగువానితోపాటు 1972 వ. సం. ఆంధ్రప్రభ నడిపిన నవలల పోటీలో ప్రథమ బహుమతి నందుకొనిన శ్రీమతి ఎ. రాధారాణి "అన్వేషి" నవలను గూడ ప్రకటించి తెలుఁగు నవలా సాహిత్యమునకు బలమును చేకూర్చెను.

ఆంధ్ర సారస్వత పరిషత్తు : ఇది హైద్రాబాదులో నున్న ప్రముఖ సాహిత్య సంస్థ. ఆంధ్ర సాహిత్య సంబంధమైన ప్రామాణిక గ్రంథములను ప్రచురించుటతోపాటు బాల వాఙ్మయమునకు చెందిన విజ్ఞానాత్మకమైన రచనలను అనుభవజ్ఞులచేత వ్రాయించి ప్రచురించినది. రచయితలు స్వయముగా ముద్రించుకొనిన నవలలను ఈ సంస్థ విక్రయించి వారికి ఆర్థికముగా తోడ్పడుచున్నది.

దేశోద్ధారక గ్రంథమాల :- దేశభక్తుడు, నవలా రచయితయైన కీ. శే. వట్టికోట ఆళ్వారుస్వామి దీనిని స్థాపించి, వివిధ సాహిత్య గ్రంథములతోపాటు నవలలను సహితము ముద్రించెను. ఆయన "ప్రజల మనిషి", "గంగు" నవలలు ఈ గ్రంథమాల పక్షమున ప్రకటింపబడినవే.

ఆంధ్ర విశ్వసాహితి :- రచయిత, శ్రీ పోతుకూచి ఈ సంస్థ పక్షమున శ్రీమతి శిఖా వేంకటరమణరాజు "ప్రగతి మధ్య మనిషి", శ్రీ సాంబశివరావు "ఏడు రోజుల మజిలీ", "అన్వేషణ", మున్నగు నవలలను ప్రచురించెను.

ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి : ఆంధ్రప్రదేశ్ లోని భిన్న ప్రాంతముల భాషా సాహిత్యముల ప్రోత్సాహము నిమిత్తము 1957 వ. సం. ఆగష్టు 7 వ. తేదీన ప్రభుత్వము ఈ సంస్థను నెలకొలిపినది. ఆనాటి రాష్ట్రపతి డాక్టర్ శ్రీ రాజేంద్రప్రసాద్ దీనికి ప్రారంభోత్సవము జరిపెను. ఈ సంస్థ స్థాపింపబడిన నాటినుండి నేటివరకు శ్రీ బెజవాడ గోపాలరెడ్డి, శ్రీ దేవులపల్లి రామానుజరావులు దీనికి అధ్యక్ష కార్యదర్శులుగా నుండి, ప్రతి సంవత్సరము వాఙ్మయము నందలి విభిన్న శాఖలలో ప్రచురితమైన ఉత్తమ రచనలకు బహుమతుల నిచ్చుచు 1964-65 సం. నుండి నవలా రచన కును ఈ బహుమతులను విస్తరింపజేసి, ఒక్కొక్క నవలకు 1116 రూపాయల నిచ్చుటకు మొదలిడిరి. ఆ పథకము క్రింద శ్రీయుతులు నోరి నరసింహశాస్త్రి "నారాయణభట్టు"; పిలకా గణపతిశాస్త్రి "విశాల నేత్రాలు"; కొడవటిగంటి కుటుంబరావు "కార్ల"; శ్రీ రావిపాటి హనుమంతరావు "కొన్నాళ్ళు గట్టికేనేమి"; శీలా వీర్రాజు "మైనా"; దాశరథి రంగాచార్య "చిల్లర దేవుళ్ళు"; శ్రీమతులు ముప్పాళ్ళ రంగనాయకమ్మ "బలిపీఠం"; వాసిరెడ్డి సీతాదేవి "సమత" నవలలకు బహుమతులు లభించినవి. బాలసాహిత్య సంబంధమైన రచయిత్రుల నవలలకు 5గురి చే. బహుమతుల నిచ్చుటకు నిశ్చయించిన వేరొక పథకము క్రింద శ్రీమతులు కె. రామలక్ష్మి "యువరాజు"; కోదూరి లీలావతి "ఆశా కిర

ణాలు"; కంచి రమాదేవి "అనంతంలో అంతం" మున్నగు నవలలకు లభించినవి.

కేంద్ర సాహిత్య అకాడమి :- 1954 శ. సం. మార్చి 12 వ. తేదీన భారతదేశమునందలి ప్రధాన భాషలలో సారస్వతమును అభివృద్ధిపరచి, ఒకదానితో మరొక దానిని సమన్వయము చేయుగలందులకు డాక్టర్ శ్రీ రాధాకృష్ణన్, పండిత శ్రీ జవహర్లాలు వంటి పెద్దల ప్రోత్సాహముతో ఆనాటి కేంద్ర విద్యామంత్రి శ్రీ మౌలానా ఆజాద్ అధ్యక్షతన న్యూఢిల్లీలో ఈ సంస్థ స్థాపింపబడినది. వివిన్న భారతీయ భాషలలో వెలువడిన ఉత్తమ రచనలను ఒక భాషనుండి మరొక భాషలోనికి అనువదించి, ఒక ప్రాంత ప్రజల ఆచార వ్యవహారములను, ఆలోచనలను, అభిరుచులను, సంప్రదాయములను, నాగరికతలను మరొక ప్రాంతపు ప్రజలు ఆకళింపు చేసికొనుటకు ఇది తోడ్పడుచున్నది. దానికి తోడు ప్రతి సంవత్సరము భారతీయ భాషలలో వెలువడిన ఉత్తమ రచనలకు ఐదువేల రూపాయల నగదు బహుమతిని ప్రకటించి రచయితలను ప్రోత్సహించుచున్నది. శ్రీ గోపీచంద్ "పండిత పరమేశ్వరశాస్త్రి వీలునామా" నవలకు ఆ బహుమతి లభించినది. భారతీయ భాషలలో వెలువడిన కొన్ని నవలలను నమర్థులచేత తెలుఁగులోనికి అనువదింపజేసినది. అట్టివానిలో కొన్ని మంచి నవలలు శ్రీయుతులు గోపీనాథ మహంతి "అమృత సంతానము"

కాకాళకాంక బందోపాధ్యాయ "ఆరోగ్యనికేతనము"; తగళి శివశంకరపిళ్ళై "రెండుశేర్లు", "రొయ్యలు"; హరినారాయణ ఆప్టే "అబలా జీవితం"; కాలేల్కర్ "జీవనలీల"; మహమ్మద్ బషీర్ "మా తాతయ్యకొక ఏనుగుండేది"; రజనీకాంత్ "మోరీబాల"; దేశపాండే "విరిగిన విగ్రహాలు"; కె. వి. అయ్యర్ "శాంతల". శ్రీ విశ్వనాధ "వేయిపడగలు", "సహస్రఫణ్" పేరున హిందీలోనికి పరివర్తనము చేయబడినది.

నేషనల్ బుక్ ట్రస్టు ప్రచురణలు :- వివిధ భాషలను ఏకసూత్రాధీనము చేసి, ఒక భాషయందలి మాధుర్యమును, ఇంపు సొంపులను వేరొక భాషవారికందించు తలంపుతో స్థాపించబడిన మరొక సంస్థ ఇది. భిన్న భాషలలో వెలువడిన కొన్ని ఉత్తమ నవలలను ఇది తెలుఁగువారికందించినది. "స్మృతి రేఖలు", "బన్‌గర్వాడి", "చిక్కవీర రాజేంద్ర", "తెల్లని కర్ణం" మున్నగునవి.

ఆంధ్ర విశ్వవిద్యాలయ కృషి : నవలా సాహిత్యాభివృద్ధిలో మంచి ఫలసాయమును తీయుటకు 1984 వ. సం. ఈ కళాపరిషత్తు పోటీలను నిర్వహించినది. ఆ సందర్భమున శ్రీయుతులు విశ్వనాధ "వేయిపడగలు"; భావిరాజు "నారాయణరావు" నవలలకు బహుమతులు లభించి, అవి ప్రజల మన్ననలకు పాత్రమైనవి. అపిమ్మట ఈ పరిషత్తు తెలుఁగు చారిత్రకాంశములపైన ఇంటర్మీడియట్ విద్యార్థుల ఉపవాచకములకొరకు వ్రాసిన ఉత్తమ నవలలకు 1000 రూపా

యుల బహుమతులను ప్రకటించగా 1952 వ. సం. లో కుమారి మల్లాది వసుంధర "తంజావూరు పతనము", నవలకు లభించినది. ఇది తంజావూరు నేలిన ఆంధ్రనాయకరాజులలో అగ్రేసరుడైన శ్రీ రఘునాథరాయల ఆస్థాన జీవితమును, సాతస్వతము పట్ల ఆయనకుగల అభినివేశమును చిత్రించును. ఇట్టి బహుమతి నందుకొనిన ఆమె మరొక నవల "సప్తపర్ణి". ఇది కాకతీయ సామ్రాజ్య వైభవమును వర్ణించును. శ్రీ పాటి బండ మాధవశర్మ "రాజశిల్పి" ఈ కళాపరివత్తువారి బహుమతి నందిన మరొక నవల. ఇది కొండవీటి రెడ్డిరాజుల కాలమునకు సంబంధించినది, కుమారగిరి రెడ్డి, లకుమాదేవి కథ ఇందు నిబద్ధింపబడినది. ఈ సంస్థ బహుమతుల నందిన మరి రెండు నవలలు "భువన విజయము", "గృహరాజు మేడ" అనునవి. రచయిత శ్రీ ధూళిపాళ శ్రీ రామమూర్తి. ఇవి శ్రీకృష్ణదేవరాయ ప్రభువుల కాలమునాటి విజయనగర సామ్రాజ్య వైభవములను చిత్రించును. ఆంధ్ర విశ్వవిద్యాలయమువలెనే శ్రీ వేంకటేశ్వర, ఉస్మానియా విశ్వవిద్యాలయములును ఈ సాహిత్యమున మరికొన్ని పోటీలు నిర్వహించి నచో ఉత్తమ నవలలు మరికొన్ని వెలువడి, తెలుఁగు నవలకు మరికొంత పుష్టి సమకూరును.

పైన వివరించిన సంస్థలేగాక, పురెస్నెడో ప్రచురణ సంస్థలు, జిల్లా రచయితల సంఘములు ఈ సాహిత్య వికాసమునకు దండిగా తోడ్పడుచున్నవి.

వసుధైక కుటుంబ నిర్మాణ మార్గదర్శి
న వ ల.

శ్రీయుతులు కొక్కొండ వెంకటరత్నం, నరహరి గోపాలకృష్ణమ్మ శెట్టి, కందుకూరి వీరేశలింగం మున్నగు విద్వన్మణులు ప్రగతిశీలక దృక్పథముతో పంథొమ్మిదవ శతాబ్ది తృతీయ పాదమున పాశ్చాత్యభాషా సహచర్య, సంపర్కములతో 'తెలుగు నవల' అను 'చిన్న అంటును' ఆంధ్ర సాహిత్య నందనోద్యానమున నాటిరి. "ఇంతింతై, వటు డింతయై మఱియు దానింతై నభోవీధిపై...." అని మహాకవి శ్రీ పోతన బలిచక్రవర్తియొద్ద దానప్రతి గ్రహీతయైన వామనమూర్తి విశ్వరూపుడై విజృంభించిన అవతార క్రమమును వర్ణించి చెప్పినట్లు, అనాటి ఆ చిన్న అంటు పలువురు తెలుగు రచయితల నిరంతర పరిశ్రమతో దిన దిన ప్రవర్ధమానమునంది, చెట్టై, మ్రానై శాఖోపశాఖలతో వలు ముఖముల విస్తరిల్లి మూడు పూవులు ఆరు కాయలై వర్ధిల్లుచు శుభాంధ్ర జనులను మహదానందభరితులను జేయుచు ప్రథమ శతజయంత్యుత్సవములను దిగ్విజయముగా పరిసమాప్తము చేసికొని, ద్వితీయ శతజయంతి ప్రథమ పాదమున కాలుపెట్టి, నిగాఘాటముగా పయనించుచున్నది.

ప్రపంచమునందలి ఇతర భాగములలోను, భారత

దేశములోను, ఆంధ్రదేశములోను ఈ మధ్యకాలమున అనేక మహోద్యమములు నడచి కనివిని యెరుగనంతటి మార్పులు సంభవించినవి. ఈ శతాబ్దపు ప్రథమ, ద్వితీయ పాదము లలో రాజ్య కాంక్షతో, రాజకీయ ప్రాబల్యకాంక్షతో రెండు ప్రపంచ మహా సంగ్రామములు జరిగినవి. సాంఘిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక వ్యవస్థలలో మార్పుల కొరకు, సుస్థిరమైన పరిణామము కొరకు ప్రపంచము నలు మూలల అంతర్యుద్ధములు, శీతల యుద్ధములు, ప్రచ్ఛన్న యుద్ధములు, విప్లవములు చెలరేగినవి. పారతంత్ర్యమున మగ్గుచున్న పెక్కు దేశముల ప్రజలు తమ నిరంకుశ ప్రభుత్వముల కబంధహస్తములనుండి బయటపడి, స్వేచ్ఛా వాయువులను పీల్చగలందులకు హింస, అహింసా మార్గము లతో పోరాటములు సలిపి, భూరి విజయములను సాధించిరి. దానితో రాజరికపు వ్యవస్థ అంతరించిపోయి. ప్రజాస్వామ్య ప్రభుత్వములు ప్రపంచ వ్యాప్తముగా వీక్షడినవి. ప్రజల మనుగడలో, నడవడికలో, ఆలోచనలలో, అభిరుచులలో హస్తి మశకాంతము కారతమ్యములు వీక్షడి, నూతన భావ శకోదయమైనది. ప్రపంచ పట స్వరూపమే కారుమారైనది. ఈ శుభోదయమునకు విశ్వవ్యాప్తముగా రచయితలు, రచ యిత్రులు సలిపిన కృషి అనల్పమైనది. ఈ మార్పులను ప్రతిబింబించునట్లు ఇంతవరకు నవలా సాహిత్యప్రక్రియలో పుంభూను పుంభములుగా విభిన్న భాషలలో రచనలు చేసి,

ప్రజలలో వారు జాగృతిని కలిగించిన విధమును స్థాలీపులాక న్యాయముగా పరామర్శించితిని.

మన తెలుఁగు నవలా రచనము ఇతివృత్త సేకరణలో, కథాకథన పద్ధతిలో, వర్ణనాక్రమములో, సంభాషణా సంవిధానములో, పాత్ర పోషణారీతిలో, కథను ప్రారంభించుటలో, ముగించుటలో రచయితలు ప్రదర్శించిన వైవిధ్యమును వివరించితిని. సంఘటనలను సృష్టించుటలో, సన్నివేశములను కల్పించుటలో, కథను నడుపుటలో వారు తొక్కిన సరికొత్త మార్గములను మీముందుంచితిని. గ్రాంథిక భాషతో ప్రారంభమైన ఈ ప్రక్రియ కొందరికి మాత్రమే పరిమితమై యుండగా, అది నేడు వ్యావహారిక భాషపై మరలి సర్వజనామోదముగా మారిన పద్ధతిని వివరించితిని. ఉన్నతవర్గ ప్రజల భోగ పరాయణత్వమును, వారి సమస్యలను వర్ణించు రచయితలు, ఈనాడు నడిమి తరగతి, చివరి తరగతి ప్రజలకైనందిన జీవిత సమస్యలను, కార్మిక కర్షకుల కష్టనిష్ఠురములను వివిధ దృక్కోణములనుండి చిత్రించుటకు పూనుకొనిన విధమును వివరించితిని. సాధారణ పరిస్థితులనుండి, అసాధారణ పరిస్థితులవరకు; సామాన్య ఆలోచనలనుండి, అసామాన్యమైన ఆలోచనలవరకు; (Psycho-analysis) మనోవిశ్లేషణనుండి (Stream of consciousness Technique) శుద్ధచైతన్యస్రవంతి వరకు; న్యూనతాభావము (Inferiority Complex.) నుండి, ఆధిక్యతాభావము (Superiority

Complex) వరకును వచ్చిన మార్పులను సందర్భోచితముగా తెలిపితిని.

పాశ్చాత్య పాశ్చాత్య తత్వవేత్తలు సూక్ష్మదృష్టితో వివరించిన మానసిక విశ్లేషణావిధానముతో, వైయక్తికమైన ఆంతర బహిర జీవితములను, వివిధ ప్రవృత్తులను ఇతివృత్తములు చేసి రచనలు సలిపిన విధమును మీ మాముందుంచితిని.

ఈనాడు మనిషికి మనిషికి, సంఘమునకు సంఘమునకు, దేశమునకు దేశమునకు, ఖండమునకు ఖండమునకు మధ్యన ఏర్పడివున్న అడ్డు తెరలు పటాపంచలై పోయి, వసుధైక కుటుంబ నిర్మాణమునకు రాచబాటలు నిర్మింపబడినవి. నవల వివిధ రసోళీయమై నెగడుచున్నది. ప్రపంచమున యే మూలమూలన యేమి జరిగినది. జరుగుచున్నది గ్రహించుటకు ఇది ఒక్కటే నేడు యేకైక సాధనమై వర్ధిల్లుచున్నది. కనుకనే ఈనాడు విశ్వ ఉత్తమ నవలలకు నోబెల్ బహుమతి లభించినది. ఈ దృక్పథముతో తెలుఁగు నవల సర్వతోభద్ర సమన్వితముగా, సర్వకళామయముగా వికసించి, మధుర సువాసనల గుబాళింపుతో పాఠకులను తన్మయుల నొనరించిన తీరును తులనాత్మకముగా పరామర్శించి, గాసట బీసటగా పడియున్న పెక్కు దివ్య కుసుమములను ఒక మాలగా గుదిగుచ్చి ఆంధ్రభారతి గళమున కర్పించి మంగళ నీరాజనము లతో సమర్పించి, సహృదయులైన పాఠకలోకమునుండుంచితిని.

—శుభం—

పరిశోధిత నవలా సూచి.

నవల పేరు	పేజి నం.	నవల పేరు	పేజి నం.
అంకుల్ టామ్ కథ	572	అనాథ బాలుడు	258
అంతర్వాహిని	596	అనాకొండా	7;37;258;476
అంతర్ద్వీపాలు	507	అనామిక	253
అంతర్ముఖం	146	అనావీలర్	424
అంతుపట్టని మనిషి	408	అన్నా	618
అందని పిలుపు	604	అనుభూతి నీకు మరణం లేదు	617
అందాలదీవి	617; 577	అనురాగం	484
అందుకే చంపాను	547	అనామధేయుడి ఆత్మకథ	559
అంధకారంలో	603	అన్వేషి	473; 620
అంపశయ్య	398; 399; 605	అన్వేషణ	331; 620
అంబాపాలి	522	అన్నపూర్ణ	329; 409; 604
అక్బర్	75	అపరాధిని	258
అగ్నిహోత్రం	130	అపరాజిత	472
అగ్నిపరీక్ష	604	అపశ్రుతులు	469
అచలం-చంచలం	459	అపస్వరాలు	312
అడవిముల్లె	446; 605	అప్సర	500
అడవి శాంతిశ్రీ	207	అబలా జీవితం	73; 504; 625
అతడు-ఆమె	398	అభాగిని	137
అది ప్రశ్న-ఇది జవాబు	392	అభయదానం	508
అద్దెకో అడది	547	అభావంలో ఆబల	367
అదృష్టరేఖ	460	అమ్మ	146; 484
అధికార పిపాసన	484		
అనంతంలో అంతం	622;590		

నవల పేరు	పేజి నెం.
అమావాస్య చంద్రుడు	508; 617
అమీనా	185; 199
అమృతవల్లి	526
అమృతసంతానం	74;486;622
అరణ్యకాండ	137
అర్ధాంగి	445
అరుణ	185; 199
అరుణోదయం	247
అలకాపురి	416
అల్పజీవి	309,310
అల్లాఉద్దీన్ అద్భుత దీపము	580
అల్లాహూఅక్బరు	130; 619
అల్లీబిల్లీ లోకంలో అమ్మాయి కథ	612
అలుముకున్న అంధకారం	603
అల్లూరి సీతారామరాజు	420
అసమర్థుని జీవితయాత్ర	228; 230
అసుర గణం	495
అసుర సంధ్య	347;349; 596;615
అస్తమయం	479
అస్తమయము	180
అహం-అనర్థం	354
అహం-అసూయ	484
అహల్యాబాయి	86
ఆంధ్రరాష్ట్రము	130.133:612
ఆకలి	601
ఆకర్షణలో అపస్వరాలు	350; ,, 596
ఆఖరి మజిలి	473
ఆగిన ఘడియ	491
ఆడది	616
ఆగ్నిబలి	218
ఆదర్శం	283
ఆదర్శాలు- అనుబంధాలు	467
ఆద్యంతాలు- అంతర్యాలు	597
ఆదర్శాలు- అంతర్యాలు	349
ఆనంద మఠము	37; 69; 612
ఆనందనిలయం	373
ఆమె దొస్తింది	420

నవల పేరు	పేజి నెం.	నవల పేరు	పేజి నెం.
ఆరాధన	442; 473	ఇవాన్ ఇలియచ్ మృతి	476
ఆరోగ్యనికేతనము	505 621	ఇహపరాలు	401
ఆరువందల		ఈడొచ్చిన కోరికలు	553
ఆరుపది ఆరు (666)	540	ఈస్టు అండ్ వెష్టు	7
ఆరేకరములు		ఉక్కు పిడి	606
ఎనిమిది గుంటలు	73	ఉజ్జయిని పతనం	514
ఆవేదన	412	ఉదయకిరణాలు	329; 596
ఆశాకిరణాలు	621	ఉదయగిరిపోలమ్మ ఐశ్వర్యం	592
ఆశల శిఖరాలు	605	ఉమ్రావ్ జాన్ అదా	72; 494
ఆసిధార	481	ఉరితీసిన ఉంగరం	420
ఆస్తి	411	ఉలక్కా	76
ఆఱు నదులు	287; 601	ఉషోదయం	73
ఇందు లేఖ	75	ఉషఃకాలము	73
ఇంటి దొంగ	395	ఊర్వశి	256
ఇచ్చినీకుమారి	130	ఋణానందలహరి	342; 616
ఇడియట్	413; 472; 616	ఋణానుబంధం	337
ఇద్దరం ఒకటే	383; 562	ఋతుపవనాలు	597
ఇద్దరు అమ్మాయిలు-ముగ్గురు అబ్బాయిలు	343; 616	ఎండమావులు	253
		ఎంబాసిడర్	7
ఇదెక్కడి న్యాయం	451	ఎగిరే మనిషి	547
ఇదేనా న్యాయం	435	ఎడారి పువ్వులు	430
ఇల్లుపట్టిన వెధవవాడపడుచు	218	ఎదురుదెబ్బలెన్ని తగిలినా	614

నవల పేరు	పేజి నెం.
ఎనుబది రోజుల్లో విశ్వ విహారం	577
ఏకవీర	146; 169
ఏకోదరులు	220
ఏటి అవతల	501
ఏటివడ్డున నీటిపూలు	448
ఏటెల్ ఆఫ్ టుసిటీస్	7; 37
ఏడురోజుల మజిలీ	620
ఏది సత్యం-ఏదసత్యం	443
ఐదుగురు లోఫర్లు	614
ఐవాన్‌హో	7; 37; 602
ఒకే పాటకు రెండు రాగాలు	332
ఒకే రక్తం-ఒకే స్పర్శ	381
ఓబయ్యా	146
ఓ నమూలు	619
కడివిడిచెట్టు	171; 592
కత్తుల వంతెన	324, 600
కనకాభిషేకము	536
కన్యాశుల్కం	108
కన్నీరు	484
కన్నపిల్లలు	603
కపాలకుండల	139, 612, 516
కమలాంబాళ్ చరిత్రము	77
కరణఫెలో	72
కరుణ	409
కర్పూరద్వీపయాత్ర	586
కర్పూర మంజరి	86
కలసిన జీవితాలు	103
కల్యాణ మండిర్	437
కసార్వ- భౌముడు	224, 596, 527
కవీ-గాయకుడు	584
కష్టకమల	108
కళంకం	484
కళారాధన	531
కళ్యాణ ఘడియ	611
కాంతం	220
కాంతిపూలు	366
కాగితపు పల్లకి	341
కాగితం పులి	430
కాదంబరి	79
కాముకేత్రం	363
కామేశ్వరి	420
కారణభూతుడు	406
కాలకన్య	384

నవల పేరు	పేజి నెం.	నవల పేరు	పేజి నెం.
కాలప్రవాహము	361	కొవ్వొత్తి	616
కాలాతీత వ్యక్తులు	427	కౌంట్ ఆఫ్-	7, 475,
కాశీనాథ్	258	మాంట్ క్రిస్టో	596, 611
కాశ్మీర పట్టమహిషి	223	కౌసల్య	405
కిల్లర్ మేనియర్	545	కొత్త అల్లుడు	250
కిస్‌మి నాట్-		కొత్త కోడలు	250
మిస్‌మి నాట్	547	కంగు	318,319,620
కీలుబొమ్మలు	290	కడ్డురోజాలు	249
కుంకుమ భరణి	136	కడ్డిపోచలు	597
కుంతల	473	కడియుపడని-	
కూలిన గోడలు	435	తలుపులు	231, 233
కృష్ణకాంతుని		కణపతి	89, 551
మరణ శాసనము	136	కద్వాల చీర	381
కృష్ణావతారము	606	కబస్	614
కృష్ణవేణి	121, 438	కరల్ పాంటర్సు	547
కేరళ సింహ	76	గాజు బొమ్మ	468
కేసరీ విలాసము	86	గాడిద ఆత్మకథ	492
కోనంగి	208, 552	గాడిద బ్రతుకులు	417
కోనేరు-సెలయేరు	402	గాలివాన	399, 615
కోటవీరస్య సాహసం	592	గుడ్ ఆర్థ్	7
కొత్త కల్లు	369	గూడుచేరిన పక్షులు	374
కొడిగట్టిన దీపాలు	451	గృహరాజ మేడ	624
కొల్లాయిగట్టితేనేమి	322,621	గృహిణి	418

నవల పేరు	పేజి నం.	నవల పేరు	పేజి నం.
గొంక గాథ	7, 482	చిగురించిన విలువ	351
గెలుపెవరిది ?	604	చిత్రకారుడి భార్య	420
గోదాన్	258	చిత్రమైన జీవితం	420
గోవగన్నాకొడ్డి	203, 600	చిత్రశాల	362, 620
గోమతి	441	చిచ్చర పిడుగు	548
గోరా	137	చిట్టికి చిరుగంట	582
గౌతమి	473	చిన్నక్క	331
గౌరి	619	చిన్న వదిన	439
గృహణం విడిచింది	440	చిల్లర దేవుళ్ళు	415. 621
ఘంటారావం	475	చివరకు మిగిలేది	305, 309
చందగిపుడు	180	చివరి రాత్రి	493
చంద్రమతీ చరిత్ర	119	చీకటి గదులు	242, 616
చంద్రిక కథ	496, 614	చీకటిదారి	439
చంద్రునిలో నూలుపోగు	408	చీరముడి-కత్తిపిడి	547
చంపకం-పెదపుత్రుడులు	426	చెమ్మాన్	76
చక్రభ్రమణము	435. 473	చెలియలి కట్ట	173
చదువు	244, 247	చైతన్యసంవంతి	604
చదువుకున్న కమల	605	ఛంఘీజ్ ఖాన్	528
చతుర చంద్రహాస	134	ఛాయ	604
చతురిక	257, 257	జగన్మోహిని	517
చలమయ్య షష్టిపూర్తి	604	జడపుచ్చులు	108
చారుమతి	394	జయ యాధేయ	513
చిక్కవీర రాజేంద్ర	623	జలప్రళయం	369

నవల పేరు	పేజి నెం.	నవల పేరు	పేజి నెం.
జాజిమల్లి	318	డాన్ క్విక్ సెట్	7, 475
జారుడు మెట్లు	337	డెవిల్స్ క్లబ్	547
జీవన గంగ	340	తండ్రులు-కొడుకులు	477
జీవన ఫలం	416	తంజావూరు పతనం	624
జీవన సమరం	598	తప్పటడుగులు	453
జీవనసూత్రం	420	తరగని తరంగాలు	615
జీవనతరంగాలు	616	తరం మారింది	616
జీవన మాధురి	455	తల్లీ బిడ్డలు	471
జీవన లీల	623	తానాజీ	257
జీవన లీలలు	258	తార 252, 616,	621
జీవన రాగం	424	తిక్కన సోమయాజి	535
జీవన్మృత రహస్యము	137	తిరస్కృతి	616
జీవన్మృతులు	362	తిమ్మరుళ్ళ	221, 222
జీవితాదర్శం	196	తిలక మంజరి	257
జీవితాదర్శము	185	తీర్పు	604
జీవిత వలయాలు	617	తుఫాను	215, 600
టేబు దొంగలు	278	త్యాగ కంకణము	108
ట్రైజవాన్	611	తెల్లని రక్తం	628
జ్యోతిర్బిందువు	481	తెరచిరాజు	174, 611
టామ్‌సాయర్	7, 567, 612	తెలిన తీగలు	473
టాలిస్ మన్	7	తెలిపోని బంధం	490
టేలిస్ మన్	7	తెలుగుదళవాయి	257
టూలీవుడ్ అండ్ ఏబడ్	618	తేజసింగు	138

నవల పేరు	పేజి నెం.	నవల పేరు	పేజి నెం.
తొలి మజిలి	371	దుందుభి	551
తోలిమాలుపు	508	దుఃఖితులు	389
త్యాగమూర్తి	574	దుర్గేశనందిని	37,69,134,136
త్యాగ హృదయులు	864	దూత మేఘము	610
త్రిగుబోతు	360	దూరతీరాలు	420
త్రివిక్రమవిలాసము	85	దెయ్యాలదీవి	547
త్రిమస్కాటీయర్స్	37	దేవి కాదురాణి	69
దగాబడిన తమ్ముడు	325	దేవుడిలీల-	
దమయంతీ-		మనుషుల గోల	607
స్వయంవరము	237	దేశం ఏమైంది!	484
దయ్యాల లంక	257	దైవం-న్యాయం	311
దరిజేరిన ప్రాణులు	424	దైవఘటన	355
దక్షిణ పవనం	477, 619	దైవమిచ్చిన భార్య	185
దిండుక్రింద పోకచెక్క	526		139, 195
దిగంతాలకు అవతల	419	దైవోపహతులు	601
దిమేస్	7	ధనమూల మిదం జగత్	410
దిలైట్ ఆఫ్-ఎ-		ధన్యజీవి	257, 420
డిస్టెంట్ స్టార్	477	ధన్యజీవులు	473
దివ్య	520	ధర్మం-సత్యం	311
దివోదాసు	514	ధర్మచక్రము	171, 437
దీపశిఖ	405	ధర్మపాల	258
దీర్ఘయాత్ర	484	ధర్మరాజు	75
దీక్షితులు	221, 619	ధర్మలోగిలి	420

నవల పేరు	పేజీ నెం.	నవల పేరు	పేజీ నెం.
ధర్మవతీ విలాసము	85	నాగార్జున	589
ధర్మసామ్రాజ్యము	256, 619	నాటర్ డాం	475
ధాయిన్	7	నాడు-నేడు	619
ధీరసమీరే	473	నారాయణభట్టు	224, 596,
ధూమకేతు	526	,,	611, 621
ధూర్జటి	224, 528	నారాయణరావు	211, 215
ధ్రువతార	391	,,	508, 623
ఫెరిసా	7	నిన్న స్వప్నం-నేడు సత్యం	405
నందోరాజ భవిష్యతి	526	నిరీక్షణ	446
నత్తగుల్లలు	597	నివాళి	257
నన్ను పిలిచింది	360	నిశ్శబ్ద సంగీతం	444
నరరూపరాక్షసి	547	నిశాగీతి	501
నరుడు	218	నీకేంకావాలి	604
నరులు-వనరులు	483	నీటి ముత్యాలు	615
నర్తకి	458	నీడలు-జాడలు	376
నల్లకళ్ళ అమ్మాయి	256	నీలి చంద్రిక	79
నవనాగరికతకు-దూరంగా	484	నీరజ	604
నవాబు నందిని	136	నీలం నోట్‌బుక్	618
నళిని	257, 258	నీలికళ్ళు	603, 617
నా ఇల్లు-నా సంసారం	598	నూరు శరత్తులు	387
నాగబలి	257, 288	నూర్జహాన్	533
నాగరిక	418, 508	నెలవంక	420
		నేనే	135

నవల పేరు	పేజి నం.	నవల పేరు	పేజి నం.
నైమిశారణ్యం	598,616	పాంచాలి	253
నౌకాభంగము	137	పాతరోజులు	388
పంతులుగారి అమ్మాయి	607	పాతాళభైరవి	181
పండిత పరమేశ్వర-	240,	పాప నవ్వింది	466
శాస్త్రి వీలునామా	616,622	పాప పరిహారం	497
పగిలిన పరిణామం	420	పాపాలభైరవుడు	547
పచ్చతోరణం	598	పావికొండలు	297,355
పచ్చలకలశంలో-		పాము-నిచ్చెన	410,600
మేలిముత్యాలు	598	పాలనురుగుల్లో-	
పడగవిూది మణి	597	పంచదార	455
పత్నీహిత సూచిని	88	పిక్ విక్ పేపర్స్	7
పదిరూపాయల నోటు	508	పిచ్చోడి పెళ్ళి	602
పథవిహీన	430	పిడికెడు ఆకాశం	377
పథేరి పాంచాలి	258	పిల్లతెమ్మెర	231
పన్నీటి జల్లులు	352	పిల్లదొంగ	331
పరిభ్రమణం	615	పుణ్యభూవిూ-	
పరివర్తన	227	కళ్ళు తెరు	463,616
పరీక్ష	592,593,618	పునర్జన్మ	285
పరుగులిడే చక్రాలు-		పునరాగమము	321
ప్రవహించే జీవితవాహిని	598	పులిమ్రుగ్గు	526
పలకల పెండి గ్లాసు	547	పులుల సత్యాగ్రహము	183
పల్లె జీవులు	506	పుష్యమిత్ర	523
పల్లె వాసి	879	పూజాఫలం	406

నవల పేరు	పేజి నెం.	నవల పేరు	పేజి నెం.
పూజా సుమం	460	ప్రాణభయం-	
పూర్ణానంద	130	పరుగత్తిస్తోంది	542
పెంకిపిల్ల	256	ప్రాణాంతకప్రణయం	395,610
పెంకుటిల్లు	331	ప్రాయశ్చిత్తం	74
పెద్దక్క	603	ప్రియంవద	403
పెద్ద కోడలు	420,598	ప్రియాన్వేషి	620
పేకమేడలు	258,434	ప్రేమ-మనిషి	311
పేను-పెసరచేను	583	ప్రేమకు పగ్గాలు	388
పొట్టి మొగుడు	256	ప్రేమ	257
పొడుగు వెళ్ళాం	256	ప్రేమ గాథ	478
పొరుగింటి పిల్ల	257	ప్రేమ జ్వాల	602
పోరాటం	604	ప్రేమ జ్యోతి	477,614
ప్రకృతి పిలుపు	484	ప్రేమ నగర్	436
ప్రగతిమధ్య మానిషి	450,620	ప్రేమ బంధం	615
ప్రజల మనిషి	314 620	ప్రేమించు ప్రేమ కై	439
ప్రతాపరుద్రమదేవి	530	ప్రేయసి	403
ప్రతాప మొదలియారు-		ప్రొద్దు పొడుపు	135
చరిత్ర	76	ఫాదర్స్ అండ్ సన్స్	7
ప్రతిధ్వని	502	ఫార్టీఫస్ట్	602,617
ప్రతిమాదేవి	257	ఫేమిలీ హేపినెస్	618
ప్రభాతము	135	బంగారు పంజరం	596
ప్రమదావనం	134	బంగారు నగరం	606
ప్రాకుడు రాళ్ళు	363	బంగారు లోయ	581

నవల పేరు	పేజి నం.
బంధమూ-	
అనుబంధమూ	407
బండీ	603
బడదీది	613
ద్దన్న సేనాని	170
బన్‌గర్‌వాడి	628
బలిపీఠం	433,621
బహుకుటుంబి	473
బాంధవ్యబంధితులు	478,596
బాణావతి	601
బారిష్టరు పార్వతీశం	147,
,,	219,552
బాల రాజ్యం	576
బాల్యకాల సఖి	76
బికారి	257
బీదల పాట్లు	484
బుడుగు I & II	585,616
బుద్ధిమంతుడు	611
బూచి	619
బ్లూ నోట్‌బుక్	618
బృందావనం	604
బెన్‌హోర్	606
బేరీకేడర్ ఇం బెర్లిన్	618
బ్రిటిషు లాలేజి	400,563,605
బ్రీతుకు తోడు	611
బ్రీతుకు బాట	367
బ్రీతుకు బొంగరం	397
బ్రాహ్మపుత్ర	588
బ్రాహ్మణీకము	185
బ్లాక్‌టూత్‌లిఫ్	7
భగవన్ పరశురాముడు	41
భగవాన్	547
భయస్తుడు	484
భక్తి	86
భువన విజయము	624
భూతగృహము	257
భూతరాయర్	76
భ్రమర	604
మంచికోరే మనసు	473
మంచివాడు	604
మంచీ-చెడూ	312,611
మంత్రాలరామన్న-	
మొండితనం	592
మట్టిమనిషి	447
మట్టి మనిషులు	487
మట్టి బొమ్మలు	386,596,597

నవల పేరు	పేజి నెం.	నవల పేరు	పేజి నెం.
మట్టిలో మనిషి	487	మల్లెల మనసులు	617
మణిమంజరి	121	మల్లెలు-ఎర్రగులాబీలు	374
మత్స్యగంధి	326	మహానగరంలో స్త్రీ	430
మదర్	7,146	మహాభాగవతం	606
మధూక కుసుమాలు	390	మహాభారతం	605
మనం మిగిలేం	344	మహామాయి	548
మనసు ఒకరికే-		మహాశ్వేత	79
మనిషి ఒకరికే	604	మహోదయం	473,602
మనసు-మనువు	617	మళ్ళీ పైలు-	
మనసు-మమత	615	తప్పిపోయింది	377
మనస్వినీ	598	మళ్ళీ వసంతం	346
మనస్విని	257	మాఘఘటం	356
మనిషి	386	మాతా-భూమాతా	479
మనిషి-విధ్వ	372	మాతాతయ్యకోక-	
మనుషులు-మమతలు	473	ఏనుగుండేది	623
మన్మధరాజ్యం	430	మాతృజ్యోతి	409
మరది	420	మాతృమందిరం	145
మరీచిక	406	మాధవాశ్రీముము	257
మరుభూమిలో-		మా బాబు	172
మల్లెతీగలు	598	మాబిడిక్	7
మరో మలుపు	473	మాయ జలతారు	614
మల్లారెడ్డి	224,226	మాయావి	137,606
మల్లిక	257	మాయావిని	137

నవల పేరు	పేజి నెం.	నవల పేరు	పేజి నెం.
మూర్ఖ మానుషులు	341	మృత్యులోయ	606
మార్గదర్శి	483,605	మొరపుల మరకలు	231,234
మార్తాండవర్మ	75	మెయర్ ఆఫ్ కాస్టర్‌బ్రిడ్జి	7
మూలతీరాఘువము	85	మేఘాల మేలిముసుగు	436
మూలపల్లి	37,140,141,	మేడాం బోవారి	7
,,	148,508 598	మైదానం	185,191,195
మిత్రభేదము	606	మైనా	366,621
మిథునానురాగము	146,218	మొగలాయి దర్బారు	145,
మినువాక	257	,,	513
మిస్ ఇండియా	544	మొగలి పొదలు	450
మిహిరకులుడు	525,605	మోగిన గంట	588
మీనా	443	మోచనగడ్	73
మీనాంబిక	222	మోహన	256
మీరీబాల	430,623	మోహన వంశి	430
ముగ్గురు మిత్రులు	434	మోహనాంగి	531
ముత్యాల పందిరి	375	మోహియుద్దీన్	287
ముత్యాల సరము	108	యవనపాశం	239
ముసలమ్మ మరణము	106	యవనపర్వతము	605
మూగ భార్య	343	యామినీకుంతలాలు	597
మూసిన తలుపులు	420	యుగసంధి	335
మృత్యుంజయులు	396	యుగళాంగుళీయం	136
మృత్యుభయం-		యుద్ధము-శాంతి	40
పీడిస్తోంది	548	యువరాజు	621

నవల పేరు	పేజి నెం.	నవల పేరు	పేజి నెం.
రంగపతి	403	రాజరత్నము	121
రంగభూమి	499	రాజశిల్పి	624
రంగమహల్	258	రాజశేఖర చరిత్ర	30,82,90
రంగరాజ చరిత్ర	89	రాజసింహా	257
రంగుల మేడ	350	రాజు-మహిషి	311
రఘునాథజీ	138	రాజు మహిషి-	
రఘునాథ విజయము	518	ప్రేమ మహిషి	616
రణచండిక	257	రాజూ-పేద	571
రతనాల నవ్వు	581	రాణి చిన్నాజీవి	604
రత్నకంబళి	456	రాణి సంయుక్త	130,132
రత్నబాయి	256	రాతి రథము	605
రథచక్రాలు	619	రాబందులూ-	
రహస్యబంధము	218	రామచిలుకలూ	607
రాకాశి లోయ	605	రాబిన్‌హుడ్	579
రాగమయి	469.615	రాబ్రాయ్	37
రాగమాలిక	218	రామచంద్ర-	
రాగరేఖలు	297,598	విజయము	85 90
రాగవిపంచి	597,615	రామరాజ బహద్దర్	75
రాగి-యోగి	407	రామానుజాని ప్రతిజ్ఞ	532
రాగోదయం	467	రామారాజ్యానికి-	
రాజకీయ భేతాళ-		రహదారి	400
పంచవింశతి	554	రాయచూరు యుద్ధము	130
రాజ తరంగిణి	525	రిటరన్ ఆఫ్ ది నేటివ్	7

నవల పేరు	పేజి నెం.	నవల పేరు	పేజి నెం.
రుక్కుతల్లి	221,619	లోక సంచారి	614
రుక్మిణిదేవి	234,225,508,	వక్కింటిన సరళరేఖలు	407
,,	596,611	వచ్చాయి-	
రెండు ఆకులు-		మంచిరోజులు	614
ఒక మొగ్గ	618	వడ్లగింజలు	218
రెండు మహానగరాలు	475,	వనవాసి	508
,,	596,611	వలయం	603
రెండు సేర్లు	623	వసంతగానం	508
రేకులు విరిసిన మొగ్గ	604	వసంత రాత్రియం	471
రేడియో సిలోన్	420	వసుమతీ వసంతము	134
రొయ్యలు	448,623	వాచ్‌డాగ్	547
లలిత	108,470	వాడే - వీడు	135
లలితాదేవి	597	వారధి	440
లహరి	362,620	వారసత్వం	251,252
లస్టర్ లైఫ్	41	వారసులు	553
లక్ష రూపాయలు	134	వార్ అండ్ పీస్	7,476
లక్ష్మి విజయము	86	వాల్గానుండి-	
లాడ్జింగులో ఒక రాత్రి	380	గంగాతీరం వరకు	258
లావణ్య	426	వాసనలేని పూలు	473
లీలాకుమారి	256	వింత ప్రణయము	335
లీలా సుందరి	584	వికసించని కుసుమాలు	420
లేమిజర్ బుల్సు	7	విశార్ ఆఫ్ ది వేక్ ఫీల్డు	7
లోక చరిత్ర	604	విక్రమ విజయం	602

నవల పేరు	పేజి నెం.	నవల పేరు	పేజి నెం.
విచిత్ర కవలలు	605	విషవలయం	606
విజయ	258	విహారయాత్ర	583
విజయనగర-సామ్రాజ్యము	131	విష్ణుశర్మ ఇంగ్లీషు-చదువు	182,183,552
విజయపతాక	602	వీరకంపరాయలు	535
విద్య	604	వీరగాంధర్వము	256
విద్యానగర చరిత్ర-నవలా గుచ్ఛము	517	వీరవల్లడు	181,592
విధించితులు	354,465	వుడ్‌లాండర్సు	7
విధివిధానం	466	వృశ్చికలోయ	606
విధి విన్యాసాలు	469	వెన్నెల కాటేసింది	378
వినోదిని	258	వెన్నెల నీడ	420
విమలాదేవి	130,131	వెలుగు రేఖలు	365
విముక్తి	361	వెలుగులో చెలది	420
విగతని విగ్రహాలు	493	వెలుగూ వెన్నెలా గోదారీ	374
విరామం	614	వెల్లువలో పూచిక పుల్లలు	335
విరిసిన కలలు	420	వెయ్యి శిరస్సులు	
విరిసిన విగ్రహాలు	623	ఖండించిన అపూర్వ చింతామణి	256
వివాహం	188	వెంకటేశ్వర	
వివేక విజయము	85	మహాత్మ్యము	256
విశ్వనాథం	339	వేనిటీ పేపరు	7
విశ్వేరధుడు	523		
విశాల నేత్రాలు	223,621		

నవల పేరు	పేజి నెం.	నవల పేరు	పేజి నెం.
వేయబోవని తలుపులు	454	షేమ్	604
వేయిపడగలు	176,173,180	సంఘముచేసిన మనిషి	404
,,	508,618,623	సంఘర్షణ	418
వైకుంఠంలో కల్లోలం	388	సంజీవరాయు చరిత్ర	85
వైతరణి	611	సంధ్య	453,616
వ్యక్తిత్వంలేని మనిషి	332	సంధ్య విరిసిన సంపంగి	327
శశిరేఖ	147,185	సంపెంగలు-	
శాంతల	518,623	సన్నజాజులూ	392,616
శాంతవాది	518	సంపూర్ణ రామాయణం	611
శాఫో	476	సంసార చక్రం	436
శారద	75,257	సంసార సుఖం	618
శారద రాత్రులు	459	సజీవ శిల్పాలు	620
శిఖరాలు-సెలయేళ్లు	419	సత్యరాజా పూర్వదేశ	
శిధిల సౌధం	458	యాత్రలు	82,551
శిధిలాలయము	239,605	సత్యవతీ చరిత్ర	119
శివపురాణం	606	సతీ హితబోధిని	83
శుచిముఖి	257	సన్ను అండ్ డాటర్సు	7
శుశ్రీతప్పిన రాగం	420,611	సప్తపది	472
శుశ్రీతప్పిన వీణలు	597	సప్తపర్ణి	624
శ్రీకాంత్	613	సమత	446,621
శ్రీదేవి	410	సమరము-శాంతి	476
షణ్ముఖప్రియ	472	సమర్పణ	344,596
షెర్లాక్ హోమ్స్	81	సమాంతర రేఖలు	420

నవల పేరు	పేజి నెం.	నవల పేరు	పేజి నెం.
సముద్రపు దిబ్బ	287	సూర్యయానం	589
సరస్వతీ చంద్ర	72	సెక్రటరీ	442
సరళీస్వరాలు	462	సెలవుల్లో	420,601
సవాప్రపణ్	623	సైరంధ్రి	257
సాగర గర్భంలో-		సొండ్ ఆఫ్ ఫ్యూర్	548
సాహసయాత్ర	577	సౌందర్య తిలక	42
సామాన్యుని కామన	402	సౌందర్యమూ-	
సాక్షి	551,612	సౌశీల్యము	389
సింహ సేనాపతి	41,514	స్వయంవరణం	325
(సి) సీతిచంద్రిక	611	స్వయం సిద్ధ	258
సిపాయి కూతురు	255	స్వర్ణలత	257
సిరి	604	స్వర్గానికి నిచ్చెనలు	174,611
సీతారాము	69	స్వాతంత్ర్యం	256
సీతారామరాయలు	515	స్విస్ ఫామిలీ-	
సుగంధి	452,615	రాబిన్సన్	577,617
సుగుణ	328	స్వీట్ హోమ్	556
సుడిగాలి	473	స్త్రీ	616
సుడిగుండంలో		స్నేహము	373
బోడిగుండు	548	స్నేహలత	390
సుధా కరశ్చంద్రము	121	స్మశానవాటిక	218
సువర్ణ	359	స్మృతిరేఖలు	628
సుశీల	614	హంచ్‌బేక్ ఆఫ్-	
సూరి-సీతి-వెంకి	585	నాటర్ డాం	7,475

నవల పేరు	పేజి నెం.	నవల పేరు	పేజి నెం.
హంతకుడు-		హిమజ్వాల	599,615
పిలుస్తున్నాడు	542	హిమబిందువు	202,600
హకల్ బెరీఫిన్	568	హేమలత	86,140
హత్యా రహస్యము	137	హేలావతి	145
హరిణి	461	హౌస్ సర్జన్	331,332
హారతి	331,333	హృదయం-	
హాహా-హూహూ	182,183,	చిగిర్చింది	438
,,	554		

సవరణ :- 405 వ. పేజీలో "కాసల్య" కు బదులు "కైకేయి" అని; 446 లో "అడవిపుల్లై" కు బదులు "అడవిమల్లెలు" అని; 447 లో "మట్టిమనిషి"కి బదులు "మట్టిబొమ్మలు" అని పొరపాటున పింటు జరిగినది.

(B)

ఉపయుక్త ఉద్యమములు, సంస్థలు, పత్రికల సూచి.

అభినవ ఆంధ్ర కవి పండిత సభ	157	అభ్యుదయ రచయితల సంఘం	157
అభిసారిక	607	ఆదర్శ గ్రంథమండలి	615
అభ్యుదయ	298	ఆర్యసమాజము	112

నవల పేరు	పేజి నెం.	నవల పేరు	పేజి నెం.
ఆంధ్ర గ్రంథమూల	147,312, 571.611	ఆంధ్ర సాహిత్యపరిషత్తు	108
ఆంధ్ర జనసంఘము	109	ఆంధ్ర సాహిత్య-పరిషత్పత్రిక	103
ఆంధ్రజ్యోతి	273, 413, 598	ఆంధ్రదేశీయేతిహాసక పరిశోధక మండలి	110
ఆంధ్ర పత్రిక	107,273,312, 326,329,340, 349,374,387,437, 571,595	ఆంధ్రోద్యమము	271
		ఉప్పుసత్యాగ్రహము	103,150
		కవితా సమితి	157
ఆంధ్ర పరిశోధకమండలి	110	కమ్యూనిష్టు ఉద్యమము	155
ఆంధ్రపత్రికా		కాకతీయ	273
గ్రంథమాల	134	కాంగ్రెసు ఉద్యమము	111,180
ఆంధ్రప్రదేశ్-	400, 446,	క్విట్ ఇండియా	153,155
పత్రికా సంపాదక సంఘపత్రిక	605	కేంద్ర సాహిత్య అకాడమీ	263,622
ఆంధ్రప్రదేశ్-	271,566 415,	కొండపల్లి వీరవెంకయ్య అండ్ పన్న	619
సాహిత్యఅకాడమీ	590 621	కృష్ణా పత్రిక	273,601
ఆంధ్రప్రభ	273,344,362, 397,426,430,435, 447,448,496	ఖిలాఫత్ ఉద్యమము	102
		ఖేడా	101
ఆంధ్రమహాసభ	110,158	గదర్ ఉద్యమము	111
ఆంధ్ర విశ్వసాహితి	620	గోలకొండ	600
ఆంధ్ర విశ్వవిద్యాలయం	623	చలనచిత్ర	606
ఆంధ్ర సారస్వత-పరిషత్తు	158,620	చందమామ	605

నవల పేరు	పేజి నెం.	నవల పేరు	పేజి నెం.
చాంపాన్	101	ద్వితీయ ప్రపంచ-	
చింతామణి	85,87,95	సంగ్రామము	152,154
జనధర్మ	278	ధర్మభూమి	278
జయశ్రీ-మాస పత్రిక	623	నక్సలైట్ ఉద్యమము	270
జయంతి	273	నటరాజ పబ్లికేషన్సు	617
జలియన్ వాలా బాగ్	102	నవజ్యోతి పబ్లికేషన్సు	615
జాగృతి	273	నవభారత్ పబ్లికేషన్సు	615
జాతీయోద్యమము	105	నవోదయ పబ్లికేషన్సు	616
జ్యోతి	604	నవ్యసాహిత్య పరిషత్తు	157
టెర్రరిష్టు ఉద్యమము	111	నేషనల్ బుక్ ట్రస్టు	
తరుణ మాస పత్రిక	603	ప్రచురణలు	623
తెలంగాణా ఉద్యమము	270	ప్రగతి	273,602
తెలంగాణా రచయితల		ప్రగతి ప్రచురణా	
సంఘం	159	లయము	618
తెలుగు దేశము	268	ప్రజామత	273
తెలుగు భాషాసమితి	331	ప్రతిభ	157
త్రివేణి పబ్లికేషన్సు	613	ప్రపంచ ప్రథమ	
దక్షిణభాషాపుస్తకసంస్థ	612	సంగ్రామము	100
దిగంబర		పెగంబర కవితో	
కవితోద్యమము	272	ద్యమము	372
దివ్యజ్ఞాన సమాజము	113	బాలమిత్ర	606
దేశీ ప్రచురణలు	618	బార్డోలి	101
దేశోద్ధారక గ్రంథమాల	620	బాలానందం	606

నవల పేరు	పేజి నెం.	నవల పేరు	పేజి నెం.
బొమ్మరిల్లు	606	విజయ చిత్ర	606
భారతి	156,278 310.339,	విప్లవ రచయితలసంఘం	272
	547,550,571,437,555	పవేశవర్ధని	86
భారతీయ జ్ఞానపీఠం	263	విశాలాంధ్ర పత్రిక	273,324,
బ్రహ్మసమాజము	112		410,599
మదన	607	విశాలాంధ్ర పబ్లిషింగ్	
మిూజాన్	159,600	హౌస్	614
యం. శేషాచలం		వి. యస్. యస్,	
అండ్ కో,	603	అంత్యసన్నుపచురణలు	618
యువ	273,603	విశ్వరచన	271,604
యువ పచురణలు	147	విశ్వ సాహిత్యమాల	619
యూనిలిట్	271	వేంకట్రామా అండ్ కో	612
రసికపియ	607	వేగుచుక్క గ్రంథమాల	138
రాధాస్వామి సమాజం	113	వ్యష్టి సత్యాగ్రహము	153
రూపవాణి	606	వ్యావహారిక	
రేరాణి	607	భాషోద్యమము	152,154
లక్ష్మణ రాయ-		శీ కృష్ణాదేవరాయాంధ్ర	
పరిశోధక మండలి	110	భాషానిలయము	106
వందేమాతరం	70	శీ పబ్లికేషన్స్	617
వావిళ్ళ రామస్వామి		శీ రాజరాజనరేంద్ర	
శాస్త్రి అండ్ సన్స్	612	గ్రంథాలయము	107
విజ్ఞానచంద్రిక-	106,129,	సంపూర్ణ స్వరాజ్యము	103
గ్రంథమాల	130,131,133	సప్తగిరి పబ్లికేషన్స్	619

నవల పేరు	పేజి నెం.	నవల పేరు	పేజి నెం.
సరస్వతీకంఠహారం	165,69	సుజాత	273
పరాయ నిరాకరణోద్యమము	150	స్టూడెంట్స్ బుక్ సెంటర్	616
సాంఘిక సంస్కరణోద్యమము	105	సోషలిస్టు ఉద్యమము	155
సారథి	268	స్త్రీవంతి	273
సాహితి	156	సృజన	273,605
సాహితీ సదస్సు	271	స్వతంత్ర వారపత్రిక	296
సాహితీ సమితి	147,156	స్వరాజ్యపార్టీ	102
సినిమారంగం	606	సైమన్ కమీషన్	103
		హోంరూలు ఉద్యమము	100

పరామర్శ.

[illegible] కళాశాలలో [illegible] సాహిత్య వ్యాపంగంలో [illegible] పరిశోధనా గ్రంథాలకు సూపరిచితు [illegible] 'సాహిత్యభూషణ' శ్రీ పుల్లాభొట్ల వెంకటేశ్వర్లుగారి [illegible] వెలువడిన అత్యుత్తమ పరిశోధనా గ్రంథమే [illegible] 'తెలుగు నవలా సాహిత్య వికాసం'.

వారి దాదాపు వేయి నవలలను పరిశీలించి, నవల ఆవిర్భావం, దాని క్రమ వికాసం, ఇతివృత్తం, పాత్ర పోషణ, కథాసంవిధానం, మున్నగు అంశాలను పందరో వివరంగా విశ్లేషించి, చాలా పరంగా అందరికీ చేరువలో ఉండే భాషలో పరిశోధనాత్మకంగా రచన చేశారు. మిక్కిలి ముదావహం.

తెలుగు నవలలను గురించి పరిశోధనలు చేసేవారికి, "తెలుగు నవల వికాసం" మిక్కిలి ఉపయుక్తంగా ఉండడమే కాకుండా, తెలుగునాట నవలా వికాసం గురించి సమగ్ర అవగాహన చేసుకోవలసిన వారెవరైనా తప్పక చదివి తీరవలసిన గ్రంథం ఇది.

పలు గ్రంథాలు వెలువరించుతూ, సవ్యసాచిగా రచనా వ్యాపంగం సాగిస్తున్న శ్రీ వెంకటేశ్వర్లుగారి లేఖిని నుండి యిలాగే తెలుగు పాఠకులకు ప్రయోజనకరమైన మరి కొన్ని గ్రంథాలు వెలువడాలని కోరుతూ, బహుళ ప్రయోజనకరమైన 'తెలుగు నవలా సాహిత్య వికాసం' అను ఈ గ్రంథాన్ని పాఠకులకు అందించినందుకు నేను హృదయపూర్వకంగా వారిని అభినందిస్తున్నాను–

– పబ్బరాజు గోపాలరావు.

Check List

Book Number	pA 1Cof Au27	Date	27/1/2023
Front Cover	Yes	Back Cover	Yes
Blank Pages	CR, 25		
Missing Pages	No		
Prepared By	Dayathri	Cutting By	Dayathri
Scanned By	Aravinth	Pages	691